# జువాన్ ఫాలున్

(తెలుగు అనువాదం)

లీ హోంగ్‌జీ

# దాఫా అనగా

## (లున్యూ)

దాఫా అనగా సృష్టికర్త జ్ఞానం. దివికి, భువికి, విశ్వ నిర్మాణానికి మూలాధారమైనది దాఫా. అది విశ్వరూపములోని ఒక్కొక్క స్థాయిలో భిన్నమైన రూపాలలో అభివ్యక్తం అవుతూ, అత్యల్ప రేణువు మొదలుకొని అతిపెద్ద ఆకారాల వరకు, అన్నిటినీ ఆవరించుకొని ఉంటుంది. విశ్వములోని అత్యంత సూక్ష్మరూపం యొక్క లోతులలోని అతిసూక్ష్మ రేణువుల పుట్టుకతో మొదలై, పొరలపై పొరలుగా కొలతకు, లెక్కకు అందని రేణువులు, చిన్నవాటి నుండి పెద్దవాటి వరకును, తదుపరి – పరమాణువులు, అణువులు, గ్రహాలు, పాలపుంతలు – వంటి మానవ జాతికి తెలిసిన, ఇతర ఉపరితలాల వరకును, తరువాత వాటికి కూడా ఆవల అంతకంటే పైస్థాయికి చేరుకుంటాయి. వేరువేరు కొలతల రేణువులు వివిధ పరిమాణాలలోని జీవులుగా, అలాగే భిన్న పరిమాణాలలోని ప్రపంచాలుగా రూపుదిద్దుకొని దివ్యరూపమంతటనూ వ్యాపించి ఉంటాయి. భిన్న స్థాయులలోని రేణువులపై నివసించే జీవులకు, తమ రేణువుల కన్నా పెద్దగా ఉన్న రేణువులు నిజానికి తమ ఆకాశంలో ఉన్న నక్షత్రాలు, ప్రతీ ఒక్క స్థాయిలోనూ ఇది వాస్తవం. విశ్వంలోని వివిధ స్థాయులలోని జీవుల విషయంలోనూ, ఇది అనంతంగా కొనసాగుతూ ఉంటుంది. ఇంకను, దేశ కాలములను, జీవులలోని వర్గ సమూహములను, అసంఖ్యాకమైన విషయాలను, దేనినీ వదలక, ప్రతి ఒక్క దానినీ కలుపుకొని దాఫా సృష్టి చేసింది. ఇవి వివిధ స్థాయులలోనూ దాఫా లక్షణములైన సత్యం, దయ, సహనముల యొక్క స్పష్టమైన అభివ్యక్తీకరణలు.

విశ్వమునూ, జీవమునూ అన్వేషించడానికి మానవులు ఉపయోగించే సాధనాలు ఎంతటి ఆధునికమైనవి అయినప్పటికీ, విశ్వంలోని క్రింది స్థాయిలోని, మానవులు నివసించే ఈ ఏకైక పరిమాణంలోని కొంత భాగాన్నే

చూపగలుగుతున్నాయి. ఐతిహాసిక యుగంలో గడచిన అనేక నాగరికతలకు చెందిన మానవులు, ఇతర నక్షత్రాలను అన్వేషించారు, అయినా, ఇంత వరకు ఎంత ఎత్తు, దూరమూ ఎగిరినా, ఎన్నడూ మానవజాతి నివసించే ఈ పరిమాణమును దాటి వెళ్ళలేకపోయారు. విశ్వం యొక్క వాస్తవ అభివ్యక్తీకరణ లను నిజంగా తెలుసుకోవడం అన్నది మానవజాతికి ఎప్పటికీ అసాధ్యమే. మానవులు విశ్వమూ, దేశ–కాలములూ, మానవ దేహము యొక్క రహస్యా లను అర్థం చేసుకోవాలంటే, ఒక ఋజుమార్గపు ఫా ను ఆధ్యాత్మిక సాధన చేసి, నిజమైన జ్ఞానోదయం పొంది, తమ జీవన స్థాయిని పెంచుకున్నప్పుడు మాత్రమే, అలా చెయ్యగలుగుతారు. ఆధ్యాత్మిక సాధన చేస్తున్నప్పుడు వారి నైతిక శీలం కూడా మెరుగవుతుంది, ఒకసారి, పుణ్యం నుండి పాపమును, మంచి నుండి చెడును వేరుచేసి గుర్తించగలిగి, మానవుల స్థాయికి ఆవల అడుగుపెట్టినప్పుడు, వారు నిజమైన విశ్వమును, భిన్న పరిమాణములలోని, భిన్న స్థాయులలోని జీవులను చూసి, వాటితో సంబంధం పెంచుకోగలుగుతారు.

మానవుల అన్వేషణలు, జీవన ప్రమాణాలను మార్చడం కోసమనే సాకుతో సాంకేతికపరంగా పోటీపడడం కోసమే. అవి చాలావరకు దైవమును ధిక్కరించడమూ, మానవులు నైతికమైన ఆత్మనిగ్రహాన్ని సడలించడమూ ఆధారంగా జరిగాయి, ఆ విధంగా గతంలోని నాగరికతలు అనేక పర్యాయాలు నశించిపోయాయి. జనుల అన్వేషణలు ఈ భౌతిక ప్రపంచానికి మాత్రమే పరిమితమై ఉంటాయి, విధాన పరంగా కూడా ఒక విషయం గుర్తింపు పొందిన తర్వాత మాత్రమే అధ్యయనం చేయబడుతుంది. అయినప్పటికీ, మానవ పరిమాణంలో స్పర్శకు అందనివీ, కంటికి కనిపించనివే అయినా ఖచ్చితమైన ఉనికి కలిగి, మానవుల నడుమ – ఆధ్యాత్మికత, విశ్వాసం, దివ్య వాక్కు, అద్భుతాలు – అని వాస్తవంగా ప్రతిఫలించే విషయాలను, జనులు దైవాన్ని నిరాకరించినందువల్ల, వాటిని సమీపించడానికి ఎన్నడూ సాహసించరు.

మానవులు నైతికత పునాదిగా తమను తాము పటిష్టపరచుకొని తమ శీలమును, ఆలోచనాధోరణిని ఉన్నతీకరించుకోగలిగితే, మానవ సంఘంలో నాగరికతలు అధిక కాలం కొనసాగుతాయి, అలాగే మానవ జగతిలో మరల

దైవికమైన అద్భుతాలు చోటుచేసుకుంటాయి. గతంలోని మానవ సంఘాలలో కొంత మానవ, కొంత దైవ భాగస్వామ్యం కలిగిన సంస్కృతులు అనేకసార్లు అవతరించి, మానవులకు జీవితం, విశ్వంపట్ల ఉన్నతమైన అవగాహన చేసుకో గలిగే శక్తిని కల్పించాయి. మానవ ప్రపంచంలో ఉన్న దాఫా వ్యక్తీకరణలపట్ల మానవులు సముచిత భక్తి గౌరవాలను చూపగలిగినప్పుడు, అది వారి జాతికి, దేశానికి, ఆనందమూ, వైభవమూ ప్రసాదిస్తుంది. దివ్యరూపాలు, విశ్వమూ, జీవమూ, ఇంకను లక్షలాది విషయాలు విశ్వం యొక్క ఉన్నతమైన మార్గం, దాఫా చేత సృష్టింపబడినవి, అందువల్ల దాఫా నుండి దూరమైన ఏ జీవి అయినా, నిజంగా చెడిపోయినట్లే, ప్రపంచంలో దాఫాను అనుసరించిన మానవులు నిజంగా ఉత్తమ వ్యక్తులు, అదే సమయంలో అది తగిన ప్రతిఫలమును, ఆనందమును, దీర్ఘ జీవితమును తెస్తుంది; ఇక, ఒక సాధకునిగా దాఫాతో మమేకం అయినట్లైతే, మీరు దావోను సంపాదించు కున్నవారు – ఒక దివ్య జీవి అవుతారు.

**లీ హోంగ్ జీ**

మే 24, 2015

* * * *

**అర్థములు:**

1. లున్యూ – వివరణ
2. దాఫా – “మహాధర్మం” లేదా “మహామార్గం” నియమాలు
3. జెన్–షాన్–రెన్ – సత్యం–దయ–సహనము.
4. ఫా – బుద్ధ సిద్ధాంతములోని ధర్మం మరియు నియమములు.
5. దావో – 1. తావోగా కూడా పిలవబడుతుంది. ప్రకృతి నియమము మరియు లోకరీతి నడవడికకు తావో మతస్తుల పేరు. 2. తావోను పొందిన జ్ఞాని.

* * * *

# విషయసూచిక


దాఫా అనగా (లున్యూ)

**మొదటి ఉపన్యాసము** 1–53

మానవులను ఉన్నత స్థాయిలకు చేర్చే అసలైన మార్గదర్శకత్వం 1

భిన్న స్థాయిలలో భిన్నమైన ఫా ఉంటుంది 8

సత్యం–దయ–సహనం ఒక్కటే మంచివారికి, చెడ్డవారికి నడుమనున్న తేడా నిర్ణయించే లక్షణం 14

చీ గోంగ్ ఐతిహాసిక యుగపు సంస్కృతి 17

చీ గోంగ్ ఒక ఆధ్యాత్మిక సాధన 24

మీరు చేసే వ్యాయామాల వలన మీ గోంగ్ ఎందుకు పెరగదు? 28

ఫాలున్ దాఫా యొక్క లక్షణాలు 40

**రెండవ ఉపన్యాసము** 54–102

దివ్యనేత్రపు వివాదాంశం 54

దూరదృష్టి అనే అతీంద్రియ సామర్థ్యం 72

భూత భవిష్యత్తులను గురించి తెలుసుకోగలిగిన అతీంద్రియ సామర్థ్యం 75

ఐదు మూలపదార్థాలను, త్రిలోకాలను అధిగమించడం 82

విషయాసక్తి అన్న అంశం 89

**మూడవ ఉపన్యాసము** 103–158

సాధకులందరినీ నా శిష్యులుగా ఆదరిస్తాను 103

బుద్ధ సిద్ధాంత చీ గోంగ్ మరియు బౌద్ధమతం 105

కేవలం ఒక్క ఆధ్యాత్మిక సాధనామార్గాన్ని అభ్యసించుట 111
అతీంద్రియ శక్తులు మరియు గోంగ్ బలము 116
విలోమ ఆధ్యాత్మిక సాధన మరియు గోంగ్‌ను
అరువు తెచ్చుకోవడం 117
ప్రేతాత్మ లేదా జంతువులు ఆవహించడం 128
విశ్వ భాష 137
గురువు అభ్యాసకులకు ఏం ప్రసాదించారు? 141
శక్తి క్షేత్రం 151
ఫాలున్ దాఫా సాధకులు ఈ అభ్యాసాన్ని ఏ విధంగా
వ్యాప్తి చెయ్యాలి? 152

**నాల్గవ ఉపన్యాసము** 159–201
నష్టము మరియు లాభము 159
కర్మ యొక్క పరివర్తన 162
షిన్ షిన్ ఉన్నతీకరణము 177
గ్వాండింగ్ 185
రహస్యమార్గ స్థాపన 191

**ఐదవ ఉపన్యాసము** 202–233
ఫాలున్ చిహ్నం 202
చీ మున్ సిద్ధాంతం 206
దుష్ట సాధన చెయ్యడం 208
స్త్రీ పురుషుల జంట ఆధ్యాత్మిక సాధన 213
మనశ్శరీరాల ఆధ్యాత్మిక సాధన 216

ఫాషెన్ 218
ప్రాణ ప్రతిష్ట 219
జ్యుయూక 231

**ఆరవ ఉపన్యాసము** 234–290
ఆధ్యాత్మిక సాధన పిచ్చి 234
ఆధ్యాత్మిక సాధనలో అసుర జోక్యం 248
ఒక వ్యక్తికి స్వయంగా తన మనసునించే అసుర జోక్యం 258
మీ ప్రధాన చైతన్యం ప్రబలంగా ఉండాలి 266
మీ మనసు సరిగ్గా ఉండాలి 268
యుద్ధవిద్యల చీ గోంగ్ 278
గొప్పలు ప్రదర్శించే మనస్తత్వం 284

**ఏడవ ఉపన్యాసము** 291–331
చంపడం అన్న అంశం 291
మాంస భక్షణ అంశం 298
అసూయ 307
వ్యాధులకు చికిత్స చేయడం అన్న అంశం 316
ఆస్పత్రిలో చికిత్స, చీ గోంగ్ చికిత్స 324

**ఎనిమిదవ ఉపన్యాసము** 332–374
బీగూ 332
చీ ని దోచుకోవడం 335
చీ ని కూడబెట్టడం 339

ఆధ్యాత్మిక సాధన చేసినవారు గోంగ్‌ను పొందుతారు 343
దివ్య వలయం 353
వీరాభిమానం అన్న బంధం 368
వాక్శుద్ధి సాధించడం 371

**తొమ్మిదవ ఉపన్యాసము** 375–422
చీ గోంగ్ మరియు శారీరక వ్యాయామాలు 375
మనోభావన 379
ఒక స్పష్టమైన శుద్ధమైన మనసు 389
జన్మ సంస్కారం 396
జ్ఞానోదయం 400
మహోన్నత జన్మ సంస్కారం కలిగినవారు 410

* * * *

# మొదటి ఉపన్యాసము

## మానవులను ఉన్నత స్థాయిలకు చేర్చే అసలైన మార్గదర్శకత్వం

ఫా గురించి, ఆధ్యాత్మిక సాధన చేయడం గురించీ నేను ఇచ్చిన ఉపన్యాసాల యావత్క్రమంలో, నేను సమాజం పట్లనూ, సాధకుల పట్లనూ బాధ్యత వహించి ఉన్నాను. మాకు వచ్చిన ఫలితాలు బాగున్నాయి, మొత్తం సమాజం మీద వాటి ప్రభావం కూడా చాలా బాగుంది. కొన్ని సంవత్సరాల క్రిందట, చీగోంగ్ (1) ను నేర్పే చీగోంగ్ గురువులు అనేకులు ఉండేవారు. వారు నేర్పినదంతా వ్యాధి నిర్మూలన, దేహపుష్టి నిలుపుకునే స్థాయికి చెందినది. అయితే, వారి అభ్యాస మార్గాలు మంచివి కావని నేను అనడం లేదు. నేను చెప్పదల్చుకున్నదల్లా, వారు ఉన్నత స్థాయికి చెందినది ఏమీ నేర్పలేదు అన్న విషయం మాత్రమే. దేశమంతటా చీగోంగ్ పరిస్థితి ఎలా ఉన్నదో కూడా నాకు తెలుసు. ప్రస్తుతం, ఉన్నత స్థాయిలలో చీగోంగ్‌ను మన దేశంలోనూ, విదేశాలలోనూ నిజాయితీగా బోధిస్తున్నది నేనొక్కడనే. ఉన్నత స్థాయికి తీసుకువెళ్ళే చీగోంగ్‌ను బోధించడం ఇంత వరకూ ఎవ్వరూ ఎందుకు చెయ్యలేదు? ఎందుకంటే, అది ఎన్నో ప్రధాన విషయాలను గురించిన ప్రశ్నలతోనూ, లోతైన చారిత్రక కారణాలతోనూ, విస్తృతమైన అంశాలతోనూ, అతిగంభీరమైన విషయాలతోనూ ముడిపడి ఉన్నది. ఇది, ఎన్నో చీగోంగ్ సిద్ధాంతాలకు చెందిన సాధనలను కలిగి ఉన్న విషయం గనక, ఒక సామాన్య వ్యక్తికి దానిని బోధించడానికి శక్తి చాలదు. ప్రత్యేకించి, మన సాధకులలో అనేకులు, ఇవాళ ఒక సాధనను అధ్యయనం చేసి, రేపు మరొక దానిని అధ్యయనం చేస్తూ ఇప్పటికే, తమ శరీరాలను కలుషితం చేసుకున్నారు. వారి

సాధన ఖచ్చితంగా విఫలమవుతుంది. ఇతరులు, సాధనలో ప్రధాన మార్గంలో పయనిస్తూ ముందుకు పోతూ ఉంటే, వీరు పక్కదారులలో ఉన్నారు. వారు ఒక మార్గంలో సాధన చేస్తూ ఉంటే, మరొక సాధన దానికి అంతరాయం కలిగిస్తూ ఉంటుంది. వారు మరొక మార్గంలో సాధన చేస్తూ ఉంటే, ఈ మార్గం అంతరాయం కలిగిస్తూ ఉంటుంది. ప్రతిదీ వారికి అంతరాయం కలిగిస్తూ ఉండడంవల్ల ఆధ్యాత్మిక సాధనలో ఏ మాత్రమూ సఫలం కాలేకపోతారు.

మేము ఈ విషయాలన్నిటినీ సరిచేసి, మంచి భాగాన్ని పరిరక్షించి, చెడు భాగాన్ని తొలగించడంవల్ల, ఆ తర్వాత మీరు ఆధ్యాత్మిక సాధన చెయ్య గలుగుతారని నేను నిశ్చయంగా చెప్తున్నాను. అయితే, మీరు దాఫా (2) ను నిజాయితీగా అధ్యయనం చెయ్యడానికి మాత్రమే ఇక్కడ ఉండాలి. మీరు రకరకాల బంధాలు ఉంచుకొని, అతీంద్రియ శక్తులను సంపాదించుకోవడానికో, వ్యాధులు నయం చేసుకోవడానికో, కొన్ని సిద్ధాంతాలను వినడానికి లేదా కొన్ని దురుద్దేశాలతో వచ్చి ఉంటే, అది జరగని పని. ఎందుకంటే, నేను ముందే చెప్పినట్లు ఈ విధమైన పని చేస్తున్నది నేనొక్కడనే. ఇలా మళ్ళీమళ్ళీ జరిగే అవకాశాలు ఎక్కువ రావు, నేను ఈ విధంగా ఎల్లకాలమూ బోధించను. నా ఉపన్యాసాలను వ్యక్తిగతంగా వినగలిగినవారు, నా ఉద్దేశంలో, నిజాయితీగా చెప్తున్నాను ఈ మాట... ఈ కాలవ్యవధి ఎంతో అమూల్యమైనదన్న నిజం, మీరు కూడ భవిష్యత్తులో గ్రహించుకుంటారు. అయితే, ముందే విధిలిఖితమైన సంబంధం అన్నది మేము విశ్వసిస్తాం. ఇక్కడ కూర్చుని ఉన్నవారందరూ, కేవలం విధి లిఖితమైన సంబంధం వల్లనే ఇక్కడ ఉంటారు.

ప్రతివారూ, ఇది ఆలోచించండి: ఉన్నత స్థాయులకు చేర్చే చీగోంగ్‌ను బోధించడం అంటే ఏమిటి? ఇది మానవాళికి ముక్తిని ప్రసాదించడం కాదా? మానవాళికి ముక్తిని ప్రసాదించడం అంటే, కేవలం వ్యాధి నిర్మూలన, దేహపుష్టి నిలుపుకోవడం అన్నది కాక, మీరు నిజంగా ఆధ్యాత్మిక సాధన చేస్తున్నట్లు అవుతుంది. దానికి తగినట్లుగా, అసలైన ఆధ్యాత్మిక సాధనలో సాధకులు ఒక ఉన్నతమైన షిన్ షిన్ (3) ను కలిగి ఉండవలసిన అవసరం ఉంది. ప్రతివారూ, దాఫాను నేర్చుకోవడానికి ఇక్కడ కూర్చొని ఉన్నారు, అందువల్ల మిమ్మల్ని మీరు నిజమైన సాధకులుగా నిలుపుకోవాలి, ఇంకను మీరు తప్పనిసరిగా

బంధాలను త్యజించాలి. మీరు రకరకాలైన ఆరాటాలను కలిగి ఉండి, ఈ దాఫాను నేర్చుకోవడానికి వచ్చి ఉంటే, మీరు ఏమీ నేర్చుకోరు. నిజం చెప్పాలంటే, ఒక సాధకుడు తన యావత్ ఆధ్యాత్మిక సాధనాక్రమంలో, మానవ బంధాలను త్యజిస్తూ ఉండడం ఒక నిరంతర ప్రక్రియ. సామాన్య మానవ సంఘంలో, మనుషులు, ఒకరితో ఒకరు పోటీపడుతూ, మోసం చేసుకుంటూ, చిన్నచిన్న స్వలాభాల కోసం ఒకరికొకరు హాని చేసుకుంటూ ఉంటారు. ఇటువంటి అన్ని మనస్తత్వాలను వదిలిపెట్టాలి. ముఖ్యంగా ఇవాళ దాఫాను నేర్చుకుంటున్నవారు అలా వదిలిపెట్టడం ఇంకా ఎక్కువ అవసరం.

ఇక్కడ వ్యాధి నిర్మూలన చెయ్యడం గురించి నేను మాట్లాడడం లేదు, మేము వ్యాధి నిర్మూలనమూ చెయ్యం. అయితే, ఒక నిజమైన సాధకుడిగా మీరు వ్యాధిగ్రస్తమైన శరీరంతో సాధన చెయ్యలేరు. నేను మీ శరీరాన్ని శుద్ధి చేస్తాను. ఈ శారీరక శుద్ధి అన్నది, కేవలం నిజంగా ఈ సాధనను, ఫా ను నేర్చుకునే కోరికతో వచ్చిన వారికి మాత్రమే జరుగుతుంది. మేం ఒక విషయాన్ని గట్టిగా చెప్తాం: మీరు రోగంపట్ల ఉన్న బంధాన్ని గానీ, ఆవేదనను గానీ వదులుకోకపోతే, మేము ఏమీ చెయ్యలేం, మీకు సాయమూ చెయ్యలేం. ఎందుకని? ఎందుకంటే, విశ్వంలో అట్టి నియమం ఒకటుంది: బుద్ధ సిద్ధాంతం ప్రకారం, సాధారణ మానవ వ్యవహారాలన్నీ, విధిలిఖితమైన సంబంధాలను కలిగి ఉంటాయి. అట్టి సామాన్య వ్యక్తులకు, పుట్టుక, వృద్ధాప్యమూ, వ్యాధి, మరణమూ అన్నవి ఉంటాయి. పూర్వజన్మలోని పాపకర్మల వల్ల, ఒక వ్యక్తికి రోగాలూ, కష్టాలు ఉంటాయి, కష్టాలను సహించడం అన్నది, ఋణపడి ఉన్న కర్మను తీర్చుకోవడం వంటిదే, అందువల్ల, దానిని అలక్ష్యంగా ఎవరూ మార్చకూడదు. దాన్ని మార్చడం అంటే, ఒక ఋణం ఉన్నప్పటికీ తీర్చకపోవడం వంటిది, అది ఎవరి ఇష్టానుసారం వారు చెయ్యకూడదు. అలా చెయ్యడం, ఒక చెడ్డ పని చెయ్యడం వంటిదే.

రోగులకు చికిత్స చెయ్యడమూ, వారి వ్యాధులను నిర్మూలన చెయ్యడమూ, వారి ఆరోగ్యాన్ని మెరుగుపరచడమూ అన్నవి మంచి పనులని కొందరు అను కుంటారు. నా దృష్టిలో, వారు ఆ వ్యాధులను నిజంగా నిర్మూలన చెయ్యలేదు. ఆ వ్యాధులను తొలగించే బదులు, వాటిని వారు వాయిదా వేయడమో,

మార్చుడమో చేశారు. అటువంటి కష్టాన్ని నిజంగా తొలగించాలంటే, ఆ కర్మ నిర్మూలింపబడాలి. ఒక వ్యక్తి మరొకరి కర్మను నిర్మూలించడం ద్వారా రోగ నిర్మూలన చెయ్యడానికి, అతడి స్థాయి అత్యున్నతంగా ఉండాలి. సాధారణ మానవ సంఘంలోని నియమాలను అలక్ష్యంగా అతిక్రమించకూడదన్న ఒక వాస్తవాన్ని అతడు అప్పటికే చూసి ఉండొచ్చు. ఆధ్యాత్మిక సాధనాక్రమంలో, తమ జాలిగుణం వల్ల ఒక స్త్రీ లేదా పురుషుడు, ఇతరుల వ్యాధులకు చికిత్స చేసి, నిర్మూలన చెయ్యడం, వారి ఆరోగ్యాన్ని నిలుపుకోవడానికి సాయం చెయ్యడం వంటి కొన్ని మంచి పనులు చెయ్యొచ్చు. అయితే, ఒక వ్యక్తి, ఇతరుల వ్యాధులను పూర్తిగా నయం చెయ్యలేడు. ఒక సామాన్య వ్యక్తి యొక్క వ్యాధి కారణాన్ని తీసి వెయ్యడం నిజంగానే జరిగితే, సాధకుడు కానివాడు వ్యాధిగ్రస్తుడు కాకుండానే వెళ్ళిపోవచ్చు. ఆ వ్యక్తి, ఈ ద్వారం నించి బయటకు అడుగుపెట్టిన తరవాత, ఒక సామాన్య వ్యక్తిగా మిగిలిపోతాడు. అతడు ఇంకా, సామాన్య వ్యక్తుల లాగా, స్వలాభం కోసం పోటీపడతాడు. అతడి కర్మ అలక్ష్యంగా ఎలా తీసివేయబడుతుంది? అది పూర్తిగా నిషేధితం.

అయితే ఒక సాధకునికి ఇలా ఎందుకు చేస్తాము? ఎందుకంటే, ఒక స్త్రీ అయినా పురుషుడైనా ఆధ్యాత్మిక సాధన చేయాలని కోరుకోవడంవల్ల, సాధకులు చాలా విలువైనవారు. ఆ విధంగా, ఆలోచనను పెంచుకోవడం చాలా విలువైనది. బౌద్ధమతంలో, బుద్ధ స్వభావం గురించి ప్రజలు మాట్లాడు తుంటారు. ఒక వ్యక్తిలోని బుద్ధ స్వభావం వెలికి వచ్చినప్పుడు, జ్ఞానులు అతడికి సాయపడగలుగుతారు. దీని అర్థం ఏమిటి? మీరు నన్నడిగితే, నేను ఈ సాధనను ఉన్నత స్థాయులలో బోధిస్తున్న కారణంగా చెప్తున్నాను, ఇది అత్యున్నత స్థాయికి చెందిన నియమాలను, గొప్ప ప్రాముఖ్యత కలిగిన అంశాలను కలిగి ఉంటుంది. ఈ విశ్వంలో మానవజన్మ అన్నది, సామాన్య మానవ సంఘంలో సృష్టింపబడదు; ఒక వ్యక్తి నిజమైన జీవితం విశ్వపరిధిలో సృష్టింపబడి ఉన్నది. ఈ విశ్వంలో అనేక రకాలైన పదార్థం, చాలా రూపాలలో ఉంటుంది. వాటి నడుమ జరిగే ప్రతిచర్యల కారణంగా ఆ పదార్థం ప్రాణాన్ని సృష్టించగలుగుతుంది. మరొక రకంగా చెప్పాలంటే, ఒక వ్యక్తి ప్రప్రథమ జన్మ విశ్వాంతర్భాగంలో సృష్టింపబడుతుంది. విశ్వాంతర్భాగం ప్రాథమికంగా

ఎంతో ఉదారంగా, సత్యం–దయ–సహనం అన్న లక్షణాన్ని మూర్తీభవించుకొని ఉంటుంది. పుట్టినప్పుడు, మనిషి విశ్వ లక్షణంతో మమేకమై ఉంటాడు. కానీ జీవుల సంఖ్య అధికమైనకొద్దీ, సమాజంలో రకరకాల సంబంధాలు ఏర్పడి, వాటివల్ల కొందరు వ్యక్తులలో స్వార్థం పెరిగి, క్రమంగా వారి స్థాయి తగ్గి పోతుంది. ఆ స్థాయిలో నిలవలేనప్పుడు, వారు ఇంకా కిందకు పడిపోవలసి వస్తుంది. ఈ స్థాయిలో కూడా మంచి మనుషులుగా మారలేక అక్కడ కూడా నిలవలేకపోతారు. ఇలా దిగజారడం కొనసాగుతూ, చివరికి, వారు సామాన్య మానవులున్న ఈ స్థాయికి చేరుకుంటారు.

మానవ సమాజం యావత్తు, ఒకే స్థాయిలో ఉంది. అతీంద్రియ శక్తుల లేదా మహాజ్ఞానుల దృక్పథం నించి చూసినప్పుడు, ఈ స్థాయికి దిగజారిన జీవులు నాశనం కావలసి ఉంటుంది. కానీ తమ ఔదార్యమూ, దయవల్ల, ఆ మహాజ్ఞానులు వారికి మరొక అవకాశం ఇచ్చి, ఈ ప్రత్యేక పర్యావరణాన్నీ, విలక్షణమైన పరిమాణాన్ని నిర్మించారు. ఈ పరిమాణంలోని జీవులన్నీ విశ్వంలోని ఇతర పరిమాణాలలోని జీవులకు భిన్నంగా ఉంటాయి. ఈ పరిమాణంలో ఉన్న జీవులు, ఇతర పరిమాణాలలోని జీవులను గానీ, విశ్వ సత్యాన్ని గానీ చూడలేవు. అందువల్ల ఈ మానవులు ఒక మాయలో చిక్కుకొని ఉన్నారు. వీరు, తమ వ్యాధులను పోగొట్టుకోవడానికి, కష్టాలను, కర్మలనూ నిర్మూలించుకోవడానికి, ఆధ్యాత్మిక సాధన చేసుకొని, తమ స్వస్వరూపాలకు తిరిగి చేరుకోవాలి. అన్ని సాధనామార్గాలలోనూ ఈ విధమైన అభిప్రాయం వ్యక్తమవుతుంది. మానవుడు తన స్వస్వరూపానికి తిరిగి చేరుకోవాలి; మానవుడిగా పుట్టినందుకు నిజమైన ప్రయోజనం ఇదే. అందువల్ల, ఒక వ్యక్తి ఆధ్యాత్మిక సాధన చేయాలని కోరుకున్నప్పుడు, ఆ స్త్రీ లేదా పురుషునిలోని బుద్ధ–స్వభావం వెలికివచ్చినట్లు భావింపబడుతుంది. అటువంటి ఆలోచన అత్యంత అమూల్యమైనది, ఎందు కంటే, స్త్రీ అయినా పురుషుడైనా, ఆ వ్యక్తి, తన స్వస్వరూపానికి తిరిగి చేరుకొని, సామాన్య మానవుల స్థాయిని అధిగమించాలని కోరుకుంటున్నారు.

బహుశా, మీరందరూ బౌద్ధమతంలోని ఈ క్రింది వివరణను విని ఉంటారు: "ఒక వ్యక్తిలోని బుద్ధ–స్వభావం వెలికివచ్చినప్పుడు, అది

'ప్రపంచంలోని దశ దిశలను' (4) కుదిపేస్తుంది." అది చూసినవారు ఎవరైనా, వచ్చి అతడికి ఎటు వంటి నిబంధనలూ లేని సాయం చేస్తారు. మానవాళికి ముక్తిని ప్రసాదించడంలో, బుద్ధ సిద్ధాంతం ఏ విధమైన నిబంధనలూ పెట్టక, ఎటువంటి ఫలితాన్ని ఆశించక సాయం చేస్తుంది. అదే విధంగా మేము సాధకుల కోసం ఎన్నో పనులు చెయ్యగలం. కానీ, తన వ్యాధులను నిర్మూలించుకోవాలని కోరుకొని, కేవలం ఒక సామాన్య వ్యక్తిగానే మిగిలిపోవాలనుకునే సామాన్య వ్యక్తి విషయంలో, అది జరగదు. కొంతమంది "నా వ్యాధి నిర్మూలనమైన తరవాత నేను ఆధ్యాత్మిక సాధన చేస్తాను" అనుకుంటారు. ఆధ్యాత్మిక సాధన చేసే విషయంలో ముందుగా విధించే నిబంధన ఏమీ లేదు, ఒక వ్యక్తికి ఆధ్యాత్మిక సాధన చెయ్యాలని కోరిక ఉన్నప్పుడు అతడు సాధన చెయ్యాలి. అయితే కొందరి శరీరాలలో వ్యాధులు ఉంటాయి, మరికొందరి శరీరాలు అదుపు తప్పిన సందేశాలతో కలుషితమై ఉంటాయి. కొందరు ఎన్నడూ చీగోంగ్ అభ్యసించి ఉండరు. ఎన్నో దశాబ్దాల పాటు దానిని అభ్యసించి కూడా, సాధనలో ఎటువంటి పురోగతి సాధించ కుండా, ఇంకా చీ (5) స్థాయిలోనే దారితప్పి తిరుగుతున్నవారు కూడా కొందరు ఉంటారు.

ఈ విషయంలో ఏం చెయ్యాలి? మేము వారి శరీరాలను శుద్ధిపరచి, ఉన్నత స్థాయుల కొరకు ఆధ్యాత్మిక సాధన చేయడానికి అనువుగా చేస్తాం. ఆధ్యాత్మిక సాధనలోని క్రింది స్థాయిలో ఉన్నప్పుడు, ఒక మార్పు జరుగుతుంది, అది మీ శరీరాన్ని పూర్తిగా శుద్ధిపరచడానికి జరుగుతుంది. మీ మనసులో ఉన్న చెడ్డ విషయాలు, మీ శరీరం చుట్టూ ఉండే కర్మ యొక్క పరిధి, ఇంకా, మీ శరీరాన్ని వ్యాధిగ్రస్తం చేసే మూలకాలు శుభ్రం చేయబడతాయి. వాటిని శుద్ధి చేయనిదే, అటువంటి పాపభూయిష్టమైన, కళంకితమైన శరీరంతోనూ, మలినమైన మనసుతోనూ మీరు ఉన్నత స్థాయికి చేర్చే ఆధ్యాత్మిక సాధన ఎలా చేయగలుగుతారు? మేము ఇక్కడ చీని సాధన చెయ్యం. మీరు అటువంటి తక్కువ స్థాయి విషయాలను సాధన చెయ్యవలసిన అవసరం లేదు, మీరు దానిని దాటి వెళ్ళేలాగ, మిమ్మల్ని ముందుకు నడిపి, మీ శరీరాన్ని వ్యాధి రహితమైన స్థితికి చేరుస్తాం. అదే సమయంలో, క్రింది స్థాయిలో, పునాది

వేయడానికి అవసరమైన, వాడుకకు సిద్ధంగా ఉన్న సంవిధానాలను అమర్చుతాము. ఈ విధంగా, మీరు అత్యున్నత స్థాయిలో ఆధ్యాత్మిక సాధన చేయగలుగుతారు.

ఆధ్యాత్మిక సాధనా సాంప్రదాయాలను బట్టి, చీని కలుపుకొని మూడు స్థాయిలున్నాయి. అయితే, అసలైన ఆధ్యాత్మిక సాధనలో, రెండు ప్రధాన స్థాయిలున్నాయి (చీ సాధనను లెక్కవేయకుంటే). ఒకటి త్రిలోకాంతర ఫా (6) ఆధ్యాత్మిక సాధన, మరొకటి, త్రిలోకాతీత ఫా ఆధ్యాత్మిక సాధన. త్రిలోకాంతర ఫా, త్రిలోకాతీత ఫాల లోని ఆధ్యాత్మిక సాధనలు, బౌద్ధ మతాలకు చెందిన "లోకాతీత", "లోకాంతర" అన్న సైద్ధాంతిక పదాలకు భిన్నమైనవి. మనది ఆధ్యాత్మిక సాధన ద్వారా, రెండు ప్రధాన స్థాయిల వద్ద మానవ శరీరం, అసలైన పరివర్తన చెందే సాధన. ఎందుకంటే, త్రిలోకాంతర ఫా ఆధ్యాత్మిక సాధనా క్రమంలో, ఒక వ్యక్తి శరీరం నిరంతరమూ, శుద్ధి చెందుతూ ఉంటుంది, అతడు త్రిలోకాంతర ఫా లోని అత్యున్నత రూపానికి చేరుకున్నప్పుడు, అది పూర్తిగా అత్యంత శక్తి పదార్థంతో ప్రతిక్షేపించబడి (మార్పు చెంది) ఉంటుంది. త్రిలోకాతీత ఫా లోని ఆధ్యాత్మిక సాధన మౌలికంగా బుద్ధ – శరీరమును సాధన చెయ్యడం. ఆ శరీరం అత్యంత శక్తి పదార్థంతో తయారయి ఉంటుంది, అన్ని అతీంద్రియ శక్తులూ, పునఃవృద్ధి చెందుతాయి. ఇవీ, మేము సూచించే రెండు ప్రధాన స్థాయిలు.

ముందుగానే విధిలిఖితమయిన సంబంధాన్ని మేము విశ్వసిస్తాం. నేను అటువంటి పనిని ఇక్కడ కూచుని ఉన్న ప్రతి ఒకరికీ చెయ్యగలను. ఇప్పుడు, ఇక్కడ రెండు వేలకు పైబడిన సంఖ్యలో మాత్రమే జనులున్నారు. నేను అనేక వేల మందికి, అంతకన్నా అధికంగా ఉన్నా, పదివేల కన్నా ఎక్కువ మంది ఉన్నా కూడా అలా చెయ్యగలను. మీరు క్రింది స్థాయిలో సాధన చెయ్యవలసిన అవసరం లేదని, దీని అర్థం. మీ శరీరాలను శుద్ధి చేసి మిమ్మల్ని ఉన్నతీ కరించిన తర్వాత, నేను, మీ శరీరాలలో, ఒక సంపూర్ణ సాధనావ్యవస్థను నెలకొల్పుతాను. మీరు నేరుగా ఉన్నత స్థాయిలలో ఆధ్యాత్మిక సాధన చేస్తారు. అయితే అది, కేవలం నిజంగా ఆధ్యాత్మిక సాధన చేయాలని వచ్చిన సాధకులకు మాత్రమే చేస్తాను, మీరు ఇక్కడ కూచున్నంత మాత్రాన, మీరు ఒక

సాధకుడు అయినట్లు కాదు. మీరు మౌలికంగా మీ ఆలోచనావిధానం మార్చుకున్నంత కాలమూ, ఇవన్నీ మీకు ఇస్తూ ఉంటాము, ఇక, ఇవ్వడం అన్నది వీటికే పరిమితం కాదు. నేను ప్రతివారికీ ఏమిచ్చానన్నది, మీకు తరవాత అర్థమవుతుంది. మేము ఇక్కడ వ్యాధి నిర్మూలన చెయ్యడం గురించి కూడా మాట్లాడం. అంతకంటే, సాధకుల శరీరాలను సమగ్రంగా సరిచేసి, ఆధ్యాత్మిక సాధనకు అనువుగా చేయడం గురించి, మాట్లాడతాం. ఒక వ్యాధిగ్రస్త శరీరంతో, మీరు గోంగ్ (7)ని ఏ మాత్రమూ పెంచుకోలేరు. అందువల్ల, వ్యాధులను తొలగించుకోడానికి నా దగ్గరకు రాకూడదు, నేను అటువంటి పని చెయ్యను కూడా. నేను ప్రజలలోకి రావడంలోని ప్రాథమిక ఉద్దేశం, ప్రజలకు ఉన్నత స్థాయిలకు దారి చూపడమే, ప్రజలకు, ఉన్నత స్థాయిలకు దారిచూపే అసలైన మార్గదర్శకత్వం చేయడం.

## భిన్న స్థాయిలలో భిన్నమైన ఫా ఉంటుంది

గతంలో ఎందరో చీ గోంగ్ గురువులు, చీ గోంగ్‌లో ఆరంభస్థాయి, మధ్యమ స్థాయి, ఉన్నత స్థాయి ఉంటాయని చెప్పారు. అదంతా చీ యే, చీ స్థాయిలో సాధన గురించిన కొంత విషయం కూడా, కానీ ఆరంభ-స్థాయి, మధ్యమ-స్థాయి, ఉన్నత-స్థాయి చీ గోంగ్‌గా వర్గీకరణ కూడా చేయబడింది. అసలైన ఉన్నత స్థాయి విషయాల గురించి చీ గోంగ్ గురువులలో అధికసంఖ్యాకులకు అసలు ఏమీ తెలియకపోవడం వల్ల, వారి మనసులు శూన్యంగా ఉండేవి. ఇప్పటినించి, మేము చెప్పబోయేది అంతా ఉన్నత స్థాయిలలోని ఫా గురించే. దీనితోపాటుగా, నేను ఆధ్యాత్మిక సాధన యొక్క ప్రతిష్టను పునరుద్ధరిస్తాను. నా ఉపన్యాసాలలో, సాధకుల సమాజంలో ఉన్న కొన్ని పెడ ధోరణులను గురించి చెప్తాను. ఆ ధోరణుల పట్ల ఎలా వ్యవహరించాలో, వాటిని ఎలా అర్థం చేసుకోవాలో కూడా చెప్తాను. పైగా, ఒక సాధనా విధానాన్ని, ఉన్నత స్థాయిలలోని ఫానూ బోధించడంలో, అతిముఖ్యమైన అనేక కోణాలు, వాటిలో కొన్ని అతిగంభీరమైన సమస్యలూ ఇమిడి ఉంటాయి; వాటి గురించి కూడా సూటిగా చెప్తాను. మన సామాన్య మానవ సంఘంలో, ప్రత్యేకించి సాధకుల సమాజంలో ఇతర పరిమాణాల నించి అంతరాయం కలగడం

అన్నది జరుగుతుంది. నేను దీన్ని కూడా ప్రజలకు తెలియజేయదలచుకున్నాను. అదే సమయంలో, సాధకుల విషయంలో ఈ సమస్యలను నేను పరిష్కరిస్తాను. ఈ సమస్యలను పరిష్కరించకుండా వదిలివేస్తే, మీరు ఆధ్యాత్మిక సాధన చెయ్యలేరు. ఈ అంశాలను మౌలికంగా పరిష్కరించడానికి, మేము ప్రతి ఒక్కరినీ తప్పనిసరిగా అసలైన సాధకులుగా ఆదరించవలసి ఉంటుంది. నిజానికి, మీ ఆలోచనావిధానాన్ని ఇప్పటికిప్పుడు మార్చడం అంత సులభం కాదు; రాబోయే ఉపన్యాసాల కాలంలో మీరు క్రమంగా మీ ఆలోచనా విధానాన్ని మార్చుకుంటారు. మీరందరూ కూడా శ్రద్ధగా వింటారని ఆశిస్తాను. నేను ఆధ్యాత్మిక సాధనను బోధించే తీరు ఇతరుల విధానానికి భిన్నంగా ఉంటుంది. కొంత మంది, క్లుప్తంగా తమ సాధనావిధానాల సిద్ధాంతాల గురించి మాత్రమే చెప్పి బోధిస్తారు. తరవాత, తమ సందేశాలను మీకు అనుసంధానం చేసి, మీకు కొన్ని వర్గాల వ్యాయామాలు నేర్పుతారు, అంతే. ప్రజలు ఈ విధమైన సాధనను నేర్పించే పద్ధతికి ఇప్పటికే అలవాటు పడిపోయారు.

ఒక అసలైన సాధన పద్ధతిని బోధించాలంటే, ఫాను గానీ, తావోను గానీ నేర్పించాలి. మీరు ఆధ్యాత్మిక సాధన చేసుకోవడానికి, ఉన్నత స్థాయిలోని అన్ని నియమాలను, పది ఉపన్యాసాలలో నేను మీకు తెలియజేస్తాను. లేకపోతే, మీరు ఆధ్యాత్మిక సాధనను చేయనే లేరు. ఇతరులు నేర్పించినదల్లా, వ్యాధి నిర్మూలన, దేహపుష్టి నిలుపుకోవడం మాత్రమే. ఉన్నత స్థాయిలకు దారిచూపే ఆధ్యాత్మిక సాధన చేయాలని మీరు తలచినప్పుడు, ఉన్నతస్థాయి ఫా మార్గదర్శకత్వం లేనిదే, సాధనలో మీరు సఫలం కాలేరు. ఇది పాఠశాలకు వెళ్ళే విషయాన్ని పోలి ఉంటుంది: మీరు ప్రాథమిక స్థాయి పాఠ్యపుస్తకాలతో కళాశాలకు వెళ్ళినా, మీరు ప్రాథమిక పాఠశాల విద్యార్థిగానే ఉంటారు. కొందరు వ్యక్తులు, ఆ సాధన, ఈ సాధన అంటూ, అనేక రకాల సాధనలు నేర్చుకుని, ఒక ఉత్తీర్ణతాపత్రాల దొంతరను కూడా సంపాదించుకొని, తాము చాలా రకాల సాధనలు నేర్చుకున్నామనుకుంటారు, అయితే వారి గోంగ్‌లో మాత్రం అప్పటికీ ఎటువంటి అభివృద్ధి ఉండదు. చీగోంగ్‌లో చెప్పబడేదీ, చీ గోంగ్‌లో ఉన్న నిజమైన సారమూ అదేనని వారు భావిస్తారు. కాదు, అది చీ

గోంగ్‌లో, ఏమాత్రమూ లోతు లేని, అట్టడుగు స్థాయికి చెందిన భాగం మాత్రమే. చీ గోంగ్ ఇటువంటి విషయాలకు పరిమితమైనది కాదు, ఎందుకంటే అది ఒక ఆధ్యాత్మిక సాధనేకాక, విశాలమూ, నిగూఢమూ అయినట్టిది. అంతేకాక భిన్న స్థాయులలో భిన్నమైన ఫా ఉంటుంది. అందువల్ల, మనకు ప్రస్తుతం తెలిసి ఉన్న చీ సాధనలకు అది భిన్నంగా ఉంటుంది. మీరు ఇంకా ఎంత ఎక్కువగా నేర్చుకున్నా కూడా, దానిలో మార్పు ఉండదు. ఉదాహరణకు, మీరు బ్రిటన్‌లో ప్రాథమిక స్థాయి పాఠ్యపుస్తకాలు, అమెరికాలో ప్రాథమిక స్థాయి పాఠ్యపుస్తకాలు, జపానులో ప్రాథమిక స్థాయి పాఠ్యపుస్తకాలు, ఇంకా చైనాలో ప్రాథమిక స్థాయి పాఠ్యపుస్తకాలు అన్నీ చదివినా కూడా, మీరు ప్రాథమిక పాఠశాల విద్యార్థిగానే మిగులుతారు. క్రింది స్థాయికి చెందిన చీగోంగ్ పాఠాలను ఎంత ఎక్కువ చదువుకొని, వాటినించి ఎంత ఎక్కువ విషయాన్ని జీర్ణించుకుంటారో, మీకు మీరు అంత హాని చేసుకుంటారు– ఇప్పటికే మీ శరీరం కలుషితమైంది.

నేను ఇంకొక విషయాన్ని గట్టిగా చెప్పాలి: మన ఆధ్యాత్మిక సాధనలో ఒక సాధనావిధానాన్నీ, ఫానూ రెండిటినీ బోధించవలసిన అవసరముంది. బౌద్ధ మఠాలలో ఉండే భిక్షువులకు, ప్రత్యేకించి జెన్ బౌద్ధానికి చెందినవారికి వేరే అభిప్రాయాలు ఉండొచ్చు. ఫాను బోధించడం అన్న మాట వింటూనే వారు విముఖత చూపుతారు. అలా ఎందుకు చేస్తారు? జెన్ బౌద్ధంలో ఫాను నేర్పకూడదనీ, నేర్పిస్తే అది ఫాయే కాదనీ, బోధనకు అర్హమైన ఫాయే లేదనీ, ఒక వ్యక్తి కేవలం తన హృదయమూ, మనసులతో మాత్రమే దానిని అర్థం చేసుకోగలుగుతాడనీ నమ్ముతారు. దాని పర్యవసానంగా, ఇవాల్టిదాకా జెన్ బౌద్ధం ఎటువంటి ఫానూ బోధించలేకపోయింది. జెన్ బౌద్ధానికి ఆదిపురుషుడైన బోధిధర్ముడు, శాక్యముని (8) "ఏ ధర్మమూ నిశ్చితం కాదు" (9) అని చేసిన ఒక వ్యాఖ్య ఆధారంగా, కొన్ని విషయాలను బోధించారు. శాక్యముని చేసిన ఈ వ్యాఖ్య ఆధారంగా వారు జెన్ బౌద్ధాన్ని స్థాపించారు. మేము ఆ సాధనను "ఎద్దు కొమ్ములోకి తవ్వుకుంటూ పోవడం" (10) (చైనీయ సామెత)లా ఉందని భావిస్తాం. ఎద్దు కొమ్ము లోపలికి తవ్వుతున్నట్లు అని ఎందుకు అన్నారు? బోధిధర్ముడు దాని లోతులలోకి వెళ్తున్నప్పుడు, ఆయనకు

అది ఎంతో విశాలంగా ఉన్నట్లు అనిపించింది. రెండవ అధిపతి తప్పినప్పుడు, అంత విశాలంగా తోచలేదు, మూడవ అధిపతికి కొంత అనువుగా ఉన్నట్లు అనిపించినా, నాలుగవ అధిపతి కాలానికి అది ఇరుకు అయినట్లు అనిపించింది, ఇక అయిదవ అధిపతికి ముందుకు వెళ్ళలేనంత కుంచించుకు పోయినట్లు అనిపించింది. ఆరవ అధిపతి అయిన హ్యూనెంగ్ కాలానికి అది ఇక ఏమాత్రమూ ముందుకు కదలలేనంత చిట్టచివరి అంచుకు చేరుకుంది. ఇవాళ మీరు ఒక జెన్ గురువు దగ్గర ధర్మం అధ్యయనం చెయ్యాలని వెళ్తే, ఎటువంటి ప్రశ్నలు అడిగేందుకు వీలు లేదు. మీరు ఒక ప్రశ్న అడిగితే, ఆ వ్యక్తి వెనక్కు తిరిగి, మీ నెత్తి మీద ఒక కర్రతో కొడతారు, దాన్ని "కర్రతో చేసే హెచ్చరిక" అంటారు. దానికి అర్థం ఏమిటంటే, మీరు ఏమీ అడగకూడదనీ, మీ అంతట మీరే స్వయంగా జ్ఞానోదయం పొందాలి అని. "నాకు ఏమీ తెలియదు కాబట్టి, నేను అధ్యయనం చెయ్యడానికి వచ్చాను. నేను ఏ విషయం గూర్చి జ్ఞానోదయం పొందాలి? నన్ను మీరు కర్రతో ఎందుకు కొడుతున్నారు?" అని మీరు అడుగుతారు. ఇది, జెన్ బౌద్ధం ఎద్దు కొమ్ము చివరి అంచుకు చేరిందనీ, మీకు నేర్పేందుకు ఇక ఏమీ మిగలలేదన్న విషయాన్ని సూచిస్తుంది. బోధిధర్ముడు కూడా తన బోధనలు ఆరుతరాల వరకే అందించబడతాయనీ, తరవాత వాటివల్ల ఎటువంటి ప్రయోజనమూ ఒనగూరదనీ చెప్పారు. అనేక శతాబ్దాలు గడిచాయి. అయినా ఈనాటికీ జెన్ బౌద్ధమతపు నియమాలను దృఢంగా అంటిపెట్టుకొని ఉండే వ్యక్తులున్నారు. "ఏ ధర్మమూ నిశ్చితం కాదు" అన్న శాక్యముని వ్యాఖ్యకు అర్థమేమిటి? శాక్యముని తథాగత (11) స్థాయికి చెందినవారు. తరువాత ఉన్న సన్యాసులలో ఎక్కువ మంది శాక్యముని స్థాయిలో జ్ఞానోదయం పొందడం గానీ, ఆయన ఆలోచనా విస్తృతిని అందు కోవడమూ, ఆయన బోధించిన ధర్మానికి సరైన అర్థం తెలుసుకోవడమూ, ఆయన చెప్పినదానికి నిజమైన అర్థం తెలుసుకోవడమూ గానీ జరగలేదు. అందువల్ల ప్రజలు దానికి రకరకాలుగా, తికమకపెట్టే వివరణలతో, అర్థాలు చెప్పుకున్నారు. "ఏ ధర్మమూ నిశ్చితం కాదు" అంటే, ఎవరూ దానిని బోధించ కూడదనీ, బోధిస్తే అది ధర్మమే కాదని అర్థం చేసుకున్నారు. నిజానికి దానికి అర్థం అది కాదు. శాక్యముని బోధివృక్షం క్రింద జ్ఞానోదయం పొందినప్పుడు

నేరుగా తథాగత స్థాయిని అందుకోలేదు. ఆయన ధర్మాన్ని బోధిస్తూ ఉండిన నలభై తొమ్మిది సంవత్సరాలలో నిరంతరమూ తనని తాను అభివృద్ధి చేసుకుంటూనే ఉన్నారు. తనను తాను ఒక ఉన్నత స్థాయికి పెంచుకున్న ప్రతిసారీ, ఆత్మపరిశీలన చేసుకొని తాను అంతకుముందే బోధించిన ధర్మము సరియైనది కాదని గ్రహించేవారు. మళ్ళీ పురోగతి సాధించినప్పుడు, అదే కనుగొనేవారు. ఆ విధంగా ఆయన నిరంతరమూ నలభైతొమ్మిదేళ్ళపాటు, అటువంటి పురోగతి సాధించారు. ఒక ఉన్నత స్థాయిని చేరుకున్నప్పుడల్లా, తాను గతంలో బోధించిన ధర్మం విషయ గ్రహణ శక్తిలో తక్కువ స్థాయిలో ఉందని గ్రహించేవారు. ధర్మం ప్రతి స్థాయిలోనూ ఆ స్థాయికి చెందిన ధర్మంగా వ్యక్తం అవుతుందని, ప్రతి స్థాయిలోనూ ధర్మం ఉందని, వాటిలో ఏదీ కూడా విశ్వం యొక్క సంపూర్ణ సత్యం కాదన్న విషయాలను కూడా ఆయన కనుగొన్నారు. క్రింది స్థాయిలలో ఉన్న ధర్మం కన్నా, ఉన్నత స్థాయిలలోని ధర్మం విశ్వ లక్షణానికి దగ్గరగా ఉంటుంది. అందువల్ల, "ఏ ధర్మమూ నిశ్చితం కాదు" అని వ్యాఖ్యానించారు.

చివరకు శాక్యముని, "నా జీవిత కాలంలో నేను ఏ ధర్మమూ నేర్పలేదు" అని ప్రకటించారు. జెన్ బౌద్ధం దీనిని కూడా, బోధించడానికి ఏ ధర్మమూ లేదని తప్పుగా అర్థం చేసుకుంది. తన జీవితపు తదుపరి సంవత్సరాలలో శాక్యముని, అప్పటికి తథాగత స్థాయిని చేరుకున్నారు. అటువంటప్పుడు, తాను ఏ ధర్మాన్ని బోధించలేదని, ఆయన ఎందుకన్నారు? నిజానికి ఆయన ఎత్తిచూపిన అంశం ఏమిటి? "నాదైన తథాగత స్థాయిలో కూడా, విశ్వం యొక్క అత్యున్నత సత్యాన్ని గానీ, అత్యున్నత ధర్మం ఏమిటన్నది గానీ చూడలేకపోయాను" అని చెప్పారు. అందువల్ల, తన మాటలే సంపూర్ణ సత్యాలని గానీ, మార్చలేని సత్యాలని గానీ భావించవద్దని, తదుపరి కాలంలో ఆయన ప్రజలను కోరేవారు. లేకపోతే, తదుపరి కాలంలో అది ప్రజలను తథాగత స్థాయికి లేదా అంతకన్నా తక్కువ స్థాయికి పరిమితం చేస్తుంది, వారు ఉన్నత స్థాయిలకు పురోభివృద్ధి చెందలేరు. తరవాత కాలంలో ప్రజలు దీని అసలైన అర్థం తెలుసుకోలేక, ధర్మాన్ని బోధిస్తే, అది ధర్మమే కాదనుకొని – ఆ విధంగా అర్థం చేసుకున్నారు. నిజానికి శాక్యముని, భిన్న స్థాయిలలో భిన్న

ధర్మం ఉంటుందనీ, ప్రతి స్థాయిలోని ధర్మం విశ్వం యొక్క సంపూర్ణ సత్యం కాదనీ చెప్పారు. అయినప్పటికీ, ఒక నిర్దిష్టమైన స్థాయిలోని ధర్మం, ఆ స్థాయిలో ఒక మార్గదర్శి భూమికను పోషిస్తుంది. నిజానికి, ఆయన ఆ విధమైన ఒక నియమాన్ని చెప్పేవారు.

గతంలో చాలామంది, ప్రత్యేకించి జెన్ బౌద్ధులు, అటువంటి దురభిప్రాయాన్నీ, చాలా వక్రదృష్టిని కలిగి ఉండేవారు. బోధన, మార్గదర్శకత్వమూ లేకుండా, మీరు ఆధ్యాత్మిక సాధనను ఎలా చెయ్యగలరు? బౌద్ధమతంలో ఎన్నో, బౌద్ధ కథలు ఉన్నాయి. స్వర్గానికి వెళ్ళిన ఒక వ్యక్తి కథను కొంతమంది చదివి ఉంటారు. స్వర్గానికి చేరుకున్న తరవాత, అక్కడ, వజ్ర సూత్రం(12)లోని ప్రతి పదమూ, దాని అర్థమూ ఇక్కడ ఉన్నట్లుగాకాక భిన్నంగా ఉన్నట్లు కనుగొన్నాడు. “పరమానందపు స్వర్గంలో ఉన్న గ్రంథం, క్రింద, ఇక్కడ ఉన్న దానికి పూర్తి భిన్నంగా ఉంది, ఏ మాత్రమూ పోలిక లేదు. పదాలు మాత్రమే కాదు, వాటిలోని భావం, అర్థం కూడా మారడం వల్ల, అన్నీ భిన్నంగా ఉన్నాయి,” అని. నిజానికి, అదే ఫా భిన్న స్థాయులలో వివిధ మార్పులు కలిగి, వివిధ రూపాలలో వ్యక్తమవుతుంది, అది విభిన్న స్థాయులలో ఉండే సాధకులకు విభిన్నమైన మార్గదర్శక భూమికను పోషిస్తుంది.

బౌద్ధమతంలో పరమానందపు స్వర్గానికి యాత్ర అన్న పేరుతో ఒక చిన్న పుస్తకం ఉందని అందరికీ తెలుసు. అందులో, ఒక సన్యాసి ధ్యానంలో కూర్చుని ఉండగా అతడి ప్రాథమికాత్మ (13) పరమానందపు స్వర్గానికి వెళ్ళి, అక్కడి దృశ్యాలను చూసి వచ్చిందని లిఖితమై ఉంది. అతడు అక్కడ ఒక్క రోజు గడిపాడు; అతడు మానవ లోకానికి తిరిగి వచ్చేటప్పటికి, ఆరు సంవత్సరాలు గడిచాయి. అతడు దానిని చూశాడా? చూశాడు, కానీ అతడు చూసినది దాని నిజ స్థితి కాదు. ఎందువల్ల? ఎందుకంటే, అతడి స్థాయి దానికి తగినంత ఉన్నతంగా లేదు, అతడికి కనబడినది తన స్థాయిలో అభివ్యక్తమైన బుద్ధ ఫా మాత్రమే. అటువంటి స్వర్గం, ఫా కూర్పుకు ప్రత్యక్ష రూపం గనక, అతడు దాని నిజ పరిస్థితిని చూడలేక పోయాడు. “ఏ ధర్మమూ నిశ్చితం కాదు” అని నేను చెప్పినదానికి అర్థం ఇదే.

## సత్యం-దయ-సహనం ఒక్కటే మంచివారికి, చెడ్డవారికి నడుమనున్న తేడా నిర్ణయించే లక్షణం

బౌద్ధమతంలో, ప్రజలు బుద్ధ ఫా అంటే ఏమిటని చర్చించుకునేవారు. బౌద్ధ మతంలో చెప్పబడిన ధర్మం మొత్తమూ బుద్ధ ఫా అని నమ్మేవారు కూడా ఉన్నారు. నిజానికి, అలా కాదు. 2500 సంవత్సరాల క్రిందట, శాక్యముని బోధించిన ధర్మం, చాలా క్రింది స్థాయిలో ఉన్న సామాన్య వ్యక్తుల కోసం మాత్రమే బోధింపబడినది; అప్పుడే ఆదిమ సమాజంనించి వచ్చినట్టి, ఇంకా కపటం ఎరుగని మనసులు కలిగినవారికి బోధింపబడినది. ఆయన పేర్కొన్నటువంటి ధర్మం అంతరించే కాలం (14) ప్రస్తుతం నడుస్తున్నది. ఆనాడు బోధించిన ధర్మంతో, ఈనాడు ప్రజలు ఆధాత్మిక సాధనను ఎంత మాత్రమూ చెయ్యలేరు. ధర్మం అంతరించే కాలంలో బౌద్ధమత భిక్షువులకు సైతం, ఇతరులకు ముక్తి ప్రసాదించడం అటుంచి, తమను తాము రక్షించు కోవడమే కష్టం అవుతుంది. శాక్యముని ఆ కాలంలో బోధించిన ధర్మం అప్పటి పరిస్థితులకు అనుగుణంగా ఉండినది, ఆయన తన స్థాయిలో తెలుసుకున్న బుద్ధ ఫా అంతటినీ కలిపి బోధించలేదు. దానిని, ఎల్లకాలమూ మారకుండా ఉంచడం కూడా అసాధ్యం.

సమాజం అభివృద్ధి చెందేకొద్దీ, మానవుల మనసు సరళత కోల్పోయి, లౌక్యం పెరిగి, ఈ విధమైన ఆధ్యాత్మిక సాధన చెయ్యడం కష్టమవుతుంది. బౌద్ధ మతంలోని ధర్మం బుద్ధ ఫా అంతటినీ క్షుణ్ణంగా తెలపలేదు, అది బుద్ధ ఫా లోని ఒక చిన్ని భాగం మాత్రమే. బుద్ధ సిద్ధాంతంలో ప్రజలకు అందించ బడుతున్న అనేక ఇతర ఉత్తమ సాధనామార్గాలున్నాయి. చరిత్రలో ఇప్పటి వరకు అవి గురువు నుండి కేవలం ఒక్క శిష్యుడికే అందించబడ్డాయి. భిన్న స్థాయిలలో భిన్నమైన ఫా ఉంటుంది, భిన్న పరిమాణాలలో కూడా భిన్నమైన ఫా ఉంటుంది, అవన్నీ కూడా భిన్న పరిమాణాలలో, భిన్న స్థాయిలలో అభివ్యక్తమైన బుద్ధ ఫా యొక్క అనేక రూపాలు. బుద్ధత్వాన్ని సాధన చెయ్యడానికి, ఎనభై నాలుగు వేల సాధనామార్గాలు ఉన్నాయని శాక్యముని కూడా చెప్పారు. అయితే, బౌద్ధమతం, జెన్ బౌద్ధం, పవిత్ర భూమి, టియాన్టై,

హ్యుయాన్, తాంత్రిక విద్య, వంటి సుమారు పది సాధనామార్గాలను మాత్రమే కలిగి ఉంది; ఇవి బుద్ధ ఫాను పూర్తిగా తెలియజేయవు. శాక్యముని, తనదైన ధర్మాన్ని మొత్తంగా కలిపి తానే బోధించలేదు; ఆయన ఆ కాలంలోని ప్రజల గ్రహణ శక్తికి తగినంత భాగాన్నే బోధించారు.

అటువంటప్పుడు, బుద్ధ ఫా అంటే ఏమిటి? విశ్వంలోని అతిప్రాథమిక మైన సత్యం–దయ–సహనం అన్న లక్షణమే, అత్యున్నత స్థాయిలో అభివ్యక్తమైన బుద్ధ ఫా యొక్క రూపం. అదే మౌలికమైన బుద్ధ ఫా. బుద్ధ ఫా అన్నది భిన్న స్థాయులలో భిన్నరూపాలలో వ్యక్తం అవుతూ, భిన్న స్థాయులలో భిన్న భూమికలు వహించి, మార్గదర్శకత్వం నెరుపుతుంది. స్థాయి తగ్గినకొద్దీ అధిక క్లేశతమై ఉంటుంది. సత్యం–దయ–సహనం అన్న ఈ లక్షణం, గాలి, రాయి, చెక్క, మట్టి, ఇనుము, ఉక్కు, మానవదేహం మొదలైన సమస్త పదార్థాల యొక్క సూక్ష్మమైన నలుసులలో ఉంది. ప్రాచీనకాలంలో, విశ్వంలోని సమస్త వస్తువులూ, ద్రవ్యమూ, ఐదు మూలపదార్థాల (15) తో ఏర్పడ్డాయని, వాటన్నిటిలోనూ, సత్యం–దయ–సహనం అన్న విశ్వ లక్షణం ఉంటుందని చెప్పబడింది. ఒక సాధకుడు, తాను చేరుకున్న సాధనాస్థాయిని అంటే, తాను పొందిన ఫలస్థితి (16) స్థాయిలో అభివ్యక్తమైన బుద్ధ ఫా యొక్క నిర్దిష్ట రూపాన్ని మాత్రమే అర్థం చేసుకోగలడు. విస్పష్టంగా చెప్పాలంటే, ఫా అపారమయినది. అత్యున్నత దృష్టికోణం నించి చూసినప్పుడు, అది అతి సులభంగా ఉంటుంది, ఎందుకంటే, ఫా, పిరమిడ్ వంటి ఆకృతిని కలిగి ఉంటుంది. శిఖరం చివర, దాన్ని సంక్షిప్తంగా సత్యం–దయ–సహనం అన్న మూడు పదాలలో చెప్పొచ్చు. భిన్న స్థాయులలో వ్యక్తం అవుతున్నప్పుడు అది అతిసంకీర్ణంగా ఉంటుంది. ఉదాహరణకు ఒక మానవుని తీసుకుందాం. తావో సిద్ధాంతం మానవ శరీరాన్ని చిన్న విశ్వంగా పరిగణిస్తుంది. ఒక వ్యక్తికి భౌతిక శరీరం ఉంటుంది, అయితే, కేవలం భౌతిక శరీరాన్ని మాత్రమే కలిగి ఉండడంతో అతడు సంపూర్ణ వ్యక్తి కాడు. వ్యక్తిత్వంతో కూడిన స్వతంత్రుడైన ఒక సంపూర్ణ వ్యక్తిగా తయారుకావడానికి, అతడిలో మానవ స్వభావమూ, వ్యక్తిత్వమూ, శీలమూ, ప్రాథమికాత్మ కూడా కలిసి ఉండాలి. అదే విధంగా, పాలపుంత, ఇతర నక్షత్ర సమూహాలు, జీవమూ, నీరూ కలిగి ఉన్న మన

విశ్వానికి కూడా ఈ విషయం అన్వయిస్తుంది. విశ్వంలోని అన్ని వస్తువులూ, పదార్థమూ కూడా, భౌతికమైన ఉనికికి వివిధ రూపాలు. అయితే, అదే సమయంలో విశ్వంలో సత్యం-దయ-సహనం అన్న లక్షణం కూడా ఉంది. పదార్థంలోని సూక్ష్మమైన నలుసులన్నీ- అతిసూక్ష్మమైన నలుసులతో సహా, ఈ లక్షణంతో మూర్తీభవించి ఉంటాయి.

సత్యం-దయ-సహనం అన్న ఈ లక్షణమే, విశ్వంలో మంచి, చెడులను కొలిచే ప్రమాణం. మంచి, చెడులంటే ఏమిటి? అది ఈ విధంగా నిర్ణయించ బడుతుంది. మేము ఇంతకు ముందు చెప్పిన పుణ్యం (17) కూడా ఇదే. ఈనాడు సంఘంలో నైతిక ప్రమాణం ఖచ్చితంగా మారిపోయి, నాశనమైంది. ఇప్పుడు ఎవరైనా లీ ఫెంగ్ (18) నించి నేర్చుకుంటే, వాళ్ళను పిచ్చివాళ్ళుగా ముద్ర వెయ్యడం జరుగుతుంది. కానీ, 1950 లేదా 60లలో ఆ వ్యక్తులను పిచ్చివాళ్ళు అని ఎవరైనా అని ఉండేవారా? మనుషులలో నైతికవిలువల స్థాయి విపరీతంగా దిగజారుతున్నది, నైతిక విలువలు రోజురోజుకూ క్షీణిస్తున్నాయి. మనుషులు తమ స్వప్రయోజనాల కోసమే పాటుపడుతూ, చిన్న స్వలాభం కోసం కూడా ఇతరులకు హాని చేస్తారు. ఇతరులతో పోటీపడుతూ, అన్ని రకాలుగా నిరంతరం ఒకరితో ఒకరు ఘర్షణ పడుతూ ఉంటారు. ఇలా జరగడాన్ని కొనసాగనివ్వాలా? ఒక వ్యక్తి చెడ్డపని చేసినప్పుడు దానిని మీరు ఎత్తిచూపితే అతడు నమ్మడు. అతడు తాను చెడ్డపని చేస్తున్నానని నిజంగానే నమ్మడు. కొందరు వ్యక్తులు, దిగజారిపోయిన నైతిక ప్రమాణాలతో తమ విలువను నిర్ణయించుకుంటారు. అంచనా వేసుకునే ప్రమాణాలు మారిపోయిన కారణంగా, తమను తాము ఇతరులకన్నా మేలైన వారిగా భావించుకుంటారు. మానవ నైతిక ప్రమాణం ఎంతగా మారిపోయినా, ఈ విశ్వలక్షణం ఎన్నటికీ మార్పు చెందదు, మంచి వారికి, చెడ్డవారికి నడుమ భేదాన్ని తెలిపే ఏకైక ప్రమాణం ఇదే. అందువల్ల, సాధకునిగా ఒక వ్యక్తి, సామాన్య మానవుల ప్రమాణాలకన్నా ఈ విశ్వ లక్షణాన్ని అనుసరించి తనను తాను నియంత్రించుకోవాలి. మీరు ఆధ్యాత్మిక సాధన చేసి ఉన్నతులై, స్వస్వరూపానికి చేరుకోవాలని కోరుకుంటే, మిమ్మల్ని మీరు ఈ ప్రమాణానికి అనుగుణంగా నియంత్రించుకోవలసిన అవసరముంది. ఒక మానవుడిగా,

సత్యం–దయ–సహనం అన్న ఈ విశ్వ లక్షణాన్ని అనుసరించగలిగితేనే మంచి మనిషి అవగలరు. ఈ లక్షణాన్ని అతిక్రమించిన వ్యక్తి చెడ్డవాడే అవుతాడు. మీ కార్యాలయంలో లేదా సమాజంలో, మీరు చెడ్డవారని కొందరు అనొచ్చు, అంత మాత్రాన మీరు తప్పనిసరిగా చెడ్డవారు కాకపోవచ్చు. మీరు మంచి వారని కొందరు అనొచ్చు, కానీ మీరు నిజంగా మంచివారు కాకపోవచ్చు. ఒక సాధకుడిగా, మీరు ఈ లక్షణంతో మమేకం అయితే, మీరు తావో స్థితిని అందుకున్న వారవుతారు – ఈ నియమం ఇంతటి సులభమైనది.

సత్యం–దయ–సహనాన్ని సాధన చెయ్యడంలో, తావో సిద్ధాంతం సత్య సాధనయే ముఖ్యమని నొక్కిచెప్తుంది. అందువల్ల, ఒక వ్యక్తి స్వభావాన్ని పెంపొందించడంలో సత్య సాధనను తావో సిద్ధాంతం ఎక్కువగా నమ్ముతుంది; అతడు నిజమే చెప్పాలి, నిజాయితీగా పనులు చెయ్యాలి, సత్యవంతుడు కావాలి, స్వస్వరూపాన్ని చేరుకోవాలి, చివరకు ఆధ్యాత్మిక సాధన ద్వారా నిజమైన మనిషిగా మారాలి. ఇది దయ, సహనం గురించి కూడా చెప్పినా, సత్య సాధన మీద ఎక్కువగా దృష్టి నిలుపుతుంది. బుద్ధ సిద్ధాంతం సత్యం–దయ–సహనం మూడింటిలో దయ సాధనను ఎక్కువగా నొక్కిచెప్తుంది. దయ సాధన అపారమైన దయను జనింపజేస్తుంది, అటువంటి దయ పెంపొంది నప్పుడు, ఒక వ్యక్తి ఇతర జీవుల బాధలను తెలుసుకుంటాడు. ఆ విధంగా బుద్ధ సిద్ధాంతం, అన్ని జీవులకూ ముక్తిని ప్రసాదించాలనే అభిలాషను వృద్ధి చేస్తుంది. అందులో కూడా, సత్యమూ, సహనమూ ఉన్నాయి. కానీ, దయ గురించి ఎక్కువగా చెప్తుంది. మన ఫాలున్ దాఫా , విశ్వంలోని అత్యున్నత ప్రమాణమైన సత్యం–దయ–సహనం మీద ఆధారపడి ఉంది. వాటన్నిటినీ కలిపి మనం ఒకే సమయంలో సాధన చేస్తాము. మనం సాధన చేసే విధానం అపరిమితమైనది.

## చీ గోంగ్ ఐతిహాసిక యుగపు సంస్కృతి

చీ గోంగ్ అంటే ఏమిటి? అనేకమంది చీ గోంగ్ గురువులు దీని గురించి చెప్తారు. నేను చెప్తున్నది, వారు చెప్పినదానికి, భిన్నంగా ఉంటుంది. చాలా మంది చీ గోంగ్ గురువులు, తమ స్థాయిలోని చీ గోంగ్ గురించి చెప్తారు,

అయితే నేను చీ గోంగ్‌ను అత్యున్నత స్థాయినించి అర్థం చేసుకోవడం గురించి చెప్తున్నాను. ఇది వారి అవగాహనకు పూర్తిగా భిన్నమైనది. కొందరు చీ గోంగ్ గురువులు, చీ గోంగ్‌కు మనదేశంలో 2000 సంవత్సరాల చరిత్ర ఉందని చెప్తారు. చీ గోంగ్‌కు 3000 యేళ్ళ చరిత్ర ఉందని చెప్పేవారు కూడా కొందరున్నారు. కొందరైతే, చీ గోంగ్‌కు దాదాపుగా చైనీయ నాగరికతా కాలమైన 5000 ఏళ్ళ చరిత్ర ఉందంటారు. మరికొందరు, పురావస్తు తవ్వకాల ఆధారంగా చూస్తే, దానికి 7000 ఏళ్ళ చరిత్ర ఉందని, అందువల్ల చైనీయ నాగరికతా కాలానికి కూడా పూర్వమే ఉందని చెప్తారు. వాళ్ళు ఏ విధంగా అర్థం చేసుకొని ఉన్నా, మానవ నాగరికతా చరిత్ర కాలానికి ముందు చీ గోంగ్ ఉనికికి అవకాశం లేదు. డార్విన్ సిద్ధాంతం ప్రకారం మానవులు నీటిలో పుట్టిన మొక్కలూ, వాటినించి పరిణామం చెందిన జలచరాలనించి ఆవిర్భవించారు. తరవాత, అవి నేల మీద జీవించేందుకు ఆ పై చెట్ల మీదకు చేరాయి. నేల మీద కోతులుగా పరిణామం చెంది, చివరకు నాగరికత, ఆలోచనా శక్తి కలిగిన ఆధునిక మానవులుగా పరిణామం చెందారు. ఆ లెక్కల ఆధారంగా చూస్తే, వాస్తవంగా, మానవ నాగరికత ఆవిర్భవించి 10 వేల సంవత్సరాలు మించి గడవలేదు. అంతకు ముందటి కాలాన్ని పరిక్షిస్తే, ముడులు వేసి విషయాలను గుర్తుపెట్టుకోవడం అన్న పద్ధతి కూడా లేదు. ఆ కాలం మనుషులు, చెట్ల ఆకులు చుట్టుకొని, పచ్చిమాంసాన్నే తినేవారు. ఇంకా వెనక కాలాన్ని చూస్తే, వాళ్ళు పూర్తిగా అడవి మనుషులు లేదా ఆదిమ మానవులు. వారికి నిప్పు వాడడం కూడా తెలిసి ఉండకపోవచ్చు.

అయినా మాకు ఒక సమస్య ఎదురైంది. ప్రపంచంలోని అనేక ప్రదేశాలలో, మానవ నాగరికతా చరిత్రకు ఎంతో అతీతంగా ఉన్న కాలానికి చెందిన సాంస్కృతిక అవశేషాలు ఉన్నాయి. ఈ ప్రాచీన అవశేషాలలో ఎంతో అభివృద్ధి చెందిన నైపుణ్యం కనిపిస్తుంది. అవి, కళాత్మక విలువలలో చాలా అభివృద్ధి పొందిన స్థాయికి చెంది ఉన్నాయి. ఆధునిక మానవాళి, కేవలం ప్రాచీన మానవుల కళలను అనుకరిస్తున్నారు, వారి కళలు గొప్ప కళాత్మక విలువలు కలిగి ఉన్నాయి. అయితే, అవి లక్ష సంవత్సరాలూ, అనేక లక్షల సంవత్సరాలూ, కోట్ల సంవత్సరాలూ లేదా పది కోట్ల సంవత్సరాలకు మించిన

గతకాలపు అవశేషాలు. దీని గురించి అందరూ యోచించండి: అవి ఈనాటి చరిత్రను వెక్కిరిస్తున్నట్లుగా లేదూ? నిజానికి, ఇదేమీ పరిహాసం కాదు, ఎందుకంటే మానవజాతి నిరంతరం తనను తాను మెరుగుపరచుకుంటూ, పునరావిష్కరణ చేసుకుంటూ ఉంది. సమాజం ఈ పద్ధతిలో అభివృద్ధి చెందుతూ ఉంటుంది. మొట్టమొదట అర్థం చేసుకున్నదే పరిపూర్ణ సత్యం కాకపోవచ్చు.

ఐతిహాసిక యుగపు సంస్కృతి లేదా ఐతిహాసిక యుగపు నాగరికత అని చెప్పబడిన దాని గురించి చాలామంది వినే ఉంటారు. మేము ఐతిహాసిక యుగపు నాగరికత గురించి చెప్తాం. భూమి మీద ఆసియా, ఐరోపా, దక్షిణ అమెరికా, ఉత్తర అమెరికా, ఆఫ్రికా, అంటార్కిటికా వంటి ఖండాలూ, మహా సముద్రాలు ఉన్నాయి. భూగర్భ శాస్త్రవేత్తలు వీటిని ఖండ ఫలకాలు అంటారు. ఈ భూఖండ ఫలకాలు తయారైన కాలం తరవాత ఎన్నో కోట్ల సంవత్సరాలు గడిచాయి. అంటే, అనేక ఖండాలు మహాసముద్రగర్భంనించి ఆవిర్భవించాయి, అనేక ఖండాలు మహాసముద్రపు అట్టడుగునకు మునిగిపోయాయి. అవి, ప్రస్తుత స్థితిలోకి స్థిరపడడానికి అనేక కోట్ల సంవత్సరాల కాలం పట్టింది. అయితే, కొన్ని మహాసముద్రాల అంతర్భాగంలో, కొన్ని పొడవైన, అతిపెద్దవైన, ప్రాచీన కట్టడాలు కనుగొనబడ్డాయి. ఈ కట్టడాలు అతిసుందరంగా, కళాత్మకంగా తీర్చిదిద్దబడినవి, అవి మన ఆధునిక మానవాళి యొక్క సాంస్కృతిక వారసత్వానికి చెందినవి కావు. అటువంటి పక్షంలో, అవి తప్పని సరిగా, సముద్రంలోనికి మునిగిపోక మునుపే, నిర్మింపబడి ఉండాలి. కొన్ని కోట్ల సంవత్సరాలకు ముందుగానే ఈ నాగరికతలను ఎవరు సృష్టించారు? ఆ కాలానికి, మన మానవజాతి కనీసం మహావానరాల స్థితిలో కూడా లేదు. అంతటి గొప్ప తెలివితేటలతో మనం వాటిని ఎలా సృష్టించగలిగాము? ప్రపంచవ్యాప్తంగా ఉన్న పురావస్తు శాస్త్రజ్ఞులు, అరవైనించి ఇరవైఆరు కోట్ల సంవత్సరాలకు మధ్యనున్న ప్రాచీనకాలంలో, ట్రైలో బైట్ అనే జీవి ఉండేదని కనుగొన్నారు. ఈ రకమైన జీవి 26 కోట్ల సంవత్సరాలకు పూర్వమే అంతరించింది. అమెరికాకు చెందిన ఒక శాస్త్రజ్ఞుడు, ట్రైలోబైట్ అన్న ఆ జీవి శిలాజాన్ని, దాని మీద ఉన్న మానవ పాదముద్రతో సహా కనుగొన్నాడు; ఆ

పాదముద్ర, పాదరక్షలు ధరించిన ఒక వ్యక్తిదని స్పష్టంగా కనిపించింది. ఇది చరిత్రకారులను వెక్కిరిస్తున్నట్లుగా లేదూ? డార్విన్ సిద్ధాంతం ప్రకారం చూస్తే, ఇరవైఆరు కోట్ల సంవత్సరాల క్రింద మానవులు ఉండడం ఎలా సాధ్యం?

పెరూలోని జాతీయ విశ్వవిద్యాలయంలోని వస్తు ప్రదర్శనశాలలో ఒక మనిషి బొమ్మ చెక్కబడిన రాయి ఉంది. పరిశోధన జరిగిన తరువాత, ఆ బొమ్మ 30 వేల ఏళ్ళ క్రింద చెక్కబడిందని ధృవీకరింపబడింది. ఆ మనిషి బొమ్మ దుస్తులు, టోపీ, పాదరక్షలనూ ధరించి యుండి, చేతిలో దూరదర్శినిని పట్టుకొని, ఖగోళంలోని ఆకృతిని పరిశీలిస్తున్నట్లుంది. 30 వేల ఏళ్ళ క్రిందట, మనుషులు బట్టను నేసి, దుస్తులు ధరించడం ఎలా చెయ్యగలిగారు? అంతకన్నా నమ్మశక్యం కాని విధంగా, అతడు కొంత ఖగోళశాస్త్ర పరిజ్ఞానం కలిగి ఉండి, దూరదర్శినితో ఖగోళాకృతిని పరిశీలిస్తున్నాడు. దూరదర్శినిని కనిపెట్టినది గెలీలియో అని మనమంతా అనుకుంటాం. అది 300 సంవత్సరాలకు కొంచెం పూర్వం మాత్రమే జరిగినది. అయితే 30 వేల సంవత్సరాల క్రిందట, దూరదర్శినిని ఎవరు కనిపెట్టారు? పరిష్కరింపబడనట్టి చిక్కు ప్రశ్నలు ఇంకా ఎన్నో ఉన్నాయి. ఉదాహరణకు, ఫ్రాన్సులోనూ, దక్షిణాఫ్రికాలోనూ, ఆల్ప్ పర్వతాలలోనూ ఉన్న అనేక గుహలలో, నిజమే అనిపించేట్లు, ప్రాణం ఉట్టిపడుతున్న కుడ్య చిత్రాలు మలచబడి ఉన్నాయి. వాటిలోని బొమ్మలు చెప్పుకోదగినంత ప్రశస్తంగా ఉండి ధాతు వర్ణాలతో చిత్రించబడి ఉన్నాయి. ఆ వ్యక్తులు సమకాలీనమైన దుస్తులు అంటే, పాశ్చాత్యులు ధరించే సూట్ల వంటివి, బిగుతైన పంట్లాంల వంటివి ధరించి ఉన్నారు. కొందరు మనుషులు పొగ పీల్చే గొట్టాలను పట్టుకొని ఉండగా, మరికొందరు చేతికర్రలను పట్టుకొని, టోపీలను ధరించి ఉన్నారు. లక్షల సంవత్సరాల క్రింద ఉండిన వానరాలు అంతటి అభివృద్ధి చెందిన కళాత్మక స్థాయికి ఎలా చేరగలిగాయి?

అంతకన్నా పూర్వయుగానికి చెందిన ఉదాహరణ ఇవ్వాలంటే, ఆఫ్రికాలోని గణతంత్ర దేశమైన గాబన్‌లో, యురేనియం ఖనిజం ఉంది. అది అంతగా అభివృద్ధి చెందని దేశం. అది స్వయంగా యురేనియంను తయారు చేసుకోలేక, ఆ ఖనిజాన్ని అభివృద్ధి చెందిన దేశాలకు ఎగుమతి చేస్తూ

ఉంటుంది. 1972లో ఒక ఫ్రెంచ్ తయారీదారుడు ఆ యురేనియం ఖనిజాన్ని దిగుమతి చేసుకున్నాడు. పరిశోధనశాలలో పరీక్షలు జరిపిన తరవాత ఆ ఖనిజంనించి యురేనియంను వెలికితీసి, ఉపయోగించినట్లు తెలిసింది. అది చాలా అసాధారణంగా తోచి, వారు దానిని గురించి అధ్యయనం చెయ్యడానికి, శాస్త్రజ్ఞులను పంపించారు. ఎన్నో ఇతర దేశాలనించి కూడా ఎందరో శాస్త్రజ్ఞులు అక్కడ పరీక్షలు నిర్వహించడానికి వెళ్ళారు. చివరకు, ఆ యురేనియం గని ఎంతో ప్రణాళికాబద్ధంగా నిర్మించబడిన భారీస్థాయి అణు రియాక్టరు అని ధృవీకరింపబడింది. మన ఆధునిక కాలపు మానవులకే అటువంటి దానిని సృష్టించడం సాధ్యమయ్యే పని కాదు, అలా అయితే అది ఎప్పుడు నిర్మింప బడింది? అది రెండు బిలియన్ సంవత్సరాల క్రింద నిర్మింపబడి, ఐదు లక్షల సంవత్సరాలపాటు పనిచేసింది. అవి ఊహకందని సంఖ్యలు, వాటిని డార్విన్ పరిణామ సిద్ధాంతం ఆధారంగా వివరించలేం. అటువంటి ఉదాహరణలు చాలా ఉన్నాయి.

ఈనాటి శాస్త్ర, సాంకేతిక నిపుణులు ప్రస్తుత పాఠ్యగ్రంథాలను మార్చడానికి తగినంత సమాచారం కనిపెట్టారు. మానవజాతి పాతకాలపు మనస్తత్వాలతో ఒక క్రమపద్ధతిలో పనిచెయ్యడమూ, ఆలోచించడమూ ఏర్పాటుచేసుకున్న తర్వాత, కొత్త ఆలోచనలను అంగీకరించడం చాలా కష్టం. సత్యం బయటపడినప్పుడు మనుషులు దానిని ఒప్పుకోవడానికి సాహసించక, తమ సహజ బుద్ధితో దానిని తిరస్కరిస్తారు. పరంపరాగత సాంప్రదాయాల ప్రభావం కారణంగా అటువంటి ఆవిష్కరణలను ఒక క్రమపద్ధతిలో ఎవ్వరూ సంకలనం చెయ్యలేదు. ఆ విధంగా మానవుల ఆలోచనలు ఎప్పుడూ కూడా జరిగిన విస్తరణల కంటే వెనకబడే ఉంటాయి. ఒకసారి మీరు ఈ విషయాల గురించి మాట్లాడడం మొదలుపెడితే–అవి అప్పటికే కనిపెట్టిన విషయాలైనా–వాటిని మూఢనమ్మకాలని కొట్టిపారేసేవారు ఉంటారు. కేవలం వాటిని ఇప్పటి దాకా విస్తృతంగా ప్రచారం చెయ్యడం మాత్రమే జరగలేదు.

విదేశాలలోని ధైర్యవంతులైన శాస్త్రజ్ఞులు, ఇది ఐతిహాసిక సంస్కృతి అని, ఇప్పటి మన మానవజాతి నాగరికతకు ముందు ఉండిన ఒక నాగరికత అని గుర్తించి, వెల్లడి చేశారు. ఇంకో రకంగా చెప్పాలంటే, మన నాగరికత కంటే

ముందుగానే కేవలం ఒక్క కాల అవధికి చెందినవే కాక అనేక నాగరికతలు ఉండేవి. భూమి లోపలినించి వెలికితీసిన అవశేషాలను బట్టి, అవి కేవలం ఒక్క కాల అవధికి చెందిన నాగరికతకు మాత్రమే సంబంధించిన వస్తువులు కావని తెలుసుకున్నాం. ఆ విధంగా, ఇది వరకు ఎన్నోసార్లు జరిగినట్లు, మానవ నాగరికత నశించిపోయిన ప్రతిసారి, కేవలం చిన్న సంఖ్యలో మనుషులు బ్రతికియుండి, అనాగరిక జీవితాన్ని కొనసాగించారని నమ్మబడు తున్నది. ఆపై, వారు క్రమంగా, సంఖ్యాపరంగా పెరిగి, కొత్త మానవజాతి తయారై, కొత్త నాగరికతను ప్రారంభించేవారు. ఆ తర్వాత వారు మళ్ళీ నశించిపోయి, మరొకసారి కొత్త మానవజాతిని తయారుచేసేవారు. అది, కేవలం అటువంటి వివిధ కాల అవధులలోని మార్పులకు లోనవుతూ ఉంటుంది. భౌతిక శాస్త్రవేత్తలు, పదార్థం యొక్క కదలిక కొన్ని సూత్రాలను అనుసరించి ఉంటుందని చెప్తారు. మన యావత్ విశ్వంలోని మార్పులు కూడా నిర్దిష్టమైన సూత్రాలను అనుసరించే ఉంటాయి.

అనంతమైన విశ్వంలోనూ, పాలపుంతలోనూ, మన భూగోళం, ఎల్లవేళలా అడ్డంకులు లేకుండా సమంగా పరిభ్రమిస్తూ ఉండి ఉండడం అసంభవం. అది ఇంకొక గ్రహాన్ని ఢీకొట్టడం, లేదా ఇతర సమస్యలు ఎదురవడం, మహావిపత్తులకు దారితీసింది. మా అతీంద్రియ శక్తుల దృష్టి కోణం నించి చూస్తే, అది కేవలం ఆ విధంగా నిర్ణయింపబడి ఉంది. నేను ఎంతో జాగ్రత్తగా పరిశీలన చేసి, మానవజాతి ఎనభైఒక్కసార్లు అటువంటి సంపూర్ణ వినాశనం చెందిందని తెలుసుకున్నాను. ముందరి నాగరికతకు చెందిన మనుషులలో, నశించగా మిగిలిన కొందరు, తరవాతి కాల అవధిలోకి ప్రవేశించి, తిరిగి, అనాగరిక జీవితం ప్రారంభిస్తారు. మానవ జనాభా పెరిగేకొద్దీ, కాలక్రమేణా నాగరికత తిరిగి అభివృద్ధి చెందుతుంది. కాలక్రమేణా జరిగే అటువంటి మార్పులను మానవాళి ఎనభైఒక్కసార్లు అనుభవించింది, అయినా, ఆ మార్పుల ముగింపు యొక్క ఆచూకీ నాకు దొరకలేదు. చైనీయులు, జగత్సంబంధమైన కాలనిర్ణయం, భూమిపైన ఉన్న సానుకూల పరిస్థితులు, మానవుల నడుమ సుహృద్భావముల గురించి మాట్లాడుతారు. విశ్వంలో జరిగే వివిధ పరిణామాలు, విభిన్న విశ్వకాల నిర్ణయాలు సామాన్య మానవ

సంఘంలో విభిన్న పరిస్థితులను కల్పించగలవు. భౌతికశాస్త్ర ప్రకారం, పదార్థం యొక్క కదలిక కొన్ని నిర్దిష్ట సూత్రాలను అనుసరించి ఉంటుంది – విశ్వం యొక్క కదలిక కూడా ఇలాగే జరుగుతుంది.

ఐతిహాసిక యుగపు సంస్కృతిని గురించిన ఈ ప్రస్తావన, ఛీ గోంగ్ మన కాలంలోని మానవజాతి కనిపెట్టిన అంశం కాదని మీకు తెలుపుతుంది. ఇది, అంతు తెలియని పూర్వయుగం నించి వారసత్వంగా లభించింది, ఇది కూడా ఒక రకమైన ఐతిహాసిక యుగపు సంస్కృతియే. బౌద్ధమత గ్రంథాలలో కూడా దీనికి సంబంధించిన కొన్ని వివరణలు మనకు కనిపిస్తాయి. తాను అనేక లక్షల కల్పా(19)ల క్రింద ఆధ్యాత్మిక సాధనలో సఫలత సాధించానని శాక్యముని ఒకసారి చెప్పారు. ఒక కల్పంలో ఎన్ని సంవత్సరాలున్నాయి? ఒక కల్పమంటే, కొన్ని కోట్ల సంవత్సరాల సంఖ్యను తెలియజేస్తుంది. అటువంటి పెద్ద సంఖ్య ఊహాతీతమైనది. ఇది నిజమే అయితే, మానవజాతి చరిత్ర, భూగోళం అంతటా మార్పులు జరిగిన విషయం కూడా నిజమైనట్లే కదా? తన కంటే ముందు ఆరుగురు ప్రాచీన బుద్ధులు ఉన్నారని, తనకు గురువులు ఉన్నారని, వారందరూ అనేక కోట్ల కల్పములకు ముందే ఆధ్యాత్మిక సాధనలలో సఫలీకృతులు అయ్యారు అనే మరొక విషయం కూడా శాక్యముని చెప్పారు. ఇదంతా నిజమైతే, మన సంఘంలో ఈనాడు బోధింపబడుతున్న నిక్కమైన, సాంప్రదాయబద్ధ పద్ధతులలోనూ, విశ్వసనీయమైన బోధనలలోనూ ఆనాటి సాధనా విధానాల వంటివి ఉన్నాయా? నన్నడిగితే, ఖచ్చితంగా ఉన్నాయి కానీ, అవి అరుదుగా కనబడతాయి. ఈ రోజుల్లో, నకిలీ ఛీ గోంగ్, నామమాత్రపు ఛీ గోంగ్, ఆత్మలు ఆవహించిన వ్యక్తులు మొత్తంగా, ప్రజలను మోసం చేసేందుకు, తమ ఇష్టం వచ్చినట్లు ఏదో తయారుచేశారు, వాటి సంఖ్య అసలైన ఛీ గోంగ్ సాధనల సంఖ్యను ఎన్నో రెట్లు మించిపోయింది. అసలు, నకిలీల మధ్యనున్న భేదాన్ని చెప్పడం కష్టం. ఒక అసలైన ఛీ గోంగ్ సాధనను వేరుచేసి చూపడం అంత సులభమైన పని కాదు, అది దొరకడమూ సులభం కాదు.

నిజానికి ఛీ గోంగ్ ఎంతో పూర్వయుగంనించి రావడమే కాదు, తాయిజి (20), హూతు (21), లోషు, బుక్ ఆఫ్ చేంజెస్ (22), ద ఎయిట్ ట్రెయ

గ్రామ్స్ (23), మొదలైన గ్రంథాలన్నీ కూడా ఐతిహాసికయుగపు వారసత్వంగా లభించినవే. అందువల్ల, నేటి సామాన్య మానవుల దృక్కోణంనించి వీటిని అధ్యయనం చెయ్యడమూ, అర్థం చేసుకోవడమూ చేస్తే, మనం ఏ రకంగానూ వాటిని అవగాహన చేసుకోలేము. ఒక సామాన్య వ్యక్తి స్థాయి మనోదృక్పథమూ, మానసికస్థితీ కలిగియున్న మనిషి నిజమైన విషయాలను అర్థం చేసుకోలేడు.

## చీ గోంగ్ ఒక ఆధ్యాత్మిక సాధన

చీ గోంగ్‌కు సుదీర్ఘ చరిత్ర ఉండడం చేత, దాని ప్రయోజనం ఏమిటి? మనం బుద్ధ సిద్ధాంతంలోని ఒక గొప్ప ఆధ్యాత్మిక మార్గంలో ఉన్న కారణంగా, మనం సహజంగానే బుద్ధత్వాన్ని సాధన చేస్తున్నామని నేను మీకందరికీ చెప్తున్నాను. తావో సిద్ధాంతంలో, ఒక వ్యక్తి తావో అయ్యేందుకు తావో సాధనను చేస్తాడు. "బుద్ధుడు" అంటే ఒక మూఢనమ్మకం కాదని, మీ అందరికీ చెప్తున్నాను. అది, ప్రాచీన భారతీయ భాష అయినట్టి సంస్కృతానికి చెందిన పదం. అది చైనాలో ప్రవేశపెట్టబడినప్పుడు, దాన్ని "ఫో తువో" (24) అనేవారు. కొందరు దాన్ని "ఫు తు" (25) అని కూడా అనువదించారు. ఆ మాట జనంలో ప్రాచుర్యం పొందిన తర్వాత చైనీయులు దానిలోనించి ఒక అక్షరాన్ని వదిలేసి, "ఫో" అనడం మొదలుపెట్టారు. చైనీయ భాషలో దాని అర్థమేమిటి? అంటే, "జ్ఞానోదయం పొందిన వ్యక్తి", ఆధ్యాత్మిక సాధన ద్వారా జ్ఞానోదయం పొందిన వ్యక్తి, అని. ఇందులో మూఢనమ్మకం ఏముంది?

మీరందరూ ఇది యోచించండి: ఆధ్యాత్మిక సాధన ద్వారా ఒక వ్యక్తి అతీంద్రియ శక్తులను పెంపొందించుకోగలడు. ఈనాడు ప్రపంచంలో, ఆరు రకాల అతీంద్రియ శక్తులు గుర్తింపబడి ఉన్నాయి, అయితే అవి అంతవరకే పరిమితం కాలేదు. పది వేలకు పైగా అసలైన అతీంద్రియ శక్తులు ఉన్నాయని నేను చెప్తున్నాను. ఒక వ్యక్తి ఇక్కడ కూర్చుని ఉండగానే, తన కాళ్ళు, చేతులు కదిలించకుండా, తమ కాళ్ళు, చేతులతో కలిపి కూడా, ఇతరులు చేయలేని పనులను చెయ్యగలడు, ఇంకా అతడు విశ్వంలోని ప్రతి పరిమాణంలోని అసలైన సత్యాన్ని చూడగలుగుతాడు. ఈ వ్యక్తి, ఒక సామాన్య వ్యక్తి చూడలేనట్టి

విశ్వ సత్యాన్ని, విషయాలను చూడగలుగుతాడు. అతడు ఆధ్యాత్మిక సాధన ద్వారా తావో స్థితిని పొందినవాడు కాదా? అతడు మహాజ్ఞాని కాదా? అతడు ఒక సామాన్య వ్యక్తితో సమానంగా ఎలా పరిగణింపబడతాడు? అతడు ఆధ్యాత్మిక సాధన ద్వారా జ్ఞాని అయినవాడు కాదా? అతడిని జ్ఞాని అనడం సరియే కదా? ప్రాచీన భారతీయ భాషలో అతడు ఒక బుద్ధుడుగా చెప్ప బడతాడు. ఇది వాస్తవం. ఇదే చీ గోంగ్ ప్రయోజనం.

చీ గోంగ్ గురించి మాట్లాడుతూ కొందరు, “ఎటువంటి వ్యాధి లేనప్పుడు, చీ గోంగ్ సాధనను ఎవరు చేస్తారు?” అనొచ్చు. అప్పుడు, చీ గోంగ్, వ్యాధి నిర్మూలన కోసం మాత్రమే అన్న అర్థం వస్తుంది. ఇది ఏ మాత్రమూ, అవగాహన లేని మాట. ఇది మీ తప్పు కాదు, ఎందుకంటే చాలామంది చీ గోంగ్ గురువులు నిజంగానే రోగులకు వ్యాధి నిర్మూలన, దేహపుష్టి కలగజేయడం వంటివి చేస్తూ ఉంటారు. వాళ్ళందరూ ఆ పనుల గురించి మాట్లాడుతూ ఉంటారు. ఎవ్వరూ ఉన్నతస్థాయిలకు చేర్చే విషయాల గురించి చెప్పరు. వారి సాధనలు మంచివి కావని కాదు దీని అర్థం. స్వస్థపరచి, ఆరోగ్యాన్ని నిలిపే స్థాయిలో బోధిస్తూ, చీ గోంగ్‌ను ప్రచారం చెయ్యడమే వారి లక్ష్యం. ఉన్నత స్థాయులకు చేరేందుకు ఆధ్యాత్మిక సాధన చెయ్యాలని కోరుకునేవారు అనేకులు ఉన్నారు. వారిలో అటువంటి ఆలోచనలూ, కోరికలూ ఉన్నా, వారికి సరైన సాధనాపద్ధతులు లభించలేదు, అది చాలా కష్టాలకు, అనేక సమస్యలకు కారణం అయింది. ఉన్నతస్థాయిలో ఒక సాధనను వాస్తవంగా నేర్పాలంటే, అందులో చాలా లోతైన అంశాలు అనేకం ఉంటాయి. అందువల్ల మేము ప్రజల పట్ల, సమాజం పట్ల బాధ్యత కలిగి ఉన్నాం, మొత్తం మీద, ఈ ఆధ్యాత్మిక సాధనను బోధించడం వల్ల, మంచి ఫలితం లభించింది. కొన్ని విషయాలు నిజంగానే నిగూఢంగా ఉండి, వాటి గురించి చర్చించినప్పుడు, మూఢనమ్మకాలుగా అనిపిస్తాయి. అయినా, మేము నేటి విజ్ఞానశాస్త్ర ఆధారంగా వాటిని వివరించడానికి శాయశక్తులా ప్రయత్నిస్తాం.

మేము కొన్ని అంశాలను గురించి చెప్పినప్పుడు, కొందరు వాటిని మూఢనమ్మకాలని అంటారు. ఎందుకని? ఆ వ్యక్తి అలా అనడానికి కారణం,

విజ్ఞానశాస్త్రం ఇంతవరకు గుర్తించనిది, ఇంకా తన అనుభవంలోనికి రానిది, లేదా అటువంటి విషయం ఉండడం అసంభవమని అతడు భావించేది – అన్నీ మూఢనమ్మకాలూ, కల్పనలు అనుకుంటాడు – అది అతని మనస్తత్వం. ఈ మనస్తత్వం సరైనదేనా? విజ్ఞానశాస్త్రం చేత గుర్తించబడనివీ, దాని అభివృద్ధికి అతీతమైనవీ అయిన విషయాలకు మూఢనమ్మకమని, కల్పన అని ముద్ర వెయ్యడం సరైనదేనా? అటువంటప్పుడు, ఆ వ్యక్తి తానే మూఢనమ్మకాలను, కల్పనలను కలిగి ఉన్నట్లు కాదా? ఇటువంటి మనస్తత్వం ఉన్నప్పుడు, విజ్ఞాన శాస్త్రంలో పురోగతి, అభివృద్ధి ఎలా జరుగుతుంది? అటు మానవ సమాజం కూడా ముందడుగు వెయ్యలేదు. మన విజ్ఞాన శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులూ ఈనాడు కనిపెట్టిన ప్రతి విషయమూ, గతంలో ప్రజలకు తెలియనివే. అటు వంటి విషయాలన్నిటినీ మూఢనమ్మకాలుగా పరిగణిస్తే, నిజంగా, అభివృద్ధి అన్నదే అవసరం లేదు. చీ గోంగ్ కల్పిత విషయం కాదు. చీ గోంగ్‌ను అర్థం చేసుకోలేని వ్యక్తులు చాలామంది ఉన్నారు, అందువల్ల చీ గోంగ్‌ను ఎల్లప్పుడూ ఒక కల్పనగానే భావించారు. ప్రస్తుతం, విజ్ఞానశాస్త్ర పరికరాల సహాయంతో, ఒక చీగోంగ్ గురువు శరీరంలో ఇన్‌ఫ్రాసోనిక్ తరంగాలు, సూపర్‌సోనిక్ తరంగాలు, విద్యుదయస్కాంత తరంగాలూ, ఇన్‌ఫ్రారెడ్, అల్ట్రావయొలెట్, గామా కిరణాలు, న్యూట్రాన్లు, అణువులు, అరుదైన లోహ మూలకాలు, మొదలైనవి ఉన్నట్లు మేము కనుగొన్నాం. అవన్నీ భౌతికంగా ఉన్న పదార్థాలే కదా? అవన్నీ కూడా పదార్థ జనితమైనవే. ప్రతి వస్తువూ పదార్థంతో తయారైనదే కాదా? ఇతర దేశ కాలాలు పదార్థంతో నిర్మింపబడినవే కదా? చీ గోంగ్‌ను కల్పన అని ఎలా ముద్ర వేయగలరు? బుద్ధత్వాన్ని సాధన చెయ్యడానికి ఉపయోగించుకుంటున్న కారణంగా, దానిలో, అనేక నిగూఢమైన అంశాలు ఉంటాయి, మేము వాటన్నిటినీ వివరిస్తాం.

చీ గోంగ్, అంతటి ప్రయోజనం ఇస్తున్నప్పుడు, మనం దానిని చీ గోంగ్ అని ఎందుకు పిలుస్తున్నాం? నిజానికి అది "చీ గోంగ్" అని పిలవబడడం లేదు. ఏమని పిలవబడుతున్నది? అది "ఆధ్యాత్మిక సాధన"గా చెప్పబడు

తున్నది, అది కేవలమూ ఆధ్యాత్మిక సాధన. దానికి ఇతర ప్రత్యేకమైన పేర్లు ఉన్నాయి, కానీ సాధారణంగా దానిని ఆధ్యాత్మిక సాధన అంటున్నారు. అయితే చీ గోంగ్‌గా ఎందుకు పిలవబడుతున్నది? ఇరవై ఏళ్ళకు పైగా సంఘంలో చీ గోంగ్ ప్రచారం చెయ్యబడుతున్న విషయం తెలిసినదే. అది తొలిసారిగా మహా సాంస్కృతిక విప్లవం (26) లోని మధ్యకాలంలో అవతరించి, తర్వాతి కాలంలో కీర్తిశిఖరాన్ని చేరుకుంది. దీన్ని గురించి ప్రతివారూ యోచించండి: ఆ సమయంలో వామపక్ష భావజాలం చాలా ప్రాచుర్యంలో ఉంది. ఐతిహాసిక యుగంలో చీ గోంగ్‌కు ఏ పేర్లు ఉన్నాయో మేము చెప్పము. ఇప్పటి మానవ నాగరికత తన గమనంలో భూస్వామ్య వ్యవస్థను గడచి వచ్చింది. అందువల్ల, ఆ కాలంలోని పేర్లలో భూస్వామ్యపరమైన అంశాలు కలిసి ఉండేవి. మత సంబంధిత చీ గోంగ్ సాధనలకు సహజంగానే, ఘనంగా ధ్వనించే మత పరమైన పేర్లు ఉండేవి. ఉదాహరణకు "ద గ్రేట్ కల్టివేషన్ వే ఆఫ్ తావో", "ద ధ్యాన ఆఫ్ వజ్ర", "ద వే ఆఫ్ అర్హత్" (27), "ద గ్రేట్ కల్టివేషన్ వే ఆఫ్ బుద్ధ ధర్మ", "నైన్ ఫోల్డ్ ఇన్టర్నల్ ఆల్కెమి" మొదలైనవి. మహాసాంస్కృతిక విప్లవకాలంలో ఈ పేర్లను ఉపయోగించి ఉంటే, మీరు విమర్శలకు గురయ్యే వారు కాదా? చీ గోంగ్‌ను ప్రచారం చెయ్యాలన్న ఆ చీ గోంగ్ గురువుల ఆశయం ఎంత మంచిదైనప్పటికీ, సామాన్య మానవులకు వ్యాధి నిర్మూలన, దేహపుష్టి కలగజేసి వారి శారీరక స్థితులను మెరుగుపరచుకునే విధంగా సహాయం చెయ్యాలనే సత్సంకల్పం వారిలో ఉన్నప్పటికీ – అది ఎంత ఉన్నత మైనప్పటికీ – దానికి అనుమతి లభించలేదు. ఈ రకమైన పేర్లను వాడేందుకు ప్రజలు ధైర్యం చేయలేకపోయేవారు. అందువల్ల, చాలామంది చీ గోంగ్ గురువులు చీ గోంగ్‌ను ప్రచారం చెయ్యడానికి, దాన్ జింగ్, తావో జాంగ్ (28) అన్న గ్రంథాల నించి రెండు పదాలను తీసుకొని, "చీ గోంగ్" అనే పేరు పెట్టారు. కొందరైతే చీ గోంగ్ పదజాలాన్ని గురించి పరిశోధన చెయ్యడం మీద దృష్టి కేంద్రీకరిస్తారు. అక్కడ అధ్యయనం చెయ్యడానికి ఏమీ లేదు. గతంలో దీనిని ఆధ్యాత్మిక సాధన అని మాత్రమే అనేవారు. "చీ గోంగ్" అన్నది, కేవలం ఆధునిక ప్రజల మనస్తత్వానికి తగిన విధంగా ఉండేందుకు కొత్తగా సృష్టింపబడిన పదం.

## మీరు చేసే వ్యాయామాల వలన మీ గోంగ్ ఎందుకు పెరగదు?

మీ శారీరక వ్యాయామాల వలన మీ గోంగ్ ఎందుకు పెరగదు? చాలామంది, "నాకు అసలైన బోధన లభించలేదు. నాకు ఒక గురువు కొన్ని ప్రత్యేకమైన నైపుణ్యాలూ, అభివృద్ధి చెందిన ప్రక్రియలూ నేర్పినట్లైతే, నా గోంగ్ పెరుగుతుంది", అనుకుంటారు. ఈ రోజుల్లో, తొంభైఐదు శాతం మంది ఈ రకంగా ఆలోచిస్తారు, అది హాస్యాస్పదమని నేను భావిస్తాను. ఎందువల్ల హాస్యాస్పదం? ఎందుకంటే, చీ గోంగ్ అన్నది సామాన్య వ్యక్తులకు సంబంధించిన ప్రక్రియ కాదు. అది పూర్తిగా మానవాతీతమైన విషయం. దాన్నిబట్టి, ఉన్నతస్థాయిలకు చెందిన నియమాలను ఉపయోగించి దాన్ని పరీక్షించాలి. ఒక వ్యక్తి తన గోంగ్‌ను పెంచుకోలేకపోవడానికి ప్రాథమిక కారణం, ఆధ్యాత్మిక సాధన, వ్యాయామాలన్న రెండు పదాలలో ప్రజలు వ్యాయామాలను మాత్రమే పట్టించుకొని, ఆధ్యాత్మిక సాధనను నిర్లక్ష్యం చేస్తారు. మీరు దేనికోసమైనా వెలుపల అన్వేషిస్తే, దానిని ఏ విధంగానూ పొందలేరు. ఒక సామాన్య వ్యక్తి శరీరంతో, సామాన్య వ్యక్తి చేతులతో, సామాన్య వ్యక్తి మనసుతో, అత్యంత శక్తి పదార్థాన్ని గోంగ్‌గా మార్చగలమనీ, పెంపొందించుకోగలమనీ మీరు భావిస్తున్నారా? అది అంత సులభంగా ఎలా జరుగుతుంది? నా దృష్టిలో, అది హాస్యాస్పదం. అది ఒక విషయానికై బాహ్యపరంగా ప్రయత్నిస్తూ, వెలుపలనే అన్వేషించినట్లు అవుతుంది. మీకు అది ఎన్నటికీ దొరకదు.

అది ఎంతో కొంత డబ్బు చెల్లించి గానీ, కొన్ని ప్రత్యేక ప్రక్రియల ద్వారా గానీ, సంపాదించుకోగలిగినట్టి సామాన్య వ్యక్తుల యొక్క నైపుణ్యం వంటిది కాదు. ఎందుకంటే, ఇది సామాన్య వ్యక్తుల స్థాయికి అందనిది. అందువల్ల, మీరు అతీంద్రియ నియమాలను పాటించవలసిన అవసరం ఉంది. అటువంటప్పుడు, మీనుండి ఆశించేది ఏమిటి? మీరు తప్పనిసరిగా మీ అంతరాత్మను సంస్కరించుకోవలసిన అవసరం ఉంది, బాహ్య విషయాల కోసం ప్రాకులాడకూడదు. అనేకులు బాహ్య విషయాల కోసమే ప్రాకులాడుతూ ఉంటారు. వారు ఇవాళ ఒక విషయానికై, రేపు మరొక విషయానికై తాపత్రయ పడుతూ ఉంటారు. దీనికితోడు, వారు అతీంద్రియ శక్తులను సాధించడం పట్ల తీవ్రమైన బంధం పెంచుకొని, అన్ని రకాల అభిప్రాయాలు కలిగి ఉంటారు.

చీ గోంగ్ గురువులై పోయి, వ్యాధుల నుంచి స్వస్థత చేకూర్చి, సంపద కూడబెట్టాలని కోరుకునే వ్యక్తులు సైతం ఉంటారు! అసలైన ఆధ్యాత్మిక సాధన చేయడం కోసం, మీరు తప్పనిసరిగా మనసును సంస్కరించుకోవాలి. దీనినే షిన్ షిన్ సాధన అంటారు. ఉదాహరణకు, ఇద్దరు వ్యక్తుల మధ్య సంఘర్షణ ఏర్పడినప్పుడు, మీరు మీ వ్యక్తిగత మనోభావాలకూ, వాంఛలకూ అధిక ప్రాధాన్యత ఇవ్వరాదు. స్వలాభం కోసం పోటీపడుతున్నప్పుడు మీరు గోంగ్‌ను ఎలా పెంపొందించుకోగలుగుతారు – అదెలా సాధ్యపడుతుంది? అప్పుడు మీరు కూడా ఒక సామాన్య వ్యక్తి వంటి వారే కదా? మీ ఆధ్యాత్మిక శక్తి ఎలా పెంపొందుతుంది? అందువల్ల, కేవలం మీ షిన్ షిన్ సాధన పై దృష్టి కేంద్రీకరించడంవల్లనే, మీ గోంగ్‌తో పాటుగా మీ స్థాయి కూడా పెరుగుతుంది.

అయితే, షిన్ షిన్ అంటే ఏమిటి? అది పుణ్యం (ఒక రకమైన పదార్థం), సహనమూ, జ్ఞానలక్షణమూ, త్యాగమూ, సామాన్య వ్యక్తులలో ఉన్నట్టి రకరకాల కోరికలనూ, బంధాలనూ వదిలిపెట్టడమూ, కష్టాలను భరించే శక్తి మొదలయిన అంశాలను కూడుకొని ఉంటుంది. ఇది అనేక విషయాలను ఆవరించుకొని ఉంటుంది. మీరు నిజమైన అభివృద్ధి పొందడానికి, షిన్ షిన్‌కు చెందిన అన్ని కోణాలనూ ఉన్నతీకరించుకోవాలి. గోంగ్ సామర్థ్యాన్ని (గోంగ్ లి) పెంపొందించుకోవడానికి ఇదే ముఖ్యమైన కారకము.

“మీరు చెప్పిన షిన్ షిన్ అన్న అంశం ఊహాజనితమూ, ఒక వ్యక్తి యొక్క భావనాప్రపంచానికి చెందిన విషయం. మేము సాధన చేస్తున్న గోంగ్‌కీ దీనికీ ఏ విధమైన సంబంధమూ లేదు.” అని కొందరు అనుకోవచ్చు. అది ఒకటే విషయం ఎందుకు కాదు? యావత్ చరిత్ర గమనంలో, తత్వశాస్త్ర ప్రపంచంలో, పదార్థమూ, మనసూ వీటిలో ఏది ముందు, ఏది తరువాత అన్న అంశం గురించిన నిరంతర చర్చలూ, వాదనలూ జరిగాయి. నిజానికి, పదార్థమూ, మనసూ రెండూ ఒక్కటే అని నేను అంటున్నాను. మానవ దేహం గురించిన వైజ్ఞానిక పరిశోధనలలో, నేటి శాస్త్రజ్ఞులు, మానవ మస్తిష్కంలో జనించిన ఒక ఆలోచనను, ఒక పదార్థంగా పరిగణిస్తారు. ఆలోచన అన్నది పదార్థమైతే మానవుని మనసు కూడా పదార్థమే కదా? అవి రెండూ ఒకటే కదా? విశ్వం గురించి నేను వర్ణించినట్లు, కేవలం భౌతికమైన ఉనికి మాత్రమే కాక , దానికి

తనదైన ఒక లక్షణం కూడా ఉంటుంది. విశ్వంలో, సత్యం-దయ-సహనం అన్న ఈ లక్షణం యొక్క ఉనికిని ఒక సామాన్య మానవుడు కనిపెట్టలేడు, సామాన్య మానవులందరూ ఒకటే స్థాయిలో ఉన్నారు. మీరు సామాన్య మానవుల స్థాయి నించి పైకి ఎదిగిన తరవాత, దానిని గుర్తించగలుగుతారు. మీరు దానిని ఎలా కనిపెట్టగలరు? విశ్వమంతటా వ్యాపించి ఉన్న పదార్థాలతో సహా, విశ్వంలోని ద్రవ్యమూ (Mass), ఆలోచనాశక్తి కలిగిన జీవులు, అన్నీ, విశ్వంలో విభిన్న స్థాయిలలోని ఫా కు చెందిన రూపాలు. అవి మిమ్మల్ని పైకి ఎదగ నివ్వవు. మీరు ఎదగాలి అనుకున్నా, ఎదగలేరు. అవి మిమ్మల్ని పైకి ఎదగ నివ్వవు. అవి ఎందుకు ఎదగనివ్వవు? ఎందుకంటే, మీ షిన్ షిన్ అభివృద్ధి చెందలేదు. ప్రతి స్థాయికీ వేరు వేరు ప్రమాణాలున్నాయి. మీరు ఒక ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే, ఆ స్థాయికి అవసరమైన ప్రమాణాలను జీర్ణింప జేసుకోవడానికై, మీరు మీలోని చెడు తలపులు వదిలేసి, రోత కలిగించే విషయాలను నిర్మూలించుకోవాలి. అలా చెయ్యడం వల్ల మాత్రమే మీరు పైకి ఎదగగలుగుతారు.

ఒకసారి మీరు మీ షిన్ షిన్ స్థాయిని పెంచుకున్నప్పుడు, మీ శరీరం ఒక గొప్ప మార్పుకు లోనవుతుంది. షిన్ షిన్ స్థాయి పెరిగినప్పుడు, మీ శరీరంలోని పదార్థం మారడం తథ్యం. ఏ రకమైన మార్పులు జరుగుతాయి? మీరు బంధం పెట్టుకొని ఉన్న చెడ్డ విషయాలను వదిలివేస్తారు. ఉదాహరణకు, ఒక సీసా నిండుగా మురికి వస్తువులని నింపి, గట్టిగా మూత పెట్టి, నీళ్ళలోకి విసిరితే, అది అట్టడుగుకు మునిగిపోతుంది. దానిలోని మురికిని కొద్దిగా పారబోయండి. ఖాళీ అవుతున్న కొద్దీ, అది పైపైకి తేలుతూ ఉంటుంది. మొత్తం ఖాళీ అయినప్పుడు, అది పూర్తిగా నీటి ఉపరితలానికి తేలిపోతుంది. మీ ఆధ్యాత్మిక సాధనాక్రమంలో, మీరు పైకి ఎదగడం కోసం, మీ శరీరంలో ఉన్న రకరకాల చెడ్డ విషయాలను శుభ్రం చేసెయ్యాలి. విశ్వం యొక్క ఈ లక్షణం సరిగ్గా ఇటువంటి పాత్రనే పోషిస్తుంది. మీరు షిన్ షిన్ సాధన చేయక పోయినా, మీ నైతిక ప్రమాణాలను పెంపొందించుకోకపోయినా, మీలోని చెడు తలపులూ, చెడ్డ పదార్థాలు తొలగించుకోకపోయినా, అది మిమ్మల్ని ఎదగనివ్వదు. అవన్నీ ఒకటే కాదని మీరు ఎలా అనగలరు? మీకు ఒక సరదా

కలిగించే విషయం చెప్తాను, సామాన్య మానవులకు సహజంగా ఉండే అనురాగాలూ, కోరికలూ కలిగి ఉన్న ఒక వ్యక్తి, పై స్థాయులకు ఎదిగి, బుద్ధుడు అయ్యేందుకు వీలయిం దనుకోండి – ఆలోచించండి – ఇది సంభవమా? ఒక అందమైన బోధిసత్వ (29)ను చూసినప్పుడు అతడిలో ఒక దుష్ట భావన కలగొచ్చు. తనలోని అసూయను నిర్మూలించని కారణంగా, ఆ వ్యక్తి ఒక బుద్ధునితో ఘర్షణ పడొచ్చు. అటువంటి విషయాలు జరిగేందుకు అనుమతి ఎలా ఉంటుంది? ఈ విషయంలో ఏం చెయ్యాలి? సామాన్య మానవులలో ఉండే అన్ని చెడు తలపులనూ మీరు తొలగించుకోవాలి – అప్పుడే మీరు పైకి ఎదగగలుగుతారు.

మరొక విధంగా చెప్పాలంటే, మీరు షిన్ షిన్ సాధనపై దృష్టిని కేంద్రీకరించి, సత్యం–దయ–సహనం అన్న విశ్వ లక్షణాన్ని అనుసరించి ఆధ్యాత్మిక సాధన చెయ్యాలి. సామాన్య మానవులలో ఉండే వాంఛలూ, అనైతిక భావనలూ, తప్పు పనులు చేయాలన్న ఉద్దేశాలూ పూర్తిగా వదులు కోవాలి. మీ మనఃస్థితిలో చిన్న ఎదుగుదల కలిగినప్పుడల్లా, మీ శరీరంనించి కొన్ని చెడుపదార్థాలు నిర్మూలింపబడుతుంటాయి. అదే సమయంలో, మీ కర్మను తగ్గించుకోవడానికి, మీరు కొంత బాధను అనుభవించి, కొన్ని కష్టాలను సహించాలి. అప్పుడు మీరు కొంచెం పైకి ఎదగగలుగుతారు, అంటే, విశ్వ లక్షణం మిమ్మల్ని ఎక్కువగా నిర్బంధించదు. ఆధ్యాత్మిక సాధన అన్నది ఒక వ్యక్తి యొక్క స్వంత ప్రయత్నాల మీద ఆధారపడి ఉండగా, గోంగ్‌లోని పరివర్తన ఆ వ్యక్తి యొక్క గురువు చేత చేయబడుతుంది. గురువు మీకు గోంగ్‌ని అభివృద్ధి చేసుకునే వ్యవస్థను ఇస్తారు; అది తన పనిని నిర్వహిస్తుంది. మీ శరీరానికి వెలుపల ఉన్న పుణ్యమనే పదార్థాన్ని, గోంగ్‌గా మార్చగలుగుతుంది. మిమ్మల్ని మీరు నిరంతరమూ ఉన్నతీకరించుకొని ఆధ్యాత్మిక సాధనలో పైకి ఎదిగినకొద్దీ, మీ గోంగ్ స్తంభం (గోంగ్ జు) కూడా ఉన్నత స్థాయులకు పురోగతి సాధించడం కొనసాగిస్తూనే ఉంటుంది. ఒక సాధకుడిగా, మీరు మీ చుట్టూ ఉండే సామాన్య వ్యక్తుల వాతావరణంలో, సాధనతో మీలోని తీక్షణతను తగ్గించుకుంటూ, క్రమంగా బంధాలనూ, వివిధ వాంఛలనూ, త్యజించాలి. సాధారణంగా ఉన్నత స్థాయుల దృక్పథం నించి చూసినప్పుడు, మన మానవ

జాతి చేత మంచిదని పరిగణించబడే విషయం చాలాసార్లు చెడుగా ఉంటుంది. ఆ విధంగా చూసినప్పుడు, ఒక మనిషి ఎక్కువ స్వప్రయోజనాలను సఫలీకృతం చేసుకొని, తద్వారా మెరుగైన జీవితాన్ని గడపడం అన్నది, సామాన్య మానవుల దృష్టిలో ఒక మంచి విషయంగా పరిగణింపబడుతూ ఉంటుంది. మహాజ్ఞానుల దృక్పథంలో, ఆ వ్యక్తి చెడిపోయినట్లు లెక్క. ఇందులో అంతటి చెడు ఏముంది? ఒక వ్యక్తి ఎంతగా లాభపడితే, ఇతరుల హక్కును అంతగా భంగపరచినట్లు అవుతుంది. ఒక వ్యక్తికి తాను పొందే అర్హత లేనివి లభిస్తాయి. ఆ వ్యక్తి కీర్తి, లాభం అన్న వాటికి బంధితుడై, పుణ్యాన్ని పోగొట్టుకుంటాడు. షిన్ షిన్ సాధన మీద శ్రద్ధ వహించకుండా, మీ గోంగ్‌ని పెంచుకోవాలని మీరు కోరుకుంటే, మీ గోంగ్ ఏమాత్రమూ పెరగదు.

ఒక వ్యక్తి యొక్క అసలైన ఆత్మ నశించదని, సాధకుల సమాజం నమ్ముతుంది. మనుషుల యొక్క అసలైన ఆత్మ గురించి చర్చించడాన్ని, మూఢనమ్మకంగా గతంలో ప్రజలు చెప్పి ఉండవచ్చు. భౌతికశాస్త్రం, మానవ దేహం గురించి చేసిన పరిశోధనలలో, అందులో పరమాణువుల సమూహాలు, ప్రోటాన్లు, ఎలెక్ట్రాన్లు, ఇంకా సూక్ష్మంగా పరికిస్తే క్వార్క్‌లు, న్యూట్రినోలు ఉన్నట్లు కనుగొన్నది. ఆ పైన సూక్ష్మదర్శిని వాటిని కనిపెట్టలేకపోయింది. అప్పటికీ, అవి జీవం యొక్క మూలానికి, పదార్థం యొక్క మూలానికి అందనంత దూరంలో ఉన్నాయి. అణువిచ్ఛేదనం కోసమైనా లేదా అణువులు కరిగి కలవడానికైనా, అత్యంతమైన శక్తి ఘర్షణ, అత్యంతమైన ఉష్ణమూ అవసరమని అందరికీ తెలుసు. ఒక మనిషి మరణంతో, అతడి శరీరంలోని అణుకేంద్రకాలు అంత సులభంగా ఎలా నశించిపోతాయి? అందువల్ల, ఒక మనిషి మరణించినప్పుడు కేవలం మన ఈ పరిమాణంలోని అతిపెద్ద పరమాణు సమూహాల మూలకాలు రాలిపోగా, ఇతర పరిమాణాలలోని శరీరాలు శిథిలం కావు. ప్రతి ఒక్కరూ ఇది ఆలోచించండి: ఒక మానవ దేహం, సూక్ష్మదర్శిని క్రింద ఎలా కనిపిస్తుంది? ఆ మానవ దేహం మొత్తం కదులుతూ ఉంటుంది. మీరు స్థిరంగా కూర్చుని ఉన్నప్పటికీ, మొత్తం శరీరం కదులుతూ ఉంటుంది. కణములలోని పరమాణు సమూహాలు కదులుతూ ఉండి, మొత్తం శరీరం ఇసుకతో తయారైనట్లు వదులుగా ఉంటుంది. మానవ

దేహాన్ని ఒక సూక్ష్మదర్శిని క్రింద చూసినప్పుడు అచ్చం ఇలాగే ఉండి, మన భౌతిక నేత్రాలతో చూసిన దానికి అతిభిన్నంగా ఉంటుంది. ఇలా ఎందుకంటే, మానవ నేత్రద్వయం, ఒక అసత్యభావాన్ని కలిగించి, మీరు వాటిని చూడ కుండా అడ్డుపడుతుంది. ఒక వ్యక్తిలోని దివ్యనేత్రం (30) తెరుచుకున్నప్పుడు, ఆ పదార్థాలను పెద్దవిగా చెయ్యడం ద్వారా చూడగలుగుతుంది; నిజానికి, అది మనుషులకు స్వతఃసిద్ధమైన శక్తి, దాన్ని ఇప్పుడు అతీంద్రియ శక్తి అంటున్నాము. మీ అతీంద్రియ శక్తులు వెలికి రావాలని మీరు కోరుకుంటే, మీ స్వస్వరూపానికి చేరుకోవడానికి, తిరిగి ఆధ్యాత్మిక సాధన చెయ్యాలి.

పుణ్యమును గురించి చెప్పుకుందాం. దానికి ఎటువంటి విశేష సంబంధ ముంది? దాన్ని వివరంగా విశ్లేషించుకుందాం. మానవులుగా మనకు అనేక పరిమాణాలలోని ప్రతి ఒక్కదానిలో, ఒక శరీరముంటుంది. ఇప్పుడు మనం మానవ దేహాన్ని పరీక్షిస్తే, అందులో ఉన్న అతిపెద్ద మూలపదార్థాలు జీవకణాలు, అవి కలిసి మానవ దేహం తయారవుతుంది. మీరు గనక, జీవకణాలకూ, పరమాణు సమూహాలకు నడుమనున్న ప్రదేశం లేదా పరమాణు సమూహాల నడుమనున్న ప్రదేశంలోకి ప్రవేశించగలిగితే, ఇంకొక పరిమాణంలో ఉన్నట్లుగా అనుభూతి పొందుతారు. ఆ శరీరపు ఆకృతి దేనిని పోలిఉంటుంది? నిజం చెప్పాలంటే, ఈ పరిమాణంలో ఉన్న భావనలను ఉపయోగించి, మీరు దానిని అర్థం చేసుకోలేరు, మీ శరీరం ఆ పరిమాణానికి అవసరమైన రూపంలో ఉండాలి. మొదట్లో, ఇతర పరిమాణంలోని ఆ శరీరం, పెద్దగా లేదా చిన్నగా కాగలదు. ఆ సమయంలో ఆ పరిమాణం అంతులేనిదని కూడా తెలుసుకుంటారు. ఇది, ఒకే ప్రదేశంలో ఒకే కాలంలో ఉండే ఇతర పరిమాణాల యొక్క సాధారణ రూపాన్ని సూచిస్తుంది. ప్రతివారికీ, ఇతర అనేక పరిమాణాలలోని ప్రతిదానిలో, ఒక ప్రత్యేకమైన శరీరం ఉంటుంది. ఒక విశేషమైన పరిమాణంలో, మానవ శరీరాన్ని ఆవరించుకున్న ఒక క్షేత్రం ఉంటుంది. అది ఏ విధమైన క్షేత్రం? ఇదే మేము చెప్పినట్టి పుణ్యం అన్న క్షేత్రం. గతంలో మనం నమ్ముతూ వచ్చిన విధంగా పుణ్యం అన్నది, ఆధ్యాత్మికమూ, కల్పితమూ కాక, పూర్తిగా, భౌతికమైన ఉనికిని కలిగిన ఒక తెల్లని పదార్థం. ఆ విధంగా, గత కాలంలో పెద్దవాళ్ళు, పుణ్యాన్ని సంపాదించు

కోవడమూ, పోగొట్టుకోవడం గురించి, చాలా అర్థవంతంగా చెప్పేవారు. ఈ పుణ్యం, ఒక వ్యక్తిని ఆవరించుకొనియున్న ఒక క్షేత్రంగా ఏర్పడుతుంది. గతంలో తావో సిద్ధాంతంలో, ఒక శిష్యుడు గురువును ఎన్నుకునే బదులు, ఒక గురువే తన శిష్యుని ఎన్నుకుంటాడని చెప్పబడేది. దాని అర్థం ఏమిటి? ఆ గురువు, ఆ శిష్యుని శరీరంలో ఎక్కువ పుణ్యం నిండి ఉన్నదా? అని పరీక్ష చేసేవారు. ఆ శిష్యుని శరీరంలో అధిక పుణ్యం ఉంటే, అతడికి ఆధ్యాత్మిక సాధన చెయ్యడం సులభంగా ఉంటుంది. లేకపోతే, అతడు దానిని సులభంగా చెయ్యలేడు, పైగా గోంగ్‌ను ఉన్నత స్థాయిలకు పెంపొందించుకోవడానికి, చాలా శ్రమపడవలసి ఉంటుంది.

అదే సమయంలో, మనం "కర్మ" అని, బౌద్ధులు "పాపకర్మ" అని చెప్పుకునే ఒక నల్లని పదార్థం కూడా ఉంటుంది. ఈ నల్లని, తెల్లని పదార్థాలు ఒకే సమయంలో ఉంటాయి. ఈ రెండు పదార్థాల మధ్య ఎటువంటి సంబంధం ఉంటుంది? మనం బాధలను భరించడం, అవాంతరాలను ఓర్పుతో సహించడం, మంచి పనులు చెయ్యడం; వీటివల్ల పుణ్యాన్ని పొందుతాం. చెడ్డ పనులు, తప్పు పనులు, ఇతరులతో తగవులు పెట్టుకోవడం వంటి పనులవల్ల నల్లని పదార్థం సంక్రమిస్తుంది. ఈ రోజుల్లో కొందరు కేవలం స్వలాభాలకు ఆశపడడమేకాక, అన్ని రకాల పాపాలకు పాల్పడు తున్నారు. డబ్బు కోసం హత్యలు చెయ్యడం, ఎవరినైనా చంపేందుకు డబ్బు ఇవ్వడం, స్వలింగ సంపర్కం, మాదకద్రవ్యాలు సేవించడం వంటి అన్ని రకాల పాపపు పనులు చేస్తారు. వాళ్ళు అన్ని రకాల పనులు చేస్తారు. ఒక వ్యక్తి తప్పు పని చేసినప్పుడు, పుణ్యాన్ని పోగొట్టుకుంటాడు. అతడు పుణ్యాన్ని ఏ విధంగా పోగొట్టుకుంటాడు? ఒక వ్యక్తి మరొక వ్యక్తిని దూషించినప్పుడు, తనది పైచెయ్యి అయిందని సంతోషిస్తాడు. ఈ విశ్వంలో, "నష్టపోనిదే లాభం లేదు", అన్న నియమం ఒకటుంది. ఒక వ్యక్తి లాభం పొందాలంటే, నష్టాన్ని భరించాలి. మీకు వదులుకోవాలని లేకపోతే, బలవంతంగా కోల్పోవలసి వస్తుంది. అటువంటి పనిని ఎవరు చేస్తారు? ఖచ్చితంగా, విశ్వ లక్షణం ఈ పాత్రను వహిస్తుంది. కాబట్టి, మీరు ఎల్లప్పుడూ లాభమే పొందాలి అని కోరుకుంటే, అది అసంభవం. అప్పుడేం జరుగుతుంది? ఒక వ్యక్తి, మరొకరిని

దూషించినా, తగవులాడినా, తన పుణ్యాన్ని మరొకరివైపుకు విసురుతున్నాడు. తనకు అన్యాయం జరిగిందని, తానేదో కోల్పోయి, బాధపడ్డానని భావించే ఎదుటి వ్యక్తికి, తగిన పరిహారం లభిస్తుంది. ఒక వ్యక్తి ఇక్కడ ఎదుటి వ్యక్తిని దూషిస్తున్నప్పుడు, ఆ తిట్లతో పాటు, ఒక పుణ్యపు తునక కూడా, అతని యొక్క పరిమాణ క్షేత్రాన్ని విడిచి, ఎదుటి వ్యక్తిని చేరుకుంటుంది. అతడు ఎంత ఎక్కువగా దూషిస్తే, అంత పుణ్యాన్ని ఇచ్చుకుంటాడు. ఇతరులను కొట్టినా, తగవు లాడినా కూడా ఇదే జరుగుతుంది. ఒక వ్యక్తి మరొకరిని కొట్టినా, తన్నినా, అవతలి వ్యక్తిని ఎంత ఎక్కువగా కొడితే, అంతకు అంతా పుణ్యాన్ని అతడికి ఇచ్చుకుంటాడు. ఒక సామాన్య వ్యక్తి ఈ లక్షణాన్ని ఈ స్థాయిలో చూడలేడు. పరాభవం కలిగినట్లు భావించి, దానిని తట్టుకోలేక అతడు "నువ్వు నన్ను కొట్టావు గనక నేను కూడా తిప్పి కొడతా" అనుకుంటే, అదే రకంగా అతడిని కొట్టి, ఆ పుణ్యాన్ని వెనకకు ఇచ్చేస్తాడు. ఇద్దరికీ లాభం లేదా నష్టం కలగలేదు. ఒకవేళ, "నువ్వు నన్ను ఒక దెబ్బ కొట్టావు, కాబట్టి నేను నిన్ను రెండు దెబ్బలు కొట్టాలి, లేకపోతే నా పగ తీరదు" అనుకొని, రెండో దెబ్బ కొడితే, అతడి పుణ్యంలోనించి మరియొక తునక మొదటి వ్యక్తికి వెళ్ళిపోతుంది.

ఈ పుణ్యం అన్న దానికి అంతటి విలువ ఎందుకు ఇస్తారు? పుణ్యం పరివర్తన చెందడంలో ఎటువంటి సంబంధం ఉంది? "పుణ్యం సంపాదించు కున్న వ్యక్తి, ఈ జన్మలో కాకపోయినా మరుజన్మలోనైనా ఫలితం పొందుతాడు" అని మతాలు చెబుతున్నాయి. అతడు పొందే లాభం ఏమిటి? అధిక పుణ్యం సంపాదించుకున్న వ్యక్తి, మరుజన్మలో, ఉన్నతోద్యోగి కావచ్చు, లేదా గొప్ప సంపన్నుడు కావచ్చు. ఒక వ్యక్తి తాను కోరుకున్నది ఏదైనా పొందవచ్చు, అటువంటి పుణ్యానికి మారుగా దానిని పొందుతాడు. ఒక వ్యక్తి అసలు పుణ్య సముపార్జన చేయనట్లైతే, అతడి శరీరమూ, ఆత్మ రెండూ అంతరించిపోతాయని కూడా మతాలు చెప్తాయి. ఆ వ్యక్తి ప్రధాన ఆత్మ నాశనం అవుతుంది, ప్రాణం పోయిన తరవాత, ఇక ఏమీ మిగలకుండా, ఆ వ్యక్తి మరణిస్తాడు. అయితే, మన సాధకుల సమాజంలో, పుణ్యం నేరుగా గోంగ్‌గా మారుతుందని విశ్వసిస్తాము.

పుణ్యం గోంగ్‌గా ఎలా మారుతుందో మేము వివరిస్తాం: సాధకుల సమాజంలో "ఆధ్యాత్మిక సాధన అన్నది ఒక వ్యక్తి యొక్క స్వంత ప్రయత్నాల మీద ఆధారపడి ఉండగా, గోంగ్ పరివర్తనను మాత్రం అతడి గురువు చేస్తారు" అన్న నానుడి ఉంది. అయితే , కొందరు "ఒక మూసను, కొలిమి మీద పెట్టి, ఔషధ మొక్కలను సేకరించి అందులో వేసి, మనోక్రియల ద్వారా దాన్ (31)ని తయారుచెయ్యడం" (32) గురించి చెప్తారు, వాళ్ళు వీటన్నిటినీ అతిముఖ్యం అయినవిగా భావిస్తారు. ఇవి ఏ మాత్రమూ ప్రాముఖ్యత లేనివని, వాటి గురించి మీరు ఎక్కువగా ఆలోచిస్తే అది ఒక బంధం అవుతుందని నేను చెప్తున్నాను. దాని గురించి అతిగా ఆలోచిస్తే, మీరు ఒక ప్రాకులాటకు బంధింపబడి ఉన్నట్లు కాదా? ఆధ్యాత్మిక సాధన అన్నది ఒక వ్యక్తి స్వంత ప్రయత్నం మీద ఆధారపడి ఉండగా, గోంగ్ పరివర్తన మాత్రం అతడి గురువు చేత చెయ్యబడుతుంది. మీలో ఈ కోరిక ఉంటే చాలు. వాస్తవానికి ఆ పని మీ గురువు చేస్తారు, ఎందుకంటే, ఇది చెయ్యడం మీకు అలవిగాని పని. ఒక సామాన్య వ్యక్తి వంటి శరీరం కలిగి ఉన్న మీరు, దాన్ని అత్యంత శక్తి పదార్థంతో తయారైన ఉత్తమ ప్రాణంగల శరీరంగా ఎలా పరివర్తన చెయ్యగలరు? అది పూర్తిగా అసాధ్యమూ, హాస్యాస్పదమూ అయిన సంగతి. ఇతర పరిమాణాలలో జరిగే మానవ దేహ పరివర్తన ప్రక్రియ, చాలా చిక్కులతో ముడిపడి, సంక్లిష్టంగా ఉంటుంది. అటువంటి పనులను మీరు ఎంత మాత్రమూ చెయ్యలేరు.

గురువు మీకు ఏమిస్తారు? ఆయన, మీ గోంగ్‌ను పెంపొందించే గోంగ్ వ్యవస్థను ఇస్తారు. పుణ్యం అన్నది ఒక వ్యక్తి శరీరం బయట ఉండడం వల్ల, అతడి నిజమైన గోంగ్, పుణ్యంనించి జనిస్తుంది. ఒక వ్యక్తి యొక్క స్థాయి ఔన్నత్యమూ, అతడి గోంగ్ యొక్క బలమూ, రెండూ కూడా పుణ్యం నించే తయారవుతాయి. గురువు మీ పుణ్యమును, సర్పిలాకారంలో పైకి పెరిగే గోంగ్‌గా పరివర్తన చెందేలా చేస్తారు. ఒక వ్యక్తి స్థాయిని నిజంగా నిర్ధారించే గోంగ్, అతడి శరీరం వెలుపల పెరుగుతుంది, అది సర్పిలాకారంలో పెరుగుతుంది, చివరకు అది అతడి తలను దాటి పైకి పెరిగిన తరవాత, క్రమంగా గోంగ్ స్తంభంవలె (గోంగ్ కాలమ్) తయారవుతుంది. అతడి గోంగ్ స్తంభపు

ఎత్తును ఒక్కసారి చూడగానే ఎవరైనా, అతడి గోంగ్ స్థాయిని తెలుసుకో గలుగుతారు. అదే ఒక వ్యక్తి యొక్క స్థాయి, బౌద్ధమతంలో చెప్పబడిన ప్రకారం అతడి ఫల స్థితి. ధ్యానంలో కూచున్న సమయంలో, కొందరు వ్యక్తుల యొక్క అసలైన ఆత్మ, వారి శరీరాలను విడిచి, ఒక నిర్దిష్టమైన స్థాయిని చేరుకోగలదు. ఎంత ప్రయత్నించినా, అతడి అసలైన ఆత్మ, అంతకన్నా పైకి ఎదగలేదు, అందుకు సాహసించదు కూడా. అది అతడి గోంగ్ స్తంభం పైన కూచోవడంవల్ల పైకి కదులుతుంది గనక, అది ఆ స్థాయికే చేరగలుగుతుంది. అతడి గోంగ్ స్తంభం అంత ఎత్తులోనే ఉండడంవల్ల, అది అంతకన్నా పైకి కదలలేదు. బౌద్ధమతంలో చెప్పబడిన ఫల స్థితి అన్న అంశం ఇదే.

షిన్ షిన్ స్థాయిని నిర్ణయించే ఒక కొలబద్ద కూడా ఉంది. ఆ కొలబద్ద, గోంగ్ స్తంభమూ, ఒకే సమయంలో ఉంటాయి, కానీ, ఒకే పరిమాణంలో ఉండవు. మీ షిన్ షిన్ యొక్క సాధన అప్పటికే పురోగతి సాధించి ఉంటే, ఉదాహరణకు, సామాన్య వ్యక్తుల నడుమ మిమ్మల్ని ఎవరైనా దూషించినప్పుడు, మీరు మారు పలకక, శాంతంగా ఉంటారు; లేక, ఎవరయినా మిమ్మల్ని పిడికిలితో కొట్టినా, మీరు ఒక్క మాటైనా అనకుండా, చిరునవ్వుతో దానిని ఉపేక్షిస్తారు. ఇప్పటికే మీ షిన్ షిన్ చాలా ఉన్నతంగా ఉంది. కాబట్టి, ఒక సాధకునిగా మీకు ఏం లభించాలి? మీకు గోంగ్ లభించదా? మీ షిన్ షిన్ ఉన్నతీకరించబడినప్పుడు, మీ గోంగ్ పెరుగుతుంది. ఒక వ్యక్తి షిన్ షిన్ స్థాయి ఎంత ఎత్తులో ఉంటుందో, అతడి గోంగ్ స్థాయి కూడా, అంత ఎత్తులో ఉంటుంది, ఇది ఒక సంపూర్ణ సత్యం. గతంలో, ప్రజలు ఆరుబయట తోటల్లో, లేదా ఇంట్లో చీ గోంగ్ సాధనను ఎక్కడ చేసినా, శ్రమపడి, శ్రద్ధతో, చక్కగా చేసేవారు. ఆ తర్వాత, బయట ప్రపంచంలో అడుగుపెట్టగానే, వాళ్ళ ప్రవర్తన చాలా మారిపోయి, తమ దారిన తాము ఎప్పటిలాగే, సామాన్య మానవుల నడుమ కీర్తి, స్వలాభాల కోసం ఇతరులతో పోటీపడి, తగవులు పడేవారు. వాళ్ళు తమ గోంగ్ శక్తిని ఏ విధంగా పెంచుకోగలుగుతారు? అది ఏ మాత్రమూ పెరగలేదు, ఆ కారణంగానే, వారి వ్యాధులూ నిర్మూలింపబడలేదు. చాలాకాలం సాధన చేసి కూడా కొందరు తమ వ్యాధులనించి స్వస్థత ఎందుకు పొందలేరు? చీ గోంగ్ అన్నది ఒక ఆధ్యాత్మిక సాధన, మానవాతీతమైనది,

అది సామాన్య మానవులు చేసే శారీరక వ్యాయామాలకు వ్యతిరేకమైనది. ఒక వ్యక్తి తన వ్యాధి నిర్మూలనకు, గోంగ్‌ను పెంచుకోవడానికీ, షిన్ షిన్‌ని సాధన చెయ్యడం మీద దృష్టిని కేంద్రీకరించాలి.

ఒక మూసను కొలిమి మీద పెట్టి, అందులో, సేకరించి పెట్టుకున్న ఔషధ మొక్కలు వేసి, దాన్‌ను తయారుచెయ్యవచ్చని కొందరు నమ్ముతారు, ఆ దాన్‌నే, గోంగ్ అనుకుంటారు. అది కాదు. ఈ దాన్ కొద్దిపాటి శక్తిని సమకూర్చుకోగలదే గానీ, అన్ని రకాలైన శక్తిని కలిగి ఉండదు. దాన్ ఏ రకమైన పదార్థం? దీర్ఘాయుష్షును సాధించడానికి మార్గాలున్నాయని, మన శరీరాలు అతీంద్రియ శక్తులను, మరి కొన్ని సామర్థ్యాలను కూడా అభివృద్ధి చేసుకోగలవని, అందరికీ తెలిసిన విషయమే; వాటిలో చాలాభాగం బంధింపబడి ఉండి, ఉపయోగించడానికి అనుమతి ఉండదు. ఎన్నో అతీంద్రియ శక్తులు – దాదాపు పదివేలు ఉన్నాయి. ఒక అతీంద్రియ శక్తి అభివృద్ధి చెందిన వెంటనే, అది బంధింపబడుతుంది. వాటిని చూపించడానికి అనుమతి ఎందుకు లేదు? మీరు వాటిని అలక్ష్యంగా, సామాన్య మానవుల సంఘంలో పనులు చెయ్యడానికి, ఉపయోగించకూడదనే దాని వెనక ఉన్న ఉద్దేశం. మీరు అలక్ష్యంగా, సామాన్య మానవ సంఘంలో కలత రేపడం లేదా అలక్ష్యంగా మీ అతీంద్రియ శక్తులను ప్రదర్శించడం అనుమతింపబడదు. ఎందుకంటే, అలా చెయ్యడం వల్ల, సామాన్య మానవ సంఘం ఉన్న స్థితికి భంగం కలుగుతుంది. చాలామంది జ్ఞానోదయం పొందుతూ ఆధ్యాత్మిక సాధనామార్గంలో వెళ్తున్నారు. మీరు మీ అతీంద్రియ శక్తులన్నిటినీ వారికి ప్రదర్శిస్తే, అదంతా నిజమని గ్రహించి, వారు ఆధ్యాత్మిక సాధన చెయ్యడానికి ముందుకు వస్తారు. క్షమించరాని పాపాలు చేసినవారు కూడా ఆధ్యాత్మిక సాధన చెయ్యడానికి పూనుకుంటారు, అది జరగకూడదు. మీరు ఇలా ప్రదర్శించడానికి వీలు లేదు. పైగా, విధిలిఖితమైన సంబంధమూ, వస్తువుల యొక్క నిజస్వభావమూ ఏమిటో చూడగలిగే శక్తి మీకు లేనందువల్ల, మీరు పొరపాటు పనిచేసే అవకాశం కూడా ఉంది. మీరు ఒక మంచి పని చేస్తున్నాను అనుకుంటారు, కానీ అది చెడ్డ పని కావచ్చు. ఆ కారణంగా, మీరు వాటిని ఉపయోగించడం కుదరదు, ఎందుకంటే, మీరు ఒక తప్పు చేస్తే, మీ స్థాయి

తగ్గిపోయి, మీ ఆధ్యాత్మిక సాధన వృథా అవుతుంది. దాని ఫలితంగా, అనేక అతీంద్రియ శక్తులు బంధింపబడతాయి. ఏం జరుగుతుంది? ఒక వ్యక్తి గోంగ్ బంధనాలను విప్పుకునే స్థితికి చేరుకొని జ్ఞానోదయం పొందినప్పుడు, ఈ దాన్ అన్నది ఒక విస్ఫోటక పదార్థంలాగ పేలిపోయి, అన్ని అతీంద్రియ శక్తులను, శరీరంలోని అన్ని బంధనాలను, వందలకొద్దీ నాడులను తెరిపిస్తుంది. ఒక పెద్ద ధ్వనితో, కుదుపుతో అన్నీ తెరుచుకుంటాయి. దాన్ అన్నది ఈ రకంగా పనికొస్తుంది. ఒక సన్యాసి మరణానంతరం, దహనం చేయగా, అతడి శరీర మిగులుతుంది. కొందరు దానిని, ఎముకలు, పళ్ళు అని వాదిస్తారు. సామాన్య మానవులకు శరీర లేకపోవడం ఏమిటి? అవి కేవలం, విస్ఫోటనం చెందిన దాన్, వాటి శక్తి విడుదల అయింది. అవి ఇతర పరిమాణాలలోని అనేక పదార్థాలను కలిగి ఉంటాయి. అవి భౌతికమైన ఉనికి కలిగినవే, అయినప్పటికీ వాటివల్ల అంతగా ఉపయోగం ఉండదు. ప్రజలు, ఇప్పుడు వాటిని అతి విలువైనవిగా తలుస్తున్నారు. వాటిలో శక్తి ఉంది, అవి మెరుస్తున్నాయి, గట్టిగా ఉన్నాయి. అంతకు మించి వాటిలో ఏమీ లేదు.

గోంగ్ అభివృద్ధి చెందకపోవడానికి మరొక కారణం కూడా ఉంది. అదేమిటంటే, ఒక వ్యక్తి, ఉన్నత స్థాయులలోని ఫా ను తెలుసుకోకుండా ఆధ్యాత్మిక సాధనలో పైకి ఎదగలేడు. దానికి అర్థం ఏమిటి? నేను ఇప్పుడే చెప్పినట్లు, కొంతమంది ఎన్నో చీ గోంగ్ వ్యాయామాలు అభ్యసించి ఉంటారు. మీరు ఇంకా ఎన్ని నేర్చుకున్నా అది నిష్ప్రయోజనమే అని నేను మీకు చెప్తున్నాను. మీరు కేవలం ఒక ప్రాథమిక పాఠశాల విద్యార్థిగానే – ఆధ్యాత్మిక సాధనలో ఒక ప్రాథమిక పాఠశాల విద్యార్థిగానే మిగిలిపోతారు. అవన్నీ క్రింది స్థాయిలోని నియమాలు. అటువంటి క్రింది స్థాయి నియమాలు మీకు ఉన్నత స్థాయులకు చేరే ఆధ్యాత్మిక సాధనలో మార్గనిర్దేశం చేసే పాత్రను నిర్వహించలేవు. మీరు కళాశాలలో కూర్చొని ప్రాథమిక స్థాయి పాఠ్య పుస్తకాలు చదివినా, మీరు ప్రాథమిక పాఠశాల విద్యార్థిగానే మిగిలిపోతారు. మీరు ఎన్ని చదివినా, అది నిష్ప్రయోజనమే. పైగా, మీరు పతనమైపోతారు. భిన్న స్థాయులలో భిన్నమైన ఫా ఉంటుంది, ఆ ఫా భిన్న స్థాయులలో భిన్నమైన పాత్ర వహించి, మార్గనిర్దేశం చేస్తుంది. ఆ విధంగా, క్రింది స్థాయి

నియమాలు, మిమ్మల్ని ఉన్నత స్థాయిలకు చేర్చే ఆధ్యాత్మిక సాధనలో మార్గదర్శకత్వం వహించలేవు. మేము తరవాత చెప్పబోయేవన్నీ ఉన్నత స్థాయిలలో ఆధ్యాత్మిక సాధనకు ఉపకరించే నియమాలు. నేను నా బోధనలో, భిన్న స్థాయిలకు చెందిన విషయాలను చేరుస్తున్నాను. అందుచేత, అవి మీ భావి ఆధ్యాత్మిక సాధనలో ఎల్లప్పుడూ మార్గదర్శకత్వ పాత్రను నిర్వహిస్తాయి. నా దగ్గర చాలా పుస్తకాలు, ఆడియో, వీడియో టేపులు ఉన్నాయి. వాటిని తొలిసారి చూసి, విని మీరు ఎలా స్పందిస్తారో, కొంతకాలం తరవాత చూసి, విన్నప్పుడు కూడా అవి మిమ్మల్ని అదే విధంగా ముందుకు నడిపిస్తున్నాయని మీరు గ్రహిస్తారు. మిమ్మల్ని మీరు నిరంతరం మెరుగు పెట్టుకుంటూనే ఉంటారు, అవి మిమ్మల్ని నిరంతరం ముందుకు నడిపిస్తూనే ఉంటాయి – ఫా అంటే ఇది. గోంగ్‌ను పెంచుకోలేకపోవడానికి పైన చెప్పినవి రెండు కారణాలు. ఒక వ్యక్తి, భిన్న స్థాయులలో ఉన్న ఫా ను తెలుసుకోకుండా, ఆధ్యాత్మిక సాధన చెయ్యలేడు. తన అంతరాత్మను, షిన్ షిన్‌ను సంస్కరించు కోకుండా, ఒక వ్యక్తి గోంగ్‌ను పెంచుకోలేడు. ఇవే ఆ రెండు కారణాలు.

## ఫాలున్ దాఫా యొక్క లక్షణాలు

బుద్ధ సిద్ధాంతానికి చెందిన ఎనభైనాలుగు వేల ఆధ్యాత్మిక సాధనామార్గాలలో మా ఫాలున్ దాఫా ఒకటి. ప్రస్తుత మానవ నాగరికత చరిత్ర అవధిలో అది ఎన్నడూ ప్రజలకు తెలుపబడలేదు. అయితే ఒక ఐతిహాసిక యుగంలో, ఒకప్పుడు మానవాళికి ముక్తిని ప్రసాదించడంలో విస్తారంగా ఉపయోగింప బడేది. అంతిమ ప్రళయ కాలం (33)గా చెప్పబడుతున్న ఈ కాలంలో, నేను మళ్ళీ దీనిని ప్రజలలోకి తెస్తున్నాను. అందువల్ల ఇది అత్యంత అమూల్యమైనది. పుణ్యమును నేరుగా గోంగ్‌గా పరివర్తన చెయ్యడమన్న విషయం గురించి నేను చెప్పాను. నిజానికి గోంగ్ అన్నది కేవలం వ్యాయామాల వల్ల లభించేది కాదు. అది ఆధ్యాత్మిక సాధన ద్వారా సంపాదించబడుతుంది. చాలామంది తమ గోంగ్‌ను పెంచుకోవాలని, కేవలం వ్యాయామాల మీదే ధ్యాస ఉంచి, ఆధ్యాత్మిక సాధన ఎలా చేయాలన్నది పట్టించుకోరు. నిజం చెప్పాలంటే, గోంగ్ అన్నది పూర్తిగా షిన్ షిన్ సాధనతో పొందబడుతుంది. అటువంటప్పుడు,

మేము ఇక్కడ మీకు వ్యాయామాలు కూడా ఎందుకు నేర్పుతాము? ఒక సన్యాసి ఎటువంటి వ్యాయామాలనైనా ఎందువల్ల చెయ్యరు అన్న విషయం గురించి ముందుగా చెప్తాను. అతడు మౌలికంగా, కేవలం ప్రశాంత స్థితిలో కూర్చొని, గ్రంథాలను పఠిస్తూ, షిన్ షిన్‌ను సాధన చేస్తూ ఉంటాడు, అతడి గోంగ్ పెరుగుతూ ఉంటుంది. అతడు తన గోంగ్‌ను పెంచుకుంటాడు, దానివల్ల అతడి స్థాయి పెరుగుతుంది. శాక్యముని, జనులను, తమ దేహాలతో సహా ప్రపంచంలోని సమస్తమును త్యజించమని బోధించారు, అందువల్ల అక్కడ శారీరక వ్యాయామాలు చేసే అవసరం రాలేదు. తావో సిద్ధాంతం అన్ని జీవులకు ముక్తిని ప్రసాదించదు. అది అన్ని రకాల మనస్తత్వాలు, స్థాయుల ప్రజలు, అందులో కొందరు ఎక్కువగాను, కొందరు తక్కువగాను స్వార్థబుద్ధి కలిగి ఉన్న ప్రజలను అంగీకరించదు. అది తన శిష్యులను ఎన్నిక చేసుకుంటుంది. ముగ్గురు శిష్యులు ఎన్నిక చేయబడితే, కేవలం ఒకరికే అసలైన బోధన లభిస్తుంది. అందులో, ఆ శిష్యుడు అతిపుణ్యాత్ముడూ, చాలా మంచివాడూ అయి ఉండి, పక్కదారులు పట్టడని నిశ్చయించుకోవలసిన అవసరం ఉంది. ఆ రకంగా, జీవితాన్ని సంస్కరించు కోవడం కోసమూ, అతీంద్రియ శక్తుల కోసమూ, నైపుణ్యాలను పెంచుకోవడం కోసమూ ఆధ్యాత్మిక సాధన చెయ్యడానికి, కొన్ని సాంకేతిక విషయాలను నేర్పవలసిన అవసరాన్ని నొక్కి చెప్తుంది. దీనికోసం కొన్ని శారీరక వ్యాయామాలు అవసరం.

ఫాలున్ దాఫా మనసూ, శరీరానికి కూడా సంబంధించిన ఒక ఆధ్యాత్మిక సాధన, దానిలో వ్యాయామాలు అవసరం. ఒకవైపు, ఈ వ్యాయామాలు, అతీంద్రియ శక్తులను బలపరచడానికి ఉపయోగపడతాయి. “బలపరచడం” అంటే ఏమిటి? అంటే, మీ శక్తివంతమైన గోంగ్ సామర్థ్యంతో, మీ అతీంద్రియ శక్తులను పునఃశక్తివంతం చెయ్యడంవల్ల వాటిని క్రమంగా బలపరచడం. మరొకవైపు, మీ శరీరంలో చాలా జీవులు అభివృద్ధి చెందవలసిన అవసరం ఉంది. ఉన్నతస్థాయి ఆధ్యాత్మిక సాధనలో, తావో సిద్ధాంతం ప్రకారం, అమృత శిశువు జన్మించడం అవసరం కాగా, బుద్ధ సిద్ధాంతం ప్రకారం, నాశరహిత వజ్రదేహం ఏర్పడడం అవసరం. ఇంకా, అనేక అతీంద్రియ శక్తులు అభివృద్ధి చెందడం అవసరం. ఈ విషయాలన్నీ, వ్యాయామాల వల్ల ఏర్పడాలి, మా

వ్యాయామ సాధన వీటిని సమకూరుస్తుంది. మనశ్శరీరాలను సాధన చేసే ఒక సంపూర్ణ ఆధ్యాత్మిక సాధనలో వ్యాయామాలు, ఆధ్యాత్మిక సాధన రెండూ అవసరం. గోంగ్ ఎలా ఏర్పడుతుందో, ఇప్పుడు అందరికీ అర్థమవుతున్నదను కుంటాను. మీరు సాధించిన స్థాయిని నిర్ధారించే గోంగ్, వ్యాయామాల ద్వారా ఏ మాత్రమూ పెరగదు, అది ఆధ్యాత్మిక సాధన ద్వారా మాత్రమే, అభివృద్ధి చెందుతుంది. మీ షిన్ షిన్‌ను ఉన్నతీకరించుకొని, సామాన్య వ్యక్తుల నడుమ, మీ ఆధ్యాత్మిక సాధనలో విశ్వ లక్షణంతో మమేకం కావడంవల్ల, ఆ విశ్వ లక్షణం మిమ్మల్ని ఏ మాత్రమూ నిర్బంధించదు; మీరు పైకి ఎదగడానికి అనుమతింపబడుతుంది. అప్పుడు మీ పుణ్యం, గోంగ్‌గా పరివర్తన చెందడం మొదలవుతుంది. మీ షిన్ షిన్ ప్రమాణం పెరిగినకొద్దీ, మీ గోంగ్ కూడా పెరుగుతుంది. ఇది కేవలమూ ఇలాంటి సంబంధం.

మనది మనశ్శరీరాలు రెండింటినీ సంస్కరించే అసలైన ఆధ్యాత్మిక సాధన. మేము సంస్కరించే గోంగ్ శరీరంలోని ప్రతి జీవకణంలో నిలవ చేయబడి ఉంటుంది, అత్యంత శక్తి పదార్థం కలిగిన గోంగ్, అత్యంత సూక్ష్మస్థాయిలో ఉన్న మూలపదార్థపు అతిచిన్న నలుసులలో కూడా నిలవ చేయబడి ఉంటుంది. మీ గోంగ్ యొక్క శక్తి అధికం అవుతున్నకొద్దీ, గోంగ్ యొక్క సాంద్రత, బలమూ కూడా పెరుగుతాయి. అటువంటి అత్యంత శక్తి పదార్థానికి వివేకం ఉంటుంది. అది, ప్రాణానికి మూలం ఎక్కడుందో, అంత వెనక్కు వెళ్ళి, మానవ దేహంలోని ప్రతి జీవకణంలోనూ నిలవ చేయబడు తున్నందువల్ల, అది క్రమంగా, మీ శరీరంలోని జీవాణువులలోని పరమాణు సమూహాల సమ్మేళనాలు, అణు కేంద్రకాల రూపాన్ని సంతరించుకొని, అచ్చంగా, మీ జీవకణాల ఆకారాన్ని పొందుతుంది. అయితే, ఈ శరీరంలోని సారం మారిపోయింది, ఎందుకంటే, అందులో మొదట ఉన్న భౌతిక జీవకణాలు ఎంత మాత్రమూ లేవు. మీరు అయిదు మూలపదార్థాలకు అతీతంగా లేరా? అయితే, మీ ఆధ్యాత్మిక సాధన ఇంకా సంపూర్ణం కాలేదు, మీరు సామాన్య జనుల మధ్య ఇంకా ఆధ్యాత్మిక సాధన చెయ్యవలసి ఉంది. అందువల్ల పైకి, మీరు ఇంకా ఒక సామాన్య వ్యక్తి లాగానే కనిపిస్తారు. మీలోని ఒకటే తేడా ఏమిటంటే, మీ వయసులోని ఇతరుల కంటే, మీరు

యువకుడిలా కనిపిస్తారు. ముందుగా, మీ వ్యాధులతో సహా, మీ శరీరంలోని చెడ్డ విషయాలు, ఖచ్చితంగా తొలగింపబడాలి. కానీ ఇక్కడ మేము వ్యాధులకు చికిత్స చెయ్యం. మేము మీ శరీరాన్ని శుద్ధి చేస్తాం, దానికి అర్థం, "వ్యాధి నిర్మూలన" కాదు. మేము దానిని కేవలం "శారీరక శుద్ధి" అంటాం, అసలైన సాధకుల శరీరాలను మేము శుద్ధి చేస్తాం. కొందరు, కేవలం వ్యాధి నిర్మూలన కోసమే ఇక్కడికి వస్తుంటారు. తీవ్ర వ్యాధిగ్రస్తులను, మా బోధనకు వచ్చేందుకు మేము అనుమతించం, ఎందుకంటే, వారు తమ వ్యాధి నిర్మూలన పట్ల, వ్యాధిగ్రస్తులం అనే భావన పట్ల ఉండే బంధం వదలలేరు. ఒక వ్యక్తి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నప్పుడు, అసౌకర్యంగా అనిపిస్తున్న భావనను వదులుకోగలడా? ఆ వ్యక్తి ఆధ్యాత్మిక సాధన చెయ్యలేడు. మేము తీవ్ర వ్యాధిగ్రస్తులను చేర్చుకోం అని పదేపదే నొక్కి చెప్తున్నాం. వారు భావించేదానికి ఎంతో అతీతంగా ఉన్న ఆధ్యాత్మిక సాధన ఇది. వారు అటువంటి పనులు చెయ్యడానికి, ఇతర చీ గోంగ్ గురువులను వెతుక్కోవచ్చు. అయితే చాలామంది అభ్యాసకులకు వ్యాధులు ఉన్నాయి. మీరు నిజమైన సాధకులు గనక, మేము మీకోసం ఈ పనులను చేస్తాము.

కొంతకాలం ఆధ్యాత్మిక సాధన చేసిన తరవాత మన ఫాలున్ దాఫా సాధకుల బాహ్యరూపంలో చాలా మార్పు కనిపిస్తుంది. వారి చర్మం మృదువుగానూ, ఎరుపు కలిసిన తెలుపు రంగులోకి మారుతుంది. వయసు మళ్ళిన వారిలో, శరీరంలోని ముడతలు కొంచెం తక్కువ అవుతాయి, లేదా చాలా వరకు, తగ్గిపోతాయి, ఇది ఒక సహజపరిణామం. ఇక్కడ నేను ఏదో ఊహాతీతమైన విషయం గురించి చెప్పడం లేదు, ఎందుకంటే, ఇక్కడ కూచున్న వారిలో దీర్ఘ కాలం సాధన చేసి ఉన్నట్టి మా సాధకులు ఈ స్థితిని అనుభవించారు. దీనికి తోడు, వయసుమళ్ళిన స్త్రీలలో ఋతుధర్మం తిరిగి మొదలవుతుంది, ఎందు కంటే, మనశ్శరీరాలకు చెందిన ఆధ్యాత్మికసాధనలో శరీర సాధన చేసేందుకు ఋతుచక్రం యొక్క ఆవశ్యకత ఉంది. ఒక స్త్రీకి ఋతుక్రమం వచ్చినా, ఋతుస్రావం అధికంగా ఉండదు. ప్రస్తుత స్థితిలో అదే సరిపోతుంది. ఇది కూడా సహజ పరిణామమే. అలా కాని పక్షంలో, వారు తమ శరీర సాధనను ఎలా చెయ్యగలుగుతారు? పురుషుల విషయంలో

కూడా ఇదే జరుగుతుంది. వృద్ధులూ, యువకులు కూడా తమ శరీరమంతా తేలికగా ఉన్న అనుభూతిని పొందుతారు. అసలైన సాధకులు ఈ మార్పును అనుభవిస్తారు.

వ్యాయామాలలో జంతువులను అనుకరించే అనేక ఇతర సాధనలకు భిన్నంగా ఈ మా సాధన ఒక ప్రగాఢమైన సంస్కరణ చేస్తుంది. ఈ ఆధ్యాత్మిక సాధన ఒక బ్రహ్మాండమైన విషయాన్ని సాధన చేస్తుంది. శాక్యముని, లావో జీ (34), తమ కాలంలో, చర్చించిన నియమాలన్నీ, మన పాలపుంతకు పరిమితమైన నియమాలు మాత్రమే, మా ఫాలున్ దాఫా దేనిని సాధన చేస్తుంది? మా ఆధ్యాత్మిక సాధన, విశ్వపరిణామ సూత్రాల మీద ఆధారపడి ఉంది, అది, అత్యున్నతమైన సత్యం-దయ-సహనం అన్న విశ్వ లక్షణపు ప్రమాణం యొక్క మార్గదర్శకత్వంలో జరుగుతున్నది. మా ఆధ్యాత్మిక సాధనలోని విషయం ఎంత ఘనమైనదంటే, అది విశ్వమునే సంస్కరించిన దానితో సమానం.

మా ఫాలున్ దాఫాలో, ఇతర సాధనలకు చాలా భిన్నంగా ఉండి, దీనిని వాటినుండి వేరుచేసి చూపే, మరొక అద్వితీయమైన విశిష్ట లక్షణం ఉంది. ప్రస్తుతం సంఘంలో ప్రజాదరణ పొందిన అన్ని చీ గోంగ్ సాధనలు, దాన్‌ను అభ్యసించడం, లేదా దాన్‌ను సాధన చేసే మార్గాన్ని అనుసరిస్తున్నాయి. దాన్‌ను సాధన చేసే చీ గోంగ్ అభ్యాసాలలో, సామాన్య మానవుల నడుమ, ఒక వ్యక్తికి గోంగ్ బంధనాన్ని విప్పడం, జ్ఞానోదయం పొందడం అన్న స్థితికి చేరుకోవడం చాలా కష్టం. మా ఫాలున్ దాఫా దాన్‌ను సాధన చెయ్యదు. మా అభ్యాసంలో, పొత్తికడుపులో నెలకొని ఉన్న ఒక ఫాలున్‌ను సాధన చేస్తారు. తరగతిలోనున్న సాధకులలో దానిని నేను స్వయంగా నెలకొల్పుతాను. నేను ఫాలున్ దాఫా బోధిస్తున్నప్పుడు, అందరికీ వరుసగా అమరుస్తూ ఉంటాను. కొంతమంది దానిని అనుభూతి చెందగలరు, మరికొందరు గ్రహించలేరు; అధికసంఖ్యాకులు గ్రహించగలరు. దానికి కారణం, మనుషులలో ఉండే భిన్నమైన శారీరక స్థితులు. మేము దాన్‌కు బదులుగా ఫాలున్‌ను సాధన చేస్తాం. ఫాలున్ అన్నది విశ్వంలోని సమస్త శక్తులను కలిగి ఉన్నట్టి, విశ్వం యొక్క సూక్ష్మరూపం, అది తనంతటతానే గుండ్రంగా తిరుగుతూ

ఉంటుంది. అది మీ పొత్తికడుపు భాగంలో నిరంతరమూ తిరుగుతూ ఉంటుంది. ఒకసారి మీ శరీరంలో అమర్చిన తరవాత, అది సంవత్సరాల తరబడి నిరంతరమూ ఆగకుండా తిరుగుతూనే ఉంటుంది. సవ్యదిశలో తిరుగుతున్నప్పుడు, అది అప్రయత్నంగానే, విశ్వం నుండి శక్తిని గ్రహిస్తుంది. దానికి తోడుగా, మీ శరీరంలోని ప్రతి భాగాన్ని మార్చివేసేందుకు అవసరమైన శక్తిని దానంతట అదే పరివర్తన చేసి అందించగలుగుతుంది. అది అపసవ్య దిశలో తిరుగుతున్నప్పుడు, శక్తిని విడుదల చేస్తుంది, తద్వారా, అక్కరలేని మూలపదార్థాలను, బయటకు తోసేస్తుంది. అవి మీ శరీరం చుట్టూ, వెదజల్ల బడతాయి. అది శక్తిని విడుదల చేసినప్పుడు ఆ శక్తి చాలా దూరం వరకు విడుదల చేయబడుతుంది, తరవాత అది కొత్త శక్తిని కూడా తీసుకువస్తుంది. బయటకు విడువబడిన శక్తి, మీ చుట్టుపక్కల ఉన్న మనుషులకు మేలు చెయ్యగలదు. బుద్ధ సిద్ధాంతం, తనకుతాను ముక్తి పొందడంతోపాటు, బాధలను అనుభవిస్తున్నట్టి ఇతర జీవులకు ముక్తిని ప్రసాదించడం గురించి బోధిస్తుంది. ఒక వ్యక్తి తననుతాను సంస్కరించుకోవడమే కాకుండా, అన్ని సచేతన ప్రాణులకూ ముక్తిని ప్రసాదిస్తాడు. ఇతరులకు కూడా మేలు చేకూరుతుంది, ఇంకా, మీరు అసంకల్పితంగా, ఇతరుల శరీరాలను సరిచేసి, వారి వ్యాధులను నిర్మూలించడం వంటి పనులను చెయ్యగలరు. నిజానికి ఆ శక్తి వ్యక్తం కాలేదు. ఫాలున్ సవ్యదిశలో తిరుగుతున్నప్పుడు, నిరంతరమూ తిరుగుతున్న కారణంగా, ఆ శక్తిని తిరిగి సమకూర్చుకుంటుంది.

కొంతమంది "ఈ ఫాలున్ ఆగకుండా ఎందుకు తిరుగుతూ ఉంటుంది?" అని ఆశ్చర్యపోవచ్చు. "అది ఎందువల్ల తిరగగలుగుతుంది? దానికి కారణ మేమిటి?" అని నన్ను అడిగేవాళ్ళు కూడా ఉన్నారు. శక్తి కూడినప్పుడు దాన్ తయారవుతుందని సులభంగా అర్థం అవుతుంది గానీ, ఫాలున్ గుండ్రంగా తిరుగుతుందన్న సంగతి ఊహాతీతం అనిపిస్తుంది. మీకు ఒక ఉదాహరణ ఇస్తాను. విశ్వం పరిభ్రమిస్తూ ఉంటుంది, ఇంకా, విశ్వంలోని పాలపుంతలు, నక్షత్రసమూహాలు కూడా పరిభ్రమిస్తూ ఉంటాయి. తొమ్మిది గ్రహాలు సూర్యుడి చుట్టూ తిరుగుతూ ఉంటాయి, భూమి కూడా తన చుట్టూ తాను తిరుగుతూ ఉంటుంది. అందరూ ఈ విషయం గురించి ఆలోచించండి: వాటిని ఎవరు

నెడుతున్నారు? వాటికి ఆ శక్తిని ఎవరిచ్చారు? ఒక సామాన్య వ్యక్తి మనస్తత్వంతో, మీరు దీనిని అర్థం చేసుకోలేరు, ఎందుకంటే, ఇది కేవలం పరిభ్రమణం చెందే ఒక సంవిధానం. ఫాలున్ విషయంలో కూడా ఇంతే, అది కూడా పరిభ్రమిస్తూనే ఉంటుంది. వ్యాయామ సమయాన్ని పెంచడం ద్వారా, సాధారణ జీవన పరిస్థితులలో సామాన్య వ్యక్తులకు ఆధ్యాత్మిక సాధన చెయ్యడంలో ఉన్న సమస్యలను పరిష్కరించింది. అది ఎలా పెరిగింది? ఆగకుండా తిరుగుతూ ఉన్న కారణంగా, అది నిరంతరమూ విశ్వం నుండి శక్తిని గ్రహించి, పరివర్తన చేస్తూ ఉంటుంది. మీరు కార్యాలయానికి వెళ్ళినప్పుడు కూడా, అది మిమ్మల్ని సంస్కరిస్తూ ఉంటుంది. అయితే, ఫాలున్‌తో పాటుగా, మీ శరీరంలో, అనేక శక్తి వ్యవస్థలను, సంవిధానాలను నెలకొల్పుతాము, అవి ఫాలున్‌తో పాటుగా, తమంతట తామే తిరుగుతూ, మీలో మార్పును తెస్తూ ఉంటాయి. అందువల్ల, ఈ గోంగ్, మనుషులను తనంతటతానే మారుస్తూ ఉంటుంది. ఆ విధంగా, "గోంగ్ సాధకులను సంస్కరిస్తుంది", అలాగే, "ఫా సాధకులను సంస్కరిస్తుంది" అని చెప్పబడినట్లుగా జరుగుతుంది. మీరు వ్యాయామాలు చేస్తున్నప్పుడు గోంగ్ సాధన ఏ విధంగా జరుగుతూ ఉంటుందో, చేయనప్పుడు కూడా గోంగ్ అదే విధంగా మిమ్మల్ని సంస్కరిస్తూ ఉంటుంది. భోజనం చేస్తున్నా, నిద్రపోతున్నా, పనిచేస్తున్నా గోంగ్ మీలో పరివర్తన కలిగిస్తూనే ఉంటుంది. మీరు వ్యాయామాలు దేనికోసం చేస్తున్నారు? మీరు ఫాలున్‌ను బలపరచడానికీ, నేను నెలకొల్పిన శక్తి యొక్క యాంత్రిక వ్యవస్థలనూ, పద్ధతులను పునఃశక్తివంతం చెయ్యడానికి, వ్యాయామం చేస్తుంటారు. ఒక వ్యక్తి ఉన్నత స్థాయిలలో ఆధ్యాత్మిక సాధన చేస్తున్నప్పుడు అది పూర్తిగా వువే (35) స్థితిలో జరగాలి. వ్యాయామాలలోని కదలికలు కూడా ఆ సంవిధానాలను అనుసరించి ఉంటాయి. అక్కడ మనసు యొక్క నిర్దేశం ఉండదు, అతడు ప్రాణాయామ పద్ధతులు ఉపయోగించడం మొదలైనవి చెయ్యకూడదు.

మేము కాలం, స్థలం గురించి ఎటువంటి చింత లేకుండా వ్యాయామాలు చేస్తుంటాం. కొందరు, "వ్యాయామాలు చెయ్యడానికి ఉత్తమ సమయం ఏది? అర్ధరాత్రి, తెల్లవారుజాము లేదా మధ్యాహ్నమా" అని నన్నడిగారు. మాకు,

వ్యాయామ సమయం గురించి ఎటువంటి పట్టింపు లేదు. మీరు వ్యాయామాలు చెయ్యని అర్థరాత్రి సమయంలోనూ గోంగ్ మిమ్మల్ని సంస్కరిస్తూనే ఉంటుంది. మీరు వ్యాయామాలు చెయ్యని తెల్లవారుజాము సమయంలో కూడా గోంగ్ మిమ్మల్ని సంస్కరిస్తూనే ఉంటుంది. మీరు నిద్రపోతున్నప్పుడు కూడా గోంగ్ మిమ్మల్ని సంస్కరిస్తూనే ఉంటుంది. మీరు నడుస్తున్నా కూడా గోంగ్ మిమ్మల్ని సంస్కరిస్తూనే ఉంటుంది. మీరు ఉద్యోగం చేస్తున్నప్పుడు కూడా గోంగ్ మిమ్మల్ని సంస్కరిస్తూనే ఉంటుంది. ఇది మీ వ్యాయామ సమయాన్ని చాలా వరకు తగ్గించడం లేదా? మీలో చాలామంది, నిజంగా, తావో కావాలని హృదయపూర్వకంగా కోరుకుంటారు, ఆధ్యాత్మిక సాధన యొక్క అసలైన ప్రయోజనం  అదే. ఆధ్యాత్మిక సాధన యొక్క అంతిమలక్ష్యం తావో అయి, సాధనను సంపూర్ణం చేసుకోవడం. అయితే, కొంతమందికి తమ జీవితాలలో పరిమితమైన సమయమే ఉంటుంది. వారి జీవితం కొన్ని సంవత్సరాలకే పరిమితమై, ఆధ్యాత్మిక సాధన చెయ్యడానికి అది సరిపోకపోవచ్చు. మా ఫాలున్ దాఫా వ్యాయామ సమయం తగ్గించి, ఆ సమస్యను పరిష్కరించగలదు. అదే సమయంలో, అది మనశ్శరీరాలకు సంబంధించిన ఆధ్యాత్మిక సాధన కూడా. మీరు ఆపకుండా ఆధ్యాత్మిక సాధన కొనసాగిస్తూ ఉంటే, మీరు మీ జీవితాన్ని నిలకడగా పొడిగించుకోగలుగుతూ ఉంటారు. స్థిరమైన సాధనతో, మీ జీవితం పొడిగింపబడుతూనే ఉంటుంది. ఉన్నతమైన జన్మ సంస్కారం కలిగినట్టి వృద్ధులకు ఆధ్యాత్మిక సాధన చెయ్యడానికి జీవితంలో తగినంత సమయం ఉంటుంది. అయితే, విధిలిఖితమైన జీవితకాలాన్ని మించి పొడిగింపబడిన కాలం పూర్తిగా మీ ఆధ్యాత్మిక సాధన కోసమే కేటాయింప బడుతుందన్న ఒక నియమం ఉంది. మీ మనసు ఏమాత్రం తప్పుదారి పట్టినా, అది మీ ప్రాణానికి ముప్పు కావచ్చు, ఎందుకంటే విధి నిర్ణయం ప్రకారం మీ జీవితకాలం ఏనాడో ముగిసిపోయి ఉండవలసింది. ఈ నియమం మీకు, త్రిలోకాతీత ఫా యొక్క ఆధ్యాత్మిక సాధన చేరుకునే వరకు ఉంటుంది. దాని తరవాత, ఒక వ్యక్తి మరొక స్థితిలో ఉంటాడు.

ఫలానా దిక్కుకు తిరిగి వ్యాయామాలు చెయ్యాలనో, వ్యాయామాలను ముగించేందుకు ఫలానా విధానాలు పాటించాలన్న అవసరం మాకు లేదు.

ఫాలున్ నిరంతరం తిరుగుతున్న కారణంగా, దానిని ఆపలేరు. మీకు ఒక ఫోన్ వచ్చినా, ఎవరైనా తలుపు కొట్టినా వ్యాయామం ముగించవలసిన అవసరం లేకుండానే, మీరు ఆ పనులు చూసుకోవచ్చు. మీరు ఆ పనిని ముగించుకున్న తర్వాత, వెంటనే ఫాలున్ సవ్యదిశలో తిరిగి, మీరు విడిచిన శక్తిని మీ చుట్టుపక్కలనించి తిరిగి స్వీకరిస్తుంది. కొందరు ఉద్దేశపూర్వకంగా చీ ని ఆపి, తమ తలలలోకి నింపుకుంటారు, మీరు ఎంతగా ఆపినా అది నిలవదు, పోతుంది. ఫాలున్ తెలివైనది, దానికి ఇటువంటి పనులు ఎలా చేయాలో స్వయంగా తెలుసు. మాకు దిక్కుల గురించి పట్టింపు కూడా ఉండదు, ఎందుకంటే, సమస్త విశ్వమూ భ్రమణంలోనే ఉంటుంది. పాలపుంత కూడా కదులుతూనే ఉంటుంది, తొమ్మిది గ్రహాలు సూర్యుని చుట్టూ తిరుగుతుంటాయి. భూమి కూడా తన చుట్టూ తాను తిరుగుతూ ఉంటుంది. మనం ఈ గొప్ప విశ్వ లక్షణాన్ని అనుసరించి వ్యాయామాలు చేస్తూ ఉంటాము. తూర్పు, దక్షిణం, పడమర లేదా ఉత్తరం ఎక్కడున్నాయి? ఏదీ లేదు. ఏ దిక్కున వ్యాయామాలు చేసినా, అన్ని దిక్కులకు తిరిగి చేసినట్లే, ఏ దిక్కున వ్యాయామాలు చేసినా ఒకేసారి నలుదిక్కులా వ్యాయామం చేసినట్లే అవుతుంది. సాధకులను, క్రమం తప్పకుండా మా ఫాలున్ దాఫా రక్షిస్తుంది. అది మిమ్మల్ని ఏ రకంగా రక్షిస్తుంది?

మీరు ఒక నిజమైన సాధకుడు అయితే మా ఫాలున్ మిమ్మల్ని కాపాడుతూ ఉంటుంది. నేను విశ్వంలో పాదుకొని ఉన్నాను. మీకు ఎవరైనా హాని చేస్తే, ఆ స్త్రీ లేదా పురుషుడు నాకూ హాని చేసినట్లే. ఒక్కమాటలో చెప్పాలంటే, ఆ వ్యక్తి ఈ విశ్వానికి హాని చేసినట్లు. నేను చెప్తున్నది, నమ్మశక్యం కానట్లు ధ్వనించవచ్చు. మీరు ముందుముందు చదివేకొద్దీ అర్థం చేసుకుంటారు. నేను మీకు అర్థమయ్యేలా చెప్పేందుకు, అతినిగూఢమైన ఇతర విషయాలు కూడా కొన్ని ఉన్నాయి. మేము ఒక పద్ధతి ప్రకారం, సరళమైన వాటితో మొదలుపెట్టి నిగూఢమైన విషయాల వరకు, ఉన్నత స్థాయులలోని ఫాను వివరిస్తాం. మీ షిన్ షిన్ ధర్మబద్ధమై ఉండకపోతే, దానివల్ల ప్రయోజనం ఉండదు. మీరు దేని కోసమైనా ప్రాకులాడితే, ఇబ్బందులలో పడవచ్చు. ఎంతోకాలంపాటు సాధన చేసిన సాధకులలోని ఫాలున్ ఆకారం కోల్పోవడం నేను గమనించాను. అలా

ఎందుకని? మీరు మీ సాధనలో ఇతర విషయాలను కలిపేశారు, ఇతరుల విషయాలను అంగీకరించారు. అప్పుడు ఫాలున్ మిమ్మల్ని ఎందుకు రక్షించ లేదు? అది మీకు ఇవ్వబడిందంటే, అది మీది, మీ మనసు చేత శాసింప బడుతుంది. మీరు ప్రయత్నం చేసే విషయంలో ఎవ్వరూ అంతరాయం కలిగించరాదని విశ్వంలో ఒక నియమం ఉంది. మీకు ఆధ్యాత్మిక సాధన చెయ్యాలని లేకపోతే మిమ్మల్ని ఎవరూ బలవంతపెట్టలేరు – అది ఒక చెడ్డపని చేసినట్లే. మీ హృదయ సంకల్పం మార్చుకోమని మిమ్మల్ని ఎవరు బలవంత పెట్టగలరు? మిమ్మల్ని మీరే, నియంత్రించుకోవాలి. ప్రతి సిద్ధాంతంలోని ఉత్తమ విషయాలను స్వీకరించడమంటే, అందరినించి విషయాలను అంగీ కరించడమే. మీరు మీ వ్యాధి నిర్మూలనకు ఇవాళ ఒక చీ గోంగ్ సాధనను, రేపు మరొకదానిని సాధన చేస్తే, మీ వ్యాధి తొలగింపబడుతుందా? లేదు, మీరు దానిని కేవలం వాయిదా వేయగలుగుతారు. ఉన్నత స్థాయిలలో ఆధ్యాత్మిక సాధన చేయడమంటే, ఒకే సిద్ధాంతం మీద శ్రద్ధపెట్టి, దానికి కట్టుబడి ఉండాలి. మీరు ఒక సాధనను అనుసరిస్తే, పూర్తిగా జ్ఞానోదయం పొందేవరకు, దానియందే హృదయాన్ని లగ్నం చెయ్యాలి. అప్పుడు మాత్రమే మీరు మరొక సిద్ధాంతంలోని ఆధ్యాత్మిక సాధనను చెయ్యగలరు, అది ఒక భిన్నమైన పద్ధతిలో ఉంటుంది. శ్రేష్టమైన బోధనలు కలిగిన ఒక పద్ధతి అనాదికాలంనించి అందించబడుతున్న కారణంగా, అది ఒక క్లిష్టమైన పరివర్తనాప్రక్రియ ద్వారా వచ్చి ఉంటుంది. కొంతమంది, ఏదైనా సాధన చేసినప్పుడు, తమకు కలిగే అనుభూతిని బట్టి దానిని కొనసాగిస్తారు. మీ అనుభూతితో పనేమిటి? ఏమీ లేదు. నిజమైన పరివర్తన ప్రక్రియ ఇతర పరిమాణాలలో జరుగుతుంది, అది అత్యంత సంక్లిష్టమూ, నిగూఢమూ అయినట్టిది. అందులో చిన్నమెత్తు పొరపాటు కూడా జరగకూడదు. అది అచ్చంగా, ఒక సునిశిత పరికరంలో మరొక కొత్త భాగం అమర్చితే, అది వెంటనే చెడిపోయిన విధంగా జరుగుతుంది. మీ శరీరం ప్రతి పరిమాణంలోనూ మారుతూ ఉంటుంది. అది అత్యంత గూఢమైనది, అందులో ఒక్క చిన్న పొరపాటు కూడా జరగరాదు. ఆధ్యాత్మిక సాధన ఒక వ్యక్తి స్వంత ప్రయత్నాల మీద ఆధారపడి ఉండగా, గోంగ్ పరివర్తన మాత్రం అతడి గురువు చేత చెయ్యబడుతుందని, నేను

ఇంతకు ముందే మీకు చెప్పాను. మీరు అలక్ష్యంగా ఇతరుల విషయాలను తీసుకొని మీ సాధనకు కలుపుకుంటే, ఆ బయటి సందేశాలు ఈ సిద్ధాంతంలోని సాధనకు సంబంధించిన విషయాలకు అంతరాయం కల్పిస్తాయి, దానివల్ల మీరు దారి తప్పిపోతారు. దీనికి తోడు, ఇది సామాన్య మానవ సంఘంపై ప్రభావం చూపించి, సామాన్య మానవులకు సమస్యలు తెచ్చి పెడుతుంది. ఇది మీ ప్రాకులాటవల్ల జరిగినది, ఇతరులు దానిలో జోక్యం చేసుకోలేరు. ఇది మీ జ్ఞానోదయ లక్షణం యొక్క సమస్య. దానిని అనుసరించి, మీరు కలిపినవన్నీ మీ గోంగ్‌ను కలుషితం చేస్తాయి, ఆ పై మీరు ఆధ్యాత్మిక సాధనను ఎంత మాత్రమూ చెయ్యలేరు. ఈ విధమైన సమస్య చోటు చేసుకుంటుంది. అందరూ ఫాలున్ దాఫా మాత్రమే అధ్యయనం చెయ్యాలని నేను చెప్పడం లేదు. మీరు ఫాలున్ దాఫాకు మారుగా మరొక చీగోంగ్ సాధనకు సంబంధించిన అసలైన బోధనలు పొంది ఉంటే, నేను దానిని కూడా ఒప్పుకుంటాను. అయితే ఒక విషయం చెప్పనివ్వండి, నిజంగా ఉన్నత స్థాయిలకు చెందిన ఆధ్యాత్మిక సాధన చెయ్యడానికి, ఒక వ్యక్తి ఒక్క సాధన పట్ల మాత్రమే ఏకాగ్రచిత్తంతో ఉండాలి. నేను ప్రత్యేకంగా చెప్పవలసిన ఒక సంగతి కూడా ఉంది: ప్రస్తుతం, నావలె, ఉన్నత స్థాయిలకు చేర్చే నిజమైన బోధన చేస్తున్న వారు మరెవ్వరూ లేరు. నేను మీ కోసం ఏమి చేశానో, మీకు భవిష్యత్తులో స్పష్టంగా అవగతం అవుతుంది. ఈ విధంగా, మీలోని జ్ఞానోదయ లక్షణం తగ్గిపోరాదని నేను ఆశిస్తున్నాను. చాలామందికి, ఉన్నత స్థాయిలకు చేర్చే ఆధ్యాత్మిక సాధన చెయ్యాలని ఉంటుంది. ఇది మీ ఎదురుగానే మీకు ఇవ్వబడి ఉంది, మీకు ఇంకా అది తెలిసి ఉండకపోవచ్చు. మీరు ఒక గురువు కోసం అన్నిచోట్లా వెతికి, ఎంతో ధనం ఖర్చు చేసి ఉంటారు, అయినా మీకు ఏమీ దొరకలేదు. ఇవాళ అది మీ ముంగిట్లోకి తీసుకువచ్చి ఇవ్వబడింది, మీరు దీనిని ఇంకా గ్రహించినట్లు లేదు! మీరు జ్ఞానోదయం పొందగలరా? రక్షింపబడగలరా, లేదా అన్నదే ఇక్కడున్న ప్రశ్న.

* * * *

**అర్థములు:**

1. చీ గోంగ్ – చీ లేదా ప్రాణ శక్తిని సాధన చేసే సంప్రదాయబద్ధ చైనీయ వ్యాయామం.
2. దాఫా – "మహాధర్మం" లేదా "మహామార్గం"; నియమాలు.
3. షిన్ షిన్ – మనసు లేదా హృదయపు స్వభావం; నైతిక శీలం.
4. దశ దిశల ప్రపంచం – విశ్వం పట్ల బౌద్ధుల భావన.
5. చీ – చైనీయ సంస్కృతిలో ప్రాణశక్తిగా భావింపబడేది; గోంగ్‌తో పోల్చినప్పుడు తక్కువ స్థాయి శక్తి రూపం.
6. త్రిలోకాంతర ఫా – త్రిలోకాతీత ఫా ఆధ్యాత్మిక సాధనాస్థాయికి చేరుకోని వ్యక్తి సంసార (పునర్జన్మ చక్రం)లో పరిభ్రమిస్తూ ఉండాలని బౌద్ధమతం అభిప్రాయపడుతుంది.
7. గోంగ్ – 1. సాధనార్జిత శక్తి. 2. అటువంటి శక్తినిచ్చే సాధన.
8. శాక్యముని – చరిత్రలో ఉండిన బుద్ధుడు, గౌతమ సిద్ధార్థుడు.
9. ధర్మ – శాక్యముని బుద్ధుని బోధనలు.
10. "ఎద్దు కొమ్ములోకి తవ్వుకొని పోవడం" – చైనీయ భాషలో "చివరికి మూసుకుపోయే ఇరుకైన దారి" అన్న పద ప్రయోగం.
11. తథాగత – బుద్ధ సిద్ధాంతంలో బోధిసత్వ మరియు అర్హత స్థాయులకు మించిన ఫల స్థితిని అందుకున్న జ్ఞాని.
12. వజ్రసూత్రం – ప్రాచీన బౌద్ధమత గ్రంథం.
13. ప్రాథమిక ఆత్మ – ఇది మరల ప్రధాన ఆత్మ (జూ యువాన్ షెన్) మరియు సహాయక ఆత్మ (ఫు యువాన్ షెన్) లుగా విభజింపబడింది. సంప్రదాయ చైనీయ భావన ప్రకారం శరీరంలో కొన్ని విధులను, ప్రక్రియలను ప్రభావితం చేసే అనేక ఆత్మలు నివసిస్తాయని నమ్ముతారు. (ఉదా : కాలేయంలో ఒక ఆత్మ నివసిస్తూ దాని విధులను నడుపుతుందని అనేకులు నమ్ముతారు.)
14. ధర్మం అంతరించే కాలం – శాక్యముని బుద్ధుని ప్రకారం, తన నిర్యాణానికి అయిదు వందల సంవత్సరాల తరవాత ధర్మం అంతరించే కాలం ప్రారంభ మవుతుంది, ఆ తరవాత బుద్ధ ధర్మం ప్రజలను రక్షించలేదు.

15. అయిదు మూలకాలు – లోహం, చెక్క, నీరు, నిప్పు, భూమి.
16. ఫల స్థితి – బుద్ధ సిద్ధాంతంలో ఒక వ్యక్తి సాధించిన స్థాయి, ఉదా: అర్హత్, బోధిసత్త్వ, తథాగత మొదలైనవి.
17. ద – "పుణ్యం"; ఒక విలువైన తెల్లని పదార్థం.
18. లే ఫుంగ్ – 1960లలో నైతిక ఆదర్శం.
19. కల్పము – రెండు బిలియన్ సంవత్సరాల కాల అవధి; ఇక్కడ ఈ పదం ఒక సంఖ్యగా ఉపయోగించబడింది.
20. తాయిజీ – తావో సిద్ధాంతం యొక్క చిహ్నం, పశ్చిమ దేశాలలో "యిన్-యాంగ్" చిహ్నంగా ప్రాచుర్యం పొందినది.
21. హూ తూ, లువా ష్యూ – ప్రాచీన చైనాలో కనిపించినవి, ప్రకృతి గమనంలో కలిగిన మార్పును వెల్లడిచేసేవిగా భావింపబడే ఐతిహాసిక కాలపు చిత్రాలు.
22. బుక్ ఆఫ్ చేంజెస్ – ఝౌ వంశ కాలం (క్రీ.పూ. 1100–221 క్రీ.పూ. నడుమ కాలం) నించి భవిష్యత్తును తెలియజేసిన ప్రాచీన చైనీయ గ్రంథం.
23. ఎయిట్ ట్రయాగ్రామ్స్– బుక్ ఆఫ్ చేంజెస్‌లో ప్రకృతి గమనంలోని మార్పులను వెల్లడి చేసిన ఐతిహాసిక యుగపు చిత్రాలు.
24. ఫో టువో – "బుద్ధుడు" అన్న పదానికి సాంప్రదాయక చైనీయ పదం.
25. ఫూ టూ – "బుద్ధుడు" అన్న పదానికి సాంప్రదాయక చైనీయ పదం.
26. మహా సాంస్కృతిక విప్లవం – సాంప్రదాయ విలువలను, సంస్కృతిని నిందించినట్టి కమ్యూనిస్టు రాజకీయ ఉద్యమము.
27. అర్హత్ – బుద్ధ సిద్ధాంతంలో ఫల స్థితి పొంది త్రిలోకాలకు అతీతం అయిన జ్ఞాని.
28. దాన్ జింగ్, తావో జాంగ్ – ఆధ్యాత్మిక సాధన గురించిన ప్రాచీన చైనీయ గ్రంథాలు.
29. బోధిసత్త్వ – బుద్ధ సిద్ధాంతంలో అర్హత స్థాయిని మించి తథాగత స్థాయికి తక్కువగా ఫల స్థితిని కలిగిన జ్ఞాని.
30. దివ్య నేత్రం – "మూడవ కన్ను" అని కూడా పిలవబడుతుంది.
31. దాన్ – ఇతర పరిమాణాలనించి పోగు పడి ఒక సాధకుని శరీరంలో ఏర్పడే శక్తి పుంజం.

32. ఒక మూసను కొలిమి మీద పెట్టి ఔషధ మొక్కలను సేకరించి అందులో వేసి, మనోక్రియల ద్వారా దాన్‌ను తయారుచెయ్యడం – తావోలు అంతర్గత రసవాదంతో పోల్చి చెప్పిన సమాసం.
33. చివరి ప్రళయ కాలం – విశ్వానికి మూడు పరిణామ దశలు ఉంటాయని (తొలి ప్రళయం, మధ్యమ ప్రళయం, చివరి ప్రళయం), ఇప్పుడు చివరి ప్రళయ కాలం నడుస్తున్నదని సాధకుల సమాజం భావిస్తుంది.
34. లావో జీ – తావో సిద్ధాంతాన్ని కనుగొని తావో తే చింగ్ రచించినవారు. క్రీ.పూ. 5 లేదా 4 శతాబ్దములలో చైనాలో జీవించి బోధనలు చేసినట్లు భావింపబడుతుంది.
35. వూవే – "క్రియారహిత", "క్రియాశూన్య", "సంకల్పరహిత".

* * * *

# రెండవ ఉపన్యాసము

## దివ్యనేత్రపు వివాదాంశం

చాలామంది చీగోంగ్ గురువులు ఇదివరకే దివ్యనేత్రం గురించి చెప్పారు. అయితే, ఫా, భిన్న స్థాయిలలో భిన్నంగా అభివ్యక్తం అవుతుంది. ఒక సాధకుడు, తన ఆధ్యాత్మిక సాధనలో, తాను చేరుకున్న ఒక ప్రత్యేక స్థాయిలో అభివ్యక్తమైన ఫా ను మాత్రమే తెలుసుకోగలుగుతాడు. అతడు సత్యాన్ని ఆ స్థాయిని దాటి చూడలేడు, నమ్మనూ లేడు. అందువల్ల, అతడు తనకు తెలిసినదే సరియైనది అనుకుంటాడు. తన ఆధ్యాత్మిక సాధనలో పైస్థాయికి చేరనంత వరకు, ఆ విషయాలు ఉండవని, నమ్మశక్యం కావనీ అనుకుంటాడు. అది, అతడి స్థాయినిబట్టి నిర్ణయింపబడుతుంది. అతడి మనస్సు ఎదగలేకపోయింది. మరొక రకంగా చెప్పాలంటే, ఈ దివ్యనేత్రం విషయంలో కొందరు ఒక రకంగా, మరికొందరు మరొక రకంగా ముచ్చటిస్తారు. ఫలితంగా, వారు దివ్యనేత్రం యొక్క విషయాన్ని సందిగ్ధంలో పెట్టి, చివరకు, ఎవ్వరూ దాని గురించి స్పష్టంగా వివరించలేరు. నిజానికి ఒక క్రింది స్థాయిలో, దివ్యనేత్రం గురించి స్పష్టంగా వివరించడం కష్టం. గతంలో దివ్యనేత్రం యొక్క నిర్మాణం అత్యంత రహస్యంగా ఉంచబడేది, సామాన్య మానవులు దాని గురించి తెలుసుకోవడం నిషేధింప బడింది. అందువల్ల, చరిత్ర గమనంలో దాని గురించి ఎవ్వరూ మాట్లాడలేదు. కానీ, ఇప్పుడు మేము పాతకాలపు సిద్ధాంతాల ఆధారంగా దాని గురించి వివరించం. మేము ఆధునిక విజ్ఞాన శాస్త్రాన్నీ, ఆధునికమైన సరళ భాషనూ ఉపయోగించి, దాని గురించిన మౌలికమైన విషయాలను వివరించి చెప్తున్నాము.

మనం చెప్పుకుంటున్న ఈ దివ్యనేత్రం అనేది, రెండు కనుబొమల మధ్యలో కొద్దిగా పైన ఉండి, వినాళగ్రంథితో కలపబడి ఉంటుంది. అదే

దాని ప్రధాన మార్గం. మానవ శరీరానికి ఇంకా ఎన్నో అనుబంధ నేత్రాలు ఉన్నాయి. ప్రతి రంధ్రము ఒక నేత్రమని తావో సిద్ధాంతం చెప్తుంది. తావో సిద్ధాంతంలో, ప్రతి ఆక్యుపంక్చర్ బిందువు ఒక రంధ్రం అంటారు. కానీ చైనీయ వైద్యంలో దాన్ని కేవలం ఆక్యుపంక్చర్ బిందువు అని చెప్తారు. ప్రతి రోమ రంధ్రమూ ఒక నేత్రం అని బుద్ధ సిద్ధాంతంలో అంటారు. అందువల్ల కొంతమంది చెవులతో చదవగలుగుతారు, చేతులు లేదా తల వెనుకనించి చూడగలుగుతారు. ఇంకా కొందరు పాదాలతో లేక పొట్టతో కూడా చూడ గలుగుతారు. అవి అన్నీ సాధ్యమే.

దివ్యనేత్రం గురించి మాట్లాడేటప్పుడు, ముందు, మనం మనకున్న భౌతికమైన రెండు కళ్ళ గురించి చెప్పుకుందాం. ఈ రెండు కళ్ళూ, ప్రపంచంలో ఏ పదార్థమునైనా, ఏ వస్తువునైనా, చూడగలవని ఈ రోజుల్లో కొందరనుకుంటారు. అందువల్ల కొంతమంది, మొండి వైఖరిని అవలంబించి, ఈ కళ్ళ ద్వారా చూసినది నిజమైనదని, ఖచ్చితమైనదని నమ్ముతారు. వారు చూడలేని విషయాన్ని నమ్మరు. గతంలో, ఇటువంటివారికి జ్ఞానోదయ లక్షణం తక్కువగా ఉందని భావించేవారు. అయితే, వారిలో, ఈ లక్షణం ఎందుకు తక్కువగా ఉన్నదో కొందరు చెప్పలేకపోయేవారు. చూడనిదే నమ్మరు, అది చాలావరకు సబబు అనిపించవచ్చు. కానీ, కొంచెం ఉన్నతస్థాయి దృక్పథం నించి చూసినప్పుడు, అది సబబు కాదు. ప్రతి యొక్క దేశము – కాలము పదార్థంతో తయారై ఉంటుంది. నిజానికి, భిన్న దేశ–కాలాలు, భిన్నమైన భౌతిక నిర్మాణాలు కలిగి ఉండి, వాటిలో భిన్నమైన అనేక ప్రాణుల రూపాలు వ్యక్తమవుతూ ఉంటాయి.

మీకొక ఉదాహరణ ఇస్తాను. మానవ సంఘంలో గోచరించే ప్రతిదీ భ్రమ అని, అసత్యం అని బౌద్ధమతం చెప్తుంది. అవి ఎందువలన భ్రమలు? నిజమైన, స్పష్టమైన భౌతిక వస్తువులు ఇక్కడ ఉండగా, వాటిని అసత్యమని ఎవరు వాదించగలరు? ఒక భౌతికమైన వస్తువు యొక్క ఉనికి ఒక రూపంలో కనిపించినా, అది నిజంగా వ్యక్తమయ్యే విధానం ఇది కాదు. అయితే, భౌతిక మైన వస్తువులను, మన భౌతిక పరిమాణంలో, ఇప్పుడు మనం చూడగలిగే విధంగా స్థిరపరచి, ఈ స్థితిలో చూపించగలిగిన శక్తి, మన కళ్ళకు ఉంది.

ఆ వస్తువులన్నీ, నిజానికి ఈ స్థితిలో లేవు, అవి మన పరిమాణంలో కూడా ఈ స్థితిలో లేవు. ఉదాహరణకు, ఒక సూక్ష్మదర్శిని క్రింద చూసినప్పుడు ఒక మనిషి ఎలా కనిపిస్తాడు? ఆ శరీరమంతా, కదులుతున్న ఇసుకరేణువుల వలె, వదులుగా ఉండే చిన్న పరమాణు సమూహాలతో తయారై ఉంటుంది. ఎలెక్ట్రాన్లు, కేంద్రకాల చుట్టూ పరిభ్రమిస్తూ ఉంటాయి, ఇంకా ఆ శరీరం మెలికలు తిరుగుతూ, కదులుతూ ఉంటుంది. ఆ శరీరపు ఉపరితలం మృదువుగా లేదా, ఒక నిర్ణీత పద్ధతిలో కానీ ఉండదు. విశ్వంలోని ఉక్కు, ఇనుము, రాయి వంటి ఏ పదార్థమైనా ఆ విధంగానే ఉంటుంది, లోపల వాటిలోని అన్ని పరమాణు సమూహాల యొక్క మూలపదార్థాలు కదులుతూ ఉంటాయి. మీరు వాటి సంపూర్ణ రూపాన్ని చూడలేరు, నిజానికి అవన్నీ స్థిరంగా ఉండవు. ఈ బల్ల కూడా మెలికలు తిరుగుతూ ఉంటుంది, కానీ మీ కళ్ళు ఆ నిజాన్ని చూడలేవు. ఈ నేత్రద్వయం ఆ విధమైన అసత్య భావనను కలిగిస్తుంది.

దీనికి అర్థం, మనం వస్తువులను సూక్ష్మస్థాయిలో చూడలేమని గాని, మనుషులకు ఈ శక్తి లేదని గాని కాదు. మనుషులకు పుట్టుకతోనే ఈ శక్తి ఉంటుంది, వారు ఒక నిర్దిష్టమైన సూక్ష్మస్థాయిలో వస్తువులను చూడగలుగు తారు. ఒక్క మాటలో చెప్పాలంటే మనకు ఈ కళ్ళు, ఈ భౌతిక పరిమాణంలో ఇవ్వబడినందున మనుషులకు ఒక అసత్యభావం కలిగి, వస్తువులను చూడడం నిరోధింపబడుతుంది. అందువల్ల, గతంలో తాము చూడలేనిదానిని నమ్మని వ్యక్తుల విషయంలో, వారిలో జ్ఞానోదయ లక్షణం తక్కువగా ఉందనీ, అటువంటివారు సామాన్య మానవులలో కలిగే అసత్యభావన కారణంగా భ్రమలో పడ్డారని, వారు సామాన్య మానవుల నడుమ మాయలో చిక్కుకున్నారని సాధకుల సమాజం భావించేది. ఇది మతాలు చెప్పిన ఒక చారిత్రక వివరణ. నిజానికి, మాకు కూడా అది కొంతవరకు సబబుగానే తోచింది.

మన కళ్ళు, మన ఈ భౌతిక పరిమాణంలో వస్తువులను అటువంటి స్థితికి స్థిరపరచగలవు. అంతకుమించి, వాటికి ఎటువంటి ప్రత్యేకమైన శక్తి లేదు. ఒక వ్యక్తి దేనినైనా చూసినప్పుడు, దాని ప్రతిబింబం అతడి కళ్ళల్లో నేరుగా ఏర్పడదు. ఈ కళ్ళు కెమెరాలోని కటకాలవలె, కేవలం ఒక పరికరంగా

మాత్రమే పనిచేస్తాయి. దూరపు వస్తువులను చూసేటప్పుడు కటకపు శక్తి వాటి మేరకు పొడిగింపబడుతుంది. మన రెండు కళ్ళు కూడా ఆ ప్రక్రియనే అనుసరిస్తాయి. చీకట్లో చూసినప్పుడు, మన కంటిపాపలు పెద్దవి అవుతాయి. ఒక కెమెరా చీకటిలో ఒక చిత్రాన్ని గ్రహించినప్పుడు, దాని కంటి రంధ్రం వ్యాకోచిస్తుంది. లేకపోతే, సరిపడినంత వెలుతురు లేని కారణంగా, ఆ చిత్రం మొత్తం నల్లగా ఉంటుంది. ఒక వ్యక్తి చాలా కాంతివంతమైన ఆరుబయట ప్రదేశానికి వెళ్ళినప్పుడు, అతడి కంటిపాప సంకోచిస్తుంది. లేకపోతే, ఆ కాంతి వల్ల అతడి కళ్ళు మిరుమిట్లు చెంది, అతడు దేనినీ స్పష్టంగా చూడలేడు. ఒక కెమెరా కూడా అదే సూత్రంతో పనిచేస్తుంది. కెమెరా కన్ను కూడా సంకోచించ వలసిన అవసరం ఉంది. అది కేవలం ఒక పరికరంగా పనిచేసి, ఒక వస్తువు యొక్క ప్రతిబింబాన్ని మాత్రమే గ్రహిస్తుంది. మనం వస్తువులను, మనిషిని లేదా ఒక వస్తువు యొక్క స్వరూపాన్ని నిజంగా చూసినప్పుడు, మన మెదడులో వాటి ప్రతిబింబాలు ఏర్పడతాయి. అంటే, మనం కంటితో చూసినవి, మెదడు వెనక ఉన్న వినాళగ్రంథికి దృష్టి నాడి ద్వారా పంపబడి, ఆ ప్రదేశంలో ప్రతిబింబాలుగా ఏర్పడతాయి. అంటే, నిజమైన ప్రతిబింబాలు, మెదడు యొక్క వినాళగ్రంథిలో కనబడతాయి. ఆధునిక వైద్యం కూడా దీన్ని అంగీకరిస్తుంది.

మనం చెప్పుకుంటున్న ఈ దివ్యనేత్రం తెరుచుకోవడం అంటే, మానవ దృష్టి నాడిని ఉపయోగించకుండా, కనుబొమల మధ్యన ఒక దారిని ఏర్పరచు కొని వినాళగ్రంథి, నేరుగా బయటకు చూడగలుగుతుంది. దీనినే దివ్యనేత్రం తెరచు కోవడం అంటారు. కొందరు, "ఇది నిజం కాదు. ఎంతైనా, ఈ రెండు కళ్ళు ఒక పరికరంగా ఉపయోగపడతాయి. ఇది వస్తువుల ప్రతిబింబాలను గ్రహిస్తుంది, కళ్ళు లేనిదే ఇది అసాధ్యం", అని ఆలోచించవచ్చు. శస్త్ర వైద్యశాస్త్ర ప్రకారంగా, వినాళగ్రంథికి ముందు భాగంలో ఒక సంపూర్ణమైన మానవ నేత్రం నిర్మితమై ఉన్నట్లు ఇదివరకే కనుగొనబడింది. ఇది ఒక మనిషి పుర్రె లోపలి భాగంలో పెరిగిన కారణంగా, ఇది ఒక అవశేష నేత్రంగా చెప్పబడు తుంది. అది ఒక అవశేష నేత్రం అవునా, కాదా అన్న విషయంలో మన ఆధ్యాత్మిక సాధకుల సమాజంలో, కొన్ని ప్రత్యేక అభిప్రాయాలున్నాయి. అయినా, మనిషి మెదడు మధ్యభాగంలో ఒక కన్ను ఉన్నదని, ఆధునిక

వైద్యశాస్త్రం ఇప్పటికే గుర్తించింది. మేము తెరిచే ఈ దారి, సరిగ్గా, ఆ ప్రదేశాన్ని లక్ష్యంగా చేసుకుంటుంది, ఇది ఆధునిక వైద్యశాస్త్ర అవగాహనతో పూర్తిగా ఏకీభవిస్తుంది. ఈ కన్ను మన భౌతికమైన కళ్ళలాగా మిథ్యా ప్రతిబింబాలను కల్పించదు, ఎందుకంటే ఇది, పదార్థం యొక్క సహజ స్వరూపాన్ని, సారాన్నీ కూడా చూడగలుగుతుంది. అందువల్ల ఉన్నతస్థాయిలో దివ్యనేత్రమును కలిగి ఉన్న ఒక వ్యక్తి, సామాన్య మానవులు చూడలేనట్టి, మన పరిమాణానికి ఆవలి దేశ కాలాలను, ఇతర దృశ్యాలను చూడగలుగుతాడు. తక్కువ స్థాయిలో దివ్యనేత్రం కలిగి ఉన్న ఒక వ్యక్తి , గోడల గుండా గానీ, మానవ శరీరం గుండా గానీ చొచ్చుకపోయి వస్తువులను చూడగలిగే దృష్టిని కలిగి ఉండవచ్చు. దానికి అట్టి తీక్షణమైన అతీంద్రియ శక్తి ఉంటుంది.

బుద్ధ సిద్ధాంతం అయిదు స్థాయుల నేత్ర దృష్టిని గురించి చెప్తుంది: భౌతిక నేత్ర దృష్టి, దివ్యనేత్ర దృష్టి, జ్ఞాన నేత్ర దృష్టి, ఫా నేత్ర దృష్టి, మరియు బుద్ధ నేత్ర దృష్టి. ఇవీ దివ్యనేత్రం యొక్క అయిదు ప్రధాన స్థాయులు, వీటిలోని ప్రతి ఒక్కటీ, మళ్ళీ పై, మధ్య, క్రింది స్థాయులుగా విభజించబడింది. తావో సిద్ధాంతం తొమ్మిదిసార్లు తొమ్మిది, లేదా ఎనభై ఒక్క స్థాయుల ఫా నేత్ర దృష్టి గురించి చెప్తుంది. మేము ఇక్కడున్న ప్రతి ఒక్కరికీ దివ్యనేత్రాన్ని తెరిపిస్తున్నాం, కానీ, మేము దానిని దివ్యనేత్ర దృష్టి లేదా అంతకన్నా క్రింది స్థాయిలో గానీ తెరవం. ఎందుకని? మీరు ఇప్పుడే ఆధ్యాత్మిక సాధనను ప్రారంభించినప్పటికీ, ఇంకా సామాన్య వ్యక్తులకు ఉండే అనేక సామాన్య మానవ బంధాలను మీరు ఇంకా వదలిపెట్టలేదు. మీ దివ్యనేత్రం ఒకవేళ దివ్యనేత్ర దృష్టి స్థాయికి క్రింద తెరవబడితే, మీరు గోడల గుండా, ఒక మానవ దేహం గుండా వస్తువులు చూడగలిగినందువల్ల, సామాన్య మానవులు అతీంద్రియ శక్తులుగా పరిగణించే శక్తులు మీకు లభిస్తాయి. మేము మీ అందరికీ ఈ అతీంద్రియ శక్తిని విస్తారంగా ఇస్తే, మీ అందరి దివ్యనేత్రం ఈ స్థాయిలో తెరవబడితే, సామాన్య మానవ సంఘంలో అది తీవ్రమైన కలత రేపి, సామాన్య మానవ సంఘపు స్థితికి భంగం కలిగిస్తుంది: దేశ రహస్యాలకు భంగం కలుగుతుంది; ప్రజలు దుస్తులు ధరించినా, లేకున్నా ఒకటే, ఇంటి లోపల ఉండే మనుషులను బయటినించే చూడగలుగుతారు; దారిన పోతూ, లాటరీలో ఉన్న పెద్ద

బహుమతులను చూస్తే, వాటన్నిటినీ మీరే గెలుచుకోవచ్చు. అది అనుమతింప బడదు! అందరూ ఇది ఆలోచించండి: అందరి దివ్యనేత్రం దివ్యనేత్ర దృష్టి దగ్గర తెరవబడితే, అది ఇంకా మానవ సంఘం వలెనే ఉంటుందా? మానవ సంఘపు స్థితిని తీవ్రంగా కలచివెయ్యడం పూర్తిగా నిషిద్ధం. నేను నిజంగా మీ దివ్యనేత్రాన్ని ఆ స్థాయిలో తెరిపిస్తే, మీరు సరాసరి ఒక చీ గోంగ్ గురువు అయిపోగలరు. ఇంతకుముందు కొందరు వ్యక్తులు, చీ గోంగ్ గురువులు కావాలని కలలు కన్నారు. వారి దివ్యనేత్రం హఠాత్తుగా తెరుచుకుంటే, వారు, రోగులకు చికిత్స చెయ్యగలిగి ఉండేవారు. ఆ సందర్భంలో, నేను మిమ్మల్ని ఒక పాపపు మార్గంలోకి నడిపించినట్లు కాదా?

అప్పుడు, నేను మీ దివ్యనేత్రాన్ని ఏ స్థాయిలో తెరిపించాలి? నేను మీ దివ్యనేత్రాన్ని నేరుగా జ్ఞాననేత్ర దృష్టి స్థాయిలో తెరిపిస్తాను. ఒకవేళ, అంత కంటే ఎక్కువ స్థాయిలో తెరిపిస్తే, దానికి మీ షిన్ షిన్ స్థాయి సరిపోదు. అంతకంటే తక్కువ స్థాయిలో తెరిపిస్తే, అది మానవ సంఘపు స్థితిని తీవ్రంగా కలచివేస్తుంది. జ్ఞాననేత్ర దృష్టితో మీకు గోడల గుండా గాని, మానవ శరీరం గుండా గానీ చూడగలిగే శక్తి ఉండదు, కానీ మీరు ఇతర పరిమాణాలలో ఉండే దృశ్యాలను చూడగలుగుతారు. దీనివల్ల ఏ ప్రయోజనాలు కలుగుతాయి? అది సాధన పట్ల మీకు గట్టి నమ్మకాన్ని పెంచుతుంది. సామాన్య మానవులు చూడలేని దాన్ని మీరు నిజంగా చూడగలిగినప్పుడు, అది ఖచ్చితంగా ఉందని మీరు అనుకుంటారు. ప్రస్తుతానికి, మీరు దేనినైనా స్పష్టంగా చూడగలిగినా, లేకపోయినా ఫరవాలేదు, మీ దివ్యనేత్రం ఈ స్థాయిలో తెరవబడుతుంది, అది మీ సాధనకు మేలు చేస్తుంది. తన షిన్ షిన్‌ను మెరుగుపరచుకోవడంలో ఖచ్చితంగా ఉంటే, ఒక నిజమైన దాఫా సాధకుడు ఈ పుస్తకం చదవడం ద్వారా అదే ఫలితాన్ని పొందగలుగుతాడు.

దివ్యనేత్రపు స్థాయిని నిర్ణయించేది ఏమిటి? ఒకసారి మీ దివ్యనేత్రం తెరుచుకున్న తరవాత, మీరు ప్రతిదాన్ని చూడగలరనే నమ్మకమేమీ లేదు – అది అలా జరగదు. ఆ విషయంలో ఇంకా స్థాయుల విభజన ఉంటుంది. అయితే ఆ స్థాయులను నిర్ణయించేది ఏది? దీనికి మూడు కారకాలు ఉన్నాయి. మొదటిది, ఒక వ్యక్తి యొక్క దివ్యనేత్రానికి, లోపలినించి బయటికి వెళ్ళే

ఒక క్షేత్రం ఉండాలి, దీనిని మేము చీ యొక్క సారం అంటాము. దాని ప్రయోజనం ఏమిటి? అది ఒక టెలివిజన్ తెర లాంటిది: భాస్వరపు పూత లేనిదే, టెలివిజన్ మీట నొక్కినా, అది కేవలం వెలిగే విద్యుత్ దీపం వంటిది. దానికి వెలుగు మాత్రమే ఉండి, చిత్రాలు కనపడవు. భాస్వరపు పూత వల్ల, చిత్రాలు ప్రదర్శింపబడతాయి. నిజానికి ఇది సరైన ఉదాహరణ కాదు, ఎందుకంటే, టెలివిజన్ ఒక తెర ద్వారా చిత్రాలను చూపుతుండగా, మనం వస్తువులను నేరుగా చూడగలం. ఇంచుమించుగా అదీ అక్కడి ఉద్దేశం. కొద్దిపాటి ఈ చీ యొక్క సారం చాలా విలువైనది, అది పుణ్యమును శుద్ధి పరచడంవల్ల ఏర్పడిన శ్రేష్ట పదార్థంతో తయారైనది. సాధారణంగా ప్రతి వ్యక్తికి ఉండే చీ యొక్క సారం భిన్నంగా ఉంటుంది. పదివేలమందిలో బహుశా ఇద్దరు వ్యక్తులు ఒకటే స్థాయిలో ఉంటారు.

దివ్యనేత్రం యొక్క స్థాయి, నేరుగా మన విశ్వపు స్థాయిలోని ఫాకు అభివ్యక్తీకరణం. అది మానవాతీతమైనదీ, ఒక వ్యక్తి యొక్క షిన్ షిన్‌కు దగ్గర సంబంధం కలిగి ఉన్నట్టిది. ఒక వేళ ఒక మనిషి యొక్క షిన్ షిన్ స్థాయి తక్కువగా ఉంటే, అతడి స్థాయి తక్కువగా ఉంటుంది. తక్కువ స్థాయి షిన్ షిన్ వల్ల, ఈ వ్యక్తిలోని చీ యొక్క సారం చాలావరకు నశిస్తుంది. ఒక వ్యక్తి యొక్క షిన్ షిన్ స్థాయి ఉన్నతంగా ఉంటే, సామాన్య మానవ సంఘంలో అతడు బాల్యం నించి, పెద్దవాడైనంత కాలమూ, కీర్తి, లాభం, పరస్పర ఘర్షణలు, స్వలాభం, వివిధ మానవ సహజ సున్నిత భావనలు, వాంఛలకు అధిక ప్రాధాన్యత ఇవ్వక, ఉపేక్షించి ఉంటే, అతడి చీ సారం మెరుగైన విధంగా పరిరక్షింపబడి ఉండొచ్చు. దానివల్ల, అతడి దివ్యనేత్రం తెరవబడిన తరవాత అతడు అన్ని విషయాలను అతిస్పష్టంగా చూడగలుగుతాడు. ఆరేళ్ళలోపు బాలుని యొక్క దివ్యనేత్రం తెరచుకుంటే అతడు విషయాలను అతిస్పష్టంగా చూడగలుగుతాడు. అతడి దివ్యనేత్రం తెరవడం కూడా సులభం. నేను ఒక్కమాట చెప్తే, అది తెరచుకుంటుంది.

ఒక ప్రబలమైన ప్రవాహమూ లేదా, రంగులు కలిపే ఒక పెద్ద తొట్టి వంటిదీ అయిన సామాన్య మానవ సంఘం కలిగించే భావ కాలుష్యం వల్ల, మనుషులు సరైనవిగా భావించే విషయాలు తరచుగా తప్పులు అవుతాయి.

ప్రతి ఒక్కరికీ ఒక మంచి జీవితాన్ని గడపాలన్న కోరిక ఉండదా? మంచి జీవితాన్ని గడపాలని కోరుకోవడంవల్ల, ఇతరుల ప్రయోజనాలకు భంగం కలగవచ్చు, ఒక వ్యక్తిలోని స్వార్థపూరిత వాంఛలను ప్రేరేపించవచ్చు, ఇతరులకు కలిగే మేలు తీసేసుకోవచ్చు, లేదా ఇతరులను భయపెట్టడం లేదా వారికి హాని కలిగించవచ్చు. ఒక వ్యక్తి సామాన్య వ్యక్తుల నడుమ ఇతరులతో పోటీ పడి, స్వలాభానికై పోరాడతాడు. ఇది విశ్వ లక్షణానికి వ్యతిరేకంగా ప్రవర్తించినట్లు కాదా? అందువల్ల, మనుషులు సరైనదిగా భావించినది, తప్పనిసరిగా సరైనది కాకపోవచ్చు. ఒక బాలుడికి విద్య నేర్పేటప్పుడు ఒక వయోజనుడు తరచుగా "నువ్వు చాలా తెలివిగా ఉండడం నేర్చుకోవాలి" అని నేర్పుతూ ఉంటాడు, అందువల్ల భవిష్యత్తులో ఆ బాలుడు సామాన్య మానవసంఘంలో నిలదొక్కుకోగలడు. మన విశ్వదృక్పథంనించి చూసినట్లయితే, "చాలా తెలివి"గా ఉండడం అన్నది ప్రాథమికంగా తప్పు, ఎందుకంటే, మనం ప్రకృతిని అనుసరించి స్వలాభాన్ని ఉపేక్షించవలసిన అవసరం ఉంది. అతితెలివిగా ఉండి, అతడు స్వలాభానికై ప్రయత్నిస్తాడు. "నిన్ను ఎవరైనా బెదిరిస్తే, అతడి గురువుకు, తల్లిదండ్రులకు మొరపెట్టుకో", "నేల మీద డబ్బు కనిపిస్తే తీసేసుకో", అని ఆ బాలుడికి నేర్పించారు. బాల్యంనించి పెద్దయ్యే వరకు చాలా విషయాలు నేర్చుకొని, క్రమంగా సామాన్య మానవ సంఘంలో అతి స్వార్థపరుడిగా తయారవుతాడు. అతడు ఇతరులను తన స్వార్థానికి ఉపయోగించుకొని, తన పుణ్యాన్ని పోగొట్టుకుంటాడు.

ఒక వ్యక్తి పోగొట్టుకున్నంత మాత్రాన, పుణ్యం అనే ఈ పదార్థం, మాయమైపోదు. అది మరొక వ్యక్తికి మార్చబడుతుంది. కానీ ఈ చీ యొక్క సారం అదృశ్యం అవుతుంది. ఒక వ్యక్తి, బాల్యం నించి వయోజనుడు అయ్యే వరకు స్వార్థపరత్వంతో కేవలం లాభార్జనపట్ల తీవ్రవాంఛ కలిగియుండి, చాలా జిత్తులమారిగా తయారైతే, అతడి దివ్యనేత్రం తెరచుకున్న తరవాత సాధారణంగా అది పనిచెయ్యదు, లేదా విషయాలను స్పష్టంగా చూడలేదు. అయితే అప్పటినించి అది ఎన్నటికీ పనిచెయ్యదని దీని యొక్క అర్థం కాదు. ఎందుకని? ఎందుకంటే ఆధ్యాత్మిక సాధనాక్రమంలో మనం మన స్వస్వరూపానికి చేరుకోవడానికి ప్రయత్నిస్తూ, నిర్విరామ సాధనతో నిరంతరమూ ఆ నష్టాన్ని

పూరించుకుంటూ దానిని తిరిగి పొందగలుగుతాం. అందువలన ఒక వ్యక్తి తన షిన్ షిన్ పట్ల శ్రద్ధ వహించి తీరాలి. మేము సమగ్రమైన మెరుగుదల గురించి, సమగ్రమైన ఉన్నతి గురించి నొక్కి చెప్తాం. షిన్ షిన్‌ను పెంచుకుంటే, తక్కినవన్నీ దాన్ని అనుసరిస్తాయి. ఒకవేళ షిన్ షిన్‌ను పెంచుకోకపోతే, ఆ కొద్ది చీ సారాన్ని కూడా తిరిగి పొందలేం. ఇదే దాని నియమం.

రెండవ కారకం ఏమిటంటే, ఒక వ్యక్తి స్వంతంగా చీ గోంగ్‌ను సాధన చేస్తున్నప్పుడు కూడా, అతడికి ఉన్నతమైన జన్మ సంస్కారం ఉంటే, అతడి దివ్యనేత్రం తెరచుకోగలదు. తరచుగా, కొందరు వ్యక్తులు తమ దివ్యనేత్రం తెరచుకున్న క్షణంలో భయపడతారు. వారు ఎందుకు భయపడతారు? ఎందువల్లనంటే, సామాన్యంగా, జనులు అర్ధరాత్రి వేళలో, చీకటిగానూ, నిశ్శబ్దంగానూ ఉన్నప్పుడు సాధన చేస్తారు. ఒక వ్యక్తి సాధన చేస్తున్నప్పుడు హఠాత్తుగా, అతడి కళ్ళ ఎదుట భయంకరమైన ఒక పెద్ద కంటిని చూస్తాడు. అంతటి తీవ్రమైన భయం కలగడం అరుదు, ఆ తరవాత అతడు చీ గోంగ్ సాధనను చేసేందుకు సాహసించడు. అది ఎంత భయానకం! ఒక అతిపెద్ద కన్ను రెప్పలను మూస్తూ, తెరుస్తూ మీ వైపు చూస్తూ ఉంటుంది, పైగా అది అత్యంత స్పష్టంగా కనిపిస్తూ ఉంటుంది. దాని ఫలితంగా కొందరు దానిని అసుర నేత్రమనగా మరికొందరు బుద్ధనేత్రం మొదలైన పేర్లు పెడతారు. నిజానికి అది మీ నేత్రమే. సాధన అన్నది ఒక వ్యక్తి స్వంత ప్రయత్నాల మీద ఆధారపడి ఉండగా, గోంగ్ పరివర్తనను చేసేది మాత్రం అతడి గురువు అన్నమాట నిజం. గోంగ్ పరివర్తన ప్రక్రియ అంతా చాలా సంక్లిష్టంగా ఉంటూ, ఇతర పరిమాణాలలో జరుగుతుంది. ఆ శరీరం కేవలం మరియొక పరిమాణంలో మాత్రమే కాకుండా, అన్ని భిన్న పరిమాణాలలో మార్పు చెందుతుంది. అది మీరు స్వయంగా చేసుకోగలరా? మీరు చేయలేరు. ఈ విషయాలన్నీ గురువుచేత ఏర్పరచబడి, నిర్వహించబడతాయి. అందువల్లనే ఆధ్యాత్మిక సాధన ఒక వ్యక్తి స్వంత ప్రయత్నాల మీద ఆధారపడి ఉండగా గోంగ్ పరివర్తనను మాత్రం అతడి గురువు చేస్తారని చెప్పబడింది. మీరు కేవలం ఆ విధమైన కోరికను కలిగి ఉండి, దాని గురించి ఆ విధంగా ఆలోచించగలుగుతారు, కానీ ఆ పనులన్నీ నిజంగా చేసేది గురువే.

కొందరు వ్యక్తులు, తమ స్వంత సాధన ద్వారా తమ దివ్యనేత్రాన్ని తెరిపించుకుంటారు. మేము మీకున్న నేత్రాన్ని సూచిస్తాం గానీ, మీరు స్వంతంగా దానిని అభివృద్ధి చేసుకోలేరు. కొందరి గురువులు, ఆయా వ్యక్తుల దివ్యనేత్రం తెరుచుకొని ఉండడం గమనించి, వారికోసం ఒక కంటిని పరివర్తన చేస్తారు. దానినే నిజనేత్రం అంటారు. కొందరికి నిజానికి ఒక గురువు ఉండరు, అయితే ఒక గురువు వారి పక్కగా వెళ్ళడం సంభవించవచ్చు. బుద్ధ సిద్ధాంతం ప్రకారం: "బుద్ధులు సర్వ వ్యాపకులు". వారి సంఖ్య అనంతమైనది, వారు ప్రతిచోట ఉన్నారు. కొంతమంది: "ఆధ్యాత్మిక జీవులు ఒక వ్యక్తి తల మీద మూడు అడుగుల ఎత్తున ఉంటారు" అని కూడా అంటారు, అంటే అసంఖ్యాకంగా ఉంటారు అని అర్థం. మీ పక్కగా వెళ్తున్న ఒక గురువు, చక్కటి సాధన వలన మీ దివ్యనేత్రం తెరచుకొని ఉండడం చూసి, మీకు ఒక నేత్రం అవసరమని భావించి, ఆ స్త్రీ లేదా పురుషుడు మీ కోసం ఒక కంటిని పరివర్తన చేస్తారు, దాన్ని మీ సాధనకు ప్రతిఫలంగా కూడా పరిగణించవచ్చు. జనులకు ముక్తిని ప్రసాదించే విషయంలో, ఎటువంటి నిబంధన ఉండదు, వారు వెల, బహుమానం లేదా కీర్తి కోసం ఆశించరు. ఆ విధంగా వారు సామాన్య మానవుల యొక్క కథానాయకుల కంటే, మహా ఉదారులు. వారు కేవలం తమ ఉపకార బుద్ధితో కూడిన దయ కారణంగా అలా చేస్తారు.

ఒక వ్యక్తి యొక్క దివ్యనేత్రం తెరచుకున్న తరవాత, ఒక సందర్భం ఏర్పడుతుంది: అతడి కళ్ళు ఆ కాంతికి మిరుమిట్లు చెంది, చిరాకుకు గురి అవుతాయి. నిజానికి అది మీ కళ్ళను చిరాకు పెట్టడం లేదు. మీ కళ్ళు చిరాకు చెందుతున్నట్లు మీకు అనిపించినా, నిజానికి చిరాకుకు గురి అవుతున్నది మీ యొక్క వినాళ గ్రంథి. అలా ఎందుకంటే, మీరు ఇంకా ఆ కంటిని పొందలేదు. మీకు ఆ కన్ను ఇవ్వబడిన తరవాత, మీ భౌతిక నేత్రాలకు చిరాకు కలగదు. మన సాధకులలో చాలామంది దానిని అనుభూతి చెందడం లేదా చూడడం సాధ్యపడుతుంది. అది విశ్వ స్వభావాన్ని మూర్తీభవించుకొని ఉండడంవల్ల, చాలా అమాయకంగానూ, ఆసక్తిని కలిగియున్ను ఉంటుంది. మీ దివ్యనేత్రం తెరుచుకొని ఉందా అని, అది విషయాలను చూడగలుగుతున్నదా అని పరీక్ష చేస్తుంది. అది మీలోనికి కూడా చూస్తుంది. ఆ సమయంలో మీ దివ్యనేత్రం

తెరచుకొని ఉంది. నిజ నేత్రం మీవైపు చూస్తున్నప్పుడు, దానిని హఠాత్తుగా చూడడంవల్ల మీరు భయపడిపోతారు. నిజానికి ఇది మీ స్వంత కన్నే. ఇప్పటి నించి మీరు విషయాలను చూసినప్పుడు ఈ కంటి ద్వారా చూస్తారు. మీ దివ్యనేత్రం తెరుచుకొని ఉన్నప్పటికీ ఈ కన్ను లేకుండా మీరు విషయాలను చూడడం, పూర్తిగా అసాధ్యం.

మూడవ కారకం ఏమిటంటే, ఒక వ్యక్తి భిన్న స్థాయిలకు పురోగతి చెందినప్పుడు భిన్న పరిమాణాలలో వ్యక్తమయ్యే వ్యత్యాసాలు. అతడి స్థాయిని నిజంగా నిర్ణయించే ప్రధానమైన అంశం ఇదే. విషయాలను చూడడానికి, ప్రధాన మార్గంతో పాటు, మనుషులు అనేక ఉపమార్గాలను కూడా కలిగి ఉంటారు. బుద్ధ సిద్ధాంతంలో ప్రతి స్వేదరంధ్రమూ ఒక కన్ను అనే అభిప్రాయం ఉండగా, తావో సిద్ధాంతం శరీరంలోని ప్రతి రంధ్రమూ ఒక కన్ను అని వాదిస్తుంది. అంటే, ఆక్యుపంక్చర్ బిందువులన్నీ కళ్ళే. నిజానికి, ఫా శరీరంలో చేసే పరివర్తనలలోని ఒక్క రూపాన్ని గురించి మాత్రమే వారు చర్చిస్తున్నారు; ఒక వ్యక్తి తన శరీరంలోని ఏ భాగంనించి అయినా విషయాలను చూడగలడు.

మనం స్థాయి అని చెప్పుకుంటున్నది, దానికి భిన్నంగా ఉంటుంది. ప్రధానమార్గంతోపాటుగా అనేక ప్రధాన ఉపమార్గాలు చాలాచోట్ల ఉంటాయి, అవి – రెండు కనుబొమలకు పైగా, కంటిరెప్పలకు పైన, క్రింద, మరియు షాన్ ఘున్ (1) బిందువు. స్థాయులలో పురోగతి చెందడం అన్న అంశాన్ని అవి నిర్ణయిస్తాయి. ఒక సగటు సాధకుడు, ఈ వివిధ భాగాల నించి విషయాలను చూడగలిగితే, అతడు నిజంగా అప్పటికే ఒక అత్యున్నత స్థాయిని చేరుకున్నట్లే. కొంతమంది తమ భౌతిక నేత్రాలతో కూడా విషయాలను చూడగలుగుతారు. వివిధ రకాలైన అతీంద్రియ సామర్థ్యాలతో సమకూర్చ బడిన ఈ నేత్రాలను సాధనతో సంపాదించుకోవడంలో వారు కూడా సఫలత పొందారు. అయితే, ఒకవేళ ఈ కంటిని సద్వినియోగపరచుకోకపోతే, ఒక వ్యక్తి మరొక వస్తువును చూసే శక్తి లేకుండా, ఎప్పుడూ ఒక్క వస్తువునే చూడగలుగుతాడు. దీనివల్ల ఏ ప్రయోజనమూ ఉండదు. ఆ విధంగా, తరచుగా, కొందరు, ఒక కంటితో ఒకవైపు, మరొక కంటితో మరొకవైపు

చూస్తారు. అయితే, ఈ కన్ను నేరుగా ఫాతో సంబంధం కలిగి ఉండడంవల్ల, దీని (కుడికన్ను) క్రింద ఉపమార్గం లేదు. జనులు దుష్కర్మలు చేయడానికి, తమ కుడి కంటిని ఉపయోగించడం జరుగుతుంది; కాబట్టి కుడి కంటి క్రింద ఉపమార్గం లేదు. ఒక వ్యక్తి యొక్క త్రిలోకాంతర ఫా ఆధ్యాత్మిక సాధనా క్రమంలో అభివృద్ధి చెందే ప్రధాన ఉపమార్గాలను ఇవి సూచిస్తాయి.

ఒక అత్యున్నత స్థాయినీ, త్రిలోకాతీత ఫా ఆధ్యాత్మిక స్థాయిని చేరుకున్న తరవాత, ఒక సమ్మేళన నేత్రాన్ని పోలిన నేత్రం ఒకటి ఏర్పడుతుంది. ప్రత్యేకించి, ముఖంలోని పైభాగంలో అసంఖ్యాకమైన చిన్ని కన్నులు కూర్చబడిన ఒక అతిపెద్ద కన్ను ప్రత్యక్షం అవుతుంది. అత్యున్నత స్థాయులలో ఉన్న కొందరు మహాజ్ఞానులు ఎన్నో కళ్ళను సాధించారు, అవి వారి ముఖాలపై అంతటా ఉంటాయి. ఆ కళ్ళన్నీ, ఈ మహానేత్రం ద్వారానే విషయాలను చూస్తాయి, అవి తాము చూడాలనుకున్నవన్నీ చూడగలుగుతాయి. ఒక్క కడగంటి చూపుతో, అవి అన్ని స్థాయులనూ చూడగలుగుతాయి. ఈనాడు జంతు శాస్త్రవేత్తలు, కీటక శాస్త్రవేత్తలు ఈగల గురించి పరిశోధనలు నిర్వహిస్తున్నారు. ఈగ కన్ను అతిపెద్దది; సూక్ష్మదర్శిని ద్వారా దానిలో అసంఖ్యాకమైన చిన్ని కళ్ళు ఉన్నాయని తెలిసింది, దానిని ఒక సమ్మేళన నేత్రమని అంటారు. సాధకులు ఒక అత్యంత ఉన్నత స్థాయిని చేరుకున్న తరవాత, ఈ స్థితి ఏర్పడొచ్చు. ఇది సాధ్యపడాలంటే, ఒక వ్యక్తి, తథాగత స్థాయి కంటే చాలా రెట్లు ఉన్నతంగా ఉండాలి. అయినా ఒక సామాన్య వ్యక్తి దీనిని చూడలేడు. సగటు స్థాయిలో ఉండే జనులు కూడా దాని ఉనికిని చూడలేరు, అది మరొక పరిమాణంలో ఉన్నందువల్ల, వారు ఆ స్త్రీ లేదా పురుషుని ఒక సాధారణ వ్యక్తిని చూసినట్లే చూస్తారు. స్థాయులలోని పురోగతులను ఇది వివరిస్తుంది. అంటే, ఒక వ్యక్తి భిన్న పరిమాణాలను చేరుకోగలడా అన్నది ఇక్కడి చర్చనీయాంశం.

నేను మౌలికంగా దివ్యనేత్రపు ఆకృతిని, సంక్షిప్తంగా మీ అందరికీ తెలియజేశాను. మేము మీ దివ్యనేత్రాన్ని బాహ్యమైన శక్తితో తెరుస్తాము, కాబట్టి అది మీరు స్వయంగా తెరిపించుకున్న దానితో పోలిస్తే, త్వరగానూ, సులువుగానూ జరుగుతుంది. నేను దివ్యనేత్రాన్ని గురించి చెప్తున్నప్పుడు,

మీలో ప్రతి ఒక్కరూ మీ నుదురు బిగుసుకున్నట్లు అనుభూతి చెంది ఉంటారు; ఆ కండరాలన్నీ ఒకదానిమీద ఒకటి దొంతిగా ఏర్పడి, లోపలి వైపుకు తొలుస్తున్నట్లు మీకు అనిపించింది. అలా జరిగింది, కదా? అది అలా జరిగింది. మీరు ఇక్కడ ఫాలున్ దాఫాను నిజంగా మనసును లగ్నం చేసి అధ్యయనం చేసినంత కాలమూ, ప్రతి వారికి అలాగ అనిపిస్తుంది; లోపలికి తొలుస్తున్నప్పుడు ఆ బాహ్య శక్తి చాలా బలంగా వస్తుంది. దివ్యనేత్రాన్ని తెరిపించే ఆ ప్రత్యేకమైన శక్తిని నేను విడుదల చేశాను. అదే సమయంలో, మీ దివ్యనేత్రాన్ని సరిచేయడానికి నేను ఫాలున్‌ను కూడా పంపించాను. నేను దివ్యనేత్రాన్ని గురించి మాట్లాడుతుండగా, ఫాలున్ దాఫా ఆధ్యాత్మిక సాధన చేసేవారైతే, వారిలోని ప్రతిఒక్కరికీ దివ్యనేత్రాన్ని వరుసగా తెరిపించాను. అయినా, ప్రతిఒక్కరు విషయాలను స్పష్టంగా చూడడం, అందరూ దానితో విషయాలను చూడడం అన్నవి తప్పనిసరి కాదు. ఆ విషయం, నేరుగా మీపై, స్వయంగా మీపైనే ఆధారపడి ఉంటుంది. ఇదేమంత సమస్య కాదు, మీరు దానితో విషయాలను చూడలేనంతమాత్రాన ఏమీ జరగదు. దానిని సాధన చెయ్యడానికి మీకు కావలసినంత సమయం తీసుకోండి. మీరు నిరంతరం మీ స్థాయిని పెంచుకుంటూ ఉన్నప్పుడు, క్రమంగా, మీరు విషయాలను చూడడం సాధ్యపడుతుంది, మసకగా ఉన్న మీ దృష్టిలో, స్పష్టత అధికమవుతూ ఉంటుంది. మీరు ఆధ్యాత్మిక సాధనను కొనసాగించినంతవరకు, మీ ఆధ్యాత్మిక సాధన పట్ల దృఢచిత్తం కలిగి ఉన్నంత వరకూ, మీరు పోగొట్టుకున్నవన్నీ తిరిగి పొందుతారు.

మీరు స్వయంగా దివ్యనేత్రాన్ని తెరిపించుకోవడం కష్టం. ఒక వ్యక్తి స్వయంగా తన దివ్యనేత్రాన్ని తెరిపించుకోవడంలోని కొన్ని రకాల గురించి చెప్తాను. ఉదాహరణకు, కూర్చుని ధ్యానం చేస్తున్నప్పుడు, మీ నుదుటిని, దివ్యనేత్రాన్ని చూస్తున్నప్పుడు మీలో కొందరికి, నుదుటి లోపల చీకటిగా ఉన్నట్లు, అక్కడ ఏమీ లేనట్లు అనిపించవచ్చు. ఒక వ్యక్తి, కాలం గడిచిన కొద్దీ, తన నుదుటిలో క్రమంగా తెల్లగా అవుతున్నట్లు గ్రహిస్తాడు. కొంతకాలం ఆధ్యాత్మిక సాధన చేసిన తరవాత, క్రమంగా అతడు నుదుటి లోపల ప్రకాశ వంతం అవడం మొదలై, తరవాత ఎర్రగా మారినట్లు కనుగొంటాడు. ఆ

సమయంలో, టెలివిజన్‌లోగానీ, ఒక చలనచిత్రంలోగానీ ఒక్క క్షణంలో పూలు విచ్చుకున్నట్లు అది విచ్చుకుంటుంది. అటువంటి దృశ్యాలు ప్రత్యక్షం అవుతాయి. ఆ ఎరుపు రంగు చదునుగా మొదలై, హఠాత్తుగా అది మధ్యలో నిలబడి, ఆగకుండా తిరుగుతుంది. దానిని మీరే వికసింపచెయ్యాలనుకుంటే, ఎనిమిదినించి పది సంవత్సరాల కాలం కూడా సరిపోకపోవచ్చు, ఎందుకంటే ఆ దివ్యనేత్రం మొత్తం మూసుకుపోయి ఉంది.

అయితే, కొందరిలో దివ్యనేత్రాలకు అడ్డంకి ఉండదు, అవి ఒక మార్గాన్ని కలిగి ఉంటాయి. కానీ, దానికి అక్కడ ఎటువంటి శక్తి ఉండదు, ఎందుకంటే, ఆ వ్యక్తులు అంతకు ముందు చీ గోంగ్‌ను అభ్యసించలేదు. అందువల్ల, వారు చీ గోంగ్ సాధన మొదలుపెట్టినప్పుడు, ఒక నల్లని పదార్థపు గోళం హఠాత్తుగా వారి కళ్ళ ఎదుట ప్రత్యక్షం అవుతుంది. కొంతకాలం అభ్యాసం చేసిన తరవాత, అది క్రమంగా తెల్లగా మారి, తరవాత ప్రకాశవంతం అవుతుంది. చివరకు అది ఇంకా ప్రకాశవంతం అవుతూ ఉండి, వారి కళ్ళు కొంచెం చెదురుతాయి. అందువల్ల, కొందరు “నేను సూర్యుని చూశాను” అని లేదా “నేను చంద్రుని చూశాను” అంటారు. నిజానికి వారు సూర్యునిగానీ, చంద్రునిగానీ చూడలేదు. అయితే, వారేం చూశారు? అది వారి లోపల ఉన్న మార్గం. కొంతమంది తమ స్థాయిలలో అతివేగంగా పురోగతి సాధిస్తారు. ఆ కన్ను అమరిన తరవాత, వారు విషయాలను నేరుగా చూడగలుగుతారు. ఇతరులకు అది చాలా కష్టం. వారు చీ గోంగ్‌ను అభ్యసించినప్పుడు, ఒక సొరంగం లేదా బావి వంటి ఈ మార్గం వెంబడి బయటికి పరుగెత్తుతున్న అనుభూతిని పొందుతారు. నిద్రలో కూడా వారికి బయటకు పరుగెత్తుతున్నట్లు అనిపిస్తుంది. కొందరు గుర్రపు స్వారీ చేస్తున్నట్లుగానూ, కొందరు ఎగురుతున్నట్లుగానూ కొందరు పరుగెత్తు తున్నట్లుగానూ మరికొందరు కారులో ముందుకు దూసుకుపోతున్నట్లుగానూ అనుభూతి పొందుతారు. ఒక వ్యక్తి స్వయంగా దివ్యనేత్రాన్ని తెరిపించుకోవడం చాలా కష్టం గనక, తాము ఎప్పటికీ చివరి వరకు దూసుకుపోలేమని వారికి అనిపిస్తుంది. తావో సిద్ధాంతం మానవ దేహాన్ని ఒక సూక్ష్మ విశ్వంగా పరిగణిస్తుంది. అది ఒక సూక్ష్మ విశ్వమైతే, దీని గురించి ఆలోచించండి, నుదుటినించి వినాళగ్రంథికి నడుమనున్న దూరం 108 వేల లీ (2).

అందువల్ల, ఒక వ్యక్తి ఎప్పుడూ బయటకు దూసుకుపోతున్నా, దాని చివరకు చేరుకోలేనట్లు అనుభూతి చెందుతాడు.

తావో సిద్ధాంతం మానవ దేహాన్ని ఒక సూక్ష్మ విశ్వంగా పరిగణించడం చాలావరకు సబబే. దాని యొక్క కూర్పు, ఆకృతి విశ్వంవలె ఉన్నాయని దీనికి అర్థం కాదు, అది మన భౌతిక పరిమాణంలో ఉన్న దేహపు ఆకారాన్ని సూచించడమూ లేదు. "ఆధునిక విజ్ఞానశాస్త్రపు అవగాహనను అనుసరించి, ఒక అతిసూక్ష్మస్థాయిలో, జీవకణాలతో తయారైన మానవ దేహం యొక్క స్థితి ఏమిటి?" అని మేము అడుగుతాము. అందులో భిన్న పరమాణు సమూహాలు ఉన్నాయి. పరమాణువులకన్నా చిన్నవి అణువులు, ప్రోటాన్లు, కేంద్రకాలు, ఎలెక్ట్రాన్లు, క్వార్క్లు. ఇప్పుడు అధ్యయనం చెయ్యబడుతున్న అతిసూక్ష్మమైన రేణువులు న్యూట్రినోలు. అయితే, అత్యంత సూక్ష్మమైన రేణువు ఏది? దానిని అధ్యయనం చెయ్యడం నిజంగా చాలా కష్టం. తన చివరి సంవత్సరాలలో శాక్యముని "అది ఎంత పెద్దదంటే దానికి వెలుపలి అంచు లేదు, అది ఎంత చిన్నదంటే, దానికి లోపలి అంచు లేదు" అని ఒక వ్యాఖ్య చేశారు. దాని అర్థమేమిటి? తథాగత స్థాయిలో, విశ్వం ఎంత పెద్దదంటే, దాని సరిహద్దు ఊహకు అందనిది, అయినా, ఎంత చిన్నదంటే, దాని పదార్థపు అతిసూక్ష్మమైన రేణువులు కూడా ఊహకు అందనివి. ఫలితంగా ఆయన "అది ఎంత పెద్దదంటే, దానికి వెలుపలి అంచు లేదు, ఎంత చిన్నదంటే దానికి లోపలి అంచు లేదు" అని వ్యాఖ్యానించారు.

శాక్యముని మూడువేల లోకాల సిద్ధాంతం గురించి కూడా చెప్పారు. మన విశ్వంలోనూ, పాలపుంతలో కూడా, మన మానవజాతి వంటి భౌతిక శరీరాలు కలిగిన ప్రాణులు నివసించే మూడువేల గ్రహాలున్నాయని, ఆయన చెప్పారు. ఒక్క ఇసుకరేణువులో అటువంటి మూడువేల లోకాలు ఉండేవని కూడా ఆయన చెప్పారు. ఆ విధంగా ఒక ఇసుకరేణువు, మన మానవులవలెనే జ్ఞానం కలిగిన మనుషులు, గ్రహాలు, పర్వతాలు, నదులతో కూడి ఉండి, అచ్చంగా ఒక విశ్వం వంటిదే. అది పూర్తి కల్పనగా ధ్వనిస్తుంది! అలా అయి ఉంటే, అందరూ దీని గురించి ఆలోచించండి: అయితే, ఆ మూడువేల లోకాలలో, ఇసుక ఉందా? అయితే, ఆ ఇసుకలోని ఒక రేణువులో, ఇంకా

మూడువేల లోకాలున్నాయా? దాని ప్రకారం, ఒక వ్యక్తి, తథాగత స్థాయిలో దాని చివరి అంచును చూడలేడు.

మానవ పరమాణు సమూహ కణాల విషయంలో కూడా ఇలాగే ఉంటుంది. జనులు, విశ్వం ఎంత పెద్దగా ఉందని అడుగుతారు. ఈ విశ్వానికి కూడా తనదైన సరిహద్దు ఉందని నేను చెప్తున్నాను. అయితే, ఒక వ్యక్తి తథాగత స్థాయిలో ఉన్నప్పటికీ దానిని హద్దు లేనిదిగా, హద్దులేని మహా అనంతంగా పరిగణిస్తాడు. అయినా, మానవ శరీర అంతర్భాగం విశ్వమంత పెద్దది, పరమాణువుల నుండి సూక్ష్మస్థాయిలో సూక్ష్మమైన రేణువుల వరకు కలిగి ఉంది. ఇది చాలా ఊహాతీతంగా ధ్వనించవచ్చు. ఒక మానవుడు గానీ, ఒక ప్రాణి గానీ సృష్టింపబడినప్పుడు, అతడి జీవితానికి ప్రత్యేకించబడి ఉన్న జీవ మూలపదార్థాలూ, ప్రధాన గుణమూ అంతకు ముందే అత్యంత సూక్ష్మ స్థాయిలో కూర్చబడి ఉన్నాయి. ఆ విధంగా, ఈ అంశాన్ని అధ్యయనం చేసే విషయంలో, ఆధునిక విజ్ఞానశాస్త్రం ఎంతో వెనుకబడి ఉంది. సమస్త విశ్వం అంతటనూ గ్రహాలలో ఉండే మహాజ్ఞానులతో పోల్చినప్పుడు, మన మానవజాతి యొక్క విజ్ఞానశాస్త్ర స్థాయి అత్యల్పం. ఇతర గ్రహాలనించి ఎగిరే పళ్ళాలు నేరుగా ఇతర పరిమాణాలలో ప్రయాణించగలుగుతుండగా, మనం ఒకేచోట ఒకే సమయంలో ఉన్న ఇతర పరిమాణాలను కూడా చేరుకోలేకపోతున్నాము. అక్కడ ఉండే దేశ కాలాల భావన పూర్తిగా భిన్నం. అందువల్ల, కోరినప్పుడల్లా అవి మానవ మేధస్సు అంగీకరించలేని వేగంతో, వచ్చి వెళ్ళగలవు.

దివ్యనేత్రం విషయం గురించి చెప్తూ, మీరు ఒక మార్గం వెంబడి బయటకు దూసుకుపోతున్నట్లు అనుభూతి చెందుతున్నప్పుడు, అది హద్దులు లేనిదిగా, ముగింపు లేనిదిగా మీకు అనిపిస్తుందన్న విషయం నేను ప్రస్తావించాను. కొంత మంది మరొక విధమైన స్థితిని ఎదుర్కొంటారు; అక్కడ వారు ఒక సొరంగం వంటి మార్గం వెంబడి దూసుకుపోతున్నట్లు కాక, హద్దులు లేని అంతం లేని ఒక రహదారి వెంట దూసుకుపోతున్నట్లు అనుభూతి చెందుతారు. అలా బయటకు దూసుకుపోతున్నప్పుడు, రెండు వైపులా పర్వతాలు, నదులు, నగరాలు ఉంటాయి. ఇది ఇంకా ఊహాతీతంగా ధ్వనించవచ్చు. ఒక చీ గోంగ్ గురువు చేసిన వ్యాఖ్య నాకు గుర్తు వస్తున్నది,

అది “మానవదేహంలోని ప్రతి స్వేదరంధ్రంలోనూ ఒక నగరం ఉంది, దానిలో కార్లూ, రైళ్ళూ కూడా పరుగెత్తుతున్నాయి”. ఇది విని, తక్కిన వ్యక్తులు, ఆశ్చర్య చకితులైపోయి, అది ఒక కల్పన అనుకుంటారు. పదార్థంలోని సూక్ష్మమైన రేణువులలో పరమాణువులు, అణువులు, ప్రోటాన్లు ఉంటాయని మీకు తెలుసు. మరింతగా పరిశోధనను కొనసాగించి, ఒక్కొక్క స్థాయిని ఒక బిందువుగా కాకుండా, ఒక సమతల ప్రదేశంగా చూడగలిగితే, పరమాణు సమూహాల సమతలం, అణువుల సమతలం, ప్రోటాన్ల సమతలం, కేంద్రకాల సమతలాన్ని చూసినట్లైతే, మీరు భిన్న పరిమాణాలలో ఉన్న రూపాలను చూస్తారు. మానవ దేహంతో సహా, సమస్త పదార్థమూ, ఒకే సమయంలో, విశ్వాంతర్భాగంలోని పరిమాణముల స్థాయులతో అనుసంధానమై ఉంటుంది. మన ఆధునిక భౌతికశాస్త్రం, పదార్థంలోని సూక్ష్మమైన రేణువుల గురించి అధ్యయనం చేసినప్పుడు, దానిని ఖండించి లేదా విచ్ఛేదన చేయడం ద్వారా మాత్రమే అధ్యయనం చేస్తుంది. అణువిచ్ఛేదనం చేసిన తరవాత, దానిలో ఉన్న మూల పదార్థాలను అధ్యయనం చేస్తుంది. మనం, అన్ని అణు మూలపదార్థాలు, పరమాణు మూలపదార్థాలు తమ సంపూర్ణ రూపంలో వ్యక్తమయ్యే స్థాయిని విస్తరింపజేసి చూడగలిగే పరికరమే మనకు ఉంటే, లేదా ఈ దృశ్యం చూడగలిగితే, మీరు ఈ పరిమాణం ఆవలకు చేరుకొని, ఇతర పరిమాణాలలో ఉండే నిజమైన దృశ్యాలను చూస్తారు. మానవ దేహం బాహ్య పరిమాణాలకు అనురూపంగా ఉంటుంది, వాటన్నిటిలోనూ అటువంటి రూపాలుంటాయి.

ఒక వ్యక్తి తన దివ్యనేత్రాన్ని స్వయంగా తెరిపించుకున్నప్పుడు మరికొన్ని భిన్నమైన పరిస్థితులు ఏర్పడతాయి. మేము ప్రధానంగా, కొన్ని అతిసాధారణ పరిణామాల గురించే చెప్పాం. కొంతమందికి తమ దివ్యనేత్రం గుండ్రంగా తిరుగుతున్నట్లు కూడా తెలుస్తుంది. తావో సిద్ధాంతం ప్రకారం సాధన చేసేవారు, తరచుగా తమ దివ్యనేత్రం లోపల ఏదో తిరుగుతున్నట్లు చూస్తారు. తాయిజీ ప్లేట్ అన్నది హఠాత్తుగా ఫెళ్ళుమన్న శబ్దంతో తెరుచుకున్నప్పుడు, ఒక వ్యక్తి చిత్రాలను చూస్తాడు; అయితే, దీని అర్థం, మీ తలలో ఒక తాయిజీ ఉందని కాదు. మీకోసం మొట్టమొదట కొన్ని వస్తువులను అమర్చినవారు మీ గురువు, వాటిలో తాయిజీ ఒకటి. ఆయన మీ దివ్యనేత్రాన్ని మూసివేశారు.

మీ దివ్యనేత్రం తెరుచుకునే సమయానికి అది ఫెళ్ళున తెరుచుకుంటుంది. గురువు ఉద్దేశపూర్వకంగానే దాన్ని ఆ విధంగా అమర్చారు, అది ముందుగా మీ తలలో ఉండినది కాదు.

అయినప్పటికీ, కొంతమంది దివ్యనేత్రాన్ని తెరవాలని ప్రయత్నిస్తూనే ఉంటారు. దానికోసం ఎంత అధిక సాధన చేస్తే, అది తెరుచుకోవడం అంత అసాధ్యమవుతూ ఉంటుంది. దానికి కారణం ఏమిటి? అది వారికే తెలియదు. దానికి ప్రధాన కారణం, ప్రయత్నాలతో దివ్యనేత్రం లభించదు; ఒక వ్యక్తి దాని కోసం ఎంత తాపత్రయపడితే, అతడు అంత తక్కువ పొందుతాడు. ఒక వ్యక్తి దానికోసం నిరాశోపహతుడై (నిరాశ చేత దెబ్బ తిన్నవాడై) ప్రయత్నించిన కొద్దీ, అది తెరుచుకోకపోవడం అటుంచి, దానికి మారుగా నలుపు తెలుపు కాని పదార్థం ఏదో, అతడి దివ్యనేత్రంనించి బయటకు వస్తుంది. అది అతడి దివ్యనేత్రాన్ని పూర్తిగా కప్పి వేస్తుంది. కాలం గడిచేకొద్దీ, అది ఒక అతిపెద్ద క్షేత్రంగా ఏర్పడుతుంది. అది ఎంత ఎక్కువగా ముందుకు ప్రవహిస్తే అంత పోగుపడుతుంది. దివ్యనేత్రం తెరుచుకోవడం కష్టమైనకొద్దీ, దాని కోసం అతడు అంత ఎక్కువగా ప్రయత్నిస్తాడు, ఆ పదార్థమూ అంత ఎక్కువగా బయటికి వస్తుంది. ఫలితంగా అది అతడి శరీరం అంతటినీ ఎంతగా కప్పి వేస్తుందంటే, అది ఒక అతిపెద్ద క్షేత్రం కలిగి చాలా మందంగా ఏర్పడుతుంది. ఒకవేళ ఈ వ్యక్తి యొక్క దివ్యనేత్రం నిజంగా తెరుచుకున్నప్పటికీ, అతడి యొక్క బంధంవల్ల, అది మూసివేయబడిన కారణంగా, అతడు దేనినీ చూడలేడు. అతడు భవిష్యత్తులో దాని గురించి ఏ మాత్రమూ ఆలోచన చేయకుండా, ఆ బంధాన్ని పూర్తిగా వదలిపెడితే, అది క్రమంగా అదృశ్యం అవుతుంది. దాన్ని పూర్తిగా తొలగించాలంటే, చాలా బాధాకరమైనట్టి దీర్ఘకాల ఆధ్యాత్మిక సాధన అవసరం అవుతుంది. ఇది ఏ మాత్రం అవసరం లేదు. కొందరికి అది తెలియదు. దాని వెంటపడవద్దనీ, ప్రయత్నమూ చెయ్యవద్దని, గురువు చెప్పినా, వారు ఆ మాటను నమ్మరు. వారు ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉంటారు, చివరకు, ఫలితాలు సరిగ్గా వ్యతిరేకంగా వస్తాయి.

# దూరదృష్టి అనే అతీంద్రియ సామర్థ్యం

దివ్యనేత్రానికి నేరుగా సంబంధం కలిగిన ఒక అతీంద్రియ సామర్థ్యాన్ని దూరదృష్టి అంటారు. "ఇక్కడ కూర్చొని ఉండి, బీజింగ్, అమెరికాలలోని దృశ్యాలను, భూమికి ఆవల ఉన్న దృశ్యాలను కూడా చూడగలను" అని కొందరు చెప్పుకుంటారు. కొందరు దీన్ని అవగాహన చేసుకోలేరు; విజ్ఞాన శాస్త్రపరంగా దీనిని వివరించటం కూడా కుదరదు. ఇది ఎలా సాధ్యం? కొందరు ఏదో ఒక రకంగా దీన్ని వివరించాలని ప్రయత్నిస్తారు గానీ, అర్థవంతంగా వివరించలేరు. మనుషులకు ఇటువంటి సామర్థ్యం ఉండడం ఎలా సాధ్యం? అని వారు ఆశ్చర్యపోతారు. ఇది అలా కాదు. త్రిలోకాంతర ఫా ఆధ్యాత్మిక సాధన స్థాయిలో ఉన్న సాధకునికి ఈ సామర్థ్యం ఉండదు. అతడు చూడగలిగినవి, దూరదృష్టితోపాటు ఇంకా ఎన్నో అతీంద్రియ సామర్థ్యాలు, ఒక ప్రత్యేక పరిమాణంలోనే పనిచేస్తాయి. ఎంత ఎక్కువగా ఉన్నా, అవి మన మానవ జాతి ఉన్న భౌతిక పరిమాణాన్ని దాటి ఉండవు. ఒక రకంగా చెప్పాలంటే, అవి ఆ వ్యక్తి యొక్క పరిమాణ క్షేత్రాన్ని కూడా దాటవు.

ఒక ప్రత్యేక పరిమాణంలో, మానవ శరీరానికి, పుణ్యం యొక్క క్షేత్రానికి భిన్నమైన ఇంకొక క్షేత్రం కూడా ఉంటుంది. అవి ఒకే పరిమాణంలో లేకపోయినా, ఒకే కొలతలో ఉంటాయి. ఈ క్షేత్రం విశ్వమునకు అనురూపంగా ఉంటుంది. విశ్వంలో ఉన్నవన్నీ, తదనుగుణంగా ఇక్కడ ప్రతిబింబిస్తుంది. ప్రతి వస్తువు ప్రతిబింబించగలదు. అది ఒక రకమైన ప్రతిరూపమే కానీ నిజం కాదు. ఉదాహరణకు, ఈ ప్రపంచంలో అమెరికా, వాషింగ్టన్ డీ.సీ. ఉన్నాయి. ఒక వ్యక్తి యొక్క క్షేత్రంలో అవి ప్రతిబింబిస్తాయి కానీ అవి వాటి ప్రతిరూపాలు మాత్రమే. అయితే అవి ప్రతిబింబ రూపాలైనా కూడా పదార్థపు ఉనికిని తెలియజేసే ఆకారాలు. అక్కడ జరిగే మార్పులకు అనుగుణంగా ఇక్కడ అవి మారుతూ ఉంటాయి. అందువల్ల, కొందరు చెప్పే దూరదృష్టి అనే అతీంద్రియ సామర్థ్యం, ఒక వ్యక్తి యొక్క స్వంత పరిమాణ క్షేత్రం లోపలి విషయాలను చూడడం. ఒక వ్యక్తి, త్రిలోకాతీత ఫా ఆధ్యాత్మిక సాధనను అభ్యసిస్తున్నప్పుడు ఈ విధంగా విషయాలను చూడడు. అతడు విషయాలను

నేరుగా చూస్తాడు, దానిని బుద్ధ ఫా యొక్క దివ్యశక్తి అంటారు. అది అత్యంత శక్తివంతమైనది.

త్రిలోకాంతర ఫా ఆధ్యాత్మిక సాధనలో దూరదృష్టి అనే అతీంద్రియ సామర్థ్యం అంటే ఏమిటి? మీ అందరికోసం నేను వివరించబోతున్నాను. ఈ క్షేత్రంలో, ఒక వ్యక్తి నుదురులో ఒక దర్పణం ఉంటుంది. సాధకుడు కాని వ్యక్తిలో అది తన వైపుకు తిరిగి ఉంటుంది. కానీ, ఒక సాధకుడికి, బయటి వైపుకు తిరిగి ఉంటుంది. ఒక వ్యక్తిలో దూరదృష్టి అన్న అతీంద్రియ సామర్థ్యం వెలువడే సమయంలో అది ముందుకూ, వెనకకు తిరుగుతూ ఉంటుంది. ఒక చలనచిత్రంలో క్షణానికి ఇరవైనాలుగు ఫ్రేములు చూపిస్తూ ఉంటేనే దృశ్యాలు కొనసాగుతూ ఉంటాయి. ఒక క్షణానికి ఇరవైనాలుగు ఫ్రేములకన్నా తక్కువ ఫ్రేములు చూపిస్తే బొమ్మలు ఎగురుతూ, గంతులు వేస్తున్నట్లు కనిపిస్తుంది. ఆ అద్దం క్షణానికి ఇరవైనాలుగు ఫ్రేములకన్నా అధిక భ్రమణవేగంతో తిరుగుతూ, కనిపించిన వాటి ప్రతిబింబాలను గ్రహిస్తూ, మీకు కనబడేట్లు తిరుగుతుంది. అది మళ్ళీ వెనకకు తిరిగినప్పుడు ఆ ప్రతిబింబాలు, తొలగింప బడతాయి. అది ప్రతిబింబాలను చూపించి, వెనక్కు తిరిగి, ప్రతిబింబాలను తొలగిస్తుంది. అది నిరంతర భ్రమణంలో ఉంటుంది. అందువల్ల, మీరు చూస్తున్నదంతా కదులుతూ ఉంటుంది. అది మీ స్వంత పరిమాణపు క్షేత్రం లోపల ప్రతిబింబించే విషయాన్ని చూసేలా చేస్తుంది, అది ఈ మహావిశ్వంలో ఉన్నవాటికి అనుగుణంగా ఉంటుంది.

అటువంటప్పుడు, ఒక వ్యక్తి, తన శరీరం వెనకవైపు ఏమున్నదో, ఎలా చూడగలుగుతాడు? అంత చిన్న అద్దం ద్వారా, ఒక వ్యక్తి యొక్క శరీరం, చుట్టూ ఉన్న ప్రతిదానిని ఎలా ప్రతిబింబింప చేయగలదు? ఒక వ్యక్తి యొక్క దివ్యనేత్రం తెరవబడి, దివ్యనేత్ర దృష్టిని దాటి, జ్ఞానదృష్టిని చేరుకోబోయే టప్పుడు, మన పరిమాణమునకు ఆవలివైపుకు చేరువ అవుతుందని మీకు తెలుసు. పురోగతి అన్నది తప్పనిసరి అయిన ఈ సమయంలో దివ్యనేత్రం ఒక మార్పును అనుభవిస్తుంది. అది భౌతికమైన వస్తువులను చూసినప్పుడు, అవన్నీ మాయం అవుతాయి. మనుషులు, గోడలు, అన్నీ మాయం అవుతాయి– ప్రతిదీ మటుమాయం అవుతుంది. భౌతికమయిన ఉనికి ఏమాత్రమూ

ఉండదు. అంటే, మీరు దగ్గరగా చూసినప్పుడు, ఈ ప్రత్యేక పరిమాణంలో, మనుషులు ఉండరు; మీ పరిమాణ క్షేత్రం ఉన్నంత మేర, కేవలం ఒక అద్దం నిలబడి ఉంటుంది. అయితే, మీ పరిమాణ క్షేత్రం ఎంత పెద్దగా ఉంటుందో, అందులో ఉన్న అద్దం కూడా అంత పెద్దగా ఉంటుంది. అందువల్ల, అది ముందుకు, వెనకకు తిరిగినప్పుడు, ప్రతిచోట ఉన్న ప్రతిదానిని ప్రతిబింబిస్తుంది. మీ పరిమాణ క్షేత్రంలో, విశ్వానికి, అనుగుణంగా ఉన్న పక్షంలో, ప్రతి వస్తువునూ చూపగలుగుతుంది. ఇదే మనం చెప్పే దూరదృష్టి అన్న అతీంద్రియ సామర్థ్యం.

మానవ శరీరశాస్త్రం అభ్యసించేవాళ్ళు, ఈ అతీంద్రియ సామర్థ్యాన్ని పరీక్షించినప్పుడు, సాధారణంగా, ఈ విషయాన్ని అతి తేలిగ్గా తీసిపడేస్తారు. ఆ నిరాకరణకు కారణం ఇలా ఉంటుంది. ఉదాహరణకు ఒక వ్యక్తిని ఎవరయినా, బీజింగ్‌లో ఉన్న తమ బంధువు పేరు, వివరాలు చెప్పి, "ఆమె ఇంట్లో ఏమి చేస్తున్నది?" అని అడిగినప్పుడు, ఆ వ్యక్తి ఆమెని చూడగలుగుతాడు. అతడు ఆ భవనం ఎలా ఉందో, ద్వారంలోనికి ఎలా వెళ్ళాలో, గదిలోనికి వెళ్ళాక అందులో ఏయే సామాన్లున్నాయో వర్ణించి చెప్తాడు. అతడు చెప్పిన దంతా సరైనదే. ఆ బంధువు ఏం చేస్తున్నది? ఆమె ఏదో రాస్తున్నదని, అతడు చెప్తాడు. అది నిజమో కాదో తెలుసుకోవడానికి, ఆ బంధువుకు ఫోన్ చేసి, "మీరేమి చేస్తున్నారు?" అని అడిగినప్పుడు, "నేను భోజనం చేస్తున్నాను" అని చెప్తుంది. ఆమె చెప్పినది, అతడు చెప్పిన దానికి వ్యతిరేకంగా ఉంది కదా? గతంలో, ఈ అతీంద్రియ సామర్థ్యాన్ని గుర్తించకపోవడానికి కారణం ఇదే. అయితే, అతడు చూసిన పరిసరాలు మాత్రం ఏమాత్రం భిన్నంగా లేవు. ఎందుకంటే, మనం "దేశ కాలాలు" అని చెప్పుకునే, మన దేశము మరియు కాలము ఆ అతీంద్రియ సామర్థ్యం ఉన్న పరిమాణంలోని దేశ కాలాలకు భిన్నంగా ఉండడంవల్ల, రెండుచోట్ల కాలం అన్న భావన భిన్నంగా ఉంటుంది. ఆమె అంతకు ముందు ఏదో రాస్తూ ఉన్నది, ఇప్పుడు భోజనం చేస్తున్నది; అక్కడ, కాలంలో అటువంటి తేడా ఉంది. దీని ఫలితంగా, మానవ శరీరాన్ని పరిశోధించేవాళ్ళు, ఊహాజనితమయిన నిర్ణయాలు చేసి, సాంప్రదాయిక సిద్ధాంతాలనూ, ఆధునిక విజ్ఞానశాస్త్రం ఆధారంగా పరిశోధనలు చేసినట్లైతే,

ఇంకొక పదివేల సంవత్సరాలకైనా వారి ప్రయత్నాలు వ్యర్థమే. ఎందుకంటే మొదటగా, ఇవన్నీ సామాన్య మానవులకు అందుబాటులో లేనివి. అందువల్ల, మానవజాతి, తన ఆలోచనారీతిని మార్చుకొని, ఈ విషయాలను, ఇక ముందు ఈ విధంగా ఆలోచించకూడదు.

## భూత భవిష్యత్తులను గురించి తెలుసుకోగలిగిన అతీంద్రియ సామర్థ్యం

దివ్యనేత్రానికి నేరుగా సంబంధించిన మరొక అతీంద్రియ సామర్థ్యం, భూత, భవిష్యత్తులను తెలుసుకోవడం. ఈనాడు ప్రపంచంలో దివ్యనేత్రం, దూరదృష్టి, భూత, భవిష్యత్తులను చెప్పడం అన్న సామర్థ్యాలతో కలిపి ఆరు అతీంద్రియ సామర్థ్యాలు ప్రజలలో గుర్తించబడి ఉన్నాయి. భూత భవిష్యత్తులను తెలుసుకోవడం అంటే ఏమిటి? అంటే ఒక వ్యక్తి మరొక వ్యక్తి యొక్క భవిష్యత్తును, గతాన్ని గురించి తెలుసుకోగలిగిన సామర్థ్యం. బలమైన ఇటువంటి సామర్థ్యాలను కలిగిన వ్యక్తి ఒక సమాజం యొక్క ఉత్థాన, పతనాలను గురించి చెప్పగలుగుతాడు. ఇంకా అధిక సామర్థ్యం కలిగి ఉంటే, అతడు విశ్వంలోని అన్ని మార్పులు ఏ నియమమును అనుసరించి జరుగుతాయో చూడగలుగుతాడు. ఇదే భూత భవిష్యత్తులను తెలుసుకోగల అతీంద్రియ సామర్థ్యం. ఒక ప్రత్యేక పరిమాణంలో, పదార్థము, ఒక నిర్దిష్ట సూత్రాన్ని అనుసరించి కదులుతూ ఉండడం వలన, అనేక ఇతర పరిమాణాలలో కూడా ఆ పదార్థానికి, ఒక రూపం ఉంటుంది. ఉదాహరణకు, ఒక వ్యక్తి శరీరం కదులుతున్నప్పుడు, ఆ శరీరంలోని జీవకణాలన్నీ కూడా కదులుతూ ఉంటాయి. సూక్ష్మస్థాయిలో ఉన్నట్టి అన్ని పరమాణు సమూహములు, ప్రోటాన్లు, ఎలెక్ట్రాన్లు, ఇంకా అతిసూక్ష్మమైన నలుసులు మొదలయిన మూలపదార్థాలు కూడా కదులుతూ ఉంటాయి. అయినా, అవి స్వతంత్రమైన ఆకృతులు కలిగి ఉండి, ఇతర పరిమాణాలలో గల శరీరాల రూపాలు కూడా మారుతుంటాయి.

పదార్థం నశించదని, మనం చెప్పుకున్నాం కదా? ఒక ప్రత్యేక పరిమాణంలో ఒక వ్యక్తి చేసిన పని, అతడు చేతి కదలికతో ఏమి చేశాడు

అన్నవి పదార్థం యొక్క ఉనికే, అతడు చేసినది ఒక భావచిత్రంగానూ, సందేశంగానూ వదిలిపెడుతుంది. అది ఇతర పరిమాణంలో నశించక, శాశ్వతంగా ఉండిపోతుంది. అతీంద్రియ సామర్థ్యం కలిగిన ఒక వ్యక్తి, ఇప్పుడు ఉన్న ఆ చిత్రాలను చూసి, గతంలో జరిగినది చెప్పగలుగుతాడు. రాబోయే కాలంలో, మీరు భూత భవిష్యత్తులను చెప్పగలిగే అతీంద్రియ సామర్థ్యాన్ని పొందిన తరువాత, నేటి నా ఉపన్యాసపు రూపాన్ని చూసినప్పుడు, ఇదే రూపంలో ఉంటుంది. అది ఇప్పటికే, ఇదే సమయంలో అక్కడ ఉన్నది. కాలం అనే భావన లేని ఒక ప్రత్యేక పరిమాణంలో; ఒక వ్యక్తి పుట్టినప్పుడే ఆ స్త్రీ లేదా పురుషుని పూర్తి జీవితకాలం, ఇదివరకే అక్కడ ఉన్నది. కొందరు వ్యక్తులకు, ఒక జీవితకాలం కంటే ఎక్కువ కూడా అక్కడ ఉంటాయి.

"మన జీవితాలను మార్చుకోవడానికి మన స్వంత ప్రయత్నాలు అవసరం లేదా?" అని కొందరు ఆలోచించవచ్చు. వాళ్ళు దానిని అంగీకరించ లేరు. నిజానికి వ్యక్తిగత ప్రయత్నాలు, ఒక వ్యక్తి జీవితంలో, చిన్న మార్పులు కలిగించ గలవు. వ్యక్తిగత ప్రయత్నాలవల్ల కొన్ని చిన్న విషయాలలో కొద్దిపాటి మార్పులుండవచ్చుగానీ, నిజం చెప్పాలంటే, ఒక మార్పు కోసం ప్రయత్నం చెయ్యడం వల్ల మీరు కర్మను పొందుతారు. లేకపోతే, కర్మ చెయ్యడం అన్న విషయమే ఉండదు, అలాగే మంచి పనులో, చెడ్డ పనులో చెయ్యడం అన్న విషయం కూడా ఉండదు. ఒక వ్యక్తి ఒక పనిని ఫలానా విధంగానే చెయ్యాలని అనుకున్నప్పుడు, ఇతరులను తన అవసరానికి వాడుకొని, చెడ్డపనులు చేస్తాడు. అందుకే ఆధ్యాత్మిక సాధనలో, విషయాలను వాటి సహజ గమనంలో జరగనివ్వమని, మీ ప్రయత్నాల వల్ల ఇతరులకు హాని కలిగిస్తారని, మీకు పదేపదే చెప్పడం జరుగుతుంది. మీది కాని దానిని, సంఘంలో మరొక వ్యక్తికి చెందిన దానిని పొందితే, మీరు ఆ వ్యక్తికి ఋణపడి ఉన్నట్లే.

ముఖ్యమైన సంఘటనల విషయంలో, ఒక సామాన్య వ్యక్తి వాటిని ఏ మాత్రమూ మార్చలేడు. దానికి ఒకటే మార్గం ఉన్నది. అదేమిటంటే, ఆ వ్యక్తి దుష్కర్మలు మాత్రమే చేస్తే, దుష్కర్మలు తప్ప మరేమీ చేయకుంటే, అతడు తన జీవితాన్ని మార్చుకోగలడు. అయితే, అతడికి ఎదురయ్యేది ఒక్కటే, సర్వనాశనం. ఒక ఉన్నతస్థాయినించి చూస్తే, ఒక వ్యక్తి మరణించినప్పుడు,

అతడి ప్రాథమిక ఆత్మ నశించదు. ప్రాథమిక ఆత్మ ఎందుకు నశించదు? నిజానికి ఒక వ్యక్తి మరణించిన తరువాత శవశాలలో ఉన్న అతడి శవం, మన పరిమాణంలో, మానవకణాల శరీరం మాత్రమే అని మనం చూస్తాము. ఈ పరిమాణంలో, లోపలి అవయవాల కణ సమూహాలు, తక్కిన మానవ శరీర కణాలన్నీ రాలిపోతాయి, ఐతే, ఇతర పరిమాణాలలో, పరమాణు సమూహాలు, అణువులు, ప్రోటాన్లు, మొదలైనవాటికన్నా సూక్ష్మాతిసూక్ష్మమైన నలుసులతో తయారైన శరీరాలు మరణించవు. అవి ఇతర పరిమాణాలలో ఉంటాయి, అతిసూక్ష్మమైన పరిమాణాలలో జీవిస్తూ ఉంటాయి. అన్ని రకాల దుష్కర్మలు చేసేవాడికి చివరికి జరిగేది, అతడి శరీరంలోని కణాలు పూర్తిగా విచ్ఛిన్నమై పోవడం. దీనినే బౌద్ధమతంలో శరీరనాశనం, ఆత్మ అధోగతి చెందడం అన్నారు.

ఒక వ్యక్తి జీవితాన్ని మార్చేందుకు ఇంకొక మార్గం కూడా ఉంది, ఇంకా చెప్పాలంటే, ఇది ఒక్కటే మార్గం. అదేమిటంటే ఆ వ్యక్తి, ఇప్పటినించి ఆధ్యాత్మిక సాధన మార్గాన్ని అనుసరించడం. ఒక వ్యక్తి జీవితం ఆధ్యాత్మిక సాధన మార్గాన్ని అనుసరిస్తే ఎందుకు మారుతుంది? అంత సులభంగా ఆ విషయాన్ని ఎవరు మార్చగలరు? ఈ వ్యక్తి, ఒకసారి ఆధ్యాత్మిక సాధన మార్గాన్ని అనుసరించాలని అనుకున్నప్పుడు, ఈ ఆలోచన కలిగిన వెంటనే, అది ఈ ప్రపంచాన్ని పది దిక్కులలో కుదిపివేస్తూ, బంగారంలా ప్రకాశిస్తుంది. బుద్ధ సిద్ధాంతం ప్రకారం చూస్తే, విశ్వమంటే దశ దిశలు కలిగిన ప్రపంచం అనే ఒక సిద్ధాంతం ఉంది. బుద్ధి జీవుల దృష్టిలో, ఒక వ్యక్తి జీవితం కేవలం మానవుడిగా బ్రతకడానికి ఉద్దేశింపబడినది కాదు. వారు, ఒక వ్యక్తి జీవితం, విశ్వాంతర్భాగంలో జన్మించినదనీ, విశ్వలక్షణాన్ని కలిగి ఉంటుందనీ తలుస్తారు; జీవితం సహజంగా దయతో కూడి ఉండి, సత్యం-దయ-సహనం అనే పదార్థంతో తయారైనది. అయినా, జీవితం సాంఘిక సంబంధాలను కూడా ఏర్పరుస్తుంది. సాంఘికమైన చర్య, ప్రతిచర్యలు జరిగే క్రమంలో కొందరు జీవులు చెడిపోయి, కింది స్థాయికి పతనమౌతారు. ఆ స్థాయిలో కూడా ఉండ లేనప్పుడు, ఇంకా ఇంకా దిగజారిపోయి, పతనమౌతారు. అలా పతనమౌతూ చివరకు సామాన్య మానవుల యొక్క ఈ స్థాయికి చేరుకుంటారు.

ఈ స్థాయిలో, ఈ వ్యక్తులను, నాశనం చేసి నిర్మూలించాలి. అయినా, గొప్ప ఉపకారబుద్ధితో కూడిన జాలిగుణం కారణంగా ఆ గొప్ప జ్ఞానులు, వారికోసం ప్రత్యేకంగా, మన మానవ సంఘం వంటి ఒక ప్రదేశాన్ని సృష్టించారు. ఈ పరిమాణపు ప్రదేశంలో ఒక వ్యక్తికి అదనంగా ఒక మానవ భౌతిక శరీరం, ఈ భౌతిక పరిమాణంలోని వస్తువులను మాత్రమే చూడగలిగిన రెండు కళ్ళూ ఇవ్వబడతాయి. అంటే, ఆ వ్యక్తి ఒక భ్రాంతిలో చిక్కుకొని, ఇతర పరిమాణాలన్నిటిలో విశ్వసత్యాన్ని చూడగలిగినట్లు, అతడు ఇక్కడనించి చూసేందుకు అనుమతించబడదు. ఇటువంటి భ్రాంతిలోనూ, అటువంటి పరిస్థితులలోనూ, ఒక వ్యక్తికి ఈ రకమయిన అవకాశం ఇవ్వబడుతుంది. భ్రాంతిలో చిక్కుకున్న కారణంగా ఆ వ్యక్తికి చాలా బాధాకరంగా కూడా ఉంటుంది. ఈ శరీరంతో, ఆ వ్యక్తి యాతనలకు గురిచేయబడతాడు. ఈ పరిమాణంనించి తన సహజ స్థితిలోకి తిరిగి రావాలని ఒక వ్యక్తి కోరుకుంటే అతడు, తన స్వస్వరూపానికి తిరిగివచ్చేందుకు తప్పనిసరిగా ఆధ్యాత్మిక సాధన చెయ్యాలని తావో సిద్ధాంతం చెప్తుంది. ఆధ్యాత్మిక సాధన చెయ్యాలని హృదయపూర్వకంగా అనుకుంటే, అతనిలోని బుద్ధ–స్వభావం బయటికి వచ్చిందన్న మాట. ఈ హృదయం అత్యంత విలువైనదిగా పరిగణింపబడుతుంది, అతడికి ఇతరులు సహాయం చేస్తారు. అటువంటి క్లిష్ట పరిస్థితులలో కూడా అతడు చిక్కుకొనక, వెనకకు రావాలని కోరుకుంటాడు. ఇతరులు అతడికి సాయం చేసేందుకు వచ్చి, ఎటువంటి నిబంధనలు లేకుండా చేయూతనిస్తారు – అతడికి ఏది కావాలన్నా, ఇస్తారు. మేము కేవలం ఒక సాధకుడికి మాత్రమే ఇటువంటి సాయం ఎందువల్ల చేయగలుగుతాం? సామాన్య వ్యక్తికి ఎందుకు చెయ్యం? దానికి కారణం ఇది.

ఒక సామాన్య వ్యక్తి, వ్యాధులను నిర్మూలన చెయ్యాలనుకుంటే, అతడికి మేము ఎటువంటి సాయమూ చెయ్యలేము. ఒక సామాన్య వ్యక్తి కేవలం సామాన్య వ్యక్తి మాత్రమే. ఒక సామాన్య వ్యక్తి, సామాన్య మానవ సమాజపు స్థితికి అనుగుణంగా ఉండాలి. బుద్ధుడు అన్ని జీవులకు ముక్తిని ప్రసాదిస్తాడనీ, బౌద్ధ సిద్ధాంతం అన్ని జీవులకూ ముక్తిని బోధిస్తుందనీ చాలామంది అంటారు. నేను చెప్పేది ఏమిటంటే, బౌద్ధమత గ్రంథాలన్నింటినీ పరీక్షించి చూడండి,

వాటిలో ఏదీ కూడా, వ్యాధి నిర్మూలనకు అర్థం అన్ని జీవులకు ముక్తిని ప్రసాదించడం అని చెప్పదు. ఈ విషయాన్ని ఇటీవలి కాలంలో తయారయిన నామమాత్రపు చీ గోంగ్ గురువులు తారుమారు చేశారు. ఈ అభ్యాస మార్గాన్ని తయారుచేసిన అసలైన చీ గోంగ్ గురువులు, ఇతరుల వ్యాధులను నిర్మూలన చెయ్యమని మీకు చెప్పనే లేదు. వారు అభ్యాసం చేస్తూ, వ్యాధి నిర్మూలన చేసుకొని, మీ అంతట మీరే శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడం నేర్పారు. మీరు ఒక సామాన్య వ్యక్తి. రెండు రోజులు అధ్యయనం చేసినంత మాత్రాన, మీరు వ్యాధులను ఎలా తొలగించగలరు? అది ఇతరులను మోసం చెయ్యడం కాదా? అది మీ బంధాన్ని ప్రోత్సహించినట్లు కాదా? అది పేరు కోసమూ, స్వప్రయోజనం కోసమూ ఆరాటపడటం, ఏదో అతీంద్రియమైన దానిని సామాన్య వ్యక్తుల ఎదుట, గొప్ప కోసం ప్రదర్శించడమే! అది పూర్తిగా నిషేధం. అందువల్ల కొందరు వ్యక్తులు ఎంత ఎక్కువ ఆరాటపడి ప్రయత్నిస్తే అంత తక్కువగా పొందగలుగుతారు. మీరు అలా చెయ్యడానికి వీలులేదు, అంత అలక్ష్యంగా మానవ సమాజ స్థితిని చెరపకూడదు.

మీరు మీ స్వస్వరూపానికి తిరిగి వెళ్ళాలని కోరుకున్నప్పుడు ఇతరులు మీకు సహాయం చేస్తారని విశ్వంలో ఒక నియమం ఉంది. ఒక మానవ జీవితం, సామాన్య మానవుల నడుమ ఉండిపోవడంకాక, అతడు ఎక్కడినించి వచ్చాడో, అక్కడికి తిరిగి వెళ్ళాలని వారు అనుకుంటారు. ఒక వ్యక్తి జబ్బులు లేకుండా, సుఖవంతంగా జీవించేందుకు వీలయిన పక్షంలో – అడిగినా కూడా అతడు అమరుడై ఉండేందుకు ఆసక్తి చూపడు. ఒక వ్యక్తికి, ఎటువంటి వ్యాధీ లేకుండా, ఎటువంటి కష్టమూ లేకుండా, కోరినవన్నీ లభిస్తూ ఉంటే, ఎంత అద్భుతంగా ఉంటుంది! అది నిజంగా మరణం అన్నదే లేని లోకం అయ్యుండేది. కానీ, మీరు చెడిపోవడంవలన, ఈ స్థాయికి దిగజారిపోయి, ఎటువంటి సుఖమూ లేకుండా ఉన్నారు. మాయలో చిక్కిన వ్యక్తి సులభంగా తప్పులు చేస్తాడు, బౌద్ధమతంలో దీనిని కర్మానుసారం జరగడం అంటారు. అందువల్ల, కొందరికి కష్టాలు వచ్చినప్పుడు గానీ, దురదృష్టం కలిగినప్పుడు కానీ, వారి కర్మానుసారం అనుభవిస్తున్నారన్న మాట. బుద్ధులు ప్రతిచోటా ఉన్నారని కూడా, బౌద్ధమతం చెప్తుంది. ఒక బుద్ధుడు ఒక్కసారి చేతిని కదిలిస్తే,

మానవాళి రోగాలు తుడిచిపెట్టబడతాయి; ఇది ఖచ్చితంగా సాధ్యపడుతుంది. మన చుట్టూ అంత మంది బుద్ధులు ఉండగా, ఒక్కరు కూడా ఆ పని ఎందుకు చెయ్యలేదు? ఒక వ్యక్తి గతంలో దుష్కర్మ చెయ్యడంవల్ల, ఈ కష్టాలను అనుభవిస్తున్నాడు. మీరు అతని వ్యాధిని నిర్మూలన చేసినట్లైతే, అది విశ్వ నియమాన్ని భంగం చేసినట్లే. ఎందుకంటే, అది ఒక వ్యక్తి తప్పు చేసి, మరొకరికి ఏదైనా ఋణపడి ఉన్నప్పటికీ, తిరిగి చెల్లించాల్సిన అవసరం లేనట్లు పరిగణింపబడుతుంది. అది నిషిద్ధం. అందువల్ల ప్రతి ఒక్కరూ సామాన్య మానవ సంఘపు స్థితిని కాపాడుతూ ఉండి, దీనిని కలతపెట్ట కూడదని కోరుకుంటారు. సౌఖ్యవంతమైన జీవితాన్ని, ఏ విధమైనట్టి అనారోగ్య సమస్య లేకుండా, స్వేచ్ఛాయుతమైన గమ్యాన్ని చేరుకునేందుకు ఆధ్యాత్మిక సాధన ఒక్కటే మార్గం! జనులందరూ, ధర్మబద్ధమైన మార్గాన్ని అభ్యసించి నప్పుడే అన్ని జీవులకు నిజంగా ముక్తి లభిస్తుంది.

చాలామంది చీ గోంగ్ గురువులు ఎందువల్ల వ్యాధి నిర్మూలన చేస్తారు? వారు వ్యాధి నిర్మూలన చెయ్యడం గురించి ఎందుకు మాట్లాడతారు? కొంత మంది ఈ ప్రశ్నలను పరిగణించి ఉండవచ్చు. ఈ చీ గోంగ్ గురువులలో ఎక్కువమంది నిజాయితీ గల సాధనలకు చెందినవారు కాదు. అన్ని జీవులూ బాధలు అనుభవిస్తూ ఉండడం చూసి, తన ఆధ్యాత్మిక సాధనాక్రమంలో, ఒక నిజమయిన చీ గోంగ్ గురువు, దయ, సానుభూతులతో, ఎవరో ఒకరికి సాయం చెయ్యడం అన్నది అనుమతింపబడుతుంది. అతడు వ్యాధిని నయం చెయ్యలేడు, కానీ, తాత్కాలికంగా అణచిపెట్టడమో, వాయిదా వేయడమో చేయగలుగుతాడు. మీకిప్పుడు ఆ వ్యాధులు లేవు, కానీ అవి తర్వాత వస్తాయి, ఎందుకంటే, మీ వ్యాధిని అతడు కొంతకాలం తర్వాత వచ్చేలాగ వాయిదా వేస్తాడు. అతడు వ్యాధులను మరియొకచోటకో, మీ బంధువుల శరీరాలకో మారుస్తాడు. అతడు నిజంగా మీ కర్మను పూర్తిగా తొలగించలేడు. అతడు సాధకుల విషయంలో మాత్రమే అలా చెయ్యవచ్చును, అంతేగానీ అలక్ష్యంగా ఒక సామాన్య మానవుడి విషయంలో చెయ్యడం నిషిద్ధం. ఇదే నియమం.

బుద్ధ సిద్ధాంతంలో, "అన్ని జీవులకు ముక్తి" అంటే, అత్యంత వేదనా భరితమైన సామాన్య మానవుల స్థితినించి, ఉన్నత స్థాయిలకు తీసుకు

రావడం. మీరు ఇక ఏమాత్రమూ బాధలు పడరు, స్వతంత్రులవుతారు – ఇదే దీనికి అర్థం. శాక్యముని, నిర్వాణానికి ఆవలివైపు గురించి చెప్పలేదా? అన్ని జీవులూ ముక్తిని పొందడమంటే, అసలైన అర్థం అదే. చాలా డబ్బు ఉండి, మీ మంచం నిండా డబ్బు పరిచి ఉండి, మీకు ఎటువంటి బాధలు లేకుండా, సామాన్య మానవుల నడుమ సుఖవంతమైన జీవితాన్ని గడుపుతూ ఉంటే, మీకు అమరులు అయ్యే అవకాశం ఇచ్చినా, మీరు ఆసక్తి చూపించరు. ఒక సాధకునిగా మీ జీవన గమనం మార్చవచ్చు. మీ జీవితం కేవలం ఆధ్యాత్మిక సాధన వల్ల మాత్రమే మార్చబడుతుంది.

భూత భవిష్యత్తులను తెలుసుకోగలిగిన అతీంద్రియ సామర్థ్యం పనిచేసే విధానం, ఒక వ్యక్తి నుదుటిలో ఒక చిన్న టెలివిజన్ తెర కలిగి ఉన్నట్లుగా ఉంటుంది. కొందరికి అది నుదుటి మీదనూ; మరికొందరికి నుదుటి దగ్గరలో ఉంటుంది. కొందరిలో నుదుటి లోపల ఉంటుంది. కొంతమంది కళ్ళు మూసుకొని, వస్తువులను చూడగలరు. ఆ శక్తి అధికంగా కలిగినవారు, కళ్ళు తెరుచుకొని కూడా చూడగలుగుతారు. అయినా, అది ఒక వ్యక్తి యొక్క పరిమాణ క్షేత్ర పరిధిలో ఉండడం వలన, ఇతరులు వాటిని చూడలేరు. మరొక రకంగా చెప్పాలంటే, ఈ అతీంద్రియ సామర్థ్యం వృద్ధి చెందిన తర్వాత, ఇతర పరిమాణాలలోని దృశ్యాలను ప్రతిబింబించేందుకు, మాధ్యమంగా పనిచేసే మరొక అతీంద్రియ సామర్థ్యం ఉండాలి. ఫలితంగా దివ్యనేత్రం వాటిని చూడగలుగుతుంది. ఒక వ్యక్తి మరొక వ్యక్తి యొక్క భవిష్యత్తును, గతాన్ని ఖచ్చితంగా చూడగలుగుతాడు. జ్యోతిష్యం అన్నది, ఎంత బాగా పనిచేసినా, చిన్న సంఘటన లను, వాటి వివరాలను గురించి తెలియజేయలేదు. కానీ, ఈ వ్యక్తి మాత్రం, ఈ విషయాలను స్పష్టంగానూ, సంవత్సరమూ, సమయంతో సహా చూడగలడు. ఒక వ్యక్తి చూసేవి, భిన్న పరిమాణాలలోని వ్యక్తుల యొక్క, వస్తువుల యొక్క నిజమైన ప్రతిబింబాలను గనక ఆ మార్పులలోని వివరాలన్నీ అతడికి కనిపిస్తాయి.

మీరు ఫాలున్ దాఫా అభ్యసించినంత కాలం, మీ దివ్యనేత్రం తెరవబడుతూ ఉంటుంది. అయితే దాని తరవాత మేము చెప్పిన అతీంద్రియ సామర్థ్యాలు ఇవ్వబడవు. మీ స్థాయి నిరంతరం పెరుగుతున్నకొద్దీ, మీలో భూత

భవిష్యత్తులను చూడగలిగిన అతీంద్రియ సామర్థ్యం సహజంగా బయట పడుతుంది. రాబోయే సంఘటనల గురించిన ఈ విధమైన భావన మీ భవిష్యత్ ఆధ్యాత్మిక సాధనలో కలుగుతుంది, అప్పుడు ఈ శక్తి పెంపొందిన సమయంలో, జరుగుతున్నదేమిటో మీకు తెలుస్తుంది. అందువలన, మేము ఫా లోని నియమాలను బోధించాము.

## ఐదు మూలపదార్థాలను, త్రిలోకాలను అధిగమించడం

ఐదు మూలపదార్థాలను, త్రిలోకాలను అధిగమించడం అంటే ఏమిటి? ఈ విషయాన్ని ప్రస్తావించడం, అతిసున్నితమైన అంశం. గతంలో, చాలామంది చీ గోంగ్ గురువులు ఈ విషయం గురించి మాట్లాడారు కానీ, చీ గోంగ్‌ను నమ్మని వ్యక్తుల ప్రశ్నలకు ఉక్కిరిబిక్కిరయిపోయారు. "చీ గోంగ్‌ను అభ్యసించే మీలో, ఐదు మూలపదార్థాలను అధిగమించి, త్రిలోకాలను దాటినవారు ఎవరైనా ఉన్నారా? "కొందరు, చీ గోంగ్ గురువులు కాకపోయినా, తమను తాము చీ గోంగ్ గురువులుగా చెప్పుకుంటారు. వాళ్ళకు ఆ విషయంలో స్పష్టత లేని పక్షంలో మౌనంగా ఉండాలి. అయినా వాళ్ళు మాట్లాడడానికి సాహసిస్తారు, అప్పుడు ఇతరులు తమ ప్రశ్నలతో, వాళ్ళను అవాక్కులయ్యేట్లు చేస్తారు. ఇందువల్ల, సాధకుల సంఘం చాలా అప్రతిష్ట పాలై, ఒక గందర గోళానికి దారితీసింది. కొందరు, చీ గోంగ్ మీద దాడి చేసేందుకు ఈ అవకాశాన్ని వాడుకున్నారు. సాధకుల సంఘంలో ఐదు మూలపదార్థాలను, త్రిలోకాలను అధిగమించడం అన్నది ఒక సామెత. అది మతంలో వేళ్ళూనుకొని ఉంది, అది మతంలోనించి వచ్చింది. ఆ కారణంవల్ల, మనం ఈ విషయంలో, దాని చారిత్రక నేపథ్యాన్నీ, ఆనాటి పరిస్థితులనూ పరిగణనలోకి తీసుకోకుండా మాట్లాడలేము.

ఐదు మూలపదార్థాలను అధిగమించడం అంటే ఏమిటి? ప్రాచీన చైనీయ భౌతికశాస్త్రమూ, ఆధునిక భౌతికశాస్త్రమూ రెండూ కూడా ఐదు మూలపదార్థాల చైనీయ సిద్ధాంతాన్ని సరైనదిగా పరిగణిస్తాయి. మన విశ్వంలోని ప్రతి వస్తువూ ఐదు మూలపదార్థాలైన లోహమూ, చెక్క, నీరు, నిప్పు, భూమితో కల్పించబడి ఉంటుందన్నమాట నిజం. అందువల్ల, మనం

ఐదు మూలపదార్థాల సిద్ధాంతాన్ని గురించి మాట్లాడతాము. ఒక వ్యక్తి ఐదు మూలపదార్థాలను అధిగమించినట్లు చెప్పబడితే, ఆధునికుల భాషలో, అతడు మన భౌతిక ప్రపంచం దాటి ఆవలివైపుకు చేరుకున్నాడని అర్థం. ఇది ఊహాతీతంగా ధ్వనిస్తుంది. ప్రతి ఒక్కరూ, దీని గురించి ఆలోచించండి: ఒక చీ గోంగ్ గురువుకు గోంగ్ ఉంటుంది. నేను ఒక ప్రయోగంలో పాల్గొన్నాను, ఇంకా ఎందరో ఇతర చీ గోంగ్ గురువులు కూడా వారి శక్తిని కొలుచుకోవడానికి పాల్గొన్నారు. ఈనాడు ఉన్న శాస్త్రీయ ఆధునిక పరికరాలతో గోంగ్‌లోని మూల పదార్థాలను కనుగొనవచ్చు. అంటే, ఇటువంటి పరికరాలు ఉన్నంతకాలం, ఒక చీ గోంగ్ గురువు నుండి వెలువడే మూలపదార్థాలు, అతడిలో ఉన్న గోంగ్ గుర్తించబడగలవు. ఆధునిక పరికరాలు ఇన్‌ఫ్రారెడ్ కిరణాలను, అతినీలలోహిత కిరణాలను, శ్రవణాతీత తరంగాలు, శబ్ద తరంగాలు, విద్యుదయస్కాంత తరంగాలు, గామా కిరణాలు, అణువులు, న్యూట్రాన్లు మొదలైన వాటి ఉనికిని కనుగొనగలవు. ఒక చీ గోంగ్ గురువు ఈ పదార్థాలన్నిటినీ కలిగి ఉంటాడు, ఇంకా ఎన్నో, కనిపెట్టలేని పదార్థాలు అతడి నుండి వెలువడతాయి. ఎందుకంటే, వాటిని కనిపెట్టగలిగిన పరికరం అసలు లేదు. అటువంటి పరికరం ఉన్నంత కాలమూ, ప్రతిదీ కనిపెట్టేందుకు, వీలవుతుంది. చీ గోంగ్ గురువుల నుండి వెలువడే పదార్థాలు అతిసమృద్ధిగా ఉంటాయి.

ఒక అయస్కాంత క్షేత్రం యొక్క ప్రత్యేక ప్రభావంలో, ఆ చీ గోంగ్ గురువు, ఒక శక్తివంతమైన, చాలా అందమైన ఒక ఆధ్యాత్మిక కాంతిని ప్రసరించగలుగుతారు. ఒక వ్యక్తి యొక్క గోంగ్ సామర్థ్యం అధికమైన కొలదీ, ఆ ఆధ్యాత్మిక కాంతి క్షేత్రం విశాలంగా ఏర్పడుతూ ఉంటుంది. ఒక సామాన్య వ్యక్తికి కూడా ఆధ్యాత్మిక కాంతి క్షేత్రం ఉంటుంది, కానీ అది చాలా చిన్నగానూ, బలహీనంగానూ ఉంటుంది. శ్రేష్ఠమైన శక్తి గురించిన భౌతికశాస్త్ర పరిశోధనలలో, శక్తి అన్నది న్యూట్రాన్లు, అణువులవంటి చిన్న నలుసులతో తయారైందని జనులు నమ్ముతారు. ప్రసిద్ధి పొందినవారితో సహా, అనేకమంది చీ గోంగ్ గురువులు, పరీక్ష చేయబడ్డారు. నేను కూడా పరీక్షింపబడ్డాను, అప్పుడు వెలువడిన గామా కిరణాల, ఉష్ణపు న్యూట్రాన్ల యొక్క కాంతి ప్రసారం, సాధారణ పదార్థం కన్నా, ఎనభై నించి నూటడెబ్బై రెట్లు అధికంగా ఉన్నట్లు

కనుగొనబడింది. ఈ బిందువు దగ్గర, పరీక్ష చేస్తున్న పరికరం యొక్క సూచిక, పైహద్దును చేరి, దాని ముల్లు, గరిష్ట స్థాయి దగ్గర ఆగిపోయింది. చివరకు, నాకు ఇంకా ఎంత అధిక శక్తి ఉన్నదో ఆ పరికరం సూచించలేకపోయింది. ఒక వ్యక్తిలో అంత శక్తివంతమైన న్యూట్రాన్లు ఉండడం అన్నది ఊహాతీతం! ఒక వ్యక్తి అంత శక్తివంతమైన న్యూట్రాన్లను ఎలా ఉత్పత్తి చేయగలడు? చీ గోంగ్ గురువులమైన మాకు గోంగ్, శక్తీ ఉంటాయని కూడా ఇది నిరూపిస్తున్నది. శాస్త్రీయ, సాంకేతిక సమాజం కూడా దీనిని బలపరిచింది.

ఐదు మూలపదార్థాలను అధిగమించేందుకు మనసు, శరీరం రెండింటి ఆధ్యాత్మిక సాధన అవసరం. ఒక సాధన మనశ్శరీరాలకు సంబంధించినది కాక, శరీర సాధన అనేది లేకుండా, కేవలం గోంగ్ శక్తిని పెంపొందించేది అయితే, దానికి ఈ విషయంతో నిమిత్తం లేదు, అందులో, ఐదు మూలపదార్థాలను అధిగమించడం అవసరం కాదు. మనసు, శరీరాలకు సంబంధించిన ఆధ్యాత్మిక సాధన, శరీరంలోని అన్ని జీవకణాలలో శక్తిని నిలవ చేస్తుంది. సగటు సాధకులు, లేదా, గోంగ్ పెంపొందించుకోవడం అప్పుడే మొదలుపెట్టిన వారిలో, మధ్యలో ఖాళీలు కలిగి ఉండి, తక్కువ సాంద్రతతో, ముతకగా ఉన్న రేణువులతో కూడిన శక్తి ఏర్పడుతుంది. అందువల్ల దానిలో తక్కువ బలం ఉంటుంది. ఒక వ్యక్తి యొక్క స్థాయి అధికమైన కొద్దీ, ఆ వ్యక్తి యొక్క శక్తి సాధారణమైన నీటి పరమాణు సమూహముల కంటే, వందరెట్లు, వెయ్యిరెట్లు, లేదా పదికోట్ల రెట్లు ఉండడం అన్నది పూర్తిగా సాధ్యపడుతుంది. ఒక వ్యక్తి స్థాయి పెరుగుతున్నకొద్దీ అతడిలో ఏర్పడే శక్తి చిక్కగాను, సన్నటి రేణువులను, ఎక్కువ బలమునూ కలిగి ఉంటుంది. ఈ పరిస్థితిలో, ఆ శక్తి శరీరంలోని ప్రతి జీవకణంలోనూ నిలవ చెయ్యబడుతుంది. అటువంటి శక్తి ఈ భౌతిక పరిమాణంలోని శరీర జీవ కణాలలోని ప్రతి జీవకణంలోనే కాక, ఇతర పరిమాణములలోని శరీరాలన్నిటిలోని సూక్ష్మాతిసూక్ష్మమైన జీవకణాలను చేరేవరకు, పరమాణు సమూహాలనూ, అణువులనూ, ప్రోటాన్లనూ, ఎలెక్ట్రాన్లనూ నింపుతుంది. కాలం గడిచేకొద్దీ, ఒక వ్యక్తి శరీరమంతా అటువంటి అత్యంత–శక్తి పదార్థంతో నిండుతుంది.

ఈ అత్యంత–శక్తి పదార్థం తెలివి కలిగి ఉంటుంది, చాలా సమర్థవంతంగా

ఉంటుంది. ఒకసారి అది పెరిగి, చిక్కబడేకొద్దీ, మానవ శరీరంలోని అన్ని జీవ కణాలను నింపి, మానవ భౌతిక జీవకణాలను – ఏ మాత్రమూ సామర్థ్యం లేనట్టి ఆ జీవకణాలను – అణచివేస్తుంది. ఆ కణాలు ఒకసారి అణచివేయబడిన తర్వాత, వాటిలో జీవరసాయన క్రియలు జరగవు. చివరకు, మానవ భౌతిక జీవకణాలు అన్నీ పూర్తిగా మార్చివేయబడతాయి. అయితే, ఇలా చెప్పడం నాకు సులభం అనుకోండి. సాధనలో ఈ స్థితికి చేరడం అన్నది, క్రమక్రమం గానూ, నెమ్మదిగానూ సాగే ఒక ప్రక్రియ. మీ సాధన ఈ స్థాయికి చేరుకున్నప్పుడు, అత్యంత–శక్తి పదార్థం మీ శరీరంలోని అన్ని జీవకణాల స్థానంలోకి వచ్చేస్తుంది. ఈ విషయాన్ని గురించి యోచించండి: మీ శరీరం ఇప్పటికీ ఐదు మూలపదార్థాలతో తయారై ఉన్నదేనా? ఇప్పుడు కూడా, అందులో ఉన్నది ఇంకా మన పరిమాణంలోని పదార్థమేనా? ఇప్పటికే అది, ఇతర పరిమాణాలనించి సంగ్రహింపబడిన అత్యంత–శక్తి పదార్థంతో తయారై ఉంది. పుణ్యం అన్న పదార్థం కూడా, ఇతర పరిమాణాలలో ఉన్న పదార్థం. అది మన పరిమాణంలోని కాల అవధికి కట్టుబడి ఉండదు.

ఆధునిక విజ్ఞానం, కాలానికి ఒక క్షేత్రం ఉందని చెప్తుంది. ఒక విషయం కాల అవధి యొక్క పరిధిలో లేనప్పుడు, అది ఆ కాలానికి కట్టుబడదు. ఇతర పరిమాణాలలోని దేశ కాలాలు మన వాటికి భిన్నంగా ఉంటాయి. ఇతర పరిమాణాలలోని పదార్థాన్ని ఇక్కడి కాలం ఎలా నియంత్రించగలదు? ఏమైనా, అది అలా చెయ్యలేదు. దీన్ని గురించి అందరూ యోచించండి, అప్పటికి, మీరు ఐదు మూలపదార్థాలను అధిగమించి ఉండరా? మీ శరీరం ఇంకా ఒక సామాన్య వ్యక్తి శరీరంగానే ఉందా? అది ఏ మాత్రమూ అలా ఉండదు, కానీ సాధారణ వ్యక్తులు ఆ తేడాను చెప్పలేరు. ఒక వ్యక్తి శరీరం, ఆ మేరకు మారినా, అది ఆధ్యాత్మిక సాధనకు ముగింపు కాదు. ఒక వ్యక్తి ఉన్నత సాధనా స్థాయులకు అభివృద్ధి చెందడాన్ని కొనసాగిస్తూనే ఉండాలి. అందువల్ల, ఒక వ్యక్తి సామాన్య మానవుల నడుమ ఆధ్యాత్మిక సాధనను కొనసాగిస్తూనే ఉండాలి. జనులు ఈ వ్యక్తిని చూస్తూ ఉండకపోతే, ఇది సాధ్యపడదు.

ఆ తర్వాత ఏం జరుగుతుంది? సాధనాక్రమంలో, ఈ వ్యక్తిలోని అన్ని

జీవకణాలు, పరమాణు సమూహాల స్థాయిలో అత్యంత–శక్తితో మార్చబడినప్పటికీ, అణువులకు ఉండే సమ్మేళనాక్రమంవల్ల, పరమాణు సమూహాల సమ్మేళనాలు, అణువుల ఆకృతులు మారవు. జీవాణువులలోని పరమాణు సమూహాల సమ్మేళనాలు ఏ స్థితిలో ఉంటాయంటే, వాటిని తాకినప్పుడు మెత్తగా అనిపిస్తాయి. ఎముకలలోని పరమాణు సమూహాల సమ్మేళనాలు హెచ్చు సాంద్రత కలిగి ఉండడం వలన గట్టిగా ఉంటాయి. రక్తం యొక్క పరమాణు సమూహాల సాంద్రత అతితక్కువగా ఉండడంవల్ల అది ద్రవస్థితిలో ఉంటుంది. ఒక సామాన్య వ్యక్తి మీ ఆకారాన్ని బట్టి, మీలో జరిగిన మార్పులను చూడలేడు. ఎందుకంటే, మీ జీవకణాలలోని పరమాణు సమూహాలు తమ సహజ నిర్మాణాన్ని, సమ్మేళనాన్ని నిలుపుకొనే ఉంటాయి. వాటి నిర్మాణం మారదు. కానీ వాటిలోని శక్తి మారింది. కనక, అప్పటినించి ఆ వ్యక్తి వయసు పెరిగినా, అలా కనిపించడు, అతనిలోని జీవకణాలు మరణించవు. అలాగే, అతడు ఎప్పటికీ యువకుడుగానే ఉంటాడు. ఆధ్యాత్మిక సాధన క్రమంలో ఒక వ్యక్తి యువకుడుగా కనిపిస్తూ, చివరి వరకు అలాగే ఉంటాడు.

అయినప్పటికీ, ఒక వ్యక్తిని కారు ఢీకొట్టినప్పుడు అతడి ఎముకలు విరగొచ్చు. కత్తితో కోసినప్పుడు ఒక వ్యక్తికి రక్తస్రావం కావచ్చు, ఎందుకంటే, ఆ వ్యక్తిలోని పరమాణు సమూహాల సమ్మేళనాలు మారలేదు. వారిలోని జీవకణాలు సహజ మరణం పొందవు, వారు సహజంగా వృద్ధులు కారు. జీవరసాయనక్రియ ఉండదు. దీనినే ఐదు మూలపదార్థాలను అధిగమించడం అంటారు. ఇది మూఢనమ్మకం ఎలా అవుతుంది? దీన్ని శాస్త్రీయ సూత్రాల ద్వారా కూడా వివరించవచ్చు. కొందరు దీనిని వివరించడం చేతకాక నిర్లక్ష్యపు అభిప్రాయాలు చెప్తారు. ఇంకొందరు, మూఢనమ్మకాలను పెంచుతున్నారని అంటారు. ఈ వివరణ మతంనించి వచ్చినది కాబట్టి, ఇది ఆధునిక చీ గోంగ్ సృష్టించినది కాదు.

"త్రిలోకాలను అధిగమించడం అంటే ఏమిటి? మన గోంగ్ పెరగడానికి, షిన్ షిన్ సాధన చేయడమూ, విశ్వలక్షణంతో మమేకం కావడం ప్రధాన కారణమని, నేను ఒకనాడు చెప్పాను. అప్పుడు విశ్వ లక్షణం మిమ్మల్ని నిర్బంధించదు. మీరు మీ షిన్ షిన్‌ను ఒక ఉన్నత స్థాయికి పెంపొందించుకున్న

తర్వాత, పుణ్యమనే మూలపదార్థం, గోంగ్‌గా పరివర్తన చెంది, నిలకడగా పైస్థాయికి ఎదుగుతూ, ఒక గోంగ్ స్తంభంగా ఏర్పడుతుంది. ఈ గోంగ్ స్తంభం ఎత్తు ఎంత ఉంటుందో, మీ శక్తి స్థాయి కూడా అంత ఎత్తులో ఉంటుంది. "గొప్ప ఫా అనంతం" అన్న వాడుక ఒకటి ఉంది. దాన్ని సాధన చేయడం అన్నది పూర్తిగా మీ హృదయపూర్వక సంకల్పం మీద ఆధారపడి ఉంటుంది. మీ ఆధ్యాత్మిక స్థాయి ఎంత ఎత్తుకు ఎదగగలదు అన్న విషయం, మీ సహన గుణమూ, కష్టాలను భరించగల శక్తి మీద ఆధారపడి ఉంటుంది. మీరు మీలోని తెల్లని పదార్థం వాడేసుకుంటే, కష్టాలను అనుభవించడంవల్ల మీలోని నల్లని పదార్థాన్ని తెల్లని పదార్థంగా మార్చుకోవచ్చు. అది సరిపోకపోతే ఆధ్యాత్మిక సాధన చేయని మీ స్నేహితులు, లేదా బంధువుల పాపాలను అనుభవించి, మీ గోంగ్ పెంచుకోవచ్చు. ఇందుకోసం, ఒక వ్యక్తి ఆధ్యాత్మిక సాధనలో అత్యంత ఉన్నత స్థాయిని చేరుకోవడం అవసరం; ఒక సామాన్య సాధకుడు తన బంధువుల పాపాలను భరించాలని అనుకోకూడదు. అంత అధిక కర్మ ఉన్నప్పుడు, ఒక సగటు వ్యక్తి సాధనలో సఫలం కాలేదు. ఇక్కడ నేను భిన్న స్థాయులలో ఉన్న నియమాలను వివరిస్తున్నాను.

మతములు చెప్పే త్రిలోకాలు అంటే, స్వర్గం యొక్క తొమ్మిది స్థాయులు, లేదా స్వర్గం యొక్క ముప్పైమూడు స్థాయులు – అంటే స్వర్గం, భూమి, పాతాళం, వాటిలో ఉన్న సమస్త జీవులతో సహా కలిపి సూచిస్తుంది. ముప్పై మూడు స్థాయుల స్వర్గంలోని అన్ని జీవులూ "సంసార"మనే పునర్జన్మల చక్రంలో పరిభ్రమిస్తూ ఉంటాయని భావిస్తారు. "సంసార" అంటే ఒక వ్యక్తి ఈ జన్మలో మానవుడిగా పుట్టినా, మరుజన్మలో జంతువుగా పుట్టొచ్చు. బౌద్ధమతంలో: "ఒక వ్యక్తి ఈ జన్మలో లభించిన పరిమితమైన సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పుడు ఆధ్యాత్మిక సాధన చేయకపోతే, ఇంకెప్పుడు చేస్తావు?" అని చెప్పబడింది. ఇలా ఎందుకు అంటారంటే, జంతువులకు ఆధ్యాత్మిక సాధన చెయ్యడం నిషేధం, అవి ఫాను కూడా వినలేవు. అవి సాధనను అభ్యసించినా, సాధనలో "సరైన ఫలం" (3) సాధించలేవు. వాటి గోంగ్ స్థాయి పెరిగితే, దైవంచేత అవి చంపబడతాయి. మీకు మానవ శరీరం ఎన్నో వందల ఏళ్ళకు గానీ లభించదు. బహుశా

వెయ్యేళ్ళలో, ఒకసారి మీరు పొందుతారు. మానవ శరీరం పొందిన తర్వాత, దానినెలా సంరక్షించుకోవాలో కూడా మీకు తెలియదు. మీరు ఒక రాయిగా పునర్జన్మ పొందితే, ఇంకొక పదివేల ఏళ్ళు గడిచినా బయటికి రాలేరు. ఆ రాయి పగలగొట్టబడకపోయినా, శిథిలం చెందకపోయినా, మీరు బయటికి రాలేరు. మానవ శరీరం పొందడం అంత కష్టం! ఒక వ్యక్తి నిజంగా దాఫాను పొందగలిగితే, అతడు ఎంతో అదృష్టవంతుడు. ఒక మానవ దేహం దొరకడం కష్టం – ఇదే దీని అర్థం.

ఆధ్యాత్మిక సాధనలో స్థాయుల విషయం గురించి మేము శ్రద్ధ వహిస్తాం, ఇది ఒక వ్యక్తి స్వంత ఆధ్యాత్మిక సాధన మీద ఆధారపడి ఉంటుంది. మీకు త్రిలోకాలను అధిగమించాలన్న కోరిక ఉండి, మీ గోంగ్ స్తంభం అత్యున్నత స్థాయికి పెరిగితే, మీరు త్రిలోకాలను దాటినట్లే కాదా? ఒక వ్యక్తి, ధ్యానంలో కూచున్న సమయంలో, అతడి ప్రాథమికాత్మ అతడి శరీరాన్ని వదిలినప్పుడు, అది ఒక్క ఉదుటున అత్యంత ఉన్నత స్థాయికి చేరుకుంటుంది. ఒక సాధకుడు, తన అనుభవం గురించిన నివేదికలో, “టీచర్, (4) నేను స్వర్గం యొక్క ఎన్నో స్థాయులను చేరి, కొన్ని దృశ్యాలను చూశాను” అని రాశాడు. నేను అతడిని ఇంకా పైకి ఎక్కమన్నాను. “నేను అది చెయ్యలేను. ఇంకా పైకి ఎక్కేందుకు సాహసించలేను, నేను ఇంక ఏ మాత్రమూ ఎక్కలేను” అన్నాడు. ఎందువల్ల? అతడి గోంగ్ యొక్క ఎత్తు అంతే ఉండడంవల్ల అతడు తన గోంగ్ స్తంభంపై కూర్చోవడంవల్ల అంతవరకే చేరాడు. బౌద్ధమతంలో చెప్పబడిన ఫలస్థితి అంటే ఇదే, అతడు ఆ స్థాయిని చేరుకున్నాడు. అయినా, ఒక సాధకుడికి, ఫలస్థితి యొక్క శిఖరం అది మాత్రమే కాదు. ఒక వ్యక్తి నిరంతరం ఇంకా పైకి ఎదుగుతూ తనని తాను ఉన్నతీకరించుకుంటూ ఉంటాడు. మీ గోంగ్ స్తంభం త్రిలోకాల హద్దును దాటితే, మీరు త్రిలోకాలనూ దాటినట్లు కాదా? మతములలో పేర్కొన్న ఈ త్రిలోకాలూ, మన తొమ్మిది ప్రధాన గ్రహాల పరిధిలోనే ఉన్నాయని మేము పరిశోధించి, కనుక్కున్నాము. కొందరు పది ప్రధాన గ్రహాలు ఉన్నాయంటారు. అది ఏమాత్రమూ నిజం కాదని, నేను అంటాను. గతంలో కొందరు చీ గోంగ్ గురువుల యొక్క గోంగ్ స్తంభములు చాలా ఎత్తుగా ఉండి, పాలపుంతను దాటాయని నేను కనుగొన్నాను; వారు

ఈ త్రిలోకాలను దాటి, చాలా దూరంలో ఉన్నారు. నేను ఇప్పుడే, త్రిలోకాలను అధిగమించడం గురించి చెప్పాను. నిజానికి ఈ విషయం స్థాయిలకు సంబంధించినది.

## విషయాసక్తి అన్న అంశం

చాలామంది ప్రాకులాట అన్న బంధంతో మన సాధనాస్థలికి వస్తారు. కొందరు అతీంద్రియ శక్తులు సాధించాలి అనుకుంటారు; కొందరు కొన్ని సిద్ధాంతాలను గురించి వినాలని వస్తారు; కొందరు రోగాలు నిర్మూలించుకోవడానికి వస్తారు, కొందరు ఫాలున్‌ను పొందాలని కూడా వస్తారు. ఇక్కడ అన్ని రకాల మనస్తత్వాలుంటాయి. మరికొందరు “నా కుటుంబ సభ్యులొకరు ఉపన్యాసం వినేందుకు ఇక్కడికి రాలేదు, కొంచెం డబ్బు చెల్లిస్తాను, అతనికి ఒక ఫాలున్‌ను ఇవ్వగలరా?” అని అడుగుతారు. ఈ ఫాలున్‌ని రూపొందించేందుకు ఎన్నో తరాలు, చాలా కాలవ్యవధి, వినగానే భయం కలిగించే సంఖ్య గల సంవత్సరాలు పట్టింది. కొన్ని డజన్ల యువాన్ల(5)తో ఈ ఫాలున్‌ని మీరు ఎలా కొనగలుగుతారు? మేము మీకందరికీ ఎటువంటి నిబంధనలూ లేకుండా దీనిని ఎందుకు ఇవ్వగలుగుతున్నాము? ఎందుకంటే, మీరు సాధకులు కావాలని కోరుకుంటున్నారు. ఎంత ధనం ఖర్చు చేసినా, ఈ హృదయ సంకల్పాన్ని కొనలేరు. మీలోని బుద్ధ–స్వభావం బయటపడినప్పుడు మాత్రమే మేము ఇలా చెయ్యగలుగుతాం.

మీరు, విషయాసక్తి అన్న బంధాన్ని అంటిపెట్టుకొని ఉన్నారు. మీరు కేవలం దీని కోసమే ఇక్కడికి వస్తున్నారా? ఇతర పరిమాణంలోని నా ఫాషెన్ (6) కు, మీ మనసులో ఉన్నదంతా తెలుసు. రెండిటిలోని, దేశ కాలాల భావనలు వేరుగా ఉండడంవల్ల, ఇంకో పరిమాణంలో మీలోని ఆలోచనలు రూపుదిద్దుకోవడమన్నది ఒక అతినిదానమైన ప్రక్రియ. మీరు ఆలోచించే లోపలే అది అన్నీ తెలుసు కుంటుంది. అందువల్ల, మీలోని చెడు ఆలోచనలన్నీ మీరు తొలగించుకోవాలి. బుద్ధ సిద్ధాంతం విధిలిఖితమైన సంబంధాలను నమ్ముతుంది. ప్రతి ఒక్కరూ విధిలిఖితమైన సంబంధం వల్లనే, ఇక్కడికి వస్తారు. మీరు దాన్ని పొందితే, బహుశా అది మీకు లభించవలసి ఉన్నదేమో?

అందువల్ల మీరు దానిని కాపాడుకోవాలే గానీ, ఏ బంధం కోసమూ ప్రాకులాడకూడదు.

గతంలోని మతపరమైన ఆధ్యాత్మిక సాధనలలో బుద్ధ సిద్ధాంతం ప్రకారం మనసు శూన్యముగా ఉంచుకోవలసిన ఆవశ్యకత ఉంది. ఒక వ్యక్తి ఎటువంటి ఆలోచనలూ లేకుండా, శూన్యమనే ద్వారంలోకి ప్రవేశించవలసి ఉంటుంది. తావో సిద్ధాంతం, అక్కడ ఏమీ లేదు కాబట్టి ఏమీ లేదని బోధించింది. ఒక వ్యక్తి దేనినీ కోరుకోకూడదు, దేనికోసమూ ఆరాటపడకూడదు. ఒక సాధకుడు తాను గోంగ్‌ను పొందడంపట్ల శ్రద్ధ వహించక, కేవలం అభ్యాసం మీదనే దృష్టి కేంద్రీకరించాలని నమ్ముతాడు. ఒక వ్యక్తి ఆధ్యాత్మిక సాధనలో, ఉద్దేశ రహితమైన స్థితిలో ఉండాలి. మీరు మీ షిన్ షిన్‌ను సాధన చేయడం మీద దృష్టి కేంద్రీకరించినంత కాలమూ, మీ స్థాయిలో పురోగతి సాధిస్తూ, తప్పనిసరిగా మీ అర్హతకు తగినవాటిని పొందుతారు. మీరు దేనినైనా వదులుకోలేనప్పుడు, అది ఒక బంధం కాదా? ఇక్కడ మేము మీకు ఒక్కసారిగా అటువంటి ఉన్నత స్థాయి ఫాను నేర్పాము, మీ షిన్ షిన్ స్థాయి కూడా అంతటి ఉన్నత ప్రమాణంలో ఉండడం అన్నది అవసరం. అందువల్ల ఒక వ్యక్తి, విషయాసక్తి అనే బంధం పెట్టుకొని ఫాను నేర్చుకోవడం కోసం రాకూడదు.

ప్రతి ఒక్కరిపట్ల బాధ్యత కలిగి ఉండడానికి, మేము మిమ్మల్ని సరియైన దారిలోకి తీసుకువెళ్తాం, మేము మీకు ఆ విషయం గురించి క్షుణ్ణంగా వివరించి తీరాలి. ఒక వ్యక్తి దివ్యనేత్రం కోసం ఆరాటపడినప్పుడు, ఒక అడ్డంకి దానంతట అదే ఏర్పడి, దివ్యనేత్రం మూతపడిపోతుంది. దీనితోపాటు, ఒక వ్యక్తి తన త్రిలోకాంతర ఫా సాధనలో పెంపొందించుకున్న అతీంద్రియ శక్తులన్నీ ఈ భౌతిక శరీరంలో సహజంగానూ జన్మతః ఉండే శక్తులని నేను అందరికీ చెప్తున్నాను. ఇప్పుడు మనం వీటిని అతీంద్రియ శక్తులు అంటున్నాము. అవి కేవలం మన ఈ పరిమాణంలో మాత్రమే పనిచేసి, సామాన్య వ్యక్తులను లొంగదీసుకోవడానికి ఉపయోగపడతాయి. మీరు ఏం ఆశించి ఈ నీచమైన జిత్తుల వెనుక పరుగెడతారు? మీరు ఏదో ఒకదానికోసం వెంటపడతారు, అయితే, ఈ త్రిలోకాంతర ఫా స్థాయి దాటిన తర్వాత, ఇతర పరిమాణాలలో అవి ఉపయోగపడవు. త్రిలోకాతీత ఫా ఆధ్యాత్మిక సాధన సమయానికి, ఈ

అతీంద్రియ శక్తులన్నిటినీ వదిలిపెట్టి, సూక్ష్మరూపంలోకి సంగ్రహపరచి, ఒక లోతైన పరిమాణంలో సంరక్షించాలి. భవిష్యత్తులో, మీ ఆధ్యాత్మిక సాధనకు అది ఒక నివేదికలాగా పనికొస్తుంది. వాటి ప్రయోజనం అంత మాత్రమే.

త్రిలోకాతీత ఫా స్థాయిని చేరుకున్న తరవాత, ఒక వ్యక్తి తన ఆధ్యాత్మిక సాధన అంతటినీ, మొదటినించి పునఃప్రారంభించాలి. నేను ఇప్పుడే చెప్పినట్లు, ఆ వ్యక్తి శరీరం ఐదు మూలపదార్థాలను అధిగమించినట్టిది. అది ఒక బుద్ధ–శరీరం. అటువంటి శరీరం, బుద్ధ–శరీరం అని పిలవబడాలి కదా? ఈ బుద్ధ–దేహం, మొట్టమొదటినించి ఆధ్యాత్మిక సాధనను పునఃప్రారంభించి, అతీంద్రియ శక్తులను మళ్ళీ పెంపొందించుకోవాలి. అవి ఇప్పుడు "అతీంద్రియ శక్తులు" అని గాక, "బుద్ధ ఫా యొక్క దైవిక శక్తులు" అని పిలవబడతాయి. అవి అనంతమైన శక్తి కలిగి ఉండి, నిజంగా ప్రభావవంతమై, అన్ని పరిమాణాలలోనూ పని చెయ్యగలవు. మీరు అతీంద్రియ శక్తులు పొందడానికి ప్రాకులాడడం యొక్క ప్రయోజనం ఏమిటి? అతీంద్రియ శక్తులకై ప్రాకులాడేవారంతా, వాటిని ఉపయోగించి, సామాన్య వ్యక్తుల ముందు గొప్పగా ప్రదర్శించాలని మీరు అనుకోవడం లేదా? లేకపోతే వాటిని మీరెందుకు కోరుకుంటారు? అవి అదృశ్యంగానూ, అస్పృశ్యంగానూ ఉంటాయి. అలంకరణ కోసం అయినా, ఒక వ్యక్తి, అందమైన వాటికోసమే ప్రయత్నిస్తాడు. వాటిని ఉపయోగించాలన్న ఉద్దేశం, మీ అంతశ్చేతనలో ఉందన్న విషయం ఖచ్చితం. సామాన్య మానవ నైపుణ్యాల కోసం ప్రయత్నించినట్లు వాటికోసం ప్రాకులాడడం కుదరదు. అవి పూర్తిగా మానవాతీతమైనవి, మీరు వాటిని సామాన్య వ్యక్తుల ఎదుట గొప్పల కోసం ప్రదర్శించడం నిషేధితం. గొప్పలు ప్రదర్శించడమే ఒక బలమైన బంధం, అది ఒక సాధకుడు తప్పనిసరిగా వదిలివెయ్యాల్సిన ఒక చెడ్డ బంధం. మీరు వీటి వలన ధన సంపాదన చేసి సంపద కూడబెట్టడం, సామాన్య వ్యక్తుల నడుమ ఉపయోగించి, మీ స్వార్థ లక్ష్యాలను సాధించాలనుకోవడం నిషేధం. అది ఉన్నత స్థాయి విషయాలను ఉపయోగించి, సామాన్య పౌర సమాజాన్ని కలత పెట్టి, నాశనం చేసే ప్రయత్నమే. ఆ ఆలోచన కలిగి ఉండడమే చాలా దారుణమైనది. అందువల్ల వాటిని అలక్ష్యంగా ఉపయోగించకూడదు.

సాధారణంగా అతీంద్రియ శక్తులు మనుషులలోని రెండు వర్గాల వారిలో త్వరగా పెంపొందుతాయి. పిల్లలు, వృద్ధులు. ముఖ్యంగా వృద్ధ స్త్రీలు ఎక్కువ బంధాలు లేకుండా, సామాన్య వ్యక్తుల నడుమ మంచి షిన్ షిన్‌ను నిలుపుకుంటారు. వారి అతీంద్రియ శక్తులు వృద్ధి చెందిన తరవాత, వాటిని ప్రదర్శించాలనే కోరిక లేకుండా, తమనితాము సులభంగా అదుపులో పెట్టుకుంటారు. యువకులకు అతీంద్రియ శక్తులు పెంపొందించుకోవడ మన్నది ఎందువల్ల కష్టం? ముఖ్యంగా, సామాన్య వ్యక్తుల సమాజంలో ఒక యువకుడు, కొన్ని లక్ష్యాలను సాధించడానికి ఎందుకు కష్టపడతాడు! ఒకసారి అతీంద్రియ  శక్తులను పొందిన తరువాత, వాటిని, తన లక్ష్యసాధన కోసం ఉపయోగిస్తాడు. తన లక్ష్యాలను సాధించడానికి, వాటిని ఉపయోగించడం పూర్తిగా నిషేధం, అందువల్ల అతడు అతీంద్రియ శక్తులను పెంపొందించు కోలేడు.

ఆధ్యాత్మిక సాధన అన్నది, చిన్నపిల్లల ఆట కాదు, సామాన్య వ్యక్తులు ఉపయోగించగల నైపుణ్యమూ కాదు – అది ఒక గంభీరమైన విషయం. మీకు ఆధ్యాత్మిక సాధన చేయాలని ఎంత కోరిక ఉన్నదో, లేదా, మీరు సాధన చేయగలుగుతారా అన్నది, పూర్తిగా మీ షిన్ షిన్ పురోభివృద్ధి మీద ఆధారపడి ఉంటుంది. ఒక వ్యక్తి నిజంగా ఆరాటంతో పట్టుబట్టి, అతీంద్రియ శక్తులు పొంది ఉంటే అది ఒక భయానకమైన విషయం. అతడికి ఆధ్యాత్మిక సాధన అంటే లెక్కలేదని, ఈ విషయం గురించి ఏ మాత్రమూ ఆలోచించడని, మీరు గుర్తించగలరు. అతడి షిన్ షిన్ సామాన్య వ్యక్తుల స్థాయిలో ఉండడంవల్లనూ, అతడి అతీంద్రియ శక్తులు ప్రాకులాటవల్ల వచ్చిన కారణంగా, అతడు ఏ రకమైన తప్పులైనా చేస్తాడు. ఒక బ్యాంక్‌లో ఉన్న చాలా డబ్బులో కొంత దోచేస్తాడు. వీధిలో చాలా లాటరీ టికెట్లు అమ్ముతుంటారు, అతడు మొదటి బహుమతి పొందుతాడు. ఇటువంటి విషయాలు ఎందుకు జరగలేదు? కొందరు చీ గోంగ్ గురువులు: "సద్గుణములు లేనిదే, ఒక వ్యక్తి, అతీంద్రియ శక్తులు పొందిన తర్వాత, చెడ్డ పనులను అతిసులువుగా చేయగలుగుతాడు", అని అంటారు. ఈ ప్రకటన తప్పని నేనంటాను – అలా జరగదు. మీరు సద్గుణములకు విలువనివ్వకపోయినా, మీ షిన్ షిన్ సాధన చేసుకోకపోయినా,

మీరు అతీంద్రియ శక్తులను ఎంతమాత్రమూ పొందలేరు. కొందరు మంచి షిన్ షిన్‌తో తమ స్థాయులలో అతీంద్రియ శక్తులను పొందగలరు. అయితే తర్వాత, వాళ్ళు వాటిని తమంతట తాము సంభాళించుకోలేక, చేయకూడని తప్పులు చేస్తారు. ఇటువంటి స్థితి కూడా ఉంటుంది. ఎప్పుడయితే ఒక వ్యక్తి ఒక తప్పు పని చేస్తాడో, ఆ అతీంద్రియ శక్తులు బలహీనపడటం కానీ, పూర్తిగా పోవడం కానీ జరుగుతుంది. అవి ఒకసారి పోతే, శాశ్వతంగా పోయినట్లే. ఇంకా చెడ్డ విషయం ఏమిటంటే, అవి ఆ వ్యక్తి బంధాలను పెంచుకునేందుకు కారణమవుతాయి.

ఒక చీ గోంగ్ గురువు, తన అభ్యాసాన్ని ఒక వ్యక్తి మూడు లేదా ఐదు రోజులు అధ్యయనం చేస్తే, అతడు వ్యాధి నిర్మూలన చెయ్యగలుగుతాడని, చెప్పుకుంటాడు. అది ఒక వాణిజ్య ప్రకటన వంటిది, అందువల్ల అతడిని ఒక చీ గోంగ్ వ్యాపారి అని పిలవాలి. మీరందరూ ఒకసారి ఇది ఆలోచించండి: ఒక సామాన్య వ్యక్తి అయి ఉండి, మీలోని కొంత చీ ని ప్రసరింపచేసి, మరొక వ్యక్తిలో ఉన్న వ్యాధిని, ఎలా నిర్మూలన చెయ్యగలరు? మీ లోపల ఉన్నట్లుగానే ఒక సామాన్య వ్యక్తి శరీరం లోపల కూడా కొంత చీ ఉంటుంది. మీరు ఇప్పుడే అభ్యాసం మొదలుపెట్టారు, కేవలం మీ లావో గోంగ్ (7) బిందువు మాత్రమే తెరుచుకుంది, అందువల్ల మీరు చీని గ్రహించడమూ, ప్రసరింపచేయడమూ చెయ్యగలుగుతారు. మీరు ఇతరులకు వ్యాధి నిర్మూలన చేసేటప్పుడు, వారి శరీరాలలో కూడా చీ ఉంటుంది. ఒకవేళ వారిలోని చీ మీకు వ్యాధి నిర్మూలన చేస్తుందేమో! ఒక వ్యక్తిలోని చీ మరొక వ్యక్తిలోని చీ పై ఆధిక్యం ఎలా సాధిస్తుంది? చీ, వ్యాధులను ఏ మాత్రమూ నిర్మూలన చెయ్యలేదు. దీనికితోడు, మీరు ఒక రోగికి చికిత్స చేస్తున్నప్పుడు మీకు, ఆ రోగికి కలిపి ఒక క్షేత్రం ఏర్పడి, ఆ రోగిలోని వ్యాధికారకమైన చీ అంతా, మీ శరీరానికి వచ్చేస్తుంది. నిజానికి ఆ వ్యాధి ఆ రోగి శరీరంలో వేళ్ళూనుకొని ఉన్నప్పటికీ, అతనికి ఎంత వ్యాధి తీవ్రత ఉందో, మీకు కూడా అంత వ్యాధి తీవ్రత కలుగుతుంది. అధిక రోగగ్రస్త చీ కారణంగా, మీలో కూడా వ్యాధి పుడుతుంది. మీరు వ్యాధినిర్మూలన చేయగలను అనుకున్నప్పుడు, రోగులను చూడడం ప్రారంభిస్తారు. వారి కోరికను నిరాకరించక, ఒక బంధాన్ని ఏర్పరచుకుంటారు. ఇతరులకు వ్యాధి

నిర్మూలన చేయగలగడం ఎంత సంతోషకరమైన విషయం! వాళ్ళకు వ్యాధి నిర్మూలన ఎందువలన జరుగుతున్నది? మీరు దానిని గురించి ఆలోచించలేదా? నకిలీ చీ గోంగ్ గురువుల శరీరాలను ప్రేతాత్మ లేదా జంతువు ఆవహించి ఉంటుంది. అవి మిమ్మల్ని నమ్మించేందుకు వాటి సందేశాలలో కొన్నిటిని మీకు ఇస్తాయి. మీరు మూడు, ఐదు, ఎనిమిది లేదా పదిమంది రోగులకు నయం చేసేసరికి అవి ఖర్చైపోతాయి. దానికోసం శక్తిని వాడడంవల్ల, తర్వాత ఆ కాస్త శక్తి ఇక ఏమాత్రమూ ఉండదు. మీకు మీ స్వంత గోంగ్ లేదు, అప్పుడు మీకు అది ఎక్కడ దొరుకుతుంది? చీ గోంగ్ గురువులుగా మేము అనేక డజన్ల సంవత్సరాలు ఆధ్యాత్మిక సాధన చేశాము. గతంలో ఆధ్యాత్మిక సాధన చేయడం ఎంతో కష్టంగా ఉండేది. ఒక వ్యక్తి, ధర్మబద్ధమైన మార్గంలో కాకుండా, అడ్డదారిని గాని, దగ్గర దారినిగాని అనుసరిస్తే, ఆధ్యాత్మిక సాధన చేయడం చాలా కష్టం.

కొందరు చీ గోంగ్ పరమ గురువులు, చాలా గొప్పవారని మీకు తెలిసినా, వారిలో ఉన్న ఆ కొంచెం గోంగ్ సంపాదించేందుకే వారు దశాబ్దాల తరబడి ఆధ్యాత్మిక సాధన చేశారు. మీరు ఎప్పుడూ ఆధ్యాత్మిక సాధన చెయ్యలేదు. ఒక చీ గోంగ్ తరగతికి వెళ్ళి ఉపన్యాసం విన్నంత మాత్రాన, మీకు గోంగ్ ఎలా వస్తుంది? అదెలా సాధ్యం? మీరు తర్వాత, ఒక బంధాన్ని పెంచుకుంటారు. ఒక బంధం పెరిగిన తరవాత, ఒక వ్యాధిని నిర్మూలించలేనప్పుడు, మీలో ఆత్రుత కలుగుతుంది. ఒకవ్యక్తి, తన మంచిపేరును కాపాడుకోవడానికి, ఒక వ్యాధిని నిర్మూలన చేసేటప్పుడు, అతడి మనసులో ఏం ఉంటుంది? “ఈ రోగికి నయం అయ్యేందుకు, ఈ జబ్బును నేను పొందుదును గాక”. అయితే ఇది, దయాగుణంవల్ల చేస్తున్నది కాదు, ఎందుకంటే, ఆ వ్యక్తి కీర్తి, స్వలాభం అన్న బంధాలను ఏ మాత్రమూ వదులుకోలేదు. అతడు, కొంచెమైనా ఈ దయాగుణాన్ని పెంచుకోలేకపోయాడు. తన మంచిపేరు పోతుందని భయ పడతాడు. తన ప్రతిష్ట నిలబెట్టుకోవడానికి, ఆ వ్యాధిని తానే తీసుకుంటాడు. కీర్తి పట్ల ఎంతటి బలమైన బంధం! ఒకసారి ఈ కోరిక కలిగిన వెంటనే, ఆ జబ్బు అతడి శరీరంలోకి మార్చబడుతుంది – అది నిజంగా జరుగుతుంది. రోగికి వ్యాధి నిర్మూలన కాగా, అతడు ఆ వ్యాధితో ఇంటికి వెళ్తాడు. రోగికి

చికిత్స చేసిన తర్వాత, అతడు ఇంటి దగ్గర బాధను అనుభవిస్తాడు. అతడు ఒక వ్యాధిని నిర్మూలించాననుకుంటాడు. ఇతరులు అతడిని చీ గోంగ్ గురువు అని పిలుస్తుంటే, అతడు సంతోషిస్తాడు, చాలా ఆనందిస్తాడు. అది ఒక బంధం కాదా? అతడు ఒక వ్యాధిని నిర్మూలించలేనప్పుడు, తలవంచుకొని, భంగ పడినట్లు ఎంతో బాధపడతాడు. అది, కీర్తి, స్వలాభం పట్ల అతడికి గల బంధంవల్ల జరిగినది కాదా? దీనికితోడు, రోగుల యొక్క వ్యాధిపూరితమైన చీ అతడి శరీరానికి వచ్చేస్తుంది. ఆ నకిలీ చీ గోంగ్ గురువులు అతడికి తన శరీరం నించి దానిని ఎలా తొలగించాలో నేర్పించినప్పటికీ, అతడు ఎంత మాత్రమూ, కొంచెం కూడా దానిని తొలగించ లేడని నేను చెప్తున్నాను, ఎందుకంటే చెడ్డ చీ కి మంచి చీ కి మధ్య తేడాను తెలుసుకోగలిగిన శక్తి అతడికే లేదు. కాలం గడిచేకొద్దీ, అతడి శరీరం లోపల అంతటా, నల్లగా మారుతుంది, అదే కర్మ.

మీరు ఆధ్యాత్మిక సాధన చెయ్యాలని నిజంగా కోరుకుంటే, అది ఒక కఠిన పరీక్ష కాబోతున్నది. దాని గురించి మీరేం చేస్తారు? మీరు కర్మను తెల్లని పదార్థంగా మార్చేందుకు, ఎంతగా శ్రమపడాలి? అది చాలా కష్టం. ప్రత్యేకంగా, ఒక వ్యక్తి యొక్క జన్మ సంస్కారం ఎంత ఉన్నతమైనదైతే, ఈ విషయాన్ని ఎదుర్కోవడం అంత సులభం. కొంతమంది ఎప్పుడూ వ్యాధులు నిర్మూలన చేయాలనే కోరుకుంటూ ఉంటారు. మీలో దేనికోసమైనా ఆరాటం ఉంటే, ఒక జంతువు అది గమనించి, మిమ్మల్ని ఆవహించడానికి వస్తుంది. జంతువు లేదా ఆత్మ ఆవహించడం అంటే ఇదే. మీకు వ్యాధి నిర్మూలన చెయ్యాలనే కోరిక లేదూ? ఈ పని చేసేందుకు అది మీకు సహాయపడు తుంది. కానీ మీరు వ్యాధి నిర్మూలన చెయ్యడానికి, అది అకారణంగా సాయం చెయ్యదు. నష్ట పోనిదే లాభం రాదు. అది చాలా ప్రమాదకరమైనది, మీరు దానిని ఆహ్వానిస్తే అంతమైపోతారు. మీరు మీ ఆధ్యాత్మిక సాధనను ఎలా కొనసాగించగలరు? అది అంతా ముగిసిపోతుంది.

కొందరు, తమ జన్మ సంస్కారాన్ని, ఇతరుల కర్మతో పరస్పరం మార్చుకుంటారు. ఆ వ్యక్తి వ్యాధిగ్రస్తుడై ఉన్నాడు, అతనికి చాలా కర్మ ఉంది. ఒక తీవ్ర వ్యాధి ఉన్న రోగికి నయం చేస్తే, ఆ చికిత్స తర్వాత, మీరు ఇంట్లో

చాలా అసౌకర్యం అనుభవిస్తారు. గతంలో ఎందరో వ్యక్తులకు ఒక రోగిని చూసిన తర్వాత ఈ రకంగా అనిపించింది: ఆ రోగి కోలుకున్నాడు కానీ, ఇంట్లో మీరు జబ్బు పడ్డారు. కాలం గడిచేకొద్దీ, మీకు ఎక్కువ కర్మ వస్తూ ఉంటుంది: మీరు ఇతరులకు కర్మకు బదులుగా పుణ్యాన్ని ఇచ్చారు. నష్ట పోనిదే లాభం రాదు. మీకు దొరికేది వ్యాధి అయినా, కర్మకు బదులుగా పుణ్యాన్ని తప్పనిసరిగా ఇవ్వాలి. ఎంతకాలమైతే మీరు దీనిని కోరుకుంటారో, మిమ్మల్ని ఎవరూ ఆపరనీ, మీరు మంచివారని ఎవ్వరూ అనరనీ ఈ విశ్వంలో ఒక సూత్రం ఉంది. అధికంగా కర్మ కలిగినవాడు ఒక చెడ్డ వ్యక్తి అని విశ్వంలో ఒక ప్రత్యేకమైన నియమం ఉంది. మీ జన్మ సంస్కారాన్ని ఇతర వ్యక్తి కర్మకు బదులుగా ఇచ్చేస్తున్నారు. అధిక కర్మ కలిగి ఉంటే మీరు ఆధ్యాత్మిక సాధన ఎలా చెయ్యగలరు? ఆ వ్యక్తి వల్ల మీ జన్మ సంస్కారం పూర్తిగా నాశనమై పోతుంది. అది భయానకం కాదా? ఆ వ్యక్తి వ్యాధి పూర్తిగా నిర్మూలింపబడింది, అతడు ఇప్పుడు సుఖంగా ఉన్నాడు కానీ మీరు ఇంటిలో బాధ అనుభవిస్తున్నారు. మీరు ఇద్దరు కాన్సర్ రోగులకు నయం చేస్తే, వారి స్థానాలను మీరు తీసుకోవలసి ఉంటుంది. ఇది ప్రమాదకరం కాదా? ఇది దాని విధానం, చాలామందికి ఈ నిజం తెలియదు.

కొందరు నకిలీ చీ గోంగ్ గురువులు ఎంతటి ప్రసిద్ధులైనా లొంగి పోకండి. ఒక ప్రసిద్ధ వ్యక్తికి తప్పని సరిగా విషయ పరిజ్ఞానం ఎక్కువ ఉండక పోవచ్చు. సామాన్యవ్యక్తులకు ఏమి తెలుసు? అతిగా ప్రచారమైన విషయాలను నమ్మేస్తారు. వారు ఇప్పుడు ఆ పనులు చేస్తున్నట్లు మీరు తెలుసుకున్నా, వాళ్ళు ఇతరులకు హాని చెయ్యడమే కాకుండా, తమకుతాము కూడా హాని చేసుకుంటున్నారు. ఒకటి రెండు సంవత్సరాలలో, వారికి ఏం జరుగుతుందో, మీరు చూస్తారు. ఆధ్యాత్మిక సాధనను ఈ విధంగా దిగజార్చకూడదు. ఆధ్యాత్మిక సాధన వ్యాధులను నయం చేయగలదు, కానీ దానిని వ్యాధి నిర్మూలన చెయ్యాలనే ఉద్దేశంతో వాడకూడదు. అది ఒక సామాన్య వ్యక్తి నైపుణ్యం వంటిది కాక ఒక అతీంద్రియమైన విషయం. మీరు అలక్ష్యంగా దానిని నాశనం చేయడం అన్నది పూర్తిగా నిషిద్ధం. ఈనాడు కొందరు నకిలీ చీ గోంగ్ గురువులు ఈ విషయాలను చిందరవందర చేసి, చీ గోంగ్‌ను

కీర్తిని, సంపదను కూడబెట్టుకోడానికి ఉపయోగిస్తున్నారు. వాళ్ళు తమ చెడు ప్రభావాన్ని వ్యాపింపజేస్తున్నట్టి తెగలు; వారి సంఖ్య, అసలైన చీ గోంగ్ గురువుల సంఖ్యను ఎన్నో రెట్లు ఎక్కువగా, దాటిపోయింది. సామాన్య వ్యక్తులు అన్ని విషయాలను ఈ విధంగా చెప్తుంటే, చేస్తుంటే, మీరు సులభంగా వాటిని నమ్మేస్తారా? చీ గోంగ్ అలా ఉంది అని మీరనుకోవచ్చు, కానీ, అలా కాదు. నేను చెప్పేది ఒక ఖచ్చితమైన నియమం.

సంఘంలో సామాన్య వ్యక్తుల మధ్య రకరకాల పరస్పర చర్యలు జరుగుతున్న క్రమంలో, ఒక వ్యక్తి స్వలాభం కోసం చెడ్డ పనులు చేసి, ఇతరులకు ఋణపడిపోతాడు. ఒక వ్యక్తి ఋణాలు తీర్చుకోవడానికి, కష్టాలు అనుభవించాలి. ఒకవేళ మీరు మీ ఇష్టానుసారం ఒక వ్యాధికి చికిత్స చేశారనుకోండి. మీరు నిజంగా ఒక వ్యాధిని నయం చేసేందుకు ఎలా అనుమతించబడతారు? బుద్ధులు ప్రతిచోటా ఉన్నారు. అంతమంది ఉన్నప్పుడు వారు అటువంటి పనిని ఎందుకు చెయ్యరు? ఒక బుద్ధుడు మానవజాతి మొత్తానికి సుఖం ఇస్తే ఎంత అద్భుతంగా ఉంటుంది! అతడు ఎందుకు చెయ్యడు? ఒక వ్యక్తి తన కర్మను తానే తీర్చుకోవాలి. ఈ నియమాన్ని అతిక్రమించేందుకు, ఎవరూ సాహసించలేరు. ఆధ్యాత్మిక సాధన క్రమంలో, ఒక సాధకుడు మరొక వ్యక్తికి, దయతో ఎప్పుడైనా సాయం చెయ్యొచ్చు; ఐతే, అది ఆ వ్యాధిని కేవలం వాయిదా వేస్తుంది. మీరు ఇప్పుడు బాధపడకపోతే, తర్వాత బాధపడతారు. ఇంకా, ఒక వ్యక్తి, మీకు వ్యాధికి బదులు డబ్బు పోగొట్టుకోవడంగా లేదా ఒక కష్టం కలగడంగా మార్చవచ్చు. ఇది ఇలా జరగొచ్చు. ఒక వ్యక్తి కర్మను ఒకేసారి నిజంగా తొలగించడం, సాధకుల విషయంలో మాత్రమే చేయబడుతుంది, సామాన్య వ్యక్తులకు కాదు. ఇక్కడ నేను కేవలం నా సాధన యొక్క నియమాలను మాత్రమే బోధించడం లేదు. మొత్తం విశ్వం యొక్క నియమాలను గురించి చెప్తున్నాను, సాధకుల సమాజంలోని అసలైన నిజాలను చర్చిస్తున్నాను.

ఇక్కడ మేము మీకు వ్యాధులకు చికిత్స చేయడం నేర్పం. మిమ్మల్ని ఒక గొప్ప మార్గానికి, ధర్మబద్ధమైన మార్గానికి తీసుకువెళ్తున్నాం, మిమ్మల్ని ఉద్ధరిస్తున్నాం. అందువల్ల, ఫాలున్ దాఫా సాధకులు వ్యాధి నిర్మూలన

చెయ్యడానికి అనుమతింపబడరని ఎల్లప్పుడూ నా ఉపన్యాసాలలో, చెప్తుంటాను. మీరు గనక వ్యాధులకు చికిత్స చేస్తే మీరు ఫాలున్ దాఫా సాధకులు కానే కారు. మేము మిమ్మల్ని ధర్మబద్ధమైన మార్గానికి తీసుకువెళ్తున్నందువల్ల, త్రిలోకాంతర ఫా ఆధ్యాత్మిక సాధన క్రమంలో, మీ శరీరం అత్యంత-శక్తి పదార్థం చేత పూర్తిగా మారేవరకు నిరంతరం శుద్ధి చేయబడుతూ ఉంటుంది. మీరు మీ శరీరంలో ఆ నల్లని పదార్థాలను ఇంకా కూడబెట్టుకుంటూ ఉంటే, ఆధ్యాత్మిక సాధన ఎలా చెయ్యగలుగుతారు? ఆ పదార్థాలే కర్మ! మీరు ఎట్టి పరిస్థితిలోనూ ఆధ్యాత్మిక సాధన చేయలేరు. అధికమైన కర్మ ఉన్నప్పుడు, మీరు దానిని భరించలేరు. మీరు ఎక్కువగా బాధపడితే ఆధ్యాత్మిక సాధన చేయలేరు. ఇదే కారణం. నేను ఈ ఫాను బహిర్గతం చేశాను, అయినా నేను ఏం నేర్పానో మీకు తెలియకపోవచ్చు. ఈ దాఫాను బహిర్గతం చేయొచ్చు కాబట్టి, దానిని రక్షించుకోవడానికి మార్గాలు ఉన్నాయి. మీరు గనక ఇతరుల వ్యాధులకు చికిత్స చేస్తే, మీ ఆధ్యాత్మిక సాధన కోసం మీ శరీరానికి ఇచ్చినవన్నీ నా ఫాషెన్ తిరిగి తీసేసుకుంటుంది. ఇంతటి అమూల్యమైన దీన్ని మీ కీర్తి, స్వలాభాల కోసం అలక్ష్యంగా నాశనం చేయడాన్ని మేము అనుమతించ లేము. ఫాలో అవసరమైన వాటిని మీరు పాటించకపోతే, మీరు ఒక ఫాలున్ దాఫా సాధకుడు కారు. మీరు మళ్ళీ ఒక సామాన్య వ్యక్తిగా ఉండాలని అనుకుంటున్నారు కాబట్టి, మీ శరీరాన్ని మళ్ళీ సామాన్య వ్యక్తి స్థాయికి మారుస్తాం, చెడ్డ విషయాలన్నీ మళ్ళీ మీకు తిరిగి ఇవ్వబడతాయి.

నిన్నటి ఉపన్యాసం అయిన తరువాత మీలో చాలామందికి మీ శరీర మంతా తేలికగా ఉన్నట్లు అనిపించింది. అయినా, చాలా తీవ్రమైన వ్యాధులు కలిగి ఉన్న అతికొద్దిమంది మాత్రం, నిన్న అసౌకర్యాన్ని అనుభవించారు. నిన్న మీ శరీరంలోని చెడ్డవాటిని తొలగించిన తరవాత, మీలో ఎక్కువమందికి మొత్తం తేలికగా అనిపించింది. అయినా, మన విశ్వంలో "నష్టపోనిదే లాభం రాదు" అన్న నియమం ఉంది. మేము మీకోసం అన్నిటినీ తొలగించలేము. మీరు కొంత బాధను భరించకుండా చెయ్యడం అన్నది పూర్తిగా నిషిద్ధం. అంటే, మేము మీ వ్యాధికి, అనారోగ్యానికి గల మూలకారణాలను తొలగించాము. కానీ మీకు ఇంకా అనారోగ్యం యొక్క క్షేత్రం ఉన్నది. తక్కువ స్థాయిలో మూడో

కన్ను తెరుచుకున్న ఒక వ్యక్తి మీ శరీరంలో గుత్తులుగా ఉన్న నల్లని చీ, మలినమై వ్యాధిగ్రస్తమైన చీ ని చూడగలుగుతారు. ఇంకా, అది ఎక్కువ సాంద్రత కలిగిన గుత్తులుగా చిక్కబడి ఉన్న నల్లని చీ కూడా. ఒకసారి విచ్చిపోయిన తర్వాత, అది మీ శరీరం అంతటా వ్యాపిస్తుంది.

ఇవాళ్టి నించి, కొందరికి విపరీతమైన జలుబుతో బాధపడుతున్నట్లుగా, తమ శరీరం చాలా చల్లగా ఉన్నట్లుగా అనిపిస్తుంది, వారికి ఎముకలలో కూడా నొప్పి పుట్టొచ్చు. మీలో చాలామందికి ఎక్కడో అసౌకర్యంగా అనిపిస్తుంది. మీ కాళ్ళు నొప్పిగానూ, మీ తల తిరుగుతున్నట్లుగా అనిపించ వచ్చు. చీ గోంగ్ వ్యాయామాల వల్లగానీ, చీ గోంగ్ గురువు వల్లగానీ నయమైందని అనిపించిన వ్యాధిగ్రస్తమైన శరీర భాగం, మళ్ళీ వ్యాధిగ్రస్తం అవుతుంది. ఎందుకంటే ఆ చీ గోంగ్ గురువు మీ వ్యాధిని నయం చెయ్యలేదు, కేవలం వాయిదా వేశాడు. అది అక్కడే ఉంది, ఇప్పుడే కాకపోయినా మళ్ళీ తిరగబెట్టొచ్చు. మేము దాన్ని తవ్వి తీసి, వేళ్ళతో సహా పూర్తిగా తొలగించ వలసిన అవసరం ఉంటుంది. దీనితో, మీ వ్యాధులు తిరగబెట్టాయని మీకు అనిపించొచ్చు. ఇది మీ కర్మను మూలాలతో సహా తొలగించడం కోసమే. అందువల్ల మీలో ప్రతిచర్యలు ఉంటాయి. కొందరికి భౌతికంగా ఎక్కడో ప్రతిచర్యలు ఉండొచ్చు. రకరకాలైన అసౌకర్యం అనుభవం అవడంవల్ల, కొందరికి ఏదో ఒక రకంగా అసౌకర్యం వ్యక్తమవుతుంది. ఇవన్నీ సహజమే. మీకు ఎటువంటి అసౌకర్యం ఉన్నా కూడా ఈ తరగతికి రావడం అన్నది తప్పకుండా కొనసాగించాలి, అని నేను అందరికీ చెప్తున్నాను. ఒకసారి తరగతిలో అడుగుపెట్టగానే మీ లక్షణాలన్నీ మాయమైపోయి, మీకు ఏ విధమైన ప్రమాదమూ కలగదు.

మీకందరికీ ఒక విషయం ప్రత్యేకంగా చెప్పాలనుకుంటున్నాను: మీరు “వ్యాధి”తో ఎంతగా బాధపడినా, మీరు వస్తూ ఉంటారని ఆశిస్తాను, ఎందుకంటే ఫా ని పొందడం దుర్లభం. మీకు ఎప్పుడైతే అసౌకర్యం అనిపిస్తుందో, విపరీతమైన అంచెకు చేరిన తర్వాత, మొత్తం పరిస్థితి మొదటికొస్తుందని అది సూచిస్తుంది. మీ శరీరమంతా శుద్ధి అవుతుంది, పూర్తిగా శుద్ధి చెందాలి. మీ వ్యాధి మూలం తొలగించబడింది, ఇక మిగిలినది

కొంచెం నల్లని చీ, మీరు కొంత బాధను అనుభవించి, కొంత నొప్పిని భరించడంకోసం అది మిగిలిపోయి, దానంతట అదే బయటకు వచ్చేస్తుంది. మీరు కొంచెమైనా బాధ అనుభవించకపోవడం నిషిద్ధం.

సామాన్య మానవ సంఘంలో, మీ కీర్తి, స్వలాభాలకై ఇతరులతో పోటీ పడుతుంటారు. మీరు సరిగ్గా తినలేరు, నిద్రపోలేరు, మీ శరీరం ఒక చెడిపోయిన స్థితిలో ఉంటుంది. ఇంకొక పరిమాణం నించి చూసినప్పుడు, మీ ఎముకలు అన్నీ నల్లగా ఉంటాయి. ఇటువంటి శరీరం కలిగియుండి, ఒక్కసారిగా శుద్ధి చేయబడినప్పుడు మీలో ప్రతిక్రియ లేకపోవడం అసంభవం. అందువల్ల మీలో ప్రతిక్రియలు ఉంటాయి. కొందరికి వాంతులు, విరేచనాలు అవవచ్చు. వేరు వేరు ప్రాంతాలనించి వచ్చిన ఎందరో సాధకులు, ఇంతకు ముందు ఈ విషయాన్ని తమ అనుభవాల నివేదికలలో "గురువుగారూ, మీ ఉపన్యాసం విన్న తర్వాత, ఇంటికి వెళ్ళే దారి పొడుగునా, నేను ఒక మరుగుదొడ్డికోసం వెతికాను" అని చెప్పారు. మీ అంతర్గత అవయవాలన్నీ శుద్ధి కావాలి గనక అలా జరుగుతుంది. కొందరు వ్యక్తులు నిద్రపోయి, నేను ఉపన్యాసం ముగించగానే లేస్తారు. ఇదంతా ఎందువల్ల? ఎందుకంటే, వారి మెదళ్ళలో, చికిత్స చేయవలసిన వ్యాధులు ఉన్నాయి. ఒక వ్యక్తి మెదడు మీద పనిచెయ్యడం మొదలుపెడితే అతడు తట్టుకో లేడు. అందువల్ల అతడికి మత్తు ఇవ్వడమో, స్పృహ లేని స్థితిలో ఉంచడమో జరగాలి. అయినా, కొందరికి, నా ఉపన్యాసం వినడానికి ఏ సమస్యా ఉండదు. వారు గాఢనిద్రలో ఉన్నా, ఒక్కమాట కూడా వదలకుండా మొత్తం వినగలుగుతారు. ఆ తర్వాత, శక్తివంతంగా అవుతారు, రెండు రోజులు నిద్ర లేకపోయినా, నిద్రమత్తు లేకుండా ఉండగలరు. సరిచెయ్యవలసిన అవసరం ఉన్న అటువంటి వ్యాధి సూచికలు ఉన్నాయి. మీ శరీరం మొత్తం శుద్ధి చేయబడుతుంది.

మీరు ఒక నిజమైన ఫాలున్ దాఫా సాధకుడైతే, మీరు బంధాలను వదులుకోగలిగితే, ఈ క్షణంనించి మీలోని ప్రతి ఒక్కరిలో ప్రతిచర్యలు జరుగుతాయి. బంధాలను వదులుకోలేనివారు, తాము వదిలేశామని చెప్పుకున్నా, వారు నిజంగా వదులుకోలేదు. కాబట్టి, ఇది సాధించడం, చాలా కష్టం. నా ఉపన్యాసాలలోని సారాన్ని తర్వాతి కాలంలో అర్థం చేసుకునే

వ్యక్తులు కూడా కొందరు ఉంటారు. వారు బంధాలను వదిలిపెట్టడం మొదలుపెడతారు, వారి శరీరాలు శుద్ధి చెందుతాయి. ఇతరుల శరీరాలు తేలిక పడినట్లు అనిపిస్తూ ఉండగా, వీరికి మాత్రం వ్యాధి నిర్మూలన జరగడం అనేది అప్పుడే మొదలై, అసౌఖ్యంగా అనిపిస్తుంది. ప్రతి తరగతిలోనూ తక్కువ జ్ఞానోదయ లక్షణం కలిగి వెనకబడే అటువంటి వ్యక్తులుంటారు. అందువల్ల, మీకు ఎటువంటి పరిస్థితి ఎదురైనా, అది సహజమే. నేను ఇతర ప్రదేశాలలో తరగతులు నిర్వహించినప్పుడు, ఇటువంటి పరిస్థితి ఎప్పుడూ సంభవించేది. కొందరు చాలా అసౌఖ్యం కలగడంవల్ల, తమ ఆసనాలలోనించి కనీసం కదలకుండా, నేను వేదిక నించి దిగివచ్చి తమకు చికిత్స చేయాలని వేచి ఉండేవారు. నేను అలా చెయ్యను. మీరు కనీసం ఈ పరీక్షను దాటలేకపోతే, ముందుముందు రాబోయే ఇంతకన్నా పెద్ద కష్టాలను ఎదుర్కొన్నప్పుడు ఆధ్యాత్మిక సాధనను ఎలా కొనసాగించగలరు? ఇటువంటి చిన్న కష్టాన్ని మీరు అధిగమించలేరా? అందరూ చెయ్యగలరు. అందువల్ల, ఎవ్వరైనా వ్యాధులు నిర్మూలించమంటూ నా దగ్గరికి రావద్దు, నేను చికిత్స కూడా చెయ్యను. మీరు "వ్యాధి" అన్న మాట అనగానే, నేను వినడానికి ఇష్టపడను.

మానవులను రక్షించడం చాలా కష్టం. ప్రతి తరగతిలో, తక్కినవారితో సమానంగా లేక, వెనకబడి ఉన్నవారు ఐదునించి పదిశాతం మంది ఎప్పుడూ ఉంటారు. ప్రతివారూ ఒక తావో అవడం అనేది అసాధ్యం. ఆధ్యాత్మిక సాధనను కొనసాగించేవారిలో కూడా, విజయం సాధించగలరా, మీరు ఆధ్యాత్మిక సాధన చేయాలని నిశ్చయించుకున్నారా అన్న విషయాన్ని గమనించ వలసి ఉంది. ప్రతి ఒక్కరూ బుద్ధుడు కావడం అన్నది అసాధ్యం. అసలైన దాఫా సాధకులు ఈ పుస్తకం చదవడంవల్ల కూడా ఇటువంటి అనుభవాలనే పొంది, తమతమ అర్హతలనుబట్టి ఏదైనా పొందగలుగుతారు.

* * * *

**అర్థములు:**

1. షాన్ ఘున్ బిందువు – ఒక వ్యక్తి కనుబొమల మధ్యనున్న ఆక్యుపంక్చర్ బిందువు.

2. లీ – దూరం కొలవడానికి చైనీయులు ఉపయోగించే కొలమానం. (అర కిలోమీటరు). "108 వేల లీ" అన్నది చాలా దూరాన్ని సూచించడానికి చైనీయ భాషలో సాధారణంగా ఉపయోగించే పద ప్రయోగం.
3. సరియైన ఫలము – బుద్ధ సిద్ధాంతంలో ఫలస్థితిని చేరుకోవడం.
4. టీచర్ – (మాస్టర్ అని కూడా పిలుస్తారు) చైనాలో ఒక బోధకుడిని గౌరవ పూర్వకంగా చేసే సంబోధన.
5. యువాన్ – చైనీయ ద్రవ్య కొలమానం. (దాదాపుగా = 0.12 అమెరికన్ డాలర్)
6. ఫా షెన్ – "ధర్మ శరీరం"; గోంగ్ మరియు ఫా లతో ఏర్పడిన శరీరం.
7. లావో గోంగ్ బిందువు – అరచేతి మధ్య ఉన్న ఆక్యుపంక్చర్ బిందువు.

* * * *

# మూడవ ఉపన్యాసము

## సాధకులందరినీ నా శిష్యులుగా ఆదరిస్తాను

నేను ఏం చేస్తున్నానో మీ అందరికీ తెలుసా? స్వయంగా అధ్యయనం చేయడం ద్వారా ఆధ్యాత్మిక సాధన చేయగలిగేవారితో సహా సాధకులందరినీ నా శిష్యులుగా ఆదరిస్తాను. నేను ఆ విధంగా చెయ్యకపోతే ఉన్నత స్థాయిలలో మీకు సాధన నేర్పుతున్నప్పుడు అది ఉపయోగపడదు. లేకపోతే, బాధ్యతా రాహిత్యంగా, సమస్యను కల్పించినట్లుగా అవుతుంది. సామాన్య మానవులకు తెలియకూడని ఎన్నో విషయాలు, అనేక నియమాలూ మీకు తెలియజేశాం. మీకు నేను ఎన్నో విషయాలు అందించడమే కాకుండా, దాఫాను బోధించడం కూడా జరిగింది. ఇందులో ఉన్న కొన్ని ఇతర విషయాలలో భాగంగా, మీ శరీరం శుద్ధి చేయబడింది. అలాగే, మిమ్మల్ని శిష్యులుగా పరిగణించక పోవడం అన్నది నాకు ఎంతమాత్రమూ సమ్మతం కాదు. దివ్య రహస్యాలను అలక్ష్యంగా సామాన్య వ్యక్తులకు వెల్లడి చేసేందుకు అనుమతి లేదు. కానీ ఇక్కడ ఒక విషయం చెప్పాలి. ఇప్పుడు కాలం మారింది. మనం సాంప్రదాయ బద్ధంగా చేసే మోకరించి నమస్కరించడం లేదా అభివాదం చెయ్యం. అటు వంటి లాంఛనప్రాయమైన పని మనం చెయ్యం, దానివల్ల ప్రయోజనం లేదు, అప్పుడు అది ఒక మతాచారం అవుతుంది. మనం అలా చెయ్యం. మీరు బయట అడుగుపెట్టిన తర్వాత  ముందర వలెనే వ్యవహరిస్తూ, మీకు ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తూ, సామాన్య మానవుల నడుమ కీర్తి, స్వలాభాల కోసం పోటీ పడుతూ, పోట్లాడుతూ ఉంటే, మీరు గురువుకు మోకరించి నమస్కారం చెయ్యడం, గురువుకి పూజ చెయ్యడం వల్ల ఉపయోగం ఏమిటి? నా పేరిట ఉన్న ఫాలున్ దాఫాకి ఉన్న ప్రతిష్టను కూడా మీరు చెడగొట్టగలరు!

అసలైన ఆధ్యాత్మిక సాధన పూర్తిగా మీ హృదయం మీద ఆధారపడి ఉంటుంది. మీరు ఆధ్యాత్మిక సాధన చేసినంత కాలమూ, ఆధ్యాత్మిక సాధన విషయంలో దృఢనిశ్చయంతో ఉన్నంత కాలమూ, మేము మిమ్మల్ని శిష్యులుగా ఆదరిస్తాము. మిమ్మల్ని ఈ విధంగా ఆదరించకపోవడం నాకు అసాధ్యం. అయితే, కొంతమంది వ్యక్తులు తమను తాము నిజంగా సాధకులుగా పరిగణించుకొనక, ఆధ్యాత్మిక సాధనను కొనసాగించరు. కొందరికి అది అసాధ్యం. కానీ చాలామంది నిజంగా ఆధ్యాత్మిక సాధనను కొనసాగిస్తారు. మీరు ఆధ్యాత్మిక సాధన చేసినంత కాలమూ, నేను మిమ్మల్ని శిష్యులుగా ఆదరిస్తాను. ప్రతిరోజు కొన్ని రకాల వ్యాయామాలు చేసినంత మాత్రాన మిమ్మల్ని ఫాలున్ దాఫా శిష్యునిగా పరిగణించాలా? ఆ అవసరం లేదు. ఎందుకంటే నిజమైన ఆధ్యాత్మిక సాధనలో మేము స్థిరపరచిన షిన్ షిన్ ప్రమాణాలు పాటించి, మీరు నిజంగా మీ షిన్ షిన్‌ను పెంపొందించుకోవాలి– అప్పుడు అది నిజమైన ఆధ్యాత్మిక సాధన. మీరు మీ షిన్ షిన్‌ను, ప్రతి విషయాన్నీ బలోపేతం చేసే బలమైన శక్తిని పెంపొందించుకోకుండా, కేవలం వ్యాయామాలు చేస్తే దానిని నిజమైన ఆధ్యాత్మిక సాధన అననూ లేము; మేము మిమ్మల్ని మా శిష్యులుగా ఆదరించనూలేము. మా ఫాలున్ దాఫాలో అవసరమైన వాటిని పట్టించుకోకుండా, సామాన్య వ్యక్తుల నడుమ, మునుపటి లాగే ప్రవర్తిస్తూ, షిన్ షిన్‌ను పెంపొందించుకోక అలా చేసుకుంటూ పోతే వ్యాయామాలు చేస్తున్నప్పటికీ మీరు కొన్ని సమస్యలను ఎదుర్కోవలసి వస్తుంది. ఫాలున్ దాఫా సాధన వల్లనే మీరు దారితప్పడం జరిగిందని మీరు వాదించొచ్చు. ఇవన్నీ జరగొచ్చు. అందు వల్లనే, మీరు మన షిన్ షిన్‌లో అవసరమైన ప్రమాణాలు పాటించాలి – అప్పుడే మీరు అచ్చమైన ఒక సాధకుడు. నేను మీ అందరికీ స్పష్టంగా చెప్పాను. అందువల్ల, గురువుకు పూజ చెయ్యడమనే లాంఛనం కోసం దయచేసి, నా దగ్గరికి రావద్దు. మీరు నిజమైన ఆధ్యాత్మిక సాధన చేసినంత కాలం, మిమ్మల్ని ఇలాగే ఆదరిస్తాను. నా ఫాషెన్ లెక్కకు అందనంత అసంఖ్యాకంగా ఉన్నాయి. ఇక్కడున్న సాధకులే కాక, ఇంకా ఎంత ఎక్కువమంది వ్యక్తులున్నా, నేను వాళ్ళందరినీ రక్షించగలను.

# బుద్ధ సిద్ధాంత చీ గోంగ్ మరియు బౌద్ధమతం

బుద్ధ సిద్ధాంత చీ గోంగ్ అంటే బౌద్ధమతం కాదు. నేను అందరికీ ఈ విషయాన్ని తప్పనిసరిగా స్పష్టం చెయ్యదల్చుకున్నాను. అలాగే, తావో సిద్ధాంత చీ గోంగ్ అంటే, తావో మతం కాదు. మీలో కొందరు ఇటువంటి విషయాలలో ఎప్పుడూ అయోమయంలో పడతారు. కొంతమంది బౌద్ధమత భిక్షువులు, కొందరు సాధారణ బౌద్ధులు. వారు తమకు బౌద్ధమతం గురించి కొంచెం ఎక్కువ తెలుసని అనుకుంటూ మన సాధకుల సంఘంలో బౌద్ధమతం గురించి ఉత్సాహంగా ప్రచారం చేస్తూ ఉంటారు. మీరు అటువంటివి చెయ్యకూడదని నేను చెప్తున్నాను, ఎందుకంటే అది మరొక సాధనాసిద్ధాంతం. మతం మత రూపంలోనే ఉంటుంది. కానీ ఇక్కడ మేము మీకు మా సిద్ధాంతంలోని సాధనాపరమైన భాగాన్ని బోధిస్తున్నాం. ఫాలున్ దాఫా శిష్యులైన సన్యాసులు, సన్యాసినులు తప్ప, తక్కినవారందరు మతపరమైన విషయాలు పాటించకూడదు. అందువల్ల మన సిద్ధాంతం, ధర్మం అంతరించి పోయే కాలంలో ఉన్న బౌద్ధమతం కాదు.

బౌద్ధమతంలో ఉన్న ధర్మం బుద్ధ ఫాలోని ఒక చిన్ని భాగం మాత్రమే. ఉన్నతస్థాయి ఫాలో ఇంకా అనేక రూపాలు ఉన్నాయి. భిన్న స్థాయులలో కూడా భిన్నమైన ఫా ఉంటుంది. శాక్యముని, ఎనభైనాలుగువేల ఆధ్యాత్మిక సాధనామార్గాలు ఉండేవని చెప్పారు. బౌద్ధమతం, కొన్ని ఆధ్యాత్మిక సాధనా మార్గాలనే కలిగి ఉంది. అందులో టియాన్టై, హ్యూయన్, జెన్ బౌద్ధమతం, పవిత్రభూమి, తాంత్రికవిద్య మొదలైనవి ఉన్నాయి. వాటి సంఖ్య కూడా తక్కువ కాదు! అందు వల్ల బౌద్ధమతం, బుద్ధా ఫా అంతటినీ తెలపలేదు, అది బుద్ధా ఫాలోని ఒక చిన్ని భాగం మాత్రమే. మా ఫాలున్ దాఫా కూడా, బుద్ధ సిద్ధాంతంలోని ఎనభై నాలుగు వేల ఆధ్యాత్మిక సాధనామార్గాలలో ఒకటి, దానికి ప్రధానమైన బౌద్ధమతంతో లేదా ధర్మం అంతరించే దశలోని బౌద్ధ మతంతో ఎటువంటి సంబంధమూ లేదు; దానికి ఆధునిక మతాలతోనూ సంబంధం లేదు.

బౌద్ధమతం 2500 ఏళ్ళ క్రిందట ప్రాచీన భారతదేశంలో శాక్యముని

చేత స్థాపింపబడింది. శాక్యముని గోంగ్ బంధనాన్ని విప్పుకొనే స్థితికి చేరి జ్ఞానోదయం పొందినప్పుడు, తాను అంతకుముందు చేసిన సాధనను గుర్తు చేసుకొని, ప్రజలను కాపాడేందుకు దానిని వెల్లడి చేశారు. ఆ సిద్ధాంతంలో నించి ఎన్ని వేల గ్రంథాలు వెలువడినా, అందులో కేవలం, మూడు పదాలు ఉన్నాయి. ఈ సిద్ధాంతంలో ఉన్న మూడు లక్షణాలు ఏమిటంటే: “నియమము, సమాధి, జ్ఞానము” (1) నియమాలనేవి, సామాన్య మానవుల కోరికలన్నిటినీ త్యజించడానికీ, మీచేత స్వలాభం కోసం చేసే ప్రయత్నాలను బలవంతంగా మాన్పించడానికి, ప్రాపంచిక విషయాలు మొదలైన వాటిని తెంచుకోవడం కోసమే ఉద్దేశింపబడి ఉన్నాయి. ఈ విధంగా, ఒక వ్యక్తి మనసు, ఏ విషయం గురించిన ఆలోచనలూ లేకుండా శూన్యం అయి, నిశ్చలస్థితిని పొందుతుంది. అవి ఒకదాని నొకటి పరస్పరం పూరించుకుంటాయి. నిశ్చలస్థితిని సాధించ గలిగిన తర్వాత, ఒక వ్యక్తి అసలైన ఆధ్యాత్మిక సాధన చెయ్యడానికి ధ్యానంలో కూర్చొని, ఆధ్యాత్మిక సాధనలో పురోగతి సాధించడానికి సమాధి స్థితిని ఆధారం చేసుకోగలడు. ఆ సిద్ధాంతంలో ఇది అసలైన ఆధ్యాత్మిక సాధనాభాగం. అది వ్యాయామాలు చేయడాన్ని గురించి లక్ష్యపెట్టదు, ఒక వ్యక్తి యొక్క “బెంటి” (2) ని మార్చదు. ఒక వ్యక్తి కేవలం, తన స్థాయి యొక్క ఎత్తును నిర్ణయించే గోంగ్‌ను మాత్రమే సాధన చేస్తాడు. అందువల్ల అతడు తన షిన్ షిన్‌ను మాత్రమే సంస్కరించుకుంటాడు. అతడు తన శరీర సాధనను చేయడు కనుక గోంగ్‌లో పరివర్తన గురించి లక్ష్యపెట్టడు. అదే సమయంలో ధ్యానం ద్వారా సమాధి స్థితిలో ఎక్కువ కాలం ఉండగలిగే సామర్థ్యాన్ని బలపరచు కుంటాడు, బాధను సహించి కర్మను తొలగించుకోవడానికి ధ్యానంలో కూచుంటాడు. “జ్ఞానం” అనేది ఒక వ్యక్తి గొప్ప వివేకంతో జ్ఞానోదయం పొందడాన్ని సూచిస్తుంది, ఇంకా అతడు విశ్వ సత్యాన్నీ, విశ్వంలోని భిన్న పరిమాణాలలోని సత్యాన్ని కూడా చూడగలుగుతాడు. అన్ని దివ్యశక్తులు వెలువడుతాయి. జ్ఞానంపట్ల ఎరుక కలగడమూ, జ్ఞానోదయం పొందడాన్నీ, గోంగ్ బంధనం విప్పుకోవడం అని కూడా అంటారు.

శాక్యముని ఈ ఆధ్యాత్మిక సాధనామార్గాన్ని స్థాపించిన సమయానికి భారతదేశంలో ఎనిమిది మతాలు ఉండేవి. లోతుగా వేళ్ళూనుకున్న బ్రాహ్మణత్వం

అన్న మతం ఉండేది. శాక్యముని తన జీవిత పర్యంతం, ఇతర మతాలతో భావజాలపరంగా పోరాడారు. శాక్యముని బోధించినది ఒక ధర్మబద్ధమైన మార్గం కనుక, ఆయన బోధించిన బౌద్ధధర్మం, బోధిస్తున్నంత కాలమూ, అధికాధిక ప్రాచుర్యం పొంది, ఇతర మతాలు చాలా బలహీనపడ్డాయి. ఎంతో బలంగా వేళ్ళూనుకొన్న బ్రాహ్మణత్వం కూడా అంతరించిపోయే దశకు చేరింది. అయినా, శాక్యముని నిర్వాణ (3) తరవాత ఇతర మతాలు, ముఖ్యంగా బ్రాహ్మణత్వం, తిరిగి ప్రాచుర్యం పొందాయి. అయితే, బౌద్ధమతంలో ఎటువంటి పరిస్థితి ఏర్పడింది? కొందరు సన్యాసులు గోంగ్ బంధం విప్పుకునే స్థితిని చేరుకొని భిన్నస్థాయిలలో జ్ఞానోదయం పొందారు, అయితే వారి జ్ఞానోదయపు స్థాయిలు చాలా తక్కువగా ఉండేవి. శాక్యముని తథాగతస్థాయికి చేరుకున్నారు కానీ, చాలామంది సన్యాసులు ఆ స్థాయికి చేరలేకపోయారు.

బుద్ధా ఫా భిన్న స్థాయిలలో భిన్నంగా వ్యక్తమవుతుంది. అయితే, స్థాయి పెరిగినకొద్దీ, సత్యానికి దగ్గర అవుతూ ఉంటుంది. స్థాయి తగ్గినకొద్దీ, సత్యానికి దూరం అవుతూ ఉంటుంది. ఆ సన్యాసులు గోంగ్ బంధనం విప్పుకుని తక్కువ స్థాయిలో జ్ఞానోదయం పొందారు. శాక్యముని చెప్పిన దాన్ని వివరించడానికి వారు తమతమ స్థాయిలలో చూసిన విశ్వం యొక్క అభివ్యక్తీకరణను, తమకు అర్థమైన పరిస్థితులను, నియమాలను ఉపయోగించుకున్నారు. అంటే కొందరు సన్యాసులు శాక్యముని ధర్మానికి తమకు తోచిన అర్థం చెప్పారు. శాక్యముని ఉపయోగించిన అసలైన పదాలు కాకుండా, కొందరు సన్యాసులు, శాక్యముని పదాలుగా, తమకు అర్థమైన పద్ధతిలో కూడా బోధించారు, ఇందువల్ల బౌద్ధధర్మం, గుర్తించలేనంతగా వక్రీకరింపబడి, శాక్యముని బోధించిన ధర్మంగా ఎంతమాత్రమూ మిగలలేదు. చివరకు, దీనివల్ల భారతదేశంలో బౌద్ధధర్మం అదృశ్యమైపోయింది. ఇది చరిత్ర నేర్పిన ఒక గంభీరమైన పాఠం. తర్వాత భారతదేశంలో బౌద్ధమతం ఏమాత్రమూ మిగలలేదు. బౌద్ధమతం అదృశ్యమయ్యే ముందు, ఎన్నో సంస్కరణలకు లోనైంది. చివరకు అది బ్రాహ్మణత్వంలోనించి కొన్ని విషయాలను ఇముడ్చుకొని, ఈనాడు భారత దేశంలో ఉన్న హిందూమతంగా తయారైంది. అది ఏ బుద్ధుడిని పూజించదు. ఇతర పూజలు చేస్తుంది, శాక్యమునిని నమ్మదు. ఇదీ పరిస్థితి.

బౌద్ధమతం అభివృద్ధి చెందుతున్న క్రమంలో చాలా పెద్ద మార్పులు చోటుచేసుకున్నాయి. ఒకటి శాక్యముని నిర్యాణం చెందిన వెంటనే జరిగింది. కొందరు, శాక్యముని బోధించిన ఉన్నత స్థాయి నియమాల ఆధారంగా మహాయానాన్ని (4) స్థాపించారు. శాక్యముని ప్రజలలో వెల్లడి చేసి బోధించిన ధర్మం, కేవలం సామాన్య మానవులకు స్వయంముక్తిని, అర్హత స్థితిని సాధించ డానికి ఉద్దేశింపబడిందని వారు నమ్మారు. అది అన్ని జీవులకూ ముక్తిని ఇవ్వనందున హీనయానం (5) అని పిలవబడింది. ఆగ్నేయ ఆసియాలో ఉండే సన్యాసులు, శాక్యముని కాలానికి చెందిన మౌలిక ఆధ్యాత్మిక సాధనామార్గాన్ని కొనసాగిస్తున్నారు. చైనాలో దానిని మేము బౌద్ధమతపు "చిన్న వాహనం" అంటాము. నిజానికి వారు స్వయంగా అలా భావించరు. తాము శాక్యముని యొక్క అసలైన సంప్రదాయానికి వారసులమని వారు నమ్ముతారు. అది నిజం, ఎందుకంటే వారు శాక్యముని కాలంలోని ఆధ్యాత్మిక సాధనామార్గాన్ని వారసత్వంగా పొందారు.

ఈ సంస్కరింపబడిన మహాయానం, చైనాలో ప్రవేశపెట్టబడి, వేళ్ళూనుకొని, చైనాలో బోధింపబడుతున్న ఈనాటి బౌద్ధమతంగా తయారైంది. వాస్తవానికి, ఇది శాక్యముని కాలంలోని బౌద్ధమతానికి పూర్తి భిన్నమైన రూపాన్ని సంతరించుకుంది. వేషధారణ మొదలుకొని, జ్ఞానోదయ స్థితి వరకు, సాధనా క్రమంతో సహా మొత్తం మారిపోయింది. అసలైన బౌద్ధమతంలో, మత స్థాపకుడుగా బుద్ధుడు మాత్రమే పూజింపబడ్డాడు. అయితే, ఇప్పుడు బౌద్ధ మతంలో చాలామంది బుద్ధులూ, గొప్ప బోధిసత్వులు ఉన్నారు. దీనికితోడు, అనేకులు, బుద్ధుల పట్ల విశ్వాసంతో అంకితభావం ప్రకటిస్తారు. చాలామంది తథాగతులు పూజింపబడుతున్నారు, ఇంకా, ఇప్పటి బౌద్ధమతం అమితాభ బుద్ధుడు, వైద్య బుద్ధుడు, మహాసూర్య తథాగతుడు మొదలైన బుద్ధులను పూజించే మతంగా తయారైంది. ఎందరో గొప్ప బోధిసత్వులు కూడా ఉన్నారు. ఈ విధంగా బౌద్ధమతం పూర్తిగా శాక్యముని తన కాలంలో స్థాపించిన దానికి పూర్తి భిన్నంగా తయారైంది.

ఈ కాల అవధిలోనే, బోధిసత్వ నాగార్జునుడు ఒక రహస్యమైన ఆధ్యాత్మిక సాధనను బోధించినప్పుడు, మరొక సంస్కరణ చోటుచేసుకుంది.

అది భారతదేశమునించి, ఆఫ్ఘనిస్తాన్, తర్వాత షిన్జియాంగ్, (6) మార్గం గుండా చైనాలో ప్రవేశపెట్టబడింది. ఇది టాంగ్ రాజవంశీయుల (7) కాలంలో జరగడంవల్ల దాన్ని టాంగ్ తాంత్రికవిద్య అన్నారు. కన్ఫ్యూషియస్ మతం ప్రభావంతో చైనాలో నైతిక విలువలు, మిగతా దేశాలతో పోల్చినప్పుడు సాధారణంగా ఎంతో భిన్నంగా ఉండేవి. ఈ రహస్య సాధనలో ఒక ఆడ, ఒక మగ కలిసి చేసే జంట ఆధ్యాత్మిక సాధన ఉండేది, అందుచేత ఆ కాలంలో సంఘంలో అది అంగీకరించబడలేదు. అందువల్ల, టాంగ్ వంశంలోని హ్యూచాంగ్ కాలంలో, బౌద్ధమతం అణచివేయబడినప్పుడు అది తుడిచిపెట్ట బడింది, ఆ కారణంగా టాంగ్ తాంత్రికవిద్య చైనానించి మాయమైంది. ఆ కాలంలో చైనానించి వచ్చిన తూర్పు తాంత్రికవిద్య ఇప్పుడు జపాన్‌లో ఉంది; అయితే, అందులో గ్వాండింగ్ (8) జరగదు. తాంత్రికవిద్య ప్రకారం, ఒక వ్యక్తి గ్వాండింగ్ లేకుండా, తాంత్రిక విద్యను అధ్యయనం చేస్తే, ధర్మమును దొంగిలించడంతో సమానంగా భావింపబడుతుంది, అతడికి వ్యక్తిగతంగా నేర్చుకున్నాడన్న గుర్తింపు ఉండదు. భారతదేశమూ, నేపాల్ దేశాలనించి టిబెట్‌కు పరిచయమైన ఇంకొక ఆధ్యాత్మిక సాధనను “టిబెటన్ తాంత్రిక విద్య” అనేవారు, అది ఈనాటి వరకూ అందించబడింది. ఇదీ, మౌలికంగా, బౌద్ధమతంలోని పరిస్థితి. నేను ఇప్పుడే, క్లుప్తంగా, దాని యొక్క అభివృద్ధి, పరిణామాలను సంగ్రహంగా తెలియపరిచాను. బౌద్ధమతం యొక్క పూర్తి వికాస క్రమంలో, బోధిధర్ముడు స్థాపించిన జెన్ బౌద్ధమతము, పవిత్రభూమి బౌద్ధమతము, హ్యూయన్ బౌద్ధమతం వంటి సాధనలు వెలికివచ్చాయి. శాక్యముని తన కాలంలో చెప్పినవాటిలో కొంత అవగాహన చేసుకున్న విషయంతో అవి స్థాపించబడ్డాయి. ఇవన్నీ కూడా సంస్కరణకు లోనైన బౌద్ధమతానికి చెందుతాయి. బౌద్ధమతంలో పది రకాలకు పైగా ఇటువంటి ఆధ్యాత్మిక సాధనామార్గాలున్నాయి. అన్నీ మత రూపాన్ని సంతరించు కున్నాయి. అందువల్ల, అవన్నీ బౌద్ధమతానికి చెందుతాయి.

ఈ శతాబ్దంలో స్థాపించబడిన మతాలు, ఆ మాటకొస్తే గడిచిన ఎన్నో శతాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలలో స్థాపించబడిన మతాలలో, చాలావరకు నామమాత్రమైనవే. మహాజ్ఞానులందరికీ తమవైన స్వంత స్వర్గాలు

ఉండేవి, వారు మానవులను అక్కడ ఉద్ధరించేవారు. శాక్యముని, అమితాభ బుద్ధుడు, మహాసూర్య తథాగతుడు వంటి ఈ తథాగతులకు జనావళిని రక్షించడానికి, తమవైన స్వంత స్వర్గాలు ఉన్నాయి. మన పాలపుంతలో అటు వంటి స్వర్గాలు వందకుపైగా ఉన్నాయి. మన ఫాలున్ దాఫాకి కూడా ఫాలున్ స్వర్గం ఉంది.

ముక్తినివ్వడంలో, ఆ నామమాత్రపు సాధనలు తమ అనుయాయులను (శిష్యులను) ఎక్కడికి తీసుకుపోగలవు? అవి జనులను రక్షించలేవు, ఎందు కంటే అవి బోధించేది ఫా కాదు. అయితే, మతాలను స్థాపించినవారిలో కొందరు, అవి సంప్రదాయ మతాలను శిథిలం చేసే అసుర శక్తులుగా మారాలని ముందు ఉద్దేశించలేదు. వారు గోంగ్ బంధాన్ని విప్పుకునే స్థితిని చేరి, భిన్న స్థాయులలో జ్ఞానోదయం పొందారు. వారు కొన్ని నియమాలను దర్శించారు, కానీ జనులను రక్షించగలిగిన జ్ఞాన జీవులకు అతిదూరంలో ఉండిపోయారు. వారు చాలా తక్కువ స్థాయులలో ఉండి, కొన్ని నియమాలను కనుగొన్నారు. సామాన్య వ్యక్తుల నడుమ జరిగే కొన్ని విషయాలు తప్పని వారు తెలుసుకున్నారు, మంచి పనులు ఎలా చెయ్యాలనేది కూడా ప్రజలకు చెప్పేవారు. మొదట్లో వారు ఇతర మతాలకు విరుద్ధంగా ఉండేవారు కాదు. అయితే, చివరకు వారు చెప్పేది అర్థవంతంగా ఉందని ప్రజలు వారిని నమ్మేవారు; ఆ కారణంగా ప్రజలు వారిని మరింతగా నమ్ముతూ ఉండేవారు. ఫలితంగా ప్రజలు మతాలకు మారుగా, వారిపట్ల అతిభక్తిని కలిగి ఉండేవారు. కీర్తి, స్వలాభాలతో బంధం పెంచుకున్న కారణంగా, వారు తమను కొన్ని బిరుదులతో సత్కరించమని ప్రజలను అడిగేవారు. ఆ తర్వాత వారు కొత్త మతాలను స్థాపించేవారు. ఇవన్నీ దుష్ట మతాలని, నేను చెప్తున్నా. అవి ప్రజలకు హాని చేయకపోయినా, సంప్రదాయ మతాలపట్ల ప్రజల నమ్మకాలకు ఆటంకం కలిగించిన కారణంగా అవి దుష్ట సాధనలే. సంప్రదాయ మతాలు ప్రజలను రక్షించగలవు గానీ, ఇవి చేయలేవు. కాలం గడిచేకొద్దీ, వారు కపటబుద్ధితో దుష్కర్మలు చేస్తారు. ఇటీవల, ఈ విధమైన అనేక సాధనలు చైనాలో ప్రవేశపెట్టబడ్డాయి. గ్వాన్ యీన్ (9) తెగ అని పిలవబడుతున్నది వాటిలో ఒకటి. అందువల్ల మీరు మీ జాగ్రత్తలో ఉండండి. ఒక తూర్పు

ఆసియా దేశంలో, రెండు వేలకు పైగా సాధనలు ఉన్నాయని చెప్పబడుతున్నది. ఆగ్నేయాసియా దేశాలలోనూ, పడమటి దేశాలలోనూ, అన్ని రకాల నమ్మకాలున్నాయి. ఒక దేశంలో బాహాటంగానే దయ్యాలను పూజించే సాధన ఉంది. ఇవన్నీ, ధర్మం అంతరించే కాలంలో, బయటికి వచ్చిన అసురులు. ధర్మం అంతరించే కాలం అన్నది కేవలం బౌద్ధమతానికే పరిమితం కాదు, ఒక అత్యున్నత స్థాయి పరిమాణం క్రింద ఉన్న అనేక పరిమాణాలలో జరిగే పతనాన్ని కూడా సూచిస్తుంది. "ధర్మం-అంతరించడం" అన్నది కేవలం బౌద్ధమతాన్ని గురించిన సూచన మాత్రమే కాదు; మానవ సమాజంలో, నైతికతను నిలిపే ఆధ్యాత్మిక బాధ్యత గురించిన స్పృహ లోపించడం అనే అర్థాన్ని కూడా సూచిస్తుంది.

## కేవలం ఒక్క ఆధ్యాత్మిక సాధనామార్గాన్ని అభ్యసించుట

ఒక వ్యక్తి తప్పనిసరిగా కేవలం ఒకే ఆధ్యాత్మిక సాధనామార్గాన్ని అభ్యసించాలని మేము బోధిస్తాం. మీరు ఆధ్యాత్మిక సాధన ఎలా చేసినప్పటికీ, ఇతర విషయాలను కలుపుకుంటూ, మీ ఆధ్యాత్మిక సాధనామార్గాన్ని గందరగోళం చేసుకోకూడదు. కొందరు సాధారణ బౌద్ధులు బౌద్ధమతమునూ, మన ఫాలున్ దాఫాను, రెండింటినీ అభ్యసిస్తూ ఉంటారు. చివరకు మీరు దేనినీ పొందలేరు, ఎందుకంటే ఏ ఒక్కటి కూడా మీకు ఏమీ ఇవ్వదని మీకు నేను చెప్తున్నాను. మనమందరం బుద్ధ సిద్ధాంతానికి చెందినవాళ్ళం కాబట్టి, ఇక్కడ షిన్ షిన్ అన్న అంశంతోపాటు, ప్రత్యేకంగా ఒకే ఆధ్యాత్మిక సాధనను చెయ్యాలన్న విషయం కూడా ఉన్నది. మీకున్నది ఒకటే శరీరం. మీ శరీరం ఏ సిద్ధాంతం యొక్క గోంగ్‌ను పెంపొందించుకుంటుంది? దాని యొక్క పరివర్తన ఎలా జరుగుతుంది? మీరు ఎటు వెళ్ళాలనుకుంటున్నారు? మీ ఆధ్యాత్మిక సాధనామార్గం ఎక్కడికి తీసుకువెళ్తే మీరు అక్కడికి వెళతారు. మీరు ఆధ్యాత్మిక సాధనలో పవిత్ర భూమి బౌద్ధాన్ని సాధన చేస్తే అమితాభ బుద్ధుని స్వర్గమైన పరమానందపు స్వర్గానికి వెళ్తున్నారు. మీరు సాధనలో వైద్య బుద్ధుని అనుసరిస్తే, మెరిసే స్వర్గానికి వెళుతున్నారు. మతంలో చెప్పబడినది ఇదే, దానినే "రెండవ ఆధ్యాత్మిక సాధనామార్గం లేదు" అన్నారు.

సాధన అని ఇక్కడ మేము చెప్తున్నది, నిజానికి శక్తి పరివర్తన చెందే మొత్తం ప్రక్రియ. ఇది ఒక వ్యక్తి తాను అనుసరించే ఆధ్యాత్మిక సాధనా సిద్ధాంతాన్ని బట్టి ఉంటుంది. అప్పుడు మీకు ఎక్కడికి వెళ్ళాలని ఉందని చెప్పగలరు మీరు? మీరు రెండు పడవల మీద ఒకేసారి కాళ్ళు పెట్టినప్పుడు ఏమీ సాధించలేరు. చీ గోంగ్ సాధనను, బౌద్ధమతాలలోని బౌద్ధమత సాధనలతో కలపకుండా ఉండడమే కాకుండా ఆధ్యాత్మిక సాధనలనూ చీ గోంగ్ సాధనలనూ లేదా మతాలలోని విషయాలను కలగాపులగం చెయ్య కూడదు. ఆధ్యాత్మిక సాధనలో, ఒకే మతంలోనివే అయినా వివిధ వర్గాలు ఒకదానితో ఒకటి కలవవు. ఒక వ్యక్తి తప్పనిసరిగా ఒక ఆధ్యాత్మిక సాధనా మార్గాన్నే ఎన్నుకోవాలి. మీరు పవిత్రభూమి బౌద్ధమత సాధన చేస్తే దాన్నే చెయ్యాలి. తాంత్రికవిద్యను సాధన చేస్తుంటే దాన్నే సాధన చెయ్యాలి. జెన్ బౌద్ధమతాన్ని సాధన చేస్తే, దాన్నే సాధన చెయ్యాలి. ఒకేసారి రెండు పడవల మీద కాళ్ళు పెట్టి ఇదీ, అదీ రెండు సాధనలనూ ఒకేసారి చేస్తే, మీరు ఏమీ సాధించలేరు. అంటే, బౌద్ధమతంలోనే అయినా, మీరు మరొక పద్ధతిని అభ్యసించక ఉండవలసిన అవసరం ఉంది, అలాగే మీరు ఆధ్యాత్మిక సాధన లను కలపకూడదు. బౌద్ధమతం కూడా, గోంగ్‌ను, ఆధ్యాత్మిక సాధననూ అభ్యసించడమే. ఒక స్త్రీ లేదా పురుషుని గోంగ్ రూపం మారడం అన్న విషయం, ఆధ్యాత్మిక సాధనాపద్ధతిని, ఆ ఆధ్యాత్మిక సాధనామార్గంలో గోంగ్ పరివర్తనను అనుసరించి ఉంటుంది. ఇతర పరిమాణాలలో కూడా, గోంగ్ వికాస ప్రక్రియ ఒకటి ఉంది, అది సాధనలోని ఇతర విషయాలతో అలక్ష్యంగా కలపకూడనట్టి, అతిసంక్లిష్టమూ, చిక్కులతో కూడినదీ అయిన ప్రక్రియ.

మనం బౌద్ధ సిద్ధాంతంలోని చీ గోంగ్‌ను అభ్యసిస్తామని తెలుసుకున్న కొందరు సాధారణ బౌద్ధులు, మన సాధకులను బౌద్ధమత స్వీకరణ కోసం మతాలకు తీసుకువెళ్తారు. ఇక్కడ కూచుని ఉన్న ప్రతి ఒక్కరికి, అటువంటి పని ఎవరూ చేయకూడదని చెప్తున్నాను. మీరు మన దాఫానూ, బౌద్ధమత నియమాలనూ కూడా అవమానించినవారవుతారు. అదే సమయంలో, సాధకులకు అంతరాయం కలిగించి, వారు దేనినీ పొందకుండా చేస్తున్నారు. ఇది నిషిద్ధం. ఆధ్యాత్మిక సాధన అన్నది, ఒక గంభీరమైన విషయం. ఒక వ్యక్తి

ఒక అభ్యాసంపై ఏకాగ్రచిత్తంతో ఉండాలి. మనం సామాన్య వ్యక్తుల మధ్య బోధిస్తున్న ఈ భాగం, మతం కాకపోయినా, ఆధ్యాత్మిక సాధనలో దాని గమ్యం ఒకటి. ఇవి రెండూ కూడా, గోంగ్ వికాసమునూ, జ్ఞానోదయం, సాధనలో సంపూర్ణతను సాధించడానికి ప్రయత్నం చేస్తాయి.

ధర్మం అంతరించే కాలంలో, మతాలలో ఉన్న సన్యాసులకే తమను తాము రక్షించుకోవలసిన కష్టకాలం రాగా, ఎవరి రక్షణా లేని సాధారణ బౌద్ధుల మాట చెప్పాల్సిన పనే లేదని, శాక్యముని తెలిపారు. నీకు ఒక "గురువు" ఉన్నా, ఆ గురువు అనబడేవాడు కూడా ఒక సాధకుడే. గురువు అసలైన ఆధ్యాత్మిక సాధన చేయకపోతే, అది నిరుపయోగం. హృదయ సంస్కరణ లేకుండా, దానిని ఎవరూ సాధించలేరు. మత మార్పిడి అన్నది సామాన్య వ్యక్తులు చేసే లాంఛనం. మత మార్పిడి జరిగిన తర్వాత, మీరు ఇంకా బుద్ధ సిద్ధాంత సభ్యులేనా? అప్పుడు బుద్ధుడు మిమ్మల్ని రక్షిస్తాడా? అటువంటిదేమీ లేదు. మీరు తల నుంచి రక్తం వచ్చేంతగా ప్రతిరోజూ మోకరించి నమస్కారాలు చేసినా, లేదా కట్టలకొద్దీ ధూపం వేసినా అది వ్యర్థం. మీరు అది సాధించేందుకు, తప్పనిసరిగా నిజమైన హృదయసంస్కరణ చేయాలి. ధర్మం అంతరించే కాలానికి, ప్రపంచంలో చాలా పెద్ద మార్పులు వచ్చాయి. మతపరమైన ప్రార్థనాస్థలాలు కూడా ఏ మాత్రమూ సరైన స్థితిలో లేవు. అతీంద్రియ శక్తులు గలిగినవారు (సన్యాసులతో సహా) కూడా, ఈ పరిస్థితిని కనిపెట్టారు. ప్రస్తుతం ప్రజలలో ఒక ధర్మబద్ధమైన మార్గాన్ని బోధిస్తున్నది ప్రపంచంలో, నేనొక్కడనే. ఇంతకు మునుపు ఎప్పుడూ జరగని పనిని నేను చేశాను. ధర్మం అంతరించే కాలంలో, నేను ఈ ద్వారాన్ని ఇంకా విశాలంగా తెరిచాను. నిజానికి, ఈ అవకాశం వెయ్యి సంవత్సరాలకో, పదివేల సంవత్సరాలకో, ఒకసారి కూడా రాదు. కాని, ఒక వ్యక్తి రక్షించబడ గలడా – మరొక విధంగా చెప్పాలంటే, ఒక వ్యక్తి ఆధ్యాత్మికసాధన చేయ గలడా – అన్నది, అతడి మీదనే ఆధారపడి ఉంది. నేను మీకు చెప్తున్నది, ఈ మహా విశ్వంలోని ఒక నియమం.

మీరు నా ఫాలున్ దాఫాను చదవాలని నేను చెప్పడం లేదు. నేను చెప్పినది ఒక నియమం. మీరు ఆధ్యాత్మిక సాధన చెయ్యాలనుకుంటే, ఒకటే

ఆధ్యాత్మిక మార్గాన్ని సాధన చెయ్యాలి. లేకపోతే, మీరు ఆధ్యాత్మిక సాధనను అసలు చేయనే లేరు. అయితే, మీకు ఆధ్యాత్మిక సాధన చేయాలనే కోరిక లేకపోతే మీ దారిన మిమ్మల్ని వదిలేస్తాం. ఈ ఫా అటువంటి అసలైన సాధకులకే బోధింపబడు తుంది. అందువల్ల, ఒక వ్యక్తి తప్పనిసరిగా ఒకే సాధనపై ఏకాగ్రత పెట్టాలి, ఇతర సాధనల గురించిన ఆలోచనలు కూడా కలపకూడదు. నేను ఇక్కడ మనోచర్యలు ఏమీ నేర్పను; మన ఫాలున్ దాఫాలో మనోచర్య లేదు. అందువల్ల దానికి ఎవరూ ఎటువంటి ఆలోచనలు జోడించకూడదు. ఇది తప్పక మనసులో పెట్టుకోండి. వాస్తవంగా మనో చర్య అన్నదే లేదు. బుద్ధ సిద్ధాంతం శూన్య స్థితి ఆవశ్యకతని బోధిస్తుంది, తావో సిద్ధాంతం, ఏమీ లేని స్థితి ఆవశ్యకతను బోధిస్తుంది.

ఒక సందర్భంలో, అత్యున్నత స్థాయిని అందుకున్న నలుగురైదుగురు మహాజ్ఞానులూ, ఇంకా గొప్ప తావోలతో మానసికంగా కలిశాను. ఇక్కడ, వారు ఉన్నట్టి ఉన్నత స్థాయులు అనగా అర్థం, వారి స్థాయులు, సామాన్య వ్యక్తులు ఊహించడానికి కూడా అసాధ్యమైన ఎత్తులో ఉన్నాయి. నా మనసులో ఏముందో తెలుసుకోవాలని వారు అనుకున్నారు. నేను ఎన్నో సంవత్సరాలు ఆధ్యాత్మిక సాధన చేశాను. నా మనసులో ఏముందో చదవడం ఇతరులకు పూర్తిగా అసాధ్యం, ఇతర వ్యక్తుల అతీంద్రియ శక్తులు నన్ను ఏమాత్రమూ అందుకోలేవు. నన్ను అర్థం చేసుకోవడమూ, నా మనసులో ఏముందో తెలుసుకోవడమూ ఇతరులకు సాధ్యం కాదు. నేను ఏం ఆలోచిస్తున్నానో తెలుసుకోవాలని వారు కోరారు. నా అంగీకారంతో, కొంత సమయం పాటు నా మనసుతో వారి మనసులను అనుసంధానించుకున్నారు. ఆ అనుసంధానం తర్వాత నాకు ఆ స్థితిని తట్టుకోవడం కొంత కష్టమైంది. ఎందుకంటే నా స్థాయి ఎంత ఎక్కువగా లేదా తక్కువగా ఉందో అన్న విషయంతో సంబంధం లేకుండా, నేను సామాన్య వ్యక్తుల నడుమ ఉన్నాను, అది కూడా ఒక ఉద్దేశం– జనులను రక్షించడంతో ఉన్నాను, నా హృదయం, జనులను రక్షించడానికి అంకితమై ఉంది. కానీ వారి మనసులు ఎంత ప్రశాంతంగా ఉన్నాయి? వారి మనసులు, భయం కలిగించేంత శాంత స్థితిలో ఉన్నాయి. ఒక వ్యక్తికి అటువంటి శాంత స్థితిని చేరుకోవడం సాధ్యమే. అయితే నలుగురైదుగురు

వ్యక్తులు, అటువంటి నిశ్చలస్థితిలో, కూర్చుని ఉంటే, అది కదలని నీరు తప్ప ఏమీ లేని కొలనుతో సమానంగా ఉన్నట్లు అనిపిస్తుంది. నేను వారిని అనుభవంతో తెలుసుకోవాలని ఒక విఫలయత్నం చేశాను. ఆ రోజులలో, నాకు మానసికంగా అసౌకర్యంగా అనిపించింది, ఒక అద్వితీయమైన భావాన్ని అనుభవించాను. సామాన్య వ్యక్తులు ఏ విధంగానూ, దానిని ఊహించనూ లేరు, అనుభవించనూ లేరు; అది పూర్తిగా బంధాలనించి విముక్తమై, శూన్యంగా ఉండింది.

ఆధ్యాత్మిక సాధనలోని అత్యున్నత స్థాయిలలో ఎటువంటి మనోచర్య ఉండదు. ఎందుకంటే, మీరు పునాది వేసుకునే సామాన్య వ్యక్తుల స్థాయిలో ఉన్నప్పుడే, ఆ పునాది వ్యవస్థ అంతకు ముందే ఏర్పాటై ఉంది. ఆధ్యాత్మిక సాధనలో ఉన్నతస్థాయికి చేరుకున్న తరవాత, మా ఆధ్యాత్మిక సాధన వ్యవస్థ, అతివిశేషంగా, తనంతటతానే పనిచేస్తుంది, ఆధ్యాత్మిక సాధన పూర్తిగా స్వయంచాలకము. మీరు మీ షిన్ షిన్‌ను పెంపొందించుకుంటున్నంత కాలమూ, మీ గోంగ్ పెరుగుతూ ఉంటుంది. మీరు ఎటువంటి వ్యాయామాలు చేసే ఆవశ్యకత లేదు. మా వ్యాయామాలు ఈ స్వయంచాలక యంత్ర వ్యవస్థను బలోపేతం చేస్తాయి. ఒక వ్యక్తి ధ్యానంలో నిశ్చలంగా ఎందుకు కూర్చుంటాడు? అతడు పూర్తిగా వూవే స్థితిలో ఉంటాడు. తావో సిద్ధాంతంలో, ఆ వ్యాయామమూ, లేదా ఈ వ్యాయామమూ అంటూ మనోచర్యలను లేదా మానసికమైన మార్గదర్శనం చేస్తూ బోధించడం మీరు గమనించగలరు. తావో సిద్ధాంతంలో చీ స్థాయిని దాటగానే, అందులో ఏమీ ఉండదు, ఎటువంటి మనోచర్య కూడా ఉపయోగించరని, నేను చెప్తున్నాను. అందువల్ల ఇతర చీ గోంగ్ సాధనలు చేసిన కొందరు వ్యక్తులు, ప్రాణాయామ పద్ధతులను, మనోచర్యలు మొదలైనవాటిని వదలలేరు. నేను కళాశాల స్థాయిలో బోధిస్తూ ఉంటే, వాళ్ళు ఎప్పుడూ, ప్రాథమిక పాఠశాల విద్యార్థుల స్థాయి విషయాలు, మనసును ఏ విధంగా నడిపించాలి, మనోచర్యలు ఎలా చెయ్యాలి వంటి ప్రశ్నలు వేస్తుంటారు. వాళ్ళు అప్పటికే అటువంటి ధోరణికి అలవాటు పడిపోయారు. చీ గోంగ్ నిజంగా అటువంటిది కాకపోయినా వాళ్ళు చీ గోంగే అటువంటిది అనుకుంటారు.

# అతీంద్రియ శక్తులు మరియు గోంగ్ బలము

చీ గోంగ్ పరిభాషలోని పదాల గురించి మీలో చాలామందికి స్పష్టత లేదు, కొందరు అలవాటుగా తికమక పడుతూనే ఉంటారు. వారు అతీంద్రియ శక్తులను గోంగ్ బలంగా, గోంగ్ బలాన్ని అతీంద్రియ శక్తులుగా అర్థం చేసుకుంటారు. మనం పొందే గోంగ్ అన్నది, షిన్ షిన్ సాధనవల్లనూ, మనం విశ్వలక్షణంతో మమేకం కావడంవల్లనూ, మన పుణ్యంనించి తయారవుతున్నది. అది ఒక వ్యక్తి యొక్క స్థాయి ఔన్నత్యాన్ని, అతడి గోంగ్ బలం యొక్క సామర్థ్యాన్ని, అతడి ఆధ్యాత్మిక సాధన యొక్క ఫల స్థితిని నిర్ణయిస్తుంది. ఇది అతికీలకమైన గోంగ్. ఒక వ్యక్తికి తన సాధనాక్రమంలో ఎటువంటి పరిస్థితులు ఎదురవుతాయి? అతడు కొన్ని అసాధారణమైన మానవాతీత శక్తులను పెంపొందించుకోగలుగుతాడు, వీటినే క్లుప్తంగా అతీంద్రియ శక్తులు అంటాము. నేను ఇప్పుడే చెప్పినట్లు, ఒక వ్యక్తి స్థాయిని పెంచే గోంగ్‌నే గోంగ్ సామర్థ్యం అంటారు. ఒక వ్యక్తి స్థాయి పెరుగుతున్నకొద్దీ, అతడి గోంగ్ సామర్థ్యం కూడా అంత గొప్పగానూ ఉండి అతడి అతీంద్రియ శక్తులు కూడా అంతటి బలవత్తరంగా ఉంటాయి.

అతీంద్రియ శక్తులనేవి ఒక వ్యక్తి చేసిన ఆధ్యాత్మిక సాధన యొక్క ఉప ఉత్పత్తులు మాత్రమే; అవి ఒక వ్యక్తి స్థాయిని లేదా స్థాయి ఔన్నత్యాన్ని గానీ, అతడి గోంగ్ సామర్థ్యపు బలాన్ని గానీ తెలియజేయవు. కొందరు వాటిని అధిక సంఖ్యలో పెంపొందించుకోగా ఇతరులు కొన్నిటినే పెంపొందించుకుంటారు. పైగా ఆధ్యాత్మిక సాధన ద్వారా ప్రయత్నించి సాధించే ప్రధాన గమ్యం అతీంద్రియ శక్తులు సంపాదించడం కాదు. ఒక వ్యక్తి ఆధ్యాత్మిక సాధన చెయ్యాలని నిజంగా కృతనిశ్చయంతో ఉన్నప్పుడు మాత్రమే, వాటిని పెంపొందించుకోగలడు; అయినా ఆధ్యాత్మిక సాధనకు అవే ప్రధాన గమ్యంగా భావించలేం. మీరు వాటిని ఎందుకు సాధన చేస్తారు? మీరు వాటిని సామాన్య వ్యక్తుల నడుమ ఉపయోగించాలనుకుంటున్నారా? మీరు మీ ఇష్టానుసారం వాటిని సామాన్య వ్యక్తుల మధ్య ఉపయోగించడం అన్నది పూర్తిగా నిషిద్ధం. ఆ విధంగా, మీరు వాటికోసం అతిగా ప్రాకులాడినకొద్దీ మీకు దొరికేది తక్కువ. ఎందుకంటే మీరు దేనికోసమో ప్రాకులాడుతున్నారు గనక. ప్రాకులాట

అన్నదే ఒక బంధం. ఆధ్యాత్మిక సాధనలో, తొలగించుకోవలసినవి బంధాలే.

ఎందరో వ్యక్తులు, అతీంద్రియ శక్తులు లేకుండానే అత్యున్నత ఆధ్యాత్మిక సాధనాలోకానికి చేరుకున్నారు. గురువు వాటిని బంధించేశారు, ఎందుకంటే వారు వాటిని సక్రమంగా ఉపయోగించలేకపోతే తప్పులు చేస్తారు. అందువల్ల వారు ఆ అతీంద్రియ శక్తులను ఉపయోగించడానికి అనుమతి లేదు. అటువంటివారు ఎందరో ఉన్నారు. అతీంద్రియ శక్తులన్నవి ఒక వ్యక్తి మనసు చేత నిర్దేశించబడుతుంటాయి, అతడు నిద్రపోతున్నప్పుడు వాటిని అదుపులో ఉంచలేకపోవచ్చు. కేవలం ఒక్క కలతో, తెల్లవారేసరికి ఒక వ్యక్తి స్వర్గ, భూలోకాలను తారుమారు చెయ్యొచ్చు, అది నిషిద్ధం. ఆధ్యాత్మిక సాధన అన్నది సామాన్య వ్యక్తుల నడుమ జరుగుతూ ఉన్న కారణాన, గొప్ప అతీంద్రియ శక్తులు గల వారికి, సాధారణంగా వాటిని ఉపయోగించే అనుమతి ఉండదు. వాటిలో అనేక శక్తులు బంధింపబడి ఉంటాయి, కానీ పూర్తిగా కాదు. చాలా చక్కని ఆధ్యాత్మిక సాధనను చేసుకుంటూ, తమంతట తాము సత్ప్రవర్తన కలిగిన అనేకమంది ఉన్నారు. కొన్ని అతీంద్రియ శక్తులు కలిగి ఉండడానికి వారికి అనుమతి ఉంటుంది. వీరిని, మీరు యథాలాపంగా తమ అతీంద్రియ శక్తులు ప్రదర్శించమని అడిగినా వారు ముమ్మాటికీ అలా చెయ్యరు, వారు తమనుతాము అదుపులో ఉంచుకోగలరు.

## విలోమ ఆధ్యాత్మిక సాధన మరియు గోంగ్‌ను అరువు తెచ్చుకోవడం

కొంతమంది ఎన్నడూ చీ గోంగ్ అభ్యసించి ఉండరు, లేదా, ఒక చీ గోంగ్ తరగతిలో కొన్ని విషయాలు నేర్చుకొని ఉంటారు. కానీ అవి రోగనిర్మూలన, దేహపుష్టికే గాని, ఆధ్యాత్మిక సాధనకు కావు. మరొక రకంగా చెప్పాలంటే, ఈ వ్యక్తులు ఎన్నడూ అసలైన సాధన నేర్చుకోలేదు, అయినప్పటికీ, వారు హఠాత్తుగా ఒకనాడు రాత్రికి రాత్రే గోంగ్‌ను పొందుతారు. ఈ రకమైన గోంగ్ ఎక్కడనించి వచ్చి ఉంటుందో, మనం చెప్పుకుందాం. అందులో చాలా రకాలున్నాయి.

ఒకటి విలోమ సాధనకు సంబంధించినది. విలోమ ఆధ్యాత్మిక సాధన అంటే ఏమిటి? కొందరు వ్యక్తులు కొంత వయసు మళ్ళిన తరవాత ఆధ్యాత్మిక సాధన చేయాలని కోరుకుంటారు. వారు, మొట్టమొదటినించి మొదలు పెట్టాలంటే అప్పటికి చాలా ఆలస్యం అయిపోతుంది. చీ గోంగ్ అత్యధిక ప్రాచుర్యం పొందినప్పుడు, వాళ్ళు కూడా ఆధ్యాత్మిక సాధన చేయాలని కోరుకున్నారు. చీ గోంగ్ సాధన చేస్తూనే అదే సమయంలో ఇతరులకు మేలు చేస్తూ తమను తాము కూడా ఉన్నతీకరించుకోగలరని వారు తెలుసుకున్నారు. వారికి ఈ కోరిక కలిగి అభివృద్ధి చెందాలనీ ఆధ్యాత్మిక సాధన చెయ్యాలనీ కోరుకున్నారు. అయితే కొన్నేళ్ళ క్రిందట చీ గోంగ్ ప్రాచుర్యంలో ఉన్నప్పుడు, ఆ చీ గోంగ్ గురువులందరు చీ గోంగ్‌ని ప్రచారం చేయడమే తప్ప, నిజంగా ఉన్నత స్థాయులలోని విషయాలను నేర్పలేదు. ఈనాటికి కూడా నిజంగా ఉన్నత స్థాయులలో చీ గోంగ్‌ను ప్రజలకు నేర్పే విషయానికి వస్తే, ఆ పని చేస్తున్నది నేనొక్కడనే. ఈ పని చేస్తున్న రెండవ వ్యక్తే లేడు. విలోమ ఆధ్యాత్మిక సాధనలోని వ్యక్తులందరూ, యాభై ఏళ్ళు దాటి వృద్ధాప్యంలో అడుగుపెట్టిన వారే. వారు తమలో ఉత్తమ జన్మ సంస్కారమూ, తమ శరీరాలలో మంచి పదార్థాలను కలిగి ఉండేవారు. వారిలో దాదాపు ప్రతి ఒక్కరూ శిష్యులుగా లేదా, ఆ గురువులకు వారసులుగా ఉండడానికి అర్హులు. అయితే వారు అతివయోవృద్ధులు. వారు ఆధ్యాత్మిక సాధన చెయ్యాలని కోరుకుంటే, అది మాటల్లో చెప్పడం సులభమేగానీ ఆచరణలో కష్టం. వారికి గురువు ఎక్కడ లభిస్తారు? కానీ, వారు ఆధ్యాత్మిక సాధన చెయ్యాలని కోరుకున్న వెంటనే, హృదయంలోని ఆ తలపుతో, అది బంగారంలాగ మెరిసి, దశదిశల ప్రపంచాన్ని కుదిపివేసేది. జనులు బుద్ధ-స్వభావం గురించి మాట్లాడతారు, బుద్ధ-స్వభావం వెలికి రావడమంటే ఇదే.

ఉన్నత స్థాయి దృక్పథంనించి చూసినప్పుడు, ఒక వ్యక్తి జీవితం, కేవలం మానవునిగా ఉండిపోయేందుకు ఉద్దేశింపబడినది కాదు. ఒక వ్యక్తి జీవితం, విశ్వాంతర్భాగంలో సృష్టింపబడినది కాబట్టి విశ్వలక్షణం అయిన సత్యం-దయ-సహనంతో మమేకమై ఉంటుంది. దయ, ఉపకారబుద్ధి దాని స్వభావం. అయితే జీవుల సంఖ్య పెరిగినకొద్దీ సాంఘిక బంధం ఏర్పడుతుంది.

దానివలన వారు స్వార్థపరులై లేక దుష్టులై, కొంతమంది వ్యక్తులు అత్యున్నత స్థాయిలో ఉండ లేకపోతారు. వారు క్రింది స్థాయికి పడిపోయి, మరింత దుష్టులై ఇంకా క్రిందకు పతనం కావలసి ఉంది. ఆ పతనమనేది వారు ఈ సామాన్య వ్యక్తుల స్థాయికి పడిపోయే వరకు జరుగుతూనే ఉంటుంది. ఈ స్థాయికి పడిపోయిన తరవాత, వారు పూర్తిగా నశించిపోవాలి. తమ ఉపకార బుద్ధి, దయాగుణాలవల్ల, ఆ మహాజ్ఞానులు చాలా బాధాకర వాతావరణంలో మానవజాతికి మరొక అవకాశం ఇవ్వాలని నిర్ణయించారు; ఆ విధంగా అటువంటి పరిమాణమును సృష్టించారు.

ఇతర పరిమాణాలలోని వ్యక్తులకు ఇటువంటి శరీరాలు ఉండవు. వాళ్ళు గాలిలో తేలుతారు, తమ శరీరాలను పెద్దవిగా లేదా చిన్నవిగా మార్చుకోగలరు. కానీ ఈ పరిమాణంలో, జనులకు ఇటువంటి శరీరం, మన మానవ శరీరాలు ఇవ్వబడినవి. ఈ శరీరంతో, ఒక వ్యక్తి, చలి, వేడి, అలసట, ఆకలి కలిగి నప్పుడు తట్టుకోలేడు. ఏ రకంగానైనా అది బాధే. మీకు అనారోగ్యంగా ఉన్నప్పుడు మీరు బాధపడతారు. ఒక వ్యక్తి తన కర్మ శేషమును, పుట్టుక, వృద్ధాప్యం, వ్యాధి, మరణం అన్న అవస్థలలోని బాధలను అనుభవించి తీర్చుకుంటాడు. మీరు మీ స్వస్వరూపానికి తిరిగి వెళ్ళగలరా అని చూసేందుకు మరొక అవకాశం ఇవ్వబడుతుంది, అందువల్ల మానవులు ఒక మాయలోకి పడవేయబడతారు. మీరు ఇలా క్రిందికి వచ్చిన తర్వాత, మీరు ఇతర పరిమాణాలను, పదార్థం యొక్క సత్యాన్ని చూడలేని విధంగా, ఈ రెండు కళ్ళు మీకోసం సృష్టించబడ్డాయి. మీరు మీ స్వస్వరూపానికి తిరిగి వెళ్ళగలిగితే, తీవ్రమైన ఈ బాధ కూడా అతివిలువైనదే. ఆ మాయలో ఆధ్యాత్మిక సాధన చేస్తూ, విషయాల అవగాహన ద్వారా, ఒక వ్యక్తి తన స్వస్వరూపానికి తిరిగి వెళ్ళే క్రమంలో, అనేక కష్టాలు ఎదురవుతాయి; అందువల్ల, దాన్ని త్వరగా సాధిస్తాడు. మీరు ఇంకా పతనమైపోతే, నిర్మూలింపబడతారు. ఆ విధంగా, ఇతర జీవుల దృష్టిలో, ఒక వ్యక్తి జీవితం మానవునిగా మిగిలిపోయేందుకు కాదు. అది తన స్వస్వరూపానికి తిరిగి వెళ్ళేందుకు ఉద్దేశింపబడినది. ఒక సామాన్య వ్యక్తి ఈ నిజాన్ని తెలుసుకోలేడు. ఒక సామాన్య వ్యక్తి, సామాన్య మానవ సమాజంలోని ఒక సామాన్య మానవుడు, తననుతాను ఏ విధంగా

అభివృద్ధి చేసుకొని, జీవితాన్ని మెరుగుపరచుకోవాలి, అని ఆలోచించే సామాన్య మానవుడు. ఎంత బాగా బతుకుతాడో, అంతటి స్వార్థపరుడుగా తయారవుతాడు. ఎంతగా కూడబెట్టుకోవాలని ఆశ పడతాడో, అంతగా విశ్వ లక్షణానికి దూరమవుతాడు. తర్వాత అతడు వినాశనంవైపు కదులుతాడు.

ఒక ఉన్నతస్థాయినించి చూసినప్పుడు, మీరు ముందడుగు వేస్తున్నానని అనుకున్నా, నిజానికి మీరు వెనక్కి వెళ్తున్నారు. మానవజాతి విజ్ఞానశాస్త్రాన్ని అభివృద్ధి చేసి, పురోగతి సాధిస్తున్నాననుకుంటున్నది, నిజానికి అది కేవలం విశ్వ నియమాన్ని అనుసరిస్తున్నది. ఎనిమిదిమంది దేవతల్లో (10) ఒకరైన ఝాంగ్ గువొలవ్, తన గాడిద మీద వెనకకు స్వారీ చేశాడు. అతడు వెనకకు ఎందుకు స్వారీ చేశాడో, కొద్దిమందికే తెలిసింది. ముందుకు పోవడమంటే, వెనకకు కదలడమేనని అతడు కనిపెట్టాడు, అందుకే అతడు గాడిద మీద వ్యతిరేక దిశలో స్వారీ చేశాడు. ఆ విధంగా, ఒకసారి జనులు ఆధ్యాత్మిక సాధన చేయాలని కోరుకున్నప్పుడు, మహాజ్ఞానులు ఆ హృదయానికి చాలా విలువనిచ్చి, ఎట్టి నిబంధనలూ లేని సాయాన్ని అందిస్తారు. అది ఇవాళ సాధకులు ఇక్కడ కూర్చుని ఉన్నట్లే ఉంటుంది. మీరు ఆధ్యాత్మిక సాధన చేయాలని కోరుకుంటే, నేను ఎటువంటి నిబంధనలూ లేకుండా సాయం చెయ్యగలను. కానీ మీరు ఒక సామాన్య వ్యక్తిలాగా, వ్యాధినిర్మూలన చెయ్యాలనుకుంటే, ఏదో ఒక విషయం కోసమై ప్రాకులాడితే మాత్రం నేను సాయం చెయ్యలేను. ఎందుకలా? ఎందుకంటే, మీరు సామాన్య వ్యక్తిలా ఉండాలనుకుంటున్నారు, సామాన్య మానవులు పుట్టుక, వృద్ధాప్యం, వ్యాధి, మరణములను దాటాలి – అది అలా జరగాలి. ప్రతి విషయానికీ కర్మతో సంబంధం ఉంటుంది, దానికి అంతరాయం కలిగించకూడదు. మీ జీవితంలో ముందుగా ఆధ్యాత్మిక సాధన విధిలిఖితమై లేదు, కానీ ఇప్పుడు ఆధ్యాత్మిక సాధన చేయాలని మీరు కోరుకుంటున్నారు. దానికి తగినట్లే, మీ భవిష్యత్ జీవితం తిరిగి సవరించాలి, అందువల్ల అది మీ శరీరాన్ని తగినట్లు సరిచేయడానికి అనుమతింపబడింది.

ఒక వ్యక్తి ఆధ్యాత్మిక సాధన చెయ్యాలని కోరుకుంటే, అతడి కోరిక

పెరిగిన తరవాత, మహాజ్ఞానులు దానిని చూసి అతివిలువైనదిగా భావిస్తారు. అయితే వారు అతడికి ఎలా సాయం చేయగలరు? అతడికి ఈ ప్రపంచంలో గురువు ఎక్కడ దొరుకుతారు? దీనికితోడు అతడి వయసు యాభై ఏళ్ళు దాటింది. ఆ మహాజ్ఞానులు అతడికి బోధించలేరు. ఎందుకంటే, వారు అతడికి ప్రత్యక్షమై ఫాను, వ్యాయామాలనూ బోధించినట్లైతే, అది దివ్య రహస్యాలను బయటపెట్టినట్లవుతుంది; వారు తమ స్థాయిని స్వయంగా తగ్గించుకోవలసి వస్తుంది. జనులు దుష్కర్మలు చేయడంవల్ల మాయలో చిక్కుకుంటారు కాబట్టి, ఆ మాయలో ఆధ్యాత్మిక సాధన చేస్తూ, ఆ స్థితిలోనే నిరంతరమూ తమ జ్ఞానోదయం పొందాలి. అందువల్ల, మహాజ్ఞానులు అతడికి బోధించలేరు. ఒక బుద్ధుడు ప్రజల ముందు ప్రత్యక్షమై, ఫానూ, వ్యాయామాలనూ బోధిస్తే, క్షమార్హం కాని పాపాలు చేసినవారు కూడా వాటిని నేర్చుకోవడానికి వస్తారు. ప్రతివారూ దానిని నమ్ముతారు. అప్పుడు, జనులు జ్ఞానోదయం పొందడానికి అక్కడ ఏముంది? జ్ఞానోదయం అన్న అంశమే లేదు. ఆ వ్యక్తులు తమంతట తామే మాయలో పడిపోయారు గనక, వారు నిర్మూలింపబడాలి. ఆ మాయనించి తిరిగి మీ స్వస్వరూపానికి వెళ్ళడానికి మీకు మరొక అవకాశం ఇవ్వబడింది. మీరు స్వస్వరూపానికి చేరుకోగలిగితే, మీరు దానిని సాధిస్తారు. సాధించలేకపోతే, మీరు సంసారచక్రంలో కొనసాగుతారు లేదా నిర్మూలింప బడతారు.

ఒక వ్యక్తి తన మార్గాన్ని తానే ఏర్పాటు చేసుకుంటాడు. ఒక వ్యక్తి ఆధ్యాత్మిక సాధనను అభ్యసించాలని అనుకున్నప్పుడు ఏం జరుగుతుంది? వారు ఒక విధానాన్ని ఏర్పరచారు. ఆ సమయంలో చీ గోంగ్ చాలా ప్రాచుర్యంలో ఉండేది. విశ్వ వాతావరణంలో కూడా అది ఒక మార్పు అయింది. ఈ విశ్వ వాతావరణంతో సహకరించడానికి, జ్ఞానులు ఆమె షిన్ షిన్ స్థాయిని బట్టి, ఒక మృదువైన నాళం ద్వారా గోంగ్‌ను అందచేస్తారు. ఒక నీటి కొళాయి తెరిచినప్పుడు చిమ్మే నీటి ప్రవాహంలాగా ఆ శక్తి ప్రవహిస్తుంది. వారు, గోంగ్‌ను విడుదల చేయాలని అనుకుంటే అది బయటికి వస్తుంది. ఆమెకు తన యొక్క స్వంత గోంగ్ లేకపోవడంవల్ల, స్వయంగా గోంగ్‌ను విడుదల చేయలేకపోయింది. అది అలా జరిగింది. దీనినే “విలోమ ఆధ్యాత్మిక

సాధన" అంటారు, దానిలో, ఒక వ్యక్తి యొక్క ఆధ్యాత్మిక సాధన ఉన్నత స్థాయినించి వెనుదిరిగి, క్రింది స్థాయికి వచ్చినప్పుడు సంపూర్ణం అవుతుంది.

సాధారణంగా మనం క్రింది స్థాయి నించి, గోంగ్‌ను విప్పుకోవడం లేదా సాధన సంపూర్ణం అయ్యే ఉన్నతస్థాయి వరకు ఆధ్యాత్మిక సాధనను చేస్తాం. ఈ విలోమ సాధన అన్నది క్రింది స్థాయి నించి ఉన్నతస్థాయికి ఆధ్యాత్మిక సాధనను అభ్యసించడానికి తగినంత సమయం లేని వృద్ధుల కోసం ఉండేది. అందువల్ల పైస్థాయినించి క్రింది స్థాయికి అభ్యసిస్తే, త్వరగా అయిపోయేది. ఇది ఆ కాలంలో కల్పించబడిన ఒక ప్రక్రియ. అటువంటి వ్యక్తికి అత్యంత ఉన్నతమైన షిన్ షిన్ ఉండాలి, ఆమెకి తన షిన్ షిన్ స్థాయిని బట్టి శక్తి ఇవ్వబడేది. దాని వెనకనున్న ఉద్దేశాలేమిటి? ఒక వ్యక్తి, ఆ కాలంలో ఉండిన విశ్వ వాతావరణానికి సహకరించవలసిన అవసరం ఉండేది. ఆమె ఒక మంచి పని చేస్తూ, అదే సమయంలో, కష్టాలు అనుభవించవలసి ఉండేది. ఎందుకంటే, సామాన్య వ్యక్తుల నడుమ రకరకాల మానవ బంధాలు ఆమెకు అంతరాయం కల్పించే అవకాశం ఉంది. ఆమె ఒక వ్యాధిగ్రస్తునికి వ్యాధి నిర్మూలన చేసినప్పుడు, అతడు దాన్ని మెచ్చుకోకపోవచ్చు. ఆ రోగికి చికిత్స చేసినప్పుడు, అతడి శరీరంనించి ఎన్నో చెడుపదార్థాలు తీసేసి ఉంటుంది. ఆ మేరకు వ్యాధిని తొలగించినా, ఆ సమయంలో వచ్చిన మార్పు బయటికి కనిపించి ఉండకపోవచ్చు. ఆ రోగి అప్పుడు, తన మనసులో సంతోషపడి ఉండకపోవచ్చు. కృతజ్ఞత తెలియజేసే బదులు తనను మోసం చేసిందని, ఆమెను నిందించవచ్చు. ఈ సమస్యలతో, ఆ పరిసరాలలో ఆమె మానసికంగా బాధకు లోనవుతూ ఉండొచ్చు. ఆమెకు ఆధ్యాత్మిక సాధన చేసుకొని, తనను తాను అభివృద్ధి చేసుకోవడానికి ఆ శక్తిని ఇచ్చి ఉండొచ్చు. మంచి పనులు చేస్తుండగా ఆమె తన అతీంద్రియ శక్తులను స్వయంగా అభివృద్ధిపరచుకొని గోంగ్‌ను పెంచుకొని ఉండొచ్చు; అయితే కొందరు వ్యక్తులు ఈ నియమాన్ని తెలుసుకోలేదు. ఈ వ్యక్తికి ఎవ్వరూ ఫాను బోధించలేరని నేను చెప్పలేదా? ఆమె దానిని అర్థం చేసుకొని ఉంటే, దానిని పొంది ఉండేది. ఇది జ్ఞానోదయానికి సంబంధించిన అంశం. ఆ వ్యక్తి ఆ విషయాన్ని అర్థం చేసుకోలేకపోతే ఏమీ చెయ్యలేము.

కొందరు వ్యక్తులకు, శక్తి ఇవ్వబడినప్పుడు నిద్రలోనే హఠాత్తుగా వేడిగా అనిపించి దుప్పటి కప్పుకోలేకపోతారు. మరునాడు పొద్దున లేచిన తరవాత, వారు ఏ వస్తువు మీద చెయ్యి వేసినా, విద్యుద్ఘాతం తగులుతుంది. తాము శక్తిని పొందామని వాళ్ళకు తెలిసింది. ఎవరికైనా ఒక శరీర భాగంలో నొప్పి ఉన్నప్పుడు, వారు తమ చేతులతో తాకి ఆ బాధను తీరుస్తారు, అది చక్కగా పనిచేస్తుంది. అప్పటినించి తమకు శక్తి ఉందని వాళ్ళకు తెలిసింది. వారు చీ గోంగ్ గురువులై, తమ నామ ఫలకాలు రాయించుకొని తగిలించారు. తమకు తామే చీ గోంగ్ గురువులన్న పేరు పెట్టుకొని, తమ వృత్తిని స్థిరపరుచు కున్నారు. మొదట్లో ఈ వ్యక్తి చాలా మంచిగా ఉండేవాడు. అతడు ఇతరుల వ్యాధులను పోగొట్టినప్పుడు వారు అతడికి డబ్బు, కానుకలు ఇచ్చేవారు – వాటన్నిటినీ అతడు తిరిగి ఇచ్చేవాడు లేదా తిరస్కరించేవాడు. అయితే ఇంత పెద్ద ఎత్తున, రంగులు కలిపే పెద్ద తొట్టివంటి సామాన్య వ్యక్తులనించి వస్తున్న భావకాలుష్యాన్ని అతడు నిగ్రహించలేకపోయేవాడు. ఈ విలోమ ఆధ్యాత్మిక సాధన చేసినవారు అసలైన షిన్ షిన్ సాధనను ఎప్పుడూ చేసి ఉండకపోవడం వల్ల, తమ షిన్ షిన్‌ను నిలుపుకోవడం వాళ్ళకు కష్టమయ్యేది. క్రమంగా ఈ వ్యక్తి చిన్న బహుమతులను స్వీకరించేవాడు. తరవాత పెద్ద బహుమతులను కూడా స్వీకరించేవాడు. చివరకు బహుమతులు తక్కువగా వచ్చినప్పుడు బాధపడేవాడు. చిట్టచివరకు, "మీరు నాకు ఇన్ని వస్తువులు ఎందుకిస్తున్నారు? డబ్బుగా ఇవ్వండి!" అనేవాడు. మరీ తక్కువ డబ్బు ఇస్తే అతడు సంతోషపడేవాడు కాడు. తన సమర్థతను గురించి ఇతరుల పొగడ్తలు విని, విని, అసలైన చీ గోంగ్ సిద్ధాంత గురువులను కూడా అతడు గౌరవించేవాడు కాడు. ఎవరైనా తన గురించి చెడ్డగా మాట్లాడితే, అతడు కలతపడేవాడు. కీర్తి, స్వార్థం పట్ల అన్ని బంధాలు అతడిలో పెరిగాయి. తనను తాను ఇతరులకన్నా మేలని, అసాధారణమైన వాడినని అతడు భావించుకునేవాడు. ఒక చీ గోంగ్ గురువు అయిపోయి, సంపద కూడబెట్టుకోవడం కోసమే తనకు శక్తి ఇవ్వబడిందని అతడు పొరపాటుగా భావించేవాడు, నిజానికి అది అతడికి ఆధ్యాత్మిక సాధన కోసం ఇవ్వబడింది. ఒకసారి కీర్తి, లాభం అనే బంధాలు అతడిలో పెరిగి నంతనే అతడు షిన్ షిన్ స్థాయి నిజంగా పడిపోయింది. ఒక వ్యక్తి యొక్క

షిన్ షిన్ ఎంత ఎత్తుగా ఉంటుందో, అతడి గోంగ్ స్థాయి అంత ఎత్తుగా ఉంటుందని నేను చెప్పాను. అతడి షిన్ షిన్ స్థాయి పడిపోయినప్పుడు, అతడికి ఎక్కువ గోంగ్ ఇవ్వబడదు, ఎందుకంటే, అది షిన్ షిన్ స్థాయిని బట్టి ఇవ్వబడుతుంది. గోంగ్ స్థాయి యొక్క ఎత్తు షిన్ షిన్ స్థాయికి అనుగుణంగా ఉంటుంది. సామాన్య వ్యక్తుల నడుమ ఉన్నప్పుడు, ఒక వ్యక్తి కీర్తి, స్వలాభాలకు ఎంత ఎక్కువగా బంధితుడైతే, అతడి స్థాయి అంతగా దిగజారిపోతుంది. అతడి గోంగ్ కూడా అదే విధంగా తగ్గిపోతుంది. చివరికి అతడు పూర్తిగా అట్టడుగుకు పడిపోయినప్పుడు, అతడికి ఏమాత్రమూ గోంగ్ ఇవ్వబడదు. ఆ వ్యక్తికి ఇక గోంగ్ అన్నదే ఉండదు. కొన్నేళ్ళ క్రిందట, అటువంటి వ్యక్తులు కొందరు ఉండేవారు. అందులోనూ, ఎక్కువగా యాభై ఏళ్ళు దాటిన స్త్రీలు ఉండేవారు. మీరు ఒక వృద్ధ స్త్రీ, చీ గోంగ్ చెయ్యడం చూసి ఉన్నా, ఆమె ఎన్నడూ అసలైన బోధనను పొందలేదు. ఆమె ఒక చీ గోంగ్ తరగతిలో, వ్యాధి నిర్మూలన చేయడం కోసమూ, దేహపుష్టి నిలుపుకోవడం కోసమూ, కొన్ని చేతి కదలికలను నేర్చుకొని ఉండొచ్చు. ఒక రోజున హఠాత్తుగా ఆమెకి గోంగ్ లభించింది. ఒకసారి ఆమె షిన్ షిన్ తగ్గినా, ఆమెలో కీర్తి, స్వలాభాల పట్ల బంధాలు పెరిగినా, ఆమె స్థాయి తగ్గిపోతుంది. ఆమె ఎటువంటి ప్రాముఖ్యత లేకుండా మిగిలిపోతుంది. అలాగే, ఆమె గోంగ్ కూడా మాయమైపోతుంది. ఈ రోజుల్లో ఇలాగ విలోమ సాధన చేసి స్థాయి కోల్పోయినవాళ్ళు చాలామంది ఉన్నారు. వారిలో కొంతమంది మాత్రమే మన చుట్టూ ఉన్నారు. అలా ఎందువల్ల? ఆమెకు ఆ గోంగ్ ఇవ్వబడినది ఆధ్యాత్మిక సాధన చేయడానికని తెలియలేదు, సంపద కూడబెట్టుకోవడానికి, కీర్తిని పొందడానికి, చీ గోంగ్ గురువు అయేందుకు ఇవ్వబడినదని ఆమె పొరపాటుగా అర్థం చేసుకున్నది. నిజానికి అది ఆమె ఆధ్యాత్మిక సాధన కోసం ఇవ్వబడింది.

"గోంగ్‌ను అరువు తెచ్చుకోవడం" అంటే ఏమిటి? దీనికి వయోపరిమితి లేదు కానీ ఒక ఆవశ్యకత మాత్రం ఉన్నది: ఒక వ్యక్తికి చాలా మంచి షిన్ షిన్ ఉండాలి. చీ గోంగ్ ఒక వ్యక్తికి ఆధ్యాత్మిక సాధన చేసే వీలు కల్పిస్తుందని ఇతడికి తెలుసు, ఇతడికి ఆధ్యాత్మిక సాధన చేయాలన్న ఆసక్తి కూడా ఉంది. అతడికి ఆధ్యాత్మిక సాధన చెయ్యాలని హృదయంలో సంకల్పం ఉంది కానీ

గురువును ఎక్కడ కనుగొనగలడు? కొన్నేళ్ళ క్రిందట, చీ గోంగ్‌ను బోధించే నిజమైన చీ గోంగ్ గురువులు ఉండేవారు. అయితే, వారు బోధించినది పూర్తిగా వ్యాధి నిర్మూలనమూ, దేహపుష్టి నిలుపుకోవడం మాత్రమే. వారెవ్వరూ ఉన్నత స్థాయి చీ గోంగ్‌ను బోధించనూ లేదు, బోధించేవారు కూడా కాదు.

గోంగ్‌ను అరువు తెచ్చుకోవడం గురించి చెప్పేటప్పుడు, నేను మరొక అంశాన్ని కూడా ప్రస్తావిస్తాను. ఒక వ్యక్తికి, ప్రధాన ఆత్మ (ప్రధాన చైతన్యం) (11)తో పాటుగా, సహాయక ఆత్మ (సహాయక చైతన్యం)(12) కూడా ఉంటుంది. కొందరికి ఒకటి, రెండు, మూడు, నాలుగు లేదా ఐదు సహాయక ఆత్మలు కూడా ఉంటాయి. సహాయక ఆత్మల విషయంలో, ఒక పురుషునికి పురుష సహాయక ఆత్మ ఉండాలని, ఒక స్త్రీకి స్త్రీ సహాయక ఆత్మ ఉండాలన్న నియమం లేదు. కొన్ని స్త్రీ ఆత్మలు ఉంటాయి, కొన్ని పురుష ఆత్మలు ఉంటాయి. అవన్నీ వేరుగా ఉంటాయి. నిజానికి స్త్రీపురుషుల యొక్క ప్రధాన ఆత్మలు కూడా తప్పనిసరిగా స్త్రీకి స్త్రీ ప్రధాన ఆత్మ, పురుషునకు పురుష ప్రధాన ఆత్మ ఉండవలసిన అవసరం లేదు, ఎందుకంటే, ప్రస్తుతం, ఎందరో పురుషులలో స్త్రీ ప్రధాన ఆత్మలూ, ఎందరో స్త్రీలలో పురుష ప్రధాన ఆత్మలూ ఉండడం మేము గమనించాము. ఇది తావో సిద్ధాంతంలో చెప్పిన విశ్వ వాతావరణానికి సరిగ్గా సరిపోతుంది, యిన్, యాంగ్ (13) లనేవి ఒకదానికొకటి వ్యతిరేకంగా ఉంటాయని, యిన్ అన్నది వృద్ధిలోనూ, యాంగ్ అన్నది క్షీణతలోనూ ఉంటాయని తావో సిద్ధాంతం వర్ణించింది.

ఒక వ్యక్తి యొక్క సహాయక ఆత్మ సాధారణంగా అతడి ప్రధాన ఆత్మ కన్నా పైస్థాయినించి వస్తుంది. ముఖ్యంగా కొందరు వ్యక్తుల యొక్క సహాయక ఆత్మ చాలా ఉన్నతస్థాయినించి వస్తుంది. సహాయక ఆత్మ అన్నది మిమ్మల్ని ఆవహించి ఉన్నది కాదు, ఎందుకంటే అది మీతోపాటే మీ తల్లి గర్భంనించి జన్మిస్తుంది. అది మీ పేరును కూడా పంచుకుంటుంది ఎందుకంటే అది మీ శరీరంలోని భాగం. సాధారణంగా, మనుషులు ఒక విషయాన్ని గురించి ఆలోచించినా లేదా ఒక పని చేసినా, ఆ నిర్ణయం తీసుకునే బాధ్యత ప్రధాన ఆత్మదే. సహాయక ఆత్మ ముఖ్యంగా ప్రధాన ఆత్మను తప్పులు చెయ్యకుండా నివారించడానికి తన శక్తి మేరకు ప్రయత్నిస్తుంది. అయితే, ప్రధాన ఆత్మ చాలా

మొండిగా వ్యవహరిస్తే సహాయక ఆత్మ ఎటువంటి సహాయమూ చెయ్య లేకపోతుంది. సామాన్య మానవ సంఘంలో, ప్రధాన ఆత్మ సులభంగా మోసపోగా, సహాయక ఆత్మ మోసపోదు.

కొన్ని సహాయక ఆత్మలు, అత్యున్నత స్థాయిలనించి వచ్చి ఉంటాయి, అవి ఆధ్యాత్మిక సాధనలో దాదాపు సరియైన ఫల స్థితిని సాధించే అంచున ఉంటాయి. సహాయక ఆత్మకు ఆధ్యాత్మిక సాధన చెయ్యాలన్న కోరిక ఉంటుంది, కానీ ప్రధాన ఆత్మకు చెయ్యాలన్న కోరిక లేకపోతే ఆ విషయంలో అది ఏమీ చెయ్యలేదు. చీ గోంగ్ చాలా ప్రాచుర్యంలో ఉన్నప్పుడు ఒకనాడు ప్రధాన ఆత్మ కూడా ఆధ్యాత్మిక సాధన చెయ్యాలని కోరుకుంది. ఉన్నత స్థాయిలకు చేర్చే ఆధ్యాత్మిక సాధన గురించిన ఆలోచన ఎంతో పవిత్రంగానూ, సులువుగానూ ఉండేది; ఒక వ్యక్తికి కీర్తి, స్వార్థం పట్ల ఆపేక్ష ఉండేది కాదు. ఏమైనా, సహాయక ఆత్మ "నాకు ఆధ్యాత్మిక సాధన చెయ్యాలని ఉంది కానీ, నేను నిర్ణయాలు తీసుకోను. ఇప్పుడు నువ్వు ఆధ్యాత్మిక సాధన చెయ్యా లనుకుంటున్నావు, నేను కోరినది అదే", అని సంతోషపడింది. కానీ ఆ వ్యక్తికి గురువు ఎక్కడ దొరుకుతారు? సహాయక ఆత్మకు చాలా సమర్థత ఉంది, గత జన్మలలో తనకు తెలిసినట్టి మహాజ్ఞానిని వెతకడానికి, ఆ శరీరాన్ని విడిచి వెళ్ళగలదు. కొన్ని సహాయక ఆత్మలు అత్యున్నత స్థాయిలనించి వచ్చిన కారణంగా అవి శరీరాన్ని విడిచి వెళ్ళగలవు. అక్కడికి చేరుకున్న తరవాత, ఆ సహాయక ఆత్మ ఆధ్యాత్మిక సాధన చెయ్యాలన్న కోరికను, గోంగ్ అరువుగా కావాలన్న తన కోరికలను వ్యక్తపరిచింది. ఆ మహాజ్ఞానులు అది ఎంతో బాగుందనుకొని, తప్పనిసరిగా సహాయం అందిస్తారు. దానికి తగినట్లుగా, సహాయక ఆత్మ కొంత గోంగ్‌ను అరువు తీసుకుంది. సాధారణంగా ఈ గోంగ్, ఒక నాళం ద్వారా ఇవ్వబడే శక్తి ప్రసరణ. అరువుగా తీసుకున్న గోంగ్‌లో కొంతభాగం కొన్ని రూపాల్లో కూడా వస్తుంది, ఇంకా సాధారణంగా కొన్ని అతీంద్రియ శక్తులను కూడా కలిగి ఉంటుంది.

ఈ రకంగా ఆ వ్యక్తికి అదే సమయంలో, అతీంద్రియ శక్తులు ఉండవచ్చు. నేను వర్ణించినట్లు, ఆ వ్యక్తికి ఒకరోజు రాత్రి నిద్రలో చాలా వెచ్చదనం కలిగి ఉండవచ్చు. మరునాడు పొద్దున లేచినప్పుడు అతనికి శక్తి

ఉంది. అతడు చెయ్యి పెట్టిన ప్రతిచోటా విద్యుద్ఘాతం తగిలింది. అతడు ఇతరులకు వ్యాధి నిర్మూలన చెయ్యగలిగాడు, తాను శక్తిని పొందినట్లు కూడా తెలుసుకున్నాడు. ఆ శక్తి ఎక్కడినించి వచ్చింది? ఇది అతడికి స్పష్టంగా తెలియలేదు. అది విశ్వాంతర్భాగంనించి వచ్చిందన్న ఒక అస్పష్ట భావన మాత్రం అతడికి ఉంది. కానీ అది ఎలా వచ్చిందన్నది మాత్రం అతడికి నిర్దిష్టంగా తెలియలేదు. సహాయక ఆత్మ అతడికి ఆ విషయం చెప్పదు, ఎందుకంటే ఆధ్యాత్మిక సాధన చేసినది, సహాయక ఆత్మ. అతడికి తెలిసినది కేవలం తాను శక్తిని పొందాను అన్న విషయం మాత్రమే.

గోంగ్‌ను అరువు తీసుకున్న వ్యక్తులకు సాధారణంగా వయసు గురించి ఏ విధమైన పరిమితి ఉండేది కాదు, అటువంటి వారిలో, ఎక్కువగా యువకులే ఉండేవారు. అందువల్ల కొన్నేళ్ళ క్రిందట ప్రజలలోకి వచ్చినవారిలో, ఇరవై, ముప్పై, నలభై ఏళ్ళ వారు కూడా ఉండేవారు. కొందరు వయసుమళ్ళినవారు కూడా ఉండేవారు. యువతీయువకులకు, తమనుతాము అదుపులో ఉంచుకోవడం అతికష్టంగా ఉండేది. ఒకవేళ మీరొక వ్యక్తిని, ఎక్కువ అతీంద్రియ శక్తులు లేనప్పుడు సామాన్య మానవ సమాజంలో మంచి ప్రవర్తనను కలిగి ఉండి, కీర్తి, స్వప్రయోజనాల కోసం పెద్దగా లక్ష్యపెట్టకుండా ఉన్న సమయంలో చూసి ఉండొచ్చు. ఒకసారి మంచి గుర్తింపు పొందిన తరువాత, కీర్తి, లాభం సులభంగా అంతరాయం కలిగిస్తాయి. తాను జీవితంలో ఇంకా చాలా ముందుకు పోవలసి ఉందనుకొని, సామాన్య మానవులకు ఉండే కొన్ని లక్ష్యాలను సాధించేందుకు అతడు అన్ని ప్రయత్నాలు చేస్తాడు. అందువల్ల, అతడు కొన్ని అతీంద్రియ శక్తులను, కొన్ని సామర్థ్యాలను పెంపొందించుకున్న తరవాత, వాటిని సామాన్య వ్యక్తుల సమాజంలో తన స్వంత లక్ష్యాలను సాధించడంకోసం ఉపయోగించుకుంటాడు. వాటిని అలా వాడటం అన్నది నిషిద్ధం, అవి ఇక పని చెయ్యవు. అతడు ఎంత ఎక్కువగా వాటిని ఉపయోగిస్తుంటే అతడి శక్తి అంతగా తగ్గిపోతుంది. చివరకు అతడికి ఏమీ మిగలదు. ఈ రకంగా స్థాయిలు పడిపోయినవారు ఇంకా ఎందరో ఉన్నారు. ఇప్పుడు అటువంటివారెవరూ మిగలలేదని నేను తెలుసుకున్నాను. నేను చెప్పిన ఈ రెండు సందర్భాలలో, మంచి షిన్ షిన్ వల్ల శక్తిని పొందిన

వారున్నారు. ఈ శక్తి వారి స్వంత ఆధ్యాత్మిక సాధన వల్ల పెంపొందించుకున్నది కాదు. అది మహాజ్ఞానులనించి వచ్చినది కాబట్టి ఆ శక్తి స్వతహాగా మంచి శక్తి.

## ప్రేతాత్మ లేదా జంతువులు ఆవహించడం

సాధకుల సమాజంలో నక్కలు, వీజిల్స్ అనే జంతువులు, పిశాచాలు, ఇంకా పాములు ఆవహించడం గురించి మీలో ఎందరో విని ఉంటారు. అదంతా ఏమిటి? చీ గోంగ్ సాధన ద్వారా అతీంద్రియ శక్తులు పొందడం గురించి కొంతమంది చెప్తారు. నిజానికి అతీంద్రియ శక్తులనేవి పెంపొందించుకో గలిగినవి కావు. అవి జన్మతహా వచ్చిన మానవ శక్తులు. మానవజాతి పురోగతి కారణంగా జనులు భౌతిక ప్రపంచంలోని ప్రత్యక్ష వస్తువుల మీద దృష్టి కేంద్రీకరించి, ఆధునిక పరికరాలపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. ఫలితంగా, జన్మతహా వచ్చిన మానవ శక్తులు క్షీణించిపోతున్నాయి. చివరికి అవి పూర్తిగా మాయమవుతున్నాయి.

ఒక వ్యక్తి అతీంద్రియ శక్తులను ఆధ్యాత్మిక సాధనతో పెంపొందించు కోవాలి. తర్వాత తన స్వస్వరూపానికి తిరిగి చేరుకోవాలి. కానీ జంతువుకు ఇటువంటి అభివృద్ధి చెందిన మనసు ఉండకపోవడంవల్ల, దాని మౌలిక జంతు సహజ గుణం ద్వారా విశ్వలక్షణంతో అనుసంధానం చేసుకుంటుంది. జంతువులు ఆధ్యాత్మిక సాధన చేయగలవని, నక్కలకు దాన్ను సాధన చెయ్యడం తెలుసని, పాములకు ఆధ్యాత్మిక సాధన తెలుసని, రకరకాలుగా చెప్తారు. దానికి అర్థం జంతువులకు ఆధ్యాత్మిక సాధన ఎలా చెయ్యాలో తెలుసని కాదు. మొదట్లో, వాటికి కూడా ఆధ్యాత్మిక సాధన అంటే ఏమిటో బొత్తిగా తెలియదు. వాటికి మౌలికమైన జంతు సహజ గుణం మాత్రమే ఉంటుంది. తర్వాత కొన్ని ప్రత్యేక స్థితులు, పరిసరాలవల్ల, కొంతకాలానికి వాటి సహజ గుణం మీద ప్రభావం చూపించి, వాటికి శక్తి వచ్చి, కొన్ని అతీంద్రియ శక్తులు లభించవచ్చు. అవి కొన్ని శక్తులను పొంది, అతీంద్రియ శక్తులను అభివృద్ధి చేసుకోగలవు.

ఆ విధంగా ఒక జంతువుకు కొన్ని శక్తులుంటాయి. గతంలోనైతే ఆ జంతువు కొన్ని శక్తుల వలన చాలా చాతుర్యం పొందిందని అనేవారు. సామాన్య మానవుల దృష్టిలో జంతువులు అతిప్రబలమైనవి, మానవులను సులభంగా ఏమార్చగలవు. నిజానికి, ఒక నిజమైన సాధకుడి ఎదుట అవి ఏమాత్రం ప్రబలమైనవి కావు, అవి అసలు లెక్కకే రావని నేనంటాను. ఒక వెయ్యేళ్ళు ఆధ్యాత్మిక సాధన చేసిన జంతువు ఉన్నా, దాన్ని నాశనం చెయ్యడానికి ఒక చిటికెనవేలు కూడా ఎక్కువే. జంతువులకు మౌలికమైన సహజ గుణం ఉంటుందనీ, కొన్ని శక్తులు ఉంటాయనీ మేము చెప్పాం. అయితే మన విశ్వంలో ఒక నియమం ఉంది: జంతువులు సాధనలో సఫలత సాధించడానికి అనుమతి లేదని. అందువల్లనే, మీరు ప్రాచీన గ్రంథాలలో, కొన్ని వందల ఏళ్ళకొకసారి, పెద్ద విపత్తు కారణంగానో, చిన్న దుర్ఘటన కారణంగానో, జంతువులు అంతరించాయని చదువుతారు. ఒక కాల అవధి తర్వాత, జంతువులు శక్తులను పెంపొందించుకుంటాయి, అవి తప్పనిసరిగా అంతం కావాలి, లేదా పిడుగుపాటు మొదలైనవాటికి గురి కావాలి. అవి ఆధ్యాత్మిక సాధన చేయడం నిషిద్ధం, ఎందుకంటే వాటికి మానవ సహజ స్వభావం ఉండదు; వాటికి మానవ లక్షణాలు ఉండవు గనక అవి మనుషులలాగా ఆధ్యాత్మిక సాధన చెయ్యలేవు. అవి సాధనలో సఫలమైతే పిశాచాలుగా మారే అవకాశం ఉంది. అందువల్ల అవి సాధనలో సఫలం అయ్యేందుకు అనుమతి లేదు. లేకపోతే అవి దైవం చేత సంహరింపబడతాయి. వాటికి కూడా అది తెలుసు. కానీ, నేను చెప్పినట్లుగా మానవ సమాజం చాలా పతన దిశలో ఉంది, కొందరు వ్యక్తులు అన్ని రకాల పాపాలు చేస్తారు. ఈ దశలో మానవ సమాజం ప్రమాదంలో లేదా?

ఒక హద్దుకు చేరిన తరవాత ఏ విషయమైనా వెనకకు తిరగవలసిందే! ఐతిహాసిక యుగంలో, కాలావధులలో మానవసమాజం నాశనమైనప్పుడల్లా, ప్రతిసారీ, మానవాళి నైతికంగా తీవ్ర పతనానికి చేరుకున్నప్పుడు అలా జరిగిందని మేము కనుగొన్నాము. ప్రస్తుతం, మానవాళి నివసిస్తున్న ఈ పరిమాణంతోపాటు, అన్ని పరిమాణాలూ చాలా ప్రమాదకరమైన స్థితిలో ఉన్నాయి. ఈ స్థాయిలో ఉన్న ఇతర పరిమాణాలలో కూడా ఇదే పరిస్థితి

ఉంది; ఆవహించే ఆత్మలూ, జంతువులు కూడా తప్పించుకొని పై స్థాయులకు వెళ్ళాలని తొందరపడతాయి. పై స్థాయులకు ఎదగడం ద్వారా తప్పించుకో గలమని అవి అనుకుంటున్నాయి. అయితే అది అంత సులభంగా ఎలా జరుగుతుంది? ఆధ్యాత్మిక సాధన చెయ్యాలంటే మానవ శరీరం కలిగి ఉండడం తప్పనిసరి. దానికి తగినట్లుగానే, కొందరు చీ గోంగ్ అభ్యాసకులు, ప్రేతాత్మలు, జంతువుల చేత ఆవహించబడడానికి, ఇదొక కారణం.

కొందరు వ్యక్తులు "ఎందరో మహాజ్ఞానులు లేదా ఉన్నతస్థాయి గురువులు ఉన్నారు గనక వారు ఈ విషయం గురించి పట్టించుకోవచ్చు కదా?" అని ఆశ్చర్యపోతారు. మన విశ్వంలో మరొక నియమం ఉంది: మీరు ఒక విషయం కోసం ప్రాకులాడుతున్నా, కోరుకుంటున్నా, ఇతరులు జోక్యం చేసుకోవడానికి ఇష్టపడరు. ఇక్కడ మీకందరికీ ఒక ధర్మబద్ధమైన మార్గాన్ని అనుసరించడం మేము నేర్పుతాము, అదే సమయంలో ఫా ను సమగ్రంగా బోధించి, మీరు స్వంతంగా జ్ఞానోదయం పొందేట్లు చేస్తాం. మీరు నేర్చు కోవాలా లేదా అన్నది మీ పని. గురువు మిమ్మల్ని సింహద్వారం వరకు తీసుకువెళతారు, ఆధ్యాత్మిక సాధన చెయ్యడమన్నది మీ నిర్ణయం. మిమ్మల్ని ఎవ్వరూ బలవంతపెట్టరు, ఆధ్యాత్మిక సాధన చేయించరు. ఆధ్యాత్మిక సాధన చేస్తారా లేదా అన్నది మీ పని. మరొక రకంగా చెప్పాలంటే, మీరు ఏ దారిలో వెళ్తారు, ఏం కోరుకుంటారు, ఏం పొందాలని ప్రయత్నిస్తారు అన్న విషయాలలో ఎవరూ జోక్యం చేసుకోరు. జనులందరూ మంచిగా ఉండాలన్న సలహా మాత్రమే ఇవ్వగలం.

కొందరు వ్యక్తులు చీ గోంగ్ అభ్యసిస్తున్నట్లు మీకు కనపడినా, నిజానికి వారిలో ఉన్న శక్తి వారిని ఆవహించుకున్న ప్రేతాత్మలు లేదా జంతువులు సంపాదించుకున్నట్టిది. ఒక వ్యక్తి ఆ ప్రేతాత్మ లేదా జంతువు చేత ఎలా ఆవహింపబడ్డాడు? దేశవ్యాప్తంగా ఎందరు చీ గోంగ్ సాధకులు తమ శరీరాల వెనక ఆవహించిన ప్రేతాత్మలు, జంతువులను కలిగి ఉన్నారు? నేను గనక ఆ సంఖ్యను తెలియజేస్తే, చాలామంది చీ గోంగ్‌ను అభ్యసించడానికే భయ పడతారు. ఆ సంఖ్య భయపెట్టేంత పెద్దది! అయితే ఈ పరిస్థితి ఎందువల్ల వచ్చింది? ఈ విషయాలు సాధారణ మానవ సమాజాన్ని బాధిస్తున్నాయి.

ఎందువల్ల ఇది ఇంత తీవ్రంగా పరిణమిస్తున్నది? దీనిని మానవులే స్వయంగా ప్రేరేపిస్తున్నారు, ఎందుకంటే, మానవజాతి పతనం అవుతున్నది, పిశాచాలు ప్రతిచోటా ఉన్నాయి. ముఖ్యంగా ఆ నామమాత్రపు చీ గోంగ్ గురువులు, వారి శరీరాలతోపాటు తమను ఆవహించుకొని ఉన్న ప్రేతాత్మలను, జంతువులను మోస్తూ ఉంటారు, వారి బోధనలలో వాటినే ఇతరులకు అందిస్తారు. మానవజాతి చరిత్ర అంతటా, జంతువులు మానవులను ఆవహించడం నిషేధింపబడింది. అలా చేసినప్పుడు అవి చంపబడ్డాయి; దాన్ని చూసిన వారెవరూ అందుకు ఒప్పుకోరు. అయితే ఈనాడు కొందరు సహాయం కోరి వాటిని ప్రార్థిస్తారు, కోరుకుంటారు, పూజిస్తారు. కొందరు, "నేను దానికోసం ప్రత్యేకంగా అడగలేదు!" అనుకోవచ్చు. మీరు దానికోసం అడగలేదు, కానీ అతీంద్రియ శక్తుల కోసం ప్రయత్నించారు. ఒక ధర్మబద్ధమైన ఆధ్యాత్మిక సాధనను చేసిన జ్ఞాని మీకు వాటిని ఇస్తారా? ప్రాకులాట అన్నది సామాన్య వ్యక్తులలో ఉండే ఒక బంధం, ఈ బంధాన్ని వదిలిపెట్టి తీరాలి. కాబట్టి మీకు వాటిని ఎవరిస్తారు? కేవలం ఇతర పరిమాణాలలోని పిశాచాలు, ఇంకా రకరకాల జంతువులు వాటిని మీకు ఇవ్వగలవు. ఇది, మీరు ఒక ప్రేతాత్మనో, జంతువునో ఆవాహన చేసుకున్నట్లు కాదా? అవి అప్పుడు వస్తాయి.

ఎంతమంది వ్యక్తులు సరైన మనసుతో చీ గోంగ్ సాధన చేస్తారు? చీ గోంగ్ సాధనలో ఒక వ్యక్తి పుణ్యానికి విలువనిస్తూ, మంచి పనులు చేస్తూ, దయ కలిగి ఉండడం అవసరం. ఒక వ్యక్తి అన్ని పరిస్థితులలోనూ, ప్రతి విషయంలోనూ ఈ విధంగా తన ప్రవర్తనను తాను నిలుపుకోవాలి. ఒక తోటలో గానీ, తన ఇంట్లో గానీ చీ గోంగ్ అభ్యాసం చేస్తూ ఎంతమంది ఈ విధంగా ఆలోచిస్తారు? కొందరు వ్యక్తులు ఏ విధమైన చీ గోంగ్ సాధన చేస్తారో ఎవరికీ తెలియదు. ఒక వ్యక్తి వ్యాయామాలు చేస్తూ, శరీరాన్ని కదుపుతూ, "ఓహ్, నా కోడలు నన్ను గౌరవించదు. మా అత్తగారు ఎంత భయంకరమైన మనిషి!" అని గొణుగుతాడు. కొంతమంది అయితే, తమ ఉద్యోగ విషయం మొదలుకొని దేశ రాజకీయాల వరకు అన్నిటి గురించి వ్యాఖ్యానాలు చేస్తుంటారు. వారు మాట్లాడని విషయమంటూ ఉండదు, వారి ఆలోచనా విధానానికి ఏదైనా విరుద్ధంగా ఉంటే ఎంతో కలవరపడతారు. దాన్ని చీ గోంగ్

సాధన అని మీరు అంటారా? ఇంకా, అతడు అలసటతో వణుకుతున్న కాళ్ళతో, నిలబడి చేసే వ్యాయామం చేస్తూ ఉంటాడు. అయినా అతడి మనసులో నెమ్మది అన్నది ఉండదు: “ఈ మధ్య అన్ని వస్తువులు అధిక వ్యయం కలిగి ఉంటున్నాయి, ధరలు పెరిగిపోతున్నాయి, నా జీతమేమో పెంచరు. నేను, చీ గోంగ్ అభ్యాసంతో, కొన్ని అతీంద్రియ శక్తులను ఎందుకు పెంచుకోకూడదు? అతీంద్రియ శక్తులు పొందితే నేను కూడా ఒక చీ గోంగ్ గురువునై, సంపద కూడబెట్టుకుంటాను. రోగులను చూస్తూ డబ్బు సంపాదించ గలుగుతాను” అని ఆలోచిస్తాడు. ఇతరులు అతీంద్రియ శక్తులను పెంపొం దించుకోవడం చూసిన తర్వాత అతడి ఆత్రుత అధికమవుతుంది. దివ్యనేత్రం కోసమూ, వ్యాధి నిర్మూలన చెయ్యడం కోసమూ అతీంద్రియ శక్తులను పొందడానికి ప్రాకులాడతాడు. అందరూ ఇది ఆలోచించండి: సత్యం–దయ–సహనం అన్న మన విశ్వ లక్షణానికి ఇది ఎంత దూరం! ఇది పూర్తిగా దానికి వ్యతిరేకం అవుతుంది. వాస్తవంగా చెప్పాలంటే ఈ వ్యక్తి ఒక దుష్టసాధనను అభ్యసిస్తున్నాడు! అయితే, అతడు తనకు తెలియకుండానే అలా చేస్తున్నాడు. ఈ రకంగా ఆలోచిస్తున్నకొద్దీ, అతని మనసు ఇంకా చెడిపోతూ ఉంటుంది. అతడు ఫాను పొందలేదు, పుణ్యానికి విలువ ఇవ్వాలని గ్రహించలేదు. ఇక, కేవలం వ్యాయామాలు చెయ్యడంతోనే శక్తిని పెంపొందించుకోగలననీ, నిరంతర ప్రయత్నంతోనే కావలసినవన్నీ పొందవచ్చని అతడు అనుకుంటాడు. ఆ వ్యక్తి ఆలోచించేది, ఇది.

తన దుష్ట సంకల్పాలతోనే ఒక వ్యక్తి ఖచ్చితంగా తనకు తాను చెడ్డ విషయాలను కొనితెచ్చుకుంటాడు. అయితే, ఒక జంతువు దీనిని చూడగలదు: “ఈ వ్యక్తి చీ గోంగ్‌ను అభ్యసించి సంపద కూడబెట్టుకోవాలని కోరుకుంటు న్నాడు. మరొకడు కీర్తిని, అతీంద్రియ శక్తులను కోరుకుంటున్నాడు. ఆహా! అతడి శరీరం కూడా మంచి విషయాలను కలిగి ఉంది, కానీ అతడి మనసు మంచిది కాదు. అతడు అతీంద్రియ శక్తులకై ప్రాకులాడుతున్నాడు. అతడికి ఒక గురువు ఉండి ఉండొచ్చు, కానీ అతడికి గురువున్నా, నాకేం భయం లేదు” అనుకుంటుంది. ఒక ధర్మబద్ధమైన ఆధ్యాత్మిక సాధనకు చెందిన గురువు, అతడు అతీంద్రియ శక్తులను పొందడానికి ఆ రకంగా ప్రాకులాడటం చూసి,

వాటిని ఇవ్వరన్న సంగతి ఆ జంతువుకు తెలుసు. అతడు ఎంత ఎక్కువగా కోరుకుంటే, గురువు అతడికి అంత తక్కువగా ఇస్తారు, ఎందుకంటే సరిగ్గా ఇదే ఒక బంధం, ఆ బంధాన్నే నిరాకరించాలి. అతడు ఈ విధంగా ఎంత ఎక్కువ ఆలోచిస్తే అతడు పొందే అతీంద్రియ శక్తులు అంతగా తగ్గిపోతాయి, అతడు ఆ విషయాన్ని గ్రహించనే లేకపోవచ్చు. వాటికోసం ఎంతగా ప్రాకులాడితే, అతడి మనసు అంతగా పతనం అవుతుంది. చివరికి, అతడు ఇక ఎందుకూ పనికి రాడని గమనించి, అతడి గురువు ఒక నిట్టూర్పు విడిచి, అతడి గురించి పట్టించు కోవడం మానేస్తారు. కొంతమందికి ఒక గురువు అంటూ ఉండరు, వారి పక్కగా వెళ్తున్న ఒక గురువు వారిని చూడవచ్చు, ఎందుకంటే, భిన్న పరిమాణాలలో ఎందరో మహాజ్ఞానులు ఉన్నారు. ఒక మహాజ్ఞాని అతడిని చూసి, ఒక్క రోజు అతడిని అనుసరిస్తూ ఉండవచ్చు. తరవాత, అతడు మంచివాడు కాదని తెలుసుకొని అతడిని వదిలేస్తారు. ఆ మరునాడు మరొక మహాజ్ఞాని అటుగా రావచ్చు, అతడు మంచివాడు కాదని గ్రహించి, ఆయన కూడా వదిలి వెళ్లిపోవచ్చు.

ఆ వ్యక్తికి ఒక గురువున్నా, లేకున్నా, త్రోవన పోయే గురువైనా, ఎవరూ అతడు దేనికోసమై ప్రాకులాడుతున్నాడో, దానినివ్వరని ఆ జంతువుకు తెలుసు. మహాజ్ఞానులున్న ఇతర పరిమాణాలలో చూడగల శక్తి జంతువులకు లేదు, అందువల్ల అవి వారి గురించి భయపడవు, ఆ లొసుగును అవి ఉపయోగించు కోవాలని తలుస్తాయి. మన విశ్వంలో ఒక నియమం ఉంది, అదేమిటంటే సాధారణంగా, ఒక వ్యక్తి దేనికోసమైనా ప్రయత్నం చేస్తున్నా, తనకోసం కోరుకున్నా, ఇతరులు అందులో జోక్యం చేసుకోరు. ఈ లొసుగును ఆ జంతువు ఉపయోగించుకుంటుంది, “అతడికి ఏమైనా కావాలంటే, నేను అందిస్తాను. నేను అతడికి సాయం చేయడం తప్పు కాదు కదా?”, అని ఆ జంతువు అతడికి దానిని ఇస్తుంది. మొదట్లో ఆ జంతువు అతడిని ఆవహించే సాహసం చెయ్యదు, అతడు ఉపయోగించుకోవడానికి కొంత శక్తినిస్తుంది. తాను ప్రయత్నిస్తున్న శక్తి తనలో వచ్చిందని, తాను వ్యాధులను నిర్మూలించగలనని, అతడు హఠాత్తుగా ఒక రోజున తెలుసుకుంటాడు. అది పని చేస్తున్నదని చూసిన తరవాత ఆ జంతువు దాన్ని ఒక పాటకు పల్లవిలాగా వాడుకుంటుంది.

"అతడికి అది కావాలి కాబట్టి నేను అతడి శరీరానికి అతుక్కుంటాను. ఆ రకంగా ఎన్నిటినో సులభంగా ఇవ్వగలుగుతాను. అతడు దివ్యనేత్రం కోరు కుంటున్నాడు కదా? ఇప్పుడు నేను అతడికి అన్నీ ఇస్తాను." అనుకుంటుంది. అప్పుడు అది అతడిని ఆవహించుకుంటుంది.

ఆ వ్యక్తి యొక్క ప్రాకులాడే మనసు ఈ విషయాల గురించి ఆలోచిస్తూ ఉండగా, అతడి దివ్యనేత్రం తెరచుకొని, కొన్ని అల్పమైన అతీంద్రియ శక్తులవల్ల అతడు శక్తిని కూడా ప్రసరింపచేయగలుగుతాడు. అతడు ఎంతో ఉత్తేజితుడై, తాను పొందగోరినది తన సాధనతో, చివరకు సాధించగలిగానని అను కుంటాడు. నిజానికి అతడు తన సాధనవల్ల సాధించినదేమీ లేదు. తాను ఒక మానవ శరీరం లోపలికి చూసి వ్యాధి ఎక్కడుందో, కనిపెట్టగలనని అతడు భావిస్తాడు. నిజానికి అతడి దివ్యనేత్రం తెరుచుకోనేలేదు; అతడి మనసును ఆ జంతువు నియంత్రిస్తున్నది. ఆ జంతువు తన కళ్ళతో చూసిన దానిని అతడి మెదడులోకి ప్రతిబింబింపచేస్తుంది, కాబట్టి అతడు ఆ విధంగా తన దివ్యనేత్రం తెరచుకుందని భావిస్తాడు. "గోంగ్‌ను విడుదల చెయ్యాలా? పద". అతడు శక్తిని ప్రసరింపచేయడానికి తన చేతిని చాపినప్పుడు, ఆ జంతువు కూడా అతడి వెనకనించి తన పాదాన్ని ముందుకు చాపుతుంది. అతడు శక్తిని ఇచ్చిన వెంటనే ఆ పాము తలలోనించి, చీలిన నాలుక, రోగిలోని జబ్బుపడిన భాగం లేదా వాపు ఉన్న భాగం నాకడానికి బయటికి వస్తుంది. అటువంటి కొన్ని సందర్భా లున్నాయి, ఆ వ్యక్తులందరూ తమ ప్రాకులాటవల్లనే, ఆత్మలు, జంతువులు ఆవాహన చేసుకోవడం జరిగింది.

ఈ వ్యక్తి ఒక విషయం కోసం ప్రయత్నించడం – సంపద, కీర్తుల కోసం ప్రాకులాట వల్లనే కొన్ని అతీంద్రియ శక్తులను పొందాడు. అతడు వ్యాధులకు చికిత్స చెయ్యగలడు, అతడి దివ్యనేత్రం కూడా విషయాలను చూడగలదు. అది అతడికి సంతోషాన్ని కలిగిస్తుంది. ఆ జంతువు అది చూసి, "నీకు సంపద కూడబెట్టాలన్న కోరిక లేదా? మంచిది, నువ్వు డబ్బు సంపాదించేటట్లు నేను చేస్తాను" అనుకుంటుంది. ఒక సామాన్య వ్యక్తి మనసును చెడగొట్టడం అతి సులభం. వ్యాధులు పోగొట్టుకోవడంకోసం, లెక్కలేనంతమంది అతడి దగ్గరకు వచ్చేట్లు ఆ జంతువు చెయ్యగలదు. అద్భుతం! అతడు ఇక్కడ ఒక రోగానికి

చికిత్స చేస్తుంటే, ఆ జంతువు మరొకచోట పత్రికా విలేకరులు అతడి గురించి వార్తాపత్రికలలో ప్రచారం జరిపేటట్లు చెయ్యగలదు. సామాన్య మానవులు ఇటువంటి పనులు చేసేలాగా అది జిత్తులు చేస్తుంది. ఒక రోగి తగినంత డబ్బు ఇవ్వకపోతే అది వదలిపెట్టదు; ఆ జంతువు అతడికి తలనొప్పి వచ్చేలా చేస్తుంది. ఎలాగైనా అతడికి ప్రతివారూ అధిక ధనం ఇవ్వవలసినదే. అతడు కీర్తి, సంపదలు రెండూ సాధించాడు. ఎందుకంటే ధనమూ సమకూరింది, కీర్తి కూడా వచ్చింది. అతడు ఒక చీ గోంగ్ గురువు కూడా అయ్యాడు. సాధారణంగా అటువంటి వ్యక్తి షిన్ షిన్‌కు విలువనివ్వడు, పైగా ఏ మాట అనడానికైనా సాహసిస్తాడు. దైవం తర్వాత తానే గొప్ప అని, లేడీ క్వీన్ మదర్ (14)కు, గ్రేట్ జెడ్ ఎంపరర్ (15)కు అపరావతారాన్ని అని ప్రకటించుకోవడానికి సాహసిస్తాడు. తనను తానే బుద్ధుడిగా చెప్పుకోవడానికి కూడా సాహసిస్తాడు. అతడు నిజంగా షిన్ షిన్ సాధన చేయని కారణంగా, తన సాధనలో అతీంద్రియ శక్తులకై ప్రాకులాడతాడు. ఫలితంగా తన మీదకు ప్రేతాత్మ లేదా జంతువును ఆవహింపజేసుకుంటాడు.

“ఇందులో తప్పేముంది? ఎంతకాలం డబ్బు వస్తూ సంపద కూడబెట్టుకోగలిగితే, అంత మేలు, పైగా కీర్తి కూడా వస్తుంది” అని కొందరు అనుకోవచ్చు. చాలామంది ఇలాగే ఆలోచిస్తారు. అందరికీ ఒక మాట చెప్తున్నా, నిజానికి ఆ జంతువుకు దాని స్వంత ఉద్దేశం ఉంటుంది, అకారణంగా అది మీకు ఏమీ ఇవ్వదు. ఈ విశ్వంలో “నష్టపోనిదే లాభం రాదు,” అని ఒక నియమం ఉంది. దానికి ఏం లభిస్తుంది? నేను ముందే ఈ విషయం గురించి చెప్పలేదా? దానికి మీ శరీరంలోని సారం కావాలి, సాధన చేయడానికి దానికి ఒక మానవ రూపం అవసరం, కాబట్టి ఒక మానవ శరీరంనించి సారం తీసుకుంటుంది. ఒక మానవ శరీరంలో, ఈ కొద్దిపాటి సారమే ఉంటుంది. ఒక వ్యక్తి ఆధ్యాత్మిక సాధన చేయాలనుకుంటే, ఈ నిర్దిష్ట సారం మాత్రమే ఉంటుంది. ఆ జంతువుని మీరు ఆ కొద్ది సారమూ తీసుకోనిస్తే, మీరు ఆధ్యాత్మిక సాధనను చేయడం మర్చిపోవలసిందే. మీరు ఆధ్యాత్మిక సాధన ఎలా చేయగలరు? మీ దగ్గర ఏమీ మిగలదు, ఆధ్యాత్మిక సాధన చేయనే లేరు. “నాకు ఆధ్యాత్మిక సాధన చేయాలని లేదు, కేవలం డబ్బు సంపాదించుకోవాలనే ఉంది. డబ్బు ఉన్నంత

కాలమూ మేలే. ఎవడికి లెక్క?", అని కొందరు వాదించవచ్చు. నేనొక మాట చెప్తాను. మీరు ఒక నిధిని కూడబెట్టాలని కోరుకోవచ్చు, కానీ నేనొక విషయం చెప్తే మీరు ఇలా ఆలోచించరు. ఎందుకని? అది మిమ్మల్ని త్వరగా వదిలేస్తే, మీ కాళ్ళు, చేతులు చాలా నీరసపడినట్లు అనిపిస్తుంది. ఆ తర్వాత కూడా, అది మీ శరీరంలోని అధికసారాన్ని తీసేసుకోవడంవల్ల, జీవితపర్యంతం ఆ విధంగానే ఉంటారు. అది మీ శరీరాన్ని ఆలస్యంగా వదిలితే, మీరు ఒంటి ఊపిరితో జీవచ్ఛవంలాగా జీవితాంతం మంచం పట్టి ఉంటారు. మీ దగ్గర డబ్బున్నా, మీరు దాన్ని ఖర్చు చేయగలిగే స్థితిలో ఉన్నారా? మీకు కీర్తి ఉన్నా, దానిని అనుభవించగలరా? ఇది భయంకరంగా అనిపించడం లేదూ?

ఈ సంఘటనలు ప్రత్యేకంగా ఈనాటి సాధకులలో కనిపిస్తున్నాయి, వారి సంఖ్య కూడా చాలా ఎక్కువే. ఒక జంతువు ఒక మనిషిని ఆవహించడమే కాదు, అతడి ప్రధాన ఆత్మను చంపి, అతడి నివాన్ భవనం(16)లో చేరి అక్కడ ఉండగలదు. ఆ వ్యక్తి మానవుడిలాగే కనబడినా, మానవుడు కాదు. ఈ రోజుల్లో ఇటువంటి విషయాలు కూడా జరగొచ్చు. దీనికి కారణం, మానవుల నైతిక విలువలు మారిపోవడం. ఒక వ్యక్తి ఒక తప్పు చేసినప్పుడు, అతడు తప్పు చేస్తున్నాడని ఎవరైనా చెప్తే నమ్మడు. ధనం కూడబెట్టడం, ప్రయత్నించడం, సంపద పోగుచెయ్యడం వంటివి మంచి పనులే అని అతడు భావిస్తాడు. అందువల్ల అతడు ఇతరులకు హాని కలిగించి, చెడు చేస్తాడు. డబ్బు సంపాదించడానికి అతడు ఏ పాపమైనా చేస్తాడు, ఎంతకైనా తెగిస్తాడు. ఏదైనా కోల్పోకుండా, ఆ జంతువు దేనినీ పొందలేదు. మీనించి ఏమీ పొందకుండా మీకు ఏదైనా, ఎందుకిస్తుంది? మీ శరీరంలో ఉన్నవి దానికి కావాలి. అయితే, ఒక వ్యక్తిలోని విలువలు, మనసు సరైనవీ, ధర్మబద్ధమైనవి కానప్పుడు అతడు కష్టాలలో పడతాడని మేము చెప్పాం.

మేము ఫాలున్ దాఫా బోధిస్తున్నాం. మా సిద్ధాంతం ప్రకారం ఆధ్యాత్మిక సాధన చేసేటప్పుడు, మీ షిన్ షిన్‌ను చక్కగా నిలుపుకున్నంత కాలమూ, మీకు ఎటువంటి సమస్యలూ ఉండవు, ఎందుకంటే, ఒక ధర్మబద్ధమైన మనస్సు, వంద పాపాలను అణచివేయగలుగుతుంది. మీరు మీ షిన్ షిన్‌ను చక్కగా నిలుపుకోలేక, దీని వెంటా, దాని వెంట పడుతుంటే, మిమ్మల్ని మీరే

కష్టాలలోకి తోసినట్లు అవుతుంది. కొంతమంది, ఒకప్పుడు చేసిన సాధనలను మానుకోలేరు. ఒక వ్యక్తి నిజమైన ఆధ్యాత్మిక సాధనలో ఏకాగ్రచిత్తంతో ఉండాలి, కనక, మేము అందరినీ ఒక్క సాధనామార్గాన్నే అభ్యసించమని కోరుతాము. కొందరు చీ గోంగ్ గురువులు పుస్తకాలు రాశారు, అయితే, ఆ పుస్తకాల నిండా అనేక రకాల విషయాలుంటాయి, అవి వారు అభ్యసించేవే: అవి పాములు, నక్కలు, వీజిల్స్, అని నేను చెప్తున్నాను. మీరు ఆ పుస్తకాలు చదివినప్పుడు, అవన్నీ ఆ పదాలనించి బయటికి వస్తాయి. నామమాత్రపు చీ గోంగ్ గురువులు, అసలైన చీ గోంగ్ గురువుల సంఖ్యను ఎన్నో రెట్లు దాటారని నేను చెప్పాను, వారిని మీరు వేరుచేసి కనుక్కోలేరు. కాబట్టి, మిమ్మల్ని మీరు సరిగ్గా నియంత్రించుకోవాలి. ఇక్కడ నేను చెప్పేది, మీరు ఫాలున్ దాఫాను అభ్యసించి తీరాలని కాదు; మీరు మీకు నచ్చిన ఏ మార్గంలోనైనా అభ్యసించవచ్చు. అయితే పూర్వకాలపు సామెత ఒకటి ఉండేది: "ఒక వ్యక్తి ఒక్క రోజు ఒక అడవి నక్క అభ్యాసాన్ని చేసే కంటే వెయ్యేళ్ళు ఒక అసలైన సాధన చెయ్యకపోవడమే మేలైనది" అని. ఆ రకంగా, ఒక వ్యక్తి తనను తాను సరిగ్గా నియంత్రించుకొని, ఆధ్యాత్మిక సాధనను ధర్మబద్ధంగా అభ్యసించాలి. ఆధ్యాత్మిక సాధనను మరి ఏ ఇతర విషయాలతోనూ కలపకండి, ఏ విధమైన మనోచర్యలతోనూ కలపొద్దు. కొంతమంది యొక్క ఫాలున్ ఆకారం కోల్పోయాయి. అవి ఎందుకు కోల్పోయాయి? ఆ వ్యక్తులు, తాము ఇతర చీ గోంగ్ సాధనలు చెయ్యలేదని వాదిస్తారు. అయితే, వారు సాధన చేస్తున్నప్పుడల్లా, వారి మనసులలో, పూర్వపు సాధనలలోని విషయాలను జోడిస్తున్నారు. ఆ విషయాలన్నిటినీ, ఈ సాధనలోకి తీసుకు వస్తున్నట్లు కాదా? ప్రేతాత్మ లేదా జంతువులు ఆవహించడం అంశంలో మేము చెప్పేది ఇంత మాత్రమే.

## విశ్వ భాష

విశ్వ భాష అంటే ఏమిటి? ఒక వ్యక్తి హఠాత్తుగా తనకు తెలియని భాషను మాట్లాడుతుంటే దానిని సూచిస్తుంది. అతడు తనకే అర్థం కాని భాషను గొణుగుతాడు. టెలిపతి శక్తి ఉన్నవారికి విషయం అర్థమవుతుందిగానీ, అతడు

దేనిని గురించి చెప్తున్నాడో, నిర్దిష్టంగా తెలియదు. ఇంకా కొందరు వ్యక్తులు వేరువేరు భాషలు అనేకం మాట్లాడగలరు. కొందరైతే దాన్ని ఒక విశేషంగా భావిస్తారు, దాన్ని ఒక శక్తిగానో, అతీంద్రియ శక్తిగానో పరిగణిస్తారు. అది ఒక అతీంద్రియ శక్తి గానీ, ఒక సాధకుడి శక్తి గానీ కానే కాదు; అది ఒక వ్యక్తి స్థాయిని కూడా తెలియజేయదు. అయితే, అదేమిటి? దాని అర్థం, మీ మనసు ఒక పరాయి ఆత్మచేత నియంత్రింపబడుతున్నదన్న మాట. అయితే, మీకు అది ఉండడం బాగుందని తోచి, దాని గురించి సంతోషపడి, దాన్ని కోరుకుంటారు. మీరు ఎంత ఎక్కువగా సంతోషపడితే, అది మిమ్మల్ని అంతగా అదుపు చేస్తుంటుంది. ఒక నిజమైన సాధకుడిగా మీరు మీపై దాని నియంత్రణను ఎలా ఒప్పుకుంటారు? పైగా అది చాలా కిందిస్థాయినించి వస్తుంది. అచ్చమైన సాధకులుగా మనం ఇటువంటి కష్టాలను కోరి తెచ్చుకోకూడదు.

పదార్థం (matter) అంతటికీ ఆత్మ వంటిది గనుక మానవజాతి అతి అమూల్యమైనది. మీరు అటువంటి వాటి అదుపులో ఎలా ఉంటారు? మీరు మీ శరీరాన్ని వదులుకోవడం ఎంత విచారకరమైన విషయం! వీటిలో కొన్ని మానవ శరీరానికి అతుక్కొని ఉంటాయి. కొన్ని అలా ఉండవు గానీ మనుషులకు కొంతదూరంలో ఉంటాయి. కానీ అవి మీ మనసును మార్చి వేస్తూ, మిమ్మల్ని అదుపు చేస్తూ, ఉంటాయి. మీరు మాట్లాడాలనుకున్నప్పుడు, అవి మీరు మాట్లాడేట్లు, గొణిగేట్లు చేస్తాయి. మరొక వ్యక్తి ఆ భాషను నేర్చుకోవాలనుకుంటే, అతడికి కూడా అందించబడుతుంది. ఆ వ్యక్తి స్త్రీ యైనా, పురుషుడైనా దాన్ని ధైర్యంగా ఉపయోగించదలచుకుంటే, ఆ భాషను మాట్లాడ గలరు కూడా. నిజానికి అవి గుంపులుగా కూడా వస్తాయి. మీరు ఆ భాష మాట్లాడాలనుకుంటే, వాటిలో ఒకటి వచ్చి, మీరు దాన్ని పలికేట్లు చేస్తుంది.

ఈ పరిస్థితి ఎందువల్ల రావచ్చు. నేను చెప్పినట్లు అవి వాటి స్థాయిని పెంచుకోవాలని కోరుకుంటూ ఉంటాయి. అక్కడ కష్టాలన్నవి లేవు, అందువల్ల అవి ఆధ్యాత్మిక సాధన చేసి తమను మెరుగుపరచుకోలేవు. అవి ఒక ఆలోచన చేసుకున్నాయి. వాటికి మంచి పనులు చేసి, మనుషులకు సాయం చేయాలన్న

కోరిక ఉంది, కానీ ఎలా చేయాలో తెలియదు. అయితే, తాము ఇచ్చే శక్తి ఒక రోగి వ్యాధిని అణచి, ఆ వ్యాధిని పూర్తిగా నయం చేయలేకపోయినా, ఆ క్షణానికి ఉపశమనమివ్వగలదని వాటికి తెలుసు. ఆ విధంగా శక్తిని ఇవ్వడం ఒక వ్యక్తి నోటిని ఉపయోగించుకొని సాధించవచ్చని వాటికి తెలుసు. జరిగే విషయం ఇది. కొంతమంది దానిని స్వర్గభాష అనీ, మరికొందరు బుద్ధుని భాష అనీ అంటారు. ఇది బుద్ధుని అవమానించడమే. ఇది ఏ మాత్రం అర్థం లేనిదని నేను అంటాను.

ఒక బుద్ధుడు మాట్లాడేందుకు అకారణంగా నోరు తెరవడని తెలిసిన విషయమే. మన పరిమాణంలో ఆయన అలా నోరు విప్పి మాట్లాడితే, మానవాళికి ఒక భూకంపాన్ని సృష్టించగలడు. అటువంటి పెద్ద గర్జనను ఎలా భరించగలం? కొంతమంది, “ఒక బుద్ధుడు నాతో మాట్లాడుతున్నట్లు నా దివ్యనేత్రానికి కనిపించింది,” అంటారు. ఆయన మీతో మాట్లాడలేదు. కొందరు, నా ఫాషెన్ కూడా అలాగే చెయ్యడం చూశారు. ఆయన కూడా మీతో మాట్లాడలేదు. ఆ సందేశం స్టీరియో ధ్వనిలో వినిపిస్తుంది. మీరు దాన్ని విన్నప్పుడు, ఆయనే మాట్లాడుతున్నట్లు అనిపిస్తుంది. ఆయన సాధారణంగా తన పరిమాణంలో మాట్లాడతారు. అయితే అది ఇక్కడికి ప్రసారమైనప్పుడు, ఈ రెండు పరిమాణాలలోని దేశకాలాల భావనలు భిన్నమైనవి కావడంవల్ల, మీరు స్పష్టంగా వినలేరు. మన పరిమాణంలోని ష్చన్ (17) అంటే రెండు గంటలు. ఆ పెద్ద పరిమాణంలోని ఒక ష్చన్ అక్కడ ఒక సంవత్సరంతో సమానం, అక్కడి కాలంతో పోలిస్తే మన కాలం మెల్లగా గడుస్తుంది.

పూర్వం ఒక సామెత ఉండేది: “స్వర్గంలో ఒక్క రోజే, కానీ భూమి మీద వెయ్యేళ్ళు గడిచాయి.” ఇది దేశ కాల భావనలు లేని ఏక స్వర్గాలను సూచిస్తుంది. అంటే అవి మహాజ్ఞానులు నివసించే స్వర్గాలు, ఉదాహరణకు పరమానందపు స్వర్గం, తళతళలాడే స్వర్గం, ఫాలున్ స్వర్గం, మరియు పద్మస్వర్గం. ఇది ఆ ప్రదేశాలను సూచిస్తుంది. అయితే ఆ పెద్ద పరిమాణంలోని కాలం మన పరిమాణంలోని కాలం కన్నా వేగంగా ఉంటుంది. మీరు దానిని గ్రహించగలిగితే, ఎవరో మాట్లాడుతున్నట్లు మీకు వినిపిస్తుంది. కొందరికి దివ్యశ్రవణం అన్న అతీంద్రియశక్తి ఉండి, వాళ్ళ చెవులు తెరుచుకొని

ఉంటాయి. వాళ్ళు ఎవరో మాట్లాడుతున్నట్లు వినగలరు, కానీ అది స్పష్టంగా ఉండదు. మీరు వినగలిగినదల్లా పక్షి కువకువలు, లేదా గ్రామఫోను రికార్డు అతివేగంగా తిరుగుతున్నప్పుడు వచ్చే శబ్దాలను పోలిన శబ్దం; అదేమిటన్నది ఎవరూ చెప్పలేరు. అయితే, కొంతమంది సంగీతమూ, మాట్లాడుతున్నట్లున్న శబ్దమూ వినగలరు. కానీ, మాధ్యమంగా పనిచేసే ఒక అతీంద్రియశక్తి ద్వారా కాలంలోని ఆ వ్యత్యాసాలు, తొలగింపబడాలి. అప్పుడు శబ్దం మీ చెవులకు చేరి, మీరు దానిని స్పష్టంగా వినగలుగుతారు. అది అలా ఉంటుంది. కొందరు దానిని బుద్ధుని భాష అంటారు గానీ, అది కానే కాదు.

ఇద్దరు మహాజ్ఞానులు కలుసుకున్నప్పుడు, వాళ్ళు ఒక్క చిరునవ్వుతోనే అన్నీ అర్థం చేసుకోగలుగుతారు. దీనికి కారణం శబ్దం లేనిదీ, ఆత్మల స్థాయిలో సంభాషించుకోగలదీ అయినట్టి, టెలిపతి అనబడే ఒక అతీంద్రియ శక్తి, ఆ శబ్దం, వినేవారికి స్టీరియో ధ్వనిలాగా వినిపిస్తుంది. వాళ్ళు చిరునవ్వు నవ్వినప్పుడు వారి ఆలోచనలు పరస్పరం తెలిసిపోతాయి. వారు ఉపయోగించేది ఈ పద్ధతి ఒకటే కాదు, ఎందుకంటే కొన్నిసార్లు మరొక పద్ధతిని ఉపయోగిస్తారు. తాంత్రికవిద్యలో, టిబెట్‌కు చెందిన లామాలు హస్తముద్రలను ఉపయోగించడాన్ని విశేషంగా భావిస్తారని మీకు తెలుసు. కానీ మీరు ఒక లామాని హస్తముద్రలకు అర్థం అడిగితే, అది సర్వోత్కృష్టమైన యోగభాష అని చెప్తాడు. అవి దేనికోసం ప్రత్యేకింపబడ్డాయి? ఆ సంగతి అతడికీ తెలియదు. నిజానికి అవి మహాజ్ఞానులకు చెందిన భాష. ఎక్కువమంది ఉన్నప్పుడు ఒక వ్యక్తి పెద్దవైన హస్తముద్రలను ఉపయోగిస్తాడు; అవి చాలా అందమైనవి, పెద్దవైన రకరకాల హస్తముద్రలతో ఏర్పడినవి. తక్కువమంది ఉన్నప్పుడు, అతడు చిన్నవైన హస్తముద్రలు ఉపయోగిస్తాడు; అవి కూడా చాలా అందమైనవీ చిన్నవీ అయిన రకరకాల ముద్రలతో ఏర్పడినవి. అవి చాలా అభివృద్ధి చెందినవీ, సమృద్ధి అయినవి, ఎందుకంటే అవి ఒక భాషగా ఉన్నట్టివి. పూర్వం ఇది ఒక దివ్యరహస్యం, ఇప్పుడు మేము దానిని బయటపెట్టాము. టిబెట్‌లో ఉపయోగింపబడేవి సాధన కోసం మాత్రమే వాడుకునే కొన్ని కదలికలే, వాటిని ప్రజలు వర్గాలుగా చేసి ఒక పద్ధతి తయారుచేశారు. సాధనలో భాషగా మాత్రమే అవి వాడబడుతున్నాయి, సాధన కోసం కొన్ని రకాలు మాత్రమే ఉన్నాయి. అసలైన హస్తముద్రలు, అతిసంక్లిష్టమైనవి.

# గురువు అభ్యాసకులకు ఏం ప్రసాదించారు?

నన్ను చూసినప్పుడు కొందరు నా చేతిని పట్టుకొని వదలరు. వీళ్ళు నా చేయి పట్టుకొని ఊపడం చూసిన మరికొందరు కూడా నా చేయి పట్టుకొని ఊపుతారు. వాళ్ళ మనసులో ఏముందో, నాకు తెలుసు. కొంతమందికి అలా గురువు చేయి పట్టుకొని ఊపడం చాలా సంతోషంగా ఉంటుంది. కొందరు ఏవో సందేశాలు దొరుకుతాయనుకొని నా చేతిని వదలరు. నిజమైన ఆధ్యాత్మిక సాధన మీ స్వంత పనే అని మేము మీకు చెప్పాము. మేము ఇక్కడ వ్యాధి నిర్మూలనా, దేహపుష్టి కోసమూ, లేదా మీకు సందేశాలు ఇచ్చి మీ వ్యాధులను తొలగింపజేయడం కోసమూ లేము; ఆ విషయాలనూ పట్టించుకోము. మీ వ్యాధులు నేరుగా నేను తొలగిస్తాను. అభ్యాసం జరిగే స్థలాలలో వ్యాయామాలు చేస్తున్న వారి వ్యాధులను నయం చేసేందుకు నా ఫాషెన్ అక్కడ ఉంటుంది. దాఫాను తమంతటతామే చదివేవారి వ్యాధులను కూడా నా ఫాషెన్ తొలగిస్తుంది. నా చేతిని పట్టుకోవడంవల్ల మీ గోంగ్ పెరుగుతుందని మీరు అనుకుంటున్నారా? అది ఒక పరిహాసం కాదా?

గోంగ్ అన్నది ఒక వ్యక్తి తన యొక్క షిన్ షిన్‌ను సాధన చేయడం మీద ఆధారపడి ఉంటుంది. మీరు నిజంగా ఆధ్యాత్మిక సాధనను చేయకపోతే, గోంగ్ పెరగదు; ఎందుకంటే, షిన్ షిన్‌కు ఒక ప్రామాణికత ఉంది. మీ గోంగ్ పెరుగుతున్నప్పుడు, మీ బంధం, ఒక పదార్థం, తొలగించబడినప్పుడు, మీ తల మీదుగా ఒక కొలబద్ద పెరుగుతున్నట్లు, ఉన్నతస్థాయిలోని వారు చూడ గలుగుతారు. పైగా, ఈ కొలబద్ద గోంగ్ స్తంభం రూపంలో ఉంటుంది. మీ గోంగ్ స్తంభం ఎంత ఎత్తుగా ఉంటుందో, ఆ కొలబద్ద అంత ఎత్తుగా ఉంటుంది. మీరు ఎంత గోంగ్‌ను సాధించారో అది తెలియజేస్తుంది. అది మీ షిన్ షిన్ స్థాయి ఎత్తును కూడా తెలియజేస్తుంది. ఇతర వ్యక్తులు మీకు ఎంత గోంగ్ ఇచ్చినా, అది ఉపయోగపడదు. ఒక్క చిన్నముక్క అయినా మీకు కలవదు, ఎందుకంటే, అది అక్కడ నిలవక ఊడి వచ్చేస్తుంది. నేను మిమ్మల్ని ఉన్న పళంగా "మూడు పూలు తలమీద కలిసేచోటు" అన్న స్థితికి చేర్చగలను. మీరు ఒకసారి ద్వారం దాటి బయటకు వెళ్ళగానే, ఆ గోంగ్ తొలిగిపోతుంది, ఎందుకంటే, అది మీది కాదు, మీ సాధననించి వచ్చినది కాదు. మీ షిన్ షిన్

స్థాయి అక్కడ వరకు చేరలేదు కనక, అది అక్కడ నిలవలేదు. మీకు ఎవరు ఎంత జోడించాలనుకున్నా చేయలేరు, ఎందుకంటే అది పూర్తిగా ఒక వ్యక్తి యొక్క సాధననించి, అతడి మనసును సంస్కరణ చేసుకోవడంనించి వస్తుంది. కేవలం, మీరు మీ గోంగ్‌ను దృఢంగా పెంచుకొంటూ, నిరంతరం ఎదుగుతూ, విశ్వలక్షణంతో మమేకమై, పైకి వెళ్ళగలుగుతారు. కొంతమంది నా స్వహస్త సంతకం కావాలని అడుగుతారు, కానీ ఇవ్వడానికి నేను ఇష్టపడను. కొందరు, గురువు చేసిన సంతకం తమ దగ్గర ఉందని గొప్పలు చెప్పుకుంటారు. గొప్పలు చూపాలనో, గురువు సందేశం తమను రక్షించాలనో వారు కోరతారు. అది మరొక బంధం కాదా? మీరు ఆధ్యాత్మిక సాధన మీ స్వంతంగా చేసుకోవాలి. మీరు చెప్పేది ఏ సందేశాల గురించి? ఉన్నతస్థాయి సాధనలో దీనికోసం మీరు అడగవచ్చా? దాని అర్థం ఏమిటి? అది కేవలం వ్యాధి నిర్మూలన, దేహపుష్టి కోసం మాత్రమే.

మీరు పెంచుకున్న గోంగ్ కానీ అందులోని ప్రతి ఒక్క అతిసూక్ష్మమైన రేణువుగానీ, అతిసూక్ష్మ స్థాయిలో అచ్చం మీలాగే ఉన్నట్లు కనిపిస్తుంది. త్రిలోకాతీత ఫాను చేరిన తరవాత మీరు ఒక బుద్ధ–శరీరం యొక్క సాధన చేస్తారు. ఆ గోంగ్ బుద్ధుని ఆకారాన్ని పొందుతుంది. అది తామరపూవు మీద కూచున్నట్లు, ఎంతో అందంగా ఉంటుంది. ప్రతి సూక్ష్మమైన రేణువు కూడా అలాగే ఉంటుంది. అయితే, ఒక జంతువు యొక్క గోంగ్ చిన్న నక్కలలాగానో, పాములలాగానో ఉంటుంది. అతిసూక్ష్మ స్థాయిలో వాటి చిన్న రేణువులు కూడా ఇలాగే ఉంటాయి. అలాగే సందేశాలనేవి కూడా ఉన్నాయి. కొంత మంది టీ కలిపి మీకిచ్చి, తాగమంటారు, ఎందుకంటే అది గోంగ్‌గా భావింప బడుతుంది. ఒక సామాన్య వ్యక్తి , తన నొప్పులను వాయిదా వేయడం ద్వారా, తన వ్యాధిని అణచిపెట్టడం ద్వారా తాత్కాలికంగా తగ్గించుకోవాలనుకుంటాడు. ఎంతైనా ఒక సామాన్య వ్యక్తి సామాన్య వ్యక్తే. అతడు తన శరీరాన్ని ఎలా చెడగొట్టుకుంటాడో అన్నది మాకు అనవసరం. మీరు సాధకులు. అందుకే నేను మీకు ఈ విషయాలు చెప్తున్నాను. ఇకముందు, మీరు ఇటువంటి పనులు చేయకూడదు. "సందేశాలు" అనో అవనో ఇవనో మీరు ఎప్పుడూ కోరుకో కూడదు. ఒక చీ గోంగ్ గురువు "నేను మీకు సందేశాలు ఇస్తాను, దేశంలోని

అన్ని ప్రాంతాలలో మీరు వాటిని అందుకోగలరు," అని చెప్పుకుంటాడు. మీరు ఏం అందుకుంటారు? అటువంటి విషయాలవల్ల పెద్దగా ప్రయోజనం లేదని నేను చెప్తున్నాను. ఒక వేళ అవి మంచివనే అనుకున్నా, అవి కేవలం వ్యాధి నిర్మూలన, దేహపుష్టికోసం మాత్రమే. అయితే సాధకులుగా, మన గోంగ్ మన స్వంత సాధన వల్లనే వస్తుంది. ఇతరులనించి వచ్చే సందేశాలు సామాన్య వ్యక్తులకు వ్యాధి నిర్మూలన చేయడమే తప్ప ఒక వ్యక్తి స్థాయిని పెంచలేవు. ఒక వ్యక్తి ధర్మబద్ధమైన మనసును నిలుపుకోవాలి; ఎవ్వరూ ఇతరుల కోసం ఆధ్యాత్మిక సాధన చేయలేరు. మీరు స్వంతంగా నిజమైన ఆధ్యాత్మిక సాధన చేసినప్పుడు మాత్రమే మీ స్థాయిని పెంచుకోగలుగుతారు.

అటువంటప్పుడు నేను మీకేమిచ్చాను? మన సాధకులలో చాలామంది చీగోంగ్‌ను ఎన్నడూ అభ్యసించలేదనీ, వారి శరీరాలు వ్యాధిగ్రస్తమై ఉన్నాయనీ మీ అందరికీ తెలుసు. చాలామంది ఎన్నో ఏళ్ళుగా చీ గోంగ్‌ను అభ్యసించి నప్పటికీ, ఏమాత్రమూ గోంగ్‌ను పొందకుండా, ఇంకా చీ స్థాయిలోనే వెనుకబడి ఉన్నారు. అయితే కొందరు, తాము ఎలా చేశారో తమకే తెలియని విధంగా కొందరు రోగులకు చికిత్స చేశారు. నేను ప్రేతాత్మలు లేదా జంతువులు ఆవహించడాన్ని గురించి చెప్తున్న సమయంలోనే – అవి ప్రేతాత్మలైనా, జంతువులైనా – నిజమైన దాఫా సాధకుల శరీరాలనించి వాటిని తొలగించి వేశాను, ఇంకా వారి శరీరాల పైన, లోపల ఉన్న అన్నిటినీ తొలగించాను. స్వంతంగా నిజమైన ఆధ్యాత్మిక సాధనను చేసేవారు ఈ దాఫాను చదివి నప్పుడు, నేను వారి శరీరాలను కూడా శుభ్రపరుస్తాను. దీనికితోడు, మీ ఇంటి పరిసరాలు కూడా శుభ్రం కావాలి. వీలైనంత త్వరలో ఇంతవరకూ మీ ఇంట్లో పూజించిన, నక్క లేదా వీజిల్ వంటి జంతువులు చెక్కబడివున్న "ప్రేతాత్మ తాయత్తు" (18) లను పారవేయండి. వాటినన్నిటినీ, ఇక మిగలకుండా, పారవేశాం. మీరు ఆధ్యాత్మిక సాధన చేయాలని కోరుతున్నారు కాబట్టి, మీకు అనుకూలమైన ద్వారాన్ని మేము తెరుస్తాం, మీ కోసం ఇవన్నీ చేస్తాం.

అయినా ఇవన్నీ నిజమైన సాధకుల కొరకే చేస్తాం. అయితే కొందరు, ఆధ్యాత్మిక సాధన చేయాలనుకోరు, ఈ క్షణం వరకు దాన్ని అర్థం చేసుకోనూ లేరు. అందుకు తగినట్లే, మేం కూడా వారి గురించి శ్రద్ధ తీసుకోలేం, నిజమైన

సాధకుల గురించే శ్రద్ధ తీసుకుంటాం. మరొక తరహా వ్యక్తి ఉంటాడు. ఒక వ్యక్తికి అతడిని ప్రేతాత్మ లేదా జంతువు ఆవహించిందని గతంలో చెప్పారు. అతడికి కూడా అలా అనిపించింది. అయితే దానిని తొలగించిన తరవాత కూడా అతడి మనసు, అదే విషయమై కలవరపడుతూ ఉంటుంది. ఆ పరిస్థితి ఇంకా కొనసాగుతున్నట్లే భావిస్తాడు. ఆ ప్రేతాత్మ లేదా జంతువు ఇంకా ఉన్నదనే అనుకుంటాడు, అది అనుమానం అన్న బంధంగా అప్పటికే ఏర్పడింది. కాలం గడిచేకొద్దీ, అతడు మళ్ళీ దాన్ని తన పైకి తెచ్చిపెట్టుకోవచ్చు. ఆ ప్రేతాత్మ లేదా జంతువు ఆవహించడమన్నది ఇక లేనేలేదు కనక, ఆ వ్యక్తి ఈ బంధాన్ని విడిచిపెట్టాలి. ఇంతకుముందు జరిగిన తరగతులలో కొంత మందికి అప్పటికే వాటిని తొలగించడం జరిగింది. నేను అప్పటికే వారి మీద ప్రేతాత్మ లేదా జంతువు ఆవహించడమన్నది తొలగించి వారికోసం అన్నీ చేశాను.

తావో సిద్ధాంతం ప్రకారం క్రింది స్థాయి సాధనలో ఒక పునాది వేసుకోవలసిన అవసరం ఉంది. దివ్యవలయమూ, దాన్ క్షేత్రం (19)తోపాటు మరికొన్ని అంశాలు అభివృద్ధి చేసుకోవలసిన అవసరముంది. ఇక్కడ మేము మీకు ఫాలున్‌ను, చీ జీ (20)లను, అంతేగాక ఆధ్యాత్మిక సాధనకు కావలసిన అన్ని సంవిధానాలు ఇస్తాము – పది వేలకు పైగా ఇస్తాము. మీ శరీరంలో విత్తనాలను నాటిన పద్ధతిలో అవన్నీ మీకు ఇవ్వబడతాయి. మీ వ్యాధులన్నీ తొలగించిన తర్వాత, మీకు చేయవలసినవన్నీ చేసి, ఇవ్వవలసినవన్నీ నేను ఇస్తాను. అప్పుడు మీరు మా సిద్ధాంతంలో చివరి వరకు ఆధ్యాత్మిక సాధనను కొనసాగించగలుగుతారు. లేకపోతే, మీకు ఏమీ ఇవ్వనట్లైతే, కేవలం వ్యాధి నిర్మూలన, దేహపుష్టి కోసం మాత్రమే ఇచ్చినట్లు అవుతుంది. నిష్కర్షగా చెప్పాలంటే, కొంతమంది షిన్ షిన్‌కి ఎటువంటి విలువ ఇవ్వరు, వాళ్ళు కేవలం శారీరక వ్యాయామాలు చేస్తూ మెరుగ్గా ఉంటారు.

మీరు నిజంగా ఆధ్యాత్మిక సాధన చేస్తుంటే, మేము మీపట్ల బాధ్యత వహించాలి. స్వంతంగా నేర్చుకొని సాధన చేసేవారికి కూడా ఇవన్నీ లభిస్తాయి గానీ, వారు నిజమైన సాధకులై ఉండాలి. మేము వీటన్నిటినీ నిజమైన సాధకులకే ఇస్తాం. నేను తప్పనిసరిగా మిమ్మల్ని నిజంగా నా శిష్యులుగా,

ఆదరించాలని చెప్పాను. దానికి తోడుగా, మీరు ఉన్నతస్థాయి ఫాను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, ఆధ్యాత్మిక సాధన ఎలా చేయాలో తెలుసుకోవాలి. ఐదు వర్గాల వ్యాయామాలు మీకు ఒక్కసారిగా నేర్పబడతాయి, మీరు అవన్నీ నేర్చుకుంటారు. రాబోయే కాలంలో, మీరు ఎంతో ఎత్తుకు, మీ ఊహకు కూడా అందనంత ఉన్నతస్థాయిని చేరుకోగలుగుతారు. మీరు ఆధ్యాత్మిక సాధన చేస్తున్నంత కాలమూ, సరైన ఫలస్థితిని సాధించడం మీకు ఒక సమస్య కాదు. ఈ ఫాను నేర్పడంలో, నేను భిన్న స్థాయిలను పొందుపరచాను. అది భవిష్యత్తులో, మీరు చేసే భిన్న స్థాయిల ఆధ్యాత్మిక సాధనలో నిరంతరం ఒక మార్గదర్శి పాత్రను వహిస్తున్నదని మీరు తెలుసుకుంటారు.

ఒక సాధకుడిగా, ఇప్పటినించి మీ జీవనమార్గం మారిపోతుంది. నా ఫాషెన్ దాన్ని మీ కోసం మళ్ళీ ఏర్పరుస్తుంది. అది మళ్ళీ ఎలా ఏర్పరచ బడుతుంది? ఒక వ్యక్తి జీవితంలో ఇంకా ఎన్నేళ్ళు మిగిలి ఉన్నాయి? అతడికి స్వయంగా అది తెలియదు. కొంతమందికి, ఒక సంవత్సరం లేదా ఆరు నెలలలో తీవ్రమైన వ్యాధి రావచ్చు, లేదా వారు చాలా ఏళ్ళు వ్యాధిగ్రస్తులై ఉండవచ్చు. కొందరు, మెదడులోని రక్తనాళంలో రక్తం గడ్డ కట్టడమో, లేదా ఇతర వ్యాధులతో బాధపడుతూ, అసలు కదలలేకపోవచ్చు. మిగిలిన జీవిత మంతా మీరు ఆధ్యాత్మిక సాధన ఎలా చెయ్యగలుగుతారు? మేం మీకోసం ఇటువంటివాటిని సరిచేసి, అవి జరగకుండా నివారించాలి. మేం నిజమైన సాధకుల కోసం మాత్రమే చేస్తామని ముందుగానే మీకు స్పష్టం చేయాలి. ఒక సామాన్య వ్యక్తికి అలక్ష్యంగా అలా చేసేందుకు అనుమతి లేదు. లేకపోతే అది మళ్ళీ ఒక చెడ్డపని చేసినట్లే. సామాన్య వ్యక్తులకు పుట్టుక, వృద్ధాప్యం, వ్యాధి, మరణం వంటి అన్ని విషయాలలో కర్మబంధాలు ఉంటాయి, వాటిని ఇష్టానుసారం భంగం చెయ్యడానికి వీలులేదు.

మేము సాధకులను అతివిలువైన వ్యక్తులుగా పరిగణిస్తాం. అందువల్ల, వీటిని కేవలం సాధకుల కోసం మాత్రమే చేయగలం. మేము ఇవి ఎలా చేస్తాము? ఒక గురువుకు అధికమైన పుణ్యం ఉంటే – అంటే, ఒక గురువుకు గొప్ప గోంగ్ సామర్థ్యం ఉంటే – ఈ గురువు మీ కర్మను తొలగించగలరు. ఒక గురువు శక్తి స్థాయిలు ఉన్నతంగా ఉంటే, ఆయన మీ కర్మలో చాలా

ఎక్కువ భాగాన్ని తొలగించగలరు. ఒక గురువు శక్తి స్థాయి తక్కువగా ఉంటే, మీ కర్మలో కొంచెమే తొలగించగలరు. ఒక ఉదాహరణను చెప్పుకుందాం. మీ భవిష్యత్తులోని రకరకాల కర్మను పోగుచేసి, అందులోనించి కొంత భాగమో, సగభాగమో తొలగిస్తాం. మిగిలిన సగభాగం ఇంకా ఒక పర్వతం కన్నా ఎత్తుగా ఉంది, మీరు దానిని దాటలేరు. ఏం చెయ్యాలి? మీరు తావోను సాధిస్తే, భవిష్యత్తులో ఎందరో లాభపడతారు. ఈ రకంగా ఎందరో మీతో పాలుపంచుకుంటారు. అయితే అది వారికి లెక్కలోకి రాదు. సాధన ద్వారా, మీరు కూడా మీ శరీరంలో అనేక జీవులను అభివృద్ధి చేసుకుంటారు. మీ ప్రధాన ఆత్మకు తోడు, మీ సహాయక ఆత్మ, మీలోని వారందరూ మీతో భాగం పంచుకుంటారు. మీరు కష్టాలను అనుభవించే సమయానికి మీకు ఏమీ మిగిలి ఉండకపోవచ్చు. అంత తక్కువే మిగిలి ఉన్నా, ఇంకా మీరు దాటలేకపోవచ్చు. అప్పుడేం అవుతుంది? మీ ఆధ్యాత్మిక సాధనలోని భిన్నదశలవారీగా అది చిన్న భాగాలుగా విభజింపబడుతుంది. అవి మీ షిన్ షిన్‌ను పెంపొందిస్తూ, మీ కర్మను పరివర్తన చేసి, మీ గోంగ్‌ను పెంచుతాయి.

పైగా, ఒక వ్యక్తి ఆధ్యాత్మిక సాధన చేయాలనుకుంటే, అది తేలికైన విషయం కాదు. ఇది చాలా గంభీరమైన అంశమని నేను చెప్పాను. ఇది సామాన్య వ్యక్తులకు అతీతమూ, సామాన్య వ్యక్తులకు చెందిన ఏ విషయాని కన్నా చాలా కఠినమైనది. ఇది అతీంద్రియమైనది కాదా? అందువల్ల, సామాన్య వ్యక్తులకు చెందిన ఏ అంశానికన్నా ఎంతో ఔన్నత్యమన్నది మీలో ఉండాలి. మానవులుగా, మనలో ప్రాథమిక ఆత్మలు ఉంటాయి, ప్రాథమిక ఆత్మ ఎన్నటికీ నశించదు. అందరూ ఆలోచించండి: ప్రాథమిక ఆత్మకు నాశనము లేదంటే, మీ గతజన్మలోని సాంఘిక పరస్పర చర్యలలో మీ ప్రాథమిక ఆత్మ తప్పు చేసి ఉండదా? అది చాలా సంభవనీయం. మీరు ప్రాణులను చంపడం, ఎవరికైనా ఋణపడి ఉండడం, ఎవరినో బెదిరించడం, ఎవరికైనా హాని చెయ్యడం వంటివి చేసి ఉంటారు. అది నిజమైతే, మీరు ఇక్కడ సాధన చేస్తున్నప్పుడు, వారు అక్కడ్నించి మిమ్మల్ని స్పష్టంగా చూడగలరు. మీరు వ్యాధి చికిత్స, దేహపుష్టి నిలపడం వారు చూస్తున్నా, అవేమీ పట్టించుకోరు. ఎందుకంటే, మీరు అప్పుడు ఒక ఋణాన్ని వాయిదా వేస్తున్నారని వారికి

తెలుసు. దాన్ని మీరు ఇప్పుడు చెల్లించకపోయినా, తరవాత చెల్లిస్తారు, భవిష్యత్తులో, ఇంకా ఎక్కువగా చెల్లిస్తారు. అందువల్ల మీరు ఈ క్షణంలో ఋణం తీర్చకపోయినా, వారు పట్టించుకోరు.

మీరు ఆధ్యాత్మిక సాధన చేస్తాం అన్నప్పుడు వారు మిమ్మల్ని చెయ్యనివ్వరు. "నువ్వు ఆధ్యాత్మిక సాధన చేసి, వెళ్ళిపోవాలనుకుంటున్నావు. నువ్వు గోంగ్‌ను పెంచుకున్నప్పుడు, మేము నిన్ను చేరలేము, తాకలేము" అని వారు మిమ్మల్ని చెయ్యనివ్వరు, ఇంకా మిమ్మల్ని ఆధ్యాత్మిక సాధన చేయకుండా ఆపడానికి, అన్ని విధాలా ప్రయత్నిస్తారు. దానికి తగినట్లుగా, మీకు అంతరాయం కలిగించడానికి అన్ని పద్ధతులు ఉపయోగింపబడతాయి. మిమ్మల్ని నిజంగా చంపేందుకు కూడా వారు వస్తారు. అయితే, ఇక్కడ కూర్చొని ధ్యానం చేస్తుండగా మీ తల నరకబడదు. సామాన్య మానవ సంఘం యొక్క స్థితికి అనుగుణంగా ఉండాలి కాబట్టి, అది అసాధ్యం. బహుశా ఈ తలుపు దాటి బయటకు వెళ్ళిన తరవాత మిమ్మల్ని ఒక కారు ఢీకొట్టవచ్చు, లేదా మీరు ఒక భవనం మీదినించి పడిపోవచ్చు, లేదా ఇతర ప్రమాదాలకు గురికావచ్చు. ఈ విషయాలు జరగొచ్చు, అవి చాలా ప్రమాదకరంగానూ ఉండవచ్చు. అచ్చమైన ఆధ్యాత్మిక సాధన మీరు ఊహించుకున్నంత సులభం కాదు. మీరు ఆధ్యాత్మిక సాధన చెయ్యాలని కోరుకున్నంత మాత్రాన, చెయ్యగలనని మీరు అనుకుంటున్నారా? ఒకసారి నిజంగా, ఆధ్యాత్మిక సాధన చెయ్యాలని కోరుకోగానే, మీ జీవితం సరాసరి ప్రమాదంలో పడుతుంది, ఈ అంశం వెంటనే మిమ్మల్ని కలవరపెడుతుంది. చాలామంది చీ గోంగ్ గురువులు తమ శిష్యులకు ఉన్నత స్థాయిల కోసం బోధించేందుకు సాహసించరు, ఎందుకని? వారు ఆ విషయంలో ఏమాత్రం శ్రద్ధ వహించలేక, మిమ్మల్ని రక్షించలేరు.

గతంలో ఎంతోమంది తావోను బోధించేవారు. వారు కేవలం ఒక్క శిష్యునికే బోధించగలిగేవారు, వారు చేయగలిగినదల్లా, ఆ ఒక్క శిష్యుడినే ఉద్ధరించడం. అయితే, అంత పెద్ద ఎత్తున అలా చేసేందుకు ఒక సగటు వ్యక్తి, ధైర్యం చెయ్యలేడు. కానీ, నేను ఇక్కడ అలా చేయగలనని మీకు చెప్పాను, ఎందుకంటే, నా అద్భుతమైన దైవిక శక్తులు గలిగిన అనేక ఫాషెన్ నాకు

ఉన్నాయి. అవి గొప్ప అతీంద్రియ శక్తులు – ఫా కు చెందిన అత్యద్భుతమైన శక్తులను బయటకు చూపగలవు. దీనికితోడు, ఇవాళ మేము చేసేది పైకి కనబడేంత తేలికైనది కాదు. నేను ప్రజల మధ్యకి వచ్చినప్పుడు అహంకారంతో రాలేదు. ఈ సంఘటనను ఎందరో మహాజ్ఞానులు గమనిస్తున్నారని నేను చెప్పగలను. ధర్మం అంతరించిపోయే కాలంలో ఒక ధర్మబద్ధమైన మార్గాన్ని మేము బోధించడం ఇదే చివరిసారి. అలా చెయ్యడంలో, మేము దానిని గతి తప్పనివ్వము. మీరు నిజంగా ఆధ్యాత్మిక సాధనలో ధర్మబద్ధమైన మార్గాన్ని అనుసరిస్తే, మిమ్మల్ని ఎవ్వరూ కూడా వారి ఇష్టం వచ్చినట్లు ఏదైనా చేసేందుకు సాహసించరు. పైగా మీకు నా ఫాషెన్ ఇచ్చే రక్షణ ఉంది, ఇక మీకు ఎటువంటి ప్రమాదమూ ఉండదు.

ఋణం అనేది ఉంటే, అది తప్పనిసరిగా తీర్చబడాలి. అందువల్ల, ఆధ్యాత్మిక సాధనాక్రమంలో కొన్ని ప్రమాదకరమైన విషయాలు జరగవచ్చు. అయితే, అవి జరిగినప్పుడు మీరు భయపడరు, మీరు నిజంగా ఒక ప్రమాదంలో పడడం అన్నది జరగనివ్వం. నేను మీకు కొన్ని ఉదాహరణలు ఇవ్వగలను. నేను ఒకసారి బీజింగ్‌లో తరగతి నిర్వహిస్తున్న సమయంలో, ఒక సాధకురాలు తన మోటరు సైకిల్‌పై రోడ్డును దాటగానే, వీధి మలుపులో ఒక విలాసవంతమైన కారు వచ్చి, యాభై ఏళ్ళు దాటిన ఆ సాధకురాలిని, ఢీకొట్టి, క్రింద పడేసింది. ఆ కారు ఆమెను ఒక్కఉదుటున ఎదురుగా ఢీకొనడం వల్ల ఆమెకు బలమైన దెబ్బ తగిలింది. ఒక పెద్ద చప్పుడుతో కారు ఆమె తలను కొట్టగా, ఆమె తల సూటిగా కారు పైభాగానికి పోయి తగిలింది. ఆ క్షణంలో ఆ సాధకురాలి పాదాలు బైకు పెడల్‌ల మీదే ఉన్నాయి. ఆమె తలకు దెబ్బ తగిలినా ఆమెకు ఎటువంటి నొప్పి కలగలేదు. నొప్పి కలగకపోవడమే కాకుండా ఆమె తలనించి రక్తం కూడా కారలేదు, వాపు కూడా రాలేదు. కారును నడుపుతున్న వ్యక్తి, చచ్చేంత భయంతో, కారు నుండి బయటకు దూకాడు. ఎంతో హడావిడిగా, ఆమెకు గాయాలు తగిలాయా అన్నది అడిగి, ఆస్పత్రికి వెళదామని సలహా ఇచ్చాడు. తాను క్షేమంగా ఉన్నానని ఆమె బదులిచ్చారు. నిజంగా, ఆ సాధకురాలు చాలా ఉన్నతమైన షిన్ షిన్ స్థాయి కలిగి ఉండి, అతడిని ఎటువంటి ఇబ్బంది పెట్టలేదు. ఆమె అంతా చక్కగా

ఉందని అన్నది కానీ, ఆ ప్రమాదంవల్ల కారుకే పెద్ద సొట్టపడింది.

అటువంటి విషయాలన్నీ, ఒక వ్యక్తి ప్రాణం తియ్యడానికే జరుగుతాయి. కానీ వారికి ఏ ప్రమాదం జరగదు. క్రిందటిసారి జిలిన్ విశ్వవిద్యాలయంలో తరగతి నిర్వహించినప్పుడు, ఒక అభ్యాసకుడు తన సైకిల్‌ను విశ్వవిద్యాలయ ప్రధాన ద్వారం గుండా తోసుకుంటూ వెళ్తున్నాడు. రహదారి మధ్యకు చేరుకున్న వెంటనే, హఠాత్తుగా రెండు కార్ల మధ్య చిక్కుకున్నాడు. అవి దాదాపుగా అతడిని ఢీకొట్టినంత పనయింది, కానీ, అతడు ఏమాత్రమూ భయపడలేదు. సాధారణంగా ఇటువంటి విషయాలలో ఇరుక్కున్నప్పుడు ఏమాత్రమూ భయపడం. అదే క్షణంలో, ఆ కార్లు ఆగిపోయాయి, ఏమీ జరగలేదు.

బీజింగ్‌లో కూడా ఇటువంటి సందర్భం వచ్చింది. చలికాలంలో అక్కడ త్వరగా చీకటి పడుతుంది, ప్రజలు త్వరగా పడుకుంటారు. వీధులన్నీ నిర్మానుష్యంగా, నిశ్శబ్దంగా ఉన్నాయి. ఒక సాధకుడు త్వరత్వరగా తన సైకిల్ మీద ఇంటికి వెళ్తున్నాడు, అతడి ముందు ఒక జీప్ మాత్రం వెళ్తూ ఉండింది. హఠాత్తుగా, జీప్ బ్రేకులు పడి ఆగింది. అది గమనించని అతడు, తల వంచుకొని సైకిలు నడుపుతూనే ఉన్నాడు. కానీ జీప్ ఉన్నట్లుండి వెనుతిరిగి తీవ్రమైన వేగంతో కదిలింది. ఆ రెండు శక్తులు కలిసి ఉంటే, అతడి ప్రాణం పోయేది. సరిగ్గా అవి ఢీకొట్టుకోబోయే ముందు, ఏదో ఒక శక్తి, అతడి సైకిల్‌ని అరమీటర్ వెనకకు లాగింది, ఆ జీప్ ఒక్క ఉదుటున అతడి సైకిల్ చక్రం ముందు ఆగింది. తన వెనక ఎవరో ఉన్నట్లు, బహుశా ఆ జీప్ నడుపుతున్న వ్యక్తి కనుక్కున్నాడు. ఈ సాధకుడు ఆ క్షణంలో ఏమాత్రమూ బెదరలేదు. ఈ పరిస్థితులను ఎదుర్కొన్న వారిలో ఎవరూ కూడా, ఒకవేళ ఆ తర్వాత భయపడతారేమో గానీ, ఆ సమయంలో భయపడలేదు. అతడి మనసులో మొట్టమొదటిగా అనిపించిన విషయం “ఆహా! నన్ను ఎవరు వెనక్కు లాగారు? అతడికి నేను కృతజ్ఞతలు చెప్పుకోవాలి” అని. తన కృతజ్ఞతను తెలుపుకోవడానికి వెనుదిరిగిన అతడికి వీధంతా నిశ్శబ్దంగా, చుట్టుపక్కల ఎవ్వరూ లేకుండా కనిపించింది. అతడికి “నన్ను రక్షించినవారు టీచర్” అని వెంటనే అర్థమైంది.

ఛాంగ్ ఛూన్ (21) అన్నచోట మరొక విషయం జరిగింది. ఒక సాధకుని ఇంటికి దగ్గరలో ఒక భవనం నిర్మాణంలో ఉంది. ప్రస్తుత కాలంలో భవనాలు చాలా ఎత్తుగా కట్టబడుతున్నాయి, దాని పరంజా రెండు అంగుళాల చుట్టుకొలత, నాలుగు మీటర్ల పొడవు కలిగిన ఇనుప స్తంభాలతో తయారు చేయబడుతున్నది. ఈ సాధకుడు ఇంటినించి కొంతదూరం నడిచిన తరవాత, ఆ ఎత్తైన భవనం పైనించి, ఒక ఇనప స్తంభం నేరుగా అతడి తల మీదుగా పడింది. ఆ వీధిలోని వారందరూ నిర్ఘాంతపోయారు. అతడు, "నా తల మీద తట్టినవారెవరు?" అన్నాడు. తన తల మీద ఎవరో తట్టినట్లు అతడికి అనిపించింది. ఆ క్షణంలో తల తిప్పి తన తల మీదుగా తిరుగుతున్న ఒక పెద్ద ఫాలున్‌ను అతడు చూశాడు. ఆ ఇనప స్తంభం అతడి తల మీద పడకుండా తలకు పక్కవాటుగా జారి, నేల లోపలికి దిగిపోయింది. అది ఒకవేళ ఒక మనిషి శరీరంలోనే దిగబడితే – అందరూ ఆలోచించండి – ఆ బరువువల్ల అది పండ్లను గుచ్చే చువ్వలాగా ఆ శరీరాన్ని దూసుకుపోయి ఉండేది. అది చాలా ప్రమాదకరం!

ఇటువంటి ఎన్నో సంఘటనలున్నాయి, ఇన్ని అని లెక్కించలేం. అయినా, ఎటువంటి ప్రమాదమూ జరగలేదు. ప్రతి వారికీ ఇటువంటి విషయాలు ఎదురు కావు, కానీ కొందరికి సంభవిస్తూ ఉంటాయి. మీకు ఇటువంటివి జరిగినా జరగకున్నా, ఎటువంటి ప్రమాదమూ జరగదని నేను నమ్మకంగా చెప్తున్నాను. నేను ఈ హామీ ఇస్తున్నాను. కొందరు సాధకులు షిన్ షిన్ ఆవశ్యకతలను పాటించరు, ఎందుకంటే వారు తమ షిన్ షిన్‌ను సాధన చేయకుండా కేవలం వ్యాయామాలు అభ్యసిస్తూ ఉంటారు. వారిని సాధకులుగా పరిగణించలేం.

గురువు ఏమిచ్చారన్న విషయానికి వస్తే, నేను మీకు ఇచ్చినవి, ఇవి. మిమ్మల్ని మీరు కాపాడుకోగలిగే సామర్థ్యం వచ్చేంతవరకు, నా ఫాషెన్ మిమ్మల్ని కాపాడుతూ ఉంటుంది. ఆ సమయానికి మీరు త్రిలోకాతీత ఫా ఆధ్యాత్మిక సాధనను చేస్తూ ఉంటారు, అప్పటికే తావోను సాధిస్తారు. కానీ మీరు మిమ్మల్ని ఒక నిజమైన సాధకుడిగా భావించుకుంటూ ఉండాలి, అప్పుడే సాధించగలుగుతారు. ఒక వ్యక్తి నా పుస్తకాన్ని చేతిలో పట్టుకొని,

వీధిలో నడుస్తూ "టీచర్ లీ రక్షణ ఉంది, కాబట్టి నన్ను కారు ఢీకొడుతుందన్న భయం లేదు", అని అరిచేవాడు. అది దాఫాను నాశనం చెయ్యడమే. ఇటు వంటి వ్యక్తి రక్షింపబడడు. నిజం చెప్పాలంటే, అసలైన సాధకుడు అటువంటి పని చెయ్యడు.

## శక్తి క్షేత్రం

మనం సాధన చేసే సమయంలో, మన చుట్టూ ఒక క్షేత్రం ఉంటుంది. అది ఏ క్షేత్రం? కొంతమంది దానిని చీ క్షేత్రమని, అయస్కాంత క్షేత్రం, విద్యుత్ క్షేత్రం అంటారు. ఈ క్షేత్రంలోని పదార్థం అత్యంత విలువయినది కాబట్టి, మీరు దానిని ఏ పేరుతో పిలిచినా అది సరైనది కాదు. మన విశ్వంలోని ప్రతి ఒక్క ప్రదేశం ఏ పదార్థంతో తయారై ఉందో, అదంతా చాలావరకు ఈ గోంగ్‌లో కనిపిస్తుంది. దానిని శక్తి క్షేత్రం అనడం చాలా సమంజసంగా ఉంటుంది కనక మనం సాధారణంగా దానిని ఒక శక్తి క్షేత్రంగా పిలుస్తాం.

అయితే ఈ క్షేత్రం ఏం చెయ్యగలదు? ధర్మబద్ధమైన ఈ మార్గంలో సాధన చేస్తున్న మన సాధకులందరిలో ఈ భావన ఉందని మీకందరికీ తెలుసు. అది ఒక ధర్మబద్ధమైన మార్గానికి చెందిన ఆధ్యాత్మిక సాధననించి రావడంవల్ల, అది ఉదారమైనదీ, విశ్వలక్షణమైన సత్యం-దయ-సహనంతో మమేకమైంది. అందువల్ల, ఇక్కడ, ఈ క్షేత్రంలో కూచుని ఉండగా మన సాధకులందరూ దాన్ని అనుభవించగలరు, వారి మనసులు కూడా చెడు తలపులకు దూరంగా ఉంటాయి. దీనికితోడు, ఇక్కడ కూచుని ఉండగా పొగ త్రాగే అలవాటున్నవారికి ఆ ఆలోచన కూడా రాదు. వారు ఎంతో సౌకర్యవంత మైన, నిర్మలమైన, శాంతివంతమైన వాతావరణాన్ని అనుభూతి చెందుతారు. ఒక నీతివంతమైన మార్గానికి చెందిన సాధకుడిలో ఉండే శక్తి ఇది, ఈ క్షేత్రపు పరిధిలో ఇదీ దాని ప్రభావం. ఈ తరగతి తరవాత, మన అభ్యాసకులలో చాలామందికి నిజంగా పెంపొందిన శక్తి – గోంగ్ – ఉంటుంది. నేను మీకు బోధిస్తున్నది ఒక నీతివంతమైన మార్గపు ఆధ్యాత్మిక సాధననించి వచ్చిన విషయం కాబట్టి, మీరు కూడా ఈ షిన్ షిన్ ప్రమాణాలను మీలో నిలుపు కోవాలి. ఆధ్యాత్మిక సాధనలో షిన్ షిన్ ఆవశ్యకతలను అనుసరిస్తూ ఆధ్యాత్మిక

సాధనను కొనసాగిస్తున్న కొద్దీ, మీ శక్తి క్రమంగా అధిక బలోపేతం అవుతూ ఉంటుంది.

మనకు, ఇతరులకూ, అలాగే అన్ని జీవులకు ముక్తి గురించి మేం బోధిస్తాం. ఆ విధంగా, ఒక వ్యక్తిలోని ఫాలున్ లోపలి వైపుకు తిరిగినప్పుడు అతడినీ, బయటి వైపుకు తిరిగినప్పుడు ఇతరులనూ కాపాడగలదు. బయటి వైపుకు తిరిగినప్పుడు శక్తిని బయటికి ప్రసరింపచేసి, ఇతరులకు మేలు చేస్తుంది. ఈ విధంగా, మీ శక్తి ఉన్నంతమేరా ఇతరులకు మేలు కలిగి, ఎంతో సుఖాన్ని అనుభవించగలరు. మీరు వీధిలో నడుస్తూ ఉన్నా, కార్యాలయంలో ఉన్నా, ఇంట్లో ఉన్నా, ఇతరులపై ఈ ప్రభావం చూపించగలరు. మీ క్షేత్రంలో ఉన్న వ్యక్తులకు, అసంకల్పితంగానే, జబ్బులు నయం కావచ్చు, ఎందుకంటే, ఈ క్షేత్రం అన్ని అసాధారణ పరిస్థితులనూ సరి చేయగలదు. ఒక మానవ శరీరం వ్యాధిగ్రస్తం కాకూడదు, అలా అవడం ఒక అసాధారణ పరిస్థితి. ఆ క్షేత్రం ఈ అసాధారణ పరిస్థితిని సరిచెయ్యగలదు. దుష్టబుద్ధి కలిగిన ఒక వ్యక్తి ఏదైనా చెడు గురించి ఆలోచిస్తుంటే, మీ క్షేత్రం యొక్క బలమైన ప్రభావం వలన ఆ వ్యక్తి తన మనసు మార్చుకోవచ్చు, ఆ తప్పును చెయ్యాలని అతడు ఇక ఏ మాత్రమూ అనుకోకపోవచ్చు. ఒక వ్యక్తి ఎవరినో శాపనార్థాలు పెట్టాలనుకోవచ్చు. హఠాత్తుగా, అతడు తన మనసు మార్చుకొని ఆ ఉద్దేశం మానుకోవచ్చు. కేవలం ఒక ధర్మబద్ధమైన మార్గానికి చెందిన ఆధ్యాత్మిక సాధననించి వచ్చిన శక్తి క్షేత్రం మాత్రమే ఇటువంటి ప్రభావాన్ని చూప గలుగుతుంది. అందువల్లనే గతంలో బౌద్ధమతంలో ఒక సామెత ఉండేది: “బుద్ధుని కాంతి ప్రతిచోటా వెలుగుతుంది, అన్ని వైకల్యాలనూ సరిచేస్తుంది”, అని. ఇదే దాని అర్థం.

## ఫాలున్ దాఫా సాధకులు ఈ అభ్యాసాన్ని ఏ విధంగా వ్యాప్తి చెయ్యాలి?

ఒక తరగతి అయిపోయిన తరవాత, అభ్యాసకులు, ఇది ఎంతో బాగుందని భావించి, తమ బంధువులకో, మిత్రులకో అందించాలి అనుకుంటారు. అవును, మీరు దీనిని వ్యాప్తి చేసి, ఎవరికైనా అందించవచ్చు. కానీ, ప్రతి

ఒక్కరికీ మనం చెప్పాల్సిన విషయం ఒకటుంది. మేము ప్రతివారికీ కూడా డబ్బుతో కొలవ లేనివీ, విలువ కట్టలేనట్టి ఎన్నో వస్తువులను ఇచ్చాము. నేను వాటన్నిటినీ ప్రతి వారికీ ఎందుకిస్తాను? అవి మీ ఆధ్యాత్మిక సాధన కోసమే. మీరు ఆధ్యాత్మిక సాధన చేస్తేనే మీకు ఇవి ఇవ్వబడతాయి. ఇంకో రకంగా చెప్పాలంటే, మీరు భవిష్యత్తులో ఈ ఆధ్యాత్మిక సాధనను వ్యాప్తి చేసినప్పుడు, ఈ వస్తువులను మీ కీర్తి లేదా స్వప్రయోజనాలు పొందడానికి ఉపయోగించ లేరు. అందువల్ల, మీరు నాలాగా తరగతులు నిర్వహించి డబ్బు వసూలు చెయ్యకూడదు. పుస్తకాలు, ఇతర వస్తువులు ముద్రించి, అభ్యాసాన్ని నేర్పడానికి తిరగవలసిన అవసరం ఉంది కనుక, ఆ ఖర్చులను మేము సంపాదించు కోవాలి. ఇప్పటికే, దేశమంతటిలో మేము తీసుకునేది అతితక్కువ రుసుము, అయినా ఇవ్వబడే వస్తువులు సంఖ్యలో అత్యధికం. మేం ప్రజలను నిజంగా ఉన్నత స్థాయిలకు తీసుకొస్తున్నాము; ప్రతివారికి స్వయంగా ఈ విషయం తెలుసు. ఒక ఫాలున్ దాఫా సాధకుడిగా, మీరు భవిష్యత్తులో ఈ సాధనను వ్యాప్తి చేసేటప్పుడు మేము రెండు అంశాలు ఆశిస్తాము. మొదటిగా, మీరు రుసుమును వసూలు చెయ్యకూడదు. మీకు మేము ఎన్నో వస్తువులను ఇచ్చాం, కానీ అవి మీరు సంపద కూడబెట్టుకోవడం కోసమో కీర్తిని ఆశించడం కోసమో కాదు. అందుకోసం కాకుండా, మిమ్మల్ని రక్షించేందుకు, మీరు ఆధ్యాత్మిక సాధన అభ్యాసం చేసే వీలు కల్పించేందుకు, అవి ఇవ్వబడ్డాయి. మీరు రుసుమును వసూలు చేస్తే, నా ఫాషెన్ మీకు ఇవ్వబడినవన్నీ తీసేసు కుంటుంది, మీరు ఇకముందు మా ఫాలున్ దాఫాకు చెందిన సాధకుడుగా ఉండరు. మీరు వ్యాప్తి చేసినది, మా ఫాలున్ దాఫా అవదు. మీరు దానిని వ్యాప్తి చేసినప్పుడు, పేరు కోసం, స్వలాభం కోసం ప్రాకులాడకూడదు, స్వచ్ఛందంగా ఇతరులకు సేవ చేయాలి. దేశవ్యాప్తంగా సాధకులు ఈ విధంగా చేస్తున్నారు, వివిధ ప్రాంతాలకు చెందిన సహాయకులు కూడా తమను తాము ఈ పద్ధతికి ఆదర్శంగా తీర్చిదిద్దుకున్నారు. మీరు మా అభ్యాసాన్ని నేర్చుకోవా లనుకుంటే, మీరు నేర్చుకోవాలి అనుకున్నంత కాలమూ రావచ్చు. మేము మీ పట్ల బాధ్యత వహిస్తాం, మీ దగ్గర ఒక పైసా కూడా వసూలు చెయ్యం.

మీనించి ఆశించే రెండవ అంశం ఏమిటంటే, దాఫాకు మీ వ్యక్తిగతమైన

విషయాలను కలపగూడదు. ఇంకొక రకంగా చెప్పాలంటే, మీ దివ్యనేత్రం తెరచుకున్నా, మీరు ఏదైనా చూడగలిగినా లేదా మీరు ఏవైనా అతీంద్రియ శక్తులు పెంపొందించుకున్నా, వాటిని పట్టించుకోకుండా ఉండి, మా ఫాలున్ దాఫాను వివరించడానికి, మీరు చూసిన వాటిని ఉపయోగించడానికి వీలు లేదు. మేము బోధించే ఫా యొక్క అసలైన అర్థం ముందు మీరు మీ స్థాయిలో చూసినది ఒక లెక్కలోకి కూడా రాదు, దానికి దగ్గరగా కూడా ఉండదు. అందువల్ల, భవిష్యత్తులో మీరు ఈ అభ్యాసాన్ని వ్యాప్తి చేసేటప్పుడు ఈ విషయంలో చాలా జాగ్రత్త వహించాలి. అలా చేసినప్పుడే, మన ఫాలున్ దాఫాలోని మౌలికాంశాలు మార్పు చెందకుండా ఉంటాయని నిశ్చయంగా చెప్పగలుగుతాము.

దీనికితోడు, నేను ఈ సాధనను బోధించే పద్ధతిలో బోధించడానికిగానీ, ఇటువంటి విస్తారమైన ఉపన్యాస పద్ధతిలో ఫాను బోధించడానికిగానీ ఎవ్వరికీ అనుమతి లేదు. మీకు ఫాను బోధించేంతటి శక్తి లేదు. ఎందుకంటే, నేను బోధించేది, ఎన్నో గూఢమైన అంతరార్థాలు కలిగి ఉంటుంది, ఉన్నత స్థాయులలోని కొన్ని విషయాలతో కూర్చబడి ఉంటుంది. మీరు వివిధ స్థాయుల లోని ఆధ్యాత్మిక సాధన చేస్తున్నారు. భవిష్యత్తులో, పురోగతి చెందిన తరవాత, మీరు ఈ ఉపన్యాసాన్ని మళ్ళీ విన్నప్పుడు మీ అభివృద్ధి ఇంకా కొనసాగుతూ ఉంటుంది. మీరు నిరంతరం వినడం అన్నది జరుగుతున్నంత కాలమూ, మీరు కొత్త అర్థాలను తెలుసుకుంటూ, కొత్త ఫలితాలను పొందుతూ ఉంటారు. ఈ పుస్తకాన్ని చదవడంవల్ల మరింతగా ఈ ఫలితం పొందుతారు. ఈ నా బోధన, ఉన్నత స్థాయులలోని అతిగంభీరమైన విషయంతో కూర్చబడి బోధింపబడుతూ ఉంది. అందువల్ల మీకు ఈ ఫాను బోధించగల శక్తి ఉండదు. నేను ఉపయోగించే మౌలిక పదాలను మీ మాటలుగా చెప్పడానికి మీకు అనుమతి లేదు, ఆ పని చేస్తే మీరు ఫాను దొంగిలించినట్లే అవుతుంది. నేను ఉపయోగించే మౌలిక పదాలను ఉపయోగిస్తూ, గురువుగారు ఈ విధంగా చెప్పారనిగానీ, పుస్తకంలో ఇలా ఉందనిగానీ కలిపి మీరు చెప్పవచ్చు. ఎందుకని? ఎందుకంటే, మీరు ఈ రకంగా చెప్పినప్పుడు, అది ఫా యొక్క శక్తిని కలిగి ఉంటుంది. మీకు తెలిసిన విషయాలను ఫాలున్ దాఫాగా మీరు

వ్యాప్తి చెయ్యకూడదు. లేకపోతే, మీరు అందించేది ఫాలున్ దాఫా కాదు, మీరు చేస్తున్న పని మా ఫాలున్ దాఫాను అవమానపరచడంతో సమానం అవుతుంది. మీరు మీ భావాలను, మనసును అనుసరించి ఏదైనా చెప్తే, అది ఫా కాదు, ప్రజలను కూడా రక్షించలేదు; దానికి ఎటువంటి ప్రభావమూ ఉండదు. అందువల్ల ఇంకెవ్వరూ ఈ ఫాను బోధించలేరు.

మీరు ఈ సాధనను ఎలా వ్యాప్తి చెయ్యాలంటే ఆడియో, వీడియో టేపులు వ్యాయామం చేసే ప్రదేశాలలోనూ, బోధ చేసే ప్రదేశాలలోనూ ఉపయోగించి, సాధకుల కోసం ఈ సాధనను ప్రసారం చెయ్యాలి, అప్పుడు సహాయకులు వ్యాయామాలను నేర్పవచ్చు. ఒక సమావేశం ఏర్పాటు చేసి, ప్రతిఒక్కరూ మరొకరితో సంభాషించి, మీరు విషయాలను చర్చించుకొని పంచుకోవడమన్నది చెయ్యవచ్చు. మీరు ఇలా చెయ్యాలన్నది మా కోరిక. అదే సమయంలో, ఫాలున్ దాఫాను అందించే సాధకుడిని (ఒక శిష్యుడిని) "బోధకుడు" అనో, "గురువు" అనో పిలవకూడదు, ఎందుకంటే దాఫాలో ఒక్క గురువే ఉన్నారు. సాధన ఎంత ముందుగా ప్రారంభించినప్పటికీ సాధకులు అందరూ శిష్యులే.

మీరు అభ్యాసాన్ని వ్యాప్తి చేసినప్పుడు, కొందరు, "గురువైతే ఫాలున్‌ను అమర్చి, ఒక వ్యక్తి శరీరాన్ని సరిచేయగలరు, కానీ మనం అలా చెయ్యలేము కదా?" అనుకోవచ్చు. సమస్యలేదు. ప్రతి సాధకుని వెనక నా ఫాషెన్ ఉంటుందని, అది కేవలం ఒక్కటే కాదని, నేను ఇదివరకే చెప్పాను. ఆ విధంగా నా ఫాషెన్ ఇటువంటి విషయాలను గురించి శ్రద్ధ తీసుకుంటాయి. మీరు ఒక వ్యక్తికి సాధనను నేర్పుతున్నప్పుడు, అతడికి విధిలిఖితమైన బంధం ఉంటే, అప్పటికప్పుడే అతడు ఫాలున్‌ను పొందుతాడు. అలా లేని పక్షంలో, కొంతకాలం సాధన చేసిన తరవాత, అతడి శరీరం సరిచేయబడిన తరవాత క్రమంగా దాన్ని పొందుతుంది. నా ఫాషెన్ అతడి శరీరం సరిచేసుకోవడానికి అతడికి సహాయం చేస్తుంది. ఇవే కాకుండా, ఒక వ్యక్తి నా పుస్తకం చదివి, వీడియోలు చూసి లేక నా ఉపన్యాసాల రికార్డులు విని ఫాను, సాధనను నేర్చుకుంటే, తనను తాను సాధకునిగా నిజంగా భావించుకుంటే, అతడు కూడా తనకు అర్హత కలిగిన వస్తువులను పొందగలడని నేను చెప్తున్నాను.

సాధకులు రోగులను చూసేందుకు మేము అనుమతించం, ఎందుకంటే, ఫాలున్ దాఫా సాధకులు ఇతర వ్యక్తుల రోగాలకు చికిత్స చేయడం పూర్తిగా నిషిద్ధం. మీరు ఏవైనా బంధాలను పెంచుకొని, మీ శరీరాన్ని మీరే నాశనం చేసుకోవడానికి కాకుండా మీరు ఆధ్యాత్మిక సాధనలో ఎదగడానికై మేం బోధిస్తున్నాం. ఇతర చీ గోంగ్ వ్యాయామ కేంద్రాల కన్నా, మా వ్యాయామ కేంద్రాలు మెరుగైనవి. మీరు అభ్యాసం కోసం మా వ్యాయామ కేంద్రాలకు వెళ్ళినంత కాలమూ, అది, మీ రోగాలను మీరే నయం చేసుకున్నదానికన్నా మేలు. నా ఫాషెన్ వలయాకారంగా కూచుంటాయి; ఆ వ్యాయామ కేంద్రం పైన ఒక కవచమూ, దానికిపైగా ఒక పెద్ద ఫాలున్ ఉంటాయి. ఆ కవచానికి ఒక పెద్ద ఫాషెన్ ఆ కేంద్రానికి కాపలాగా ఉంటుంది. ఈ కేంద్రం ఒక సాధారణమైన కేంద్రం కాదు, సాధారణ చీ గోంగ్ అభ్యాస కేంద్రమూ కాదు: అది ఆధ్యాత్మిక సాధన కోసం ఉన్న కేంద్రం. మన సాధకులలో అతీంద్రియ శక్తులు కలవారెందరో, ఆ ఫాలున్ దాఫా కేంద్రం ఒక ఎర్రని కాంతితో కప్పబడి ఉన్నట్లుగాను, అక్కడ అంతా ఎర్రగా ఉన్నట్లుగాను, చూడగలిగారు.

నా ఫాషెన్ ఒక సాధకునిలో నేరుగా ఫాలున్‌ను అమర్చగలదు, కానీ ఒక వ్యక్తి బంధం కల్పించుకోవడాన్ని మేం ప్రోత్సహించం. మీరు ఒక వ్యక్తికి ఈ వ్యాయామాలు నేర్పినప్పుడు, అతడు, “ఓహ్, నాకు ఇప్పుడు ఫాలున్ ఉన్నది.” అనవచ్చు. మీరు చేయకపోయినా, మీ చేతనే అది అమర్చబడిందని మీరు పొరపాటుగా ఆలోచించవచ్చు. మీరు ఆ బంధాన్ని ఏర్పరచుకోకూడదనే, నేను మీకు ఇలా చెప్తున్నాను. అదంతా నా ఫాషెన్ చేత చేయబడుతున్నది. మా ఫాలున్ దాఫా సాధకులందరూ సాధనను వ్యాప్తి చెయ్యవలసిన పద్ధతి ఇది.

ఫాలున్ దాఫా వ్యాయామాలను మార్చేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే అది దాఫాను, ఈ సిద్ధాంతపు సాధనను నాశనం చేస్తున్నట్లే. కొంతమంది, ఈ వ్యాయామాల నియమాలను చిన్నపిల్లల పద్యాలలాగా మార్చేశారు. అలా చెయ్యడానికి అనుమతి లేదు. ఒక శ్రేష్టమైన సాధన, ఎల్లప్పుడూ, చరిత్ర కందని కాలంనించి అందించబడుతూ ఉంటుంది. అది అనంతమైన కాలం నించి పరిరక్షింపబడి, ఎందరో మహాజ్ఞానులను విజయవంతంగా మలచింది.

దానిని కొద్దిగా అయినా మార్చడానికి, ఎవ్వరూ సాహసించరు. మనం ఉన్న, ఈ ధర్మం అంతరించే కాలంలో మాత్రమే అటువంటి విషయం జరగవచ్చు. చరిత్రలో ఏనాడూ, ఈ విషయాలు జరగలేదు. ఈ అంశంలో ప్రతి ఒక్కరూ చాలా జాగ్రత్తగా ఉండాలి.

* * * *

**అర్థములు:**

1. సమాధి – బౌద్ధమతంలో "ప్రశాంత స్థితిలోని ధ్యానం".
2. బెంటి – ఒక మనిషి భౌతిక శరీరం మరియు ఇతర పరిమాణాలలో అతని శరీరాలు.
3. నిర్వాణ – (సంస్కృత పదం) ఈ భౌతిక శరీరం లేకుండా మానవ లోకాన్ని విడిచి వెళ్ళడం, శాక్యముని బుద్ధ సిద్ధాంతంలో ఆధ్యాత్మిక సాధనను సంపూర్ణం చేసుకొనే పద్ధతి.
4. మహాయాన – "బౌద్ధమతం యొక్క గొప్ప మాధ్యమము".
5. హీనయాన – "బౌద్ధమతం యొక్క చిన్న మాధ్యమము".
6. షీన్ జ్యాంగ్ – వాయువ్య చైనాలోని ఒక రాష్ట్రం.
7. టాంగ్ వంశం – చైనా చరిత్రలో ఒకానొక అతిసంపన్న కాలం. (క్రీ.శ. 618–907.)
8. గ్వాండింగ్ – ఒక మనిషి తల మీద శక్తి కురిపించడం. ఉపదేశ ఆచారం.
9. గ్వాన్ యిన్ తెగ – అవలోకితేశ్వర బోధిసత్త్వ, "కరుణ దేవత" పేరిట ఉన్న తెగ.
10. ఎనిమిది మంది దేవతలు – చైనీయ చరిత్రలోని ప్రసిద్ధ తావోలు.
11. ప్రధాన ఆత్మ – ఒక మనిషి యొక్క ప్రధాన ఆత్మ; ప్రధాన చైతన్యం.
12. సహాయక ఆత్మ – ఒక మనిషి యొక్క సహాయక ఆత్మ(లు); సహాయక చైతన్యం.
13. యిన్ మరియు యాంగ్ – ప్రతిదానిలో విడివిడిగా ఉన్నప్పటికీ పరస్పర ఆధారితంగా ఉండే యిన్, యాంగ్ అన్న వ్యతిరేక శక్తులు ఉంటాయని

తావో సిద్ధాంతం నమ్ముతుంది. ఉదా: స్త్రీ (యీన్)కి ప్రతిగా పురుషుడు (యాంగ్).

14. లేడీ క్వీన్ మదర్ – చైనీయ పురాణాల ప్రకారం త్రిలోకాలలోనూ అత్యున్నత స్థాయి దేవి.
15. గ్రేట్ జెడ్ ఎంపరర్ – చైనీయ పురాణాల ప్రకారం త్రిలోకాలనూ పర్యవేక్షించే దేవత.
16. నీవాన్ – వినాళ గ్రంథికి తావో పదం.
17. ప్రషచన్ – రెండు గంటల సమయాన్ని సూచించే చైనీయ కాలమానం.
18. ఆత్మ తాయత్తు – పూర్వీకులను లేదా ఇతర ఆత్మలను ఇళ్ళల్లో పూజించుకోవడానికి పవిత్రంగా తయారుచేసుకున్న చెక్క తాయత్తు.
19. దాన్ త్యన్ – "దాన్ యొక్క క్షేత్రం"; పొత్తి కడుపు ప్రదేశం.
20. చీ జీ – "శక్తి యాంత్రిక వ్యవస్థలు".
21. ఛాంగ్ చూన్ – జిలిన్ రాష్ట్ర రాజధాని.

* * * *

# నాల్గవ ఉపన్యాసము

## నష్టము మరియు లాభము

సాధకుల సమాజంలో, లాభనష్టాల మధ్యనున్న సంబంధం, తరచుగా చర్చకు వస్తూ ఉంటుంది. సామాన్య వ్యక్తుల మధ్య కూడా అది చర్చింపబడుతూ ఉంటుంది. మన సాధకులు లాభనష్టాల విషయంలో ఎలా వ్యవహరించాలి? అది సామాన్య వ్యక్తులకు భిన్నంగా ఉంటుంది. సామాన్య వ్యక్తులు కోరుకునేది స్వలాభాన్ని, ఇంకా, చక్కని సౌకర్యవంతమైన జీవితం ఎలా గడపాలి అన్న విషయం. మన సాధకులు అలా ఉండరు, పూర్తి వ్యతిరేకంగా ఉంటారు. సామాన్య వ్యక్తులు కోరుకునే వాటి కోసం మనం ప్రయత్నించము. దానికి మారుగా, మనకు దొరికేది సామాన్య వ్యక్తులు – తాము కోరుకున్నప్పటికీ – పొందలేనట్టిది, ఆధ్యాత్మిక సాధన మినహా దొరకనిది.

సాధారణంగా మనం నష్టం అని చెప్పేది, ఒక సంకుచిత పరిమితికి చెందినట్టి నష్టం కాదు. ఒక వ్యక్తి నష్టం గురించి మాట్లాడినప్పుడు అతడు ఎవరికైనా దానమిచ్చిన సొమ్ము గురించో, అవసరంలో ఉన్నవాళ్ళకు చేయూత నివ్వడం గురించి, లేదా వీధిలోని బిచ్చగాడికి తిండి పెట్టడం గురించి ఆలోచిస్తాడు. అవి కూడా ఒక రకంగా ఇవ్వడమూ, పోగొట్టుకోవడమే. అయితే ఇది కేవలం డబ్బు గురించి, లేదా వస్తువుల వంటి ప్రాపంచిక విషయాల గురించి అతిగా బాధపడకపోవడాన్ని తెలియజేస్తుంది. సంపదను త్యాగం చెయ్యడం నిజంగా ఒక విధమైన నష్టమే, అందులోనూ పెద్ద నష్టం కూడా. కానీ, మనం చెప్పుకునే నష్టం, ఈ సంకుచిత పరిమితికి చెందినది కాదు. సాధకులుగా మన సాధనాక్రమంలో, మనం త్యజించవలసినట్టి, గొప్పలు ప్రదర్శించే మనస్తత్వమూ, అసూయ, పోటీపడడమూ, వీరాభిమానమూవంటి, అనేకమైన బంధాలున్నాయి. అనేక రకాల బంధాలను తప్పనిసరిగా వదిలి

పెట్టాలి, ఎందుకంటే మనం చర్చించుకునే నష్టం అన్న పదానికి ఒక విస్తృతమైన అర్థం ఉంది. మొత్తం ఆధ్యాత్మిక సాధనాక్రమంలో, సామాన్య వ్యక్తులలో ఉన్నట్టి అన్ని బంధాలనూ, వివిధ వాంఛలనూ వదులుకోవాలి.

"మనం సామాన్య వ్యక్తుల నడుమ ఆధ్యాత్మిక సాధన చేస్తున్నాం. మనం అన్నీ వదులుకుంటే, సన్యాసులు, సన్యాసినులతో సమానమే కదా? అన్నీ వదులుకోవడం అసాధ్యం అని తోస్తున్నది" అని ఎవరైనా అనుకోవచ్చు. మన సాధనాసిద్ధాంతం ప్రకారం, సామాన్య మానవుల మధ్య ఉంటూ, ఆధ్యాత్మిక సాధన చేసేవారు, సామాన్య వ్యక్తుల సంఘంలో తప్పనిసరిగా దృఢమైన సాధన చేయవలసిన అవసరం ఉంది, వారు సామాన్య వ్యక్తుల మధ్య వీలైనంత ఎక్కువగా ఇమిడిపోవలసిన అవసరమూ ఉంది. నిజానికి, మిమ్మల్ని భౌతికంగా ఏదీ పోగొట్టుకోమని అడగడం లేదు. మీరు ఎంత ఉన్నత పదవిలో ఉన్నారు, ఎంత సంపద కలిగి ఉన్నారు అన్నది ఇక్కడ అప్రస్తుతం. కీలకమైనది మీరు ఆ బంధాన్ని వదులుకోగలరా అన్న విషయం.

మన సాధనాసిద్ధాంతం నేరుగా ఒక వ్యక్తి మనసును లక్ష్యంగా చేసుకుంటుంది. కీలకమైన అంశం ఏమిటంటే, మీరు వ్యక్తిగత లాభం, పరస్పర ఘర్షణలు అనే విషయాలకు ఎక్కువ ప్రాధాన్యతను ఇవ్వక, తేలికగా తీసుకోగలరా అనేది. మఠాలలో లేదా మారుమూల ఉన్న పర్వతాలు, అడవులలో ఉంటూ చేసే ఆధ్యాత్మిక సాధనలు మీకు సామాన్య మానవ సంఘంతో పూర్తిగా సంబంధం తెంచివేసి, తద్వారా మీరు సామాన్య మానవుల బంధాలను వదులుకునేలా ఒత్తిడి తెచ్చి, మీకు ఏ విధమైన ప్రాపంచిక ప్రయోజనాలు లభించకుండా చేసి మీరు ఆ బంధాలను వదిలిపెట్టేట్లు చేస్తాయి. సామాన్య మానవుల నడుమ ఉండే సాధకుడు ఈ మార్గాన్ని అనుసరించడు. ఈ వ్యక్తి ఇటువంటి సామాన్య మానవుల పరిసరాలలో వాటిని తేలికగా తీసుకోవడం అవసరం. నిజానికి ఇది చాలా కష్టమే. మన సాధనాసిద్ధాంతంలో ఇది అత్యంత ప్రధాన అంశం కూడా. అందువల్ల మనం నష్టం అని చెప్పుకుంటున్నది సంకుచితమైన దృక్పథంలోగాక ఆ నష్టం అన్న మాటను విశాలమైన భావనలో అర్థం చేసుకోవాలి. మంచి పనులు చెయ్యడం, డబ్బును, వస్తువులను దానం చెయ్యడం గురించి చెప్పుకుందాం. ఈ రోజుల్లో వీధులలో అడుక్కునే

బిచ్చగాళ్ళలో, దాన్ని ఒక వృత్తిగా చేస్తున్నవారు కొందరున్నారు, మీ దగ్గర ఉన్న డబ్బు కంటే, వారి దగ్గర ఎక్కువ డబ్బు ఉండవచ్చు. మనం అప్రధానమైన చిన్న విషయాలను గురించి గాక, ఒక విశాల పరిధిలో ఉన్న వాటి మీద దృష్టి కేంద్రీకరించాలి. ఆధ్యాత్మిక సాధన, కొత్త ఆలోచనలను స్వీకరించే మనస్తత్వంతో, హుందాతనంతో కూడిన విశాల దృక్పథంతో దృష్టిని కేంద్రీకరించాలి. మన నష్టాల క్రమంలో, నిజానికి మనం చెడ్డ విషయాలను పోగొట్టుకుంటాం.

మానవులు, తాము ఏ విషయానికైనా ప్రయత్నించినప్పుడు, ప్రతిదీ మంచి విషయమేనని తరచుగా నమ్ముతారు. నిజం చెప్పాలంటే, ఒక ఉన్నత స్థాయి దృక్పథంనించి చూసినప్పుడు ఆ ప్రయత్నాలన్నీ సామాన్య మానవులు తమ చిన్నచిన్న స్వార్థ ప్రయోజనాలను సంతృప్తిపరచుకోవడం కోసమే. మీకు ఎంత ఎక్కువ ధనమున్నా ఎంత ఉన్నతమైన పదవి ఉన్నప్పటికీ, అవి కేవలం కొన్ని దశాబ్దాల వరకే పనికొస్తాయని మతం చెప్తుంది. ఏ వ్యక్తి అయినా పుట్టుకతో వాటిని వెంట తెచ్చుకోలేడు, మరణించేటప్పుడు వెంట తీసుకొని పోలేడు. గోంగ్ ఎందువల్ల అంతటి అమూల్యమైనది? ఎందుకంటే అది ఖచ్చితంగా మీ ప్రాథమిక ఆత్మ యొక్క శరీరంపై పెరుగుతుంది, పుట్టుకతోనూ మరణం తర్వాత మీతోనే తీసుకొని వెళ్ళగలిగినది. దానికితోడు, అది ఆధ్యాత్మిక సాధనలో మీ ఫల స్థితిని నేరుగా నిర్ణయిస్తుంది, అందువల్ల దాన్ని సాధించడం చాలా కష్టం. మరొక రకంగా చెప్పాలంటే, మీరు పోగొట్టుకునేది చెడ్డదాన్నే. ఆ విధంగా మీరు మీ స్వస్వరూపానికి తిరిగి చేరుకోగలుగుతారు. కాబట్టి మీకు కలిగే లాభం ఏమిటి? మీ స్థాయిలో పెంపును పొందుతారు; చివరకు, మౌలికమైన అంశాన్ని పరిష్కరించి మీరు సరియైన ఫలమును సాధించి ఆధ్యాత్మిక సాధనను సంపూర్ణం చేసుకుంటారు. సామాన్య మానవులలో ఉండే అన్ని రకాల వాంఛలను ఒక్క ఉదుటున, వెంటనే వదులుకొని నిజమైన సాధకుడి స్థాయిని చేరుకోవడం ఖచ్చితంగా మీకు సులువైన పని కాదు, ఎందుకంటే దాన్ని సాధించడానికి సమయం పడుతుంది. సమయం పడుతుందని నేను చెప్పిన మాట విని, టీచర్ మనల్ని తగినంత సమయం తీసుకోమన్నారని సాకుగా తీసుకొని మీరు మెల్లగా చేస్తారేమో, అది కుదరదు!

మేము మిమ్మల్ని క్రమంగా ఎదగడానికి అనుమతించినా, మీతో మీరు కఠినంగా వ్యవహరించుకోవాలి. మీరు అంతా ఒక్క ఉదుటున ఇవాళే చెయ్యగలిగిన పక్షంలో, ఇవాళే మీరు బుద్ధుడు అయ్యేవారు. అందువల్ల అది నిజంగా జరిగే పని కాదు. మీరు దీనిని క్రమంగా సాధించగలరు.

మనం దేనినైతే పోగొట్టుకుంటామో, అది ఒక చెడ్డ విషయం. అదేమిటి? అది కర్మ, అది వేర్వేరు మానవ బంధాలతో కలిసే ఉంటుంది. ఉదాహరణకు సామాన్య మానవులకు అన్నిరకాల చెడు తలంపులు ఉంటాయి. స్వప్రయోజనం కోసం, వారు అన్ని రకాల చెడ్డ పనులు చేసి, ఈ నల్లని పదార్థం అయిన కర్మను కూడబెట్టుకుంటారు. ఇది నేరుగా మన మనసుతో సంబంధం కలిగి ఉంటుంది. ఈ వ్యతిరేక విషయాన్ని నిర్మూలించుకోవడానికి, మీరు మొదటగా మీ మనసును మార్చుకోవాలి.

## కర్మ యొక్క పరివర్తన

తెల్లని పదార్థానికి, నల్లని పదార్థానికి నడుమ ఒక పరివర్తన ప్రక్రియ ఉంటుంది. మనుషుల మధ్య ఒక ఘర్షణ ఏర్పడిన తరవాత, ఈ పరివర్తన ప్రక్రియ జరుగుతుంది. ఒక వ్యక్తి ఒక మంచి పని చేసినప్పుడు, పుణ్యం అనబడే తెల్లని పదార్థాన్ని సంపాదించుకుంటాడు. అతడు ఒక చెడ్డ పని చేసినప్పుడు కర్మ అనబడే నల్లని పదార్థాన్ని పొందుతాడు. వారసత్వంగా పొందడమనే ప్రక్రియ కూడా ఉంది. "ఒక వ్యక్తి గతంలో చేసిన చెడ్డ పనుల కారణంగా ఇలా జరిగిందా?" అని ఎవరైనా అడగవచ్చు. అది పూర్తిగా అందువల్లనే జరిగి ఉండకపోవచ్చు, ఎందుకంటే ఈ కర్మ కేవలం ఒక జీవితకాలంలో కూడబెట్టుకున్నది కాదు. సాధకుల సమాజం ఒక ప్రాథమిక ఆత్మ నశించదని నమ్ముతుంది. ఒక ప్రాథమికాత్మకు నాశనము లేని పక్షంలో, ఒక వ్యక్తికి, ఈ జన్మకు ముందు బహుశా కొన్ని సాంఘిక పరస్పర చర్యలు ఉండి ఉంటాయి. కాబట్టి అతడు ఎవరికైనా ఏదో ఋణపడి ఉండవచ్చు, ఎవరినైనా బెదిరించి ఉండొచ్చు, లేదా హత్య చేయడం వంటి ఇతర దుష్కర్మలు చేసి ఉండవచ్చు, ఇవన్నీ ఈ కర్మకు కారణం అవుతాయి. ఈ విషయాలన్నీ ఇతర పరిమాణంలో ఒకదానితో ఒకటి కూడుతాయి, ఒక వ్యక్తి వాటిని

తనతో తీసుకొని వెళ్తుంటాడు; తెల్లని పదార్థం విషయంలో కూడా ఇలాగే జరుగుతుంది. కేవలం ఇదొకటే కారణం కాదు, ఇంకొక పరిస్థితి కూడా ఉంది. ఆ కుటుంబంలోని తరతరాలలో ముందర తరంవారు తరువాతి తరాల కోసం కర్మను కూడబెడతారు. గతంలో, పెద్దవారు, "ఒక వ్యక్తి పుణ్యమును సంపాదించాలి. అతడి పూర్వీకులు పుణ్యమును కూడబెట్టారు. ఈ వ్యక్తి పుణ్యమును ఇచ్చేస్తున్నాడు, దుర్వినియోగపరుస్తున్నాడు" అనేవారు. అది చాలా సరియైన మాట. ఈ రోజుల్లో సగటు మనుషులు ఈ మాటను ఏమాత్రమూ చెవిన పెట్టరు. మీరు ఆ యువతకు పుణ్యం పోగొట్టుకోవడం, లేదా పుణ్యం లేకపోవడం గురించి చెప్తే, వారు దానిని ఎంతమాత్రమూ మనసుకు పట్టించుకోరు. నిజానికి అందులోని అర్థం చాలా లోతైనది. అది కేవలం ఆధునిక వ్యక్తుల ఊహ లేదా ఆధ్యాత్మిక ప్రమాణం గానీ కాదు. అది నిజంగా భౌతికమైన రూపం కలిగి ఉంది. మన మానవ దేహాలలో రెండు రకాల పదార్థాలూ ఉన్నాయి.

"ఒక వ్యక్తికి చాలా ఎక్కువ నల్లని పదార్థం ఉన్నప్పుడు, అతడు ఉన్నత స్థాయిలకు సాధన చెయ్యలేడా?" అని ఒకరు అడిగారు. ఎవరైనా అలా అనొచ్చు, ఎందుకంటే, చాలా ఎక్కువ నల్లని పదార్థం కలిగి ఉంటే, జ్ఞానోదయ లక్షణం ప్రభావితం అవుతుంది. ఎందుకంటే అది ఒక వ్యక్తి చుట్టూ ఒక క్షేత్రం ఏర్పరచి, అతడిని సరిగ్గా మధ్యలో ఉంచి కప్పేస్తుంది గనక, విశ్వ లక్షణమైన సత్యం–దయ–సహనంతో ఆ వ్యక్తికి ఉన్న సంబంధాన్ని తెంచి వేస్తుంది. ఆ విధంగా, ఆ వ్యక్తికి జ్ఞానోదయ లక్షణం తరిగిపోవచ్చు. ఆధ్యాత్మిక సాధన గురించి, చీ గోంగ్ గురించి ప్రజలు చెప్పుకుంటున్నప్పుడు, ఈ వ్యక్తి వాటన్నిటినీ మూఢనమ్మకాలుగా పరిగణించి ఎంతమాత్రమూ నమ్మడు. అతడికి అవన్నీ ఎగతాళిగా కనిపిస్తాయి. సాధారణంగా ఇలా జరగవచ్చు కానీ ఎల్లప్పుడూ కాదు. అంటే, ఈ వ్యక్తికి ఆధ్యాత్మిక సాధన చెయ్యడం అతికష్టం, అతడు ఉన్నతస్థాయి గోంగ్‌ను పెంచుకోలేడు అని దీని అర్థమా? అలా ఉండదు. దాఫా అనంతమని, ఆధ్యాత్మిక సాధన అన్నది పూర్తిగా మీ హృదయసంకల్పం మీద ఆధారపడి ఉంటుందని మేము చెప్పాము. గురువు మిమ్మల్ని ద్వారంలోనికి తీసుకువెళ్తారు, ఆధ్యాత్మిక సాధన చెయ్యడం కేవలం

మీ స్వంత నిర్ణయం. అదంతా మీమీద, మీరు ఎలా స్వయంగా ఆధ్యాత్మిక సాధన చేస్తారు అన్న దానిమీద ఆధారపడి ఉంటుంది. మీ ఆధ్యాత్మిక సాధన అంతా, మీరు బాధను తట్టుకోగలరా, త్యాగం చెయ్యగలరా, బాధలు సహించగలరా అన్న విషయాల మీద ఆధారపడి ఉంటుంది. మీరు మీ మనసును నిబద్ధం చేసుకోగలిగితే, ఎటువంటి కష్టాలైనా మిమ్మల్ని ఆపలేవు. ఆపై అది ఒక సమస్యే కాదని నేను చెప్పగలను.

సాధారణంగా, నల్లని పదార్థాన్ని ఎక్కువగా కలిగియున్న వ్యక్తి, తెల్లని పదార్థం ఎక్కువ ఉన్న వ్యక్తి కంటే ఎక్కువ త్యాగం చెయ్యవలసి ఉంటుంది. తెల్లని పదార్థం నేరుగా విశ్వలక్షణం – సత్యం, దయ, సహనంతో మమేకమై ఉన్న కారణంగా, ఘర్షణ జరిగినప్పుడల్లా, ఒక వ్యక్తి తన షిన్ షిన్‌ను పెంపొందించుకుంటే, అతడి గోంగ్ పెరుగుతూ ఉంటుంది. ఇది ఇంత సులభం. ఎక్కువ పుణ్యమును కలిగి ఉన్న వ్యక్తి, మంచి జ్ఞానోదయ లక్షణం కలిగి ఉంటాడు. అతడు శారీరక, మానసిక క్లేశాలను తట్టుకొని, భరించగలిగి ఉంటాడు. అతడు శారీరకంగా ఎక్కువగానూ మానసికంగా తక్కువగానూ కష్టపడినా, అతడి గోంగ్ పెరుగుతూనే ఉంటుంది. నల్లని పదార్థం ఎక్కువగా కలిగి ఉన్న వ్యక్తి విషయంలో ఇలా జరగదు, ఎందుకంటే, అతడు మొదట ఈ ప్రక్రియకు లోను కావలసి ఉంటుంది. అతడు నల్లని పదార్థాన్ని తప్పనిసరిగా తెల్లని పదార్థంగా పరివర్తన చేసుకోవాలి. ఈ ప్రక్రియ చాలా బాధాకరంగా కూడా ఉంటుంది. కాబట్టి జ్ఞానోదయ లక్షణం తక్కువగా కలిగి ఉన్న వ్యక్తి, సాధారణంగా ఎక్కువ కష్టాలను సహించవలసి ఉంటుంది. ఎక్కువ కర్మను కలిగి ఉండి, జ్ఞానోదయ లక్షణం తక్కువగా ఉన్నప్పుడు, ఈ వ్యక్తికి ఆధ్యాత్మిక సాధన చెయ్యడం మరింత కష్టం అవుతుంది.

ఉదాహరణకు ఒక ప్రత్యేకమైన సందర్భాన్ని తీసుకోండి. ఈ వ్యక్తి ఆధ్యాత్మిక సాధన ఏ విధంగా చేస్తాడో, చూద్దాం. కూర్చున్న స్థితిలో ధ్యానం చెయ్యడానికై, చాలాసేపు రెండు కాళ్ళను, ఒక దానిపై ఒకటి వేసుకొని ఉండవలసిన అవసరం ఉంది. ఆ ఆసనంలో, ఆ కాలు నొప్పి పుట్టి, తిమ్మిరెక్కుతుంది. కాలం గడుస్తున్న కొద్దీ, ఆ వ్యక్తికి అసౌకర్యంగానూ, చాలా ఇబ్బందిగానూ అనిపిస్తుంది. శారీరకంగా, మానసికంగా అనుభవిస్తున్న బాధ

శరీరాన్నీ, మనసును కూడా అసౌఖ్యంగా చేస్తుంది. కొంతమంది, కాళ్ళను అలా ఉంచి కూచోవడంలో కలిగే బాధను భరించలేక, కాళ్ళు క్రింద పెట్టేసి, ఆ ప్రయత్నాన్ని మానేయాలనుకుంటారు. కొందరు మరికొంతసేపు కూచున్న తర్వాత బాధను ఏమాత్రమూ భరించలేరు. ఒకసారి కాళ్ళు క్రింద పెడితే అతడి సాధన వృథా అవుతుంది. ఒకసారి కాళ్ళ నొప్పి వచ్చిన తర్వాత, తిరిగి కూర్చునే ముందు, అతడు కొన్ని ప్రారంభ వ్యాయామాలు చేస్తాడు. దానివల్ల ఏ విధమైన ప్రయోజనమూ కలగదని మేము తెలుసుకున్నాము. ఇది ఎందువల్లనంటే, కాళ్ళు నొప్పిగా ఉన్నప్పుడు, ఆ నల్లని పదార్థం కాళ్ళలోకి చేరుతుంది. ఆ నల్లని పదార్థం కర్మ, అది బాధలను సహించడం ద్వారా మాత్రమే తొలగింపబడుతుంది; తర్వాత అది పుణ్యంగా పరివర్తన చెందుతుంది. ఒకసారి నొప్పి తెలిసిందంటే కర్మ తొలగింపబడడం మొదలవుతుంది. ఎక్కువ కర్మ వచ్చినకొద్దీ నొప్పి ఎక్కువ అవుతుంది. కనుక కాళ్ళలోని నొప్పి అన్నది అకారణంగా ప్రారంభం కాదు. సాధారణంగా ధ్యానంలో కూచున్నప్పుడు ఒక వ్యక్తికి, మధ్య మధ్యలో కాళ్ళలో నొప్పి అనిపిస్తూ ఉంటుంది. ఒక్క క్షణం దుర్భరం అనిపించిన తరవాత అది ముగిసిపోయి, కొంత సాంత్వన కలుగుతుంది. మళ్ళీ నొప్పి మొదలవుతుంది. సాధారణంగా ఈ విధంగా జరుగుతుంది.

కర్మ తొలగింపు అన్నది కొద్దికొద్దిగా జరుగుతూ ఉండడం వలన, ఒక భాగం తొలగిన తరవాత, కాళ్ళలో కొంత మెరుగుదల కనిపిస్తుంది. త్వరలోనే ఇంకొక భాగం వచ్చి మళ్ళీ నొప్పి మొదలవుతుంది. నల్లని పదార్థం తొలగింపబడిన తరవాత అది విచ్చిపోదు ఎందుకంటే ఆ పదార్థం నశించదు. తొలగింపబడిన తరవాత అది నేరుగా తెల్లని పదార్థమైన పుణ్యంగా పరివర్తన చెందుతుంది. అది ఈ రకంగా ఎందువలన పరివర్తన చెంద గలదు? ఎందు కంటే, ఈ వ్యక్తి బాధను అనుభవించి త్యాగం చేసి కష్టాలను సహించాడు. పుణ్యం అన్నది కష్టాలను సహించి, భరించడం ద్వారాగానీ, మంచిపనులు చెయ్యడం వలనగానీ పొందవచ్చని మేము చెప్పాము. ఆ విధంగా, ధ్యానంలో కూచున్నప్పుడు ఈ పరిస్థితి ఏర్పడుతుంది. కొందరు కాళ్ళలో నొప్పి మొదలవగానే, కాళ్ళు క్రింద పెట్టి, మళ్ళీ కూచునే ముందు

కొన్ని ప్రారంభ వ్యాయామాలు చేస్తారు. దానివలన ఎటువంటి ప్రయోజనమూ ఉండదు. నిలబడి చేసే వ్యాయామంలో, చక్రం పట్టుకున్న భంగిమవల్ల ఆ వ్యక్తి చేతులు అలసిపోవచ్చు. దానిని భరించలేక అతడు చేతులను క్రిందకు దింపితే, అతడు ఏదీ సాధించలేడు. అది ఏపాటి కష్టం? కేవలం చేతులను ఆ విధంగా పెట్టి ఉంచి ఆధ్యాత్మిక సాధనలో విజయం సాధిస్తే, అది చాలా తేలిక అని నేను అంటాను. కూర్చొని చేసే ధ్యానంలో మనుషులకు ఇలా జరుగుతుంది.

మన సాధనాసిద్ధాంతం ప్రాథమికంగా ఈ రకంగా పనిచెయ్యదు, అయితే, ఇందులోని కొంతభాగం ఈ విషయంలో కొంత భూమికను వహిస్తుంది. చాలా సందర్భాల్లో ఒక వ్యక్తి కర్మను, ఇద్దరు వ్యక్తుల షిన్ షిన్ ఘర్షణల ద్వారా పరివర్తన చేసుకుంటారు, అది అక్కడ ఆ రకంగా బయట పడుతుంది. ఇద్దరు వ్యక్తుల మధ్య తగవు ఏర్పడినప్పుడు, ఒక వ్యక్తి ఆ ఘర్షణలో ఉన్నప్పుడు, శారీరక బాధలకన్నా మానసిక క్లేశం అతడిని అధికంగా బాధిస్తుంది. శారీరక బాధలు మానసిక క్లేశం కన్నా మేలని నేను అంటాను ఎందుకంటే వాటిని పళ్ళబిగువున భరించవచ్చు. ఇద్దరి మధ్యన ఘర్షణ ఏర్పడినప్పుడు మనసును అదుపు చేయడమన్నది అతికష్టం.

ఉదాహరణకు, ఒక వ్యక్తి తన కార్యాలయంలో అడుగుపెడుతూనే, తన గురించి ఇద్దరు వ్యక్తులు చాలా చెడ్డగా మాట్లాడుకోవడం విని కోపోద్రిక్తుడవుతాడు. అయితే, సాధకుడైన ఒక వ్యక్తి, ఒక దెబ్బతిన్నా, అవమానింపబడినా, తిరిగి పోట్లాడకూడదని, తననుతాను ఒక సాధకుడిగా ఉన్నతమైన ప్రమాణంలో నిలుపుకోవాలని, మేము చెప్పి ఉన్నాము. అందువల్ల, అతడు, సాధకులుగా తాము ఇతరులవలెనే ప్రవర్తించక, తమనుతాము మెరుగైన విధంగా నిలుపుకోవాలని టీచర్ చెప్పారు కదా అని ఆలోచిస్తాడు. అతడు ఆ ఇద్దరు వ్యక్తులతో పోట్లాట పెట్టుకోడు. కానీ, సాధారణంగా ఒక సమస్య ఉత్పన్నమైనప్పుడు, అది ఒక వ్యక్తిని మానసికంగా నొప్పించకపోతే అది లెక్కలోనికి రాదు, లేదా దాని వల్ల ఉపయోగం ఉండదు, అది ఆ స్త్రీని లేదా పురుషుడుని మెరుగుపడేలా చెయ్యదు. ఆ ప్రకారం అతడి మనసు ఆ విషయాన్ని దాటలేక, దానివల్ల కలత చెందుతూ ఉంటుంది. అతడి మనసు దానియందు తగుల్కొని ఉండొచ్చు.

వెనకకు తిరిగి వారిద్దరి ముఖాలను చూడాలన్న కోరిక అతడిలో కలుగుతూనే ఉంటుంది. వెనకకు తిరిగి చూసినప్పుడు దుష్టత్వం వ్యక్తం చేస్తున్న ఆ రెండు ముఖాలు ఒక వేడెక్కిన సంభాషణలో నిమగ్నమై ఉన్నట్లు చూస్తాడు. అతడు ఇక దాన్ని ఏమాత్రమూ తట్టుకోలేక, తీవ్రంగా మథనపడతాడు. అతడు సరాసరి వారితో పోట్లాటకు కూడా దిగొచ్చు. ఇద్దరి మధ్య ఘర్షణ రేగినప్పుడు, ఆ వ్యక్తికి మనసును అదుపు చేసుకోవడం అతికష్టం అవుతుంది. కూర్చుని ధ్యానం చేసే సమయంలో అటువంటి పరిస్థితిని చక్కదిద్దుకోవడం సులభం అవుతుందని నేను అంటాను, అయితే అది ఎల్లవేళలా అలా ఉండదు.

ఈ విధంగానే, మీ భవిష్య ఆధ్యాత్మిక సాధన క్రమంలో మీరు అనేక కష్టాలలో చిక్కుకుంటారు. ఇటువంటి కష్టాలు లేనిదే మీరు ఆధ్యాత్మిక సాధన ఎలా చేస్తారు? ప్రతివారు తక్కినవారితో మంచిగా వ్యవహరిస్తూ, వారి స్వప్రయోజనాల కారణంగా కలిగే ఘర్షణలు లేకుండా, లేదా మనుషుల మనసులు కలిగించే అంతరాయాలు లేకుండా మీరు కేవలం అలా కూచుని ఉండడంవల్ల మీ షిన్ షిన్ ఎలా అభివృద్ధి చెందుతుంది? అది అసాధ్యం. ఒక వ్యక్తి తప్పనిసరిగా, అసలైన సాధనతో నిజంగా తననుతాను పదును పెట్టుకొని, తననుతాను ఉన్నతీకరించుకోవాలి. “మనకు ఎందువల్ల ఆధ్యాత్మిక సాధనలో ఎప్పుడూ కష్టాలు ఉంటాయి? ఆ సమస్యలు సామాన్య మానవులు ఎదుర్కొనేవాటికి భిన్నంగా ఉండవు కదా?” అని ఎవరైనా అడగొచ్చు. మీరు సామాన్య మానవుల నడుమ సాధన చేస్తున్న కారణంగా అలా జరుగుతుంది. మీ ముఖం నేలకు తాకేటట్లు, మీరు హఠాత్తుగా తలక్రిందులు అయిపోవడం వల్లనో, లేదా గాలిలోకి ఎగిరిపోయి అక్కడ బాధపడడం – వంటివేమీ జరగవు. ప్రతిదీ నిత్యజీవిత పరిస్థితుల రూపాన్ని సంతరించుకుంటుంది. మిమ్మల్ని ఎవరైనా ఇవాళ నొప్పించడం, ఎవరైనా బాధపెట్టడం, ఎవరైనా మీతో తప్పుగా వ్యవహరించడం లేదా ఎవరైనా ఉన్నట్లుండి మీతో అమర్యాదగా మాట్లాడడం జరగొచ్చు. మీరు ఈ విషయాలలో ఎలా ప్రతిస్పందిస్తారు అన్నదే చూడవలసి ఉంది. మీరు ఈ సమస్యలను ఎందువల్ల ఎదుర్కొంటారు? అవన్నీ మీ యొక్క కర్మవల్ల సంభవించినవే. మేము దాని నించి అసంఖ్యాకమైన అనేక భాగాలను మీకోసం తొలగించాము, మీరు మీ

మనసును పదునుపెట్టుకుంటూ, రకరకాల బంధాలను తొలగించుకుంటూ, మిగిలిన చిన్ని భాగాన్ని, మీ షిన్ షిన్‌ను ఉన్నతీకరించుకోవడం కోసం, భిన్న స్థాయులలో ఎదురయ్యే కష్టాలుగా విభజింపబడాలని, వదిలివేశాము. ఇవన్నీ మీ షిన్ షిన్‌ను మెరుగుపెట్టడానికి మేము ప్రయోగించే, మీ కష్టాలే, మీరు వీటిని అధిగమించగలుగుతారు.

మీరు మీ షిన్ షిన్‌ను ఉన్నతీకరించుకుంటున్నంత కాలమూ, వీటిని అధిగమించగలుగుతారు. మీరు అలా చెయ్యకూడదని స్వయంగా అనుకోనంత వరకు, మీరు అధిగమించాలని అనుకున్న పక్షంలో, దాన్ని సాధించగలరు. అందువల్ల ఇప్పటినించి, మీరు ఒక ఘర్షణను ఎదుర్కొన్నప్పుడు, అది కాకతాళీయంగా జరిగిందని అనుకోకూడదు. ఎందుకంటే, ఒక ఘర్షణ ఏర్పడినప్పుడు అది అసంకల్పితంగా జరుగుతుంది – అయితే అది కాకతాళీయం కాదు, అది మీ షిన్ షిన్‌ను మెరుగుపెట్టడానికే. మిమ్మల్ని మీరు ఒక సాధకుడిగా నిలుపుకున్నంతవరకు, మీరు దాన్ని సక్రమంగా నిర్వహించ గలుగుతారు.

అయితే, మీకు ఒక కష్టం, ఒక ఘర్షణా ఎదురవుతుందని ముందుగానే ఎటువంటి సమాచారమూ రాదు. మీకు ప్రతి విషయమూ ముందే చెప్పేస్తే మీరు ఆధ్యాత్మిక సాధనను ఎలా చెయ్యగలుగుతారు? దానివల్ల ఏ ఉపయోగమూ ఉండదు. సాధారణంగా అవన్నీ, ఒక వ్యక్తి యొక్క షిన్ షిన్‌ను పరీక్షకు పెట్టి, నిజంగా మెరుగుపెట్టడంకోసం, అనూహ్యంగా జరుగుతుంటాయి. అప్పుడు మాత్రమే, ఒక వ్యక్తి తన షిన్ షిన్‌ను నిలుపుకోగలడా అన్న సంగతి తెలుస్తుంది. అందుకే ఒక ఘర్షణ అన్నది ఏర్పడినప్పుడు, అది అకస్మాత్తుగా జరగదు. ఆధ్యాత్మిక సాధన జరిగినంత కాలమూ, కర్మ పరివర్తన జరుగుతున్నప్పుడు ఈ అంశం నడుస్తూనే ఉంటుంది. సామాన్య వ్యక్తులు ఊహిస్తున్నట్లుగాకాక, శారీరక బాధలను భరించడం కన్నా, ఇది చాలా కష్టం. నొప్పి కలుగుతున్నా చేతులు ఎత్తి పెట్టడమూ, నిలబడి, నిలబడి, కాళ్ళు అలసిపోయినప్పటికీ మరికొంతసేపు నిలబడి, కేవలమూ, వ్యాయామాలను మరికొంత ఎక్కువ కాలంపాటు చేసినంత మాత్రాన మీ గోంగ్‌ను ఎలా పెంచుకోగలరు? కొన్ని గంటలపాటు అధికంగా వ్యాయామాలు చేసినంత

మాత్రాన, గోంగ్‌ను ఎలా పెంచగలరు? అది కేవలం ఒక వ్యక్తి యొక్క బెంటిని పరివర్తన చెయ్యడానికి పనికొస్తుందిగానీ, దాన్ని తిరిగి శక్తితో బలోపేతం చెయ్యవలసిన అవసరం ఉంటుంది. ఒక వ్యక్తి యొక్క స్థాయిని పెంచడానికి అది సాయపడదు. కష్టాలను మానసికంగా అధిగమించడమే ఒక వ్యక్తి స్థాయిని పెంచే కీలకాంశం. ఒక వ్యక్తి కేవలం శారీరక కష్టం చేసి అభివృద్ధి చెందగలిగితే, చైనాలో రైతులు అందరికన్నా ఎక్కువగా కష్టపడు తున్నారని నేను అంటాను. అప్పుడు, వారందరూ చీ గోంగ్ గురువులు కావద్దా? మీరు ఎంత శారీరక కష్టం చేస్తున్నా, వారు ప్రతిరోజూ మండు టెండలో, ఎంతో శ్రమకోర్చి రెండు విధాలా పడే కష్టం ముందు, అది లెక్కలోకే రాదు. అది అంత సులభమైన విషయం కాదు. ఆ కారణంగా, ఒక వ్యక్తి నిజంగా తనను తాను అభివృద్ధి చేసుకోవాలి అనుకుంటే, తన మనసును ఉన్నతీకరించుకోవాలి. అప్పుడు మాత్రమే అతడు తననుతాను నిజంగా అభివృద్ధి చేసుకోగలడు.

కర్మ పరివర్తన చేసుకుంటున్న ప్రక్రియలో, మిమ్మల్ని మీరు అదుపులో పెట్టుకోవడం కోసం – విషయాలను గందరగోళపరచుకునే సామాన్య వ్యక్తికి విరుద్ధంగా – మీరు ఎల్లప్పుడూ ఉదార హృదయమునూ, దయాపూర్ణమైన మనసునూ నిలుపుకోవాలి. మీరు హఠాత్తుగా ఒక సమస్యను ఎదుర్కొన్నప్పుడు, దానిని సమర్థతతో సరిదిద్దగలుగుతారు. మీరు ఎల్లప్పుడూ ఔదార్యమూ, దయ నిండిన హృదయాన్ని నిలుపుకుంటే, ఒక సమస్య హఠాత్తుగా ఉత్పన్న మైనప్పుడు దాన్ని ఎదుర్కొనడంలో దెబ్బ తినకుండా ఒక మెత్తని అడ్డును కల్పించుకొని, ఆలోచించుకోగలిగిన సమయం, వెసులుబాటును కలిగి ఉంటారు. ఒకవేళ మీరు ఎప్పుడూ ఇతరులతో పోటీపడుతూ, ముందు, వెనుకల పోరాడుతూ ఉంటే ఒక సమస్య వచ్చినప్పుడల్లా మీరు ఇతరులతో ఒక పోట్లాట మొదలుపెట్టేస్తారని నేను చెప్తున్నాను – ఇది తథ్యం. ఆ రకంగా, మీరు ఒక ఘర్షణను ఎదుర్కొన్నప్పుడు అది మీ నల్లని పదార్థాన్ని తెల్లని పదార్థం పుణ్యంగా పరివర్తన చెయ్యడానికి జరుగుతుందని నేను చెప్తున్నాను.

మన మానవజాతి ఈనాటిదాకా వచ్చిన పరిణామంలో, దాదాపు ప్రతి ఒక్కరూ ఒక కర్మపై మరొక కర్మ కూడి పుట్టారు, ప్రతి ఒక్కరి శరీరంలో చాలా

ఎక్కువ కర్మ ఉంది. కర్మను పరివర్తన చేయడంలో సాధారణంగా ఈ క్రింద చెప్పినటువంటి పరిస్థితి సంభవిస్తుంది: మీ గోంగ్ పెరిగి, షిన్ షిన్ మెరుగు పడుతున్నప్పుడు మీ కర్మ తొలగింపబడి, పరివర్తన చెందుతుంది. ఒక వ్యక్తి ఒక ఘర్షణలో పడినప్పుడు అది ఇద్దరి మధ్య షిన్ షిన్‌కు చెందిన కష్టంగా పరిణమించవచ్చు. మీరు దాన్ని సహించగలిగితే మీ కర్మ తొలగింపబడుతుంది, మీ షిన్ షిన్ మెరుగుపడుతుంది, మీ గోంగ్ కూడా పెరుగుతుంది. ఇవన్నీ కలిసి వస్తాయి. గతంలో జనులు, ముందునించే అధికమైన పుణ్యమునూ మంచి షిన్ షిన్‌నూ కలిగి ఉండేవారు. ఏ చిన్న కష్టం ఓర్చుకున్నా వారు తమ గోంగ్‌ను పెంచుకోగలిగేవారు. ఇవాళ జనులు అలా లేరు. బాధ కలగగానే ఆధ్యాత్మిక సాధనను విరమించాలి అనుకుంటారు. దానికితోడు, తక్కువ జ్ఞానాన్ని పొందు తున్నారు, అది వారికి ఆధ్యాత్మిక సాధన చేయడాన్ని కష్టతరం చేస్తున్నది.

ఆధ్యాత్మిక సాధనలో ప్రత్యేకమైన ఘర్షణలను ఎదుర్కొన్నప్పుడూ, ఇతరులు మీతో చెడ్డగా వ్యవహరించినప్పుడూ, రెండు రకాలైన సన్నివేశాలు ఉండొచ్చు. ఒకటేమిటంటే, గతజన్మలో మీరు ఈ వ్యక్తితో చెడుగా వ్యవహరించి ఉండొచ్చు. మీరు మీ మనసులో అతడి ప్రవర్తనను అనుచితంగా భావిస్తారు, “ఈ వ్యక్తి నాతో ఈ విధంగా ఎలా వ్యవహరించగలడు?” అనుకుంటారు. అయితే, గతంలో మీరు ఈ వ్యక్తితో అలా ఎందుకు వ్యవహరించారు? మీకు నిజంగా అప్పుడు అది తెలియదని, ఈ జన్మకు గత జన్మకు ఎటువంటి సంబంధమూ లేదని మీరు వాదించవచ్చు. అదేమీ పనికిరాదు. మరొక వివాదాంశం ఉంది. ఘర్షణలలో, కర్మ పరివర్తన అన్న అంశం ఉంటుంది. అందువల్ల ప్రత్యేకమైన ఘర్షణలను ఎదుర్కోవడంలో మనం సామాన్య వ్యక్తుల వలె ప్రవర్తించకుండా క్షమాపూర్వకంగా ఉండాలి. ఇది కార్యాలయాలలో, అన్ని ఇతర పని పరిసరాలలో కూడా అమలు చెయ్యాలి. స్వయంఉపాధి కల్పించుకున్నవారికి కూడా ఇది అన్వయిస్తుంది, ఎందుకంటే వారికి కూడా సంఘంలో పరస్పర సంబంధాలు ఉంటాయి. సంఘంతో సంబంధం లేకపోవడం అన్నది అసాధ్యం, ఎందుకంటే కనీసం ఇరుగుపొరుగువారి మధ్య సంబంధం ఉంటుంది.

సాంఘిక సంబంధాలలో ఒక వ్యక్తి అన్ని రకాల ఘర్షణలు ఎదుర్కోవలసి

వస్తుంది. సామాన్య మానవుల నడుమ ఆధ్యాత్మిక సాధన చేసేవారి విషయంలో, మీరు ఏ వ్యాపారం చేస్తున్నారన్న విషయం అంత ముఖ్యం కాదు. మీకు ఎంత ధనముందో, మీ పదవి ఎంత ఉన్నతమైందో, లేదా మీరు ఏ రకమైన స్వంత వ్యాపారం, సంస్థ నడుపుతున్నారన్న వాటి కారణంగా ఎటువంటి వ్యత్యాసం రాదు, ఎందుకంటే మీరు సరియైన రీతిలో వ్యాపారం నడుపుతూ, మనసును ధర్మబద్ధంగా నిలుపుకోవాలి. మానవ సమాజంలో అన్ని వృత్తులూ ఉండాలి. సభ్యత లేకపోవడం అన్నది మానవ హృదయంలో జరుగుతుంది గానీ ఒక వ్యక్తి చేసే ఉద్యోగంలో ఉండదు. "పదిమంది వ్యాపారులలో తొమ్మిది మంది మోసకారులు" అని గతంలో ఒక సామెత ఉండేది. అది సామాన్య మానవులు కల్పించిన సామెత. అది మానవ హృదయానికి సంబంధించిన విషయమని నేను అంటాను. మీ హృదయం ధర్మయుతంగా ఉండి, మీరు సరియైన రీతిలో వ్యాపారం సాగించినంత వరకు, మీరు అధికంగా కష్టపడితే అధిక ధనం సంపాదించడానికి అర్హులవుతారు. అది ఎందుకంటే, సామాన్య మానవుల నడుమ ఎక్కువగా కష్టపడి పని చేసినందుకు బహుమతిని అందుకుంటారు. నష్టపోనిదే లాభం రాదు. మీరు దానికోసం పనిచేశారు. ఒక వ్యక్తి ఎటువంటి సాంఘిక హోదాలో ఉన్నా, మంచి వాడిగా ఉండవచ్చు. భిన్న సాంఘికవర్గాల ప్రజలలో భిన్నమైన ఘర్షణలు ఉన్నాయి. సంఘంలోని ఉన్నతవర్గాలవారికి తమ వర్గపు ఘర్షణ లుంటాయి, అవన్నీ సక్రమంగా పరిష్కరించగలిగినవే. ఏ సాంఘికవర్గంలో ఉన్నా, ఒక వ్యక్తి మంచివాడిగా ఉంటూ, వివిధ వాంఛలనూ, బంధాలనూ ఉపేక్షించగలుగుతాడు. ఒక వ్యక్తి భిన్నమైన అంతస్తులలోనూ, మంచివాడిగా ఉండగలడు, తాను ఉండే సాంఘిక స్థాయిలో ఆధ్యాత్మిక సాధనను కూడా చెయ్యగలుగుతాడు.

ఈ రోజుల్లో, ఈ దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలలోగానీ, ఇతర సంస్థలలోగానీ, పరస్పర మానవ ఘర్షణలు అతివిలక్షణంగా తయారయ్యాయి. ఇతర దేశాలలోనూ, చరిత్ర గమనంలోనూ, ఈ పరిణామం ఎన్నడూ ఏర్పడ లేదు. ఫలితంగా, స్వప్రయోజనాల గురించిన ఘర్షణలు ఎక్కువగా బయట పడుతున్నాయి. అతిచిన్న స్వలాభం కోసమైనా పోటీపడి, ఇతరులను భయ

భ్రాంతులకు గురిచేసే విధంగా వారి మనసులతో ఆడుకుంటున్నారు; వారిలోని ఆలోచనలూ, వారు పన్నే కుయుక్తులూ విషపూరితంగా ఉంటున్నాయి. మంచి మనిషిగా ఉండడమూ కష్టంగా ఉంది. ఉదాహరణకు, మీరు మీ కార్యాలయానికి వెళ్ళినప్పుడు అక్కడ వాతావరణం అనుదినంవలె లేదని గమనిస్తారు. తరవాత ఎవరో వచ్చి ఫలానావారు మీ గురించి దుష్ప్రచారం చేసి పై అధికారికి మీ గురించి చెడుగా చెప్పారని, మీకు చెప్తారు, అప్పుడు మీరొక దుస్థితిలో చిక్కుకుంటారు. ఇతరులంతా మీవైపు ఎన్నడూ లేని విధంగా వింతగా తేరిపార చూస్తుంటారు. ఒక సామాన్య వ్యక్తి దీనినంతా ఎలా సహించగలుగుతాడు? అతడు దానిని ఎలా తట్టుకోగలుగుతాడు? “ఎవరైనా నన్ను ఇబ్బంది పెడితే, నేను కూడా తిప్పికొట్టగలను. అతడికి సమర్ధకులు ఉంటే, నాకూ ఉన్నారు. పోరాడుదాం” అనుకొని మీరు సామాన్య వ్యక్తుల నడుమ, అలాగే వ్యవహరిస్తే, మీరు చాలా బలమైన వ్యక్తి అని వారు అంటారు. అయితే, ఒక సాధకుడిగా మాత్రం, అది ఘోరం. మీరు ఒక సామాన్య వ్యక్తి లాగ పోటీపడి, పోరాడినట్లైతే మీరు కూడా ఒక సామాన్య వ్యక్తియే. మీరు అతడిని అధిగమించిన పక్షంలో, మీరు ఆ సామాన్య వ్యక్తి కంటే అధములు అవుతారు.

ఈ విషయంలో, మనం ఎలా వ్యవహరించాలి? ఇటువంటి ఘర్షణలో చిక్కుకున్నప్పుడు, అన్నిటికన్నా ముందుగా, మనం మన మెదడును ఒక ప్రశాంతమైన స్థితిలో ఉంచుకొని, అతడివలె ప్రవర్తించకుండా అదుపు చేసుకోవాలి. మనం ఒకవేళ ఆ విషయాన్ని దయగా వివరించి, స్పష్టత కలిగిస్తే అది ఒక సమస్యయే కాదు. కానీ మీరు దానిని ఒక బంధంగా చేసుకోకూడదు. మనం ఈ సమస్యలను ఎదుర్కొన్నప్పుడు, ఇతరులవలె పోటీపడడమూ, పోరాడటమూ చెయ్యకూడదు. ఆ వ్యక్తి చేసినట్లే మీరూ చేస్తే, మీరు ఒక సామాన్య వ్యక్తియే కాదా? మీరు పోటీగా పోరాడకపోగా మీ మనసులో కూడా ఆ వ్యక్తిని నిరసించకూడదు. నిజంగా మీరు ఆ వ్యక్తిని ద్వేషించకూడదు. అతడిని ద్వేషిస్తే మీరు కలత పడినట్లే కదా? అప్పుడు మీరు కూడా సహనం పాటించనట్లే అవుతుంది. మనం సత్యం, దయ, సహనములను సాధన చేస్తాం, మీకు దయ లేదని చెప్పవలసి ఉంటుంది. కాబట్టి, అతడు మిమ్మల్ని,

తల ఎత్తుకోలేని విధమైన ఈ ఇబ్బందికరమైన పరిస్థితిలో పెట్టినప్పటికీ, మీరు అతడివలె ఉండకూడదు, నిజంగా అతడివల్ల కలత చెందకూడదు. అతడిపై కోపగించుకునే బదులు, మీరు మనసులో అతడికి కృతజ్ఞతలు, అది కూడా మనస్ఫూర్తిగా, చెప్పుకోవాలి. ఒక సామాన్య వ్యక్తి "అది అహ్ క్యూ (1) లా ఉన్నట్లు కాదా?" అని ఆలోచించొచ్చు. అది అలా కాదని నేను మీకు చెప్తున్నాను.

ప్రతివారూ, ఇది ఆలోచించండి: మీరు సాధకులు. మీరు ఒక ఉన్నత స్థాయికి చెంది ఉండవలసిన ఆవశ్యకత లేదా? సామాన్య వ్యక్తుల నియమాలు మీకు అన్వయించుకోరాదు కదా? ఒక సాధకుడిగా మీకు లభిస్తున్నది ఉన్నత స్థాయి విషయం కదా? అందుకు తగినట్లే, మీరు తప్పనిసరిగా ఉన్నతస్థాయి నియమాలను పాటించాలి. ఆ వ్యక్తి చేసినదే మీరూ చేస్తే, మీరూ అతడి వంటి వారే కదా? అటువంటప్పుడు, మీరు అతడికి కృతజ్ఞతలు ఎందుకు తెలపాలి? ఇది ఆలోచించండి: మీకు ఏం లభిస్తుంది? ఈ విశ్వంలో, "నష్టం పోనిదే, లాభం రాదు" అనే నియమం ఉంది. లాభం కావాలంటే, ఒక వ్యక్తి నష్టం భరించాలి. ఆ వ్యక్తి, సామాన్య మానవుల నడుమ మిమ్మల్ని ఒక ఇబ్బంది కరమైన పరిస్థితిలో పెడతాడు, మీ నష్టంతో, అతడు లాభపడ్డాడు. మిమ్మల్ని ఎంత చెడ్డ పరిస్థితిలో పెట్టి, దాని ప్రభావం ఎంత ఎక్కువ అవుతూ ఉంటుందో, మీరు అంతగా సహిస్తూ ఉంటారు, అతడు అంత ఎక్కువ పుణ్యాన్ని కోల్పోతూ ఉంటాడు. అటువంటి పుణ్యమంతా మీకు ఇవ్వబడుతూ ఉంటుంది. మీరు బాధను సహిస్తూ ఉన్న సమయంలో, దానిని ఏమాత్రమూ లెక్కచెయ్యక, మనసులో ఉపేక్ష వహించవచ్చు.

ఈ విశ్వంలో మరొక నియమం ఉంది: మీరు చాలా ఎక్కువ బాధను సహించినట్లైతే, మీ శరీరంలో ఉన్న కర్మ పరివర్తన చెందుతుంది. మీరు బాధను సహించినందున, ఎంత బాధ సహిస్తే అది అంతటి పుణ్యంగా పరివర్తన చెందుతుంది. ఒక సాధకుడు కోరేది ఈ పుణ్యాన్నే కదా? మీరు రెండు విధాల లాభపడతారు, ఎలాగంటే, మీ కర్మ కూడా తొలగింపబడుతుంది. ఆ వ్యక్తి ఈ పరిస్థితిని మీకు కల్పించి ఉండకపోతే, మీరు మీ షిన్ షిన్‌ను ఎలా పెంచుకోగలిగేవారు? మీరు, నేను ఒకరితో ఒకరు స్నేహపూర్వకంగా ఇక్కడ

కూర్చొని ఉండినట్లైతే, గోంగ్‌ను పెంచుకోవడం ఎలా సాధ్యం? క్లుప్తంగా చెప్పాలంటే, ఆ వ్యక్తి మీకోసం ఈ ఘర్షణను కల్పించడంవల్ల, మీకు షిన్ షిన్‌ను పెంచుకునే అవకాశం వచ్చింది, మీరు దీనిని మీ షిన్ షిన్ పెంచుకోవడానికి ఉపయోగించుకోవచ్చు. ఈ రకంగా మీ షిన్ షిన్ పెరగలేదా? మీరు మూడు విధాల లాభపడ్డారు. మీరు ఒక సాధకుడు. షిన్ షిన్ పెరగడంతో, మీ గోంగ్ కూడా పెరగదా? మీరు ఒక్కదెబ్బతో నాలుగు విధాల లాభపడ్డారు. మీరు ఆ వ్యక్తికి కృతజ్ఞతలు ఎందుకు చెప్పుకోకూడదు? మీరు మీ గుండె లోతులనించి నిష్కపటంగా ఆ వ్యక్తికి కృతజ్ఞతలు చెప్పుకోవాలి – అది నిజం.

ఆ వ్యక్తి ఆలోచన అమర్యాదకరమైనది అన్నమాట నిజమే, లేకపోతే, అతడు మీకు పుణ్యాన్ని ఇచ్చి ఉండేవాడు కాదు. కానీ నిజానికి అతడు మీ షిన్ షిన్‌ను పెంచుకునే అవకాశం కల్పించాడు. మరొక విధంగా చెప్పాలంటే, మనం షిన్ షిన్‌ను సంస్కరించుకోవడంపై తప్పనిసరిగా శ్రద్ధ వహించాలి. షిన్ షిన్ సంస్కరణ జరుగుతున్న సమయంలోనే, కర్మ తొలగింపబడి పుణ్యంగా పరివర్తన చెందుతుంది, అందువల్ల మీరు ఉన్నతస్థాయికి ఎదగ గలుగుతారు; ఇవన్నీ కలిసికట్టుగా జరుగుతాయి. ఉన్నతస్థాయి దృక్పథంలో, ఈ నియమాలన్నీ మారుతాయి. ఒక సామాన్య మానవుడు దీనిని అర్థం చేసుకోడు. ఈ నియమాలను ఉన్నతస్థాయినించి చూసినప్పుడు, అవి భిన్నంగా ఉంటాయి. సామాన్య మానవుల నడుమ ఈ నియమాలు సరియైనవే అనిపించినా, నిజానికి అవి సరైనవి కావు. ఉన్నతస్థాయి నించి చూసినది మాత్రమే సరియైనది. సాధారణంగా ఇలాగే ఉంటుంది.

ఈ నియమాలను నేను అందరికీ క్షుణ్ణంగా వివరించాను. ఈ నియమాలు ఇక్కడ ఇవ్వబడినవి గనక, మీ భవిష్యత్ ఆధ్యాత్మిక సాధనలో ప్రతివారూ తమనుతాము సాధకులుగా పరిగణించుకొని, నిజమైన ఆధ్యాత్మిక సాధన చేస్తారని ఆశిస్తాను. బహుశా కొందరు, సామాన్య మానవుల నడుమ జీవిస్తున్న కారణంగా, ఇప్పటికీ, నిజమైన భౌతిక ప్రయోజనాల దృష్ట్యా సామాన్య మానవులుగా ఉండడమే ఆచరణాత్మకమని భావిస్తారు. అయినా కూడా, సామాన్య మానవ ప్రవాహంలో ఉన్న కారణంగా అప్పటికీ, ఉన్నత

స్థాయిని నిలుపుకోలేకపోతారు. నిజంగా సామాన్య మానవుల నడుమ ఒక మంచి వ్యక్తిగా ఉండడానికి కొందరు కథానాయకులు ఆదర్శంగా ఉంటారు, కానీ వారు కేవలం సామాన్య వ్యక్తులకే ఆదర్శప్రాయులు. మీరు సాధకులు కావాలని కోరుకుంటే, మీ ఆధ్యాత్మిక సాధన, మీ జ్ఞాన సముపార్జన, పూర్తిగా మీ హృదయం మీద, మీ మీద ఆధారపడి ఉంటుంది. ఎందుకంటే, మీకు ఆదర్శ వ్యక్తులు ఎవరూ లేరు. అదృష్టవశాత్తూ, మేము ఈ రోజున ఈ దాఫాని ప్రజలలోకి తెచ్చాం. గతంలో, మీరు ఆధ్యాత్మిక సాధన చేయాలని కోరు కున్నప్పుడు మీకు ఎవరూ బోధించేవారు కాదు. ఈ విధంగా, మీరు దాఫాను పాటించి మీ సాధనను మరింత మెరుగ్గా చెయ్యగలరు. మీరు సాధనను అభ్యసించడమూ, ఫలమును పొందడమూ, మీరు ఏ స్థాయిని చేరుకుంటారు అన్నవి మీ మీద, కేవలం మీ మీదనే ఆధారపడి ఉంది.

అయితే కర్మ పరివర్తన చెందడం అన్నది పూర్తిగా ఇప్పుడే నేను వర్ణించిన విధంగా జరగకపోవచ్చు, అది ఏ విధంగానైనా వ్యక్తం కావచ్చు. ఇది సంఘంలో లేదా ఇంటిలోనైనా జరగవచ్చు. ఒక వ్యక్తి వీధిలో నడుస్తున్నప్పుడు గానీ, ఇతర సాంఘిక వాతావరణంలో గానీ, ఏదో ఒక సమస్యను ఎదుర్కోవచ్చు. సామాన్య మానవుల నడుమ వదులుకోలేనటు వంటి అన్ని బంధాలను మీరు వదిలిపెట్టేట్లు చేస్తుంది. మీరు బంధాలను కలిగి ఉన్నంత వరకూ, భిన్నమైన పరిస్థితులలో, వాటిని తప్పనిసరిగా తొలగించుకోవాలి. మీరు తడబాటుకు గురవుతారు, తద్వారా, తావో జ్ఞానం పొందుతారు. ఒక వ్యక్తి ఆధ్యాత్మిక సాధనలో ఈ విధంగా ముందుకు సాగుతాడు.

మరొక విలక్షణమైన పరిస్థితి ఉంది. ఆధ్యాత్మిక సాధనాక్రమంలో, మీరు చీ గోంగ్ అభ్యసిస్తున్న సమయంలో మీ జీవన సహచరులు తరచుగా చాలా అసంతుష్టికి లోనవుతారని, మీలో అనేకమంది గమనిస్తారు. మీరు వ్యాయామాలు మొదలుపెట్టగానే మీ జీవిత భాగస్వామి మీమీద విరుచుకు పడతారు. మీరు వేరే ఏ పని చేసినా వారు పట్టించుకోరు. మీరు మహ్ జోంగ్ (2) ఆడుతూ చాలా సమయం వృథా చేసినప్పుడు మీ భాగస్వామి బాధపడి ఉండొచ్చు కానీ అది మీరు చీ గోంగ్ అభ్యసించినప్పుడు వారికి కలిగిన

బాధ అంత అధికంగా ఉండదు. మీ చీ గోంగ్ అభ్యాసం మీ భాగస్వామికి అంతరాయం కలిగించదు, పైగా మీరు దేహపుష్టి కోసం వ్యాయామం చేయడం ఎంత మంచి పని, మీరు మీ భాగస్వామికి ఎటువంటి గడబిడ కలిగించడమూ లేదు. అయినా, మీరు చీ గోంగ్ అభ్యాసం మొదలుపెట్టగానే, మీ భాగస్వామి, వస్తువులన్ని చుట్టూ విసిరికొట్టి, ఒక పోట్లాట ప్రారంభిస్తారు. కొందరు దంపతులు చీ గోంగ్ అభ్యాసంవల్ల వచ్చిన గొడవల కారణంగా, దాదాపు విడాకులు తీసుకునేంత దూరం పోతారు. చాలామంది ఈ పరిస్థితి ఎందువల్ల కలుగుతుందో ఆలోచించలేదు. మీరు తరవాత మీ భార్య లేదా భర్తను: "నేను చీ గోంగ్‌ను అభ్యసిస్తే నువ్వు అంతగా ఎందుకు కలత పడతావు?" అని అడిగితే, వారు దానికి వివరణ ఇవ్వలేరు, వారి దగ్గర ఎటువంటి సమాధానాలు ఉండవు. "నిజంగా, నేను ఆ సమయంలో అంతగా ఎందుకు కోపగించు కున్నాను, అంతగా ఎందుకు విసిగిపోయాను?" అనుకుంటారు. నిజానికి విషయం ఏమిటి? ఒక వ్యక్తి చీ గోంగ్‌ను అభ్యసిస్తున్నప్పుడు వారి కర్మ పరివర్తన చెందవలసి ఉంటుంది. మీరు నష్టపడకుండా లాభం పొందలేరు మీరు పోగొట్టుకునేవి చెడ్డ విషయాలు. మీరు తప్పనిసరిగా త్యాగం చెయ్యాలి.

బహుశా, మీరు ఇంటిలో అడుగుపెట్టగానే, మీ భాగస్వామి మీమీద కోపముతో విరుచుకుపడవచ్చు. మీరు దానిని సహిస్తే, ఇవాళ మీరు చేసిన చీ గోంగ్ అభ్యాసం వృథా కాదు. కొంతమందికి చీ గోంగ్ అభ్యాసంలో తాము పుణ్యానికి విలువ ఇవ్వాలని కూడ తెలుసు. అందువల్ల అతడు సామాన్యంగా తన భాగస్వామితో చాలా మంచితనముతో మెలగుతాడు. అతడు, "సాధారణంగా నేను 'ఒకటి' అంటే తను 'రెండు' అంటుంది. ఇవాళ తను నా మీద అధికారం చలాయిస్తున్నది" అనుకొని, తన సహనాన్ని కోల్పోయి, పోట్లాట మొదలు పెడతాడు. దీనితో ఈనాటి సాధన వృథాగా ముగుస్తుంది. కర్మ ఉండడం చేత, అతడు దానిని తొలగించుకోవడానికి ఆమె సాయం చేస్తున్నది. కానీ అతడు దానిని అంగీకరించక, ఆమెతో పోట్లాట మొదలుపెట్టాడు. అందువల్ల కర్మ తొలగింపబడలేదు. ఇటువంటి అనేక సందర్భాలున్నాయి, మన సాధకులెందరో వాటిని అనుభవించారు, కానీ అవి

ఇలా ఎందుకు ఉన్నాయని మాత్రం ఆలోచించుట లేదు. మీరు వేరే ఏ పని చేసి ఉన్నా మీ భాగస్వామి పట్టించుకోకపోయి ఉండొచ్చు. చీ గోంగ్ అభ్యాసం అన్నది నిజానికి ఒక మంచి విషయం, కానీ ఆమె ఎల్లప్పుడూ మీలో తప్పును వెతుకుతుంది. నిజానికి, తనకు తెలియకుండానే, మీ భార్య మీ కర్మను తొలగించుకోవడానికి సహాయం చేస్తున్నది. ఆమె, మీపై లోలోపల మంచి భావము కలిగి ఉన్ననూ, పైకి మాత్రమే మీతో పోట్లాడుతూ ఉన్నట్లు భావించ వద్దు – అది నిజం కాదు. అది ఆమె హృదయపు లోతులనించి వచ్చిన నిజమైన కోపం, ఎందుకంటే కర్మను పొందినవారు అసౌఖ్యమును అనుభవిస్తారు. అది అలా జరగడమన్నది తథ్యం.

## షిన్ షిన్ ఉన్నతీకరణము

గతంలో చాలామంది, మంచి షిన్ షిన్‌ను నిలుపుకోని కారణంగా చాలా సమస్యలు ఏర్పడ్డాయి. వారి అభ్యాసం ఒక నిర్దిష్ట స్థాయికి చేరుకున్న తరవాత, వారు ఇక పురోగతి చెందలేకపోయారు. కొందరికి మొదటినించే చాలా ఉన్నతస్థాయి షిన్ షిన్ ఉంటుంది. సాధనను ప్రారంభిస్తూనే వారి దివ్యనేత్రం తెరుచుకొని, వారు ఒక ప్రత్యేకమైన స్థాయికి చేరుకోగలుగుతారు. ఈ వ్యక్తిలో ఇతరులకన్నా చక్కని జన్మసంస్కారమూ, ఉన్నతస్థాయి షిన్ షిన్ ఉన్నందువల్ల, అతడి గోంగ్ వేగంగా పెరుగుతుంది. ఆ గోంగ్ అతడి షిన్ షిన్ స్థాయికి పెరిగే సమయానికి, ఆ గోంగ్ కూడా అదే స్థాయికి పెరుగుతుంది. అతడు తన గోంగ్‌ను ఇంకా ఎక్కువగా పెంచుకోవాలి అనుకుంటే, ఆ ఘర్షణ కూడా తీవ్రమవుతుంది, ఎందుకంటే అతడు తన షిన్ షిన్‌ను పెంచుకుంటూనే ఉండవలసిన ఆవశ్యకత ఏర్పడుతుంది. ఇది ప్రత్యేకంగా చక్కని జన్మసంస్కారం కలిగిన వ్యక్తి విషయంలో జరుగుతుంది. తన గోంగ్ చక్కగా పెరుగుతున్నదని, సాధన కూడా దానితో సమానంగా సవ్యంగా సాగుతున్నదని అతడు భావించవచ్చు. మరి హఠాత్తుగా అన్ని సమస్యలు ఎందుకు ఏర్పడుతున్నాయి? ప్రతి విషయం అడ్డం తిరుగుతూ ఉంటుంది. జనులు అతనితో మర్యాదగా వ్యవహరించరు, అతడి పై అధికారి కూడా అతడిని మెచ్చడు. ఇంటిలోని పరిస్థితి కూడా చాలా ఆందోళనకరం అవుతుంది. ఉన్నట్లుండి అన్ని సమస్యలు

ఎందుకని? ఈ వ్యక్తి దాన్ని స్వయంగా అర్థం చేసుకోలేకపోవచ్చు. అతడికి చక్కటి జన్మ సంస్కారం ఉండినందున అతడు ఒక నిర్దిష్ట స్థాయికి చేరడం, ఈ పరిస్థితికి దారితీసింది. అయినా, అది ఒక సాధకుడి యొక్క ఆధ్యాత్మిక సాధన పూర్తి అయిందని నిర్ణయించే లక్షణం ఎలా అవుతుంది? అది ఆధ్యాత్మిక సాధన సంపూర్ణం కావడానికి ఎంతో దూరంలో ఉంది! మీరు మిమ్మల్ని ఉన్నతీకరించుకోవడమన్నది కొనసాగిస్తూనే ఉండాలి. మీలో ఉన్న ఆ కొద్దిపాటి జన్మసంస్కారం వల్ల, మీరు ఈ స్థాయిని చేరుకున్నారు. మరింత ఎత్తుకు ఎదగడానికి, ఆ ప్రమాణాన్ని కూడా పెంచవలసి ఉంటుంది.

"నేను నా కుటుంబం చక్కగా స్థిరపడడానికి మరి కొంచెం ధనాన్ని సంపాదిస్తాను దానివల్ల నేను ఇక దేని గురించి ఆందోళన చెందవలసిన అవసరం ఉండదు. ఆ తర్వాత ఆధ్యాత్మిక సాధన చేస్తాను" అని ఎవరైనా అనవచ్చు. ఇది కేవలం మీ ఆశ అని నేను అంటాను. మీరు మీ భార్య, పిల్లలు, కొడుకులు, కూతుళ్ళు, తల్లిదండ్రులూ, అన్నదమ్ములతో సహా, ఇతరుల జీవితాలతో జోక్యం చేసుకోవడమూ లేదా వారి విధి వ్రాతను నియంత్రించడమూ అన్నవి చెయ్యలేరు. ఆ విషయాలను మీరు నిర్ణయించగలరా? పైగా, ఏ విధమైన ఆందోళనలు, సమస్యలు లేకుండా ఆధ్యాత్మిక సాధనను ఎలా చెయ్యగలుగు తారు? మీరు వ్యాయామాలను సౌకర్యంగా, నెమ్మదిగా ఎలా చెయ్యగలరు? అటువంటి విషయం ఎలా జరుగుతుంది? సామాన్య మానవ దృక్పథంతో, ఇదీ మీరు ఆలోచించేది.

ఆధ్యాత్మిక సాధన అన్నది కష్టాల మధ్య కొనసాగాలి, ఎందుకంటే మీరు వివిధ మానవ సహజమైన రాగభావనలను, వాంఛలను ఉపేక్షించి వదలిపెట్ట గలరా అన్నది పరీక్షింపబడాలి. మీరు ఈ విషయాలతో బంధింపబడి ఉంటే, ఆధ్యాత్మిక సాధనలో ఎన్నటికీ సఫలురు కాలేరు. ప్రతి విషయమూ కర్మ బంధంతో ముడిపడి ఉంది. మానవులు మానవులుగా ఎందుకుంటారు? ఎందుకంటే, మానవులకు మానవ సహజమైన సున్నిత భావనలు ఉంటాయి. వారు కేవలం దీనికోసమే జీవిస్తారు. కుటుంబ సభ్యుల మధ్య ఆప్యాయత, స్త్రీపురుషుల మధ్య అనురాగము, తల్లిదండ్రులపట్ల ప్రేమ, అనుభూతులు, స్నేహమూ, స్నేహం కోసం పనులు చెయ్యడం వంటి అన్ని ఇతర విషయాలు

ఈ మానవ సహజ భావనలకు ముడిపడి ఉంటాయి. ఒక వ్యక్తి ఏదైనా చెయ్యడానికి ఇష్టపడడమూ, లేక ఇష్టపడకపోవడమూ, సంతోషంగానో లేక అసంతుష్టిగానో ఉండడమూ, దేనినైనా ప్రేమించడమూ లేదా ద్వేషించడమూ, మొత్తం మానవ సంఘంలోని మిగిలిన ప్రతి ఒక్క విషయమూ ఈ సున్నిత భావజాలంనించే వస్తాయి. ఈ సున్నిత భావనలను వదలిపెట్టకపోతే, మీరు ఆధ్యాత్మిక సాధనను చెయ్యలేరు. మీరు ఈ సున్నిత భావనల నుండి విముక్తులైతే మిమ్మల్ని ఎవరూ ప్రభావితం చెయ్యలేరు. అప్పుడు మీ మనసు ఒక సామాన్య వ్యక్తి మనసువలె మిమ్మల్ని కదిలించలేదు. ఆ స్థానంలోకి అంతకంటే ఉదారమైన ఉపకార గుణం వస్తుంది. అయితే, ఈ సున్నిత భావనలను ఒక్కసారిగా తెంచుకోవడం అన్నది అంత సులభం కాదు. ఆధ్యాత్మిక సాధన అన్నది ఒక  సుదీర్ఘ ప్రక్రియ, ఒక వ్యక్తి క్రమంగా తన బంధాలన్నిటినీ వదులుకునే ప్రక్రియ. అయితే, మీతో మీరు ఖచ్చితంగా వ్యవహరించాలి.

సాధకులుగా మీరు హఠాత్తుగా ఘర్షణలను ఎదుర్కోవలసి వస్తూ ఉంటుంది. మీరేం చెయ్యాలి? మీరు ఎల్లప్పుడు సానుభూతి, దయ నిండిన హృదయాన్ని నిలుపుకోవాలి. అప్పుడు ఒక సమస్యలో చిక్కుకున్నప్పుడు అది మీకు ఆ సమస్యను ఎదుర్కోవడంలో దెబ్బ తగలకుండా ఒక మెత్తని అడ్డు లాగ ఏర్పడి, వెసులుబాటును కల్పించడంవల్ల మీరు సరిగ్గా వ్యవహరించ గలుగుతారు. మీరు ఎప్పుడూ ఇతరులతో ఉపకారబుద్ధితోనూ, దయతోనూ ప్రవర్తిస్తూ, ఏ పని చేసినా ఇతరుల గురించి ఆలోచించాలి. మీరు ఎప్పుడు ఒక సమస్యను ఎదుర్కొన్నా, ఇతరులు ఈ విషయాన్ని భరించగలరా లేదా దానివల్ల ఎవరికైనా బాధ కలుగుతుందా అని ఆలోచించాలి. అలా చెయ్యడం వల్ల, ఎటువంటి సమస్యలూ ఉండవు. అందువల్ల, ఆధ్యాత్మిక సాధనలో మీ అంతట మీరే ఉన్నతోన్నతమైన ప్రమాణాన్ని పాటించాలి.

ఈ విషయాలను గురించి తరచుగా కొంతమంది ఆలోచించరు. ఒక వ్యక్తి యొక్క దివ్యనేత్రం తెరుచుకొని ఒక బుద్ధుని చూసినప్పుడు, అతడు ఇంటికి వెళ్ళి, మనసులో “మీరు నాకెందుకు సాయం చెయ్యరు? దయచేసి ఈ సమస్యను తీర్చండి” అని ప్రార్థిస్తూ, బుద్ధునికి పూజ చేస్తాడు. ఆ బుద్ధుడు

ఈ వ్యక్తి కోసం ఏమీ చెయ్యడు, ఎందుకంటే ఆ కష్టం ద్వారా అతడి షిన్ షిన్‌ను పెంచి, ఉన్నతీకరించే ఉద్దేశంతో బుద్ధుడే ఆ సమస్యను ఏర్పాటు చేశాడు. మీ కోసం బుద్ధుడు ఆ సమస్యను ఎలా పట్టించుకుంటాడు? ఆయన మీ సమస్యను తీర్చనే తీర్చడు. ఆయన మీ సమస్యను తీర్చినట్లయితే మీరు మీ గోంగ్‌ను పెంచుకోవడమూ, మీ షిన్ షిన్ స్థాయినీ ఎలా పెంచుకో గలుగుతారు? ఇక్కడ మీ గోంగ్‌ను పెంచుకోవడం అన్నది కీలకమైన విషయం. మహాజ్ఞానుల దృష్టిలో మానవునిగా బ్రతకడమే లక్ష్యం కాదు, ఒక వ్యక్తి జీవితం మానవునిగా బ్రతక డానికి ఉద్దేశింపబడలేదు – అది మీరు మీ స్వస్వరూపానికి తిరిగి చేరుకోవడం కోసం ఉద్దేశింపబడినది. మానవులు ఎన్నో బాధలు అనుభవిస్తారు. ఒక వ్యక్తి ఎంతగా బాధలు సహిస్తే అంత మంచిదని జ్ఞానులు తలుస్తారు, ఎందుకంటే అతడు తన ఋణాలను వేగంగా తీర్చి వేయాలి. వారి ఆలోచనాధోరణి ఇది. కొంతమంది దీనిని అర్థం చేసుకోకుండా, తమ ప్రార్థన ఫలించకపోతే “మీరు నాకెందుకు సాయం చెయ్యరు? నేను ప్రతిరోజూ ధూపం వేసి మీకు మోకరిస్తాను” అని బుద్ధునికి మొరపెట్టు కుంటారు. ఈ కారణంగా ఒక వ్యక్తి ఆ బుద్ధుని విగ్రహాన్ని నేలకు విసిరికొట్టి, అప్పటినించి బుద్ధుని నిరసిస్తూ ఉంటాడు. ఆ నిరసన కారణంగా, అతడి షిన్ షిన్ తగ్గిపోతుంది, అతడి గోంగ్ మాయం అవుతుంది. అతడికి అంతా పోయిందని తెలిసి, బుద్ధుడే తనను నాశనం చేస్తున్నాడనుకొని బుద్ధుని మరింతగా వ్యతిరేకిస్తాడు. ఆ వ్యక్తి బుద్ధుని షిన్ షిన్‌ను ఒక సామాన్య వ్యక్తి యొక్క ప్రమాణంతో కొలుస్తాడు. ఆ పోలిక ఎలా కుదురుతుంది? ఆ వ్యక్తి ఉన్నతస్థాయి విషయాలను సామాన్య వ్యక్తుల ప్రమాణంతో ఎలా కొలుస్తాడు? ఆ విధంగా, జనులు తమకు బాధలు అన్యాయంగా ఇవ్వబడ్డాయని అనుకున్నప్పుడు ఇటువంటి అనేక విషయాలు జరుగుతాయి. చాలామంది ఈ విధంగా పతనమవుతారు.

గడచిన కొన్ని సంవత్సరాలలో, ప్రఖ్యాతి వహించినవారితో సహా, అనేక మంది చీ గోంగ్ పరమ గురువులు పతనం చెంది కనుమరుగైపోయారు. అయితే అప్పటికే అసలైన చీ గోంగ్ గురువులు చరిత్రలో తమ నియమిత ప్రణాళికలను జయప్రదంగా నెరవేర్చుకొని వెళ్ళిపోయారు. వారిలో కొందరు

మిగిలిపోయి, సామాన్య వ్యక్తుల నడుమ మాయలో చిక్కుకున్నారు, వారు క్షీణించిపోయిన షిన్ షిన్ స్థాయితో, ఇంకా పని చేస్తున్నారు. ఈ వ్యక్తులు తమ గోంగ్‌ను ఎప్పుడో పోగొట్టుకున్నారు. గతంలో ప్రఖ్యాతి వహించిన చాలా కొద్దిమంది చీ గోంగ్ గురువులు సంఘంలో ఇంకా చురుకుగా ఉన్నారు. ఎప్పుడైతే వారు కీర్తి, స్వార్థంపట్ల తీరని కోరిక నుండి విముక్తులు కాలేక, సామాన్య మానవుల నడుమ మాయలో చిక్కి, నిష్ప్రయోజకులు అయ్యారని గమనించారో, ఆ గురువులు వీరి యొక్క సహాయక ఆత్మలను తీసేసుకున్నారు. ఆ గోంగ్ అంతా సహాయక ఆత్మ శరీరంలో అభివృద్ధి చెందింది. ఇటువంటి విలక్షణమైన ఉదాహరణలు చాలా ఉన్నాయి.

మా సాధనా సిద్ధాంతంలో ఇటువంటి సందర్భాలు అరుదు. ఒకవేళ కొన్ని ఉన్నా అవి అంతగా చెప్పుకోదగినవి కావు. షిన్ షిన్‌ను అభివృద్ధి చేసుకున్న విషయంలో అద్వితీయమైన ఉదాహరణలు ఉన్నాయి. ఒక సాధకుడు షాన్ డోంగ్ రాష్ట్రంలోని ఒకానొక నగరంలో జౌళి కర్మాగారంలో పని చేస్తున్నాడు. ఫాలున్ దాఫా అధ్యయనం చేసిన తరవాత అతడు తన సహకార్మికులకు సాధనను నేర్పాడు. ఫలితంగా ఆ కర్మాగారం కొత్త రూపును దిద్దుకుంది. అతడు కర్మాగారంనించి తువాళ్ళను ఇంటికి తీసుకువెళ్తుండేవాడు, అలాగే తక్కిన ఉద్యోగులు కూడా తీసుకొని వెళ్తుండేవారు. దాఫా సాధనను చేసిన తరవాత అతడు వాటిని ఇంటికి తీసుకువెళ్ళే బదులుగా, అంతకు ముందు ఇంటికి తీసుకువెళ్ళిన వాటిని కూడా వెనకకు తెచ్చేశాడు. అతడు చేసిన పని చూసిన తరవాత, ఇంకెవ్వరూ ఇంటికి వస్తువులను తీసుకువెళ్ళేవారే కాదు. మరికొందరు ఉద్యోగులు కూడా తాము అంతకు ముందు తీసుకొని వెళ్ళినవి తిరిగి ఇచ్చేశారు. ఈ పరిస్థితి కర్మాగారం అంతటా చోటుచేసుకుంది.

దాఫాను బోధించే ఒక కేంద్రంలోని ఒక స్వచ్ఛంద నిర్దేశకుడు ఆ కర్మాగారంలోని సాధకులు అభ్యాసాన్ని ఎలా పాటిస్తున్నారో చూడడానికి వెళ్ళాడు. కర్మాగారపు నిర్వహణాధికారి అతడిని కలుసుకోవడానికి స్వయంగా బయటకు వచ్చి: “ఫాలున్ దాఫాను అభ్యసిస్తున్నప్పటినించి ఈ కార్మికులు సమయానికి ముందుగానే పనిలోకి వచ్చి, ఆలస్యంగా ఇళ్ళకు వెళ్తున్నారు.

వారు అతిశ్రద్ధగా పనిచేస్తూ, పైఅధికారి ఇచ్చిన ఏ పనినైనా చేసేస్తున్నారు. వాళ్ళు స్వప్రయోజనాల కోసం ఏమాత్రమూ పోటీపడడం లేదు. అందువల్ల వారు మా కర్మాగారానికి కొత్త రూపును ఇచ్చారు, కర్మాగారపు ఆర్థిక లాభాలు కూడా పెరిగాయి. మీ సాధన చాలా శక్తివంతమైనది. మీ గురువుగారు ఎప్పుడొస్తున్నారు? నాకు కూడా వారి ఉపన్యాసాలు వినాలని ఉంది" అన్నారు. మా ఫాలున్ దాఫా ఆధ్యాత్మిక సాధన యొక్క ముఖ్యోద్దేశం జనులను ఉన్నత స్థాయిలకు నడిపించడమే. అది అటువంటి పనికోసమే ఉద్దేశించబడి లేకున్నా, సంఘంలో ఒక ఆధ్యాత్మికపరమైన సంస్కారాన్ని పెంచే గొప్ప నిర్మాణాత్మకమైన పాత్రను పోషిస్తుంది. స్త్రీ, పురుషులందరూ ఆత్మ పరిశీలన చేసుకొని తమ ప్రవర్తన ఎలా ఉండాలో అన్నది ఆలోచించుకుంటే, సంఘంలో స్థిరత్వం వచ్చి మానవ నైతిక ప్రమాణం పెరుగుతుందని నేను అంటాను.

నేను తై యూఎన్ (3) లో ఫాను, అభ్యాసాన్ని బోధిస్తున్న సమయంలో యాభై ఏళ్ళు పైబడిన ఒక అభ్యాసకురాలు ఉండేవారు. ఆమె, ఆమె భర్త ఇద్దరూ నా ఉపన్యాసాలకు వచ్చేవారు. వారు వీధి మధ్యలోకి వచ్చేసరికి, ఒక కారు అతివేగంగా వారి పక్కనించి వెళ్ళింది, ఆ పెద్దావిడ దుస్తులు కారు పక్కనున్న అద్దానికి చిక్కుకున్నాయి. అలా చిక్కుకున్న దుస్తుల కారణంగా ఆమె ఒక పది మీటర్ల దూరం ఈడ్చుకుపోబడి నేలపై పడ్డారు. ఇరవై మీటర్లు వెళ్ళిన తరవాత ఆ కారు ఆగింది. ఆ డ్రైవర్ చాలా కంగారుగా వచ్చి "నువ్వు ఎక్కడ నడుస్తున్నావో చూసుకోలేదు" అన్నాడు. ఈ రోజుల్లో జనులు, ఒక సమస్యను ఎదుర్కొన్నప్పుడు తమ తప్పున్నా పట్టించుకోక బాధ్యతను తప్పించుకొని, ఈ విధంగా ప్రవర్తిస్తారు. కారులో కూచుని ఉన్న ప్రయాణీకులు "ఆమెకు ఎంత దెబ్బ తగిలిందో ముందు అది కనుక్కో. ఆమెను ఆస్పత్రికి తీసుకువెళదాం", అన్నారు. అప్పుడు డ్రైవరు స్పృహలోకి వచ్చి, "ఎలా ఉన్నారమ్మా? మీకు దెబ్బ తగిలిందా? ఆస్పత్రికి వెళ్ళి చూపిద్దాం" అని అడిగాడు. ఆ అభ్యాసకురాలు మెల్లగా లేచి నిలబడి "ఏమీ కాలేదు. నువ్వు వెళ్ళొచ్చు" అని చెప్పారు. ఆమె తన దుస్తులకు అంటుకున్న దుమ్ము దులిపి వేసుకొని తన భర్తతో కలిసి వెళ్ళిపోయారు.

ఆమె తరగతికి వచ్చి, నాకు ఈ కథ వినిపించారు, నాకు సంతోషం

కలిగింది. మా సాధకుల షిన్ షిన్ నిజంగానే అభివృద్ధి చెందింది. ఆమె "టీచర్, నేను ఇవాళ ఫాలున్ దాఫా చదివాను. చదివి ఉండకపోతే ఈ ప్రమాదాన్ని ఈ విధంగా పరిగణించి ఉండేదాన్ని కాదు." అని నాతో అన్నారు. అందరూ దీని గురించి ఆలోచించండి: ఉద్యోగ విరమణ చేసినవారికి, నిత్యావసర ధరలు అధికంగా ఉన్న ఈ రోజుల్లో ఎటువంటి సంక్షేమ పథకమూ లేని యాభై ఏళ్ళు పైబడిన ఈమె కారుతో ఈడువబడి నేలపై పడిపోయారు. ఆమె తన శరీరానికి ఎక్కడ దెబ్బ తగిలింది? అని అడిగినప్పుడు ప్రతిచోట తగిలిందని చెప్పి ఉండొచ్చు. పైకి లేవకుండా నేలపైనే పడి ఉండొచ్చు. ఆస్పత్రికి వెళ్తాం అన్నప్పుడు వెళ్ళిపోయి ఉండొచ్చు. ఆమె బయటకు కదలక, ఎంతకాలమైనా ఆస్పత్రిలో ఉండి ఉండొచ్చు. ఒక సామాన్య వ్యక్తి అయి ఉంటే, అలా చేసి ఉండొచ్చు కానీ ఆమె ఒక సాధకురాలు కాబట్టి అలా చెయ్యలేదు. మంచిగానీ చెడుగానీ ఒక వ్యక్తికి ఒక క్షణంలో అక్కడికక్కడ కలిగే ఆలోచన వల్ల జరుగుతుందని, ఆ ఆలోచన భిన్నమైన పరిణామాలకు దారితీయొచ్చని మేము చెప్పాము. ఆమె గనక ఒక సామాన్య వ్యక్తి అయి ఉంటే, ఆ వయసులో ఆమె గాయపడక ఎలా ఉండేవారు? కానీ ఆమె చర్మం కనీసం గీరుకుపోలేదు. మంచిగానీ చెడుగానీ ఆ క్షణంలో కలిగిన ఆలోచనవల్ల జరుగుతుంది. ఆమె కింద పడి ఉండి, "అయ్యో, భరించలేకపోతున్నాను, నాకు అక్కడ, ఇక్కడ ఏదో అయింది" అని గనక అన్నట్లైతే, అప్పుడు తప్పకుండా ఆమె ఎముకలు విరిగి ఉండేవి, ఆమె మంచం పట్టి ఉండేవారు. ఆమెకు ఎంత డబ్బు ఇచ్చి ఉన్నా, జీవితాంతమూ ఆస్పత్రి పాలై ఆమె సుఖంగా ఎలా ఉండగలిగేవారు? పక్కన నిలబడి చూస్తున్నవారికి, ఆ పెద్దావిడ డబ్బు కోసం ఆ అవకాశాన్ని వాడుకొని అతడిని ఇబ్బంది పెట్టకపోవడం వింతగా అనిపించింది. ఈ రోజుల్లో మానవ నైతిక విలువలు క్షీణించిపోయాయి. ఆ డ్రైవర్ అతివేగంగా కారు నడిపిన మాట నిజమేగానీ, అతడు ఉద్దేశపూర్వకంగా ఒక వ్యక్తిని ఎందుకు ఢీ కొడతాడు? అతడు అది అసంకల్పితంగానే చేశాడు కదా? కానీ ఈ రోజుల్లో ప్రజలు ఇలా లేరు. అతడిని ఇబ్బందిపెట్టనట్లైతే పక్కన నిలిచి చూసేవారికి కూడా అది అన్యాయంగా కనిపిస్తుంది. ఇప్పటి ప్రజలు మంచి చెడులను విడదీసి చూడలేకపోతున్నారని నేను చెప్పాను. ఒక వ్యక్తి మరొక వ్యక్తికి అతడు ఒక తప్పు చేస్తున్నాడని చెప్తే ఆ రెండవ వ్యక్తి నమ్మడు. మానవ నైతిక

విలువలు మారిపోయిన కారణంగా, కొంతమంది కేవలం తమ స్వార్థం చూసుకొని డబ్బు కోసం ఏ పనైనా చేస్తారు. "ఒక వ్యక్తి స్వార్థాన్ని చూసుకోనప్పుడు, దివి, భువి కూడా వాడిని చంపుతాయి" అన్నది ఈ నాటి నీతి సూత్రం!

బీజింగ్‌లో ఒక సాధకుడు ఒక రోజు రాత్రి, భోజనానంతరం నడకకు తన కొడుకును తీసుకొని చ్యన్ మున్(4)కు వెళ్ళాడు. ఒక వాణిజ్య వాహనంలో లాటరీ టికెట్లు అమ్మడం చూశాడు. ఆ పిల్లవాడు లాటరీ ఆడతానని ఆసక్తిగా తండ్రిని కోరాడు. అతడు పిల్లవాడికి ఒక యువాన్ ఇచ్చాడు, దానితో పిల్లవాడు రెండవ బహుమతిగా చిన్నపిల్లల విలాసవంతమైన బైకును గెలుచుకున్నాడు. ఆ పిల్లవాడు సంబరపడిపోయాడు. హఠాత్తుగా ఆ తండ్రి మనసులో ఒక ఆలోచన తళుక్కుమన్నది. "నేను ఒక సాధకుణ్ణి. నేనటువంటి పని ఎలా చెయ్యగలను? డబ్బు చెల్లించకుండా ఒక వస్తువును తీసుకుంటే నేను ఎంత పుణ్యం కోల్పోవలసి వస్తుంది?" అని. అతడు పిల్లవాడితో "మనం దాన్ని తీసుకోవద్దు. నీకు కావాలంటే, మనమే ఒకటి కొనుక్కుందాం" అన్నాడు. పిల్లవాడు కలత పడ్డాడు: "నేను ఒకటి కొనిపెట్టమని బతిమాలుకున్నాను, నువ్వు కొనలేదు. ఇప్పుడు నా అంతట నేను తెచ్చుకున్నది కూడా తీసుకోనివ్వడం లేదు" అని ఏడ్చి గగ్గోలు పెట్టాడు. ఆ వ్యక్తి ఆ బైక్‌ను ఇంటికి తీసుకువెళ్ళక తప్పని పరిస్థితిలో తీసుకువెళ్ళాడు. ఇంటి దగ్గర దాన్ని గురించి ఆలోచించిన కొద్దీ ఇబ్బందికి గురయ్యాడు. అప్పుడు ఆ డబ్బును వారికి పంపించుదామా అనుకున్నాడు. మళ్ళీ "లాటరీ టికెట్లన్నీ అయిపోయాయి కదా? ఇప్పుడు డబ్బు వాళ్ళకు పంపిస్తే వాళ్ళే పంచుకుంటారు కదా? ఆ డబ్బును నా కార్యాలయంలో విరాళంగా ఇస్తాను", అని నిశ్చయించుకున్నాడు.

అదృష్టవశాత్తూ, అతడి కార్యాలయంలో కొందరు ఫాలున్ దాఫా సాధకులు ఉన్నారు, అతడి పైఅధికారి అతడిని అర్థం చేసుకోగలిగాడు. మరొక రకమైన వాతావరణంలోగానీ, మరొక కార్యాలయంలోగానీ మీరు వెళ్ళి, మీరొక సాధకుడని, లాటరీలో వచ్చిన బైక్ మీకు అవసరం లేదని, డబ్బు విరాళమిస్తానని అని ఉంటే, పైఅధికారి సైతం మీకు మానసిక సమస్య ఉందని అనుకునేవాడు. ఇతరులు కూడా "ఇతడు చీ గోంగ్ అభ్యాసంలో

దారితప్పాడా, లేక సాధనలో పిచ్చి పట్టిందా" అని వ్యాఖ్యానించి ఉండేవారు. నైతిక విలువలు వక్రీకరించబడ్డాయని నేను చెప్పాను. పందొమ్మిది వందల యాభై, లేదా అరవై దశకాలలో ఇది పెద్ద విశేషం కాదు, సాధారణమైనదే– దాన్ని ఎవరూ వింతగానో, విపరీతంగానో భావించేవారు కాదు. మానవ నైతిక విలువలు ఎంతగా మారినా, సత్యం–దయ–సహనం అన్న విశ్వలక్షణం శాశ్వతంగా మార్పులేకుండా నిలిచి ఉంటుందని నేను చెప్పి ఉన్నాను. ఎవరైనా మీరు మంచివారంటే, మీరు నిజంగా మంచివారై ఉండకపోవచ్చు. ఎవరైనా మీరు చెడ్డవారన్నంత మాత్రాన మీరు నిజంగా చెడ్డవారు కాకపోవచ్చు. ఇలా ఎందుకంటే మంచి చెడులను నిర్ణయించే ప్రమాణాలు వక్రీకరించబడ్డాయి. ఈ విశ్వలక్షణానికి అనుగుణంగా ఉన్న వ్యక్తి మాత్రమే మంచి వ్యక్తి. ఒకరు మంచి వ్యక్తి లేదా చెడ్డ వ్యక్తి అని నిర్ణయించే ఏకైక లక్షణం ఇదే, ఇది విశ్వమంతటా గుర్తింపబడింది కూడా. మానవ సమాజంలో గొప్ప మార్పులు సంభవించినా, మానవ నైతిక విలువలు విపరీతంగా పతనమైపోయాయి. మానవులలో నైతికత దినదినమూ దిగజారుతూ, లాభాలే ఏకైక ప్రేరణగా మారాయి. అయినా విశ్వంలోని మార్పులు మానవ జాతిలోని మార్పులను అనుసరించి జరగవు. ఒక వ్యక్తి సాధకుడై ఉండి, సామాన్య వ్యక్తుల ప్రమాణాల ఆధారంగా ప్రవర్తనను మలచుకోడు. కేవలం సామాన్య మానవులు సరైనదిగా పరిగణించిన కారణాన ఒక పనిని మీరు చేయడానికి అనుమతి ఉండదు. సామాన్య వ్యక్తులు సరైనది అన్నంతమాత్రాన అది సరైనది కాదు. సామాన్య వ్యక్తులు చెడు అన్నంతమాత్రాన అది చెడూ కాదు. నైతిక విలువలు వక్రీకరించ బడిన ఈ కాలంలో మీరు ఒక వ్యక్తి చేస్తున్న పనిని తప్పు అంటే అతడు నమ్మడు! ఒక వ్యక్తి సాధకుడైనప్పుడు విశ్వలక్షణం ప్రమాణంగా విషయాలను అంచనా వెయ్యాలి. అప్పుడు మాత్రమే ఒక వ్యక్తి ఏది అసలైన మంచి, ఏది నిజంగా చెడు అన్నది వేరుచేసి చూడగలుగుతాడు.

## గ్యాండింగ్

సాధకుల సమాజంలో గ్యాండింగ్ అన్న ఒక పద్ధతి ఉంది. ఇది బుద్ధ సిద్ధాంతంలోని తంత్ర సాధనకు చెందిన మతపరమైన ఆచారం. దాని ఉద్దేశం

ఏమిటంటే, గ్వాండింగ్ ప్రక్రియ చేసిన తరవాత, ఒక వ్యక్తి ఏ ఇతర సిద్ధాంతాలనూ పాటించకుండా, ఈ ప్రత్యేక సిద్ధాంతంలోనికి నిజమైన శిష్యుడుగా స్వీకరించబడడం. ఇందులో వింతైన విషయం ఏమిటంటే, మత పరమైన ఈ ఆచారం చీ గోంగ్ అభ్యాసాలలో కూడా పాటించబడుతున్నది. అది తాంత్రికవిద్యలోనే కాకుండా, తావో సిద్ధాంతంలో కూడా అభ్యసించబడు తున్నది. తాంత్రికవిద్య పేరిట తాంత్రిక అభ్యాసాలను బోధిస్తున్నవారందరూ నామమాత్రులేనని నేను చెప్పాను. ఇలా ఎందుకన్నాను? ఎందుకంటే, టాంగ్ తాంత్రికవిద్య అన్నది కనుమరుగై వెయ్యి సంవత్సరాల పైచిలుకు అయింది, ప్రస్తుతం దాని ఉనికి ఏమాత్రమూ లేదు. భాషాసమస్య మూలంగా హాన్ (5) ప్రాంతాల్లో టిబెట్ తాంత్రికవిద్య అసలు ప్రవేశించనే లేదు. ప్రత్యేకించి ఇది గోప్యంగా పాటించవలసిన మతం కనుక, మఠాలలో రహస్యంగా అభ్యసించ బడేది. అది గురువు చేత రహస్యంగా బోధింపబడవలసిన అవసరం కూడా ఉంది, గురువు ఆ వ్యక్తిని రహస్య సాధన కోసం తీసుకువెళ్ళాలి. ఇలా చెయ్యకపోతే, దాన్ని బోధించడం ఏ మాత్రమూ కుదరదు.

చీ గోంగ్ అధ్యయనం చెయ్యడానికి టిబెట్‌కి వెళ్ళేవారిలో చాలామందికి ఒకే లక్ష్యం ఉంటుంది: తాము ఒక గురువును వెతికి పట్టుకొని టిబెట్ తాంత్రికశాస్త్ర అధ్యయనం చేసి చీ గోంగ్ గురువులైపోయి ధనము, కీర్తి సంపాదించుకోవాలి అనుకుంటారు. అందరూ ఇది ఆలోచించండి: అసలైన బోధనను పొంది ఉన్న ఒక నిజమైన, ఇప్పుడు సజీవులై ఉన్న టిబెట్ లామా (6)కు చాలా బలమైన అతీంద్రియ శక్తులున్నాయి, ఆయన అటువంటి వ్యక్తి మనసును చదవగలరు. ఈ వ్యక్తి ఇక్కడికెందుకు వచ్చాడు? ఆ వ్యక్తి మనసును చదివి ఆయన నేరుగా : "నువ్వు బుద్ధ సిద్ధాంతానికి చెందిన ఈ సాధనను అవమానపరుస్తూ, చీ గోంగ్ సాధనను అధ్యయనం చేసి, ధనం, కీర్తి సంపాదించడానికి చీ గోంగ్ గురువువు కావాలని ఇక్కడికి వచ్చావు" అని తెలుసుకుంటారు. అంతటి గంభీరమైన బుద్ధత్వ ఆధ్యాత్మిక సాధన, మీ ధన, కీర్తి కాంక్షల ప్రాకులాట కారణాన యథాలాపంగా ఎలా నాశనమవుతుంది? మీకు ప్రేరణ ఏమిటి? అందువల్ల ఆయన ఈ వ్యక్తికి అసలు ఏమీ బోధించరు, ఈ వ్యక్తికి ఎటువంటి అసలైన బోధనలూ దొరకవు. చుట్టూ ఎన్నో మఠాలు

ఉండగా ఒక వ్యక్తి పైపైన కొన్ని విషయాలు నేర్చుకోవచ్చు. అతడి మనసు సరైనది కాకపోతే చీ గోంగ్ గురువు కావాలనే ప్రయత్నంలో తప్పులు చేస్తే అతడిని ప్రేతాత్మ లేదా జంతువు ఆవహించే అవకాశం ఉంది. ఆవహించుకునే జంతువులకు కూడా శక్తి ఉంటుంది కానీ అది టిబెట్ తాంత్రికశాస్త్రం ద్వారా వచ్చినది కాదు. మనస్ఫూర్తిగా ధర్మమును అన్వేషిస్తూ టిబెట్‌కి వెళ్ళేవారు అక్కడ స్థిరపడే అవకాశం ఉంది – వారు నిజమైన సాధకులు.

ఇప్పుడు అనేక తావో సిద్ధాంతాలకు చెందిన సాధనలు కూడా గ్వాండింగ్‌ను ఆచరించడం ఒక వింత. తావో సిద్ధాంతం నాడులను ఉపయోగిస్తుంది. అది గ్వాండింగ్‌ను ఎందుకు సాధన చేస్తుంది? నేను ఉపన్యాసాలు ఇవ్వడానికి దక్షిణాదికి వెళ్ళాను. నాకు తెలిసిన దాన్నిబట్టి, గ్వాండింగ్‌ను ఆచరించే పది రకాలకు పైగా విపరీతమైన అభ్యాసాలు ముఖ్యంగా గ్వాంగ్ డోంగ్ ప్రాంతంలో, ఉన్నాయి. వారు ఏమి చెయ్యాలని ప్రయత్నిస్తున్నారు? గురువు మీకు గ్వాండింగ్ చేసినట్లైతే, మీరు ఆయనకు శిష్యులైపోయి ఇతర సాధన నేర్చుకోలేరు. మీరు ఆ పని చేస్తే ఆయన మిమ్మల్ని శిక్షిస్తారు, ఎందుకంటే ఆయన చేసేది అదే. అది ఒక దుష్ట సాధన చేసినట్లు కాదా? ఆయన నేర్పుతున్నది వ్యాధి నిర్మూలన, దేహపుష్టి కోసం మాత్రమే. ప్రజలు కేవలం ఆరోగ్యవంతమైన శరీరాల కోసం దాన్ని నేర్చుకుంటారు. ఆయన ఇటువంటివి ఎందుకు చెయ్యాలి? ఒక గురువు తన చీ గోంగ్ అభ్యసిస్తుంటే మరి ఏ ఇతర చీ గోంగ్ అభ్యాసం నేర్చుకోకూడదని వాదిస్తారు. అతడు ప్రజలను రక్షించి, వారి సాధన సంపూర్ణం చేసుకునేట్లు చెయ్యగలరా? అది శిష్యులను తప్పుదారి పట్టించడమే. చాలామంది ఇలా చేస్తారు.

తావో సిద్ధాంతం ఎన్నడూ గ్వాండింగ్‌ను బోధించదు కానీ ఇప్పుడు దానిలో కూడా గ్వాండింగ్ అన్నది ఉంది. గ్వాండింగ్ ఆచారం గురించి అతిపెద్దగా చెప్పే ఒక చీ గోంగ్ గురువుకు గోంగ్ స్తంభం రెండు లేదా మూడు అంతస్తుల భవనం కన్న ఎత్తుగా లేదని నేను చూశాను. అంతటి ప్రఖ్యాత చీ గోంగ్ గురువుకు గోంగ్ అలా అతిదయనీయమైన విధంగా తగ్గిపోయింది. అతడి చేత గ్వాండింగ్ చేయించుకోవడానికి వందలమంది ప్రజలు బారులు తీరుతున్నారు. అతడి గోంగ్ అంతవరకే పరిమితమై ఉన్నది,

అది త్వరలో పూర్తిగా పడిపోతుంది. ఆ తరవాత గ్వాండింగ్ చెయ్యడానికి ఏం ఉపయోగిస్తాడు? అతడు ప్రజలను మోసం చెయ్యడం లేదా? మరొక పరిమాణం నించి చూసినప్పుడు అసలైన గ్వాండింగ్ జరిగిన తరవాత ఒక వ్యక్తి ఎముకలు తలనించి పాదాల వరకు తెల్లని జేడ్ రాయివలె కనిపిస్తాయి. ఒక వ్యక్తి శరీరం గోంగ్ లేదా ఉన్నతస్థాయి – శక్తి కారణంగా తల నించి పాదాల వరకు శుద్ధి చెందుతుంది. ఈ చీ గోంగ్ గురువు దాన్ని చెయ్యగలడా? చెయ్యలేడు. అతడు ఏం చేస్తాడు? అతడు ఒక మతాన్ని ప్రారంభించాలని ప్రయత్నించకపోవచ్చు. మీరు ఒకసారి అతడి అభ్యాసాన్ని అధ్యయనం చేస్తే, మీరు అతడికి చెందుతారన్నది అతడి లక్ష్యం. అతడి విషయాలను అధ్యయనం చెయ్యడానికి మీరు అతడి తరగతులకు వెళ్ళాలి. అతడి లక్ష్యం మీ డబ్బును సంపాదించడం. అతడి సాధనను ఎవరూ అధ్యయనం చెయ్యకుంటే, అతడు ధనార్జన చెయ్యలేడు.

ఇతర బుద్ధ సిద్ధాంత ఆధ్యాత్మిక సాధనల యొక్క శిష్యుల వలె ఫాలున్ దాఫా శిష్యులు కూడా చాలాసార్లు ఇతర పరిమాణాలలోని ఉన్నతస్థాయి గురువులు చేసే గ్వాండింగ్ అనుభవాన్ని పొందుతారు: కానీ ఆ విషయం మీకు చెప్పబడదు. అతీంద్రియ శక్తులు గలిగిన వ్యక్తులు లేదా సూక్ష్మగ్రాహులు నిద్రలోనో ఇతర సమయంలోనో ఆ అనుభూతిని పొందవచ్చు, ఎందుకంటే ఆపాదమస్తకం ఒక వెచ్చని విద్యుత్తు హఠాత్తుగా వారి తలనించి క్రిందకు శరీరమంతటా వ్యాపిస్తుంది. గ్వాండింగ్ ఉద్దేశం మీ గోంగ్ ఎత్తును పెంచడం కాదు, ఎందుకంటే అది మీ స్వంత ఆధ్యాత్మిక సాధన ద్వారానే అభివృద్ధి చేసుకోవాలి. గ్వాండింగ్ అన్నది మీ శరీరాన్ని బలోపేతం చేసి ఆ పైన మీ శరీరశుద్ధి చేసే ప్రక్రియ. ఒక వ్యక్తి అనేకసార్లు గ్వాండింగ్‌కి లోనవుతాడు– మీ శరీరం ప్రతి స్థాయిలో శుద్ధి చెయ్యబడాలి. ఆధ్యాత్మిక సాధన ఒక వ్యక్తి యొక్క స్వంత ప్రయత్నాలపై ఆధారపడి ఉండగా గోంగ్ పరివర్తన గురువు చేస్తారు కాబట్టి, మేము గ్వాండింగ్ అన్న ఆచారాన్ని పాటించము.

కొందరు "గురుపూజ" అన్న పద్ధతి అభ్యసిస్తారు. దీని గురించి చెప్పే టప్పుడు, నేను ఒక విషయం చెప్పాలనుకుంటున్నాను. చాలామంది నన్ను గురువుగా పూజించాలని కోరుకుంటారు. చరిత్రలో మనం ఉన్న ఈ కాలం

చైనా భూస్వామ్య వ్యవస్థ ఉన్న కాలానికి భిన్నంగా ఉంది. మోకరించడం, మోకరించి నమస్కరించడమూ అన్నవి ఒక వ్యక్తిని గురువుగా భావించడానికి చిహ్నామా? మేము ఈ ఆచారాన్ని పాటించం. "నేను మోకరించి నమస్కరించి, ధూపం వేసి, మనస్ఫూర్తిగా బుద్ధుడికి పూజ చేస్తే నా గోంగ్ పెరుగుతుంది" అని చాలామంది అనుకుంటారు. అది హాస్యాస్పదమని నేను అంటాను. అసలైన ఆధ్యాత్మిక సాధన అన్నది పూర్తిగా ఒక స్త్రీ లేదా పురుషునిపై ఆధారపడి ఉంటుంది కాబట్టి ప్రార్థన అన్నది నిరుపయోగం. మీరు ఒక బుద్ధునికి పూజ చెయ్యడం గానీ, ధూపం వెయ్యడం గానీ చెయ్యవలసిన అవసరం లేదు. ఒక సాధకుడి నియమాన్ని అనుసరించి మీరు నిజంగా ఆధ్యాత్మిక సాధనను చేసినంత కాలం బుద్ధుడు మిమ్మల్ని చూసి చాలా సంతోషపడతాడు. ఇతర ప్రదేశాలలో ఎప్పుడూ దుష్కర్మలు చేస్తుంటే, తన ఎదుట ధూపం వేసి, మోకరించి నమస్కారం చేసినా, బుద్ధుడు మిమ్మల్ని అసహ్యించుకుంటాడు. ఇది నిజం కాదా? అసలైన ఆధ్యాత్మిక సాధన ఆ స్త్రీ లేదా పురుషుని పైనే ఆధారపడి ఉంటుంది. మీరు ఇవాళ బయటకు అడుగుపెట్టిన తరవాత మీ ఇష్టానుసారం చెయ్యాలనుకుంటే గురువుకు మోకరించి, పూజించడంవల్ల ఉపయోగం ఏముంది? మాకు ఈ ఆచారం అసలు లెక్క లేదు. మీరు నా పేరును కూడా చెడగొట్టగలరు!

మేము ప్రతివారికి చాలా వస్తువులు ఇచ్చాము. మీరు నిజంగా ఆధ్యాత్మిక సాధన చేస్తూ దాఫాను అనుసరించి ఖచ్చితంగా సత్ప్రవర్తన కలిగి ఉన్నంత కాలమూ, మేము మిమ్మల్ని శిష్యులుగా ఆదరిస్తాం. మీరు దాన్ని అభ్యసించాలని అనుకోకపోతే, మేము మీకోసం ఏమీ చెయ్యలేం. మీరు ఆధ్యాత్మిక సాధన చెయ్యనప్పుడు సాధకుడన్న ఈ బిరుదు మీకెందుకు? మీరు మొదటిసారి ఉపన్యాసాలకు వచ్చారా, రెండవసారి వచ్చారా అన్నది అనవసరం. కేవలం వ్యాయామాలు చెయ్యడంవల్లనే, మీరు మా సాధకులెలా అవుతారు? మీరు ఒక ఆరోగ్యవంతమైన శరీరాన్ని పొందడానికి, నిజంగా ఉన్నతస్థాయికి పురోగతి చెందడానికి, మా షిన్ షిన్ ప్రమాణం నిజంగా అనుసరించి ఆధ్యాత్మిక సాధన చెయ్యాలి. అందువల్ల, మేము ఈ ఆచారాలను లెక్కచెయ్యం. మీరు ఆధ్యాత్మిక సాధన చేసినంత కాలమూ, మీరు మా

సాధనాసిద్ధాంతానికి చెందిన సాధకులు. నా ఫాషెన్‌కు అన్నీ తెలుసు – వారికి మీ మనసులో ఉన్నదంతా తెలుసు, వారు ఏమైనా చెయ్యగలరు. మీరు ఆధ్యాత్మిక సాధన చెయ్యకపోతే వారు మీపై శ్రద్ధ వహించరు. మీరు ఆధ్యాత్మిక సాధన చేస్తే వారు చివరిదాకా మీకు సహాయం చేస్తారు.

కొన్ని చీ గోంగ్ సాధనలలో, శిష్యులు గురువులను అసలు చూసి ఉండరు. కొన్ని వందల యువాన్లు చెల్లించి ఒక నిర్దిష్టమైన దిక్కుకు తిరిగి మోకరించి నమస్కరిస్తే అది చాలని వాదిస్తారు. అది ఆత్మవంచనా, పరవంచన కూడా కాదా? దీనికితోడు, ఈ వ్యక్తులు ఆ తరవాత గురువు పట్ల చాలా భక్తి కలిగి ఉండి తమ అభ్యాసాలను, గురువులను సమర్థిస్తూ వాదనలను లేదా రక్షించాలని ప్రయత్నాలు మొదలుపెడతారు. వారు ఇతరులను ఇతర అభ్యాసాలు అధ్యయనం చెయ్యవద్దని కూడా చెప్తారు. నాకు ఇది అర్థరహితంగా కనిపిస్తుంది. మరికొందరు మోడింగ్ (7) అని చెప్పబడేది చేస్తారు. అతడు తాకిన తరవాత ఏం ప్రభావం కలిగిందో ఎవరికీ తెలియదు.

తంత్రశాస్త్రం పేరుతో తమ అభ్యాసాలను బోధించేవారే కాక; బౌద్ధ మతం పేరుతో చీ గోంగ్‌ను బోధించేవారందరూ మోసపుచ్చేవారే. అందరూ ఇది ఆలోచించండి: కొన్ని వేల సంవత్సరాలపాటు బౌద్ధమతంలోని సాధనా పద్ధతులు అవే పద్ధతులలో ఉండేవి. ఎవరైనా వాటిని మారిస్తే అది ఇంకా బౌద్ధమతం ఎలా అవుతుంది? సాధనాపద్ధతులు విశేషమైన బుద్ధత్వ ఆధ్యాత్మిక సాధనకు ఉద్దేశించినవి, అవి అతిసంక్లిష్టమైనవి. ఒక్క చిన్న మార్పు కూడా వాటిని భ్రష్టు పట్టిస్తుంది. గోంగ్ పరివర్తన అన్నది అతిసంక్లిష్టం గనక ఒక వ్యక్తి అభిప్రాయం అక్కడ లెక్కలోకి రాదు. ఒక వ్యక్తి తన అనుభూతి ఆధారంగా ఆధ్యాత్మిక సాధన చెయ్యలేడు. సన్యాసుల మతరూపము ఒక ఆధ్యాత్మిక సాధన పద్ధతివల్ల కలుగుతుంది; ఒకసారి సాధన మారిస్తే అది ముందటి సిద్ధాంతానికి చెందదు. ప్రతి సిద్ధాంతానికి ఒక మహాజ్ఞాని పరమగురువుగా ఉంటారు, ప్రతి సిద్ధాంతంనించి ఎందరో మహాజ్ఞానులు ఉద్భవించారు. ఆ సిద్ధాంతానికి చెందిన ఆధ్యాత్మిక సాధన పద్ధతిలో యథాలాపంగా మార్పు చెయ్యడానికి ఎవ్వరూ సాహసించరు. బుద్ధత్వ ఆధ్యాత్మిక సాధనను మార్చి ఆ పరమ  గురువును అతిక్రమించే సాహసం చేయడానికి ఒక క్షుద్ర గురువుకు

ఎటువంటి విశేష పుణ్యం ఉంది? నిజంగా మార్చబడితే అది ఇంకా అదే సిద్ధాంతంగా ఉంటుందా? మోసపు చీ గోంగ్‌ను వేరుచేసి చూడవచ్చు.

## రహస్యమార్గ స్థాపనం

"రహస్యమార్గ స్థాపనం" ఒక "రహస్యమైన దారి" అని కూడా అంటారు. ఈ పదజాలం **డాన్ జింగ్, తావో జాంగ్, షిన్ మింగ్ గ్విజి** గ్రంథాలలో దొరకవచ్చు. అయితే అదంతా దేని గురించి? చాలామంది చీ గోంగ్ గురువులు దానిని స్పష్టంగా వివరించలేరు. ఎందుకంటే, ఒక సగటు చీ గోంగ్ గురువు స్థాయిలో, ఒక వ్యక్తి దానిని చూడలేడు, చూడడానికి అనుమతి కూడా ఉండదు. ఒక సాధకుడు దానిని చూడాలనుకుంటే అతడు జ్ఞానదృష్టి స్థాయికి లేదా అంతకంటే ఎత్తుకుగానీ చేరుకోవలసి ఉంటుంది. ఒక సాధారణ చీ గోంగ్ గురువు ఆ స్థాయిని చేరుకోలేడు; అందువల్ల దాన్ని చూడలేడు. చరిత్ర పొడుగునా, సాధకుల సమాజం ఈ రహస్యమార్గం ఏమిటని ఆ మార్గం అన్నది ఎక్కడున్నదని ఆ రహస్యమార్గ స్థాపనను ఎలా చేయాలి, అని చర్చిస్తూనే ఉన్నారు. **డాన్ జింగ్, తావో జాంగ్, షిన్ మింగ్ గ్విజి** (8) గ్రంథాలలో వారు వస్తువు గురించి చెప్పకుండా చర్చలు మాత్రమే జరుపుతూ ఉండేవారు. ఒక చర్చనించి మరొక చర్చకు దారితీస్తూ మిమ్మల్ని తికమకపెడతారు. వారు విషయాలను స్పష్టంగా చెప్పేవారు కాదు ఎందుకంటే అందులో ఉన్న వస్తువును సామాన్య మానవులు గ్రహించలేరు.

ఇంకనూ, ఒక విషయం చెప్తాను, మీరు ఫాలున్ దాఫా శిష్యులు కాబట్టి నేను ఈ మాటలు చెప్తున్నాను: "ఆ మోసపూరిత చీ గోంగ్ పుస్తకాలు మీరు ఎప్పటికీ చదవకండి". నేను గతంలోని ప్రామాణిక సంప్రదాయ గ్రంథాల గురించి చెప్పడం లేదు, ఈనాటి ప్రజలు రాసిన నామమాత్రపు చీ గోంగ్ పుస్తకాలను గురించి చెప్తున్నాను. మీరు వాటిని కనీసం తెరవనూ కూడదు. మీ మనసులో "ఆహా, ఈ వాక్యం సబబుగా ఉన్నట్లుంది" అన్న ఆలోచన రావడమే తడవు, దానితో ఆ పుస్తకంలో ఆవహించి ఉన్న ప్రేతాత్మలు లేదా జంతువులు మీ శరీరానికి అతుక్కుంటాయి. చాలా పుస్తకాలు మానవ బంధాలను కీర్తి, ధనకాంక్షల వైపు తిప్పగలిగే శక్తి కలిగిన, ప్రేతాత్మలు

లేదా జంతువుల నియంత్రణలో రాయబడినట్టివి. చాలా – అత్యధికంగా – మోసపూరిత చీ గోంగ్ పుస్తకాలు ఉన్నాయి. అనేకులు బాధ్యతారహితంగా, ఆవహించి ఉన్న ప్రేతాత్మలు, జంతువులు, ఇతర గందరగోళపరిచే విషయాలతో పుస్తకాలు రాస్తున్నారు. సాధారణంగా పైన చెప్పిన ప్రాచీన గ్రంథాలు, వాటికి సంబంధించిన ఇతర ప్రాచీన గ్రంథాలు చదవకపోవడమే మంచిది, ఎందుకంటే అది ఒకే సాధనలో ఏకాగ్రచిత్తం కలిగి ఉండే అంశాన్ని కలిగి ఉంటుంది.

చైనా చీ గోంగ్ శాస్త్ర పరిశోధనాసంస్థకు చెందిన ఒక అధికారి చెప్పిన ఒక కథ నాకు నిజంగా నవ్వు తెప్పించింది. బీజింగ్‌లోని ఒక వ్యక్తి తరచు చీ గోంగ్ సభలకు వెళ్తూ ఉండేవాడని అతడు చెప్పాడు. చాలా ఉపన్యాసాలను విన్న తరవాత, అక్కడ చెప్పేది తప్ప, చీ గోంగ్‌లో ఏమీలేదని ఆ వ్యక్తి భావించాడు. అందరూ ఒకే స్థాయిలో ఉన్నందున, వారందరూ అవే విషయాలు మాట్లాడేవారు. ఇతర నామమాత్రపు చీ గోంగ్ గురువులలాగా అతడు చీ గోంగ్‌లో ఉన్న విషయమంతా అదేనని, అంతకన్నా ఎక్కువేమీ లేదు అనుకున్నాడు! అప్పుడు అతడు చీ గోంగ్ గురించి ఒక పుస్తకం కూడా రాయాలనుకున్నాడు. అందరూ ఇది ఆలోచించండి: సాధన చేయని ఒక వ్యక్తి ఒక చీ గోంగ్ పుస్తకం రాస్తాడట. ఈ రోజుల్లో చీ గోంగ్ పుస్తకాలు ఒకదానికొకటి చూచి వ్రాతపుస్తకాలవలె రాయబడుతున్నాయి. అతడి రాత ముందుకు సాగుతుండగా, అతడు రహస్య మార్గం అన్న అంశం దగ్గర ఆగిపోయాడు. రహస్యమార్గం అంటే ఎవరికి అర్థం అవుతుంది? అసలైన చీ గోంగ్ గురువులలో కూడా కొందరే దాన్ని అర్థం చేసుకోగలుగుతారు. అతడు ఒక మోసపు చీ గోంగ్ గురువును అడిగి తెలుసుకుందామని వెళ్ళాడు. ఆ గురువు మోసకారి అని అతడికి తెలియదు, ఎందుకంటే అతడు చీ గోంగ్‌నే అర్థం చేసుకోలేదు. కానీ ఈ మోసపు చీ గోంగ్ గురువు ఆ ప్రశ్నకు జవాబు చెప్పలేకపోతే అతడు మోసకారి అని ఇతరులు గ్రహించరా? అందువల్ల, అతడు ఏదో రకంగా జవాబు చెప్పాలని సాహసించి ఒక రహస్య మార్గం అన్నది ఒక వ్యక్తి పురుషాంగపు చివర ఉంటుందని చెప్పాడు. ఇది వినడానికి చాలా హాస్యపూరితంగా ఉంటుంది. నవ్వకండి, ఎందుకంటే ఈ పుస్తకం

సంఘంలో ఇప్పటికే ప్రచురితమైంది. అంటే చీ గోంగ్ పుస్తకాలు నేటికి ఎగతాళికి గురయ్యే ఇటువంటి దశకు వచ్చాయి. మీరు ఇటువంటి పుస్తకాలు చదవడంవల్ల ప్రయోజనం ఏమిటి? దానివల్ల ఉపయోగం ఉండకపోగా అది కేవలం చెడు చేస్తుంది.

"రహస్యమార్గ స్థాపనం" అంటే ఏమిటి? ఒక వ్యక్తి యొక్క త్రిలోకాంతర ఫా సాధనలో, అతడి ఆధ్యాత్మిక సాధన త్రిలోకాంతర ఫాలోని మధ్యమస్థాయిని దాటి లేదా ఉన్నతస్థాయికి దగ్గర, ఈ వ్యక్తి అమృత శిశువును పెంపొందించు కోవడం మొదలుపెడతాడు. మేము చెప్పే అమృత శిశువు, సాధనాశిశువు (హ్వాయిాన్) రెండు విభిన్న విషయాలు. సాధనాశిశువులనేవి చాలా చిన్నగా ఉండి, ఆడుతూ పాడుతూ చుట్టూ సంబరంగా పరుగులెత్తుతూ ఉంటాయి. అమృత శిశువు అనేది అసలు కదలదు. ఒక వ్యక్తి యొక్క ప్రాథమిక ఆత్మ దాన్ని తన నియంత్రణలోకి తీసుకోకపోతే, ఆ అమృత శిశువు ఒక పద్మం మీద పద్మాసన స్థితిలో, చేతులు జోడించి కదలకుండా కూచొని ఉంటుంది. ఆ అమృత శిశువు దాన్ త్యన్ నించి పెరుగుతుంది, సూది మొన కన్న చిన్న ప్రమాణంలో ఉన్నప్పటి నించి, సూక్ష్మస్థాయిలో కనబడుతుంది.

దీనికితోడు, ఇంకొక సంగతి కూడా స్పష్టం చెయ్యాలి. అసలైన దాన్ త్యన్ ఒకే ఒక్కటి ఉంటుంది, అది ఒక వ్యక్తి శరీరంలో పొత్తికడుపు క్రింది భాగంలో ఉన్నట్టి త్యన్ (9). అది అతడి శరీరంలో పొట్టకు క్రిందుగా, హ్వాయిాన్ (10) బిందువుకు పైన ఉంటుంది. అనేక రూపాల గోంగ్, అనేక అతీంద్రియశక్తులు, అనేక శక్తులు, ఫాషెన్, అమృత శిశువు, సాధనాశిశువు, ఇంకా మరెన్నో జీవులు అన్నీ ఈ త్యన్ నించే పెరుగుతాయి.

గతంలో అతికొద్దిమంది సాధకులు, పై దాన్ త్యన్, మధ్య దాన్ త్యన్, క్రింది దాన్ త్యన్ గురించి మాట్లాడేవారు. వారు చెప్పినదంతా తప్పని నేను అంటాను. తమ గురువులు తరతరాలుగా తమకు ఈ విధంగానే బోధించారని, గ్రంథాలు కూడా అదే చెప్పాయని కొందరు వాదిస్తారు. తెట్టు తేలడం (పైకి తేలే చెత్త) అనేది ప్రాచీనకాలంలో కూడా ఉందని నేను అందరికీ చెప్తున్నాను. కొన్ని విషయాలు సంవత్సరాల తరబడి వారసత్వంగా వస్తూ ఉన్నా, అవి తప్పు కావచ్చు. ప్రపంచమంతటా, కొన్ని అల్పమైన సాధనామార్గాలు సామాన్య

మానవుల మధ్య ఎప్పుడూ అందించబడుతూనే ఉన్నాయి కానీ అవి ఆధ్యాత్మిక సాధన కోసం కావు, ఎందుకూ పనికి రావు. దాన్ని పై దాన్ త్యన్, మధ్య దాన్ త్యన్, క్రింది దాన్ త్యన్ అంటుంటే దాన్ పెరిగే ప్రతిచోటా దాన్ త్యన్ ఉన్నదని చెప్తున్నారన్న మాట. ఇది ఒక ప్రహసనం కాదూ? ఒక వ్యక్తి చాలా సమయంపాటు తన మనసును శరీరంలోని ఏదో ఒక ప్రదేశం మీద కేంద్రీకరించినప్పుడు, శక్తి ఒక గుత్తిగా అభివృద్ధి చెంది దాన్‌గా ఏర్పడుతుంది. మీరు దీనిని నమ్మకపోతే, మీ మనసును మీ జబ్బ మీద కేంద్రీకరించి చాలాసేపు అలా ఉంచండి, అక్కడ దాన్ తయారవుతుంది. అందువల్ల కొందరు ఇటువంటి పరిస్థితి చూసి దాన్ త్యన్ ప్రతిచోటా ఉందని ప్రకటిస్తారు. ఇది ఇంకా హాస్యాస్పదం. దాన్ ఏర్పడిన ప్రతిచోట దాన్ త్యన్ ఉందని అనుకుంటారు. నిజానికి అది త్యన్ కాదు, అది ఒక దాన్. దాన్ ప్రతిచోట ఉందని, పై దాన్, మధ్య దాన్, క్రింది దాన్ ఉన్నాయని మీరు అనొచ్చు. ఏమైనప్పటికీ, అసంఖ్యాకమైన ఫాను అభివృద్ధి చేయగలిగే అసలైన ఒకే ఒక త్యన్ ఉంది, అది పొత్తికడుపు క్రింద భాగంలో నెలకొని ఉంది. అందువల్ల, పై దాన్ త్యన్, మధ్య దాన్ త్యన్, క్రింది దాన్ త్యన్ అన్న మాటలు తప్పు. ఒక వ్యక్తి మనసు చాలాసేపు ఎక్కడ కేంద్రీకరించినా దాన్ ఏర్పడుతుంది.

పొత్తికడుపు క్రింది భాగంలోని దాన్ త్యన్ నించి అమృత శిశువు మెల్లమెల్లగా పెరుగుతూ పెద్దగా మరింత పెద్దగా అవుతుంది. అది ఒక పింగ్ పాంగ్ బంతి పరిమాణంలోకి పెరిగిన తరవాత, దాని పూర్తి శరీరపు ఆకృతి, కళ్ళు, ముక్కు ఏర్పడి చక్కగా కంటికి కనబడతాయి. అమృత శిశువు పింగ్ పాంగ్ బంతి అంత పెద్దగా పెరిగిన సమయంలోనే ఒక చిన్న గుండ్రటి బుడగ దాని పక్కనే పుడుతుంది. పుట్టిన తరవాత అమృత శిశువుతోపాటుగా ఆ బుడగ కూడా పెరుగుతూ ఉంటుంది. అమృత శిశువు నాలుగు అంగుళాల పొడుగు పెరిగిన తరవాత ఒక తామర పూరేకు ప్రత్యక్షమవుతుంది. అమృత శిశువు ఐదు లేదా ఆరు అంగుళాల పొడుగు పెరిగిన తరవాత ఆ తామర పువ్వు రేకులన్నీ ప్రాథమిక రూపంలో తయారై, తామరపువ్వులోని ఒక వరుస ప్రత్యక్షమవుతుంది. మెరుపులీనుతున్న బంగారు అమృత శిశువు ఒక బంగారు తామరపువ్వు పీఠంపై కూచొని చాలా అందంగా కనిపిస్తుంది. ఇది, ఎన్నటికీ

నశించని వజ్రదేహం, దీన్నే బుద్ధ సిద్ధాంతంలో "బుద్ధ శరీరం" అని, తావో సిద్ధాంతంలో "అమృత శిశువు" అని అంటారు.

మా సిద్ధాంతంలో రెండు రకాల శరీరాలను సాధన చేస్తాము, రెండింటినీ పొందడమన్నది అవసరం; రెంటి పరివర్తన కూడా అవసరం. బుద్ధ శరీరం సామాన్య వ్యక్తుల నడుమ ప్రత్యక్షం కావడం నిషిద్ధం అన్నది అందరికీ తెలుసు. అతిప్రయత్నం మీద, దాని ఆకృతి, వెలుగు ఒక సామాన్య వ్యక్తి కళ్ళకు కనిపించవచ్చు. అయితే పరివర్తన చెందిన తరవాత ఆ భౌతిక శరీరం సామాన్య మానవుల మధ్య ఉండే సగటు మనిషి శరీరంలాగే ఉంటుంది. ఈ శరీరం వివిధ పరిమాణాల మధ్య ప్రయాణించగలుగుతున్నా, ఒక సామాన్య వ్యక్తి వాటి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని చెప్పలేడు. అమృత శిశువు నాలుగునించి ఐదు అంగుళాలకు చేరినప్పుడు, ఆ గాలి బుడగ కూడా ఆ ఎత్తుకు పెరుగుతుంది, అది ఒక గాలి గుమ్మటంలాగా పారదర్శకంగా ఉంటుంది. ఆ అమృత శిశువు ధ్యాన భంగిమలో అక్కడ స్థిరంగా కూచుంటుంది. ఆ సమయానికి ఆ గాలిబుడగ దాన్ త్యన్‌ను వదిలేస్తుంది. అది పెరిగి పరిణతి చెందడంవల్ల, పైకి కదులుతుంది. అది పైకి కదలడం అన్న ప్రక్రియ అతినిదానంగా జరుగుతుంది కానీ, దాని కదలికను ప్రతిరోజూ పరిశీలించవచ్చు. అది క్రమంగా పై, పైకి కదులుతూ ఉంటుంది. అతిజాగ్రత్తగా గమనిస్తూ ఉంటే, మనం దాని ఉనికిని అనుభూతి చెందగలము.

ఆ గాలి బుడగ ఒక వ్యక్తి టాన్ జోంగ్ (11) బిందువును చేరినప్పుడు, అక్కడ కొంతసేపు ఆగుతుంది. మానవ శరీరంలోని అతిఎక్కువ సారం అక్కడ ఉండడంవల్ల (హృదయస్థానం కూడా అదే), ఆ గాలి బుడగలో కొన్ని వస్తువుల వ్యవస్థ తయారవుతుంది. ఈ సారం ఆ గాలి బుడగలోకి పంపించబడుతుంది. కొంతసేపైన తరవాత అది మళ్ళీ పైకి కదులుతుంది. అది గొంతు ద్వారా కదులుతున్నప్పుడు, ఒక వ్యక్తికి రక్తనాళాలన్నీ మూసుకుపోయినట్లు, శ్వాస ఆగిపోయినట్లు అనిపిస్తుంది, అతడు గొంతు వాచి ఉన్నట్లు బాధపడతాడు. ఇలా రెండు రోజుల వరకే ఉంటుంది. తరవాత ఆ గాలి బుడగ అతడి తల పైకి చేరుతుంది, దాన్ని మనం "నివాన్‌ను చేరుకోవడం" అంటాము. అది నివాన్‌ను చేరుకున్నది అంటాము గానీ, నిజానికి అది మీ తల ఎంత ఉందో

అంత పెద్దగా ఉంటుంది. మీ తల వాచినట్లుగా అనిపిస్తుంది. నివాన్ ఒక మనిషికి అతిముఖ్యమైన భాగం గనక, దాని సారం కూడా ఆ గాలి బుడగలో ఏర్పడాలి. అప్పుడు ఆ గాలి బుడగ దివ్యనేత్రపు సొరంగంవంటి మార్గం ద్వారా దూరడానికి ప్రయత్నిస్తుంది, అది చాలా ఇబ్బంది కలిగిస్తుంది. ఆ వ్యక్తి యొక్క దివ్యనేత్రం నొప్పిపుట్టేంతగా పిండివేయబడుతుంది. అతడి కణతలు వాచినట్లు అనిపించగా, కళ్ళు లోపలికి తవ్వేస్తున్నట్లు అనిపిస్తుంది. ఈ అనుభూతి ఆ గాలి బుడగ అతడి యొక్క దివ్యనేత్రంలోని సొరంగమార్గం ద్వారా బయటకు వచ్చి అతడి నుదుటి ఎదురుగా వ్రేలాడే వరకు ఉంటుంది. అదే రహస్యమార్గపు స్థానం అనబడుతుంది, అది అక్కడ వ్రేలాడుతూ ఉంటుంది.

ఆ సమయానికి దివ్యనేత్రం తెరవబడి ఉన్నవారు ఏమీ చూడలేరు. ఎందుకంటే బుద్ధ సిద్ధాంతం లేదా తావో సిద్ధాంతానికి చెందిన ఆధ్యాత్మిక సాధనలో, రహస్యమార్గంలో రూపుదిద్దుకుంటున్న విషయాలను వేగవంతం చెయ్యడంకోసం దాని తలుపు మూసివేయబడి ఉంటుంది. దానికి రెండు ముందు తలుపులు, రెండు వెనక తలుపులు ఉండి అన్నీ మూసివేయబడి ఉంటాయి. బీజింగ్‌లోని తియానన్మెన్ మహాద్వారాల వంటి రెండు తలుపులు ఇరువైపులా ఉంటాయి. రహస్యమార్గం త్వరగా ఏర్పడి దృఢంగా తయారవడానికి, ఆ తలుపులు అతిప్రత్యేకమైన పరిస్థితులలో తప్ప తెరవబడవు. దివ్యనేత్రంతో విషయాలను చూడగలిగినవారు, ఆ బిందువు దగ్గర చూడడం అన్నది నిషిద్ధం గనక వారు చూడలేరు. అది అక్కడ వ్రేలాడుతూ ఉండడంలోని ప్రయోజనం ఏమిటి? మన శరీరంలోని వందలకొద్దీ నాడులు అక్కడ కలుస్తాయి కాబట్టి అప్పుడు ఆ బిందువు దగ్గర అవన్నీ రహస్య మార్గం ద్వారా వలయాకారంగా తిరిగి, తరవాత బయటకు వెళ్ళాలి. వాటి గమ్యం ఏమిటంటే, కొన్ని అదనపు పునాదులు తయారుచేసి, వస్తువుల వ్యవస్థను రహస్య మార్గం లోపల రూపొం దించడం. మానవదేహం సూక్ష్మమైన ఒక విశ్వం గనక, అందులో మానవ దేహంలోని సారమంతా చేర్చి, అది ఒక చిన్న ప్రపంచాన్ని తయారుచేస్తుంది. అయితే అది పూర్తిగా ఉపయోగించుకొనలేని ఒక సౌకర్యం మాత్రమే.

చీ మున్ సిద్ధాంతపు ఆధ్యాత్మిక సాధనలో రహస్యమార్గం తెరుచుకొని ఉంటుంది. రహస్యమార్గం బయటకు పొడుచుకొని వచ్చినప్పుడు గుండ్రని

స్తంభాకారంలో బయటకు వస్తుంది, కానీ క్రమంగా గుండ్రంగా తయారవుతుంది. ఆ కారణంగా దాని తలుపులు రెండువైపులా తెరుచుకొని ఉంటాయి. చీ మున్ సిద్ధాంతం బుద్ధునిగానీ, తావోనుగానీ సాధన చెయ్యదు కాబట్టి, ఒక వ్యక్తి తననుతానే రక్షించుకోవాలి. బుద్ధ సిద్ధాంతంలోనైనా, తావో సిద్ధాంతంలోనైనా చాలామంది గురువులు ఉన్నారు, అందరూ మిమ్మల్ని కాపాడుతూ ఉంటారు. మీరు విషయాలను చూడవలసిన అవసరం లేదు, మీకు ఎటువంటి సమస్యలు కూడా రావు. కానీ చీ మున్ సిద్ధాంతంలో అలా ఉండదు ఎందుకంటే ఎవరిని వారే రక్షించుకోవాలి. అందువల్ల ఒక వ్యక్తి వస్తువులను చూసే శక్తిని నిలుపుకోవాలి. ఆ సమయంలో, ఒక వ్యక్తి యొక్క దివ్యనేత్రం దూరదర్శన యంత్రంలా పనిచేస్తుంది. ఈ వ్యవస్థ రూపొందిన తరవాత సుమారు ఒక నెలరోజులకు హెచ్చుతగ్గుగా అది లోపలకు తిరిగి వెళ్తుంది. తలలోనికి తిరిగి వెళ్ళిపోయిన తరవాత రహస్య మార్గం స్థానాలు మారడమని అంటారు.

రహస్యమార్గం లోపలికి తిరిగి వెళ్ళిన తరవాత, ఆ వ్యక్తికి తన తల వాచినట్లుగా, ఇబ్బందిగా అనిపిస్తుంది. అప్పుడు అది అతడి యూఝున్ (12) బిందువు నించి బయటకు దూరి వస్తుంది. ఇది కూడా అతడికి ఇబ్బందిగా అనిపిస్తుంది, అతడి తల రెండు ముక్కలుగా విచ్చిపోయినట్లుగా అనిపిస్తుంది. రహస్యమార్గం ఒక్క ఉదుటున బయటకు వచ్చేస్తుంది, అప్పుడు అతడికి ఉన్నట్లుండి సాంత్వన కలుగుతుంది. బయటకు వచ్చిన తరవాత ఆ రహస్య మార్గం చాలా లోతైన ఒక పరిమాణంలో వ్రేలాడుతుంది, ఆ పరిమాణంలోని శరీరం రూపంలో ఉంటుంది. అందువల్ల ఆ వ్యక్తి నిద్రలో దానికి ఒత్తుకోవడం జరగదు. కానీ ఒక సంగతి ఉంది: మొదటిసారి రహస్య మార్గం స్థానం ఏర్పరచుకున్నప్పుడు ఆ వ్యక్తికి కళ్ళ ముందు ఏదో ఉన్నట్లు అనిపిస్తుంది. అది వేరే పరిమాణంలో ఉన్నా, ఆ వ్యక్తికి ఎప్పుడూ కళ్ళను ఏదో మూసివేసినట్లు మసకలు కమ్ముతాయి, అతడికి చాలా అసౌకర్యం కలుగుతుంది. యూఝున్ బిందువు కూడా ఒక ముఖ్యమైన మార్గం గనక తల వెనక భాగంలో కూడా రహస్యమార్గం ఒక వస్తువుల వ్యవస్థను ఏర్పాటు చేయవలసిన అవసరం ఉంది. తరవాత అది ఆ వ్యక్తి శరీరంలోకి తిరిగి వెళ్తుంది. ఒక రహస్యమైన దారి అన్నది నిజానికి రహస్య మార్గం స్థానాన్ని సూచించదు ఎందుకంటే అది

పలుమార్లు స్థానం మార్చుకోవలసి ఉంటుంది. అది నివాన్‌కు చేరినప్పుడు, అది మింగ్ మెన్ బిందువుకు చేరేవరకు క్రిందకు దిగుతూ ఉంటుంది. మింగ్ మెన్ బిందువు (13) దగ్గర అది మళ్ళీ బయటకు వస్తుంది.

మానవ దేహంలోని మింగ్ మెన్ బిందువు అత్యంత ప్రధానమూ, ప్రత్యేకమూ అయిన బిందువు. తావో సిద్ధాంతంలో "ద్వారం" అని, మేము "మార్గం" (గువాన్) అని చెప్తాము. అది ఇనుప ద్వారాన్ని పోలి ఉండే ఒక ప్రధాన మార్గం, దానిలో అసంఖ్యాకమైన ఇనుప పొరల వంటి ద్వారాలు ఉంటాయి. ఒక మానవ దేహంలో చాలా పొరలుంటాయన్న సంగతి తెలిసినదే. మన భౌతిక కణాలు ఒక పొర అయితే, లోపల ఉన్న పరమాణు సమూహాలది మరొక పొర. అణువులు, ప్రోటాన్లు, ఎలెక్ట్రాన్లు, అతిసూక్ష్మమైన రేణువులు, లెక్కకు అందనంతటి సూక్ష్మరేణువుల నించి అంతకంటే సూక్ష్మాతిసూక్ష్మ రేణువుల యొక్క ప్రతి పొర దగ్గర ఒక ద్వారం అమరి ఉంటుంది. అందువల్ల భిన్నమైన పొరల దగ్గరున్న ద్వారాల లోపల అనేక అతీంద్రియ శక్తులు, అనేక ప్రత్యేక శక్తులు బంధింపబడి ఉన్నాయి. ఇతర అభ్యాసాలు దాన్‌ను సాధన చేస్తాయి. దాన్ విస్ఫోటనం చెందే సమయానికి ముందుగా మింగ్ మెన్ బిందువు పేలుడుతో తెరవబడాలి. అలా తెరవబడక పోతే ఆ అతీంద్రియ శక్తులు విడుదల కాలేవు. రహస్య మార్గం మింగ్ మెన్ బిందువు దగ్గర ఒక వ్యవస్థను ఏర్పాటు చేసిన తరవాత అది శరీరంలోనికి తిరిగి వెళ్తుంది. తరవాత అది పొత్తికడుపు ప్రదేశానికి తిరిగి చేరుతుంది. దీన్ని "రహస్య మార్గం స్థానానికి తిరిగి చేరడం" అంటారు.

తిరిగి వచ్చాక, రహస్య మార్గం తన స్వస్థానానికి వెళ్ళదు. ఈ సమయానికి అమృత శిశువు చాలా పెద్దగా ఎదిగి ఉంటుంది. ఆ గాలిబుడగ అమృత శిశువును పూర్తిగా కప్పి ఉంచేలా మూసి ఉంటుంది. అమృత శిశువు ఎదుగుతున్న కొద్దీ రహస్యమార్గం తదనుగుణంగా పెరుగుతుంది. తావో సిద్ధాంతం ప్రకారం సాధారణంగా అమృత శిశువు ఆరు, ఏడు సంవత్సరాల బిడ్డగా ఎదిగిన తరవాత, అది ఒక వ్యక్తి శరీరాన్ని విడిచి వెళ్ళడానికి అనుమతి లభిస్తుంది; దీనిని "అమృత శిశువు జన్మించడం" అంటారు. ప్రాథమిక ఆత్మ నియంత్రణలో అది ఆ వ్యక్తి శరీరం బయట తిరగగలుగుతుంది. ఆ వ్యక్తి

భౌతికశరీరం కదలదు, అతడి ప్రాథమిక ఆత్మ బయటకు వస్తుంది. సాధారణంగా బుద్ధ సిద్ధాంతంలో అమృత శిశువు ఆ వ్యక్తి అంత పెద్దగా అయ్యేంత వరకు సాధన జరిగితే తరవాత దానికి ఎటువంటి ప్రమాదం ఉండదు. ఆ సమయంలో సాధారణంగా అది శరీరాన్ని విడిచి బయటికి రావడానికి అనుమతి ఉంటుంది. అప్పటికి ఆ స్త్రీ లేదా పురుషునిలోని అమృత శిశువు వారున్నంత పెద్దగా ఎదిగి ఉంటుంది, దాని పైన ఉన్న ముసుగు కూడా పెద్దగా ఉంటుంది. ఆ ముసుగు లేదా కప్పు అప్పటికే ఆ వ్యక్తి శరీరం బయటకు వ్యాకోచం చెంది ఉంటుంది – అదే రహస్యమార్గం. అమృత శిశువు అంత పెద్దదిగా పెరగడం వల్లనే రహస్యమార్గం ఖచ్చితంగా శరీరం బయటకు వ్యాకోచించి ఉంటుంది.

మీరు మందిరాలలో బుద్ధ ప్రతిమలు చూసి ఉంటారు, బుద్ధులు ఎప్పుడూ ఒక వలయం లోపల ఉన్నట్లు గమనించి ఉంటారు. ప్రత్యేకంగా బుద్ధుని చిత్రాలలో ఎప్పుడూ ఒక వలయం ఉంటుంది, బుద్ధుడు అందులో కూర్చొని ఉంటాడు. బుద్ధుని చిత్రాలలో చాలావరకు అలాగే ఉంటాయి, ముఖ్యంగా ప్రాచీన మందిరాలలో అన్నీ అలాగే ఉంటాయి. బుద్ధుడు ఒక వలయంలో ఎందుకు కూర్చొని ఉంటాడు? దీనిని ఎవరూ స్పష్టంగా వివరించలేరు. అది అద్భుత మార్గం అని నేను చెప్తున్నాను, కానీ ఆ సమయంలో దాన్ని రహస్యమార్గం అని ఎంతమాత్రమూ అనడం లేదు. అది కేవలం ఒక సౌకర్యమేగానీ ఇంకా నిజంగా స్వర్గం కాకపోయినా, దాన్ని ఒక "స్వర్గం" అంటున్నారు. అన్ని సౌకర్యాలున్న కర్మాగారంలో, ఉత్పత్తి సామర్థ్యం లేని విధంగా అది ఉంటుంది. అది ఉత్పత్తి ప్రారంభించాలంటే, ఇంధన వనరులు, ముడిసరుకులు ఉండాలి. కొన్ని సంవత్సరాలకు పూర్వం, చాలా మంది సాధకులు: "నా గోంగ్ స్థాయి బోధిసత్త్వుని గోంగ్ స్థాయి కంటే ఎత్తుగా ఉంది" అని, "నా గోంగ్ స్థాయి బుద్ధుని గోంగ్ స్థాయి కన్నా ఎత్తుగా ఉంది" అన్నారు. అది విన్నవారు నమ్మశక్యంగా లేదనుకుంటారు. నిజానికి వారు చెప్పినది ఊహాతీతం కానే కాదు, ఎందుకంటే, ఈ మానవ ప్రపంచంలో మీరు ఉన్నప్పుడు మీ గోంగ్‌ను ఆధ్యాత్మిక సాధనతో, అత్యున్నత స్థాయికి పెంచుకోవాలి అన్న విషయం సత్యం.

ఇది ఎలా సాధ్యం: వారు బుద్ధుని కంటే ఎక్కువ స్థాయిని ఎలా సాధించారు? పైపైన చూసినప్పుడు అది అర్థం చేసుకోలేరు. అటువంటి వ్యక్తి యొక్క గోంగ్ నిజంగానే అత్యున్నత స్థాయిలో ఉంది. అలా ఎందుకంటే అతడి ఆధ్యాత్మిక సాధన అత్యున్నత స్థాయికి చేరుకున్నప్పుడు సంపూర్ణ జ్ఞానోదయం కలిగే క్షణాన, అతడి గోంగ్ స్థాయి నిజంగానే అత్యున్నతంగా ఉంటుంది. సంపూర్ణ జ్ఞానోదయానికి కొన్ని లిప్తల కాలం ముందు, అతడి గోంగ్‌లో పదింట ఎనిమిది వంతుల గోంగ్ అతడి యొక్క షిన్ షిన్ ప్రమాణంతోపాటు గ్రహించబడి, ఆ శక్తి అతడి స్వర్గం – అతడి యొక్క స్వంత స్వర్గాన్ని దృఢం చేయడానికి వినియోగింపబడుతుంది. ఒక సాధకుడి గోంగ్‌ను సాధన చేయడానికి ఈ షిన్ షిన్ ప్రమాణంతోపాటు జీవితకాలమంతా సహించే అసంఖ్యాకమైన కష్టాలను, చుట్టూ ఉన్న బాధలను భరించడం కూడా తోడవుతుంది. అందువల్ల ఇది అతివిలువైనది. ఈ విలువైన ద్రవ్యరాశిలో పదింట ఎనిమిదివంతులు స్వర్గాన్ని దృఢపరచడానికి ఉపయోగించబడుతుంది. అందువల్ల అతడు భవిష్యత్తులో ఆధ్యాత్మిక సాధనలో సఫలుడైనప్పుడు, కేవలం చేతులు చాపినంత మాత్రానే తాను కోరినదల్లా పొందుతాడు, ఏది కోరితే అది లభిస్తుంది. అతడు కోరినదల్లా చెయ్యగలుగుతాడు, అతడి స్వర్గంలో అన్నీ ఉన్నాయి. తన బాధలను సహించడంవల్ల అతడు పొందే గొప్ప పుణ్యం అది.

ఈ వ్యక్తి యొక్క శక్తి ఏ విధంగానైనా పరివర్తన చెందుతుంది. అందువల్ల ఒక బుద్ధుడు ఏదైనా కావాలని కోరినా, ఏదైనా తినాలనుకున్నా లేదా దేనితోనైనా ఆడుకోవాలనుకున్నా అతడు చెయ్యగలడు. అవన్నీ అతడు తన స్వంత సాధనతో సాధించుకున్నవే, అదే బుద్ధుని స్థితి (ఫోవీ). అది లేకుండా అతడు ఆధ్యాత్మిక సాధనలో విజయం సాధించలేడు. అప్పటికి దాన్ని ఆ వ్యక్తి యొక్క స్వంత స్వర్గం అని చెప్పొచ్చు. ఈ వ్యక్తికి ఆధ్యాత్మిక సాధన సంపూర్ణం చేసుకొని తావో పొందడానికి పదింట రెండువంతుల గోంగ్ మాత్రమే మిగిలి ఉంటుంది. కేవలం రెండువంతులే మిగిలి ఉన్నా అతడి శరీరం బంధింపబడి లేదు. అతడు ఈ శరీరాన్ని విడిచివెయ్యనూ వచ్చు, ఉంచుకోనూ వచ్చు, కానీ అప్పటికే ఈ శరీరం ఉన్నత శక్తి పదార్థంతో పరివర్తన చెంది ఉంటుంది. ఆ సమయంలో సాటిలేని బలసంపన్నమైన తన దివ్యశక్తులను ఉపయోగించుకోవచ్చు. కానీ

ఒక వ్యక్తి సామాన్య మానవుల నడుమ ఆధ్యాత్మిక సాధన చేస్తున్నప్పుడు, సాధారణంగా అతడి ప్రధాన సామర్థ్యాలు లేకుండా, అతడు బంధింపబడి ఉంటాడు. అతడి గోంగ్ స్థాయి ఎంత ఎత్తున ఉన్నా, అతడు నిర్బంధింపబడి ఉంటాడు. ఇప్పుడు అది భిన్నంగా ఉంటుంది.

* * * *

**అర్థములు:**

1. ఆహ్ క్యూ – ఒక చైనీయ నవలలోని అవివేకి పాత్ర.
2. మహ్ జోంగ్ – నలుగురు మనుషులు ఆడే సాంప్రదాయక చైనీయుల ఆట.
3. తై యు ఎన్ – షాన్ జీ రాష్ట్ర రాజధాని.
4. చ్యన్ మున్ – బీజింగ్‌లోని ప్రముఖ వ్యాపార ప్రాంతాలలో ఒకటి.
5. హాన్ – చైనీయులలో అత్యధిక సంఖ్యాకుల తెగ.
6. లామా – టిబెట్ బౌద్ధ సంప్రదాయంలో గురువుకు ఇచ్చే బిరుదు.
7. మో డింగ్– కొందరు చీ గోంగ్ గురువులు చెప్పిన ప్రకారం ఒక వ్యక్తికి శక్తిని ఇవ్వడానికి తల పైన చేతితో తాకడం.
8. షింగ్ మింగ్ గ్విజి – ఆధ్యాత్మిక సాధన గురించిన చైనీయ సాంప్రదాయక గ్రంథం.
9. త్యన్ – "క్షేత్రం".
10. హ్వే యీన్ – జననేంద్రియమునకు దగ్గరగా ఉన్న ఆక్యుపంక్చర్ బిందువు.
11. టాన్ జోంగ్ బిందువు – హృదయానికి ఇంచుమించు మధ్యభాగంలో ఉన్న ఆక్యుపంక్చర్ బిందువు.
12. యూ ఝున్ బిందువు – ముచ్చిన గుంట భాగంలో ఉన్న ఆక్యుపంక్చర్ బిందువు.
13. మింగ్ మెన్ బిందువు – "ప్రాణ ద్వారం" నడుము క్రింది భాగపు మధ్యనున్న ఆక్యుపంక్చర్ బిందువు.

* * * *

# ఐదవ ఉపన్యాసము

## ఫాలున్ చిహ్నం

మా ఫాలున్ దాఫా యొక్క చిహ్నం ఫాలున్. అతీంద్రియ శక్తులు కలిగినవారు ఇది గుండ్రంగా తిరుగుతున్నట్లు చూడగలుగుతారు. గుండ్రంగా తిరుగుతూ ఉండే మా బ్యాడ్జిలు కూడా ఇలాగే కనిపిస్తాయి. మా ఆధ్యాత్మిక సాధన సత్యం–దయ–సహనం అన్న విశ్వలక్షణం చేతనూ, విశ్వ పరిణామ నియమాల మార్గదర్శకత్వంలోనూ నడుస్తున్నది. అందువల్ల మేము సాధన చేసేది మహత్తరమైనట్టి విషయం. ఒక రకంగా చూస్తే, ఈ ఫాలున్ చిహ్నం విశ్వానికి సూక్ష్మ రూపం. బుద్ధ సిద్ధాంతం విశ్వాన్ని దశదిశలు, నాలుగు ముఖాలు, ఎనిమిది దిక్కుల ప్రపంచంగా భావన చేస్తుంది. బహుశా కొంతమంది ఫాలున్‌కు పైన, క్రింద నిలువుగా ఉన్న శక్తి స్తంభాన్ని చూడగలరు. ఫాలున్ పైన, క్రింద ఉన్న వాటితోసహా, సరిగ్గా దశదిశల ప్రపంచాన్ని స్ఫురింపజేసి ఈ విశ్వాన్ని ఏర్పరుస్తుంది. అది బుద్ధ సిద్ధాంతం సంగ్రహపరచిన విశ్వాన్ని వర్ణిస్తుంది.

ఈ విశ్వం మన పాలపుంతతో సహా అసంఖ్యాకమైన నక్షత్ర సమూహాలను కలిగి ఉంటుంది. యావత్ విశ్వం కదులుతూ ఉంటుంది, దానితోపాటు అందులో ఉన్న నక్షత్ర సమూహాలు కూడా కదులుతూ ఉంటాయి. అందువల్ల, ఈ చిహ్నంలో ఉన్న తాయిజీ గుర్తులూ, చిన్న శ్రీవత్స గుర్తులు కూడా తిరుగుతూ ఉంటాయి. ఆ ఫాలున్ మొత్తం తిరుగుతూ ఉంటుంది, దానికి మధ్యలో ఉన్న పెద్ద శ్రీవత్స గుర్తు కూడా తిరుగుతూ ఉంటుంది. ఒక రకంగా అది మన పాలపుంతకు సాదృశ్యంగా ఉంటుంది. మనం బుద్ధ సిద్ధాంతానికి చెంది ఉండడంవల్ల, మధ్యభాగం బుద్ధ సిద్ధాంతపు గుర్తును నిలుపుకొని ఉంటుంది; దాని ఉపరితలం అలా కనిపిస్తుంది. అన్ని భిన్న పదార్థాలు ఇతర

పరిమాణాలలో తమ రూపాలు కలిగి ఉన్నాయి, ఆ పదార్థాలకు దృఢమైన, అతిక్లిష్టమైన వికాస ప్రక్రియలూ, రూపాలూ ఉన్నాయి. ఈ ఫాలున్ చిహ్నం విశ్వానికి సూక్ష్మరూపం. దానికి అన్ని ఇతర పరిమాణాలలో తనదైన రూపమూ, వికాస ప్రక్రియ ఉన్నాయి, కాబట్టి నేను దానిని ఒక ప్రపంచం అంటాను.

ఫాలున్ సవ్య దిశలో తిరుగుతున్నప్పుడు, తనంతటతానే విశ్వంనించి శక్తిని గ్రహించగలదు. అపసవ్య దిశలో తిరుగుతున్నప్పుడు, అది శక్తిని విడుదల చెయ్యగలదు. లోపలి వైపుకు (సవ్య దిశ) తిరిగినప్పుడు స్వయం ముక్తిని ప్రసాదిస్తుంది. బయటి వైపుకు (అపసవ్య దిశ) తిరిగినప్పుడు ఇతరులకు ముక్తిని ప్రసాదిస్తుంది – ఇది మన సాధనలోని ఒక లక్షణం. కొంతమంది “మనం బుద్ధ సిద్ధాంతానికి చెందినవారం కదా? తాయిజీ కూడా ఎందుకుంది? అది తావో సిద్ధాంతానికి సంబంధించినది కదూ?” అని అడిగారు. ఎందుకంటే మనం సాధన చేసేది మహత్తరమైనది, అది యావత్ విశ్వమును సాధన చేస్తున్నట్లే అవుతుంది. అటువంటప్పుడు అందరూ దాని గురించి ఆలోచించండి: ఈ విశ్వం రెండు ప్రధాన సిద్ధాంతాలను కలిగి ఉంది, అవి బుద్ధ, తావో సిద్ధాంతాలు. వాటిలో ఏ ఒక్కదాన్ని వదిలివేసినా అది సంపూర్ణ విశ్వం అవదు, దాన్ని సంపూర్ణ విశ్వం అని చెప్పనూ లేము. ఫలితంగా మేము తావో సిద్ధాంతంలోని విషయాలను కలిపాం. కొందరు, తావో సిద్ధాంతంతోపాటు క్రైస్తవమతం, కన్ఫ్యూషియస్ మతం, ఇతర మతాలు మొదలైనవి ఉన్నాయని కూడా చెప్పారు. కన్ఫ్యూషియస్ మతంలో ఆధ్యాత్మిక సాధన అత్యున్నతస్థాయికి చేరిన తరవాత అది తావో మతానికి చెందుతుంది; అనేక పాశ్చాత్య మతాలలోని ఆధ్యాత్మిక సాధనలు ఉన్నతస్థాయిలకు చేరినప్పుడు, అవి మన బుద్ధ సిద్ధాంతంతో సమానమైన పద్ధతికి చెందినట్లే వర్గీకరింపబడతాయి. అటువంటి ప్రధాన సిద్ధాంతాలు రెండే ఉన్నాయి.

అటువంటప్పుడు తాయిజీ ఆకృతులలో రెండిటికి పైన ఎరుపు, క్రింద నీలం రంగులు, తక్కిన రెండు ఆకృతులకు పైన ఎరుపు, క్రింద నలుపు రంగులు ఎందుకు ఉంటాయి? మేము సాధారణంగా అర్థం చేసుకున్నది

ఏమిటంటే, తాయిజీ యిన్ యాంగ్‌ల యొక్క నల్లని, తెల్లని రంగుల చీని కలిగిన రెండు పదార్థాలతో తయారై ఉంటుంది. ఆ భావన ఒక అతితక్కువ స్థాయినించి వస్తుంది, ఎందుకంటే భిన్న పరిమాణాలలో తాయిజీ యొక్క భిన్నరూపాలు వ్యక్తమవుతాయి. అత్యంత ఉన్నతస్థాయిలో దాని రంగులు ఈ రకంగా వ్యక్తమవుతాయి. మనం సాధారణంగా అర్థం చేసుకునే తావోకి పైన ఎరుపు క్రింద నలుపు రంగులుంటాయి. ఉదాహరణకు, మన సాధకులలో దివ్యనేత్రం తెరుచుకొని ఉన్న కొందరి కళ్ళకు ఎర్రగా కనిపించినది ఒక్క స్థాయికి ఆవలి పరిమాణంలో ఆకుపచ్చ రంగులో ఉంది. ఇక్కడ బంగారు రంగుగా కనిపించినది అక్కడి విలోమస్థితి కారణంగా ఊదారంగుగా కనిపిస్తుంది. మరొక రకంగా చెప్పాలంటే, ఒక పరిమాణానికి, మరొక పరిమాణానికి రంగులు మారిపోతూ ఉంటాయి. పైన ఎరుపు, క్రింద నీలమూ కలిగిన తాయిజీ మహా ప్రాథమిక – తావో సిద్ధాంతానికి సంబంధించినది, దానిలో చీ మున్ ఆధ్యాత్మిక సాధనలు కూడా కలిసి ఉంటాయి. నాలుగు చిన్న శ్రీవత్స గుర్తులు బుద్ధ సిద్ధాంతానికి చెందినవి. అవి మధ్యలోనున్న పెద్ద గుర్తు వంటివే, అది కూడా బుద్ధ సిద్ధాంతంనించి వచ్చినదే. ఈ రంగులలో ఉన్న ఫాలున్ మిగిలిన వాటికన్నా ప్రకాశవంతంగా ఉంటుంది, దాన్ని మేము ఫాలున్ దాఫాకు చిహ్నంగా ఉపయోగిస్తాం.

దివ్యనేత్రం ద్వారా మనం చూసే ఫాలున్ తప్పనిసరిగా ఇవే రంగులలో ఉండవలసిన అవసరమేమీ లేదు. ఎందుకంటే, నేపథ్యపు రంగు మారుతూ ఉండొచ్చు కానీ దాని ఆకృతిలో మాత్రం మార్పు ఉండదు. మీ పొత్తికడుపులో నేను నెలకొల్పిన ఫాలున్ తిరుగుతున్నప్పుడు, మీ దివ్యనేత్రానికి అది ఎరుపు, ఊదా, ఆకుపచ్చ లేదా ఒకసారి వర్ణరహితంగా కనిపించవచ్చు. దాని నేపథ్యపు రంగు ఎరుపు, నారింజ, పసుపు, ఆకుపచ్చ, ఆకాశ నీలం, నీలం, ఊదా అన్న క్రమంలో మారుతూ ఉండొచ్చు. ఫలితంగా, మీరు చూసేవి విభిన్న వర్ణాలు కావచ్చు కానీ శ్రీవత్స (1) గుర్తులు, తాయిజీ యొక్క రంగులు, ఆకృతి మాత్రం అలాగే ఉంటాయి. ఈ నేపథ్యపు రంగు అన్నిటికన్నా బాగున్నట్లు చూసి, మేము దీనిని వాడుకున్నాము. అతీంద్రియ శక్తులున్నవారు ఈ పరిమాణానికి అవతల అనేక విషయాలు చూడగలుగుతారు.

కొంతమంది "ఈ శ్రీవత్స గుర్తు హిట్లర్ వాడిన దానిలాగా ఉంది" అంటారు. ఈ గుర్తు దానంతట అది ఏ అర్థాన్ని ఇవ్వదని నేను మీకు చెప్తున్నాను. "ఈ అంచు ఈ వైపుకు ఒరిగి ఉంటే, అది హిట్లర్ వస్తువు" అని కొంతమంది అంటారు. ఇది అలా ఉండదు ఎందుకంటే రెండువైపులకు తిరుగుతుంది. మన మానవ సంఘం దీన్ని శాక్యముని కాలమైన 2500 సంవత్సరాలకు పూర్వం విస్తారంగా తెలుసుకుంది. రెండవ ప్రపంచయుద్ధ కాలానికి చెందిన హిట్లర్ వచ్చి కేవలం కొన్ని దశాబ్దాలు మాత్రమే అయింది. అతడు దానిని స్వంతం చేసుకున్నాడు గాని, అతడు ఉపయోగించిన రంగు మనం ఉపయోగించే రంగులకు భిన్నమైనది. అది నల్లగా ఉండి, పైకి కొనదేలి ఉండేది, నిలబెట్టిన స్థితిలో ఉండేది. నేను కేవలం ఈ ఫాలున్ యొక్క పైపై రూపం గురించే చెప్పినా దీని గురించి నేను చెప్పేది ఇంత మాత్రమే.

అయితే, మన బుద్ధ సిద్ధాంతంలో ఈ శ్రీవత్స గుర్తు దేనికి ప్రతీక? కొంతమంది అది సంపదను సూచిస్తుందంటారు. అది సామాన్య మానవులు చెప్పే అర్థం. శ్రీవత్స అన్నది ఒక బుద్ధుని స్థాయిని తెలుపుతుంది. అది కేవలం బుద్ధుని స్థాయిలో ఉంటుంది. ఒక బోధిసత్వునికో అర్హతునికో ఉండదు. అయితే పై హోదాలో ఉన్న బోధిసత్వులు, నలుగురు మహా బోధిసత్వులకు ఉంటుంది. ఈ మహా బోధిసత్వులు సాధారణ బుద్ధుల యొక్క స్థాయిని చాలాదూరం అధిగమించారని, ఒక తథాగతునికన్నా ఉన్నతంగా ఉన్నట్లు మేము తెలుసుకున్నాం. తథాగత స్థాయికి ఆవల అసంఖ్యాకంగా బుద్ధులు ఉన్నారు. ఒక తథాగతునికి కేవలం ఒక్క శ్రీవత్స చిహ్నమే ఉంటుంది. తథాగతస్థాయిని దాటినవారికి ఎక్కువ శ్రీవత్స చిహ్నాలుంటాయి. తథాగతునికి రెట్టింపు స్థాయిలో ఉన్న బుద్ధునికి రెండు శ్రీవత్స చిహ్నాలుంటాయి. అంతకంటే ఎక్కువ స్థాయి కలిగినవారికి మూడు, నాలుగు, ఐదు అలా అధికమవుతూనే ఉంటాయి. కొందరికి ఎన్ని శ్రీవత్సలు ఉంటాయంటే అవి వారి తలలు, భుజాలు, మోకాళ్ళతోసహా శరీరమంతటా ఉంటాయి. చాలా ఎక్కువ సంఖ్యలో ఉన్నప్పుడు అవి వారి అరచేతిలో, వేళ్ళ పైన, పాదాల క్రింది వంపులో, కాలి వేళ్ళ పైన కూడా ప్రత్యక్షమవుతాయి. ఒక వ్యక్తి స్థాయి పెరుగుతూనే ఉన్నప్పుడు, అతడికి అధికాధికంగా శ్రీవత్స చిహ్నాలు ఉంటాయి.

అందువల్ల, ఆ శ్రీవత్స చిహ్నం ఒక బుద్ధుని హోదాను తెలుపుతుంది. బుద్ధుని హోదా పెరిగినకొద్దీ, ఆ బుద్ధునికి శ్రీవత్స చిహ్నాలు పెరుగుతాయి.

## చీ మున్ (2) సిద్ధాంతం

బుద్ధ సిద్ధాంతం, తావో సిద్ధాంతానికి తోడుగా చీ మున్ ఆధ్యాత్మిక సాధన అని తనని తాను పిలుచుకునే చీ మున్ సిద్ధాంతం ఉంది. ఆధ్యాత్మిక సాధనా సిద్ధాంతాల విషయంలో సామాన్య వ్యక్తుల అభిప్రాయం ఈ క్రింది విధంగా ఉంది. ప్రాచీన చైనానించి ఇవాల్టిదాకా ప్రజలు బుద్ధ, తావో సిద్ధాంతాలను సంప్రదాయ సాధనామార్గాలుగా పరిగణించారు, వాటిని ధర్మబద్ధమైన ఆధ్యాత్మిక సాధనాసిద్ధాంతాలుగా కూడా పేర్కొన్నారు. ఈ చీ మున్ సిద్ధాంతం అన్నది ఎన్నడూ బయటకు రాలేదు, సాహిత్య రచనల ద్వారా తప్పించి, దాని గురించి తెలిసినవారు చాలా అరుదు.

చీ మున్ సిద్ధాంతం అనేది ఉందా? ఉంది. నా ఆధ్యాత్మిక సాధనా క్రమంలో, ప్రత్యేకించి ఆఖరి సంవత్సరాలలో చీ మున్ సిద్ధాంతానికి చెందిన, ఘన సిద్ధి పొందిన ముగ్గురు గురువులను కలుసుకోవడం తటస్థించింది. వారు అతి అద్వితీయమైనవి, చాలా మంచివి అయిన తమ సాధనలలోని సారాన్ని నాకు ప్రసాదించారు. అంతటి అద్వితీయమైనది కాబట్టి, అది సాధన చేసేది చాలా అసాధారణమూ, చాలామందికి అర్థం కూడా కానిది. దానికితోడు వారు తాము బుద్ధ సిద్ధాంతానికిగాని, తావో సిద్ధాంతానికిగాని చెందినవారం కామని చెప్పుకుంటారు. వారు బుద్ధత్వాన్నిగానీ, తావోనుగానీ సాధన చెయ్యరు. వారు బుద్ధత్వాన్ని, తావోను సాధన చెయ్యరని తెలిసిన తరవాత, ప్రజలు వారిది "పక్క తలుపు లేదా వికృత మార్గం" (పాంగ్‌మెన్ జుదావో) అంటారు. వారు తమకు తాము చీ మున్ సిద్ధాంతంగా పిలుచుకుంటారు. పక్క తలుపు, వికృతమార్గం అంటే చులకన చేసే అర్థం వస్తుంది, కానీ ఇక్కడ ఇది చెడ్డ అర్థంలో లేదు, ఎందుకంటే ఇది ఆ సిద్ధాంతాన్ని దుష్ట సాధన అని విమర్శించడం లేదు – అది సత్యం. ఆ పదం యొక్క భాషా నిర్వచనం కూడా అది దుష్ట సాధన అన్నట్లు ధ్వనించదు. చరిత్రలో బుద్ధ సిద్ధాంతం, తావో సిద్ధాంతమూ ఆధ్యాత్మిక సాధన యొక్క "సంప్రదాయ సిద్ధాంతాలు"గా

చెప్పబడ్డాయి, ప్రజలకు ఈ సాధన అర్థం కానప్పుడు దాన్ని "పక్క తలుపు" లేదా పక్కదారి అని, సంప్రదాయ విరుద్ధ సిద్ధాంతమని అన్నారు. "వికృత మార్గం" సంగతి ఏమిటి? ఇక్కడ వికృత అంటే మొరటుతనం లేదా చేతకాని తనం అని. ప్రాచీన చైనాలో ఉపయోగించిన పదం, తరచుగా మొరటుతనాన్ని సూచించడంకోసం ఉపయోగించబడేది. పక్క తలుపు, వికృత మార్గం అన్న దానికి ఈ విధమైన అర్థం వస్తుంది.

ఎందువలన ఇది ఒక దుష్ట సాధన కాదు? ఎందుకంటే అందులో కూడా ఖచ్చితమైన షిన్ షిన్ ఆవశ్యకతలు ఉన్నాయి. అందులోని ఆధ్యాత్మిక సాధన కూడా విశ్వ లక్షణాన్ని అనుసరిస్తుంది. అది విశ్వ లక్షణాన్ని గాని విశ్వ నియమాన్ని గానీ అతిక్రమించదు, దుష్కర్మలు చేయించదు. అందువల్ల దాన్ని దుష్ట సాధన అనలేము. బుద్ధ సిద్ధాంతమూ, తావో సిద్ధాంతమూ విశ్వ లక్షణానికి అనురూపంగా ఉండడంవల్ల సంప్రదాయబద్ధ సిద్ధాంతాలు కాలేదు, అవి విశ్వ లక్షణాన్ని పాటిస్తున్న కారణంగా సంప్రదాయబద్ధ సిద్ధాంతాలు అయ్యాయి. చీ మున్ సిద్ధాంత ఆధ్యాత్మిక సాధన విశ్వ లక్షణానికి అనురూపంగా ఉంటే, అది కూడా ఒక ధర్మబద్ధమైన సాధనయేగాని దుష్ట సాధన కాదు. మంచి చెడులకు, ఉపకార బుద్ధికి, పాపానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వేరుచేసి చూపేది విశ్వ లక్షణం. దాని యొక్క సాధన విశ్వ లక్షణానికి కట్టుబడి ఉంటుంది, అందువల్ల అది కూడా ఒక ధర్మబద్ధమైన సాధనయే, దానిలో అవసరమైనవి బుద్ధ సిద్ధాంతంలో, తావో సిద్ధాంతంలో, అవసరమైన వాటికి భిన్నంగా ఉండడం అన్నది ఒక్కటే తేడా. అది ఎక్కువ మంది శిష్యులకు బోధించదు. చాలా కొద్దిమందికే బోధింపబడుతుంది. తావో సిద్ధాంతం అనేకమంది శిష్యులకు బోధింపబడుతుంది గానీ, అసలైన బోధన ఒక్క శిష్యునికి లభిస్తుంది. బుద్ధ సిద్ధాంతం అన్ని జీవులకు ముక్తి అన్నదాన్ని నమ్ముతుంది కాబట్టి ఆధ్యాత్మిక సాధన చెయ్యగలిగినవారందరూ దాన్ని చెయ్యొచ్చు.

చీ మున్ సిద్ధాంత సాధన చరిత్రలో చాలాకాలానికి ఒకసారి ఎంచుకున్న ఒక్క వ్యక్తికి మాత్రమే అందించబడే కారణాన, అది పారంపర్యంగా ఇద్దరికి లభించదు. అందువల్ల, చరిత్ర గమనంలో సామాన్య మానవులకు అది

కనిపించలేదు. అయితే, చీ గోంగ్ ప్రాచుర్యంలో ఉండగా, ఈ సిద్ధాంతంనించి వచ్చిన కొద్దిమంది కూడా బోధన చెయ్యడానికి బయటకు వచ్చారని నేను తెలుసుకున్నాను. కొంతకాలం జనులకు బోధించిన తరవాత, గురువు అందులోని కొంతభాగం బహిరంగంగా బోధించరాదని నిషేధించినందున, అది కుదరదని వారు గ్రహించారు. మీరు దాన్ని జనులకు బోధించాలనుకుంటే, మీరు శిష్యులను ఎన్నుకోలేరు. దాన్ని నేర్చుకోవడానికి వచ్చేవారు, భిన్న మనస్తత్వాలు కలిగి ఉన్న కారణాన, వారు వివిధ షిన్ షిన్ స్థాయిలతోనూ, మనస్తత్వాలతోనూ వస్తారు. మీరు బోధనకు శిష్యులను ఎన్నుకోలేకపోతారు. అందువల్ల చీ మున్ సిద్ధాంతం జనంలో విస్తారంగా బోధించడం కుదరదు. ఆ సాధన అద్వితీయమైనది కనక అలా చెయ్యడం ప్రమాదకారి అవుతుంది.

బుద్ధ సిద్ధాంతం బుద్ధత్వాన్ని, తావో సిద్ధాంతం తావోను సాధన చేస్తుండగా చీ మున్ సిద్ధాంత సాధకుడు సాధన పూర్తి చేసుకొన్న తరవాత ఏమవుతాడు? అని కొందరు ఆశ్చర్యపోతూ ఉంటారు. ఈ వ్యక్తి విశ్వంలో ఒక నిర్దిష్టమైన పరిధి అనేది లేకుండా తిరిగే దేవుడు అవుతాడు. తథాగత శాక్యమునికి సాహా స్వర్గం, అమితాభ బుద్ధునికి పరమానందపు స్వర్గం, వైద్య బుద్ధునికి మెరిసే స్వర్గం ఉన్నాయని, అందరికీ తెలుసు. ప్రతి తథాగతునికి, గొప్ప బుద్ధునికి తమ స్వంత స్వర్గం ఉంది. ప్రతి మహాజ్ఞాని అయిన స్త్రీ, పురుషులు తమ స్వంత స్వర్గాన్ని నిర్మించుకొని, తమతమ అనేక శిష్యులతో అక్కడ నివసిస్తారు. కానీ చీ మున్ సిద్ధాంతానికి చెందినవారికి విశ్వంలో తమదైన ఒక నిర్దిష్ట పరిధి ఉండదు, ఆ వ్యక్తి ఒక సంచార దేవుడిలాగా లేదా ఒంటరిగా ఉన్న అమరునిలాగా ఉంటాడు.

## దుష్ట సాధన చెయ్యడం

"దుష్ట సాధన చెయ్యడం" అంటే ఏమిటి? దానికి అనేక రూపాలున్నాయి. ప్రత్యేకంగా దుష్ట సాధనలను చేసేవారు కొందరున్నారు, ఎందుకంటే చరిత్ర అంతటా ఈ విషయాలను తరవాతి తరాలకు అందించేవారు ఉంటున్నారు. అవి ఎందుకు కొనసాగుతున్నాయి? ఎందుకంటే వారు సామాన్య మానవుల నడుమ కీర్తి, స్వలాభం, ధనం కోసం ప్రయత్నిస్తుంటారు; వారికి కావలసినవి

అవే. నిజానికి, అటువంటి వ్యక్తికి ఉన్నతస్థాయి షిన్ షిన్ ఉండదు, అతడు గోంగ్‌ను కూడా పొందలేడు. మరి అతడు ఏం పొందుతాడు? కర్మ. ఒక వ్యక్తికి చాలా అధికమైన కర్మ ఉంటే, అది కూడా ఒక విధమైన శక్తి అయ్యే అవకాశం ఉంది. కానీ అతడికి ఎటువంటి స్థాయి లేకపోవడంవల్ల, అతడిని ఒక సాధకునితో పోల్చడం కుదరదు. అయితే కర్మ కూడా శక్తికి ఒక రూపం కనక సామాన్య మానవులతో పోల్చినప్పుడు అతడు వారిని నిరోధించగలడు. కర్మ యొక్క సాంద్రత అధికమైనప్పుడు అది కూడా ఒక వ్యక్తిలోని అతీంద్రియ శక్తులను బలోపేతం చేసి అటువంటి ప్రభావాన్ని కలిగించగలుగుతుంది. అందువల్ల చరిత్ర అంతటా కొందరు దీనిని బోధించారు. అటువంటి వ్యక్తి: “నేను దుష్కర్మలు చేసీ, శాపాలు పెట్టి, నా గోంగ్‌ను పెంచుకోగలను” అని వాదిస్తాడు. అతడు గోంగ్‌ను పెంచుకోవడం లేదు. నిజానికి అతడు తన నల్లని పదార్థపు సాంద్రతను పెంచుకుంటున్నాడు ఎందుకంటే దుష్కర్మలు చెయ్యడం వల్ల నల్లని పదార్థం, కర్మ సంక్రమిస్తుంది. అందువల్ల అతడికి పుట్టుకతో వచ్చిన అల్పమైన అతీంద్రియ శక్తులు ఈ కర్మ వల్ల బలోపేత మవుతాయి. అతడు కొద్దిపాటి అతీంద్రియ శక్తులను అభివృద్ధి చేసుకో గలుగుతాడు, అవి చెప్పుకోదగినంతగా పనికి రావు. వారు చెప్పేదల్లా, దుష్కర్మలు చెయ్యడంవల్ల తాము కూడా గోంగ్‌ను పెంచుకోగలమనే విషయం.

కొందరు “ఒక తావో ఒక అడుగు ఎత్తు ఉంటే, ఒక అసురశక్తి ఒక గజం ఎత్తు ఉంటుంది” అంటారు. అది సామాన్య మానవులు చేసే ఒక అసత్య ప్రకటన. ఒక అసురశక్తి ఎప్పటికీ ఒక తావోకన్న ఎత్తుగా ఉండలేదు. ఒక నిజం ఏమిటంటే మానవులుగా మనకు తెలిసిన విశ్వం అసంఖ్యాకమైన విశ్వాలలోని ఒక అతిచిన్న విశ్వం, దాన్ని మనం సంక్షిప్తంగా విశ్వం అంటాం. మన విశ్వం అనేక వేల సంవత్సరాల కాలావధి దాటినప్పుడు, ఒక మహా ఉత్పాతానికి లోనవుతుంది, అది విశ్వంలోని అన్నిటిని, గ్రహాలు, జీవులతోసహా, నాశనం చేస్తుంది. విశ్వం యొక్క కదలిక ఒక నియమాన్ని అనుసరిస్తుంది. ఈనాటి మన విశ్వంలో కలుషితమైనది కేవలం మానవజాతి ఒకటే కాదు. ఎన్నో జీవులు, ఒక పరిస్థితిని గమనించాయి, ప్రస్తుత కాలం వరకు చూస్తే, చాలాకాలం క్రిందట విశ్వాంతరాళంలో ఒక పెద్ద విస్ఫోటనం సంభవించింది.

ఈనాటి ఖగోళ శాస్త్రజ్ఞులు దానిని పరిశీలించలేరు, ఎందుకంటే ఈనాడు అత్యంత శక్తివంతమైన దూరదర్శన యంత్రాల ద్వారా మనం చూడగలుగు తున్నవి లక్షాయాభై వేల కాంతి సంవత్సరాలకు పూర్వపు విషయాలు. ఈనాటి విశ్వం యొక్క రూపాన్ని చూడాలంటే, మనం లక్షాయాభై వేల సంవత్సరాలు గడిచేవరకు ఆగాలి. అది అతిదూరపు కాలం.

ప్రస్తుతం, యావత్ విశ్వం ఇప్పటికే గొప్ప మార్పుకు లోనయింది. అటువంటి మార్పు వచ్చినప్పుడల్లా విశ్వంలోని అన్ని జీవులు పూర్తిగా నశించిపోయి, శిథిలమై పడి ఉంటాయి. ఈ పరిస్థితి సంభవించినప్పుడల్లా అంతకు ముందుండిన విశ్వం యొక్క లక్షణమూ, దానిలో ఉన్న ద్రవ్యరాశి తప్పనిసరిగా విస్ఫోటన చెంది తీరాలి. ఆ ప్రేలుడుకు సాధారణంగా అన్ని జీవులూ నశించిపోతాయి. అయితే ప్రేలుడు జరిగిన ప్రతిసారీ, ప్రతిఒక్కరూ తుడిచిపెట్టబడకపోవచ్చు. అత్యున్నత స్థాయిలోని మహాజ్ఞానులచేత నూతన విశ్వం పునర్నిర్మింపబడినప్పుడు, ఆ ప్రేలుడును తప్పించుకొని కొందరు ఇంకా సజీవులై ఉంటారు. ఆ మహాజ్ఞానులు ఈ విశ్వాన్ని తమవైన స్వంత లక్షణాలు, ప్రమాణాలతో నిర్మిస్తారు. అందువల్ల దీనికి ముందటి విశ్వంలో ఉన్న లక్షణానికి భిన్నమైన లక్షణం ఉంటుంది.

ప్రేలుడు నించి తప్పించుకొని బ్రతికి బయటపడినవారు ముందటి విశ్వ లక్షణాన్ని, నియమాలను అనుసరించి ఈ విశ్వంలో పనిచేస్తారు. కొత్తగా నిర్మింపబడిన ఈ విశ్వం తన కార్యక్రమాలలో కొత్త లక్షణాలను, నియమాలను పాటిస్తుంది. ఆ రకంగా ఆ ప్రేలుడును తప్పించుకున్నవారు, కొత్త విశ్వంలోని నియమాలకు అంతరాయం కలిగించే అసురులు అవుతారు. అయితే, వారు కేవలం గతకాలపు విశ్వపు నియమాలకు లోబడి ఉన్నవారే తప్ప, మరీ దుష్టులు కాదు. వీరు జనులచేత దివ్య అసురులు అని పిలవబడతారు. ఏమైనా వారివల్ల సామాన్య మానవులకు ఎటువంటి భయమూ లేదు, వారు జనులకు ఏ విధమైన హాని చెయ్యరు కూడా. వారు కేవలం ఏదైనా చెయ్యడంలో తమ నియమాలకు బద్ధులై ఉంటారు. గతంలో ఈ విషయం సామాన్య మానవులు తెలుసుకోవడం నిషిద్ధం. తథాగత స్థాయికి అతీతులై అనేకమంది బుద్ధులు ఉన్నారని నేను చెప్పాను. ఆ అసురులు ఏపాటి చేస్తారు? వారితో పోల్చినప్పుడు

అత్యల్పులు. వృద్ధాప్యం, వ్యాధి, మరణం కూడా ఆసురీరూపాలే, కానీ అవి విశ్వ లక్షణాన్ని నిలపడానికి సృష్టింపబడ్డాయి.

బౌద్ధమతం సంసారచక్రాన్ని నమ్ముతుంది, అందులో అసురుల (3) అంశం ప్రస్తావించబడింది. అది భిన్న పరిమాణాలలోని జీవులను గురించి చెప్తుంది, కానీ వారిలో సహజసిద్ధమైన మానవ ప్రకృతి ఉండదు. ఒక మహాజ్ఞాని ఎదుట వారు అత్యల్పస్థాయిలో ఉంటారు, చాలా అశక్తులు. అయినా వారికి కొంత శక్తి ఉన్నందువలన సామాన్య మానవులు వారిని చూసి భయపడుతూ ఉంటారు. వారు సామాన్య మానవులను జంతువులుగా పరిగణించి, వారి మీద పడి తినడాన్ని ఆనందిస్తారు. ఇటీవలి సంవత్సరాలలో వారు కూడా చీ గోంగ్‌ను బోధించడానికి వచ్చారు. అవి ఏ రకమైన విషయాలు? వారు మనుషులలాగా ఎలా కనిపిస్తారు? వారు చాలా భయంకరంగా కనిపిస్తారు. మీరు ఒకసారి వారికి చెందిన విషయాలను నేర్చుకుంటే, మీరు వారితో వెళ్ళి, వారి జాతిలో కలసి పోవలసి వస్తుంది. చీ గోంగ్ అభ్యాసంలో, వారి మనస్తత్వాలకు తగిన చెడు తలపులు కలిగి ఉన్న వ్యక్తులుంటే, అటువంటి వ్యక్తులకు బోధించడానికి వారు వస్తారు. ఒక ధర్మబద్ధమైన మనసు వంద పాపాలను అణచివేయగలుగుతుంది. మీరు దేనికోసమైనా ప్రాకులాడకపోతే, మిమ్మల్ని ఇబ్బంది పెట్టడానికి ఎవరూ సాహసించరు. మీరు ఒకవేళ ఏదైనా దుష్ట భావన కలిగి ఉన్నా, ఏదైనా చెడ్డ విషయమై ప్రయత్నం చేస్తున్నా, వారు మీకు చేయూతనిస్తారు, దానితో మీరు ఒక అసుర మార్గానికి చెందిన ఆధ్యాత్మిక సాధనను అనుసరిస్తారు. ఈ సమస్య చోటుచేసుకోవచ్చు.

"తెలియకుండా దుష్ట మార్గపు సాధన చెయ్యడం" అన్న ఇంకొక పరిస్థితి ఉంది. తెలియకుండా దుష్ట మార్గపు సాధన చెయ్యడం అంటే అర్థం ఏమిటి? ఎవరైనా తాము దుష్ట మార్గంలో సాధన చేస్తున్నామని గ్రహించకుండా సాధన చెయ్యడం. ఈ సమస్య అతిసాధారణమూ, అతిగా వ్యాప్తి కూడా చెంది ఉన్నది. నేను ఒక రోజున చెప్పినట్లు, చాలామంది తమ మనసులలో దుష్ట భావనలు పెట్టుకొని చీ గోంగ్‌ను సాధన చేస్తుంటారు. నిలబడి చేసే వ్యాయామంలో అలసటతో కాళ్ళు, చేతులూ వణికిపోతున్నా, వారి మనసులు మాత్రం

ప్రశాంతంగా ఉండవు. ఒక వ్యక్తి : "ధరలు పెరిగిపోతున్నాయి. వ్యాయామం అయిన తరవాత నేను సరుకులు కొనడానికి వెళ్ళాలి. త్వరపడి వెళ్ళకపోతే అవి మరింత ప్రియం అవుతాయి" అని ఆలోచిస్తాడు. మరొక వ్యక్తి: "కార్యాలయంలో అపార్ట్‌మెంట్లు కేటాయిస్తున్నారు. నాకూ ఒకటి దొరుకుతుందా? ఆ కేటాయింపులు చేసే అధికారి ఎప్పుడూ నాతో గొడవ పడుతూనే ఉంటాడు" అని ఆలోచిస్తుంటాడు. ఆ విషయం ఆలోచించేకొద్దీ అతడిలో కోపం పెరిగిపోతూ ఉంటుంది. "నాకు అతడు ఒక అపార్ట్‌మెంట్‌ను ఖచ్చితంగా కేటాయించడు. అతడితో ఎలా పోట్లాడాలి...?" అని అన్ని రకాల ఆలోచనలు తలెత్తుతుంటాయి. నేను మొదటిలో చెప్పినట్లు, వారు ఇంటి సంగతులనించి దేశ వ్యవహారాలదాకా వ్యాఖ్యానిస్తుంటారు. అప్రియమైన విషయాలలో వారికి మరింత ఆగ్రహం కలుగుతుంది.

చీ గోంగ్ సాధనలో ఒక వ్యక్తి పుణ్యానికి విలువ ఇవ్వడం ఆవశ్యకం. వ్యాయామాలు చేస్తున్న సమయంలో మీరు మంచి విషయాల గురించి ఆలోచించకపోయినా, కనీసం చెడు విషయాల గురించి ఆలోచించకూడదు. ఏ విషయం గురించి ఆలోచించకపోవడం ఉత్తమం. ఎందుకంటే, క్రింది స్థాయి చీ గోంగ్ సాధనలో ఒక పునాది వేసుకోవలసిన అవసరం ఉంది. ఈ పునాది చాలా కీలకమైన పాత్ర వహిస్తుంది, ఎందుకంటే మానవుల మనో చర్యలకు చాలా ముఖ్య పాత్ర ఉంది. అందరూ ఇది ఆలోచించండి: మీరు మీ గోంగ్‌కు ఏమి జోడిస్తున్నారు? మీరు సాధన చేస్తున్నది మంచి ఎలా అవుతుంది? అది నలుపు కాకుండా ఎలా ఉంటుంది? చీ గోంగ్ సాధనలు చేసేవారిలో ఇటువంటి భావనలు లేనివారు ఎందరున్నారు? మీరు ఎప్పుడూ చీ గోంగ్ సాధన చేస్తూనే ఉన్నా మీ వ్యాధులు ఎందుకు పోలేదు? వ్యాయామ స్థలాలలో కొందరికి దుష్ట భావనలు లేకపోయినా, వారు ఎప్పుడూ అతీంద్రియ శక్తుల పట్లనో, ఏదో ఒక విషయానికై ప్రాకులాటకో విభిన్న మనస్తత్వాలకు, అనేక రకాల తీవ్రమైన వాంఛల పట్లనో బంధాన్ని పెంచుకొని ఉంటారు. నిజానికి వారు అప్పటికే తమకు తెలియకుండానే దుష్ట సాధన చేశారు. మీరు గనక ఆ స్త్రీ లేదా పురుషుడు దుష్ట మార్గపు సాధన చేస్తున్నారని చెప్తే వారు అసంతుష్టులవుతారు: "నేను ఒక పేరొందిన చీ గోంగ్ గురువు

వద్ద బోధనను పొందాను" అంటారు. కానీ ఆ పేరొందిన చీ గోంగ్ గురువు పుణ్యానికి విలువ ఇవ్వాలని మీకు చెప్పారు. మీరు అది ఆచరించారా? చీ గోంగ్ సాధనలో మీరు ఎప్పుడూ ఏవో దుష్ట భావనలతో ఉంటారు. ఇక మీరు ఆ సాధననించి మంచి విషయాలతో బయటకు వస్తానని ఎలా అనగలుగుతారు? ఇదీ సమస్య, ఇదే తెలియకుండానే దుష్టసాధన చెయ్యడం– అతిసాధారణంగా జరిగే విషయం.

## స్త్రీ పురుషుల జంట ఆధ్యాత్మిక సాధన

సాధకుల సమాజంలో, స్త్రీ పురుషులు కలిసి చేసే జంట ఆధ్యాత్మిక సాధన అన్న ఆధ్యాత్మిక సాధన ఉంది. మీరు టిబెట్ తాంత్రిక విద్యకు చెందిన ఆధ్యాత్మిక సాధనలలో ఒక బుద్ధుని యొక్క శిల్పంలో గానీ, చిత్రంలో గానీ ఒక పురుష రూపం ఒక స్త్రీ శరీరాన్ని పట్టుకొని ఆధ్యాత్మిక సాధనను చేస్తున్నట్లు బహుశా మీరు చూసే ఉండవచ్చు. ఆ పురుష రూపం కొన్నిసార్లు ఒక బుద్ధునిలా కనిపించవచ్చు, అతడు ఒక నగ్న స్త్రీని పట్టుకొని ఉంటాడు. కొన్నిటిలో బుద్ధుని మారురూపాల వంటివి ఆవు తల, గుర్రపు ముఖం కలిగిన వజ్ర రూపంతో, ఒక నగ్న స్త్రీని పట్టుకొని ఉన్నట్లు ఉంటాయి. ఇలా ఎందు కుంటుంది? మేము ముందుగా మీ అందరికీ ఇది వివరిస్తాము. మన గ్రహం మీద కన్ఫ్యూషియస్ మత ప్రభావానికి గురైనది కేవలం చైనా ఒక్కటే కాదు. కొన్ని శతాబ్దాలకు పూర్వం మన మానవజాతికంతటికీ ఒకే విధమైన నైతిక విలువలు ఉండేవి. అందువల్ల, ఈ ఆధ్యాత్మిక సాధన నిజానికి మన గ్రహానికి చెందినది కాదు. ఇది మరొక గ్రహంనించి వచ్చినది, అయితే అది ఒక వ్యక్తికి నిజంగా ఆధ్యాత్మిక సాధనను చేసే శక్తినిస్తుంది. ఆ కాలంలో చైనాలో ఇది ప్రవేశించినప్పుడు, క్లుప్తంగా చెప్పాలంటే, అందులో ఉన్న స్త్రీ పురుషులు కలిసి ఆధ్యాత్మిక సాధన చేస్తున్న కారణంగానూ, రహస్య సాధనల కారణంగానూ, చైనీయులకు ఆమోదయోగ్యం కాలేదు. అందువల్ల, టాంగ్ వంశీయుల హ్యూచాంగ్ కాలంలో చక్రవర్తి హాన్స్ ప్రాంతంలో దానిని నిషేధించారు. హాన్స్ ప్రాంతంలో దానిని బోధించడం నిషేధించబడింది, ఆ కాలంలో దానిని టాంగ్ తాంత్రికవిద్య అని పిలిచేవారు. అయితే ఒక ప్రత్యేక ప్రాంతమైన టిబెట్‌లో

ఉండిన ఒకానొక అద్వితీయ వాతావరణంలో అది కొనసాగింది. ఈ విధమైన ఆధ్యాత్మిక సాధన ఎందుకు చేస్తారు? స్త్రీ పురుషులు కలిసి చేసే జంట సాధన యొక్క ఉద్దేశం ఏమిటంటే యిన్, యాంగ్‌లను ఒకదానికి ఒకటి పరస్పర పూరకంగా కూడబెట్టి పరస్పర ఆధ్యాత్మిక సాధన కోసం పరిపూర్తి చెయ్యడమూ, ఆ విధంగా యిన్ యాంగ్‌ల మధ్య సమతుల్యత సాధించడమనే లక్ష్యానికి చేరుకునే శక్తినివ్వడం.

బుద్ధ సిద్ధాంతం, తావో సిద్ధాంతం రెండింటి ప్రకారం, ప్రత్యేకించి తావో సిద్ధాంతంలోని యిన్ యాంగ్ సిద్ధాంతాన్ని అనుసరించి ఒక మానవ దేహంలో యిన్, యాంగ్ స్వతహాగా ఉంటాయి. అలా రెండూ కలిసి ఉన్న కారణంగా అది ఆధ్యాత్మిక సాధన ద్వారా, వివిధ అతీంద్రియ శక్తులనూ, అమృత శిశువు, సాధనా శిశువులనూ, ఫాషెన్‌లు మొదలైన జీవులను అభివృద్ధి చెయ్యగలుగుతుంది. మానవదేహంలో యిన్ యాంగ్‌లు కలిసి ఉన్న కారణంగా అది స్త్రీ పురుష దేహాలన్న వ్యత్యాసం లేకుండా, ఒక వ్యక్తి ఆధ్యాత్మిక సాధన ద్వారా అనేక జీవులను అభివృద్ధి చేసుకోగలరు, అవి దాన్ త్యన్‌లో పెరగడం జరుగుతుంది – ఇద్దరి విషయంలో ఒకేలాగ జరుగుతుంది. ఇది నిజంగా అర్థవంతమైన వాదం. తావో సిద్ధాంతం ఒక వ్యక్తి శరీరపు పైభాగం యాంగ్‌గానూ, క్రిందిభాగం యిన్‌గానూ పరిగణిస్తుంది. కొంత మంది, శరీరపు వెనుకభాగాన్ని యాంగ్‌గానూ, ముందుభాగాన్ని యిన్‌గానూ పరిగణిస్తారు. ఇతరులు శరీరంలోని ఎడమవైపు భాగాన్ని యాంగ్‌గానూ, కుడిభాగాన్ని యిన్‌గానూ పరిగణిస్తారు. మనకు చైనాలో, శరీరంలోని ఎడమ భాగాన్ని పురుషునిగానూ, కుడిభాగాన్ని స్త్రీగానూ చెప్పుకునే సామెత ఉంది, అది కూడా చాలా వివేకవంతమైన కారణాల వలన సృష్టించబడినది. ఒక మానవ శరీరంలో సహజంగానే యిన్, యాంగ్‌లు ఉన్న కారణంగా ఆ రెండింటి పరస్పర చర్యల వల్ల శరీరం తనంతట తానే యిన్ యాంగ్‌ల సమతుల్యతను సాధించుకుంటుంది; ఆ రకంగా అది అనేక జీవులకు జన్మనిస్తుంది.

అప్పుడు ఇది ఒక అంశాన్ని స్పష్టపరుస్తుంది: ఒక స్త్రీ, ఒక పురుషుల జంట ఆధ్యాత్మిక సాధన అన్న పద్ధతి పాటించకుండా కూడా మనం ఆధ్యాత్మిక

సాధనలో ఒక అత్యున్నత స్థాయిని చేరుకోగలం. స్త్రీ పురుషుల జంట సాధన పద్ధతి పాటించినప్పుడు, అది సరిగా చెయ్యని పక్షంలో ఆ వ్యక్తి పిశాచాల జోక్యం కొని తెచ్చిపెట్టుకుంటాడు, అది ఒక దుష్ట సాధన అవుతుంది. తంత్ర శాస్త్రంలోని అత్యున్నత స్థాయిలో స్త్రీ పురుషుల జంట ఆధ్యాత్మిక సాధన ఉపయోగించవలసి వస్తే, ఆ సన్యాసి లేదా లామా ఆధ్యాత్మిక సాధనలో అత్యున్నత స్థాయిని చేరుకొని ఉండాలి. ఆ సమయంలో గురువు ఒక వ్యక్తికి ఈ రకమైన ఆధ్యాత్మిక సాధనలో సరియైన మార్గం చూపించగలరు. ఈ వ్యక్తి యొక్క షిన్ షిన్ స్థాయి చాలా ఉన్నతంగా ఉన్నందువల్ల అతడు చెడుగా మారకుండా తననుతాను సరిగ్గా నియంత్రించుకోగలుగుతాడు. కానీ తక్కువ షిన్ షిన్ స్థాయి కలిగిన వ్యక్తి ఈ పద్ధతిని ఎంతమాత్రమూ అనుసరించ కూడదు. లేకపోతే అతడు ఒక దుష్ట సాధనను అనుసరించే అవకాశం ఉంది. పరిమితమైన షిన్ షిన్ స్థాయి వల్లనూ, అతడు సామాన్య మానవుల కోరికలనూ, దేహ వాంఛలను వదలివెయ్యనందువల్లనూ, అతడి యొక్క షిన్ షిన్ స్థాయికి కొలబద్ద అక్కడ ఉన్నందువల్ల, దానిని ఉపయోగిస్తే అది దుష్ట సాధనగా మారే అవకాశం ఉంది. అందువల్ల, క్రింది స్థాయిలో అలక్ష్యంగా దీనిని ఎక్కువ ప్రచారం చేసినట్లైతే, అది ఒక దుష్ట సాధనను బోధించినట్లే అవుతుంది.

ఇటీవలి సంవత్సరాలలో చాలా కొద్ది మంది చీ గోంగ్ గురువులు స్త్రీ పురుషుల జంట ఆధ్యాత్మిక సాధనను బోధిస్తున్నారు. అందులో విపరీతం ఏం ఉంది? తావో సిద్ధాంతపు సాధనలలో కూడా జంట ఆధ్యాత్మిక సాధన కనిపిస్తున్నది. పైగా, అది టాంగ్ వంశం నాడే మొదలయిందే కానీ ఇవాళ మొదలైనది కాదు. తావో సిద్ధాంతంలో స్త్రీ పురుషుల జంట ఆధ్యాత్మిక సాధన ఎందుకుంది? తావో సిద్ధాంతంలోని తాయిజీ వాదం ప్రకారం మానవ దేహం యిన్, యాంగ్‌లను స్వతహాగా కలిగి ఉన్న ఒక సూక్ష్మ విశ్వం. అన్ని అసలైన, గొప్ప నీతివంతమైన బోధనలు అతిపూర్వకాలంనించి అందించ బడుతున్నాయి. ఏ విధమైన యథాలాప సవరణ గానీ, అలక్ష్యంగా దేనినైనా కలపడంవల్లగానీ, ఆ ప్రత్యేక సాధనా సిద్ధాంతాన్ని కలుషితం చేసి, ఆధ్యాత్మిక సాధనను సంపూర్ణం చేసుకునే లక్ష్యసాధనను అసాధ్యం చేస్తుంది. కాబట్టి

మీ సాధనలో స్త్రీ పురుషుల జంట ఆధ్యాత్మిక సాధన లేకపోతే, మీరు ఆధ్యాత్మిక సాధనలో దానిని చేయనే కూడదు. లేకపోతే, మీరు పొరపాట్లు చేసి, సమస్యలలో చిక్కుకుంటారు. ప్రత్యేకంగా మన ఫాలున్ దాఫా సిద్ధాంతంలో స్త్రీ పురుషుల జంట ఆధ్యాత్మిక సాధన లేదు, మాకు దాని అవసరం కూడా లేదు. ఈ అంశాన్ని మేము ఈ విధంగా చూస్తాం.

## మనశ్శరీరాల ఆధ్యాత్మిక సాధన

మనశ్శరీరాల ఆధ్యాత్మిక సాధన అన్న అంశం గురించి మీకు ఇది వరకే వివరించడం జరిగింది, మనశ్శరీరాల ఆధ్యాత్మిక సాధన అంటే ఒక వ్యక్తి శరీర సాధన జరుగుతున్న సమయంలోనే షిన్ షిన్ సాధనను కూడా చెయ్యడం. ఇంకొక రకంగా చెప్పాలంటే, బెంటి పరివర్తన చెందుతున్నది. ఆ పరివర్తన ప్రక్రియలో మానవ జీవకణాలు అత్యంత శక్తి పదార్థంతో మార్చబడతాయి, వయసు పెరుగుదల అతినిదానంగా జరుగుతుంది. ఆ వ్యక్తి శరీరం యవ్వనానికి తిరిగి మళ్ళుతున్నట్లు కనిపించి క్రమంగా పరివర్తనానుభవం పొంది, చివరకు పూర్తిగా అత్యంత శక్తి పదార్థంతో నింపబడుతుంది. అప్పటికి అతడి శరీరం మరొక రకమైన పదార్థంతో మార్చబడిన శరీరంగా ఉంటుంది. ఆ శరీరం, నేను ముందు చెప్పినట్లుగా ఐదు మూలపదార్థాలను అధిగమించి ఉంటుంది. అది ఐదు మూలపదార్థాలకు పరిమితమై ఉండకపోవడంవల్ల, ఈ వ్యక్తి శరీరం తరవాత క్షీణత నొందదు.

మతాలలోని ఆధ్యాత్మిక సాధనలో కేవలం మనోసాధన అన్నదే ఉంటుంది, అందువల్ల అది వ్యాయామాలనుగానీ శరీర సాధననుగానీ బోధించదు. అక్కడ నిర్వాణ అవసరం, ఎందుకంటే శాక్యముని బోధించిన పద్ధతిలో నిర్వాణ అవసరం. నిజానికి, శాక్యమునికి తనదైన గొప్ప పద్ధతి, అత్యున్నతస్థాయి ధర్మం ఉండేది, ఆయన తన బెంటిని పూర్తిగా అత్యంత శక్తి పదార్థంతో మార్చివేసి, దాన్ని తనతో తీసుకొనివెళ్ళగలిగారు. ఈ ఆధ్యాత్మిక సాధనాపద్ధతిని ప్రజలకు అందించడానికి ఆయన నిర్వాణపథాన్ని స్వీకరించారు. ఆయన ఈ విధంగా ఎందుకు బోధించారు? ప్రజలు తమ బంధాలను, ప్రతిదాన్ని త్యజించాలని, చివరికి తమ భౌతికదేహాలతో సహా అన్ని బంధాలను

వదిలివేయాలనే ఆయన అలా చేశారు. ప్రజలు ఈ విషయంలో సాధ్యమైనంత ఎక్కువగా సాధించాలని, ఆయన నిర్వాణపథాన్ని స్వీకరించారు. అందువల్ల చరిత్ర అంతటా బౌద్ధ భిక్షువులు అందరూ నిర్వాణపథాన్నే స్వీకరించారు. నిర్వాణమంటే, ఒక భిక్షువు మరణానంతరం తన భౌతికకాయాన్ని వదిలివేస్తాడు, అతడి ప్రాథమిక ఆత్మ అతడి గోంగ్‌తో సహా పైకి వెళ్తుంది.

తావో సిద్ధాంతం శారీరకంగా దీర్ఘ జీవిత సాధన గురించి నొక్కిచెప్తుంది. అది శిష్యులను ఎంచుకోవడమే తప్ప, అన్ని జీవులకూ ముక్తినివ్వడం గురించి చెప్పదు. అందులో, అత్యున్నత స్థాయి శిష్యులున్నారు. అందువల్ల అది దీర్ఘ జీవితం కోసం సాధన చేసే తంత్రాలూ, దాన్ని గురించిన విషయాలు మాత్రమే బోధిస్తుంది. కానీ, బుద్ధ సిద్ధాంతానికి చెందిన ఈ ప్రత్యేక ఆధ్యాత్మిక సాధనలో, ప్రత్యేకించి బౌద్ధమతంలో వీటిని బోధించరు. అలా అని బుద్ధ సిద్ధాంతానికి చెందిన అన్ని సాధనలలో దీనిని బోధించరని అర్థం కాదు. బుద్ధ సిద్ధాంతంలోని అనేక అత్యున్నత స్థాయి సాధనలలో కూడా దీన్ని బోధిస్తారు. మా సాధన దీన్ని బోధిస్తుంది. మా ఫాలున్ దాఫాలో బెంటి, అమృత శిశువూ రెండూ అవసరమే; ఇవి రెండూ భిన్నమైనవి. అమృత శిశువు కూడా ఉన్నత శక్తి పదార్థంతోనే తయారవుతుంది, కానీ అది మన ఈ పరిమాణంలో అలక్ష్యంగా చూపించకూడదు. ఈ పరిమాణంలో సుదీర్ఘకాలం ఒక సామాన్య వ్యక్తి రూపాన్ని కలిగి ఉండడానికి, తప్పనిసరిగా మనకు మన బెంటి అవసరం. అందువల్ల, ఈ బెంటి పరివర్తన జరిగిన తరవాత అందులోని జీవకణాలు అత్యున్నత శక్తి పదార్థంతో మార్చబడినా దాని పరమాణు సమూహాల సమ్మేళనాలు మాత్రం మారవు. ఆ విధంగా ఆ శరీరానికి ఒక సామాన్య వ్యక్తి శరీరానికి ఎక్కువ వ్యత్యాసం కనపడదు. అయినా, ఒక వ్యత్యాసం ఉంటుంది: ఏమిటంటే, ఈ శరీరం ఇతర పరిమాణాలలో ప్రవేశించగలుగుతుంది.

మనశ్శరీరాలు రెండిటి ఆధ్యాత్మిక సాధన చేసే సాధనలు ఒక వ్యక్తి రూపాన్ని యవ్వనవంతంగా కనపడేలా చేస్తాయి, అతడు తన అసలు వయసు కంటే చాలా భిన్నంగా కనపడతాడు. ఒక రోజున ఒకామె "టీచర్, మీరు నా వయసు ఎంతని భావిస్తున్నారు?" అని అడిగింది. నిజానికి ఆమె వయసు డెబ్భై

ఏళ్ళకు దగ్గరవుతున్నది కానీ చూడడానికి కేవలం నలభై దాటినట్లుంది. ఆమె ముఖంలో ముడతలు ఏ మాత్రమూ లేవు, గులాబీ వర్ణంతో చక్కని మెరుపుతో ఉన్నది. ఆమె డెబ్భై ఏళ్ళకు దగ్గరవుతున్నట్లు కనిపించనే లేదు. మా ఫాలున్ దాఫా సాధకులకు ఇలా జరుగుతుంది. ఒక నవ్వించే విషయం చెప్తాను, యువతులు ఎప్పుడూ తమ ముఖం వన్నెలీనుతూ మెరుగవుతూ ఉండేందుకు అలంకరణ చేసుకోవడానికి ఇష్టపడుతూ ఉంటారు. మీరు గనక నిజంగా మనశ్శరీరాల ఆధ్యాత్మిక సాధన చేస్తే మీరు ఆ లక్ష్యాన్ని సహజంగానే సాధించ గలరని నేను చెప్తాను. మీకు సౌందర్య సాధనాల అవసరం ఉండదని నేను ఖచ్చితంగా చెప్తాను. మేము ఇటువంటి ఉదాహరణలు ఎక్కువ ఇవ్వం. గతంలో వివిధ వృత్తులలో ఉన్న సహవాసులు నాకన్నా వయసులో పెద్దవారు గనక నన్ను ఒక యువకుడిగా పరిగణించేవారు. ఇప్పుడు విషయాలు మెరుగు పడుతున్నాయి, ప్రతి వృత్తిలోనూ ఎక్కువగా యువకులు ఉంటున్నారు. నిజానికి ఇప్పుడు నేను యువకుడిని కాను. నేను యాభై ఏళ్ళకు చేరువ అవుతున్నాను, ఎందుకంటే నాకిప్పుడు నలభై మూడేళ్ళు.

## ఫా షెన్

ఒక బుద్ధ విగ్రహం చుట్టూ ఒక క్షేత్రం ఎందుకుంటుంది? చాలామంది దీనిని వివరించలేరు. కొంతమంది "భిక్షువులు అక్కడ గ్రంథాలను పఠిస్తూ ఉండడం వల్ల బుద్ధ విగ్రహం చుట్టూ ఒక క్షేత్రం ఉంటుంది" అంటారు. మరొక రకంగా చెప్పాలంటే, భిక్షువులు దాని ఎదుట ఆధ్యాత్మిక సాధన చేయడంవల్ల వస్తుంది. భిక్షువులో ఇతరులో ఎవరి ఆధ్యాత్మిక సాధనవల్ల కలిగినదైనా ఆ శక్తి అన్ని దిక్కులకూ వెదజల్లబడాలి కానీ ఒకే దిశగా ఉండ కూడదు. ఆ మందిరంలో నేల, పై కప్పు, ఆ గోడలు మొత్తంగా అదే క్షేత్రాన్ని కలిగి ఉండాలి. అయితే, బుద్ధుని విగ్రహం దగ్గర క్షేత్రం మాత్రమే ఎందుకు అంత శక్తివంతమై ఉండాలి? ప్రత్యేకించి, ఎక్కడో నిర్జనమైన ఒక కొండలో, ఒక గుహలోని ఒక రాతి మీద ఉన్న బుద్ధ విగ్రహానికి సాధారణంగా ఒక క్షేత్రం ఉంటుంది. అక్కడ ఆ క్షేత్రం అలా ఎందుకుంటుంది? కొంతమంది ఏదో ఒక రకమైన వివరణ ఇచ్చినా స్పష్టంగా వివరించలేకపోయారు. నిజానికి ఒక బుద్ధ విగ్రహానికి

ఒక మహాజ్ఞాని యొక్క ఫాషెన్ ఉన్నందువల్ల ఒక క్షేత్రం ఉంటుంది. ఆ మహాజ్ఞాని ఫాషెన్ అక్కడ ఉన్నందువల్ల, దానికి శక్తి ఉంటుంది.

శాక్యముని గానీ, అవలోకితేశ్వర బోధిసత్త్వ (4) గానీ, వారిద్దరిలో ఎవరైనా చరిత్రలో నిజంగా ఉండి ఉంటే – అందరూ ఇది ఆలోచించండి – తాము ఆధ్యాత్మిక సాధన సాగించిన సమయంలో వారు కూడా సాధకులే కదా? ఒక స్త్రీ, లేదా పురుషుడు త్రిలోకాతీత ఆధ్యాత్మిక సాధనలోని అత్యున్నత స్థాయిలో సాధన చేసేటప్పుడు, వారు ఫాషెన్‌ను అభివృద్ధి చేసుకుంటారు. ఫాషెన్ అన్నది ఆ వ్యక్తి యొక్క ఫాతోనూ, గోంగ్‌తోనూ తయారై వారి దాన్ త్యన్‌లో పుడుతుంది. అది ఇతర పరిమాణాలలో వ్యక్తమవుతుంది. ఆ వ్యక్తికి ఉండే బలంలోని అధికభాగం ఫాషెన్‌కు ఉంటుంది కానీ దాని మనసు, ఆలోచనలు ఆ వ్యక్తి చేత నియంత్రింపబడుతూ ఉంటాయి. అయినా ఫాషెన్ తనంతటతానే, ఒక సంపూర్ణ, స్వతంత్రత, నిజమైన వ్యక్తిత్వమున్న జీవి. అందువల్ల అది స్వతంత్రంగా ఏమైనా చెయ్యగలదు. ఫాషెన్ చేసేదీ సరిగ్గా ఆ వ్యక్తి యొక్క ప్రాథమిక చైతన్యం చెయ్యాలని సంకల్పించుకున్నది ఒక్కటిగా ఉంటుంది. ఒక వ్యక్తి ఒక పనిని ఏ నిర్దిష్టమైన పద్ధతిలో చేస్తాడో, ఆ స్త్రీ లేదా పురుషుని ఫాషెన్ అదే పద్ధతిలో చేస్తుంది, ఇదీ మేము చెప్పేటటువంటి ఫాషెన్. నిజమైన సాధకుల శరీరాలను సరిచెయ్యడం వలె, నేను చెయ్యాలనుకున్న పనులను నా ఫాషెన్ చెయ్యగలదు. ఫాషెన్‌కు సామాన్య మానవుల వంటి శరీరం ఉండదు కాబట్టి అది తననుతాను ఇతర పరిమాణాలలో వ్యక్తపరచుకోగలదు. ఫాషెన్‌ది మార్పు చెందక స్థిరంగా ఉండే శరీరం కాదు; అలాకాక అది పెద్దదిగానీ, చిన్నదిగానీ అవ్వగలదు. కొన్నిసార్లు అది ఎంత పెద్దది కాగలదంటే, ఒక వ్యక్తి దాని మొత్తం తలను చూడలేడు. కొన్నిసార్లు అది అతిచిన్నగా, ఒక కణం కంటే చిన్నదిగా అయిపోగలదు.

## ప్రాణ ప్రతిష్ట

ఒక కర్మాగారంలో తయారైన బుద్ధ విగ్రహం కేవలం ఒక కళాకృతి మాత్రమే. "ప్రాణ ప్రతిష్ట" అంటే, ఆ బుద్ధుని ఫాషెన్‌ను బుద్ధ విగ్రహంలోనికి ఆవాహన చెయ్యడానికి ఉద్దేశింపబడినది. అప్పటినించి అది సామాన్య వ్యక్తుల చేత ఒక

వాస్తవ శరీరంగా పూజింపబడుతుంది. ఆధ్యాత్మిక సాధనలో ఒక సాధకుడికి తన హృదయంలో ఈ విధమైన గౌరవం ఉంటే, ఆ బుద్ధ విగ్రహంపై ఉన్న ఫాషెన్ ఆ వ్యక్తి యొక్క ధర్మాన్ని పరిరక్షిస్తూ, ఆ స్త్రీ లేదా పురుషుని కాపాడుతూ ఉంటుంది. ప్రాణ ప్రతిష్ట యొక్క అసలైన ఉద్దేశ్యం అదే. ఇది ఆ సాంప్రదాయకమైన ప్రాణ ప్రతిష్ట ఉత్సవంలో, అత్యున్నత స్థాయిలో ఉన్న ఒక మహాజ్ఞాని సహాయంతోగానీ, ఆ శక్తి గలిగిన అత్యున్నత ఆధ్యాత్మిక సాధన చేసిన సాధకుని సహాయంతోగానీ, ధర్మబద్ధమైన తలపులతో మాత్రమే జరుగుతుంది.

ఒక మందిరంలోని బుద్ధ విగ్రహానికి తప్పనిసరిగా ఈ ప్రాణ ప్రతిష్ట చెయ్యడం అవసరం, అలా చెయ్యనప్పుడు ఆ బుద్ధ విగ్రహంవల్ల ఏ ప్రయోజనమూ ఉండదని జనులు అంటారు. ఈనాడు మందిరాలలో ఆ భిక్షువులు – ఆ అసలైన పరమగురువులు – అందరూ నిష్క్రమించారు. మహా సాంస్కృతిక విప్లవం జరిగిన తరవాత, ఏ విధమైన అసలైన బోధనలూ పొందని క్రింది స్థాయి భిక్షువులు ఇప్పుడు మఠాధిపతులు అయ్యారు. అనేకమైన విషయాలు అందజేయబడలేదు. వారిలో ఎవరినైనా మీరు "ప్రాణ ప్రతిష్ట ఎందుకు చేస్తారు" అని అడిగితే, అతడు "ప్రాణ ప్రతిష్ట చేసిన తరవాత బుద్ధ విగ్రహం పని చేయడం ప్రారంభిస్తుంది" అని చెప్తాడు. అతడు దాని ప్రత్యేక ప్రయోజనం ఏమిటో స్పష్టంగా వివరించలేడుగానీ ఆ ఉత్సవం మాత్రం జరిపిస్తాడు. అతడు ఆ బుద్ధ విగ్రహంలో ఒక బౌద్ధమత గ్రంథాన్ని ఉంచుతాడు. తరవాత ఆ విగ్రహాన్ని కాగితంతో మూసివేసి దాని ఎదుట ఆ గ్రంథ పారాయణం చేస్తాడు. దీన్ని అతడు ప్రాణ ప్రతిష్ట అంటాడు కానీ ఆ లక్ష్యం నెరవేరుతుందా? అది అతడు ఆ గ్రంథ పారాయణాన్ని ఎలా చేశాడనే విషయం మీద ఆధారపడి ఉంటుంది. ఒక వ్యక్తి ధర్మబద్ధమైన మనసుతోనూ, నిశ్చలమైన శ్రద్ధతోనూ తన ఆధ్యాత్మిక సాధనా స్వర్గాన్ని కుదిపివేసే విధంగా ఆ గ్రంథ పారాయణ చెయ్యాలని శాక్యముని తెలిపారు. అప్పుడు మాత్రమే ఒక మహాజ్ఞానిని ఆవాహన చేయగలుగుతాడు. ఆ మహాజ్ఞాని యొక్క ఫాషెన్‌లలో ఒకటి ఆ బుద్ధ విగ్రహం మీదకు ఆవాహన అయినప్పుడు ప్రాణ ప్రతిష్ట చేసే లక్ష్యం నెరవేరుతుంది.

అక్కడ కూర్చొని గ్రంథ పారాయణ చేసే భిక్షువులలో కొందరు తమ మనసులలో "ప్రాణ ప్రతిష్ఠ తరవాత, నాకు ఎంత డబ్బు ఇస్తారో?" అని ఆలోచిస్తూ ఉంటారు. లేదా ఆ గ్రంథ పారాయణ చేస్తూ "ఆ ఫలానా వ్యక్తి నన్ను అవమానిస్తాడు" అని ఒక వ్యక్తి ఆలోచిస్తాడు. వారిలో కూడా వ్యక్తిగత ఘర్షణలు ఉంటాయి. ప్రస్తుతం ధర్మం అంతరించే కాలం నడుస్తున్నది. ఈ పరిస్థితి ఉందన్న మాటను తోసిపుచ్చలేం. ఇక్కడ మేము బౌద్ధమతాన్ని విమర్శించడం లేదు. ధర్మం అంతరిస్తున్న ఈ కాలంలో కొన్ని మందిరాలలో ప్రశాంతత లేదు. ఒక వ్యక్తి మనసు ఈ విషయాలతో నిండిపోయి ఇటువంటి చెడు తలపులు బయటపడుతున్నప్పుడు ఆ మహాజ్ఞాని ఎలా వస్తారు? అటు వంటప్పుడు ఏమైనాగానీ, ప్రాణ ప్రతిష్ఠ యొక్క లక్ష్యం నెరవేరదు. అయితే ఇది ప్రతిచోట జరుగుతుందని చెప్పలేం, ఎందుకంటే ఈనాటికీ చక్కగా నడిచే కొన్ని మందిరాలు, తావో మతానికి చెందిన మఠాలు ఉన్నాయి.

ఒక నగరంలో అతినల్లని చేతులు కలిగి ఉన్న ఒక భిక్షువును నేను చూశాను. అతడు ఒక బుద్ధ ప్రతిమ లోపల ఒక గ్రంథాన్ని పెట్టి నిర్లక్ష్యంగా దాన్ని మూసివేశాడు. అతడు కొన్ని పదాలను గొణిగిన తరవాత ఆ ప్రాణ ప్రతిష్ఠా కార్యక్రమము పూర్తయింది. తరవాత అతడు మరొక బుద్ధ ప్రతిమను తెచ్చి మళ్ళీ కొన్ని పదాలు గొణిగాడు. అతడు ప్రతిసారి ఈ కార్యక్రమం చేసి నందుకు నలభై యువాన్లను తీసుకున్నాడు. ఈనాడు భిక్షువులు ప్రాణ ప్రతిష్ఠ ప్రక్రియను వ్యాపారంగా చేసి ధనార్జన చేస్తున్నారు. ఇది చూసిన తరవాత అతడు సరిగ్గా చేయలేకపోయినందున ప్రాణ ప్రతిష్ఠ యొక్క లక్ష్యం నెరవేరలేదని నేను గ్రహించాను. ఈనాడు భిక్షువులు ఇటువంటి పనులు కూడా చేస్తున్నారు. నేను ఇంకా ఏం చూశాను? ఒక సామాన్య బౌద్ధుడు ఒక మందిరంలోని బుద్ధ ప్రతిమకు ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నాడు. అతడు ఆ బుద్ధ ప్రతిమ మీద సూర్యరశ్మి ప్రతిబింబించేటట్లు ఒక అద్దాన్ని పట్టుకున్నాడు. తరవాత ప్రాణ ప్రతిష్ఠ జరిగిపోయిందని ప్రకటించాడు. ఇది ఎంత ఎగతాళి అయింది! ఈనాడు బౌద్ధమతం ఈ స్థితికి చేరింది, ఇది ఒక సాధారణ దృశ్యం అయింది.

నాన్ జింగ్ (5) లో ఒక పెద్ద బుద్ధ విగ్రహం తయారుచేయబడింది,

దాన్ని హాంగ్‌కాంగ్‌లోని లాన్ టాప్ ద్వీపంలో పెట్టారు. అది అతిపెద్ద బుద్ధ విగ్రహం. ప్రపంచంలోని అన్ని మూలలనించి ఎందరో భిక్షువులు ఆ ప్రాణ ప్రతిష్టా కార్యక్రమానికి వచ్చారు. వారిలో ఒక భిక్షువు ఆ బుద్ధ ప్రతిమ ముఖం పైకి సూర్యరశ్మి ప్రతిబింబించేలాగ ఒక అద్దం పట్టుకొని ప్రాణ ప్రతిష్ట జరిగిపోయిందని ప్రకటించారు. ఒక పవిత్రమైన మహోత్సవంలో కూడా అటువంటి పని జరగగలదు! నాకు అది అతిశోచనీయంగా అనిపిస్తుంది. "ధర్మం అంతరించే కాలంలో ఇతరులకు ముక్తి ప్రసాదించడం అటుంచి భిక్షువులకు తమనుతాము రక్షించుకోవడమే కష్టమవుతుంది" అని శాక్యముని అనడంలో వింతేమీ లేదు. దీనికితోడు, భిక్షువులు గ్రంథాలను తమ స్వంత దృష్టికోణంనించి వ్యాఖ్యానాలు చేస్తారు. లేడీ క్వీన్ మదర్ అన్న గ్రంథం కూడా మందిరాలలో ప్రవేశించింది. సంప్రదాయ బౌద్ధమత గ్రంథాలు కానివి కూడా మందిరాలలో ప్రవేశించాయి, వాటి ప్రభావంతో ఇప్పుడు అక్కడి వాతావరణం గందరగోళం, కలుషితం అయింది. అయితే అసలైన ఆధ్యాత్మిక సాధన చేస్తూ మంచివారైన భిక్షువులు ఇప్పటికీ ఉన్నారు. నిజానికి, ప్రాణ ప్రతిష్ట అంటే ఒక మహాజ్ఞాని యొక్క ఫాషెన్ బుద్ధ ప్రతిమ పైకి వచ్చి ఉండాలని ఆవాహన చెయ్యడం. ఇదే ప్రాణ ప్రతిష్ట.

కాబట్టి ఒక బుద్ధ ప్రతిమకు సక్రమంగా ప్రాణ ప్రతిష్ట జరగకుండా దానిని పూజించకూడదు. అలా పూజిస్తే తీవ్ర పరిణామాలు సంభవిస్తాయి. ఆ తీవ్ర పరిణామాలేమిటి? ఈనాడు మానవ దేహం గురించి అధ్యయనం చేసేవారు మన మానవుల మనోచర్యలు, మానవుల ఆలోచనలూ, ఒక పదార్థాన్ని ఉత్పత్తి చెయ్యగలవని కనిపెట్టారు. ఒక అత్యున్నత స్థాయిలో, అది ఒక పదార్థమని మేము కనుగొన్నాం గానీ, ఈ పదార్థం ఈనాటి పరిశోధన లలో కనిపెట్టినట్లు మెదడు యొక్క తరంగాల రూపంలో లేదు. మారుగా, అది ఒక సంపూర్ణ మానవ మస్తిష్క రూపంలో ఉంది. అదే విధంగా ఒక సామాన్య వ్యక్తి ఒక విషయాన్ని గురించి ఆలోచించినప్పుడు ఆ స్త్రీ లేదా పురుషుడు ఉత్పత్తి చేసేది మెదడు రూపంలో ఉంటుంది. దానిలో శక్తి లేని కారణంగా కొద్దిసేపటి తరవాత అది చెదిరిపోతుంది. మరొకవైపు, ఒక సాధకుని శక్తి చాలాసేపు నిలిచి ఉంటుంది. అంటే ఈ బుద్ధ ప్రతిమ

కర్మాగారంలో తయారైన తర్వాత దానికి మనసు ఉంటుందని చెప్పడం కాదు. దానికి ఉండదు. కొన్ని బుద్ధ ప్రతిమలకు ప్రాణ ప్రతిష్ట అన్న ప్రక్రియ జరగలేదు, వాటిని మందిరాలకు తీసుకొని వెళ్ళిన తరవాత ప్రాణ ప్రతిష్ట లక్ష్యం నెరవేరనూ లేదు. ఒకవేళ ఆ ప్రక్రియ ఏ మోసపు చీ గోంగ్ గురువు లేదా దుష్ట సాధనకు చెందిన వ్యక్తి చేసినట్లైతే అది మరింత ప్రమాదకరం, ఎందుకంటే ఒక నక్క లేదా వీజెల్ ఆ బుద్ధ ప్రతిమలోనికి దూరిపోగలదు.

ఒక బుద్ధ ప్రతిమను సరైన విధంగా ప్రాణ ప్రతిష్ట ప్రక్రియ జరగ కుండానే మీరు పూజిస్తే, అది అతిప్రమాదకరం అవుతుంది. ఎంత ప్రమాద కరం అవుతుంది? నేను ముందు చెప్పినట్లు మానవజాతి పరిణామక్రమంలో ఈనాటికి ప్రతి విషయమూ క్షీణించిపోతున్నది. మొత్తం సమాజమూ, యావత్ విశ్వంలోని ప్రతి విషయమూ ఒకదాని వెంట ఒకటిగా కలుషితం అవు తున్నాయి. సామాన్య మానవుల విషయంలో జరుగుతున్నవన్నీ, స్వయంకృతాలే. అనేక కారణాలవల్ల కలుగుతున్న అంతరాయాలవల్ల, ఒక ధర్మబద్ధమైన మార్గం దొరకడమూ, ఒక ధర్మబద్ధమైన మార్గాన్ని అనుసరించడమూ అతికష్టంగా ఉంది. ఒక వ్యక్తి బుద్ధుడిని ప్రార్థించాలని అనుకుంటాడు గానీ బుద్ధుడెవరు? ప్రార్థన చేయాలనుకున్నప్పుడు ఒక బుద్ధుడు లభించడమే అతికష్టం. మీరు నమ్మకపోతే నేను చెప్తాను. ఒక వ్యక్తి మొట్టమొదట సక్రమమైన ప్రాణ ప్రతిష్ట ప్రక్రియ చేయబడని బుద్ధ ప్రతిమకు పూజ చేసినప్పుడు భయంకరమైన ఫలితం ఉంటుంది. ఈనాడు ఎంతమంది ఆధ్యాత్మిక సాధనలో సరియైన ఫల స్థితి పొందడం కోసం బుద్ధునికి పూజ చేస్తారు? అటువంటి వారు అతితక్కువ. బుద్ధుని పూజించడం వెనుక అధిక శాతం ప్రజలకు ప్రేరణ ఏమిటి? వారు తమ కష్టాలు తొలగడానికి, సమస్యల పరిష్కారానికి, సంపద కూడబెట్టుకోవడానికి ప్రయత్నిస్తారు. ఆ విషయాలు బౌద్ధమత గ్రంథాలలో ఉన్నాయా? ఏమైనా ఇటువంటివి వాటిలో ఉండవు.

ధనంపై ఆశతో బుద్ధుని పూజించే ఒక వ్యక్తి ఒక బుద్ధ ప్రతిమ ఎదుటనో లేక ఒక అవలోకితేశ్వర బోధిసత్వ ప్రతిమ ఎదుటనో లేక తథాగతుని ఎదుటనో సాష్టాంగపడి “నాకు కొంత ధనం సంపాదించే అవకాశం ఇవ్వండి” అని అడిగారనుకోండి. అప్పుడు ఒక మనోభావన రూపుదిద్దుకుంటుంది.

ఆ ప్రార్థన ఒక బుద్ధ ప్రతిమ ముందు చెయ్యబడిన కారణంగా వెంటనే ఆ ప్రతిమ మీదకు చేరిపోతుంది. ఒక వస్తువు, మరొక పరిమాణంలో పెద్దది లేదా చిన్నది అవగలదు. ఈ వస్తువు మీద ఆ భావన చేరగానే, ఆ బుద్ధ ప్రతిమకు ఒక మెదడు, మనసు వస్తాయి, కానీ శరీరం ఉండదు. ఆ బుద్ధ ప్రతిమను పూజించడానికి ఇతరులు కూడా వస్తూ ఉంటారు. ఈ విధమైన పూజలతో వారు క్రమంగా దానికి కొంత శక్తిని ఇస్తూ ఉంటారు. ఒక సాధకుడు దానికి పూజ చేసినప్పుడు మరింత ప్రమాదకరం. ఆ పూజ వల్ల క్రమంగా దానికి శక్తి లభిస్తూ, ఒక ప్రత్యక్ష శరీరం ఏర్పడే వీలు కల్పిస్తుంది. అయినా ఆ ప్రత్యక్ష శరీరం మరొక పరిమాణంలో ఏర్పడుతుంది. అది ఏర్పడిన తరవాత మరొక పరిమాణంలో ఉంటూ విశ్వంలోని కొన్ని సత్యాలను నేర్చుకో గలుగుతుంది. అందువల్ల అది ప్రజలకు కొన్ని పనులు చేసిపెట్టగలదు. ఆ విధంగా అది కొంత గోంగ్‌ను కూడా అభివృద్ధి చేసుకోగలుగుతుంది. కానీ అది నిబంధనలతోనూ, ఒక వెల కట్టి ఆ పనులు చేసి పెడుతుంది. అది మరొక పరిమాణంలో స్వేచ్ఛగా తిరుగుతూ సామాన్య వ్యక్తులను సులభంగా నియంత్రించగలుగుతూ ఉంటుంది. ఈ ప్రత్యక్ష శరీరం సరిగ్గా ఆ బుద్ధ ప్రతిమలాగానే కనిపిస్తూ ఉంటుంది. కాబట్టి మానవులు చేసే పూజ అచ్చంగా బుద్ధ ప్రతిమ వలె బుద్ధుని రూపం కలిగి ఉన్న ఒక అసత్య అవలోకితేశ్వర బోధిసత్వనుగానీ, నకిలీ తథాగతునిగానీ సృష్టిస్తుంది. కానీ ఆ అసత్య బుద్ధుని లేక బోధిసత్వ యొక్క మనసు చాలా చెడ్డగానూ, ధనార్జన మీద ఆశతోనూ ఉంటుంది. అది మరొక పరిమాణంలో పుట్టి ఉంటుంది. తనకున్న మనసుతో అది కొన్ని సత్యాలను తెలుసుకొని పెద్ద ఎత్తున దుష్కర్మలకు పూనుకోదుగానీ చిన్నపాటి దుష్కర్మలు చెయ్యడానికి సాహసిస్తుంది. కొన్నిసార్లు అది ప్రజలకు సహాయాలు కూడా చేస్తుంది; లేకపోతే అది పూర్తిగా చెడ్డదై చంపబడుతుంది. అది ప్రజలకు ఎలా సహాయం చేస్తుంది? ఎవరైనా "బుద్ధుడా, మా ఇంట్లో ఒకరికి జబ్బుగా ఉంది, సహాయం చెయ్యి" అని ప్రార్థిస్తే, అది ఒక చెయ్యి వేస్తుంది. మీరు విరాళాలు వేసే పెట్టెలో డబ్బు వేసేట్లు చేస్తుంది, ఎందుకంటే దాని మనసు డబ్బు మీద ఉంది. మీరు విరాళాల పెట్టెలో ఎంత ఎక్కువ డబ్బు వేస్తే, ఆ వ్యాధి అంత త్వరగా తొలగింపబడుతుంది. దానికి కొంత శక్తి ఉన్న

కారణంగా, మరొక పరిణామంనించి ఒక సామాన్య వ్యక్తిని ఏమార్చగలుగుతుంది. ప్రత్యేకించి, ఒక సాధకుడు దాన్ని పూజించడానికి వెళ్తే, అది ప్రమాదకరం. ఈ సాధకుడు ఏమని ప్రార్థిస్తాడు? డబ్బు కోసం. అందరూ ఇది ఆలోచించండి: ఒక సాధకుడు డబ్బుకోసం ఎందుకు తాపత్రయపడాలి? కుటుంబ సభ్యుల దురదృష్టాన్ని, వ్యాధులను తొలగించడం కోసం ప్రార్థించడమన్నది కుటుంబంపట్ల ఉన్న సున్నితభావాల బంధం. ఇతరుల విధి వ్రాతను మార్చాలని మీరు అనుకుంటున్నారా? ప్రతి వారికి తమతమ విధివ్రాత ఉంటుంది! మీరు దానికి పూజ చేసి "దయచేసి కొంచెం డబ్బు సంపాదించుకోవడానికి నాకు సాయం చెయ్యండి" అని గొణిగినట్లైతే, ఆ...అది మీకు సాయం చేస్తుంది. మీరు మరింత డబ్బు కోసం తాపత్రయపడాలని అది కోరుతుంది, ఎందుకంటే, మీరు ఎంత ఎక్కువగా కోరుకుంటే అది మీ దగ్గరనించి అన్ని ఎక్కువ వస్తువులు తీసుకోగలుగుతుంది. అది ఒక సరళ వాణిజ్యం. పూజలు చేసే ఇతర వ్యక్తులు విరాళాల పెట్టెలో చాలా డబ్బు వేశారు, అది మిమ్మల్ని కొంత తీసుకోనిస్తుంది. అది ఎలా జరుగుతుంది? మీరు వాకిలి దాటుతున్నప్పుడు మీకొక పర్స్ దొరకొచ్చు లేదా మీ కార్యాలయంలో మీకు బోనస్ దొరకొచ్చు. ఏదో ఒక విధంగా మీకు డబ్బు దొరికే ఏర్పాటు అది చేస్తుంది. ఎటువంటి నిబంధన లేకుండా అది మీకు సాయం ఎందుకు చేస్తుంది? నష్టపోనిదే, లాభం రాదు. అది తనకు కావాలంటే మీ గోంగ్‌లో కొంతభాగం తీసుకుంటుంది, లేదా మీరు సాధనతో సంపాదించుకున్న దాన్‌ను తీసుకుంటుంది. దానికి అవి కావాలి.

ఈ మోసపూరిత బుద్ధులు కొన్నిసార్లు అతిప్రమాదకారులు. దివ్యనేత్రం తెరుచుకున్న మన సాధకులలో చాలామంది తాము ఒక బుద్ధుని చూశాం అనుకుంటారు. ఇవాళ మందిరానికి ఫలానా బుద్ధుని ఆధ్వర్యంలో ఒక బుద్ధుల సమూహం వచ్చిందని ఒక వ్యక్తి చెప్పొచ్చు. అతడు ఆ సమూహం నిన్న ఎలా ఉన్నదో, ఇవాళ ఎలా ఉందో, ఒక సమూహం వెళ్ళిపోయిన కొద్దిసేపటికి మరొకటి ఎలా వచ్చిందో వర్ణిస్తాడు. వారెవరు? వారు ఈ వర్గానికి చెందినవారు – వారు అసలైన బుద్ధులు కారు, నామమాత్రపువారు. ఇటువంటి సందర్భాలు అసంఖ్యాకం.

ఇది ఒక మందిరంలో జరిగితే అతిప్రమాదకరం. భిక్షువులు దాన్ని పూజిస్తే, అది వారిపై అధికారం చూపిస్తుంది: "మీరు నన్ను పూజించడం లేదా? అది కూడా చాలా స్పష్టమైన బుద్ధితో చేస్తున్నారు! సరే, మీకు ఆధ్యాత్మిక సాధన చెయ్యాలని లేదా? నేను మీ గురించి శ్రద్ధ వహించి ఆధ్యాత్మిక సాధన చేయడం ఎలాగో నేర్పుతాను" అని వారికోసం ఏర్పాట్లు చేస్తుంది. వారు ఆధ్యాత్మిక సాధన పూర్తిచేస్తే ఎక్కడికి వెళ్తారు? మీ ఆధ్యాత్మిక సాధన దానిచేత ఏర్పాటుచేయబడి నందువలన, ఉన్నత స్థాయులలో సాధన చేసే ఏ సిద్ధాంతమూ మిమ్మల్ని అంగీకరించదు. అది మీకోసం అన్ని ఏర్పరుస్తుంది కనుక భవిష్యత్తులో మీరు దాన్నే అనుసరించవలసి ఉంటుంది. మీ ఆధ్యాత్మిక సాధన అంతా వ్యర్థం కాదా? ప్రస్తుతం మానవ జాతికి ఆధ్యాత్మిక సాధనలో సరైన ఫల స్థితి సాధించడం అతికష్టమని నేను చెప్పాను. ఇలా జరగడం అతిసాధారణం. మీలో చాలామంది ప్రసిద్ధి పొందిన పర్వతాలలోనూ, నదుల వెంటనూ బుద్ధ – జ్యోతిని చూశారు. అందులో చాలావరకు ఈ వర్గానికి చెందినదే. దానికి శక్తి ఉండి తననుతాను వ్యక్తం చేసుకోగలుగుతుంది. ఒక నిజమైన మహాజ్ఞాని అయిన స్త్రీ లేదా పురుషుడు అలక్ష్యంగా తనను తాను బయల్పరచుకోరు.

ఇప్పటితో పోల్చిచూస్తే గతంలో ఈ భూలోకపు బుద్ధులు, తావోలు తక్కువ సంఖ్యలో ఉండేవారు. అయితే ఈనాడు చాలామంది ఉన్నారు. వారు తప్పు పనులు చేస్తే ఉన్నత జీవులు వారిని సంహరిస్తారు . ఇది జరగబోయే ముందు వారు పరుగెత్తి బుద్ధ ప్రతిమల మీద వాలుతారు. సాధారణంగా ఒక మహాజ్ఞాని, అలక్ష్యంగా సామాన్య మానవుల నియమాలలో జోక్యం చేసుకోరు. ఆ మహాజ్ఞాని స్థాయి ఎంత ఉన్నతంగా ఉంటే, వారు సామాన్య మానవుల నియమాలలో అంత తక్కువగా జోక్యం చేసుకుంటారు, ఏ మాత్రమూ కలగజేసుకోరు. ఆ ఉన్నత వ్యక్తి హఠాత్తుగా ఒక బుద్ధ ప్రతిమను పిడుగుపాటుతో ముక్కలు చెయ్యరు ఎందుకంటే ఆ స్త్రీ లేదా పురుషుడు అట్టి పనులు చెయ్యరు. ఆ విధంగా ఆ ఉన్నత జీవి ఆ బుద్ధ ప్రతిమల మీద వాలినవారిని వదలివేస్తారు. తాము సంహరింపబడుతున్నామని వారికి తెలిసి పోతుంది, అందువల్ల తప్పించుకోవడానికి ప్రయత్నిస్తారు. చివరికి మీరు

చూసేది నిజమైన అవలోకితేశ్వర బోధిసత్వనేనా? మీరు చూసేది నిజమైన బుద్ధుడినేనా? అది చెప్పడం అతికష్టం.

మీలో చాలా మంది: "మన ఇళ్ళలో ఉన్న బుద్ధ ప్రతిమలను ఏం చెయ్యాలి" అన్న విషయం ఆలోచించొచ్చు. బహుశా చాలామంది నన్ను తల్చుకొని ఉంటారు. సాధకులకు ఆధ్యాత్మిక సాధనలో సాయం చెయ్యడానికి మీరు ఇలా చెయ్యొచ్చని నేను ఒక మార్గం సూచిస్తాను. ఆ బుద్ధ ప్రతిమను చేతిలో పట్టుకొని, నా పుస్తకం (అందులో నా ఫోటో ఉంది) గానీ, నా ఫోటో గానీ పట్టుకోండి. అప్పుడు మీరు పెద్ద పద్మపు చేతి ముద్ర(6)ను పట్టి నాకు చేస్తున్నట్లుగానే, ప్రాణ ప్రతిష్ఠ చెయ్యమని గురువుకు మనవి చెయ్యండి. అది అరనిమిషంలో జరుగుతుంది. ఇది మా సాధకులకు మాత్రమే చేస్తానని అందరికీ చెప్తున్నాను. ఈ ప్రాణ ప్రతిష్ఠ అన్నది మా సాధకుల కోసమే చేస్తాం కాబట్టి మీ స్నేహితుల కోసం, మీ బంధువులకోసం జరగదు. కొందరు, దుష్టశక్తులను వెళ్ళగొట్టడానికి నా ఫోటోను తమ బంధువుల, స్నేహితుల ఇళ్ళకు తీసుకువెళ్తామని చెప్తుంటారు. నేను ఇక్కడ ఉన్నది సామాన్య వ్యక్తుల కోసం దుష్టశక్తులను వెళ్ళగొట్టడానికి కాదు – అది గురువుపట్ల ఘోర అపచారం.

భూలోకపు బుద్ధులు, తావోల గురించి చెప్పుకుంటున్నప్పుడు మరొక అంశం ఉంది. ప్రాచీన కాలంలో చైనాలో మారుమూల పర్వతాల నడుమ, దట్టమైన అడవులలోనూ అనేకమంది ఆధ్యాత్మిక సాధన చేస్తూ ఉండేవారు. ఇప్పుడు అలా ఎందుకు లేరు? నిజానికి వారేమీ అదృశ్యం కాలేదు. వారిలో ప్రతీ ఒక్కరు ఉన్నారు, సామాన్య వ్యక్తులకు తమ గురించి తెలియకూడదని అనుకుంటారు అంతే. వారందరికీ అతీంద్రియ శక్తులున్నాయి. వారు అంతటా ఉన్నారు, లేకపోవడమన్నది లేదు. వారిలో అనేక వేల మంది ఈనాడు ప్రపంచంలో ఉన్నారు. మిగిలిన ప్రపంచంతో పోలిస్తే, మన దేశంలోనే అధికంగా ఉన్నారు, ముఖ్యంగా ఆ ప్రసిద్ధమైన పర్వతాల మధ్యనూ, ప్రముఖ నదీతీరాల వెంబడి ఉన్నారు. ఎత్తైన పర్వతాల గుహలలో అంతటా ఉన్నారు, కానీ, మీరు చూడడానికి వీలుపడని విధంగా తాము నివసిస్తున్న గుహలను వారు అతీంద్రియ శక్తులతో మూసివేస్తారు. వారి ఆధ్యాత్మిక సాధన ప్రగతి

అతిమెల్లగా జరుగుతుంది, వారి పద్ధతులు కూడా మొరటుగా ఉంటాయి, ఎందుకంటే, వారు ఆధ్యాత్మిక సాధనలోని సారాన్ని గ్రహించలేదు. మేము దానికి విరుద్ధంగా నేరుగా ఒక వ్యక్తి మనసును లక్ష్యంగా చేసుకొని విశ్వం యొక్క అత్యున్నత లక్షణాన్ని అనుసరించి, విశ్వం యొక్క రూపాన్ని అనుసరించి ఆధ్యాత్మిక సాధన చేస్తాం. సహజంగానే గోంగ్ చాలా త్వరగా పెరుగుతుంది. ఇది ఎందువల్లనంటే, ఆధ్యాత్మిక సాధనామార్గాలు పిరమిడ్ వంటివి; మధ్యనున్న మార్గమే ప్రధాన మార్గం. పక్కనున్న చిన్న దారులలో ఆధ్యాత్మిక సాధనలో ఒక వ్యక్తి షిన్ షిన్ స్థాయి ఉన్నతంగా ఉండకపోవచ్చు. ఆధ్యాత్మిక సాధనలో ఉన్నత స్థాయి చేరకుండానే ఒక వ్యక్తి జ్ఞానోదయం పొందగలిగే అవకాశం ఉంది. అయితే వారు అసలైన ఆధ్యాత్మిక సాధన యొక్క ప్రధాన రహదారికి చాలా దిగువన ఉన్నారు.

అటువంటి సాధనా సిద్ధాంతానికి చెందిన వ్యక్తి శిష్యులను కూడా చేర్చుకుంటారు. ఈ సాధన ఆధ్యాత్మిక సాధన స్థాయిలోనూ, షిన్ షిన్ స్థాయి లోనూ కొద్ది ఎత్తుకే చేరుకోగలిగిన కారణంగా శిష్యులందరూ ఆధ్యాత్మిక సాధనను ఆ స్థాయి వరకే చేస్తారు. ప్రధాన మార్గానికి పక్కదారిలో చేసే ఒక సాధన ఆధ్యాత్మిక సాధనకు ఎంత దూరంగా ఉంటే, దానిలో ఆవశ్యకతలు అంత అధికంగా ఉంటూ, అందులోని ఆధ్యాత్మిక సాధన అంత క్లిష్టంగా ఉంటుంది. ఎందుకంటే, అది ఆధ్యాత్మిక సాధనలోని సారాన్ని గ్రహించలేక పోతుంది. ఆధ్యాత్మిక సాధనలో ఒక వ్యక్తి ప్రధానంగా తన షిన్ షిన్‌ను సాధన చెయ్యాలి. వారు దీనిని అర్థం చేసుకోకుండా, కేవలం కష్టాలు అనుభవించడం వల్లనే ఆధ్యాత్మిక సాధన చెయ్యగలం అనుకుంటారు. అందువల్ల, సుదీర్ఘ కాలం తరవాత, కొన్ని వందలు లేదా వెయ్యేళ్ళకన్నా పైగా ఆధ్యాత్మిక సాధన చేసిన తరవాత వారికి అతికొద్ది గోంగ్ వస్తుంది. నిజానికి వారు కష్టాలు అనుభవించడంవల్ల వారి గోంగ్ పెరగలేదు. వారు దాన్ని ఎలా సంపాదిస్తారు? ఇది ఒక సాధారణ వ్యక్తి విషయంలోలాగా జరుగుతుంది: యవ్వనంలో ఒక వ్యక్తికి అనేక బంధాలు ఉంటాయి, కానీ వృద్ధాప్యంలో కాలం గడుస్తున్నకొద్దీ భవిష్యత్తు నిరాశాజనకంగా తోస్తుంది. ఆ బంధాలు సహజంగానే వీడిపోయి నశిస్తాయి. పక్కదారుల సాధనలలో కూడా ఈ పద్దతే ఉపయోగించబడుతుంది.

ఒక వ్యక్తి ధ్యానంలో కూచోవడం, సమాధి స్థితి పొందడం, ఆధ్యాత్మిక సాధనలో ముందుకు పోవడంలో కష్టాలను సహించడం వంటి వాటి మీద ఆధారపడడం ద్వారా కూడా గోంగ్‌ను పెంచుకోవచ్చని వారు తెలుసుకుంటారు. అయితే వారిలో ఉన్న సామాన్య మానవ బంధాలు ఒక దీర్ఘమైన, కష్టతరమైన కాలంలో నశిస్తాయని, మెల్లమెల్లగా ఆ బంధాలను వదిలివేయడం ద్వారా ఆ గోంగ్ పెరుగుతుందని తెలుసుకోరు.

మా సాధనకు ఒక లక్ష్యం ఉంది. అది నిజంగా ఆ బంధాలను పట్టి చూపుతుంది. వాటిని వదిలి వేయడంవల్ల ఒక వ్యక్తి ఆధ్యాత్మిక సాధనలో అతివేగంగా ప్రగతి సాధిస్తాడు. నేను కొన్ని ప్రదేశాలకు వెళ్ళినప్పుడు తరచుగా అనేక సంవత్సరాలు ఆధ్యాత్మిక సాధన చేసిన ఇటువంటివారు తారసపడ్డారు. వారు "మేము ఇక్కడ ఉన్నట్లు ఎవరికీ తెలియదు. మీరు చేస్తున్న పని విషయంలో మేము కలగజేసుకోం, మీకు ఎటువంటి ఇబ్బంది కలిగించం" అన్నారు. ఈ వ్యక్తులు కొందరు వ్యక్తులతో పోలిస్తే మంచి స్థాయికి చెందిన వర్గాలలో ఉన్నారు.

మేము కొందరు చెడ్డ వ్యక్తులతో కూడా వ్యవహరించవలసి వచ్చింది. ఉదాహరణకు నేను గ్వేఝొ(7)లో మొదటిసారి తరగతి నిర్వహించినప్పుడు మధ్యలో ఒక వ్యక్తి నాకోసం వచ్చి తన పరమ గురువు నన్ను చూడాలనుకుంటున్నారని చెప్పాడు. అతడు తన పరమ గురువును గురించి వర్ణించి, ఆయన అనేక సంవత్సరాలపాటు ఆధ్యాత్మిక సాధన ఎలా చేశారో చెప్పాడు. అతడు పసుపుపచ్చని ముఖంతో, చెడు చీని కలిగి ఉండి, అతడు చాలా దుష్టుడు అన్న భావం నాకు కలిగింది. నాకు అతడిని కలుసుకునే సమయం లేదని చెప్పి, అతడిని పంపించేశాను. ఫలితంగా వృద్ధుడైన అతడి గురువు కలత చెంది నన్ను ఇబ్బంది పెట్టసాగాడు, ప్రతిరోజూ పంతంతో ఇబ్బంది పెట్టేవాడు. నేను ఇతరులతో పోట్లాటలంటే ఇష్టపడే వ్యక్తిని కాను, అతడితో పోట్లాడడం అంత ఉపయోగకరమూ కాదు. అతడు నా మీదకు కొన్ని చెడ్డ విషయాలను పంపించినప్పుడల్లా, నేను వాటిని చెదరగొట్టేసేవాడిని. తరవాత నా ఉపన్యాసాలను కొనసాగించేవాడిని.

మింగ్ వంశం(8)లో తావో ఆధ్యాత్మిక సాధన చేస్తున్నప్పుడు పాముతో

ఆవహించబడిన తావో మతస్థుడు ఒకడు ఉండేవాడు. తరవాత అతడు తన ఆధ్యాత్మిక సాధన పూర్తి చేయకుండానే మరణించాడు. ఆ పాము అతడి శరీరం మీద పట్టు సాధించి మానవరూపం పొందింది. ఆ వచ్చిన వ్యక్తి యొక్క పరమ గురువు మానవ రూపం ధరించిన ఆ పామే. అతడి సహజ ప్రకృతి మారనందు వల్ల నన్ను ఇబ్బందులపాలు చెయ్యడానికి తనను తాను ఒక పెద్ద పాముగా మార్చుకున్నాడు. అతడు హద్దు మీరుతున్నాడు అనుకొని, నేను అతడిని చేతితో పట్టుకున్నాను. నేను అతడి శరీరంలోని క్రిందిభాగం కరిగి నీరుగా మారేటట్లు, అతిశక్తివంతమైన "కరిగించే గోంగ్" అనే గోంగ్‌ను ప్రయోగించాను. అతడి శరీరపు పై భాగం ఇంటికి తిరిగి పారిపోయింది.

గ్వేఝోలోని మా బోధనా కేంద్రపు స్వచ్ఛంద సంచాలకురాలిని ఆ వ్యక్తి యొక్క శిష్యుడు కలుసుకొని తన పరమ గురువు ఆమెను కలుసుకోవాలి అనుకున్నట్లు తెలిపాడు. ఆమె అక్కడికి వెళ్ళి ఒక చీకటి గుహలోకి ప్రవేశించారు. అక్కడ ఆమెకు ఆకుపచ్చని వెలుగుతో నిండిన కళ్ళు కలిగిన నీడ తప్ప ఏమీ కనపడలేదు. అతడు తన కళ్ళను తెరిచినప్పుడు ఆ గుహ ప్రకాశవంతం అవుతుంది. అతడు కళ్ళు మూసుకోగానే ఆ గుహ మళ్ళీ చీకటిమయం అవుతుంది. అతడు ఆ ప్రాంతపు మాండలికంలో "లీ హోంగ్జీ మళ్ళీ వస్తూ ఉంటారు, మాలో ఎవరమూ ఈసారి ఇబ్బంది కలిగించం. నేను పొరపాటు పడ్డాను. లీ హోంగ్జీ ప్రజలకు ముక్తినిచ్చేందుకు వస్తారు," అని చెప్పాడు. అతడి శిష్యుడు "గురువుగారూ, దయచేసి నిలబడండి. మీ కాళ్ళకు ఏమైంది?" అని అడిగాడు. అతడు "నా కాళ్ళు గాయపడిన కారణంగా నేను ఎప్పటికీ నిలబడ లేను" అని చెప్పాడు. ఎలా గాయపడ్డాయని అడిగినప్పుడు, తాను నన్ను ఎలా ఇబ్బందిపెట్టినదీ వర్ణించడం మొదలుపెట్టాడు. 1993లో బీజింగ్‌లో జరిగిన ఓరియెంటల్ హెల్త్ ఎక్స్‌పోలో అతడు మళ్ళీ నన్ను ఇబ్బంది పెట్టాడు. అతడు ఎప్పుడూ చెడ్డపనులు చేస్తూ నా దాఫా బోధనలో అంతరాయం కలిగిస్తున్నందు వలన నేను అతడిని పూర్తిగా నిర్మూలించాను. అతడు నిర్మూలింపబడిన తరవాత అతడి తోటి సోదరీసోదరులు నాపై చర్య తీసుకోవాలనుకున్నారు. ఆ సమయంలో నేను కొన్ని మాటలు చెప్పాను. వారంతా ఎంతగా భయపడి పోయారంటే ఎవ్వరూ ఏమీ చెయ్యడానికి

సాహసించలేకపోయారు. వారందరికీ జరుగుతున్నదేమిటో కూడా అర్థమైంది. ఎంతోకాలంగా ఆధ్యాత్మిక సాధన చేసి ఉన్నప్పటికీ, వారిలో కొందరు ఇంకా పూర్తిగా సామాన్య వ్యక్తులే. ప్రాణ ప్రతిష్ఠ గురించి నేను చెప్పిన కొన్ని ఉదాహరణలు ఇవి.

## జ్యుయూక (9)

జ్యుయూక అంటే ఏమిటి? సాధకుల సమాజంలో చీ గోంగ్ బోధనాక్రమంలో చాలామంది ఆధ్యాత్మిక సాధనలోని ఒక వర్గంగా దాన్ని బోధిస్తారు. నిజానికి అది ఆధ్యాత్మిక సాధనలో ఒక వర్గం కాదు. అది ఒక చాతుర్యం, మంత్రోచ్చారణ, తంత్రంగా బోధింపబడుతుంది. అది చిహ్నాలను చిత్రించడం, ధూపం వేయడమూ, కాగితాలను కాల్చడమూ, మంత్రోచ్చారణ చేయడం వంటి పద్ధతులను కలిగి ఉంటుంది. దానివల్ల వ్యాధినిర్మూలన జరుగుతుంది, ఆ పద్ధతులు కూడా అద్వితీయంగా ఉంటాయి. ఉదాహరణకు, ఒక స్త్రీ ముఖం మీద కురుపు లేస్తే, సాధకుడు ఎర్రని శిలాస్ఫటికపు సిరాలో ముంచిన కుంచె కలంతో నేల మీద ఒక వలయం గీసి, (మధ్యలో ఆంగ్ల భాషలోని “ఎక్స్”) అన్న గుర్తు పెడతాడు. అతడు ఆ స్త్రీని వలయం మధ్యలో నిలబడమని చెప్తాడు. అప్పుడు అతడు మంత్రోచ్చారణ మొదలుపెడతాడు. తరవాత అతడు ఆ శిలాస్ఫటికపు సిరాలో కుంచె కలాన్ని ముంచి ఆమె ముఖం మీద వలయాలు గీస్తూ ఉంటాడు. అలా గీస్తున్నప్పుడు అతడు మంత్రోచ్చారణ చేస్తుంటాడు. ఆ కురుపు మీద కుంచె కలంతో చుక్క పెట్టే వరకు గీస్తూ ఉంటాడు, తరవాత మంత్రోచ్చారణ ఆగిపోతుంది. అతడు ఆ కురుపు తగ్గించబడిందని ఆమెకు చెప్తాడు. ఆమె దాన్ని తాకినప్పుడు, అది నిజంగానే చిన్నది అయిందని, ఏమాత్రమూ బాధ లేదని ఆమెకు అనిపిస్తుంది, ఎందుకంటే ఆ చర్య ప్రభావ వంతమైనది. అతడు కొద్దిపాటి అనారోగ్యాన్ని కుదర్చగలడు కానీ తీవ్ర అనారోగ్యాన్ని తొలగించలేడు. మీ చెయ్యి నొప్పిగా ఉంటే అతడు ఏమి చేస్తాడు? మిమ్మల్ని చేతులు చాపి పెట్టమని చెప్పి అతడు మంత్రోచ్చారణ చేస్తుంటాడు. అతడు ఆ చేతి యొక్క హుగూ (10) బిందువు దగ్గర ఉఫ్‌మని గాలి ఊది మీ రెండవ చేతి యొక్క హుగూ బిందువు దగ్గరనించి బయటకు

వెళ్ళేట్లు చేస్తాడు. మీకు ఒక గాలి విసిరిన అనుభూతి కలిగి, మీరు మీ భుజాన్ని తాకి చూసుకున్నప్పుడు అది అంతకు ముందున్నంత నొప్పిగా అనిపించదు. దీనికితోడు కొందరు కాగితాలు తగలబెట్టడం, చిహ్నాలు గీయడం, ముద్రలు వెయ్యడం వంటి పద్ధతులు ఉపయోగిస్తుంటారు. వారు ఈ పనులన్నీ చేస్తారు.

తావో సిద్ధాంతానికి చెందినట్టి ప్రాపంచిక సంబంధమైన పక్కదారి సాధనలు దీర్ఘజీవితం కోసం ఆధ్యాత్మిక సాధనను చెయ్యవు. అవి పూర్తిగా జ్యోతిష్యం చెప్పడానికి, ఫెంగ్ షూయి (11) కి, దుష్టశక్తులను తరిమివెయ్యడానికి, వ్యాధి నిర్మూలనకే అంకితమయ్యాయి. వాటిలోని అధిక శాతం ప్రాపంచికమైన పక్కదారుల పద్ధతులు. అవి వ్యాధినిర్మూలన చెయ్యగలిగినా, వారు ఉపయోగించే పద్ధతులు మంచివి కావు. వారు వ్యాధినిర్మూలన కోసం ఏం ఉపయోగిస్తారో మేము చెప్పం కానీ మా దాఫా సాధకులు వాటిని ఉపయోగించకూడదు ఎందుకంటే, వాటిలో చాలా తక్కువ స్థాయి దుష్ట సందేశాలుంటాయి. ప్రాచీన చైనాలో చికిత్సా పద్ధతులు విరిగిన ఎముకలు అతికించే పద్ధతి, ఆక్యుపంక్చర్, మర్దన, చిరోప్రాక్టిక్, ఆక్యుప్రెషర్, చీ గోంగ్ చికిత్స, మూలికావైద్యం, మొదలైన వర్గాలుగా విభజింపబడింది. అవి అనేక విభాగాలుగా చేయబడ్డాయి. ప్రతి చికిత్సా విధానాన్ని ఒక పాఠ్యాంశంగా పేర్కొంటారు. జ్యుయూక పదమూడవ పాఠ్యాంశంగా వర్గీకరింపబడింది. అందువల్ల దాని పూర్తి పేరు "పదమూడవ సంఖ్య పాఠ్యాంశం జ్యుయూ". జ్యుయూక మన ఆధ్యాత్మిక సాధనలో ఉన్న వర్గం కాదు, ఎందుకంటే అది ఆధ్యాత్మిక సాధన ద్వారా పొందే గోంగ్ కాదు. దానికి మారుగా అది ఒక తంత్రం వంటిది.

* * * *

**అర్థములు:**

1. శ్రీవత్స – సంస్కృతంలో కాంతి చక్రము, 2500 ఏళ్ళ పూర్వకాలానికి చెందినది. గ్రీసు, పెరూ, భారతదేశమూ, చైనాలలో సాంస్కృతిక అవశేషాలలో బయల్పడినది. శతాబ్దాల తరబడి సౌభాగ్యాన్ని సూచించే అర్థం, సూర్యుడిని సూచించేది, శుభసూచకంగా భావింపబడినది.

2. చీ మున్ సిద్ధాంతం – "సంప్రదాయేతర సిద్ధాంతం".
3. అసుర – "రాక్షస ఆత్మలు" (సంస్కృతం నించి).
4. బోధిసత్త్వ అవలోకితేశ్వర – దయాగుణానికి ప్రసిద్ధి పొందినది, ఆమె పరమానందపు స్వర్గంలోని ఇద్దరు మహా బోధిసత్త్వలలో ఒకరు.
5. నాన్ జింగ్ – జింగ్సూ రాష్ట్ర రాజధాని.
6. పెద్ద పద్మపు చేతి ముద్ర – ప్రాణ ప్రతిష్టను సూచించే చేతి ముద్ర.
7. గ్వేఝో – నైఋతి చైనాలోని ఒక రాష్ట్రం.
8. మింగ్ వంశం – చైనా చరిత్రలో క్రీ.శ. 1368–1644 సంవత్సరాల మధ్య కాలం.
9. జ్యుయూక – విజ్ఞాపన అభ్యాసం.
10. హుగూ బిందువు – చేతి బొటనవేలికి, చూపుడువేలికి మధ్య చేతి వెనక భాగంలో ఉన్న ఆక్యుపంక్చర్ బిందువు.
11. ఫెంగ్ షూయి – చైనీయ వాస్తు శాస్త్రం.

* * * *

# ఆరవ ఉపన్యాసము

## ఆధ్యాత్మిక సాధన పిచ్చి

సాధకుల సమాజంలో, ఆధ్యాత్మిక సాధన పిచ్చి అన్న పదం ఉంది. ఇది ప్రజల మీద చాలా ప్రభావం కలిగి ఉంది. ప్రత్యేకించి, కొంతమంది దీనిని ఎంతగా ప్రచారం చేశారంటే, కొందరు వ్యక్తులు చీ గోంగ్ అభ్యసించాలంటేనే భయపడిపోతారు. చీ గోంగ్ సాధన ఆధ్యాత్మికమైన పిచ్చికి దారితీస్తుందని వింటేనే ప్రజలు దాని గురించి ప్రయత్నించడానికే చాలా భయపడిపోతారు. ఆధ్యాత్మిక సాధన పిచ్చి అనేదే లేదని మీకు నేను చెప్తున్నాను.

కొందరు మనుషులు, తమ మనసులు అధర్మపూరితమై ఉన్న కారణంగా ప్రేతాత్మలు, జంతువుల చేత ఆవహింపబడ్డారు. వారి ప్రధాన చైతన్యాలు, తమను తాము అదుపు చేసుకోలేక వాటినే గోంగ్‌గా పరిగణిస్తాయి. వారి శరీరాలు తమను ఆవహించుకొని ఉన్న ప్రేతాత్మ లేదా జంతువుల చేత శాసించబడి చిత్తచాంచల్యం కలిగించి వారు అరుపులు, కేకలు పెట్టేట్లు చేస్తాయి. చీ గోంగ్ సాధన ఇలా ఉండడం చూసిన జనులు సాధన చెయ్యడానికి చాలా భయపడతారు. మీలో చాలామంది అది చీ గోంగ్ అనుకుంటారు, అది చీ గోంగ్ సాధన ఎలా అవుతుంది? ఇది వ్యాధినిర్మూలన, దేహపుష్టి నిలుపుకోవడంలోని అత్యల్ప స్థాయి, అయినా అతిప్రమాదకరమైనది. మీరు ఈ మార్గానికి అలవాటు పడితే, మీ ప్రధాన చైతన్యం మిమ్మల్ని అదుపు చెయ్యడంలో ఎల్లప్పుడూ అశక్తం అవుతుంది. అప్పుడు మీ శరీరం మీద సహాయక ఆత్మ, బయటి సందేశాలు, ఆవహించే ప్రేతాత్మలు, జంతువులు మొదలైనవి ప్రాబల్యం పెంచుకుంటాయి. మీరు కొన్ని ప్రమాదకరమైన పనులు చేసి సాధకుల సమాజానికి గొప్ప చేటు కలిగించే అవకాశం ఉంది. ఇది ఒక వ్యక్తి యొక్క అవినీతిమయమైన మనసువల్లనూ, తనను తాను

గొప్పగా ప్రదర్శించుకోవాలనే బంధంవల్లనూ జరుగుతుంది – ఇది ఆధ్యాత్మికపు పిచ్చి కాదు. కొందరు వ్యక్తులు చీ గోంగ్ గురువులు ఎలా అయ్యారో ఎవరికీ తెలియదు గానీ వారు ఆధ్యాత్మికపు పిచ్చిని నమ్ముతారు. నిజానికి ఆధ్యాత్మిక సాధన కారణంగా మనుషులకు ఆధ్యాత్మికపు పిచ్చి పట్టదు. చాలామంది, సాహిత్యంనించి యుద్ధవిద్యల నవలలు మొదలైన వాటినించి ఈ పదజాలం నేర్చుకుంటారు. మీరు దీన్ని నమ్మకపోతే ప్రాచీన గ్రంథాలను, ఆధ్యాత్మిక సాధనాగ్రంథాలను తిరగేసి చూడండి, వాటిలో అటువంటి విషయాల ప్రసక్తే లేదు. ఆధ్యాత్మిక సాధన వలన పిచ్చి ఎలా పడుతుంది? అటువంటిది జరగడం అసంభవం.

ఆధ్యాత్మికపు పిచ్చి అనేక రకాలుగా ఉంటుందనేది ఒక సాధారణ నమ్మకం. ఇప్పుడే నేను ప్రస్తావించినది కూడా ఒక రకం. ఒక వ్యక్తి మనసు ధర్మబద్ధమై ఉండకపోవడంవల్ల అతడు ప్రేతాత్మ, లేదా జంతువుల చేత ఆవహింపబడి గొప్పలు ప్రదర్శించడానికి చీ గోంగ్‌లో ఏదో స్థితిని అందు కోవాలని ప్రయత్నించడం వంటి అనేక రకాల మనస్తత్వాలను కలిగి ఉంటాడు. కొంతమంది నేరుగా అతీంద్రియ శక్తుల వెంటపడతారు లేదా నామమాత్రపు చీ గోంగ్‌ను సాధన చేసి ఉంటారు. వారు చీ గోంగ్ సాధన చేస్తున్నప్పుడు తమ ప్రధాన ఆత్మను వదలిపెట్టడం అలవాటు చేసుకుంటారు. వారు అన్ని విషయాలపట్ల గల ఎరుకను వదలిపెట్టి, తమ శరీరాలను ఇతరులకు ఇచ్చేసు కుంటారు. వారు మానసికంగా తమ స్థితిని కోల్పోయి తమ శరీరాలను సహాయక ఆత్మలు లేదా బయటి సందేశాల ఆదేశాలకు లోనుచేస్తారు. వారు చిత్రమైన ప్రవర్తనను ప్రదర్శిస్తారు. అటువంటి వ్యక్తి ఒక భవనం మీదనించి దూకమని, ఎత్తునించి నీళ్ళలోకి దూకమని ఎవరైనా చెప్తే అది చేసేస్తాడు. తనంతటతాను బ్రతుకు మీద ఆశ కూడా లేకుండా తన శరీరాన్ని ఇతరులకు ఇచ్చేస్తాడు. ఇది ఆధ్యాత్మిక సాధనవల్ల కలిగే పిచ్చి కాదు, అది చీ గోంగ్ సాధనలో పక్కదారి పట్టడం, దీనికి కారణం ఒక వ్యక్తి ఉద్దేశ్యపూర్వకంగా మొదట్లో ఈ విధంగా ప్రవర్తించడం. చాలామంది స్పృహలో లేకుండా తమ శరీరాలను ఊపుతూ ఉండడమే చీ గోంగ్ సాధన అనుకుంటారు. నిజంగా, ఎవరైనా ఆ స్థితిలో చీ గోంగ్ సాధనను చేస్తే, అది విపరీత పరిణామాలకు

దారితీయవచ్చు. అది సామాన్య మానవుల బంధాలూ, ప్రయత్నాల ఫలితమే తప్ప, చీ గోంగ్ సాధన కాదు.

మరొక సందర్భం ఏమిటంటే చీ గోంగ్ సాధన చేసేటప్పుడు ఒక వ్యక్తి శరీరంలో ఎక్కడైనా చీ అధికంగా గూడు కట్టుకొని ఉండిపోయినా చీ అతడి తల పైనించి కిందకు రాకపోయినా ఆ వ్యక్తి భయపడతాడు. మానవ దేహం ఒక సూక్ష్మ విశ్వం. ప్రత్యేకించి తావో మతపు సాధనలలో చీ ఒక మార్గం గుండా పోతున్నప్పుడు, ఒక వ్యక్తి ఇటువంటి సమస్యలలో చిక్కుకుంటాడు. చీ ఆ మార్గం గుండా ప్రసరించలేకపోతే అది అక్కడ నిలిచిపోతుంది. అది కేవలం తలలోనేకాక శరీరంలోని ఏ ఇతర భాగాలలోనైనా జరగొచ్చు; అయినా ఒక వ్యక్తి శరీరంలోని అత్యంత సున్నితమైన భాగం తల. చీ తల పైకి వెళ్ళి క్రిందకు వస్తుంది. ఒకవేళ చీ ఒక మార్గం గుండా ప్రసరించ లేకపోతే, ఆ మనిషికి దట్టమైన చీ టోపీ ధరించినట్లు తల బరువుగానూ, వాచినట్లుగా ఉండడం మొదలైన అనుభూతులు కలుగుతాయి. కానీ ఏది ఏమైనా చీ దేనినీ అదుపులో పెట్టలేదు, అది సమస్యలను కల్పించడంగానీ, వ్యాధిని కలిగించడం గానీ చెయ్యలేదు. కొందరికి చీ గోంగ్‌ను గురించిన నిజం తెలియదు, వారు ఏవో నిగూఢమైన వ్యాఖ్యలు చేస్తారు, ఇది ఒక అయోమయ పరిస్థితికి దారి తీసింది. దానికి తగినట్లు జనులు ఒకవేళ చీ తల పైకి ఎక్కి క్రిందకు రాలేక పోతే, ఆ వ్యక్తికి ఆధ్యాత్మికపు పిచ్చి పడుతుందని, పెడదారి పడతారని, ఇంకా ఏదో అంటారు. దాని ఫలితంగా చాలామంది జనులు భయపడిపోతారు.

చీ తల పైకి ఎక్కి క్రిందకు రాలేకపోవడం ఒక తాత్కాలిక స్థితి మాత్రమే. కొంతమందికి అది చాలాకాలం లేదా ఆరు నెలలు గడిచినప్పటికీ క్రిందకు రాదు. అలాంటి సందర్భంలో ఒక వ్యక్తి ఆ చీని క్రిందకు దింపడానికి తనకు దారిచూపగల ఒక నిజమైన చీ గోంగ్ గురువును వెతుక్కోవాలి. అప్పుడు అది క్రిందకు వస్తుంది. చీ గోంగ్ సాధనలో మీలో ఎవరికైనా చీ ఒక మార్గం గుండా వెళ్ళలేకపోయినా, కిందకు రాలేకపోయినా, మీరు మీ యొక్క షిన్ షిన్‌ను పరిశీలించుకొని, మీరు చాలాకాలం ఆ స్థాయిలో ఇరుక్కొనిపోయి ఉన్నారా, మీ షిన్ షిన్‌ను పెంచుకోవలసి ఉన్నదా అన్న విషయం నిర్ణయించు

కోవాలి! ఒకసారి మీ షిన్ షిన్‌ను నిజంగా పెంపొందించుకుంటే, ఆ చీ కిందకు రావడాన్ని మీరు గమనిస్తారు. మీరు షిన్ షిన్‌ను పెంచుకోవడంపై శ్రద్ధ పెట్టకుండా, కేవలం మీ భౌతిక శరీరంలోని గోంగ్ పరివర్తన కోసం మాత్రమే ప్రయత్నం చెయ్యలేరు. అది మీరు మీ షిన్ షిన్‌ను పెంచుకోవడం కోసం ఎదురుచూస్తున్నది – అప్పుడు మాత్రమే మీలో సమగ్రమైన మార్పు వస్తుంది. చీ నిజంగానే ఇరుక్కుపోయినా అది ఎటువంటి సమస్యనూ కలిగించదు. సాధారణంగా మన మానసిక కారణాలే అక్కడ పని చేస్తుంటాయి. ఇంకా, ఒక మోసపు లేదా నామమాత్రపు చీ గోంగ్ గురువు ద్వారా, చీ తల పైకి చేరినప్పుడు వక్రమార్గం పడతారని, విన్నప్పుడు ఆ వ్యక్తి భయపడతాడు. ఈ భయమే నిజానికి ఆ వ్యక్తికి కొంత సమస్యను తెచ్చిపెట్టొచ్చు. ఒకసారి మీరు భయపడితే అది ఆ భయంతో ఒక బంధం అవుతుంది. అది ఒక బంధం కాదా? మీ బంధం పైకి కనపడినప్పుడు దానిని తొలగించవద్దా? మీరు ఎంత ఎక్కువగా భయపడిన కొద్దీ అంత వ్యాధిగ్రస్తునిలా కనపడతారు. మీలో ఈ బంధం తొలగించబడాలి. మీరు ఈ పాఠం నేర్చుకుంటారు, దానివల్ల మీ భయం తొలగిపోయి, మీరు ముందుకు సాగగలరు.

సాధకులు తమ భవిష్య ఆధ్యాత్మిక సాధనలో సుఖంగా ఉండలేరు, ఎందుకంటే వారి శరీరాలు అతిశక్తివంతమైన అనేక రకాల గోంగ్‌ను అభివృద్ధి చేసుకుంటాయి, అవన్నీ వారి శరీరాలలో అంతటా తిరుగుతుంటాయి; అవన్నీ ఏదో రకంగా మిమ్మల్ని ఇబ్బందిపెడుతూ ఉంటాయి. మీ అసౌఖ్యానికి ముఖ్యకారణం ఏమిటంటే మీరు ఎప్పుడూ ఏదో జబ్బు చేస్తుందని భయ పడుతూ ఉండడమే. నిజానికి మీ శరీరంలో అభివృద్ధి చెందినవన్నీ చాలా శక్తివంతమైనవి, అవన్నీ గోంగ్, అతీంద్రియ శక్తులు, అనేక జీవులూను. అవి తిరుగుతూ ఉంటే మీ శరీరానికి దురద, నొప్పి, అసౌఖ్యం మొదలైన అనుభూతులు కలుగుతాయి. నరాల వ్యవస్థలోని కొసలు ప్రత్యేకించి చాలా సున్నితంగా ఉంటాయి, అనేక రకాల లక్షణాలు కనిపిస్తూ ఉంటాయి. మీ శరీరం పూర్తిగా అత్యంత శక్తి పదార్థంతో పరివర్తన చెందనంతవరకు మీకు ఇలాగ అనిపిస్తూ ఉంటుంది. ఏమయినా దీనిని ఒక మంచి విషయంగానే చూడాలి. ఒక సాధకుడై ఉండి, మిమ్మల్ని మీరు ఒక సామాన్య వ్యక్తిగా

భావించుకొని ఎప్పుడూ వ్యాధులు ఉన్నట్లు ఆలోచించుకుంటే, మీరు ఆధ్యాత్మిక సాధన ఎలా చెయ్యగలుగుతారు? ఒక కష్టం ఎదురైనప్పుడు, మిమ్మల్ని మీరు ఒక సామాన్య వ్యక్తిగా పరిగణించుకుంటే, మీ షిన్ షిన్ సామాన్య వ్యక్తుల షిన్ షిన్ స్థాయికి పడిపోయిందని నేను అంటాను. కనీసం ఈ ప్రత్యేక విషయంలో మీరు సామాన్య వ్యక్తుల స్థాయికి దిగజారిపోయారు.

నిజమైన సాధకులుగా, మనం అన్ని అంశాలను సామాన్య వ్యక్తుల దృక్పథంనించి కాకుండా, అత్యున్నత స్థాయినించి చూడాలి. మీరు గనక మీకు అనారోగ్యంగా ఉందని నమ్ముతుంటే, అది మీరు నిజంగా అనారోగ్యం పాలయ్యేందుకు దారితీయొచ్చు. ఇలా ఎందుకంటే, మీరు ఒకసారి అనారోగ్యపు భావన పెంచుకుంటే, మీ షిన్ షిన్ స్థాయి సామాన్య మానవుల స్థాయిలో ఉంటుంది. ప్రత్యేకించి ఈ పరిస్థితిలో, చీ గోంగ్ సాధన, నిజమైన ఆధ్యాత్మిక సాధన అనారోగ్యానికి దారితీయవు. జనులకు అనారోగ్యం కలగడానికి అసలైన కారణం డెబ్బై శాతం మానసికమూ, ముప్పై శాతం శారీరకమూ అన్నది అందరికీ తెలిసిన విషయమే. విలక్షణంగా, ఒక వ్యక్తికి మానసికంగా దెబ్బ తగిలినప్పుడు, ఆ మనసు దానిని తట్టుకోలేక, అతడి అనారోగ్య పరిస్థితి విపరీతంగా దిగజారిపోయే ముందర అతడు చాలా మానసిక భారం అనుభవిస్తాడు. ఇది సాధారణంగా ఇలా జరుగుతుంది. ఉదాహరణకు ఒకసారి ఒక మనిషిని మంచానికి కట్టేశారు. అతడి చెయ్యి పట్టుకొని రక్తం వచ్చేట్లుగా చీలుస్తామని బెదిరించారు. తరువాత అతడి కళ్ళకు గంతలు కట్టి అతడి మణికట్టుపై గీశారు. (అతడి చేతిని కొయ్యనే లేదు అతడికి రక్తస్రావమూ కాలేదు). ఒక నీటి కొళాయిని తిప్పి అతడికి చుక్కచుక్కలుగా నీరు పడుతున్న శబ్దం వినబడేటట్లు చేశారు. ఆ విధంగా అతడు అలా కారుతున్నది తన రక్తమే అనుకొన్నాడు. ఆ వ్యక్తి కొంతసేపట్లోనే మరణించాడు. నిజానికి అతడి చెయ్యి కోసుకొని రక్తం స్రవించలేదు – అది నీరు పడుతున్న శబ్దం. అతడి మానసిక కారణాలు అతడి మరణానికి కారణమయ్యాయి. మీరు ఎల్లప్పుడూ అనారోగ్యంగా ఉన్నామని నమ్ముతూ ఉంటే, దాని ఫలితంగా నిజంగానే జబ్బుపడే అవకాశం ఉంది. మీ షిన్ షిన్ సామాన్య వ్యక్తుల స్థాయికి పడిపోవడం వల్ల, ఒక సామాన్య వ్యక్తికి నిజంగానే, జబ్బులుంటాయి.

ఒక సాధకుడిగా, మీరు ఎల్లప్పుడూ అది ఒక జబ్బు అని తలుస్తూ ఉంటే, మీరు దానిని కోరుతున్నట్లే అవుతుంది. మీరు ఒక జబ్బు కోసం అడిగితే అది వెంటనే మీ శరీరంలోకి వచ్చి చేరుతుంది. ఒక సాధకుడుగా మీ షిన్ షిన్ స్థాయి ఉన్నతంగా ఉండడం అవసరం. మీరెప్పుడూ ఒక జబ్బును చూసి చింత పడకూడదు ఎందుకంటే దానిపట్ల ఉన్న ఈ భయం కూడా ఒక బంధమే, అది అలాగే మీకు ఇబ్బందిని తెచ్చిపెడుతుంది. ఆధ్యాత్మిక సాధనలో ఒక వ్యక్తి, కర్మను తొలగించుకోవడం అవసరం, అది బాధతో కూడి ఉంటుంది. ఒక వ్యక్తి తన గోంగ్‌ను సౌకర్యవంతంగా ఎలా పెంచుకోగలుగుతాడు? అలా కానప్పుడు అతడు తన బంధాలను ఎలా వదులుకోగలుగుతాడు? బౌద్ధమతం లోని ఒక కథను చెప్తాను వినండి. ఒక వ్యక్తి చాలా కష్టపడి ఆధ్యాత్మిక సాధనతో అర్హత్ అయ్యాడు. అతడు ఆధ్యాత్మిక సాధనలో సరియైన ఫలం పొంది అర్హత్ కాబోయే సమయంలో, అతడు సంతోషంగా ఉండకపోవడం ఎలా జరుగుతుంది? అతడు త్రిలోకాలను అధిగమించబోతున్నాడు! అయినా ఈ ఉద్రేకం ఒక బంధం, ఆనందోద్రేకం అనే బంధం. ఒక అర్హత్ ఏ విధంగానూ ప్రభావితం కాని మనసు కలిగి, అన్ని రకాల బంధాలనించి విముక్తుడై ఉండాలి. కానీ అతడు విఫలుడై, అతడి ఆధ్యాత్మిక సాధన వ్యర్థం అయిపోయింది. అతడు విఫలుడైనందున తన ఆధ్యాత్మిక సాధనను మళ్ళీ మొట్టమొదటినించి ప్రారంభించవలసి వచ్చింది. అతడు తన ఆధ్యాత్మిక సాధనను పునఃప్రారంభించి, అతికష్టతరమైన ప్రయత్నం తరవాత మళ్ళీ సఫలత సాధించాడు. ఈసారి భయంతో "నేను ఉద్రేకపడకూడదు. లేకపోతే, మళ్ళీ విఫలుడను అవుతాను" అని మనసులో గుర్తు చేసుకున్నాడు. ఈ భయంతో మళ్ళీ విఫలుడయ్యాడు. భయం కూడా ఒక రకమైన బంధమే.

ఇంకొక పరిస్థితి ఉంది. ఒక వ్యక్తికి మానసిక వైకల్యం కలిగినప్పుడు అతడికి ఆధ్యాత్మికపు పిచ్చి పట్టిందని ముద్ర పడుతుంది. నేను తమ మానసిక వైకల్యానికి చికిత్స చెయ్యాలని ఎదురుచూసే వ్యక్తులు కూడా ఉంటారు! మానసిక వైకల్యం ఒక వ్యాధి కాదని, నాకు అటువంటి విషయాలను పట్టించుకునే సమయం కూడా లేదని నేను చెప్తుంటాను. ఎందుకని? ఎందుకంటే, మానసిక వైకల్యం కలిగిన వ్యక్తిలో ఎటువంటి వైరస్ ఉండదు,

అతడి శరీరంలో ఎటువంటి వ్యాధికారక మార్పులుగానీ, ఇన్ఫెక్షన్లుగానీ ఉండవు; అందువల్ల నా దృష్టిలో అది ఒక వ్యాధి కాదు. ఒక వ్యక్తి ప్రధాన చైతన్యం చాలా బలహీనపడినప్పుడు అతడికి మానసిక వైకల్యం ఏర్పడుతుంది. అది ఎంతగా బలహీనపడుతుంది? అది ఎలా ఉంటుందంటే, ఎన్నటికీ తనను తాను అదుపు చేసుకోలేని వ్యక్తిలోవలె ఉంటుంది. ఒక మానసికరోగి యొక్క ప్రధాన చైతన్యం సరిగ్గా అలాగే ఉంటుంది. దానికి ఆ శరీరాన్ని నియంత్రించాలన్న అభిలాష ఏమాత్రమూ ఉండదు. అది ఎప్పుడూ ఒక తికమకలో ఉండిపోయి స్పృహలోకి రావడం జరగదు. ఆ సందర్భంలో, ఆ వ్యక్తి యొక్క సహాయక చైతన్యం గానీ, బయటి సందేశాలు గానీ అతనితో జోక్యం కల్పించుకుంటాయి. ప్రతి ఒక్క పరిమాణంలోనూ, ఎన్నో స్థాయులు ఉంటాయి. అన్ని రకాల సందేశాలు అతన్ని కలత పెడుతుంటాయి. అదీగాక ఒక వ్యక్తి యొక్క ప్రధాన చైతన్యం ముందరి జన్మలలో ఏదో తప్పు పని చేసి ఉండొచ్చు. ఆ ఋణదాతలు అతడికి హాని తలపెట్టవచ్చు. అన్ని రకాల విషయాలు బయటపడవచ్చు. ఇదంతా మానసిక వైకల్యం అని మేము అంటాము. మీకోసం దీనిని మేము ఎందుకు పోగొడతాము? ఒక వ్యక్తి నిజంగా ఈ విధంగా మానసిక వైకల్యాన్ని పొందుతాడని నేను చెప్తున్నాను. దీని గురించి ఏం చెయ్యాల్సి ఉంది? ఆ వ్యక్తికి తగిన విధంగా బోధించి అతడు స్పృహలోకి వచ్చేలా సాయపడండి – కానీ అలా చెయ్యడం అతికష్టం. మానసిక వైద్యశాలలోని వైద్యుడు కరెంట్ షాక్ ఇచ్చే సాధనాన్ని తన చేతిలోకి తీసుకోగానే, ఆ రోగి విపరీతమైన భయానికి గురై, ఆ పై అర్థం లేని మాటలేవీ మాట్లాడడు. ఇలా ఎందుకు? ఆ క్షణంలో ఈ వ్యక్తి ప్రధాన ఆత్మ అప్రమత్తమై, అది ఆ కరెంట్ షాక్‌కు భయపడుతుంది.

సాధారణంగా, ఒక వ్యక్తి ఆధ్యాత్మిక సాధనాద్వారం దగ్గరకు చేరుకున్నప్పుడు, ముందుకు సాగాలనే కోరుకుంటాడు. ప్రతి ఒక్కరిలోనూ బుద్ధ–స్వభావం, ఆధ్యాత్మిక సాధన కోసం హృదయపూర్వక సంకల్పం ఉంటుంది. అందువల్ల, అది తెలుసుకున్న తరవాత, చాలామంది సాధకులు తమ జీవితంలో మిగిలిన కాలమంతా ఆధ్యాత్మిక సాధన చేస్తుంటారు. అతడు సఫలతను అందుకొని ఫాను పొందగలడా అన్న విషయం అప్రస్తుతం. ఏది ఏమైనా ఆ వ్యక్తికి తావోను అనుసరించాలని, దానిని సాధన చేయాలన్న

నిరంతర హృదయపూర్వక సంకల్పం ఉంటుంది. అతడు చీ గోంగ్ సాధన చేస్తాడని అందరికీ తెలుసు. అతడి కార్యాలయంలోని వారందరికీ అది తెలుసు, అతడి పక్క ఇంటి వారికి తెలిసినట్లే ఇరుగుపొరుగు వారందరికీ తెలిసి ఉంటుంది. కానీ అందరూ ఇది ఆలోచించండి: ఆధ్యాత్మిక సాధనకు సంబంధించినంతవరకు, కొద్ది సంవత్సరాల క్రితం వరకు ఇటువంటి పని ఎవరు చేశారు? ఎవ్వరూ చెయ్యలేదు. ఒక వ్యక్తి నిజంగా ఆధ్యాత్మిక సాధన చేస్తేనే, అతడి జీవనయానం మార్చబడుతుంది. అయితే నియమబద్ధంగా చీ గోంగ్ సాధన చేస్తున్న ఈ వ్యక్తి, దానిని కేవలం వ్యాధినిర్మూలన, దేహపుష్టి నిలుపుకోవడం కోసమే చేస్తున్నాడు. అతడి జీవనమార్గాన్ని ఎవరు మారుస్తారు? ఒక సామాన్య వ్యక్తిగా అతడు ఒక రోజున ఏదో ఒక వ్యాధికి గురవుతాడు లేదా మరొక రోజున ఒక సమస్యలో చిక్కుకుంటాడు. అతడు ఏదో ఒక రోజున మానసికరోగి కావచ్చు లేదా చనిపోవచ్చు. ఒక సామాన్య వ్యక్తి జీవితమంతా అలాగే ఉండిపోతుంది. ఒక వ్యక్తి పార్కులో చీ గోంగ్ సాధన చెయ్యడం మీరు చూసినా, నిజానికి, అతడు నిజమైన ఆధ్యాత్మిక సాధన చెయ్యడం లేదు. అతడు ఉన్నతస్థాయిలకు చేరే ఆధ్యాత్మిక సాధన చెయ్యాలని కోరుకున్నా, ఒక ధర్మ బద్ధమైన మార్గం దొరకనిదే చెయ్యలేడు. అతడికి కేవలం ఉన్నతస్థాయిలకు చేరే ఆధ్యాత్మిక సాధన చెయ్యాలన్న కోరిక మాత్రమే ఉంది. ఈ వ్యక్తి ఇంకా వ్యాధినిర్మూలన, దేహపుష్టి నిలుపుకోవడం కోసం చేసే దిగువ స్థాయి చీ గోంగ్ అభ్యసిస్తున్నవాడే. అతడి జీవనమార్గాన్ని ఎవరూ మార్చరు, కనక అతడికి వ్యాధులు ఉంటాయి. పుణ్యమునకు విలువనివ్వని వ్యక్తి యొక్క వ్యాధులు కూడా స్వస్థపరచబడవు. ఒక వ్యక్తి చీ గోంగ్ సాధన చేస్తే, వ్యాధిగ్రస్తుడు కాడు అన్నమాట నిజం కాదు.

ఒక వ్యక్తి నిజమైన ఆధ్యాత్మిక సాధన చేస్తూ, తన షిన్ షిన్‌పై శ్రద్ధ పెట్టాలి. కేవలం నిజమైన ఆధ్యాత్మిక సాధన చెయ్యడంవల్లనే, ఒక వ్యక్తి వ్యాధి నిర్మూలించబడుతుంది. చీ గోంగ్ సాధన ఒక శారీరక వ్యాయామం మాత్రమే కాక, సామాన్య మానవులకు అతీతమైన విషయం కావడంవల్ల సాధకులకు ఒక ఉన్నతమైన నియమమూ, ప్రమాణమూ ఉండాలి. ఒక వ్యక్తి తన లక్ష్య సాధన కోసం దాన్ని అనుసరించాలి. అయినా ఎందరో దానిని అనుసరించక,

సామాన్య వ్యక్తులుగా మిగిలిపోయారు. అందువల్ల, సమయం వచ్చినప్పుడు వ్యాధిగ్రస్తులు అవుతారు. ఈ వ్యక్తి హఠాత్తుగా మెదడుకు సంబంధించిన వ్యాధి లేదా, ఏదో ఒక వ్యాధి బారిన పడడం, లేదా మానసికరోగి కావడంగానీ జరగొచ్చు. అతడు చీ గోంగ్ సాధన చేస్తాడని అందరికీ తెలుసు. ఒకసారి మానసికరోగి అయితే జనులు "అతడికి ఆధ్యాత్మికపు పిచ్చి పట్టింది" అంటారు, అతడికి ఆ ముద్ర వేయబడుతుంది. ప్రతివారూ ఇది ఆలోచించండి: ఇలా చెయ్యడం సమంజసమేనా? ఒక సామాన్య వ్యక్తికి సత్యం తెలియదు. నిపుణులకు, సాధకులలో చాలామందికి కూడా దీని యొక్క యదార్థం తెలుసుకోవడం కష్టం. ఈ వ్యక్తికి ఇంట్లో ఉండగా మానసిక ప్రకోపం కలిగితే, అది అతడికి చీ గోంగ్ సాధనవల్ల వచ్చిందని ఇతరులు అన్నప్పటికీ, అది ఎక్కువ సమస్యాత్మకంగా ఉండదు. అతడికి వ్యాయామ స్థలంలో ప్రకోపిస్తే, పరిస్థితి దారుణంగా ఉంటుంది. ఒక అతిగాఢమైన ముద్ర పడి, ఆ వ్యక్తి ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ, దానిని చెరపడం అసాధ్యం అవుతుంది. వార్తాపత్రికలు చీ గోంగ్ సాధన ఆధ్యాత్మిక పిచ్చికి కారణం అయిందని ప్రచురిస్తాయి. కొందరు చీ గోంగ్ వైపు కనీసం చూడకుండా "చూడండి, కొంతసేపటి క్రింద ఇక్కడ చీ గోంగ్ అభ్యాసాలు చేస్తూ బాగానే ఉన్నాడు, ఇంతలోనే ఇలా మారిపోయాడు" అని చీ గోంగ్‌కు వ్యతిరేకంగా మాట్లాడతారు. ఒక సామాన్య వ్యక్తిగా అతడికి ఏమేమి జరగవలసి ఉందో, అదంతా జరుగుతుంది. అతడికి ఇతర వ్యాధులు రావచ్చు, లేదా ఇతర కష్టాలలో పడవచ్చు. అన్నిటికీ చీ గోంగ్ సాధననే విమర్శించడం సమంజస మేనా? ఈ విషయం : ఒక వ్యక్తి వైద్యుడు కనక అతడికి జీవితంలో ఎప్పుడూ అనారోగ్యం రాకూడదు – అని వైద్యశాలలోని వైద్యుని గురించి అన్న చందంగా ఉంటుంది. దీన్ని ఆ విధంగా అర్థం చేసుకోవడం ఏమిటి?

అందువల్ల, చీ గోంగ్ గురించి, దాని వెనుకనున్న నియమాలను గురించిన అసలైన నిజాలు తెలుసుకోకుండా చాలామంది మతిలేని వ్యాఖ్యలు చేస్తారని చెప్పొచ్చు. ఒకసారి ఒక సమస్య వస్తే, చీ గోంగ్ మీద అనేక ముద్రలు ఆరోపించబడతాయి. చీ గోంగ్ చాలా కొద్దికాలమే సంఘంలో ప్రాచుర్యంలో ఉండినది. చాలామంది మూర్ఖపు భావాలు కలిగి యుండి, ఎప్పుడూ దాన్ని

నిరాకరించి, అపవాదులు వేస్తారు, తిరస్కరిస్తారు. ఈ వ్యక్తుల అభిప్రాయసరళి ఏమిటో, ఎవరికీ తెలియదు. వారికి చీ గోంగ్ ఏదో చేసేస్తుంది అన్నట్లు అదంటేనే వారికి పడదు. చీ గోంగ్ అన్న మాట వినగానే అది ఒక కల్పన అని పేర్లు పెడతారు. చీ గోంగ్ ఒక శాస్త్రం, ఒక ఉన్నతమైన శాస్త్రం. ఇది ఎందుకు జరుగుతుందంటే, ఆ వ్యక్తుల మనస్తత్వాలు అతిమూర్ఖమైనవి, వారికి ఉండేది మిడిమిడి జ్ఞానం.

సాధకుల సమాజంలో ఉన్న మరొక పరిస్థితిని "చీ గోంగ్ స్థితి", అంటారు. అటువంటి వ్యక్తికి మానసిక భ్రమలుంటాయే తప్ప ఆధ్యాత్మికపు పిచ్చి ఉండదు. ఈ స్థితిలో ఉన్న వ్యక్తి అసాధారణమైన హేతుబద్ధతను కలిగి ఉంటాడు. మొదటగా చీ గోంగ్ స్థితి అంటే ఏమిటో నన్ను వివరించనివ్వండి. చీ గోంగ్ సాధనలో ఒక వ్యక్తి యొక్క జన్మసంస్కారం అన్న అంశం కూడి ఉంటుందన్నది తెలిసిన విషయమే. మతాన్ని నమ్మేవారిలో అన్ని దేశాలకు చెందిన ప్రజలూ ఉంటారు. అనేక వేల సంవత్సరాలుగా చైనాలో బౌద్ధమతాన్ని, తావోమతాన్ని నమ్మినవారున్నారు. మంచి పనులకు మంచి ప్రతిఫలం, పాపపు పనులకు దుష్ట ఫలితాలు వస్తాయని వారు నమ్ముతారు. కానీ కొంతమంది దీన్ని నమ్మరు. ప్రత్యేకించి, మహాసాంస్కృతిక విప్లవకాలంలో దీన్ని విమర్శించి మూఢనమ్మకంగా ముద్ర వేశారు. తాము అర్థం చేసుకోలేనిదీ, పాఠ్యపుస్తకాలలో నేర్చుకోనిదీ, ఆధునిక విజ్ఞానశాస్త్రంలో ఇంకా అభివృద్ధి కానిదీ, ఇంకా అర్థం చేసుకోబడనిది అయిన ప్రతిదీ మూఢనమ్మకమే అని పరిగణిస్తారు. కొన్ని సంవత్సరాల క్రితం ఇటువంటివారు అనేకులు ఉండేవారు, కానీ ఇప్పుడు కొద్దిమందే ఉన్నారు. మీరు కొన్ని పరిణామాలు గుర్తించకపోయినా మన పరిమాణంలో అవి ఇప్పటికే కనిపించాయి. మీరు వాటిని గుర్తించేందుకు సాహసించరు, కానీ వాటిని గురించి మాట్లాడడానికి, జనులకు ఇప్పుడు ధైర్యం ఉంది. చీ గోంగ్ సాధనల గురించి విని, లేదా ప్రత్యక్షంగా చూసీ, వారు కొన్ని నిజాలను కూడా తెలుసుకున్నారు.

కొంత మంది ఎంతటి మూర్ఖులంటే, మీరు చీ గోంగ్‌ను ప్రస్తావించగానే, వారు తమ మనసుల లోలోతుల్లో మిమ్మల్ని చూసి నవ్వుకుంటారు. మీరు చాదస్తులని, చాలా హాస్యాస్పదంగా మాట్లాడుతున్నారని తలుస్తారు. మీరు

చీ గోంగ్‌లో జరిగే ప్రక్రియల గురించి చెప్పగానే మిమ్మల్ని అతి అజ్ఞానులుగా జమ కడతారు. ఆ వ్యక్తి దురభిమానంతో ఉన్నా అతడి యొక్క జన్మ సంస్కారం చెడ్డది అయి ఉండకపోవచ్చు. ఒకవేళ అతడికి మంచి జన్మ సంస్కారం ఉండి, అతడు చీ గోంగ్ సాధన చెయ్యాలనుకుంటే, అతడి దివ్యనేత్రం అత్యున్నత స్థాయిలో తెరచుకోవచ్చు, అతడు అతీంద్రియ శక్తులను కూడా పొందవచ్చు. అతడికి చీ గోంగ్ మీద నమ్మకం లేకపోవచ్చు, కానీ తాను వ్యాధుల బారిన పడనని అతడు రూఢిగా చెప్పలేకపోవచ్చు. అతడు జబ్బు పడినప్పుడు ఆసుపత్రికి వెళ్ళవచ్చు. పాశ్చాత్య వైద్యుడు అతడికి స్వస్థత కలిగించలేకపోతే అతడు చైనీయ వైద్యుడి దగ్గరకు వెళ్ళొచ్చు. చైనీయ వైద్యుడు కూడా తన వ్యాధిని స్వస్థపరచలేకపోతే, ఏ విధమైన ప్రత్యేకమైన మందులు కూడా పని చెయ్యని సమయంలో అతడు చీ గోంగ్ గురించి తలచి: “చీ గోంగ్ నా వ్యాధిని నయం చేస్తుందేమో నా అదృష్టాన్ని పరీక్షించి చూసుకుంటాను” అని జాగ్రత్తగా ఆలోచిస్తాడు. అతడు చాలా తటపటాయిస్తూ వస్తాడు. మంచి జన్మ సంస్కారం వల్ల, చీ గోంగ్ సాధన ప్రారంభిస్తూనే, అతడు చాలా చక్కగా చేయగలుగుతాడు. బహుశా ఒక గురువు అతడిపట్ల శ్రద్ధ వహించవచ్చు, లేదా మరొక పరిమాణంలోని ఉన్నతజీవి అతడికి చేయూతనీయవచ్చు. హఠాత్తుగా, అతడి దివ్యనేత్రం తెరుచుకుంటుంది, లేదా అతడు కొంతవరకు జ్ఞానోదయం పొందిన స్థితిలో ఉంటాడు. ఒక అత్యున్నత స్థాయిలో తెరచుకున్న దివ్యనేత్రంతో అతడు ఉన్నట్లుండి ఏదో విశ్వసత్యాన్ని చూడగలుగుతాడు. పైగా, అతడికి అతీంద్రియ శక్తులు వస్తాయి. అటువంటి వ్యక్తి ఈ రకమైన పరిస్థితిని చూసినప్పుడు అతడి మనసు దానిని తట్టుకోగలదని మీరు చెప్పగలరా? అతడు ఏ రకమైన మానసికస్థితిలో ఉంటాడని మీరు అనుకుంటున్నారు? ఇతరుల మాటలలో విన్నది ఒకప్పుడు మూఢనమ్మకంగా, పూర్తిగా అసాధ్యమని, ఎగతాళిగానూ పరిగణించినదే అతడి కళ్ళముందు నిజంగా నిలిచి ఉంది, అతడు దానితో సంబంధాన్ని కలిగి ఉన్నాడు. అప్పటి మానసికపు ఒత్తిడి విపరీతంగా ఉండడం వల్ల, ఈ వ్యక్తి మనసు దానిని తట్టుకోలేకపోతుంది. అతడి మనసు హేతు బద్ధంగా ఉన్నప్పటికీ, ఇతరులకు అది అర్థం కాదు. కానీ అతడు రెండువైపుల మధ్యన ఉన్న సంబంధాన్ని సమతూకం చెయ్యలేక

పోతాడు. ఆవలి వైపున చేయబడే పని సాధారణంగా సరియైనది కాగా, మానవజాతి చేస్తున్నదే తప్పు అని అతడు కనుగొంటాడు. అక్కడ జరుగుతున్న విధంగా అతడు పనులు చేస్తే, జనులు అతడూ తప్పు చేస్తున్నాడంటారు. వారు అతడిని అర్థం చేసుకోలేరు, కాబట్టి అతడికి ఆధ్యాత్మికపు పిచ్చి పట్టిందని అంటారు.

నిజానికి ఈ వ్యక్తికి ఆధ్యాత్మికపు పిచ్చి లేదు. చీ గోంగ్ సాధన చేసే మీలోని చాలామంది ఎంతమాత్రమూ ఇలా తయారవరు. కేవలం అతి దురభిమానం కలిగిన వ్యక్తులు అట్టి చీ గోంగ్ స్థితిని అనుభవిస్తారు. ఇక్కడున్న ప్రేక్షకులలో చాలామందికి – అధికసంఖ్యాకులకు – దివ్యనేత్రం తెరవబడి ఉంది. వాళ్ళు నిజంగా ఇతర పరిమాణాలలోని విషయాలను పరిశీలించారు. వారు ఎటువంటి ఆశ్చర్యానికి లోనుకాలేదు, ఆరోగ్యంగానే ఉన్నారు, వారి మెదడు ఎటువంటి అఘాతానికి గురికాలేదు, వారు ఈ చీ గోంగ్ స్థితిలోనూ లేరు. ఒక వ్యక్తి చీ గోంగ్ స్థితిలో ఉన్న తరవాత, అతడు చాలా హేతుబద్ధంగా ఉంటూ, అర్థవంతంగా మాట్లాడతాడు. సామాన్య వ్యక్తులు మాత్రం అతడు చెప్పేదాన్ని నమ్మరు. చనిపోయిన ఒక వ్యక్తి తనకు కనిపించాడని, అతడు ఏదో పని చెయ్యమని తనకు చెప్పాడనీ అతడు మీకు చెప్పొచ్చు. సామాన్య వ్యక్తులు దీనిని ఎలా నమ్మగలరు? తరవాత, ఈ వ్యక్తి ఇటువంటి విషయాల గురించి చెప్పే బదులు తనలోనే ఉంచుకోవాలని అర్థం చేసుకుంటాడు. రెండువైపుల ఉన్న విషయాలతో సరిగ్గా వ్యవహరించగలిగినప్పుడు అన్నీ సరిగ్గానే ఉంటాయి. విలక్షణంగా, ఈ వ్యక్తులు అతీంద్రియ శక్తులను కూడా కలిగి ఉంటారు గానీ, ఇది కూడా ఆధ్యాత్మికపు పిచ్చి కాదు.

“నిజమైన పిచ్చి” అన్న మరొక పరిస్థితి కూడా ఉంటుంది కానీ, అది చాలా అరుదుగా కనబడుతుంది. ఈ “నిజమైన పిచ్చి” అని మేము చెప్తున్న పరిస్థితిలో నిజంగా ఒక పిచ్చివాడు ఉండడు. ఆ అర్థానికి బదులుగా “సత్యం యొక్క ఆధ్యాత్మిక సాధన” అన్న అర్థాన్ని తెలుపుతుంది. నిజమైన పిచ్చి ఏమిటి? అటువంటి వ్యక్తి బహుశా లక్ష మందిలో ఒకడు, చాలా అరుదుగా కనిపిస్తాడని నేను చెప్తాను. ఫలితంగా, అది సాధారణ విషయమూ కాదు, సమాజంపై ఎటువంటి ప్రభావమూ చూపదు.

సాధారణంగా "నిజమైన పిచ్చి"కి ముందస్తు అవసరం ఒకటి ఉంది. అదేమిటంటే, ఈ వ్యక్తికి ఒక అత్యుత్తమమైన జన్మ సంస్కారం ఉండి తీరాలి, అతడు వయోవృద్ధుడై ఉండాలి. వయసు మీరిపోయిన కారణంగా ఆ వ్యక్తికి ఆధ్యాత్మిక సాధన చేయడానికి ఆలస్యం అయిపోతుంది. అత్యుత్తమమైన జన్మ సంస్కారం కలిగి ఉన్నవారు ఇక్కడ ఒక లక్ష్యసాధన కోసం ఉంటారు, వారు అత్యున్నత స్థాయిల నించి వచ్చి ఉంటారు; ప్రతివారూ ఈ సామాన్య మానవ సంఘంలోకి వచ్చి వెళ్ళాలంటే భయపడతారు, ఎందుకంటే ఒక వ్యక్తి యొక్క జ్ఞాపకశక్తి తుడిచివేయబడిన తరవాత అతడు ఎవరినైనా గుర్తు పట్టడానికి అశక్తుడవుతాడు. ఒక వ్యక్తి సామాన్య మానవులకు చెందిన ఈ సాంఘిక వాతావరణంలోకి వచ్చిన తరవాత, మానవుల జోక్యం కారణంగా అతడు కీర్తి, ధనముల వెంటపడి, సామాన్య మానవుల స్థాయికి పడిపోతాడు. అక్కడి నించి తప్పించుకునే రోజన్నదే అతడికి ఉండదు. అందరూ భయపడతారు, అందువల్ల ఎవ్వరూ ఇక్కడికి వచ్చే సాహసం చెయ్యరు. అయినప్పటికీ, ఇక్కడికి వచ్చిన మనుషులూ ఉన్నారు. వచ్చిన తరవాత వారు సామాన్య మానవుల నడుమ సరైన ప్రవర్తనను నిలుపుకోలేకపోతారు. వారు తమ జీవిత కాలాలలో నిజంగా క్రింద స్థాయులకు పడిపోయి అనేక దుష్కర్మలు చేస్తారు. ఒక వ్యక్తి తన స్వలాభం కోసం పోటీపడడానికి జీవిస్తుంటే, అతడు అనేక దుష్కర్మలకు పాల్పడి ఇతరులకు చాలా ఋణపడతాడు. అతడు పడిపోబోతున్నట్లు అతడి గురువు చూస్తారు. అయితే అతడు ఫలస్థితిని అందుకొని ఉన్న వ్యక్తి, కాబట్టి ఆ గురువు అతడిని అంత సులభంగా దిగజారనివ్వరు! ఏం చెయ్యాలి? అతడి గురువు చాలా కలత చెందుతారు, అతడి చేత ఆధ్యాత్మిక సాధన కొనసాగింప చేయగల మార్గాలు ఆయన దగ్గర మిగలవు. ఆ సమయంలో అతడికి ఒక గురువు ఎక్కడ దొరుకుతారు? అతడు మొట్టమొదటినించి ఆధ్యాత్మిక సాధనను ప్రారంభించి స్వస్వరూపానికి చేరవలసి ఉంటుంది. కానీ అది సులభంగా ఎలా అవుతుంది? అతడు వృద్ధుడు అయినందువల్ల, ఆధ్యాత్మిక సాధనకు చాలా ఆలస్యం అయిపోతుంది. అతడికి మనశ్శరీరాల ఆధ్యాత్మిక సాధన ఎక్కడ దొరుకుతుంది?

కేవలం అతడికి అత్యుత్తమ జన్మ సంస్కారం ఉండి, చాలా అసాధారణమైన

ఈ పరిస్థితిలో మాత్రమే నిజమైన పిచ్చి అన్న ఈ పద్ధతి అతడిపై ప్రయోగించవచ్చు. మరొక రకంగా చెప్పాలంటే, ఆ వ్యక్తి తనంతటతాను స్వస్వరూపానికి చేరుకోగల ఆశ ఏమాత్రమూ లేనప్పుడు అతడిని మతి లేనివాడిగా చెయ్యడానికి ఈ పద్ధతి ప్రయోగించబడవచ్చు. అతడి మెదడులోని కొన్ని క్రియలు ఆపివేయబడతాయి. ఉదాహరణకు, మానవులుగా మనం చలికి, మురికికి భయపడతాము, కాబట్టి అతడి మెదడులో చలికి, మురికికి భయపడే భాగాలు పని చెయ్యకుండా ఆపివేయబడతాయి. కొన్ని క్రియలు ఆగిపోయిన తరవాత అతడు మానసిక సమస్యలు కలిగి ఉన్నట్లు, నిజంగానే పిచ్చిపట్టిన మనిషిలాగే వ్యవహరిస్తాడు. కాని అతడు సాధారణంగా ఎటువంటి దుష్కర్మలు చెయ్యడు, ఎవరినీ అవమానించడు, కొట్టడు. దానికి మారుగా, అతడు తరచుగా మంచి పనులు చేస్తూ ఉంటాడు, కానీ తనపట్ల తాను చాలా క్రూరంగా ప్రవర్తిస్తాడు. చలిగా ఉన్నదని గ్రహించలేకపోవడం వలన, మంచులో పలుచని దుస్తులు ధరించి, నగ్న పాదాలతో పరిగెత్తుతాడు. రక్తం కారిపోయేంతగా అతడి పాదాలు గడ్డకట్టిపోతాయి. మురికిపట్ల జ్ఞానం లోపించడంతో అతడు మానవుల మలాన్ని తిని, మానవుల మూత్రాన్ని తాగుతాడు. ఎండిపోయి గట్టిగా తయారైన గుర్రపు లద్దెను రుచికరంగా ఉన్నట్లు తినే ఒక వ్యక్తి ఒకప్పుడు నాకు తెలుసు. చైతన్యవంతమైన మనసు కలిగి ఉన్న సామాన్య వ్యక్తి భరించలేని కష్టాలను అతడు భరించగలుగుతాడు. ఈ పిచ్చి అతడిని ఎంతగా బాధించిందో ఒక్కసారి ఊహించండి. నిజానికి అటువంటి వ్యక్తులకు సాధారణంగా అతీంద్రియ శక్తులు ఉంటాయి; వారిలో వృద్ధ స్త్రీలు అధికంగా ఉంటారు. గతంలో ఒక వృద్ధ స్త్రీకి పాదాలను చిన్నగా ఉంచడానికి బాల్యంలోనే పాదాలు బంధింపబడ్డాయి, కానీ ఆమె ఎటువంటి శ్రమ లేకుండానే రెండు లేదా అంతకంటే ఎక్కువ మీటర్ల ఎత్తున్న గోడ మీదినించి అవతలకు దూకేది. ఆమెకు మతి భ్రమించి ఎప్పుడూ ఇంటినించి పారిపోతున్నదని గమనించిన కుటుంబసభ్యులు ఆమెను ఇంట్లో పెట్టి తాళం వేసేవారు. ఒకసారి కుటుంబ సభ్యులందరూ ఇంటినించి బయటకు వెళ్ళిపోయిన తరవాత ఆమె కేవలం తన చేతివేళ్ళను తాళం వైపు చూపించి దానిని తెరిచేది. అప్పుడు పారిపోయేది. ఆ తరవాత వారు ఆమెను ఇనుప

గొలుసులతో బంధించి ఆపేవారు. అందరూ ఇల్లు వదిలిన తరవాత ఆమె సులభంగా వాటిని వదిలించుకునేది. ఆమెను ఆపడమన్నది అసాధ్యంగా ఉండేది. దీనివల్ల, ఆమె అనేక కష్టాలను అనుభవించేది. ఆమె చాలా కఠినమైన విధానంలో బాధను సహించడంవల్ల, తన దుష్కర్మల చేత కలిగిన ఋణాలను త్వరగా తీర్చివేయగలదు. ఆ బాధ విపరీతంగా ఉండిన కారణంగా, అందు కొరకు అధికాధికంగా మూడేళ్ళు పట్టొచ్చు, సాధారణంగా అయితే, ఒకటో రెండో ఏళ్ళు పట్టొచ్చు. ఆ తరవాత జరిగినదంతా ఆమెకి ఒక్కసారిగా అర్థ మవుతుంది. ఆమె తన ఆధ్యాత్మిక సాధనను సంపూర్ణం చేసుకున్నందువల్ల, రకరకాల దివ్యశక్తులు వెలువడుతూ, ఆమె యొక్క గోంగ్ ఒక్క ఉదుటున బంధం విప్పుకుంటుంది. ఇటువంటి సందర్భాలు చాలా అరుదుగా కనిపిస్తాయి, కానీ చరిత్ర అంతటా కొన్ని జరిగాయి. సగటు స్థాయి జన్మ సంస్కారం కలిగినవారికి ఇలా చేసేందుకు అనుమతి ఉండదు. చరిత్రలో నిజంగానే పిచ్చిపట్టిన భిక్షువులు, తావో మతస్థులు ఉన్నట్లు లిఖితమై ఉందని తెలిసిన విషయమే, వారిలో, చిన్ హ్వే (1) ను చీపురు పట్టుకొని మందిరం నించి తరిమివేసిన పిచ్చివాడైన ఒక భిక్షువు గురించి, మరికొందరు పిచ్చివారైన తావో మతస్థుల గురించిన కథలున్నాయి. అటువంటి అనేక సంప్రదాయ కథలున్నాయి.

ఆధ్యాత్మిక పిచ్చి విషయానికి వస్తే, అది లేదని మేము నిశ్చయంగా చెప్పగలం. ఒకవేళ ఒక వ్యక్తి అగ్నిని పుట్టించగలిగితే, (2) అది నిజంగా జరిగితే, అతడు ఒక అద్భుత వ్యక్తి అని మేం అంటాం. ఒక వ్యక్తి నోరు తెరవడం ద్వారా లేదా చెయ్యి చాపడం ద్వారా మంటని వెలిగించగలిగితే, లేదా ఒక వేలితో సిగరెట్‌ను వెలిగిస్తే, దానిని నేను ఒక అతీంద్రియ శక్తి అంటాను!

## ఆధ్యాత్మిక సాధనలో అసుర జోక్యం

ఆధ్యాత్మిక సాధనలో అసుర జోక్యం అంటే ఏమిటి? అది చీ గోంగ్ సాధనలో మనం తరచుగా ఎదుర్కొనే ఒక అంతరాయం. చీ గోంగ్ సాధన అసుర జోక్యాన్ని ఎలా ఆహ్వానిస్తుంది? ఒక వ్యక్తి ఆధ్యాత్మిక సాధన చెయ్యాలి అనుకున్నప్పుడు, నిజంగా చాలా కష్టం ఉంటుంది. నా ఫాషెన్ యొక్క రక్షణ

లేకుండా ఒక వ్యక్తి అసలైన ఆధ్యాత్మిక సాధనలో విజయం పొందనే లేదు. మీరు గడప దాటగానే మీ జీవితానికి ప్రమాదం పొంచి ఉండవచ్చు. ఒక వ్యక్తి యొక్క ప్రాథమిక ఆత్మ నశించదు. అప్పుడు, మీ గత జన్మలలోని సాంఘిక కార్యకలాపాలలో, మీరు ఎవరికైనా ఋణపడి ఉండొచ్చు, ఇతరులను బెదిరించి ఉండొచ్చు, లేదా ఇతర దుష్కృత్యాలు చేసి ఉండొచ్చు. ఆ అప్పుల వాళ్ళు మీకోసం చూస్తూ ఉంటారు. ఒక వ్యక్తి కర్మల ప్రాయశ్చిత్తం కొరకే జీవిస్తాడని బౌద్ధమతంలో చెప్పబడింది. మీరు ఎవరికైనా ఏదైనా ఋణపడి ఉంటే, అతడు దాన్ని తిరిగి చెల్లించడానికై ఎదురుచూస్తుంటాడు. అతడు ఋణపడి ఉన్న దానికన్నా అధికమైన చెల్లింపు జరిగితే, అతడే మరుజన్మలో మీకు ఆ అధిక మొత్తాన్ని తిరిగి చెల్లించవలసి ఉంటుంది. ఒక కొడుకు ఒక జన్మలో తన తల్లిదండ్రులని అవమానిస్తే, మరుజన్మలో వాళ్ళు తమ స్థానాలను మార్చుకుంటారు. ఈ విధంగా ఈ చక్రం తిరుగుతూనే ఉంటుంది. కానీ మిమ్మల్ని చీ గోంగ్ సాధనలో ఆటంకపరచే అసుర జోక్యాన్ని మేము నిజంగానే పరిశీలించాము. ఇవి అకారణమైనవి కావు, వీటన్నిటికీ కర్మానుసార సంబంధాలుంటాయి. ఒక కారణం అంటూ లేకుండా అది అనుమతింపబడదు.

అతి సాధారణంగా ఏర్పడే అసుర జోక్యం ఈ క్రింది విధంగా జరుగుతుంది. మీరు చీ గోంగ్ సాధన చేసే ముందు మీ పరిసరాలు ప్రశాంతంగా ఉంటాయి; మీరు చీ గోంగ్‌ను నేర్చుకున్న కారణంగా మీకు ఎప్పుడూ సాధన చెయ్యాలనే ఉంటుంది. అయితే, మీరు ధ్యానంలో కూచోగానే, గది బయట రకరకాల శబ్దాలు మొదలవుతాయి. కార్ల హారన్లు, నడవాలో నడుస్తున్న శబ్దం, మాటలు, భళ్ళుమని తలుపులు వేసిన శబ్దం, బయటినించి రేడియో శబ్దమూ. హఠాత్తుగా అక్కడి నిశ్శబ్దం చెదిరిపోతుంది. మీరు చీ గోంగ్ సాధన చెయ్యాలనుకోకముందు చుట్టుపక్కల అతిప్రశాంతంగానే ఉంటుంది, కానీ మీరు చీ గోంగ్ సాధన మొదలుపెట్టగానే, ఇలా జరుగుతుంది. మీలో చాలా మంది ఎప్పుడూ అంతకన్నా ముందుకు ఆలోచించలేదు. నిజంగా ఏం జరుగుతున్నది? మీకు ఏదో విపరీతంగా అనిపించి, చీ గోంగ్ సాధన చెయ్యలేకపోయినందుకు నిరాశ కలుగుతుంది. ఈ “విపరీతం” మీ సాధనను

ఆపేస్తుంది. అది ఒక పిశాచం కల్పించే అంతరాయం, అది మిమ్మల్ని ఇబ్బందిపెట్టే విధంగా మీ పక్కనున్న వ్యక్తులను మార్చేస్తుంది. ఇది అన్ని రకాలలోకి అతిసరళమైన అంతరాయం, అది మీ చీ గోంగ్ సాధనను ఆపాలన్న లక్ష్యాన్ని సాధించగలుగుతుంది. మీరు చీ గోంగ్ సాధన చేసి తావో అయిపోతే, మీరు ఇతరులకు తీర్చకుండా మిగిలిపోయిన ఋణాల మాట ఏమిటి? వారు దానిని అనుమతించరు, కాబట్టి మిమ్మల్ని చీ గోంగ్ సాధన చెయ్యనివ్వరు. అయితే ఇది ఒక నిర్దిష్టమైన స్థాయికి, ఒక సూచన కూడా. కొంతకాలం తరవాత, ఈ పరిణామం ఉండేందుకు అనుమతింపబడదు. ఇంకో రకంగా చెప్పాలంటే, ఈ ఋణాలకు కాలం చెల్లిన తరవాత, అవి తిరిగి వచ్చి అంతరాయం కలిగించడానికి అనుమతి ఉండదు. ఇది ఎందుకంటే మా ఫాలున్ దాఫాను ఆధ్యాత్మిక సాధన చేసేవారు అతిశీఘ్రంగా అభివృద్ధి సాధిస్తారు, వారు తమ స్థాయులలో పురోగతులను కూడా అతిత్వరగా పొందుతారు.

మరొక విధమైన అసుర జోక్యముంది. చీ గోంగ్ సాధన ద్వారా మన దివ్యనేత్రం తెరచుకుంటుందని మీకు తెలుసు. ఇంటి దగ్గర చీ గోంగ్ సాధన చేస్తుండగా దివ్యనేత్రం తెరచుకొని, కొందరు భయపెట్టే దృశ్యాలనూ, భయంకరమైన ముఖాలనూ చూడ్డం జరగొచ్చు. కొందరికి చిక్కులు పడి ఉన్న పొడుగాటి జుట్టు ఉండవచ్చు, కొందరు మీతో పోట్లాడాలనుకోవచ్చు, లేదా భయంకరమైన అనేక ఇతర కదలికలు చూపొచ్చు. కొన్నిసార్లు ఒక వ్యక్తి వారిని కిటికీ బయట అతిభయంకరంగా కనిపిస్తూ ప్రాకుతూ ఉన్నట్లు చూడొచ్చు. ఈ పరిస్థితి ఏ విధంగా ఏర్పడే అవకాశం ఉంది? ఇది ఒక రకమైన అసుర జోక్యం. అయితే, మా ఫాలున్ దాఫా సిద్ధాంతంలో ఈ సందర్భం చాలా అరుదుగా కనిపిస్తుంది. బహుశా నూటికి ఒక్క వ్యక్తికి ఇలా జరగొచ్చు. ఎక్కువమందికి ఈ పరిస్థితి ఎదురవదు. మీ సాధనకు దీని వల్ల ఎటువంటి మేలు కలగకపోవడంవల్ల, మీకు ఇలాంటి అంతరాయం కలగడానికి అనుమతి ఉండదు. ఇతర సాంప్రదాయ సాధనలలో, ఈ విధమైన అంతరాయం అతి సహజ పరిణామం, అది చాలాకాలం కొనసాగుతుంది కూడా. కొందరు కేవలం ఈ కారణంగా భయపడిపోయి చీ గోంగ్ సాధనను

చెయ్యలేకపోతారు. ఒక వ్యక్తి సాధారణంగా చీ గోంగ్ సాధన కోసం ప్రశాంతమైన రాత్రి వేళను ఎన్నుకుంటాడు. ఒక వ్యక్తి తన ఎదుట సగం మనిషి, సగం దయ్యంగా ఉన్న వ్యక్తిని చూడ్డం జరిగితే అతడు చీ గోంగ్ సాధనను చెయ్యడానికి విపరీతంగా భయపడతాడు. మా ఫాలున్ దాఫాలో ఇటువంటి పరిణామం ఉండదు. కానీ కొన్ని అతిఅరుదైన మినహాయింపులు ఉండవచ్చు, ఎందుకంటే, కొంతమందికి చాలా ప్రత్యేక పరిస్థితులుంటాయి.

బాహ్యమూ, అంతరమూ రెండూ కలిసిన ఆధ్యాత్మిక సాధనలతో కూడిన మరొక అభ్యాసం కూడా ఉంది. దానిలో యుద్ధ విద్యలు, అంతర ఆధ్యాత్మిక సాధనల యొక్క ఆవశ్యకత ఉంది. ఈ రకమైన సాధన సాధారణంగా తావో సిద్ధాంతంలో కనిపిస్తుంది. ఒక వ్యక్తి ఈ సాధనను నేర్చుకున్నప్పుడు, సాధారణ సాధనలలో ఎదురుకానిది, కేవలం బాహ్యాంతర ఆధ్యాత్మిక సాధనలో లేదా యుద్ధవిద్యల సాధనలో మాత్రమే ఎదురయ్యే అసుర జోక్యానికి తరచు గురవుతాడు. అదేమిటంటే, అతడితో యుద్ధం చెయ్యాలని ప్రయత్నిస్తూ ఉండేవారు ఉంటారు. ప్రపంచంలో అనేకమంది తావో మత సాధకులున్నారు; వారిలో చాలామంది యుద్ధవిద్యలను లేదా బాహ్యాంతర ఆధ్యాత్మిక సాధనలను నేర్చుకునే విద్యార్థులు ఉన్నారు. యుద్ధ విద్యలను నేర్చుకునే విద్యార్థి కూడా గోంగ్‌ను పెంచుకోగలుగుతాడు. ఎందువలన? ఒక వ్యక్తి కీర్తి, స్వలాభంవంటి ఇతర బంధాలను తొలగించుకో గలిగితే, అతడు కూడా గోంగ్‌ను పెంచుకోగలుగుతాడు. అయితే పోటీపడడం అన్న అతడి బంధం వదలడానికి సమయం పడుతుంది, అది మెల్లగా దూరం అవుతుంది. అందువల్ల అతడు కొన్ని స్థాయిలలో కూడా అటువంటి పనులు సులభంగా చెయ్యగలుగుతాడు. సమాధి స్థితిలో కూచొని ఉన్నప్పుడు, ఎవరు యుద్ధవిద్యలను అభ్యసిస్తున్నారన్న విషయం అతడికి తెలుస్తుంది. అతడి ప్రాథమిక ఆత్మ అతడి శరీరాన్ని విడిచి యుద్ధవిద్యలలో ఎవరు మెరుగుగా ఉన్నారో తేల్చుకోవడానికి అవతలి వ్యక్తిని పోటీకి రెచ్చగొడుతుంది, అప్పుడు ఈ యుద్ధం ప్రారంభం అవుతుంది. ఈ విషయాలు ఇతడితో ఎవరైనా యుద్ధానికి రావడంతో మరొక పరిమాణంలో కూడా జరుగుతాయి. అతడు నిరాకరిస్తే రెండో వ్యక్తి ఇతడిని నిజంగానే చంపుతాడు. ఆ విధంగా ఆ ఇద్దరి

మధ్య ఒక యుద్ధం మొదలవుతుంది. ఈ వ్యక్తి నిద్ర పోతుండగా, ఎవరో వచ్చి ఇతడిని యుద్ధానికి పిలుస్తారు, ఇది అతడిని ఆ రాత్రికి అశాంతి పాలుచేస్తుంది. నిజానికి, ఇది అతడికి పోటీపడే గుణంపట్ల ఉన్న బంధాన్ని తొలగించుకోవలసిన సమయం. ఈ పోటీ మనస్తత్వాన్ని వదిలించుకోకపోతే, అతడు ఎప్పటికీ అలాగే ఉండిపోతాడు. కాలం గడుస్తున్న కొద్దీ, ఎన్ని సంవత్సరాల తరవాత అయినా, అతడు ఆ స్థాయిని దాటి ఎదగలేడు. అతడు చీ గోంగ్ సాధనను కొనసాగించే విషయంలో అశక్తుడు అవుతాడు. ఎక్కువ శక్తి వినియోగించడంవల్ల, అతడి భౌతికశరీరం కూడా ఇక ఏమాత్రమూ భరించలేక సులభంగా నిర్వీర్యం అవుతుంది. ఆ విధంగా, బాహ్యాంతర ఆధ్యాత్మిక సాధనలలో ఒక వ్యక్తి ఈ పరిస్థితిని ఎదుర్కోవచ్చు, ఇది సర్వ సాధారణం కూడా. మా యొక్క అంతర ఆధ్యాత్మిక సాధనలో ఇటువంటి పరిస్థితే లేదు, అలా జరగడానికి అనుమతి కూడా ఉండదు. నేను ఇంతకు ముందే వివరించిన ఈ వివిధ రూపాలు సర్వసాధారణంగా కనిపిస్తూ ఉంటాయి.

మన సాధనా సిద్ధాంతంలోని ప్రతి వ్యక్తితో సహా మనుషులందరూ ఎదుర్కొనే మరొక అసుర రూపముంది. అది కామం అనే దయ్యం. ఇది ఒక అతి తీవ్రమైన విషయం. సాధారణ మానవ సంఘంలో, వైవాహిక జీవితం ద్వారా మానవజాతి తమ వారసులను సృష్టించగలుగుతున్నది. మానవజాతి ఈ విధంగా వృద్ధి పొందుతున్నది, మానవ సంఘంలో సున్నిత భావజాలం ఉంది. ఆ విధంగా సామాన్య మానవుల విషయంలో ఇది సమర్ధనీయమే. మానవులకు తమ సున్నితభావాలవల్ల, కలత చెందడం సున్నిత భావమే, అలాగే సంతోషం, ప్రేమ, ద్వేషం, ఒక పనియందు ఇష్టమూ, మరొక పని యందు అయిష్టమూ, ఒక వ్యక్తి కంటే మరొక వ్యక్తిని కోరుకోవడమూ, ఇష్టమైన వ్యాపకాలు, అయిష్టాలూను. అన్నీ సున్నిత భావజాలానికి చెందినవే, సామాన్య మానవులు కేవలం దానికోసమే బ్రతుకుతారు. అటువంటప్పుడు, ఆ స్థాయికన్నా ఎత్తుకు, అతీతంగా ఎదిగే సాధకుడిగా, ఒక వ్యక్తి విషయాలను గురించి తీర్పు చెప్పడానికి ఈ మార్గాన్ని ఉపయోగించరాదు, అతడు వాటిని తెంచుకోవాలి. ఆ విధంగా సున్నితభావాల నుండి పెరిగే అనేక బంధాల

విషయంలో వాటిని తేలికగా తీసుకుంటూ, చివరికి వాటిని త్యజించివేయాలి. కోరికలు, దేహవాంఛ, ఇంకా ఇటువంటి విషయాలన్నీ మానవ బంధాలు, వాటన్నిటినీ త్యజించాలి.

సామాన్య మానవుల నడుమ ఆధ్యాత్మిక సాధన చేసే సాధకుల విషయంలో మా సాధనాసిద్ధాంతం మిమ్మల్ని సన్యాసి లేదా సన్యాసినిగా తయారవాలని చెప్పదు. యువ సాధకులు కుటుంబాలను కలిగి ఉండాలి. అయితే ఈ విషయంలో ఎలా వ్యవహరించాలి? మా సాధనా సిద్ధాంతం నేరుగా ఒక వ్యక్తి మనసును లక్ష్యంగా చేసుకుంటుందని నేను చెప్పాను. దీని కారణంగా మీరు నిజంగా మీ ప్రాపంచిక ప్రయోజనాలలో ఒక్కటి కూడా వదులుకోవలసిన పని లేదు. దానికిమారుగా మీరు సామాన్య మానవుల ప్రాపంచిక ప్రయోజనాల నడుమ మీ షిన్ షిన్‌ను పదును పెట్టుకోవలసి ఉంది. నిజంగా పెరిగేది మీ షిన్ షిన్. మీరు ఆ బంధాన్ని వదులుకోగలిగితే మీరు అన్నిటినీ త్యజించగలరు; మీరు ప్రాపంచిక ప్రయోజనాలను వదిలి పెట్టాలని చెప్పినప్పుడు, మీరు తప్పకుండా అలా చెయ్యగలుగుతారు. మీరు ఆ బంధాన్ని వదలలేకపోతే, దేనినీ వదలలేరు. అందువల్ల, ఆధ్యాత్మిక సాధన యొక్క నిజమైన ఉద్దేశం మీ హృదయాన్ని సంస్కరించుకోవడం. మీ యొక్క ఈ బంధాన్ని వదిలించుకోవడానికి మతాలలోని ఆధ్యాత్మిక సాధనలు మీరు ప్రాపంచిక ప్రయోజనాలను బలవంతంగా పోగొట్టుకొనేట్లు చేస్తాయి. మీరు వాటి గురించి ఆలోచించకుండా చేయడం ద్వారా, మీరు వాటిని పూర్తిగా నిరాకరించేట్లు చేస్తాయి; వారు ఆ పద్ధతిని అమలు చేశారు. కానీ మీరు అలా చెయ్యాలని మేము చెప్పం. మీ ఎట్ట ఎదుట ఉన్న ప్రాపంచిక ఆసక్తుల పట్ల ఉపేక్ష వహించమని మాత్రమే మేం చెప్తాం. ఆ విధంగా మా సాధనాసిద్ధాంతం ప్రకారం ఆధ్యాత్మిక సాధన చేసేవారు దృఢంగా ఉంటారు. మీరు సన్యాసి, సన్యాసినులు కావాలని మేము అడగం. భవిష్యత్తులో మా సాధన మరింత ప్రాచుర్యం పొందేకొద్దీ, సామాన్య మానవుల నడుమ ఆధ్యాత్మిక సాధన చేసే మా సాధకులందరూ సగం సన్యాసులు కావల్సిన అవసరం లేదు. ప్రతి ఫాలున్ దాఫా సాధకుడు అలా అవడానికి అనుమతి ఉండదు. సాధనాక్రమంలో మేము ప్రతి ఒక్కరి నించి, ఇప్పుడు చెప్పబడుతున్న ఈ విధానం ఆశిస్తున్నాం:

మీరు సాధన చేస్తున్నా మీ జీవన సహచరులు చెయ్యకపోవచ్చు, సాధన కారణంగా మీరు వారినించి విడాకులు పొందడానికి అనుమతించం. మరొక రకంగా చెప్పాలంటే, మనం ఈ విషయాన్ని తేలికగా తీసుకోవాలి, సామాన్య వ్యక్తులు దానికిచ్చిన ప్రాధాన్యతను మీరు దానికి కల్పించకూడదు. ప్రత్యేకించి ఈనాటి సంఘంలోని లైంగిక స్వేచ్ఛ, అశ్లీల చిత్రాలుగా చెప్పబడుతున్నవి జనులకు అంతరాయం కలిగిస్తున్నాయి. కొంతమంది వీటిపట్ల అత్యంతాసక్తి పెంచుకుంటున్నారు. సాధకులుగా మనం వీటిని అప్రధానమైనవిగా చూడాలి.

ఒక ఉన్నత–స్థాయి దృక్పథంనించి చూసినప్పుడు, సామాన్య వ్యక్తులు సంఘంలో ఉంటూ మురికిగా ఉన్నదన్న స్పృహ లేకుండా బురదతో ఆడుకుంటున్నారు. వారు నేల మీద బురదలో ఆడుకుంటున్నారు. ఈ అంశం కారణంగా మీరు మీ కుటుంబంలో సమన్వయం పోగొట్టకూడదు. అందువల్ల ప్రస్తుత స్థితిలో మీరు దీనిపట్ల ఉపేక్ష వహించాలి. ఒక సాధారణమైన, సమన్వయపూర్వకమైన వైవాహిక జీవితాన్ని నిలుపుకోవడం మంచిది. భవిష్యత్తులో మీరు ఒక నిర్దిష్టమైన స్థాయికి చేరుకున్న తరవాత ఆ స్థాయిలో మరొక రకమైన పరిస్థితి ఉంటుంది. ప్రస్తుతానికి, ఇలా ఉండాలి ఈ ఆవశ్యకతను మీరు కలిగి ఉంటే సరిపోతుంది. మీరు సంఘంలో జరుగుతున్న దాన్ని అనుసరించకూడదు. అది ఎలా అనుమతింపబడుతుంది?

ఈ అంశంలో మరొక కారకం కూడా కలిసి ఉంది. మన సాధకుల శరీరాలలో శక్తి ఉంటుందని మీకు తెలుసు. ఈ విభాగానికి చెందినవారిలో ఎనభై నించి తొంభై శాతం మందికి వ్యాధినిర్మూలన జరిగి ఉండడమే కాక, గోంగ్ కూడా పెరిగి ఉంటుంది. ఆ విధంగా, మీ శరీరం అత్యంత బలమైన శక్తిని కలిగి ఉంటుంది. మీ గోంగ్‌తో మీ షిన్ షిన్ అనులోమంగా ఉండదు. హఠాత్తుగా పెరిగిన కారణంగా మీ గోంగ్, షిన్ షిన్ కంటే అధికంగా ఉంటుంది, ఇప్పుడు మీ షిన్ షిన్ పెరుగుతూ ఉంది. క్రమంగా, మీ షిన్ షిన్ గోంగ్‌తో సమానమవుతుంది. ఈ కాలావధిలో అది గోంగ్‌కు సమానం అవుతుందన్న విషయం తథ్యం. కాబట్టి మేం దాన్ని నిర్ణీతకాలానికి ముందే చేశాం. మరొక రకంగా చెప్పాలంటే, మీలో కొంత శక్తి ఉన్నది. ఒక ధర్మ బద్ధమైన సాధనవల్ల సాధించుకున్న శక్తి పూర్తిగా ధర్మబద్ధంగా, ఉదారంగా

ఉంటుంది కాబట్టి, ఇక్కడ కూచుని ఉన్న ప్రతివారూ, ఒక ప్రశాంతమూ, దయాపూర్ణమూ అయిన వాతావరణాన్ని అనుభూతి చెందుతున్నారు. నన్ను నేను ఈ విధంగా మలచుకొని ఈ విషయాలను నాలో కలిగి ఉన్నాను. ఇక్కడ కూచుని ఉన్న ప్రతి ఒక్కరూ, మనసులో ఏ విధమైన చెడు భావనలూ లేకుండా ప్రశాంతంగా ఉన్నారు. ఎవ్వరూ కనీసం ఒక సిగరెట్ కాల్చాలని కూడా అనుకోవడం లేదు. భవిష్యత్తులో మీరు కూడా మా దాఫాలో ఉన్న ఆవశ్యకతలను అనుసరించాలి, మీరు ఆధ్యాత్మిక సాధన ద్వారా పెంచు కుంటున్న గోంగ్ కూడా ఈ విధంగా ఉంటుంది. నిరంతరమూ పెరుగుతున్న మీ గోంగ్ సాంద్రతతో, మీ శరీరంలోని గోంగ్‌నించి వెదజల్లబడుతున్న శక్తి కూడా అతిబలోపేతమై ఉంటుంది. అది అంతటి బలంగా లేకపోయినా కూడా, మీ క్షేత్రంలో ఉన్న సామాన్య వ్యక్తి నిరోధింపబడతారు. లేదా, మీరు ఇంట్లో ఉన్నా ఇతరులను నిరోధిస్తారు, మీ కుటుంబ సభ్యులు నిరోధింప బడవచ్చు. ఇలా ఎందుకవుతుంది? ఇలా చెయ్యడానికి మీ మనసును ఉపయోగించవలసిన అవసరం కూడా ఉండదు. ఈ క్షేత్రం, శుద్ధమైన ప్రశాంతత, దయాపూర్ణమూ, సరైన విశ్వాసాలతో నిండినట్టిది. అందువల్ల జనులు చెడ్డ విషయాలను ఆలోచించడమూ, దుష్కర్మలు చేయడమన్నది జరగదు. దీనికి ఇటువంటి ప్రభావం ఉంటుంది.

బుద్ధుని కాంతి ప్రతి చోటనూ వెలుగుతుందని, అన్ని వైకల్యాలను సరిచేస్తుందని ఒకనాడు నేను చెప్పి ఉన్నాను. ఇంకో మాటలో చెప్పాలంటే, మన శరీరాలనించి వెదజల్లబడిన శక్తి అన్ని అస్వాభావిక పరిస్థితులను సరిచెయ్యగలిగి ఉంటుంది. అందువల్ల, ఈ క్షేత్రపు ప్రభావంతో మీరు ఈ విషయాలను గురించి ఆలోచించకుండా ఉంటే, మీ జీవన సహచరులను అసంకల్పితంగానే నిరోధించగలుగుతారు. మీరు వాటి గురించి ఆలోచించక పోతే, వారు కూడా వాటి గురించి ఆలోచించరు. కానీ ఇది ఖచ్చితం కాదు, ఎందుకంటే ప్రస్తుత వాతావరణంలో టెలివిజన్‌లో అన్ని రకాల విషయా లున్నాయి, దాన్ని తిప్పినంతనే అది ఒక వ్యక్తి కోరికలను సులభంగా ప్రేరేపిస్తుంది. కానీ సాధారణ పరిస్థితులలో, మీకు ఈ నిరోధక ప్రభావం ఉంటుంది. భవిష్యత్తులో, మీరు ఉన్నతస్థాయి ఆధ్యాత్మిక సాధనను చేరు

కున్నప్పుడు, నేను చెప్పకుండానే, మీరు చెయ్యవలసినది ఏమిటో మీకు తెలుస్తుంది. అప్పటికి ఒక ప్రశాంత జీవనాన్ని నిశ్చయపరచే మరొక స్థితి ఉంటుంది. అందువల్ల మీరు ఈ విషయం గురించి ఎక్కువ ఆందోళన చెందకూడదు, ఎందుకంటే ఎక్కువగా ఆందోళన చెందడం కూడా ఒక బంధమే. కామోద్రేకం ఉండదు గాని, మోహం ఉంటుంది. మీరు దీనిని తేలికగా తీసుకొని మనసులో సరిగ్గా భావించినంత వరకు అంతా బాగుంటుంది.

అయితే, కామానికి సంబంధించి, ఒక వ్యక్తి ఏ రకమైన అసురులను ఎదుర్కొంటాడు? మీలో డింగ్ (3) శక్తి సరిపడినంతగా లేకపోతే నిద్రలో ఉండగా అది మీ కలలలో ప్రత్యక్షం అవుతుంది. మీరు నిద్రపోతున్నప్పుడో, ధ్యానంలో కూచున్నప్పుడో, అది హఠాత్తుగా కనిపిస్తుంది. మీరు పురుషులైతే ఒక సుందరి కనిపిస్తుంది. మీరు స్త్రీ అయితే మీ కలల పురుషుడు కనిపిస్తాడు. అయితే వారు నగ్నంగా ఉంటారు. మీ మనసు దాని గురించి ఆలోచించగానే, మీరు స్ఖలించి, దానిని నిజం చేస్తారు. ప్రతి వారూ ఇది ఆలోచించండి: మన ఆధ్యాత్మిక సాధనలో శరీరంలోని సారం ఒక వ్యక్తి దీర్ఘ జీవితాన్ని సాధన చెయ్యడానికి తప్ప మీరు దానిని ఇలా ఎప్పుడూ స్ఖలించరాదు. అదే సమయంలో, మీరు కామసంబంధమైన పరీక్షలో ఉత్తీర్ణులు కాలేదు. అది ఎలా అనుమతింపబడుతుంది. అందువల్ల, ప్రతి ఒక్కరూ ఈ అంశాన్ని ఎదుర్కొంటారు, అది తథ్యం. ఫాను బోధిస్తున్నప్పుడు, మీ మనసులో నేను అతిబలోపేతమైన శక్తిని ముద్రిస్తున్నాను. బయటకు అడుగుపెట్టగానే, నేను చెప్పినదాన్ని మీరు ప్రత్యేకించి గుర్తు చేసుకోకపోవచ్చు, కానీ మీరు నిజంగా ఈ విషయాన్ని ఎదుర్కొన్నప్పుడు, నేను చెప్పినది మీకు గుర్తు వస్తుంది. మిమ్మల్ని మీరు ఒక సాధకుడిగా పరిగణించినంతవరకూ, మీరు వెంటనే దానిని గుర్తుచేసుకొని మిమ్మల్ని మీరు అదుపు చేసుకోగలుగుతారు. తరవాత మీరు ఆ పరీక్షలో ఉత్తీర్ణులవుతారు. తొలిసారి పరీక్షలో విఫలమైతే, రెండవ సారి ఉత్తీర్ణులు కావడం కష్టం అవుతుంది. అయితే మరొక సందర్భం కూడా ఉంది, ఎప్పుడైతే ఒక వ్యక్తి మొదటి పరీక్షలో విఫలమవుతాడో, నిద్ర లేచిన తరవాత అతడు చాలా పశ్చాత్తాపపడతాడు. బహుశా ఇటువంటి మనస్తత్వమూ, మానసికస్థితి దానిపట్ల మీ ఆలోచనలను బలోపేతం చెయ్యవచ్చు. ఈ అంశం

మరొకసారి తలెత్తగానే, మిమ్మల్ని మీరు అదుపులో పెట్టుకొని పరీక్షలో ఉత్తీర్ణులు కావచ్చు. విఫలమైన వారు ఒకవేళ దీనిపట్ల శ్రద్ధ వహించకపోతే, తర్వాత ఉత్తీర్ణులు కావడం కష్టతరం అవుతుంది. ఇది నిశ్చయంగా ఇలాగే ఉంటుంది.

ఈ రకమైన అంతరాయం అసురులనించి అయినా రావచ్చు, లేదా, మిమ్మల్ని పరీక్ష చెయ్యడానికి ఒక వస్తువును మరొకదానిలా పరివర్తన చేసే గురువునించి అయినా రావచ్చు. ప్రతి ఒక్కరూ ఈ పరీక్షలో ఉత్తీర్ణులు కావలసి ఉంది గనక, రెండు రకాలూ ఉంటాయి. మనం ఆధ్యాత్మిక సాధనను సామాన్య వ్యక్తులుగానే ప్రారంభిస్తాం. అందులో మొట్టమొదటి మెట్టు ఈ పరీక్ష, ప్రతి ఒక్కరూ దానిని ఎదుర్కొంటారు. మీకు ఒక ఉదాహరణ ఇస్తాను. నేను వూ హాన్ (4) లో తరగతి నిర్వహిస్తున్నప్పుడు, అక్కడ ముప్పై ఏళ్ళ ఒక యువకుడు ఉన్నాడు. నేను ఈ ఉపన్యాసం ఇచ్చిన వెంటనే, అతడు ఇంటికి వెళ్ళి ధ్యానంలో కూచున్నాడు. అతడు నేరుగా డింగ్ స్థితిని సాధించాడు. తరవాత అతడు హఠాత్తుగా అమితాభ బుద్ధుడు ఒకవైపున, లావో జీ మరొక వైపున ప్రత్యక్షం కావడం చూశాడు. తన అనుభవ నివేదికలో ఇది చెప్పాడు. కనిపించిన తరవాత, వారిద్దరూ అతడితో ఒక్కమాటైనా అనకుండా మాయం అయ్యారు. తరవాత అవలోకితేశ్వర బోధిసత్త్వ, తెల్లని పొగ బయల్వెడలుతున్న ఒక కూజాను పట్టుకొని ప్రత్యక్షమైంది. ప్రతిదాన్ని వివరంగా చూస్తూ అక్కడ కూచున్న అతడికి చాలా సంతోషం కలిగింది. హఠాత్తుగా ఆ పొగ కొందరు అందగత్తెలుగా పరివర్తన చెందింది; ఆ అందగత్తెలు గాలిలో తేలిపోతున్నట్టి అతిఆకర్షణీయంగా ఉన్న దివ్యసుందరులు. వారు వయ్యారపు భంగిమలతో అతడికోసం నాట్యం చేశారు. అతడు “నేను ఇక్కడ సాధన చేస్తున్నందున, అవలోకితేశ్వర బోధిసత్త్వ కొందరు అందగత్తెలను పరివర్తన చేసి నాకు బహుమతిగా ఇస్తున్నది, ఈ ఎగిరే దివ్యసుందరులను నాకోసం నాట్యం చెయ్యడానికి పంపిస్తున్నది” అని తనలో తాను అనుకున్నాడు. ఈ తలపుతో అతడు పరవశుడవుతుండగా హఠాత్తుగా వారు నగ్నంగా తయారై, అతడి మెడను కౌగలించుకోవడం, అతడి నడుమును నిమరడం వంటి రకరకాల చేష్టలతో అతడి పక్కన చేరారు. ఈ సాధకుని షిన్ షిన్ అతిత్వరగా అభివృద్ధి

చెందింది. అతడి మనసులోకి వచ్చిన మొట్టమొదటి తలపు "నేను ఒక సామాన్య వ్యక్తిని కాను. నేనొక సాధకుడిని. మీరు నాతో ఇలాగ వ్యవహరించ కూడదు, ఎందుకంటే నేను ఒక ఫాలున్ దాఫా సాధకుడిని" అనేది. ఒకసారి ఈ తలపు జనించిన తరవాత, అన్నీ హఠాత్తుగా మాయం అయ్యాయి, ఎందుకంటే, వారెలాగూ పరివర్తనవల్ల వచ్చినవారే. అప్పుడు అమితాభ బుద్ధుడు, లావో జీ తిరిగి అతడి ఎదుట ప్రత్యక్షం అయ్యారు. లావో జీ ఈ వ్యక్తిని చూపిస్తూ, ఒక చిరునవ్వుతో " ఈ బిడ్డ బోధనార్హుడు" అని బుద్ధునితో అన్నారు. దాని అర్థం ఇతడు మంచివాడూ, బోధన చేయవచ్చు అని.

చరిత్ర పొడవునా, లేదా ఉన్నత పరిమాణాల యొక్క దృక్పథంలోనూ, ఒక వ్యక్తిలోని కోరిక, కామమూ అతడు ఆధ్యాత్మిక సాధన చెయ్యడానికి అర్హుడవునా అన్నది నిర్ణయించడంలో కీలక అంశాలుగా నిలిచాయి. అందు వల్ల మనం ఇటువంటి విషయాలపట్ల ఉదాసీనత వహించాలి. ఏమైనా, మనం సామాన్య మానవుల నడుమ ఆధ్యాత్మిక సాధన చేస్తాం, అందువల్ల మీరు వీటిని పూర్తిగా వదిలివెయ్యమని మేము చెప్పం. ప్రస్తుత స్థితిలో, మీరు వీటిని కనీసం తేలికగా తీసుకుంటూ, మునుపటివలె ప్రవర్తించకూడదు. ఒక సాధకుడిగా ఒక వ్యక్తి ఈ విధంగా ఉండాలి. చీ గోంగ్ సాధనలో ఇటువంటిదో, మరొకటో అంతరాయం కలిగినప్పుడు కారణాలకోసం మీ అంతరంగాన్ని పరిశీలించుకొని, మీరు ఇంకా దేన్ని వదిలివెయ్యలేదో నిర్ణయించుకోవాలి.

## ఒక వ్యక్తికి స్వయంగా తన మనసునించే అసురజోక్యం

"ఒక వ్యక్తికి స్వయంగా తన మనసునించే అసురజోక్యం" అంటే ఏమిటి? ఒక మానవ శరీరానికి ప్రతి స్థాయిలోని పరిమాణంలో ఒక భౌతిక క్షేత్రం ఉంటుంది. ఒక ప్రత్యేక క్షేత్రంలో, విశ్వంలోని ప్రతి విషయమూ ఒక నీడలాగా, మీ పరిమాణపు క్షేత్రంలోనికి ప్రతిబింబించగలదు. అవి నీడలే అయినా భౌతికమైన ఉనికి గలిగి ఉన్నాయి. మీ పరిమాణపు క్షేత్రంలోని ప్రతి విషయమూ, మీ మెదడులోని ఆలోచనలతో నియంత్రించబడుతుంది. అంటే, మీరు మెదడును ఉపయోగించకుండా దివ్యనేత్రంతో ప్రతి విషయాన్ని

ప్రశాంతంగా చూసినట్లైతే, మీరు గమనిస్తున్నది నిజం. మీరు ఏ మాత్రం ఆలోచించడం ప్రారంభించినా, మీరు చూసేది అబద్ధం. దీనినే “ఒక వ్యక్తికి స్వయంగా తన మనసునించే అసురజోక్యం” లేదా “పరివర్తన మనస్సంకల్పాన్ని అనుసరించి ఉంటుంది” అంటారు. కొందరు సాధకులు తమనుతాము సాధకులుగా పరిగణించుకోలేక, తమనుతాము సరిగ్గా నియంత్రించుకోలేక పోయినప్పుడు ఇలా జరుగుతుంది. వారు అతీంద్రియశక్తులకై ప్రాకులాడతారు, నీచమైన తంత్రాలపట్ల లేదా ఇతర పరిమాణాలనించి కొన్ని విషయాలను వినడంపట్ల బంధం పెంచుకుంటారు. వారు ఇటువంటి విషయాల వెంట పడతారు, ఇటువంటివారికి తమ మనసుల నించి స్వయంగా అసుర జోక్యం పెంచుకొని, క్రింది స్థాయిలకు పడిపోవడం సులభతరం. ఒక వ్యక్తి ఆధ్యాత్మిక సాధనాస్థాయి ఎంత ఉన్నతంగా ఉన్నప్పటికీ, ఒకసారి ఈ సమస్య వచ్చిందంటే, అతడు నేరుగా క్రిందకు పతనమైపోయి, చివరకు నాశనం అవుతాడు. ఇది ఒక అతితీవ్రమైన అంశం. ఇది, ఒక వ్యక్తి ఒకసారి షిన్ షిన్ పరీక్షలో విఫలుడైనా, మళ్ళీ నిలదొక్కుకొని, ఆధ్యాత్మిక సాధనను కొనసాగించగల ఇతర సందర్భాలవంటిది కాదు. అసుర జోక్యం అన్నది స్వయంగా అతడి మనసునించే జనించిందంటే, ఆ వ్యక్తి బ్రతుకే నాశనమైనట్లు. ప్రత్యేకించి, దివ్యనేత్రం కొన్ని నిర్దిష్ట స్థాయిలలో తెరచుకున్న వ్యక్తులకు, ఈ సమస్య సులభంగా ఏర్పడుతుంది. ఇదేకాక, కొందరికి ఎల్లప్పుడూ, తమ చైతన్యంలో, బయటి సందేశాలవల్ల అంతరాయం కలుగుతుంది, వారు తమకు ఆ సందేశాలలో చెప్పబడినవన్నీ నమ్మేస్తారు కూడా, ఈ సమస్య కూడా ఏర్పడొచ్చు. అందువల్ల, మీలో దివ్యనేత్రం తెరచుకొని ఉన్నవారిలో కొందరికి వివిధ రకాల సందేశాలతో అంతరాయం కలుగుతూ ఉంటుంది.

నేను మీకొక ఉదాహరణ ఇస్తాను. అతితక్కువ స్థాయి ఆధ్యాత్మిక సాధనలో ఒక వ్యక్తికి తన మనసును చెదరకుండా ఉంచుకోవడానికి అతికష్ట మవుతుంది. మీ గురువు ఎలా ఉంటారో మీరు స్పష్టంగా చూడలేకపోతారు. మీరు ఒక రోజున హఠాత్తుగా భారీగా, పొడుగ్గా ఉన్న ఒక దేవతామూర్తిని చూడడం జరగొచ్చు. ఆయన మీకు కొన్ని మెరమెచ్చుల మాటలు చెప్పి, మీకు ఏదో బోధిస్తారు. మీరు గనక దాన్ని అంగీకరిస్తే, మీ గోంగ్ కలుషితం

అవుతుంది. మీరు సంబరపడి, ఆయనను మీ గురువుగా అంగీకరిస్తే, మీరు ఆయన వెంట వెళతారు. కానీ ఆయనే సరైన ఫలితాన్ని అందుకోలేదు. ఆ పరిమాణంలో, ఆయన శరీరం చిన్నదిగానో, పెద్దదిగానో పరివర్తన చెంద గలదు. మీ కళ్ళ ముందు ఇలా జరగడం, ఆ భారీ దేవతామూర్తిని చూసిన మీరు నిజంగా ఆనందోద్రేకం పొందుతారు. ఆ ఆనందోద్రేకంలో, మీరు అతనినించి నేర్చుకోవడానికి వెళ్ళడం లేదా? ఒక సాధకుడు సరిగ్గా ప్రవర్తించ నప్పుడు, అతడిని రక్షించడం అతికష్టం. అతడు తననుతాను అతిసులభంగా నాశనం చేసుకుంటాడు. స్వర్గంలోని వారందరూ, దేవతలే, అయితే వారు కూడా సరైన ఫలం అందుకోలేదు, అందువల్ల వారు కూడా అలాగే సంసార చక్రంలో కొనసాగుతుంటారు. మీరు అలక్ష్యంగా అటువంటి జీవిని మీ గురువుగా భావించి, అనుసరిస్తే అతడు మిమ్మల్ని ఎక్కడికి తీసుకొనివెళ్ళ గలుగుతాడు? అతడు కనీసం సరైన ఫలాన్నైనా అందుకోలేదు. మీ ఆధ్యాత్మిక సాధన వృథా కాదా? చివరకు మీ గోంగ్ కూడా కలుషితమైపోతుంది. ఒక వ్యక్తి మనసు చెదిరిపోకుండా ఉండడం అతికష్టం. ఇది ఒక తీవ్రమైన అంశమని నేను అందరికీ చెప్తున్నాను, తరవాత మీలో చాలామంది దీనిని ఎదుర్కోబోతున్నారు కూడా. నేను మీకు ఫాను బోధించాను; ఇక మీ ప్రవర్తనను సరిగ్గా నిలుపుకోగలరా అన్నది మీమీద ఆధారపడి ఉంది. నేను చెప్పినది వీటిలో ఒక పరిస్థితి. మరొక సాధనాసిద్ధాంతానికి చెందిన జ్ఞానిని చూసి, మీ మనసును చెదరనివ్వకండి. ఒకే సాధనా సిద్ధాంతానికి కట్టుబడి ఉండండి. వారు ఒక బుద్ధుడు, తావో, దేవత, దయ్యం ఏమైనా మీ మనసును కదిలించకూడదు. ఒక వ్యక్తి ఇలా ప్రవర్తిస్తే, విజయం కనుచూపు మేరలో ఉంటుంది.

ఒక వ్యక్తి మనసునించి కలిగే అసుర జోక్యం ఇతర రూపాలలో కూడా వ్యక్తం అవుతుంది. మరణించిన మీ బంధువులలో ఒకరు, కన్నీళ్ళతో వేడు కుంటూ, అది చెయ్యి ఇది చెయ్యమని అంతరాయం కలిగించడం మీరు చూసి ఉంటారు. అన్ని రకాల విషయాలు జరగవచ్చు. మీ మనసు ప్రభావితం కాకుండా ఉంటుందా? మీకు మీ బిడ్డ మీద ఆపేక్ష లేదా మీ తల్లిదండ్రుల మీద ప్రేమ ఉందనుకోండి, మీ తల్లిదండ్రులు మరణించారు. వారు మిమ్మల్ని

కొన్ని పనులు చెయ్యమని అడుగుతారు. అవన్నీ మీరు చెయ్యకూడనివే. మీరు అవి చేస్తే, అది మంచిది కాదు. సాధకుడిగా ఉండడం అంత కష్టం. బౌద్ధమతం గందరగోళంలో ఉందని చెప్పబడుతున్నది. కన్ఫ్యూషియస్ మతంనించి తల్లి దండ్రులను గౌరవించడమూ, పిల్లలను ప్రేమించడమూ అన్న విషయాలను కూడా స్వీకరించింది. బౌద్ధమతంలో అటువంటి విషయాలు లేవు. దాని అర్థం ఏమిటి? ఒక వ్యక్తి యొక్క అసలు జీవితం వారి ప్రాథమిక ఆత్మ, మీ ప్రాథమిక ఆత్మకు జన్మనిచ్చినది మీ అసలు తల్లి. సంసారచక్రంలో మీకు మానవులు, మానవులు కానివారూ అయిన అనేకమంది తల్లులు ఉన్నారు, వారు లెక్కకు మించి ఉన్నారు. మీ భిన్న జీవితకాలాలలో మీకు ఎందరు కొడుకులు, కూతుళ్ళు ఉన్నారో కూడా లెక్కకు అందదు, మీ తల్లి ఎవరు? మీ కొడుకు, కూతురు ఎవరు? ఒక వ్యక్తి మరణించిన తరవాత అది ఎవరికీ తెలియదు. అయినప్పటికీ, మీరు ఇతరులకు ఋణపడి ఉన్నది తీర్చుకోవలసినదే. మానవులు భ్రమలలో బ్రతుకుతూ ఉంటారు, వీటిని వదులుకోలేరు. కొంత మంది తమ కొడుకులను, కూతుళ్ళను వదులుకోలేరు, వారెంత మంచివారో అని మరణించే ముందు చెప్పి ఆ పై మరణిస్తారు. ఒక వ్యక్తి తన తల్లి ఎంత మంచిదో చెప్పొచ్చు, కానీ ఆమె కూడా మరణిస్తుంది. ఈ వ్యక్తి ఎంత వేదనకు గురవుతాడంటే, తాను ఆమె వెంట వెళ్ళాల్సినదని జీవితాంతమూ కోరు కుంటాడు. మీరు దీని గురించి ఎందుకు ఆలోచించరు? అవన్నీ మిమ్మల్ని క్షోభ పెట్టడానికే లేవా? అవి ఈ రూపాన్ని మీరు ఒక మంచి జీవితం గడప కుండా ఉండేందుకు ఉపయోగించుకుంటాయి. సామాన్య మానవులు బహుశా దీనిని అర్థం చేసుకోరు. మీరు ఈ బంధానికి కట్టుబడితే ఏది ఏమైనా మీరు ఆధ్యాత్మిక సాధన చెయ్యలేరు. ఆ విధంగా బౌద్ధమతంలో ఈ విషయం లేదు. మీరు ఆధ్యాత్మిక సాధన చెయ్యాలంటే మానవ సహజ సున్నిత భావజాలాన్ని వదులుకోవలసినదే. అయితే, సామాన్య మానవ సంఘంలో ఆధ్యాత్మిక సాధన చేస్తూనే, మన తల్లిదండ్రులను గౌరవించడం, మన పిల్లలకు విద్యాబుద్ధులు గరపడమూ చెయ్యాలి. అన్ని పరిస్థితులలోనూ, మనం ఇతరులతో దయగా వ్యవహరించాలి, కుటుంబ సభ్యుల సంగతి ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. మనం ప్రతివారినీ ఒకే విధంగా చూడాలి. మనం మన తల్లిదండ్రులతో,

పిల్లలతో మంచిగా ఉంటూ, ఇతరులపట్ల అన్ని విషయాలలో శ్రద్ధ వహించాలి. ఆ విధంగా అటువంటి హృదయం నిస్వార్థమూ, దయాపూర్ణమూ, ఉదారమూ అవుతుంది. సున్నిత భావజాలం సామాన్య మానవులకు సంబంధించినది, సామాన్య మానవులు కేవలం దాని కోసమే జీవిస్తారు.

చాలామంది తమ ప్రవర్తనను సరిగ్గా నియంత్రించుకోలేరు, ఆధ్యాత్మిక సాధనలో ఇది ఇబ్బందులను కలగజేస్తుంది. బుద్ధుడు తనకేదో చెప్పాడని ఒక వ్యక్తి వాదించొచ్చు. మీ జీవితానికి ప్రమాదం కలుగుతుందని, అది ఎలా తొలగించుకోవాలో చెప్పేవారు తప్పించి, మీకు ఇవాళ ఒక కష్టం కలుగు తుందని, జరగబోయేదాన్ని ఎలా తప్పించాలో చెప్పేవారు, మీకు లాటరీలో మొదటి బహుమతి వస్తుందని, దాని సంఖ్య చెప్పి ప్రయత్నించమని చెప్పేవారు, మీకు సామాన్య మానవ సంఘంలో మంచివైన విషయాలను సంపాదించుకోమని చెప్పేవారంతా అసురులు. మీరెల్లప్పుడూ సామాన్య మానవ సంఘంలోనికే దారితీస్తూ, ఈ పరీక్షలో విఫలం అవుతుంటే, మీరెన్నటికీ ముందుకు సాగలేరు. మీరు సామాన్య మానవుల నడుమ గొప్పగా బ్రతుకుతూ ఉంటే, మీరు ఆధ్యాత్మిక సాధన ఎలా చెయ్యగలరు? మీ కర్మ ఎలా పరివర్తన చెందుతుంది? మీకు షిన్ షిన్‌ను పెంచుకొని కర్మను పరివర్తన చేసుకొనే వాతావరణం ఎలా ఉంటుంది? ప్రతివారూ తప్పనిసరిగా దీనిని మనసులో పెట్టుకోవాలి. ఒక దయ్యం కూడా, మిమ్మల్ని పొగుడుతూ, మీరెంత మంచివారో, మీరెంత గొప్ప బుద్ధుడో, గొప్ప తావోనో చెప్పినప్పుడు, మీరు అద్భుతమైనవారమని అనుకుంటే – అదంతా మోసం. ఉన్నత స్థాయిలకు నిజంగా సాధన చేస్తున్న ఒక వ్యక్తిగా మీరు తప్పనిసరిగా ఎన్నో బంధాలను త్యజించాలి. ఇటువంటి అంశాలను ఎదుర్కొన్నప్పుడు, మీరు మీ జాగ్రత్తలో ఉండాలి.

ఆధ్యాత్మిక సాధనలో, మీ దివ్యనేత్రం తెరుచుకుంటుంది. అలా దివ్యనేత్రం తెరుచుకున్నప్పుడు, ఆ వ్యక్తికి ఆధ్యాత్మిక సాధనలో కష్టాలు ఎదురవుతాయి. దివ్యనేత్రం మూసుకున్నప్పుడు కూడా ఆ వ్యక్తికి ఆధ్యాత్మిక సాధనలో కష్టాలు ఉంటాయి. రెండు సందర్భాలలోనూ, ఆధ్యాత్మిక సాధన సులభం కాదు. మీ దివ్యనేత్రం తెరుచుకున్న తరవాత, వివిధ రకాల

సందేశాలు మీకు అంతరాయం కలిగిస్తుంటే, సరైన ప్రవర్తనను నిలుపు కోవడం మీకు నిజంగా కష్టమే. ఇతర పరిమాణాలలో ఉన్నవన్నీ మీ కళ్ళు చెదిరిపోయేటట్లు ఉంటాయి, చాలా అందంగా, చక్కగా, అన్నీ మీ మనసును ప్రలోభపెట్టేట్లు ఉంటాయి. ఒకసారి మీరు చలిస్తే, మీకు అంతరాయం కలిగి మీ గోంగ్ కలుషితం అవుతుంది – సాధారణంగా ఇలా జరుగుతుంది. ఆ రకంగా, ఒక వ్యక్తికి తన మనసునించే అసురజోక్యం ఏర్పడి, అతడి ప్రవర్తనను సరిగ్గా నిలుపుకోలేకపోతే, ఈ పరిస్థితి ఏర్పడొచ్చు. ఉదాహరణకు, అతడి మనసులో ఒకసారి ఒక చెడు తలంపు కలిగితే, అది అతిప్రమాదకరం. ఒకరోజు అతడి దివ్యనేత్రం తెరుచుకుంటుంది, అతడు అన్ని విషయాలను స్పష్టంగా చూడగలుగుతాడు. “ఈ వ్యాయామ స్థలంలో కేవలం నాకే దివ్య నేత్రం చక్కగా తెరుచుకుంది. నేను బహుశా ఒక అసాధారణ వ్యక్తినేమో? టీచర్ లీ గారి ఫాలున్ దాఫాను నేను నేర్చుకోగలిగాను, తక్కిన అందరికంటే మెరుగ్గా నేర్చుకున్నాను. బహుశా నేను కూడా ఒక సామాన్య వ్యక్తిని కాదేమో?” అని అనుకుంటాడు. ముందే ఈ ఆలోచన మంచిది కాదు. “ఒకవేళ నేను బుద్ధుడిని కూడానేమో? ఒకసారి నన్ను నేను చూసుకుంటాను” అని ఆశ్చర్య పోతాడు. తనను తాను చూసుకున్నప్పుడు నిజంగానే బుద్ధుడిలా అనిపిస్తుంది. ఇలా ఎందుకు? ఎందుకంటే, అతడి శరీరం చుట్టూ ఉన్న పరిమాణ క్షేత్రం అతడి ఆలోచనలకు అనుగుణంగా మారుతుంది, ఇది “మనసులోని కోరికను మార్పు అనుసరిస్తుంది” అని చెప్పబడుతున్నది.

విశ్వంనించి ప్రతిబింబించినదంతా, ఒక వ్యక్తి ఆలోచనలవల్ల మారుతుంది, ఎందుకంటే ఆ వ్యక్తి యొక్క పరిమాణ క్షేత్రంలో ఉన్నవన్నీ, ఆ స్త్రీ లేదా ఆ పురుషుని ఆదేశానికి లోబడి ఉంటాయి. అలాగే ప్రతిబింబాలు కూడా భౌతికమైన ఉనికి కలిగి ఉంటాయి. ఆ వ్యక్తి “ఒకవేళ నేను ఒక బుద్ధుడినేమో, అలాగే నేను కట్టుకున్నది బుద్ధుని దుస్తులేనేమో” అనుకుంటాడు. అప్పుడు తాను కట్టుకున్నది నిజంగా బుద్ధుని దుస్తులే అని తెలుసుకుంటాడు. “ఆహా, నేను నిజంగా బుద్ధుడినే” అని ఎంతో సంబరపడిపోతాడు. “బహుశా నేను చిన్న బుద్ధుడిని కూడా కానేమో”. మరొకసారి తనను తాను చూసుకుంటే, పెద్ద బుద్ధుడుగా ఉన్నట్లు అనిపిస్తుంది. “బహుశా నేను లీ హోంగ్ జీ కంటే

గొప్పవాడినేమో!” మళ్ళీ చూసుకొని, “ఆహా, నేను నిజంగా లీ హోంగ్ జీ కంటే గొప్పవాడిని.” కొందరు తమ చెవులతోనే స్వయంగా ఇది వింటారు. ఒక దయ్యం వచ్చి అతడితో, “నువ్వు లీ హోంగ్ జీ కంటే గొప్ప వాడివి. నువ్వు లీ హోంగ్ జీ కంటే చాలా గొప్పవాడివి” అంటుంది. అతడు కూడా దానిని నమ్ముతాడు. మీరు భవిష్యత్తులో ఆధ్యాత్మిక సాధన ఎలా చేస్తారో ఆలోచించారా? మీరెప్పుడయినా ఆధ్యాత్మిక సాధన చేశారా? మీకు ఆధ్యాత్మిక సాధనను ఎవరు బోధించారు? ఒక నిజమైన బుద్ధుడు కూడా ఒక లక్ష్యంతో ఇక్కడికి వచ్చినప్పుడు మొట్టమొదటనించి ఆధ్యాత్మిక సాధన చెయ్యవలసి ఉంటుంది. అతడికి అంతకు ముందర ఉన్న గోంగ్ అతడికి ఇవ్వబడదు, ఒక వ్యత్యాసం ఏమిటంటే, అతడు ఆధ్యాత్మిక సాధనలో త్వరగా పురోగతి సాధిస్తాడు. అందువల్ల, ఒకసారి అతడికి ఈ సమస్య ఏర్పడితే, దానినించి బయటపడడం అతడికి కష్టం అవుతుంది; అతడు నేరుగా తన బంధాన్ని పెంచుకుంటాడు. ఈ బంధం పెరిగిన తరవాత, అతడు ఏది అనడానికైనా సాహసిస్తాడు: “నేను ఒక బుద్ధుడిని, మీరు ఇతరులనించి ఏమీ నేర్చుకోవలసిన పని లేదు. నేనే బుద్ధుడిని కనక మీరేం చెయ్యాలో నేను చెప్తాను”. అతడు ఇలాంటి పనులు చెయ్యడం మొదలుపెడతాడు.

చాంగ్ చున్‌లో ఇటువంటి వ్యక్తి ఉన్నాడు కదా మనకు? మొదట్లో అతడు సరిగ్గా ఉండేవాడు. తరవాత ఇటువంటి పనులు చెయ్యడం మొదలుపెట్టాడు. తాను ఒక బుద్ధుడినని అతడు అనుకున్నాడు. చివరికి, తాను తక్కినవారందరి కంటే గొప్పవాడిని అనుకున్నాడు. అతడు సరైన ప్రవర్తనను నిలుపుకోలేక పోవడం వల్లనూ, అతడు పెంచుకున్న బంధం వల్లనూ ఇది జరిగింది. ఈ సంఘటన ఎందువల్ల జరిగింది? మీరు ఏమి చూసినా లెక్క చెయ్యవద్దని, ఎందుకంటే అది అసురులు సృష్టించే భ్రమ అని, ఒక వ్యక్తి ధ్యానం ద్వారా ఆధ్యాత్మిక సాధనలో ముందుకు సాగాలని బౌద్ధమతం చెప్తుంది. మీరు వాటిని చూడడాన్ని, వాటితో బంధం పెంచుకోవడాన్ని అది ఎందుకు అనుమతించదు? ఈ సమస్య ఏర్పడుతుందనే మిమ్మల్ని అది హెచ్చరిస్తుంది. బౌద్ధమత ఆధ్యాత్మిక సాధనలో, బలోపేతం చేసే పద్ధతి గానీ, ఆ గ్రంథాలలో ఇటువంటి వాటిని తప్పించే మార్గదర్శకత్వం గానీ లేవు. శాక్యముని ఆ కాలంలో

అటువంటి బోధనలు చెయ్యలేదు. ఒక వ్యక్తి మనసునించి స్వయంగా జనించే అసురజోక్యం లేదా మనసులోని కోరికవల్ల జరిగే మార్పు గానీ తప్పించడానికి ఆధ్యాత్మిక సాధనాక్రమంలో కనిపించే అన్ని దృశ్యాలను అసురులు కల్పించే భ్రమలు అని ఆయన చెప్పారు. కాబట్టి, ఒకసారి ఒక బంధం పెరిగితే, అది ఈ అసుర భ్రమకు దారితీస్తుంది. ఒక వ్యక్తికి దానినించి తప్పించుకోవడం కష్టం అవుతుంది. దాన్ని సరిగ్గా నిర్వహించకపోతే ఆ వ్యక్తి పతనమై, అసుర మార్గాన్ని అనుసరిస్తాడు. అతడు తనను తాను ఒక బుద్ధుడుగా చెప్పుకున్న కారణాన, ముందే తనను తాను అసురునిగా చేసుకున్నాడు. చివరకు అతడు ఆత్మలచే ఆవహింపబడడం చేత లేదా ఇతర విషయాలను అనుభవించడం చేత గానీ, పూర్తిగా నాశనం అవుతాడు. అతడి మనసు కూడా అవినీతిమయమై, అతడు పూర్తిగా పతనం అయిపోతాడు. అటువంటివారు అనేకులు ఉన్నారు. ఈ తరగతిలో కూడా ఇప్పుడు తమ గురించి తాము చాలా గొప్పగా భావించి, భిన్నమైన వైఖరిలో మాట్లాడేవారున్నారు. బౌద్ధమతంలో కూడా తన స్థాయి ఏమిటో అన్నది ఒక వ్యక్తి తెలుసుకోవడంపై నిషేధం ఉంది. ఇప్పుడే నేను చెప్పినది "తన మనసునించి కలిగే అసుర జోక్యం" లేదా "మనసులోని కోరికను అనుసరించే మార్పు" అని చెప్పబడే అసుర జోక్యంలోని మరొక రకం. బీజింగ్‌లో అటువంటి సాధకులు కొందరున్నారు, ఇతర ప్రాంతాలలో కూడా కొందరున్నారు. మీదు మిక్కిలి, వారు సాధకులకు అతితీవ్రమైన అంతరాయం కలిగించారు.

ఎవరో నన్ను: "టీచర్, మీరు ఈ సమస్యనెందుకు తొలగించరు?" అని అడిగారు. అందరూ దీని గురించి ఆలోచించండి: మీ ఆధ్యాత్మిక సాధనలోని అడ్డంకులను మేమే తొలగిస్తే, ఇక మీరు ఆధ్యాత్మిక సాధన ఎలా చేస్తారు? అసుర జోక్యం అన్న పరిస్థితి ఉన్నప్పుడే, మీరు మీ ఆధ్యాత్మిక సాధనను కొనసాగించగలరా, నిజంగా తావో స్థితికి జ్ఞానోదయం పొందగలరా అని, అంతరాయాలకు చలించరని, ఈ సాధనా సిద్ధాంతంలో బలంగా నిలబడతారని చూపించగలుగుతారు. పెద్ద అలలు ఇసుకను కదిలించి వేస్తూ ఉంటాయి, ఆధ్యాత్మిక సాధనలో ఉన్నదంతా అదే. చివరకు మిగిలేది అంతా మేలిమి బంగారమే. ఈ రకమైన అంతరాయం లేకపోతే, ఒక వ్యక్తికి ఆధ్యాత్మిక సాధన

చెయ్యడం అతిసులభమని నేను అంటాను. నా దృష్టిలో, ఇప్పటికే మీ ఆధ్యాత్మిక సాధన అతిసులభమైనది. ఆ ఉన్నత స్థాయి మహాజ్ఞానులకు ఇది మరింత అన్యాయంగా తోచవచ్చు: “మీరేం చేస్తున్నారు? మీరు ప్రజలను ఇలా రక్షిస్తున్నారా? ఆధ్యాత్మిక మార్గంలో అడ్డంకులే లేవు, ఒక వ్యక్తి నేరుగా చివరి దాకా తన ఆధ్యాత్మిక సాధన చెయ్యగలుగుతున్నాడు. ఇది ఆధ్యాత్మిక సాధనా? అతడు ఆధ్యాత్మిక సాధనలో ముందుకు సాగుతున్నకొద్దీ, ఏ విధమైన అంతరాయం లేకుండా సుఖంగా ఉంటున్నాడు. ఇది ఎలా అనుమతింప బడుతుంది?” అనుకుంటారు. ఇదీ విషయం, నేను కూడా దీని గురించి ఆలోచిస్తున్నాను. మొదట్లో, నేను అటువంటి అనేక అసురులపట్ల జాగ్రత్త తీసుకున్నాను. ఎల్లకాలమూ నేను అలా చెయ్యడం అంటే, నాకూ అది సరైనదిగా తోచడం లేదు. “వారి ఆధ్యాత్మిక సాధనను నువ్వు సులభతరం చేశావు. ప్రజలకు తమవైన కొద్దిపాటి కష్టాలే ఉన్నాయి. వాళ్ళ మధ్య ఆ కొంచెం ఇబ్బంది మాత్రమే ఉంది. వారికి ఇప్పటికీ వదులుకోలేని బంధాలు అనేకం ఉన్నాయి! వారు గందరగోళమూ, కష్టాలకు మధ్యలో ఉన్నప్పుడు నీ దాఫాను అర్థం చేసుకోగలరా అన్నది ప్రశ్నగానే మిగిలిపోతుంది.” అని కూడా వారు నాతో అన్నారు. ఇది అటువంటి అంశాన్ని కలిగి ఉంటుంది, కనుక అంతరాయమూ, పరీక్షలూ ఉంటాయి. ఇదొక రకమైన అసుర జోక్యమని నేను ఇప్పుడే చెప్పాను. ఒక వ్యక్తిని రక్షించడం అన్నది అతికష్టం కానీ అతడిని నాశనం చెయ్యడం అతిసులభం. మీ మనసు సరైనది కానప్పుడు, మీరు వెంటనే నాశనమవుతారు.

## మీ ప్రధాన చైతన్యం ప్రబలంగా ఉండాలి

మానవులు తమ భిన్న జీవిత కాలాలలో ఏవో దుష్కర్మలు చేసిన కారణంగా, అది జనులకు ఉత్పాతాలను తెచ్చిపెట్టి, సాధకులకు కర్మవల్ల ఏర్పడే అడ్డంకులను సృష్టించింది. అందుచేత పుట్టుక, వృద్ధాప్యము, వ్యాధి, మరణమూ ఉంటాయి. ఇవి సాధారణమైన కర్మలు. సాధకులను అధికంగా ప్రభావితం చేసే మరొక బలవత్తరమైన కర్మ ఉంది – దానిని మానసిక కర్మ అంటారు. జనులు తమ జీవన గమనంలో ఆలోచనలు చేయవలసిన అవసరం

ఉంటుంది. సామాన్య మానవుల నడుమ మాయలో చిక్కుకున్నందువల్ల, ఒక వ్యక్తి తన మనసులో తరచుగా కీర్తి, ప్రయోజనాలు, మోహం, కోపం మొదలైన ఆలోచనలను పెంచుకుంటూ ఉంటాడు. క్రమంగా ఈ ఆలోచనలు బలవత్తరమైన ఆలోచనాకర్మగా తయారవుతాయి. ప్రతిదానికి ఇతర పరిమాణా లలో ప్రాణం ఉన్నందువలన, కర్మకు కూడా ఉంటుంది. ఒక వ్యక్తి ధర్మబద్ధ మైన ఆధ్యాత్మిక సాధన చెయ్యడం మొదలుపెట్టినప్పుడు తప్పనిసరిగా తన కర్మను నిర్మూలించుకోవాలి. కర్మను నిర్మూలించుకోవడం అంటే కర్మను తుడిచిపెట్టేసి, పరివర్తన చేసుకోవడం. కర్మ ప్రతిఘటిస్తుంది, అది నిజం, అందువల్ల అతడికి కష్టాలూ, అడ్డంకులూ ఉంటాయి. కానీ ఆలోచనా కర్మ ఒక వ్యక్తి మనసును నేరుగా ప్రభావితం చెయ్యగలదు. అందువల్ల అతడి మనసులో గురువును, దాఫాను విమర్శించే తిట్లు ఉంటాయి, అతడు ఏవో చెడ్డ ఆలోచనలు చెయ్యొచ్చు లేదా తిట్టొచ్చు. ఫలితంగా కొందరు సాధకులకు జరుగుతున్నది ఏమిటో తెలియక, తమలోనించే ఆ చెడు ఆలోచనలు వస్తున్నాయి అనుకుంటారు. కొంతమంది అవి తమను ఆవహించి ఉన్న ప్రేతాత్మలు, జంతువులునించి వస్తున్నాయని నమ్ముతారు, కానీ వాటి కారణంగా రావు. అంతకన్నా, ఒక వ్యక్తి మనసుపై ఆలోచనాకర్మ ప్రతిఫలించడంవల్ల వస్తాయి. కొంతమందికి ప్రధాన చైతన్యం బలంగా ఉండకపోవడంవల్ల ఆలోచనాకర్మ చెప్పినది పాటించి దుష్కర్మలు చేస్తారు. అటువంటి వ్యక్తులు పతనమై క్రింది స్థాయిలకు దిగజారుతారు. అయితే అధిక జనులు, తమలోని ప్రబలమైన ఆలోచనల (బలమైన ప్రధాన చైతన్యం) వల్ల దానిని తొలగించి, నిరోధించగలుగుతారు. దీనివల్ల, ఈ వ్యక్తి రక్షింపబడి, మంచి చెడులను వేరుచేసి చూడగలడు అన్న విషయాన్ని ఇది సూచిస్తుంది. మరొక రకంగా చెప్పాలంటే, ఈ వ్యక్తిలో మంచి జ్ఞానోదయ లక్షణం ఉంది. నా ఫాషెన్ ఇటువంటి ఆలోచనాకర్మలో అధిక భాగాన్ని నిర్మూలించడంలో సహాయ పడుతుంది. ఈ పరిస్థితి తరచుగా చూడొచ్చు. ఇది ఒకసారి జరిగిన తరవాత ఒక వ్యక్తి తనంతటతాను అటువంటి చెడు ఆలోచనలను అధిగమించ గలుగుతాడేమో అని పరీక్ష చెయ్యబడతాడు. అతడు దృఢ నిశ్చయంతో ఉంటే కర్మ నిర్మూలింపబడుతుంది.

# మీ మనసు సరిగ్గా ఉండాలి

సరైనది కాని మనసు అంటే ఏమిటి? ఒక వ్యక్తి ఎల్లప్పుడూ తనను తాను ఒక సాధకుడిగా భావించుకోలేకపోవడాన్ని ఇది సూచిస్తుంది. ఒక వ్యక్తికి ఆధ్యాత్మిక సాధనలో కష్టాలు ఎదురవుతూ ఉంటాయి. ఒక కష్టం వచ్చినప్పుడు అది ఇద్దరు మనుషుల మధ్య ఘర్షణగా వ్యక్తం కావచ్చు. మీ షిన్ షిన్‌ను నేరుగా ప్రభావితం చేసే విధంగా మనసును దెబ్బతీసే చర్యలు చోటుచేసుకుంటాయి. ఈ విధమైన ఎన్నో సందర్భాలు ఉంటాయి. మీరు ఇంకా ఏమేమి ఎదుర్కొంటారు? మన శరీరాలు హఠాత్తుగా బాధకు గురి కావచ్చు. కర్మను తీర్చుకోవడం విభిన్నమైన మార్గాలలో వ్యక్తం కావడంవల్ల ఇది జరుగుతుంది. ఒకానొక సమయంలో, ఏదైనా ఒక విషయం గురించి అది నిజమేనా అని, మీ గోంగ్ ఉన్నదా అని, మీరు ఆధ్యాత్మిక సాధన చేసి సఫలత పొందగలరా అని, బుద్ధులు ఉన్నారా, వారు నిజమైనవారేనా మొదలైనట్టి విషయాలను, స్పష్టంగా వేరుచేసి చూడడానికి అశక్తులవుతారు. భవిష్యత్తులో మీ మనసున అసత్యమైన ముద్రలు వేసి, ఇవన్నీ లేవని మీకు తోచే విధంగా చేసే ఈ పరిస్థితులు – మీరు స్థిర నిశ్చయంతో ఉన్నారా లేరా అని చూడడానికి ఇవి మళ్ళీ పైకి వస్తాయి. ఈ నిశ్చయంతో, ఆ సమయంలో మీరు నిజంగానే దృఢమైన నిర్ణయంతో ఉన్నట్లైతే, మీరు సహజంగానే బాగా చేస్తారు ఎందుకంటే అప్పటికే మీ షిన్ షిన్ అభివృద్ధి చెంది ఉంటుంది. కానీ మీరు ఆ క్షణంలో అంతటి నిలకడ కలిగి ఉండరు. మీకు ఈ కష్టం ఒక్కపెట్టున వచ్చినట్లైతే, మీరు దాని గురించి ఏమాత్రమూ తెలుసుకోలేరు, ఏ విధంగానూ ఆధ్యాత్మిక సాధనను చెయ్యలేరు. కష్టాలు భిన్న కోణాలనించి రావచ్చు.

ఆధ్యాత్మిక సాధనాక్రమంలో ఒక వ్యక్తి తన ఆధ్యాత్మిక సాధనను ఈ మార్గంలో చేసి, ఉన్నత స్థాయిలను అధిరోహించాలి. ఈ విధంగా మీలో కొందరు ఎక్కడో కొంచెం అసౌఖ్యంగా అని పించగానే, మీకు ఏదో అనారోగ్యం కలిగిందనుకుంటారు. మిమ్మల్ని మీరు సాధకులుగా భావించుకోవడంలో మీరు ఎప్పుడూ విఫలం అవుతారు, ఎందుకంటే మీకు ఇలా జరిగితే మీరు దాన్ని ఒక వ్యాధిగా పరిగణిస్తారు. ఇందులో ఇన్ని ఇబ్బందులు ఎందుకు ఉన్నాయి? ఇప్పటికే మీకోసం ఎంతో ఎక్కువభాగం తొలగించబడిందనీ,

మీకు ఇప్పుడున్న కష్టాలు అంత ముఖ్యమైనవి కావని నేను చెప్తున్నాను. మీకోసం అది తొలగించబడి ఉండక, ఆ కష్టాన్ని ఎదుర్కొని ఉంటే ఈపాటికే చనిపోయి ఉండేవారు. బహుశా మీరు మంచం పట్టి, ఎన్నటికీ బయటపడ లేకపోయేవారేమో? మీకు కొంచెం కష్టం ఎదురవగానే, మీకు అసౌఖ్యంగా అనిపిస్తుంది. కానీ అది సౌఖ్యవంతంగా ఎలా ఉంటుంది? ఉదాహరణకు, నేను చాంగ్ చుంగ్‌లో తరగతిని నిర్వహించినప్పుడు చాలా మంచి జన్మ సంస్కారం కలిగి ఉన్న వ్యక్తి ఉండేవాడు, అతడికి ఉత్తమ భవిష్యత్తు కూడా ఉంది. అతడు మంచివాడని తెలుసుకొని, అతడు తన కర్మను త్వరగా తీర్చివేసుకొని జ్ఞానోదయం పొందడం కోసం అతడి కష్టాలను కొద్దిగా పెంచాను – నేను ఆ విధంగా దాన్ని తయారు చేశాను. కానీ అతడు ఒక రోజున మెదడులో రక్తం గడ్డ కట్టే వ్యాధి కలిగి, నేలపై పడిపోయాడు. అతడికి తానిక కదలలేను అనిపించి తన కాళ్ళు, చేతులు స్వాధీనం తప్పిపోయాయని తలచాడు. అతడు అత్యవసర వైద్యంకోసం ఆస్పత్రికి పంపించబడ్డాడు. అప్పుడు అతడు మళ్ళీ నడవగలిగాడు. అందరూ దీన్ని గురించి ఆలోచించండి: మెదడులోని వ్యాధి కలిగిన ఒక వ్యక్తి అంత త్వరగా చేతులు, కాళ్ళను కదిలించి, ఎలా నడవగలడు? పైగా, అతడు తనకు జరిగిన చెడుకు ఫాలున్ దాఫాను తప్పుపట్టాడు. అతడు ఈ విషయాన్ని ఆలోచించలేకపోయాడు: అతడు మెదడు వ్యాధినించి అంత త్వరగా ఎలా కోలుకోగలిగాడు? ఆ సమయంలో అతడు ఫాలున్ దాఫాను సాధన చేసి ఉండకపోతే, తాను పడిపోయినప్పుడు నిజంగానే మరణించి ఉండేవాడు. బహుశా జీవితపర్యంతమూ పక్షవాతంతో బాధపడి, చివరకు అతడికి ఆ మెదడు వ్యాధి నిజంగానే వచ్చి ఉండేది.

ఒక వ్యక్తిని రక్షించడం ఎంత కష్టమో చెప్పడానికి మాత్రమే ఇవి చెప్పడం జరిగింది. అతడికి ఎంతో చేశాం, అయినా అతడు దానిని గ్రహించలేదు; దానికి మారు ఇంకేమేమో అన్నాడు. దీర్ఘకాలంగా సాధన చేస్తున్న కొందరు సాధకులు "టీచర్, నా శరీరమంతటా అసౌఖ్యం ఎందుకు కలుగుతుంది? నేనెప్పుడూ ఆస్పత్రికి వెళ్ళి, ఇంజెక్షన్లు తీసుకుంటూ ఉంటాను, అయినా దానివల్ల ఉపయోగం ఉండదు. మందులు తీసుకున్నా, ఉపయోగం ఉండదు" అంటారు. నాతో అలా అనడానికి వారికి ఎటువంటి ఇబ్బంది కూడా అనిపించ

లేదు! అవును, అవి ఉపయోగపడవు. వారికి ఉన్నవి వ్యాధులు కావు, మందులు ఎలా ఉపయోగపడతాయి? మీరు ఒకడుగు ముందుకు వెళ్ళి శరీర పరీక్షలు చేయించుకోవచ్చు, వాటిలో ఎటువంటి మార్పులూ కనపడవు, కానీ మీకు అసౌకర్యంగా ఉంటుంది. మా సాధకుడొకరు ఒక ఆస్పత్రిలో కొన్ని సూదులను విరిచేశారు. చివరికి ఆ మందు బయటకు చిమ్మిందే గానీ, ఆ సూది లోపలికి దిగలేదు. అప్పటికి అతడు "ఓహ్, నేను ఒక సాధకుడిని, నేను ఇంజెక్షన్లు తీసుకోకూడదు" అని అర్థం చేసుకున్నాడు. తాను ఒక ఇంజెక్షన్ తీసుకొని ఉండకూడదని అతడు గ్రహించుకున్నాడు. అందువల్ల, మీకు కష్టాలు ఎదురైనప్పుడల్లా, ఈ అంశం మీద తప్పకుండా శ్రద్ధ వహించండి. కొందరు వ్యక్తులు నేను తమను ఆస్పత్రికి వెళ్ళడానికి అనుమతించడం లేదన్న తలంపుతో, "మీరు, నన్ను ఆస్పత్రికి వెళ్ళనివ్వకపోతే, నేను వెళ్ళి ఒక చీ గోంగ్ గురువును కలుస్తాను" అని ఆలోచిస్తారు. వారు ఇంకా దానిని ఒక వ్యాధిగానే పరిగణించి, ఒక చీ గోంగ్ గురువును కలవాలని అనుకుంటారు. వారికి ఒక నిజమైన చీ గోంగ్ గురువు ఎక్కడ దొరుకుతారు? మీకొక మోసపు గురువు దొరికితే మీరు నిలువునా నాశనం అవుతారు.

"మీరు ఒక మోసపు చీ గోంగ్ గురువుకు, నిజమైన గురువుకు మధ్య వ్యత్యాసాన్ని ఎలా కనుక్కోగలరు?" అని మేము అడిగాం. చీ గోంగ్ గురువులలో అనేకులు స్వయంగా ప్రకటించుకున్నవారే. నేను పరీక్షింపబడ్డాను, ఆయా వైజ్ఞానికశాస్త్ర సంస్థలు తమ పరిశోధనా ఫలితాలను వెల్లడించిన పత్రాలు కూడా నా చేతిలో ఉన్నాయి. అనేక చీ గోంగ్ గురువులు, నామమాత్రులు, స్వయంప్రకటితులు. ప్రజలను బురిడీ కొట్టించి మోసగించే వారు అనేకులు ఉన్నారు. అటువంటి మోసపు చీ గోంగ్ గురువు వ్యాధులను కూడా తొలగించ గలడు. ఎలా చెయ్యగలుగుతాడు? అతడు ఒక ప్రేతాత్మ లేదా జంతువు చేత ఆవహించబడి ఉంటాడు, అది లేకుండా అతడు జనులను మోసపుచ్చలేడు! ఆ ఆవహించుకున్న ప్రేతాత్మ లేదా జంతువు కూడా శక్తిని విడుదల చేసి, వ్యాధులను తగ్గించగలదు. శక్తి ఉనికికి అది ఒక రూపం అయినందువల్ల, అది సామాన్య మానవులను అతిసులభంగా నిరోధించగలదు. కానీ "ఆ ఆవహించి ఉన్న ప్రేతాత్మ లేదా జంతువు మిమ్మల్ని స్వస్థపరచినప్పుడు

మీకు ఏమిస్తుంది?" అన్నది మీకు చెప్పాను. అతిసూక్ష్మ స్థాయిలో, అది ఆ ప్రేతాత్మ లేదా జంతువు యొక్క ప్రతిబింబం మాత్రమే. దాన్ని మీకిస్తే మీరేం చెయ్యగలరు? "మరణం లేని ఒక జీవిని వదిలించుకోవడంకన్నా ఆహ్వానించడం సులభం." (5). మేము సామాన్య వ్యక్తుల విషయంలో ఆందోళనపడం, ఎందుకంటే, వాళ్ళు సామాన్య వ్యక్తులుగానే ఉండిపోయి, తాత్కాలిక సాంత్వనను వెతుకుతారు. అయితే, మీరు ఒక సాధకుడు. మీ శరీరాన్ని నిరంతరమూ శుద్ధిపరచుకోవాలని మీరు కోరుకోరా? ఒకవేళ అది మీ శరీరానికి అతుక్కుపోతే, మీరు దాన్ని ఎప్పటికి వదిలించుకోగలుగుతారు? పైగా, దానికి కొంత శక్తి కూడా ఉంటుంది. కొందరు "ఫాలున్ దానిని ఎందుకు రానిస్తుంది? గురువుగారి ఫాషెన్ మనకు రక్షగా ఉంది కదా?" అని ఆశ్చర్యపోతారు. విశ్వంలో ఒక నియమం ఉంది: మీ అంతట మీరు దేనినైనా కోరుకుంటే ఎవరూ మధ్యన జోక్యం చేసుకోరు. మీరు దాన్ని కోరుకున్నంత కాలమూ, ఎవ్వరూ కల్పించుకోరు. నా ఫాషెన్ మిమ్మల్ని ఆపి కొన్ని సూచనలను ఇస్తుంది. మీరు ఎప్పుడూ అలాగే ఉన్నారని చూసినప్పుడు అది ఇక ఏమాత్రమూ, మీ గురించి శ్రద్ధ వహించదు. ఒక వ్యక్తిని ఆధ్యాత్మిక సాధన చెయ్యమని ఎవరు ఒత్తిడి చెయ్యగలరు? మీరు ఆధ్యాత్మిక సాధన చేసేట్లు లేదా బలవంతంగా చేసేట్లు ఎవ్వరూ చెయ్యలేరు. నిజంగా అభివృద్ధి పొందాలంటే, అది మీ నిర్ణయమే. మిమ్మల్ని మీరు ఉన్నతీకరించుకోవాలని మీరు కోరుకోనిదే, ఎవరూ ఏమీ చెయ్యలేరు. మీకు నియమాలూ, ఫా బోధించబడ్డాయి. అయినా మిమ్మల్ని మీరు ఉన్నతీకరించుకోవాలని కోరుకోకపోతే మీరు ఎవరిని నిందించగలరు? మీరు కోరుకునేదాని గురించి, నేను, నా ఫాషెన్ ఇద్దరమూ కల్పించుకోం. ఇది ఖాయం. అప్పటికీ, కొందరు వ్యక్తులు ఇతర చీ గోంగ్ గురువుల తరగతులకు వెళ్ళారు, ఇంటికి వెళ్ళిన తరవాత వారు చాలా అసౌఖ్యం అనుభవించారు. అది తప్పక జరుగుతుంది. నా ఫాషెన్ మిమ్మల్ని ఎందుకు రక్షించలేదు?

మీరు దేనికోసం అక్కడికి వెళ్ళారు? అక్కడ విన్న దానివల్ల, ఏదో పొందాలనే కోరికతో మీరు ప్రయత్నించలేదా? మీరు మీ చెవులతో విననిదే, అది మీ శరీరంలో ఎలా చేరగలిగింది? కొందరు తమ ఫాలున్ యొక్క

ఆకారాన్ని చెడగొట్టుకున్నారు. మీ జీవితంకన్నా ఈ ఫాలున్ ఎక్కువ విలువైందని నేను చెప్తున్నాను. అది మీరు మీ ఇష్టానుసారం నాశనం చెయ్యకూడని ఒక ఉన్నత జీవి. ప్రస్తుతం ఎందరో మోసపు చీ గోంగ్ గురువులు ఉన్నారు, వారిలో కొందరు ప్రసిద్ధులు కూడా ఉన్నారు. చైనా చీగోంగ్ సైన్స్ రిసెర్చ్ సొసైటీ నిర్వాహకులతో, ప్రాచీనకాలంలో ఒకసారి రాజసభ డాహ్ జీ (6) వల్ల పీడింపబడిందని నేను చెప్పాను. ఆ నక్క అనేక నీచకృత్యాలు చేసింది కానీ ఈనాడు యావత్‌దేశానికి కీడు తెచ్చిన మోసపు చీ గోంగ్ గురువుల కంటే అది చెడ్డది కాదు. ఎంతమంది ప్రజలు వారికి బలయ్యారు? పైకి అది మీకు మంచిగానే కనిపిస్తుంది, కానీ ఎంతమంది అటువంటి వాటిని తమ శరీరాలపై మోస్తున్నారు? వారు మీకు వాటిని ఇస్తే మీకు అది వచ్చేస్తుంది – ఇది అంత ఎక్కువగా ప్రబలిపోయింది. అందువల్ల కేవలం చూసినంతమాత్రాన వ్యత్యాసం తెలుసుకోవడం సామాన్య వ్యక్తులకు కష్టం.

"ఇవాళ ఈ చీగోంగ్ సమావేశానికి వచ్చి లీ హోంగ్ జీ చెప్పినది విన్న తరవాత, చీ గోంగ్ ఎంత గొప్పదో, నిగూఢమైనదో నేను తెలుసుకున్నాను! మళ్ళీ ఇతర చీ గోంగ్ సమావేశాలుంటే నేను వాటికి కూడా వెళ్ళాలి" అని కొందరు అనుకోవచ్చు. మీరు నిశ్చయంగా అక్కడికి వెళ్ళరాదని నేను చెప్తున్నాను. మీరు అవి వింటే చెడ్డ విషయాలు మీ చెవులలో దూరుతాయి. ఒక వ్యక్తిని రక్షించడమూ, లేదా ఆ స్త్రీ లేదా పురుషుని ఆలోచనావిధానాన్ని మార్చడమూ, అతికష్టం. ఒక వ్యక్తి శరీరాన్ని శుద్ధి చెయ్యడం కూడా కష్టమే. అవసరానికి మించిన సంఖ్యలో మోసపు చీ గోంగ్ గురువులున్నారు. ఒక నీతివంతమైన సాధననించి వచ్చిన అసలైన చీ గోంగ్ గురువు అయినా నిజంగా పరిశుభ్రంగా ఉన్నాడా? కొన్ని జంతువులు అతివిషపూరితమైనవి. అతడి శరీరానికి అతుక్కోగల శక్తి వాటికి లేదు, అయితే, అతడు వాటిని తరిమివేయనూ లేడు. ఈ వ్యక్తికి, ప్రత్యేకించి అతడి శిష్యులకు, భారీ ఎత్తున వాటిని ఎదిరించే శక్తి ఉండదు. అతడు గోంగ్‌ను ఇచ్చివేసేటప్పుడు దానికి అనేక కలుషితాలు అంతర్గతంగా విస్తరించి ఉంటాయి. అతడు చాలా మర్యాదస్తుడైనా, అతడి శిష్యులు నీతివంతులు కారు, వారిని భిన్న ప్రేతాత్మలు లేదా జంతువులు – అన్ని రకాలవి ఆవహించి ఉంటాయి.

మీకు నిజంగానే, ఫాలున్ దాఫాలో ఆధ్యాత్మిక సాధన చెయ్యాలని ఉంటే, మీరు వెళ్ళి అవి వినకూడదు. అయితే, మీకు ఫాలున్ దాఫాలో ఆధ్యాత్మిక సాధన కాకుండా మిగిలినవన్నీ సాధన చెయ్యాలని ఉంటే, మీరు ముందుకు వెళ్ళొచ్చు; మిమ్మల్ని నేను ఆపను, ఎందుకంటే, మీరు ఇటు ఫాలున్ దాఫా శిష్యులు కూడా కాదు. ఏదైనా చెడు జరిగితే అది ఫాలున్ దాఫా సాధనవల్ల జరిగిందని వాదించకండి. మీరు ఆ షిన్ షిన్ స్థాయిని పాటిస్తూ దాఫాను అనుసరించి ఆధ్యాత్మిక సాధన చేస్తేనే, మీరు అసలైన ఫాలున్ దాఫా సాధకు లవుతారు. ఎవరో నన్ను "నేను ఇతర చీ గోంగ్ సాధనలు చేసే సాధకులతో కలసి చెయ్యొచ్చా?" అని అడిగారు. మీరు దాఫాలోని ఆధ్యాత్మిక సాధన చేస్తుండగా, వారు కేవలం చీ గోంగ్‌ను సాధన చేస్తున్నారని నేను చెప్తున్నాను. మీరు ఈ ఉపన్యాసాలు విన్న తరవాత స్థాయుల విషయంలో మీరు వారిని ఎన్నో రెట్లు అధిగమిస్తారు. ఈ ఫాలున్ అనేక తరాల ఆధ్యాత్మిక సాధన తర్వాత తయారైనది, దీనికి మహత్తరమైన శక్తులున్నాయి. మీరు వారిని కలిసినప్పుడు, వారినించి ఏమీ తీసుకోకుండా, వారికేమీ ఇవ్వకుండా కేవలం ఒక సాధారణ స్నేహితుడిగా ఉండగలిగినంత వరకు ఏ సమస్య లేదు. అయితే, ఒకవేళ ఆ వ్యక్తులను ఏదైనా ఆవహించి ఉంటే మాత్రం, చాలా హానికరం, వారితో ఎటువంటి సంబంధమూ పెట్టుకోకుండా ఉంటేనే మంచిది. ఒక దంపతుల విషయం తీసుకున్నా, మీ జీవిత భాగస్వామి మరొక చీ గోంగ్ సాధన చేస్తున్నా ఎక్కువ ఇబ్బంది లేదని నేను అనుకుంటున్నా. కానీ ఇక్కడ ఒక విషయం ఉంది. మీరు చేస్తున్నది ఒక ధర్మబద్ధమైన మార్గంలోని సాధన కాబట్టి, మీ సాధన ఇతరులకు మేలు చేస్తుంది. మీ జీవిత భాగస్వామి ఒక పాపపు సాధన చేస్తుంటే, వారు తమ శరీరంలో చెడ్డ విషయాలను కలిగి ఉండొచ్చు. మీరు క్షేమంగా ఉండడానికి, తప్పనిసరిగా వారిని శుద్ధి చెయ్యవలసి ఉంటుంది. మీ కోసం ప్రతిది ఇతర పరిమాణాలలో శుద్ధి చేయబడుతుంది. మీ గృహ పరిసరాలు కూడా శుద్ధి చేయబడతాయి. ఒకవేళ మీ పరిసరాలు శుద్ధి చేయక, మీకు అన్ని రకాల విషయాలవల్ల అంతరాయం కలుగుతుంటే, మీరు ఆధ్యాత్మిక సాధనను ఎలా చెయ్యగలుగుతారు?

నా ఫాషెన్ విషయాలను శుద్ధి చేయని మరొక పరిస్థితి ఉంది. మా

సాధకులలో ఒకరు ఒక రోజు నా ఫాషెన్ తమ ఇంటికి రావడం చూసి చాలా సంబరపడ్డాడు. "టీచర్ ఫాషెన్ ఇక్కడుంది, టీచర్, లోపలికి రండి" అన్నాడు. నా ఫాషెన్ "నీ గది చాలా అస్తవ్యస్తంగా ఉంది, ఇక్కడ చాలా వస్తువులు ఉన్నాయి." అని, అది వెళ్ళిపోయింది. సాధారణంగా ఇతర పరిమాణాలలో చాలా దుష్ట ప్రేతాత్మలుంటే, నా ఫాషెన్ మీకోసం వాటిని తుడిచేస్తుంది. అయితే, అతడి గది నిండా రకరకాలైన చెడ్డ చీ గోంగ్ పుస్తకాలున్నాయి. అతడు దానిని అర్థం చేసుకొని, వాటిని కాల్చివేయడం లేదా, అమ్మివేయడం ద్వారా, శుద్ధి చేశాడు. నా ఫాషెన్ అప్పుడు తిరిగి వచ్చింది. ఆ సాధకుడు నాకు చెప్పిన విషయం ఇది.

కొంతమంది, జ్యోతిష్కులను సంప్రదిస్తూ ఉంటారు. ఎవరైనా, "టీచర్, నేనిప్పుడు ఫాలున్ దాఫాను సాధన చేస్తున్నాను. నాకు ఝౌయీ లేదా జ్యోతిష్యం వంటి విషయాలపట్ల ఆసక్తి ఉంది. నేను వాటిని ఉపయోగించవచ్చా?" అని అడుగుతారు. నేను ఇలా చెప్తాను: మీకు నిర్దిష్టంగా గణించదగిన శక్తి ఉంటే, మీరు అన్న ప్రతి మాటకు ఒక ప్రభావం ఉంటుంది. మీకు అలాంటి శక్తి లేకున్నా, ఉందని ఇతరులకు చెప్తే, అది ఒక దుష్కర్మ చేసినట్లే అవుతుంది. ఒక సామాన్య వ్యక్తి అతిబలహీనుడు. అతడిచ్చే సందేశాలు అస్థిరంగా ఉంటూ, మారుతూ ఉండొచ్చు. మీరు నోరు తెరిచి, అతడికి ఏదైనా చెప్పినట్లైతే, ఆ కష్టం నిజం కావచ్చు. ఈ వ్యక్తికి ఎక్కువ కర్మ ఉండి, తీర్చవలసిన ఋణం అధికంగా ఉన్నా, మీరు అతడి అదృష్టం బాగుందని చెప్తూ ఉంటే, అతడికి తిరిగి చెల్లించే శక్తి లేని పక్షంలో అది అనుమతింపబడుతుందా? మీరు అతనికి హాని చేస్తున్నట్లు కాదా? కొంతమంది తమకేదో ప్రతిభ ఉన్నట్లుగా ఇటువంటి విషయాలను వదలకుండా బంధం కలిగి ఉంటారు. ఇది ఒక బంధం కాదా? అదీకాక, మీకు నిజంగానే జరగబోయే యదార్థం తెలిసి ఉన్నప్పటికీ, ఒక సాధకుడిగా మీ షిన్ షిన్‌ను నిలుపుకొంటూ, ఒక దైవరహస్యాన్ని అలక్ష్యంగా బయటపెట్ట కూడదు. ఇది నియమం. ఒక వ్యక్తి ఝౌయీని జ్యోతిష్యం చెప్పడానికి, ఏ విధంగా ఉపయోగించినా, అందులో నిజం పాలు కొంత ఇప్పటికే తగ్గిపోయింది. కొంత నిజం, కొంత అబద్ధం కలిపి ఏదో ఒక రకంగా చెప్పబడుతున్న ఈ జ్యోతిష్యం అనేది, సామాన్య మానవ సమాజంలో

ఉండడానికి అనుమతింపబడుతున్నది. మీరు అసలైన గోంగ్‌ను కలిగి ఉన్న వ్యక్తి అయినందున, ఒక నిజమైన సాధకుడు ఉన్నత స్థాయిని అనుసరించాలని నేను చెప్తాను. అయినప్పటికీ, కొందరు సాధకులు ఇతర వ్యక్తులను తమ భవిష్యత్తు చెప్పమని అడుగుతారు: "నేను ఎలా చేస్తున్నానో మీరు కనుక్కొని చెప్పగలరా? నా ఆధ్యాత్మిక సాధన ఎలా ఉంది? నాకేమైనా కష్టాలున్నాయా?" వారు ఈ విషయాలను గురించి భవిష్యవాణిని చెప్పమని ఇతరులను అడుగుతారు. మీ కష్టాన్ని ముందుగానే చెప్పినట్లైతే, మిమ్మల్ని మీరు ఎలా ఉన్నతీకరించుకుంటారు? ఒక సాధకుని యావత్‌జీవితమూ తిరగరాయ బడుతుంది. ఒక వ్యక్తి యొక్క హస్త సాముద్రికం, ముఖ సాముద్రికం, జన్మ వివరాలు, అతడి శరీరంలోని సందేశాలన్నీ అప్పటికే మార్చబడి వేరుగా ఉన్నాయి. మీరొక జ్యోతిష్కుని దగ్గరికి వెళ్తే అతడిని నమ్ముతారు. లేకపోతే మీరు అలా ఎందుకు చేస్తారు? అతడు చెయ్యగలిగినదల్లా, మీ గతంలో జరిగిన వాటిని పైపైన చెప్పడమే. అయితే ఇప్పటికే వాటిలోని సారాంశం మార్చబడి ఉంది. ఇప్పుడు, అందరూ దీని గురించి ఆలోచించండి: మీరు ఒక జ్యోతిష్కుని దగ్గరికి వెళ్తే, మీరు అతడు చెప్పేది విని, నమ్ముతున్నట్లే కదా? అటువంటప్పుడు అది మీకు ఒక మానసికమైన భారాన్ని కల్పించదా? మీరు దాని గురించి ఆలోచించడమన్న భారం మీమీద వేసుకున్నట్లైతే ఒక బంధం అయినట్లు కాదా? అయితే ఈ బంధం ఎలా తొలగింపబడుతుంది? మీరొక అదనపు కష్టాన్ని మీద వేసుకున్నట్లే కదా? ఈ బంధాన్ని వదిలివేయడానికి మీరు మరింత బాధను అనుభవించ వద్దా? ప్రతి పరీక్షా లేదా కష్టమూ, ఆధ్యాత్మిక సాధనలో ముందుకో, వెనకకో పోవడమనే విషయానికి సంబంధించి ఉంటుంది. అసలే అది ఒక కష్టం, దాని మీద మీరు దీనిని అదనంగా స్వయంగా తెచ్చి పెట్టుకుంటున్నారు. దీనిని మీరు ఎలా అధిగమిస్తారు? దీని కారణంగా మీరు, కష్టాలను, ఇబ్బందులను ఎదుర్కొనవచ్చు. మార్చబడిన మీ జీవన పథము మరొకరు చూడడానికి అనుమతింపబడదు. ఇతరులు చూడడమో, మీకు ఒక కష్టం ఎప్పుడు కలుగుతుందో ముందే చెప్పినట్లైతే, మీరు ఆధ్యాత్మిక సాధనను ఎలా చెయ్యగలుగుతారు? అందువల్ల దానిని చూడడానికి ఎట్టి పరిస్థితులలోనూ అనుమతి లేదు. ఇతర సాధనామార్గాలకు

చెందిన వారెవ్వరూ చూడడానికి కూడా అనుమతి లేదు. ఒకే సాధనామార్గానికి చెందిన సహచర శిష్యులు కూడా దానిని చూడడానికి అనుమతి ఉండదు. ఎవ్వరికీ దాని గురించి సరిగ్గా చెప్పడానికి శక్తి చాలదు, ఎందుకంటే, అటువంటి జీవితం మార్చబడి, ఇప్పుడు ఆధ్యాత్మిక సాధన కోసమై ఉన్నది.

ఎవరో నన్ను, ఇతర మత గ్రంథాలు, ఇతర చీ గోంగ్ గ్రంథాలు చదవవచ్చా? అని అడిగారు. అన్ని మత గ్రంథాలు, ప్రత్యేకించి బౌద్ధమతానికి చెందినవి, షిన్ షిన్‌ను ఎలా సాధన చెయ్యాలన్నదే బోధిస్తాయని మేము చెప్పాము. మేము కూడా బౌద్ధ సిద్ధాంతానికి చెందినవారమే, కాబట్టి ఎటువంటి సమస్య ఉండకూడదు. కానీ ఒక విషయం చెప్పాలి. గ్రంథాలను అనువదిస్తున్నప్పుడు అనేక విషయాలను తప్పుగా అనువదించడం జరిగింది. పైగా భిన్న స్థాయుల దృక్పథాలనించి గ్రంథాలకు అర్థాలు చెప్పడం జరిగినందువల్ల కూడా అలక్ష్యంగా నిర్వచనాలు ఇవ్వడం జరిగింది. అది ధర్మాన్ని దోపిడీ చేసినట్లే. అలక్ష్యంగా గ్రంథాలను వ్యాఖ్యానించిన వారు బుద్ధుల లోకానికి అనంత దూరంలో ఉన్నారు; వారు ఆ గ్రంథాలలోని అసలైన సారాంశాన్ని అర్థం చేసుకోలేదు. అందువల్ల వారికి ఆ అంశాలపట్ల భిన్నమైన అవగాహనలు ఉంటాయి. వాటిని క్షుణ్ణంగా అర్థం చేసుకోవడం మీకు అంత సులభం కాదు, మీ అంతట మీరు వాటిని అవగాహన చేసుకునే శక్తి మీకు లేదు. కానీ, ఒకవేళ మీరు, “నాకు గ్రంథాలు చదవడంలో ఆసక్తి ఉంది” అని, ఎప్పుడూ గ్రంథాలు చదువుతూనే ఉంటే, ఆ గ్రంథాలు కూడా ఆ సాధనామార్గంలోని గోంగ్‌ను, ఫాను కలిగి ఉండడంవలన, మీరు ఆ సాధనా మార్గంలోని సాధనను చేస్తున్నట్లు అవుతుంది. మీరొకసారి దానిని అధ్యయనం చేస్తే, మీరు ఆ సాధనామార్గంలోని సాధనను చేస్తారు. ఇందులో ఈ సమస్య ఇమిడి ఉంది. మీరు దానిని లోతుగా అధ్యయనం చేసి ఆ సాధనామార్గంలోని సాధనను అనుసరిస్తే, మీ స్వంత మార్గానికి బదులు దాన్ని స్వీకరించినట్లు అవుతుంది. చరిత్ర అంతటా, ఆధ్యాత్మిక సాధన విషయంలో ఒక వ్యక్తి ఏకకాలంలో రెండు సాధనామార్గాలు అవలంబించకూడదన్న నియమం ఉంది. మీకు నిజంగా ఈ సాధనామార్గాన్ని అనుసరించాలని ఉంటే, మీరు దీనికి చెందిన గ్రంథాలనే చదవాలి.

చీ గోంగ్ గ్రంథాలకు సంబంధించినంత వరకు, మీరు ఆధ్యాత్మిక సాధనను చెయ్యాలి అనుకున్నంత కాలమూ, వాటిని చదవకూడదు. ప్రత్యేకించి, ఈ రోజుల్లో ప్రచురింపబడుతున్న పుస్తకాలను మీరు చదవకూడదు. ద యెల్లో ఎంపరర్స్ క్లాసిక్ ఆఫ్ ఇంటర్నల్ ఆల్కెమీ, షింగ్ మింగ్ గ్విజి లేదా తావో జాంగ్ వంటి పుస్తకాల విషయం కూడా అంతే. వాటిలో ఆ చెడ్డ సందేశాలు ఉండకపోయినా, భిన్న స్థాయులకు చెందిన సందేశాలు కూడా ఉన్నాయి. వాటికవే సాధనామార్గాలు కూడా. ఒకసారి మీరు వాటిని చదివితే, అవి కూడా మీకు ఏదో ఒకటి ఇచ్చి, అంతరాయం కలిగిస్తాయి. వాటిలోని ఒక వాక్యం మీకు నచ్చితేసరి, ఇక అయినట్లే, మీ గోంగ్‌కు ఏదో వచ్చి కలుస్తుంది. అది చెడ్డ విషయం కాకపోయినా, మీకు ఉన్నట్లుండి ఏదో ఇతర విషయం ఇవ్వబడినప్పుడు మీరు ఆధ్యాత్మిక సాధనను ఎలా చెయ్యగలుగుతారు? అది కూడా మీకు సమస్యలను కలిగించదా? ఒక టెలివిజన్ సెట్‌లో అదనంగా ఒక భాగం చేర్చినప్పుడు దానికి ఏమవుతుందో ఆలోచించగలరా? అది తక్షణం పనికి రాకుండా పోతుంది. ఇది నియమం. దీనికి తోడు, ఈనాడు, అనేక చీ గోంగ్ పుస్తకాలు, అసత్యపూరితమై, అనేక సందేశాలను కలిగి ఉన్నాయి. మా సాధకులలో ఒకరు ఒక చీ గోంగ్ పుస్తకంలోని పుటలను తిరగేస్తుండగా, ఒక పెద్ద పాము దానిలోనించి బయటకు దూకింది. అయినా, నేను ఈ విషయాన్ని వివరంగా చర్చించను. నేను ఇప్పుడే, ఒక సాధకుడు తన ప్రవర్తనను సక్రమంగా నిలుపుకోవడంలో అశక్తుడైనప్పుడు, ఉత్పన్నమయ్యే సమస్యలలో కొన్నింటిని గురించి చెప్పాను; అంటే, సరికాని మనసువల్ల ఆ సమస్యలు కల్పించబడ్డాయి. వాటిని గుర్తించి చెప్పి, ఏం చెయ్యాలి, భవిష్యత్తులో సమస్యలు తలెత్తకుండా వాటిని ఎలా గుర్తించాలి అన్నది అందరికీ మేము తెలియజేసి నందువల్ల, మేలు జరుగుతుంది. నేను ఇప్పుడే చెప్పిన దాన్ని మరీ గట్టిగా చెప్పకపోయినప్పటికీ ప్రతివారూ దీనిపట్ల శ్రద్ధ వహించడం తప్పనిసరి, ఎందుకంటే సాధారణంగా సమస్యలు ఈ అంశంలోనే తలెత్తుతాయి, అవి సహజంగా ఇక్కడ బయటపడతాయి. ఆధ్యాత్మిక సాధన అతికఠిన ప్రయాసతో కూడి ఉంటుంది, అతిగంభీరమైనది. మీరు ఒక్కక్షణం నిర్లక్ష్యంగా ఉన్నా, పడిపోయి వెంటనే పతనం అవుతారు. అందువల్ల ఒక వ్యక్తి మనసు సరియైనదై ఉండాలి.

# యుద్ధవిద్యల చీ గోంగ్

అంతర ఆధ్యాత్మిక సాధనలకు తోడు, యుద్ధవిద్యల చీ గోంగ్ కూడా ఉంది. నేను దీని గురించి చెప్పేటప్పుడు, సాధకుల సమాజంలో అనేక చీ గోంగ్ రూపాల గురించిన వాదాలు ఉన్నాయన్న అంశాన్ని గట్టిగా నొక్కి చెప్పవలసి ఉంది.

ఈనాడు – చిత్రలేఖన చీ గోంగ్, సంగీత చీ గోంగ్, అందమైన చేతివ్రాత చీ గోంగ్, నాట్య చీ గోంగ్ అని చెప్పబడుతున్న అన్ని రకాల చీ గోంగ్ ఉంది. అవన్నీ చీ గోంగ్ ఏనా? నాకు అది చాలా వింతగా అనిపిస్తుంది. నాకు ఇది చీ గోంగ్‌ను దోపిడీ చేయడం అనిపిస్తుంది. అంతే కాకుండా కేవలం చీ గోంగ్‌ను నాశనం చెయ్యడమే. వాటి యొక్క సిద్ధాంతపరమైన ఆధారం ఏమిటి? ఒక వ్యక్తి చిత్రలేఖనమూ, సంగీతమూ, నాట్యమూ, రాయడమూ చేస్తున్నప్పుడు అతడు ఒక సమాధి లేదా చీ గోంగ్ అని చెప్పబడుతున్న స్థితిలో ఉండాలని అంటారు. దానివల్ల అది చీ గోంగ్ అయిపోతుందా? దాన్ని ఈ విధంగా అర్థం చేసుకోకూడదు. అది చీ గోంగ్‌ను నాశనం చేసినట్లు కాదా? చీ గోంగ్ అన్నది విశాలమూ, నిగూఢమూ అయినట్టి ఒక మానవ శరీర ఆధ్యాత్మిక సాధన. ఒహ్, సమాధి స్థితిలో ఉండడాన్ని చీ గోంగ్ అని ఎలా అంటారు? అయితే సమాధి స్థితిలో ఉండగా మరుగుదొడ్డిని వాడితే, దానిని ఏమనాలి? ఇది చీ గోంగ్‌ను నాశనం చెయ్యడం కాదా? ఇది చీ గోంగ్‌ను అవమానించడమని నేను అంటాను. రెండేళ్ళ క్రిందట, ఓరియెంటల్ హెల్త్ ఎక్స్‌పో దగ్గర, అందమైన చేతివ్రాత చీ గోంగ్ అని చెప్పబడేది జరిగింది. అదేమిటి? నేను అక్కడికి వెళ్ళి, ఒక వ్యక్తి వ్రాస్తూ ఉండడం చూశాను. వ్రాయడం అయ్యాక, అతడు తన చీని తన చేతులతో ప్రతి అక్షరానికి ఇచ్చాడు, అలా ప్రసరింపబడిన చీ అంతా నల్లగా ఉంది. అతడి మనసంతా ధన, కీర్తుల గురించి నిండిపోయి ఉంది. అతడికి గోంగ్ ఎలా ఉంటుంది? అతడి యొక్క చీ కూడా సవ్యంగా ఉండి ఉండదు. అతడి వ్రాతలన్నీ అత్యధిక ధరల పట్టికలు అతికించి వ్రేలాడదీయబడి ఉన్నాయి. కానీ అవన్నీ విదేశీయులకే అమ్మబడినాయి. వాటిని కొన్నవారంతా దౌర్భాగ్యం పాలై ఉంటారని నేను అంటాను. నల్లని చీ మంచిది ఎలా అవుతుంది? ఆ వ్యక్తి ముఖమంతా నల్లగా ఉంది. అతడు ధనం

గురించిన ప్రబలమైన ఆలోచనలలో కూరుకుపోయి ఉన్నాడు – అతడికి కొంచెమైనా గోంగ్ ఉండడం ఎలా సాధ్యం? అంతేకాక, అతడి బిజినెస్ కార్డ్ మొత్తం ఇంటర్‌నేషనల్ కేలిగ్రఫీ చీ గోంగ్ వంటి బిరుదుల కుప్పను కలిగి ఉంది. అటువంటి దాన్ని చీ గోంగ్ అని ఎలా అంటారని నేను అడుగుతున్నాను.

అందరూ ఇది ఆలోచించండి: ఈ తరగతిలో ఉన్న వారిలో ఎనభై నించి తొంభై శాతం మందికి వ్యాధి నిర్మూలనం జరగడమే కాక, గోంగ్ – అసలైన గోంగ్ కూడా పెంపొంది ఉంటుంది. ఇప్పటికే మీ శరీరంలో ఉన్నది చాలా వరకు ఇంద్రియాలకు అతీతమైనది. మీ అంతట మీరు ఆధ్యాత్మిక సాధన చేస్తే, ఒక జీవితకాలంపాటు సాధన చేసినప్పటికీ దానిని సాధించలేరు. ఒకవేళ ఒక యువకుడు ఇప్పటినించి సాధన ప్రారంభించినా, నేను ఇచ్చిన వాటిని ఈ జీవిత కాలంలో పెంపొందించుకోలేడు, అతడికి అప్పటికీ ఒక నిజమైన సద్గురువు యొక్క మార్గదర్శకత్వం అవసరం అవుతుంది. ఈ ఫాలున్‌ను, సంవిధానాలను రూపొందించడానికి మాకు అనేక తరాల కాలం పట్టింది. ఇవి మీ శరీరంలో ఒక్కసారిగా నెలకొల్పడం జరిగింది. కాబట్టి, కేవలం సులభంగా పొందగలిగాము కదా అనిసులభంగా పోగొట్టుకోవద్దని మీకు నేను చెప్తున్నాను. ఇవి అత్యంత విలువైనవీ, అమూల్యమైనవి. ఈ తరగతి తరవాత, మీరు మీలో కలిగి ఉండేది, అత్యంత శక్తి పదార్థం, నిజమైన గోంగ్. మీరు ఇంటికి వెళ్ళిన తరవాత కొన్ని పదాలు రాస్తే, మీ చేతివ్రాత ఎలా ఉన్నా గానీ, అందులో గోంగ్ ఉంటుంది! ఆ కారణంగా, ఈ తరగతిలోని ప్రతివారూ "గురువు" అన్న బిరుదుకు అర్హులై చేతివ్రాత చీ గోంగ్ గురువులై పోతారా? దీన్ని ఇలా అర్థం చేసుకోకూడదని నేను అంటాను. అసలైన గోంగ్‌ను, శక్తిని కలిగి ఉన్న వ్యక్తిగా మీరు ఉద్దేశపూర్వకంగా దాన్ని ఇచ్చివేయవలసిన అవసరం లేదు; మీరు దేనిని తాకినా శక్తిని ఇస్తూ ఉంటారు, అది ప్రకాశవంతంగా వెలుగుతూ ఉంటుంది.

నేను ఒక పత్రికలో ఒక వార్తావిశేషాన్ని కూడా చూశాను, అందులో అందమైన చేతివ్రాత చీ గోంగ్ తరగతిని నిర్వహించబోతున్నట్లు తెలుపబడి ఉంది. నేను అది ఎలా నేర్పబడుతుందో చూద్దామని దాన్ని క్లుప్తంగా చదివాను. ఒక వ్యక్తి ముందుగా తన శ్వాసను లేదా ఉచ్ఛ్వాస, నిశ్వాసలను క్రమబద్ధం

చేసుకోవాలని రాయబడి ఉంది. తరవాత, అతడు పావుగంటనించి అరగంట వరకు, మనసును దాన్ త్యన్‌లోని చీ మీద కేంద్రీకరించి, దాన్ త్యన్ చీని ముంజేతికి ఎత్తుతున్నట్టు ఊహించుకోవాలి. తరవాత అతడు కుంచె కలాన్ని నల్ల సిరాలో ముంచాలి. తరవాత ఆ చీని అతడు కుంచె కలం అంచుకు జరపాలి. ఒక వ్యక్తి మానసిక భావం అక్కడికి చేరుకున్న తరవాత, అతడు రాయడం ప్రారంభించవచ్చు. అది మనుషులను మోసం చెయ్యడం కాదా? ఓహ్, ఒక వ్యక్తి ఆ చీని ఎక్కడికో జరపగలిగితే, అది చీ గోంగ్‌గా పరిగణింప బడుతుందా? అలా అయితే, మనం భోజనం చేసే ముందు, కొంతసేపు ధ్యానంలో కూచోవాలి. తరవాత చాప్ స్టిక్స్‌ను చేత పట్టుకొని భోజనం చెయ్యడానికి, వాటి కొసలకు చీని జరిపాలి. అది భోజన చీ గోంగ్ అవుతుంది, కాదా? మనం తినేదంతా కూడా ఎటూ శక్తి గానే తయారవుతుంది. మేం కేవలం ఈ అంశం గురించి వ్యాఖ్యానిస్తున్నాం. దీన్ని చీ గోంగ్‌ను అవమానించడమని నేను అంటున్నాను, ఎందుకంటే, వారు చీ గోంగ్‌ను అంత లోతు లేని విషయంగా భావిస్తారు. అందువల్ల జనులు దీనిని ఈ రకంగా అర్థం చేసుకోకూడదు.

అయితే యుద్ధవిద్యల చీ గోంగ్‌ను మాత్రం ముందుగానే చీ గోంగ్ సాధనగా పరిగణించవచ్చు. అలా ఎందుకని? ఎందుకంటే, దానికి అనేక వేల ఏళ్ళ వారసత్వమూ, ఆధ్యాత్మిక సాధనా సిద్ధాంతాల సంపూర్ణ వ్యవస్థ, ఆధ్యాత్మిక సాధనాపద్ధతుల సంపూర్ణ వ్యవస్థ ఉండడంవల్ల, దాన్ని ఒక సంపూర్ణ వ్యవస్థగా పరిగణించవచ్చు. అన్నీ ఉండి కూడా, యుద్ధవిద్యల చీ గోంగ్, అంతర ఆధ్యాత్మిక సాధనలలో అట్టడుగు స్థాయికి చెందినదిగా మిగిలిపోయింది. దృఢంగా ఉండే చీ గోంగ్ గుత్తిగా ఏర్పడిన శక్తి-పదార్థం యొక్క రూపం, ఇది కేవలం దెబ్బలు కొట్టడానికి పనికి వచ్చేది. ఒక ఉదాహరణ ఇస్తాను. మా ఫాలున్ దాఫా తరగతికి వచ్చిన బీజింగ్‌లోని ఒక సాధకుడు తన చేతులతో దేనినీ నొక్కలేకపోయేవాడు. అతడు పిల్లలను తిప్పే బండి కొనడానికి వెతుకుతున్నప్పుడు, దాని గట్టిదనాన్ని పరీక్షించడానికి నొక్కినప్పుడు, అది ముక్కలైపోవడం చూసి ఆశ్చర్యపోయాడు. అతడు ఇంటికి వెళ్ళిన తరవాత, ఒక కుర్చీలో కూచున్నాడు, అతడు దానిని నొక్కలేకపోయాడు. ఒకవేళ నొక్కితే,

అది విరిగిపోతుంది. తనకు ఏమవుతున్నదా అని అతడు నన్ను అడిగాడు. అతడు ఒక బంధాన్ని పెంచుకోకూడదనే ఉద్దేశంతో నేను అతడికి నిజాన్ని చెప్పలేదు. నేను అదంతా సహజమేనని మాత్రం చెప్పాను, అలా ఉండనీ, పట్టించుకోవద్దని, ఎందుకంటే అది మంచిదేననీ చెప్పాను. ఆ అతీంద్రియ శక్తి మంచి విధానంలో ఉపయోగిస్తే, ఒక రాతిముక్క అతడు గిల్లితే చాలు పొడి అయిపోతుంది. ఇదేకదా దృఢమైన చీ గోంగ్? అయితే, అసలు అతడు ఎన్నడూ దృఢమైన చీ గోంగ్‌ను సాధన చెయ్యలేదు. అంతర సాధనలలో, ఈ అతీంద్రియ శక్తులు సాధారణంగా పెంపొందుతుంటాయి. కానీ, ఒక వ్యక్తి తన షిన్ షిన్‌ను సరిగా నిలుపుకోవడం కష్టం కాబట్టి, అవి పెంపొంది ఉన్నా, అతడు వాటిని ఉపయోగించడానికి అనుమతి ఉండదు. ప్రత్యేకించి, ఆధ్యాత్మిక సాధనలో క్రింది స్థాయిలో ఒక వ్యక్తి యొక్క షిన్ షిన్ పెరగదు. ఆ కారణంగా, క్రింది స్థాయిలో పెంపొందిన అతీంద్రియ శక్తులకు అనుమతి లభించదు. కాలం గడిచిన కొలదీ మీ స్థాయి పెరుగుతున్న కొలదీ, ఆ విషయాలు ఏమాత్రమూ ఉపయోగకరంగా ఉండవు, వాటిని ఇవ్వవలసిన అవసరం కూడా ఉండదు.

యుద్ధవిద్యల చీ గోంగ్ ప్రత్యేకంగా ఎలా సాధన చెయ్యబడుతుంది? దీనిని సాధన చేసేటప్పుడు, చీని క్రమబద్ధం చెయ్యవలసి ఉంటుంది, కానీ ప్రారంభంలో చీని క్రమబద్ధం చెయ్యడం సులభం కాదు. ఒక వ్యక్తి దాన్ని చెయ్యాలనుకున్నా, చెయ్యలేకపోవచ్చు. అప్పుడు అతడు ఏం చెయ్యాల్సి ఉంటుంది? అతడు తన చేతులు, ఛాతీకి రెండువైపుల, పాదాలు, కాళ్ళు, భుజాలు, తల అన్నిటితో వ్యాయామం చెయ్యాలి. అతడు వాటితో వ్యాయామం ఎలా చెయ్యాలి? కొంతమంది ఒక చెట్టును తల, చేతులు, లేదా అరిచేతులతో పిడికిలి బిగించి పిడిగుద్దులు వేస్తారు, మరికొందరు ఒక రాతిబండను తమ చేతులతో ఛెళ్ళున కొడతారు. ఒక చిన్నపాటి శక్తిని ప్రయోగిస్తేనే రక్తం వస్తుంది, అటువంటి తాకిడికి ఎముకలకు ఎంత నొప్పి కలుగుతుంది! అప్పటికీ చీని క్రమబద్ధం చెయ్యలేరు. అప్పుడేం చెయ్యాలి? అతడు చేతులను ఊపి రక్తం వెనకకు ప్రవహించేలా చేస్తాడు, ఆ విధంగా, అతడి భుజాలు, చేతులు వాచిపోతాయి. అవి నిజంగా వాచి ఉంటాయి. తరవాత, అతడు ఒక

బండరాయిని కొట్టినప్పుడు, ఎముకలకు మెత్తని అడ్డు ఏర్పడి, ఎముకలు నేరుగా రాతితో ఢీకొనవు. ఆ విధంగా అవి ఆ బాధను ఎక్కువగా పొందవు. అతడు సాధన కొనసాగిస్తున్న కొలది, గురువు అతడికి బోధిస్తూ ఉంటాడు. సాధన కొనసాగుతున్నప్పుడు, అతడు చీని క్రమబద్ధం చెయ్యడం నేర్చుకుంటాడు. అయినా, కేవలం చీని క్రమబద్ధం చెయ్యగల శక్తి ఒకటే ఉండడం మంచిది కాదు, ఎందుకంటే, ఒక నిజమైన పోరాటంలో మీ ప్రత్యర్థి మీకోసం ఆగడు. అయితే, చీని క్రమబద్ధం చెయ్యగలిగిన వ్యక్తి తనపై జరిగే దాడులను నిరోధించగలిగి ఉండి, బరువైన గదతో కొట్టబడినప్పటికీ, అతడికి నొప్పి కలగకపోవచ్చు. చీని చేతులకు జరిపిన తరవాత, అవి వాస్తాయి. కానీ ఒక వ్యక్తి సాధనను ప్రారంభించిన దశలో, చీ మొదటి దశలో ఉంటుంది, సాధన సాగుతున్నకొద్దీ ఉన్నత శక్తి పదార్థంగా పరివర్తన చెందుతుంది. ఉన్నత శక్తి పదార్థంగా మారినప్పుడు, అది ఘన సాంద్రత కలిగిన శక్తి గుచ్ఛంగా రూపొందుతుంది, ఆ శక్తి గుచ్ఛానికి వివేకం ఉంటుంది. అందువల్ల దానిని కూడా ఒక అతీంద్రియ శక్తి గుచ్ఛం లేదా ఒక అతీంద్రియ శక్తిగా చెప్పొచ్చు. అయినా, ఈ అతీంద్రియ శక్తి కేవలం కొట్టడానికి, బలమైన దెబ్బ వెయ్యడానికి పనికొస్తుంది. అది వ్యాధి నిర్మూలనకు పనికిరాదు. ఈ ఉన్నత శక్తి పదార్థం మరొక పరిమాణంలో ఉంటుంది, అక్కడి కాలగమనం మనకంటే వేగంగా ఉంటుంది. మీరెవరినైనా కొట్టినప్పుడు అప్పటికే అక్కడ గోంగ్ ఉన్నందువల్ల చీని నిర్దేశించడం లేదా దాని గురించి ఆలోచించడం చెయ్యనక్కర్లేదు. మీరు మరొకరి దాడిని నివారించాలి అనుకున్నప్పుడు కూడా అక్కడ అప్పటికే గోంగ్ ఉంటుంది. మీరు ఎంత వేగంగా దెబ్బ కొట్టినా, రెండు పరిమాణాల మధ్య కాల భావనలో ఉన్న తేడావల్ల ఆ దెబ్బ మరింత వేగంగా తగులుతుంది. యుద్ధ విద్యల చీ గోంగ్‌ను సాధన చెయ్యడం ద్వారా ఒక వ్యక్తి ఐరన్ శాండ్ పామ్, సిన్న బార్ పామ్, వజ్ర లెగ్, అర్హత్ ఫుట్ (7) అనబడే వాటిని సాధిస్తాడు. ఇవి సామాన్య వ్యక్తుల యొక్క నైపుణ్యాలు. సాధన ద్వారా ఒక సామాన్యవ్యక్తి ఈ స్థాయిని సాధించగలడు.

యుద్ధవిద్యల చీ గోంగ్‌కు, అంతర ఆధ్యాత్మిక సాధనలకు మధ్య ఉన్న అతిపెద్ద వ్యత్యాసం ఏమిటంటే, యుద్ధవిద్యల సాధనలో కదులుతూ సాధన

చెయ్యవలసిన అవసరం ఉంది, ఆ విధంగా చీ చర్మం క్రింద తిరుగుతూ ఉంటుంది. కదులుతూ సాధన చెయ్యడం అవసరం కనక, ఒక వ్యక్తి సమాధి స్థితిని సాధించలేడు, అతడి చీ దాన్ త్యన్‌లో ప్రవేశించనూ లేదు. అతడి చీ చర్మం క్రింద కండరాల గుండా కదులుతూ ఉంటుంది. అందువల్ల అతడు శరీర సాధనను లేదా, ఉన్నతస్థాయి శక్తుల యొక్క సాధననుగానీ చెయ్యలేడు. మన అంతర ఆధ్యాత్మిక సాధనలో సమాధి స్థితిలో సాధన చెయ్యవలసిన ఆవశ్యకత ఉంది. సాంప్రదాయ సాధనలలో, పొత్తికడుపు ప్రాంతంలో ఉండే దాన్ త్యన్‌లోకి చీ ప్రవేశించవలసిన అవసరముంది. వాటిలో ప్రశాంత స్థితిలో సాధన చెయ్యడమూ, బెంటిని పరివర్తన చెయ్యవలసిన అవసరమూ ఉంది. అవి శరీర ఆధ్యాత్మిక సాధన చేసి, ఉన్నత స్థాయిలలోని ఆధ్యాత్మిక సాధనకు దారితీయగలవు.

మీరు గోల్డెన్ బెల్ షీల్డ్, ఐరన్ క్లాత్ షర్ట్ అని చెప్పబడే యుద్ధ విద్యా పద్ధతులు, వంద అడుగుల దూరంనించి ఒక పోప్లర్ చెట్టును కొట్టడం వంటి వాటిని గురించి నవలల ద్వారా తెలుసుకొని ఉంటారు. తేలికైన యుద్ధ విద్యలలో, ఒక వ్యక్తి ఎత్తైన ప్రదేశాలలో ముందుకు, వెనకకు ప్రయాణం చెయ్యగలడు. కొంతమంది ఇతర పరిమాణంలోకి కూడా ప్రవేశించగలరు. అటువంటి యుద్ధవిద్యలు ఉన్నాయా? ఖచ్చితంగా ఉన్నాయి. అయితే అవి సామాన్య వ్యక్తులలో లేవు. అటువంటి అద్భుత యుద్ధవిద్యలను నిజంగా సాధించినవారు వాటిని బహిరంగంగా ప్రదర్శించలేరు. అటువంటి వ్యక్తి యుద్ధవిద్యలు అకారణంగా సాధన చెయ్యడు కాబట్టి, అతడు సామాన్య వ్యక్తుల స్థాయికి పూర్తిగా అతీతంగా ఉంటాడు కాబట్టి, ఒక అంతర ఆధ్యాత్మిక సాధనను అనుసరించి ఆధ్యాత్మిక సాధన చెయ్యాలి. అతడు తన షిన్ షిన్‌కు విలువనిచ్చి, దానిని పెంచుకోవాలి. అతడు ప్రాపంచికమైన ఆసక్తులపట్ల ఉపేక్ష వహించాలి. అటువంటి యుద్ధ విద్యలను సాధన చేసినా ఆ తరవాత అతడు వాటిని సామాన్య వ్యక్తుల నడుమ అలక్ష్యంగా ఎంతమాత్రమూ ఉపయోగించకూడదు. తనచుట్టూ చూసేవారెవరూ లేనప్పుడు ఉపయోగించవచ్చు. మీరు ఆ నవలలు చదువుతున్నప్పుడు, ఒక పాత్ర, కత్తి యుద్ధానికి సంబంధించిన పుస్తకం, ఒక నిధి, లేదా స్త్రీలకోసం పోరాడినట్లు

చూస్తారు. ప్రతివారికీ గొప్ప శక్తులు ఉన్నట్లు, మనకు అర్థం కాని విధంగా ముందుకు, వెనకకు ప్రయాణిస్తున్నట్లు చూపించబడుతుంది. అందరూ, ఇది ఆలోచించండి: యుద్ధవిద్యలలో నిజంగా నైపుణ్యం కలిగిన ఆ వ్యక్తులు వాటిని అంతర ఆధ్యాత్మిక సాధన ద్వారా పెంపొందించుకోవాలి కదా? వారు వాటిని కేవలం తమ షిన్ షిన్ సాధన ద్వారా సాధించుకుంటారు, వారు ఎంతోకాలం క్రిందటే కీర్తి, లాభం, వివిధ రకాల కోరికలపట్ల నిరాసక్తులై ఉంటారు. వారు ఇతరులను ఎలా చంపగలుగుతారు? వారు ధనమూ, సంపదలపట్ల అంతటి ఆపేక్ష కలిగి ఉండడం ఎలా జరుగుతుంది? అది పూర్తిగా అసంభవం. అవన్నీ వర్ణనాత్మకమైన అతిశయోక్తులు. జనులు కేవలం తమ మానసిక ప్రేరేపణను అనుసరించి, ఆ విపరీతమైన ఆకాంక్షను తీర్చుకోవడం కోసం ఏమైనా చేస్తారు. ఆ రచయితలు ఈ అంశాన్నే అవకాశంగా తీసుకొని, మీరు ఎదురుచూస్తున్నదో, మిమ్మల్ని సంతోషపెట్టేదో రాయాలని తమ శాయశక్తులా ప్రయత్నిస్తారు. ఆ రాతలు ఎంత నమ్మశక్యంగా లేకపోతే, మీరు అంతగా వాటిని చదవగోరుతారు. అవన్నీ వర్ణనాత్మకమైన అతిశయోక్తులు. నిజంగా ఆ యుద్ధవిద్యానైపుణ్యం కలిగినవారు ఆ విధంగా ప్రవర్తించరు. ప్రత్యేకించి, వారు వాటిని బహిరంగంగా ప్రదర్శించరు.

## గొప్పలు ప్రదర్శించే మనస్తత్వం

సామాన్య వ్యక్తుల నడుమ ఉన్న మా సాధకులలో అత్యధికులు తమకు ఉన్న అనేక బంధాలను విడువలేరు. చాలా బంధాలు అప్పటికే వారి ప్రకృతిలో ఒక భాగంగా మారిపోయి ఉంటాయి, కానీ వారు వాటిని తమంతటతాము గుర్తించ లేరు. గొప్పలు ప్రదర్శించే ఈ మనస్తత్వం ఏ సందర్భంలోనైనా బయటపడొచ్చు; ఒక మంచి పని చేస్తుండగా కూడా అది పైకి రావచ్చు. కీర్తి, స్వలాభమూ, చిన్నపాటి మేలు పొందడానికి కూడా కొంతమంది తమ గురించి "నేను చాలా సమర్థుడిని, విజేతను" అని గొప్పగా చెప్పుకొంటారు. ఇతరులకన్నా సాధనలో కొంత మెరుగ్గా ఉన్నవారు, మెరుగైన దివ్యనేత్రదృష్టి కలిగినవారు లేదా చక్కగా వ్యాయామం చెయ్యగలిగినవారు కూడా గొప్పలు ప్రదర్శించడానికి ఇష్టపడతారు.

ఒక వ్యక్తి “టీచర్ లీ నాకు ఏదో చెప్పారు” అని చెప్పుకోవచ్చు. జనులు అతడి చుట్టూ గుమికూడి అతడు చెప్పేది వింటారు. ఆ విన్న దానికి తన అలంకారాలు జోడించి వారికి చెప్తాడు. దీని ఉద్దేశం ఏమిటి? తన గొప్ప చూపు కోవడమే. మరికొందరు తమకు ఆ విషయం ఎక్కువగా తెలిసినట్లు, తమకు అర్థమైనంత, తెలిసినంత ఎక్కువ విషయం ఇతర సాధకులకు తెలియదేమో అన్నట్లు, తమలోతాము దానిని ప్రచారం చేసుకుంటారు. ఇది వాళ్ళకు సహజ గుణం అయిపోతుంది, బహుశా వారు అది స్వయంగా గ్రహించలేరు. వారికి అంతశ్చేతనలో, ఈ గుణం ఉంది. లేకపోతే, ఆ విన్న మాటను ప్రచారం చెయ్యడంలోని ఉద్దేశం ఏమై ఉంటుంది? కొందరు, టీచర్ పర్వతాల దగ్గరికి ఎప్పుడు తిరిగివెళతారని గుసగుసలాడుకుంటారు. నేను పర్వతాలనించి వచ్చినవాడిని కాను. నేను అక్కడికి ఎందుకు తిరిగి వెళ్ళాలి? మరికొందరు, నేను ఫలానా రోజున ఎవరికో ఏదో చెప్పానని అతడిని చాలా ప్రత్యేకంగా పరిగణిస్తున్నానని గుసగుసలాడతారు. ఇటువంటి విషయాలను ప్రచారం చెయ్యడంవల్ల ఏం మంచి జరుగుతుంది? దీనివల్ల ఎటువంటి మేలు ఒనగూరదు. అది వారికి గొప్పలు చెప్పుకోవడంపట్ల ఉన్న బంధంగా మేము గమనించాం.

కొంతమంది నా సంతకంకోసం నా దగ్గరికి వచ్చారు. దాని ప్రయోజనం ఏమిటి? ఎవరో ఒకరి సంతకం ఒక జ్ఞాపికగా ఉంచుకోవడం సామాన్య వ్యక్తుల అలవాటు. మీరు ఆధ్యాత్మిక సాధన చెయ్యకపోతే, నా సంతకం మీకు ఎందుకూ పనికి రాదు. నా పుస్తకంలోని ప్రతి పదమూ నా ప్రతిరూపాన్నీ, ఫాలున్‌నూ, నేను చెప్పిన ప్రతి వాక్యాన్ని కలిగి ఉంటుంది. ఇక మీకు నా సంతకంతో అవసరం ఏమిటి? కొంతమంది “టీచర్ సంతకంతో, వారి సందేశం నన్ను రక్షిస్తుంది” అని భావిస్తారు. వారు ఇప్పటికీ సందేశాల వంటి వాటిని నమ్ముతారు. మాకు అవంటే లెక్కే లేదు. ఈ పుస్తకమే అతి అమూల్యమైనది. మీరు ఇంకా దేనికోసం వెతుకుతున్నారు? ఇవన్నీ ఆ బంధాల యొక్క ప్రతిబింబాలే. నాతో కలిసి ప్రయాణించే శిష్యుల ప్రవర్తనను చూసిన తరవాత వారు మంచివారో, చెడ్డవారో కూడా గ్రహించకుండానే కొందరు వారిని అనుకరిస్తారు. నిజానికి అక్కడున్న మనిషి ఎవరైనా పట్టింపులేదు – ఉన్నది

ఒకటే ఫా. ఈ ఫాను పాటించడం వల్లనే ఒక వ్యక్తి అసలైన ప్రమాణాన్ని అందుకుంటాడు. నా పక్కన ఉండి పనిచేసేవారెవరి పట్లనూ ఏ విధంగాను ప్రత్యేకంగా వ్యవహరించడం జరగదు, వారూ అందరివంటివారే; కేవలం పరిశోధనా సంఘంలోని సభ్యులే. ఈ విధమైన బంధాలను పెంచుకోకండి. ఈ బంధాలను ఏర్పరచుకున్న తరవాత, తరచుగా, మీకు తెలియకుండానే మీరు అసంకల్పితంగానే దాఫాను అవమానపరచే పాత్ర వహిస్తారు. సంచలనాత్మకంగా మీరు సృష్టించిన చెప్పుడు మాట ఘర్షణలకు కూడా దారితీయవచ్చు, లేదా, మరిన్ని విషయాలను వినడానికి గురువుకు దగ్గర కావాలన్న బంధాన్ని ఒక సాధకునిలో కలిగించవచ్చు. ఇవన్నీ ఒక వివాదాంశానికి చెందినవే కాదా?

గొప్పలు ప్రదర్శించే ఈ గుణం మరి ఏ ఇతర విషయాలకు సులభంగా దారితీస్తుంది? నేను ఈ సాధనను రెండు సంవత్సరాలనించి బోధిస్తున్నాను. మా సాధకులలో దీర్ఘకాలం సాధన చేసినవారు త్వరలోనే గోంగ్ వికాస దశకు చేరుకోవచ్చు. కొంతమంది క్రమమైన జ్ఞానోదయ దశలోకి ప్రవేశించి, హఠాత్తుగా దానిని చేరుకుంటారు. వారికి ఈ అతీంద్రియ శక్తులు మునుపే ఎందుకు లేవు? అది ఎందుకంటే, నేను మిమ్మల్ని ఒక్కసారిగా అంతటి ఉన్నత స్థాయికి నెట్టినా, మీలో ఉన్న సామాన్య వ్యక్తుల బంధాలు పూర్తిగా తొలగక, అది అనుమతించబడి ఉండేది కాదు. మీ షిన్ షిన్ ఖచ్చితంగా అప్పటికే గుర్తించ తగినంతగా పెరిగింది, కానీ ఇంకా చాలా బంధాలను మీరు వదలలేదు. అందువల్ల మీకు ఆ అతీంద్రియ శక్తులు ఇవ్వబడలేదు. ఈ దశ గడిచి, మీరు స్థిరంగా ఉన్నప్పుడు, మీరు వెంటనే క్రమమైన జ్ఞానోదయ స్థితిలో ఉంటారు. ఈ దశలో, మీ దివ్యనేత్రం ఒక అత్యున్నత స్థాయిలో తెరవబడుతుంది, మీరు అనేక అతీంద్రియ శక్తులను పెంపొందించుకుంటారు. నిజం చెప్పాలంటే, మీరు నిజంగా ఆధ్యాత్మిక సాధన చేస్తున్నప్పుడు, ప్రారంభంలోనే మీరు అనేక అతీంద్రియ శక్తులను అభివృద్ధి చేసుకొని ఉంటారు. మీరు అప్పటికే ఈ ఉన్నత స్థాయిని చేరుకొని ఉంటారు, కాబట్టి మీకు అనేక అతీంద్రియ శక్తులుంటాయి. మీలో చాలామందికి ఇటీవలే ఈ పరిస్థితి ఏర్పడి ఉంటుంది. ఆధ్యాత్మిక సాధనలో ఉన్నత స్థాయులను

చేరుకోలేనివారు కూడా కొందరు ఉంటారు. వారికి భౌతికంగా ఉన్నదంతా, వారి సహనంతోపాటు ముందుగా నిర్ణయింపబడి ఉన్నదే. చివరకు కొద్దిమంది అతితక్కువ స్థాయిలో గోంగ్ వికాసం గానీ, జ్ఞానోదయం – సంపూర్ణ జ్ఞానోదయం గానీ పొందుతారు. అటువంటి వ్యక్తులు ఉంటారు.

నేను ఈ విషయాన్ని ప్రత్యేకంగా ఎందుకు చెప్తున్నానంటే, మీరందరూ ఒకసారి ఇటువంటి వ్యక్తి గురించి విన్నప్పుడు అతడు ఒక మహనీయుడైన జ్ఞాని అని పరిగణించకూడదని ఖచ్చితంగా తెలుసుకొని తీరాలి. ఆధ్యాత్మిక సాధనలో ఇది ఒక తీవ్రమైన అంశం. కేవలం ఈ దాఫాను అనుసరించడం ద్వారా మాత్రమే మీరు ఏదైనా సరైన విధంగా చెయ్యగలుగుతారు. అతడికి అతీంద్రియ సామర్థ్యాలు, అతీంద్రియ శక్తులు ఉన్నాయనో, లేదా, అతడు కొన్ని విషయాలను చూడగలుగుతున్నాడనో మీరు అతడిని అనుసరించ కూడదు. మీరు అతడికి హాని చేస్తారు ఎందుకంటే, అతడు మీరు చూపే వీరాభిమానంపట్ల బంధం పెంచుకొని చివరకు తన సమస్తమునూ పోగొట్టు కోవడమో, అతడి శక్తులు నిర్వీర్యం కావడమో జరుగుతుంది. చివరకు అతడు పతనమైపోతాడు. గోంగ్ వికాస స్థితికి చేరిన వ్యక్తి కూడా పతనమయ్యే అవకాశం ఉంది. ఒక వ్యక్తి తన ప్రవర్తనను సక్రమంగా నిలుపుకోలేకపోతే, అతడు జ్ఞానోదయం పొందినప్పటికీ పతనం అవుతాడు. విషయాలను సరిగ్గా నిర్వహించనప్పుడు ఒక బుద్ధుడైనా పతనం చెందుతాడు, ఇక సామాన్య వ్యక్తుల నడుమ ఉన్న మీవంటి సాధకుల మాట చెప్పాల్సిన పని ఏముంది! అందువల్ల మీరు ఎన్ని అతీంద్రియ శక్తులను పెంచుకున్నా, అవి ఎంత గొప్పవైనా, లేదా మీ దివ్యశక్తి ఎంత బలమైనదైనా, మీరు సక్రమ ప్రవర్తనను నిలుపుకోవాలి. ఇటీవల, ఒక్క క్షణంలో మాయమై, మరుక్షణంలో తిరిగి ప్రత్యక్షం కాగలిగిన ఒక వ్యక్తి ఇక్కడ మన మధ్య కూర్చుని ఉన్నాడు. అది కేవలం అంతే. ఇంకా గొప్ప అతీంద్రియ శక్తులు పెంపొందుతాయి. మీరేం చేస్తారు? భవిష్యత్తులో ఈ విషయాలు మీకు లేదా ఇతరులకు ఎదురైనా మా సాధకులు లేదా శిష్యులుగా మీరు వాటిని ఆరాధించడంగానీ, వాటికోసం ప్రయత్నించడంగానీ చెయ్యకూడదు. ఒకసారి మీ మనసు తప్పు దారిన పడితే, అంతా ముగిసి పోతుంది, మీరు పతనమవుతారు. బహుశా వారున్న స్థాయికన్నా మీరు

ఉన్నత స్థాయిలో ఉండొచ్చు, కేవలం మీ అతీంద్రియ శక్తులు బయటపడలేదు, అంతే. కనీసం, ఈ అంశం కారణంగా మీరు పతనమయ్యారు. ఆ విధంగా, ప్రతివారూ, ఖచ్చితంగా ఈ విషయంపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించవలసిన అవసరం ఉంది. ఇటువంటి సంగతి త్వరలో జరుగుతుందన్న కారణంగా, మేము దీనిని ఒక అతిముఖ్యమైన విషయంగా భావించాం. ఒకసారి అది జరిగినప్పుడు, మీరు మీ ప్రవర్తనను సక్రమంగా నిలుపుకోకపోతే అది అంగీకరించబడదు.

ఒక సాధకుడు తాను గోంగ్‌ను పెంచుకొని గోంగ్ వికాస స్థితికి చేరుకున్నప్పటికీ లేదా నిజంగా జ్ఞానోదయం పొందినప్పటికీ, తననుతాను ఒక ప్రత్యేక వ్యక్తిగా భావించుకోరాదు. తాను చూసినవన్నీ తన స్థాయికి పరిమితమైన విషయాలే. అతడి ఆధ్యాత్మిక సాధన ఆ స్థితికి చేరుకున్నది, ఎందుకంటే, అతడిలో జ్ఞానోదయం పొందడానికి ఉన్న శక్తి, అతడి షిన్ షిన్ యొక్క ప్రమాణం, అతడిలోని జ్ఞానం ఆ స్థాయికి చేరుకున్నాయి. అందువల్ల, ఉన్నతస్థాయికి చెందిన విషయాలపట్ల అతడిలో అపనమ్మకం ఉండొచ్చు. సరిగ్గా చెప్పాలంటే, అతడు వాటిని నమ్మకపోవడంవల్ల, తాను చూస్తున్నదే సంపూర్ణమని, ఉన్నవల్లా అవే విషయాలని భావిస్తాడు. అతడి స్థాయి కేవలం అంతలో ఉన్నందువల్ల, అది చాలాదూరంలో ఉంది.

కొంతమందికి గోంగ్ వికాసం ఈ స్థాయిలో జరుగుతుంది ఎందుకంటే, వారు ఆధ్యాత్మిక సాధనలో ఇక ఏమాత్రమూ ముందుకు వెళ్ళలేరు. ఫలితంగా, వారు ఆ స్థాయిలోనే గోంగ్ వికాస స్థితిని అనుభవించి, జ్ఞానోదయం పొందుతారు. భవిష్యత్తులో ఆధ్యాత్మిక సాధనను సంపూర్ణం చేసుకున్న మీలో కొంతమంది చిన్న ప్రాపంచిక మార్గాలలోనూ, కొందరు భిన్న స్థాయుల లోనూ, మరికొందరు సరియైన ఫలాన్ని పొందుతారు. సరియైన ఫల స్థితిలో జ్ఞానోదయం పొందినవారు మాత్రమే ఉన్నత స్థాయులను సాధించి, విషయాలను చూడగలిగి ఉండి, భిన్న స్థాయులలో తమను తాము వ్యక్తం చేసుకుంటారు. అతిక్రింది స్థాయిలో, ప్రాపంచిక మార్గాలలో జ్ఞానోదయం పొందిన వ్యక్తులు కూడా కొన్ని పరిమాణాలను, కొందరు జ్ఞానులను చూడగలిగి ఉండి, వారితో సంభాషించగలిగే శక్తిని కూడా కలిగి ఉంటారు. ఆ సమయంలో మీరు

సంతృప్తి చెందకూడదు. ఎందుకంటే, క్రింది స్థాయిలో, చిన్న ప్రాపంచిక మార్గాలలో జ్ఞానోదయం పొందడంవల్ల సరియైన ఫలం అందుకోలేరు – అది ఖాయం. అప్పుడు దాని గురించి ఏం చెయ్యవలసి ఉంటుంది? ఆ వ్యక్తి ఆ స్థాయిలోనే ఉండిపోతాడు, అంతే. ఉన్నత స్థాయిలకు ఆధ్యాత్మిక సాధన చెయ్యడం భవిష్యత్తుకు సంబంధించిన విషయంగా ఉంటుంది. ఆ వ్యక్తి యొక్క ఆధ్యాత్మిక సాధన అంతకంటే ముందుకు సాగలేనప్పుడు, అతడి గోంగ్‌ను బంధించి ఉంచడం ఎందుకు? మీరు ఈ విధంగానే సాధన చేస్తున్నా, ఇంతకన్నా ఏమాత్రమూ ముందుకు పోలేరు, అందువల్ల మీరు మీ ఆధ్యాత్మిక సాధన ముగింపుకు చేరినందున మీ గోంగ్ వికసిస్తుంది; అటువంటివారు అనేకులు ఉంటారు. ఏం జరిగినాసరే, ఒక వ్యక్తి మంచి షిన్ షిన్‌ను నిలుపు కోవాలి. ఒక వ్యక్తి దాఫాను అంటిపెట్టుకొని ఉండడం ద్వారానే నిజంగా సరైన దారిలో ఉంటాడు. మీ అతీంద్రియ శక్తులైనా, మీ గోంగ్ వికాసమైనా, మీరు దాఫాలో ఆధ్యాత్మిక సాధన చెయ్యడం ద్వారానే సాధించగలుగుతారు. మీరు దాఫాను రెండవ స్థానంలో పెట్టి, మీ అతీంద్రియ శక్తులను మొదటి స్థానంలో పెట్టినా లేదా ఒక జ్ఞానిగా మీరు ఎలా అర్థం చేసుకున్నారో, అదే సరైనదని భావించినా, లేదా, మిమ్మల్ని మీరు గొప్పగానూ, దాఫాకు అతీతులుగానూ పరిగణించుకున్నా, మీరు పతనం కావడం మొదలైనట్లే అని నేను చెప్తున్నాను. అది చాలా ప్రమాదకరం, మీరు ఇంకా చెడిపోతారు. ఆ సమయంలో మీరు నిజంగా ఇబ్బందిలో పడతారు, మీ ఆధ్యాత్మిక సాధన వృథాగా ముగిసి పోతుంది. ఆ పనులు సరైన విధంగా చెయ్యకపోతే, మీరు పతనమై, ఆధ్యాత్మిక సాధనలో విఫలం అవుతారు.

నేను అనేక తరగతులలో బోధించిన ఫా కలిసి ఈ పుస్తకంలోని సారాంశం తయారయింది. ప్రతి ఒక్కటి నేను బోధించినదే, ప్రతి వాక్యమూ నేను చెప్పినదే. ప్రతి పదం ఆడియో టేపులనించి బయటకు తీసి, అక్షరాలా రాయబడినదే. నా శిష్యులూ, సాధకులూ టేప్‌లలో రికార్డ్ అయిన ప్రతిదానిని రాసే పనిలో నాకు సహాయపడ్డారు. నేను దానిని మరల, మరల పునశ్చరణ చేశాను. అది అంతా నా ఫా, నేను బోధించినది కేవలం ఇదే ఫా.

* * * *

**అర్థములు:**

1. చిన్ హ్వే – దక్షిణ సాంగ్ వంశపు రాజసభ (క్రీ.శ.1127–1279) లోని ఒక దుష్ట ఉద్యోగి.
2. అగ్నిని కల్పించడం – "ఆధ్యాత్మిక సాధన పిచ్చి"ని కూడా తెలిపే చైనా పదం; ఉపమానంగా కానీ, శబ్దార్థ పరంగా కానీ అర్థం చేసుకోవచ్చు.
3. డింగ్ – ఆలోచనారహితం; అయినప్పటికీ చైతన్యపూరిత మానసిక స్థితి.
4. వూహాన్ – హూబే రాష్ట్ర రాజధాని.
5. "మరణం లేని ఒక జీవిని వదిలించుకోవడంకన్నా ఆహ్వానించడం సులభం"– ఒక పరిస్థితిలో చిక్కుకోవడం సులభమూ, బయటపడడం కష్టమూ అని వర్ణించడానికి చైనీయ పద ప్రయోగం.
6. దాహ్ జీ – షాంగ్ వంశపు (క్రీ.పూ.1765–1122) చివరి చక్రవర్తి యొక్క ఉంపుడుగత్తె. ఆమె ఒక నక్క యొక్క ప్రేతాత్మ చేత ఆవహింపబడి షాంగ్ వంశం పతనం కావడానికి కారణమైనదని నమ్మబడినది.
7. చైనీయ యుద్ధ విద్యల వివిధ తంత్రాలు.

* * * *

# ఏడవ ఉపన్యాసము

## చంపడం అన్న అంశం

చంపడమన్న ఈ అంశం అతిసున్నితమైనది. ప్రాణులను చంపకూడదన్న కఠిన నియమాన్ని మేము సాధకులకు విధించాము. బుద్ధ సిద్ధాంతం, తావో సిద్ధాంతం, లేదా చీ మున్ సిద్ధాంతం దేనికి చెందిన సాధన అయినా, అది నీతివంతమైన ఆధ్యాత్మిక సాధన అయినంత కాలమూ, ఈ అంశాన్ని చాలా ఆవశ్యకంగా పరిగణించి, చంపడాన్ని నిషేధిస్తుంది – ఇది తథ్యం. ఒక జీవిని చంపడం వలన కలిగే ఫలితం చాలా తీవ్రం కాబట్టి, మనం తప్పనిసరిగా దాన్ని వివరంగా చెప్పాలి. బౌద్ధమతంలో మౌలికంగా, చంపడమంటే ఒక మానవుని ప్రాణం తియ్యడం అన్న అర్థంలో చెప్పబడింది. అది ఒక ఘాతుక చర్య. తరవాత, పెద్ద జంతువులను, పెద్దవైన పెంపుడు జంతువులను చంపడం కూడా తీవ్రంగానే పరిగణించబడింది. సాధకుల సమాజంలో ఈ విషయాన్ని ఇంత తీవ్రమైనదిగా ఎందుకు పరిగణించారు? గతంలో, విధి ప్రకారం మరణకాలం ఆసన్నం కాకుండానే మనుషులను చంపితే, వారు ఒంటరి ప్రేతాత్మలు లేదా ఆశ్రయం లేని పిశాచాలు అవుతారని బౌద్ధమతంలో చెప్పబడింది. మునుపు, ఈ మనుషుల ఆత్మలకు ఆ దురవస్థనించి విముక్తి కలిగించడానికి ఆచార కాండ నిర్వహింప బడేది. అటువంటి క్రియలు నిర్వహించనిదే, ఆ ఆత్మలు ఒక దీన పరిస్థితిలో ఆకలిదప్పులతో అలమటిస్తూ ఉండేవి. గతంలో బౌద్ధమతంలో ఇలా చెప్పబడింది.

ఒక వ్యక్తి మరొకరిని ఏదైనా చేస్తే, పరిహారంగా తమ పుణ్యంలో చాలా భాగాన్ని తప్పనిసరిగా వారికి ఇచ్చుకోవలసి వస్తుంది. ఇక్కడ, ఒక వ్యక్తి ఇతరుల వస్తువులను తీసేసుకోవడం లేదా అటువంటి విషయాలను సూచిస్తున్నాం. అయినా, ఒక జీవిని హఠాత్తుగా అంతం చేస్తే, అది జంతువైనా

మరొక ప్రాణి అయినా, దానివల్ల చాలా కర్మ జనిస్తుంది. గతంలో, చంపడమంటే, అధిక  కర్మకు కారణం అయ్యే పని, ఒక మనిషి యొక్క ప్రాణం తియ్యడం అనే అర్థం ఉండేది. అయితే, ఇతర సాధారణ ప్రాణులను చంపడం కూడా ఏమంత తక్కువ పాపం కాదు, దానివల్ల కూడా నేరుగా అధిక కర్మ జనిస్తుంది. ముఖ్యంగా ఒక సాధకుడిగా మీకు, ఆధ్యాత్మిక సాధనాక్రమంలో ప్రతి భిన్న స్థాయిలోనూ కొన్ని కష్టాలు ఇవ్వబడతాయి. అవన్నీ మిమ్మల్ని మీరు ఉన్నతీకరించుకోవడానికి, భిన్న స్థాయిలలో అమర్చబడి ఉన్న మీ యొక్క కర్మ, మీరు తెచ్చుకున్న కష్టాలు. మీరు మీ షిన్ షిన్‌ను పెంచుకున్నంత కాలమూ, వాటిని అధిగమించగలుగుతారు. కానీ హఠాత్తుగా మీరు అంత కర్మ పొందితే, మీరు దాన్ని ఎలా అధిగమించగలుగుతారు? మీకున్న షిన్ షిన్ స్థాయితో, మీరు దాన్ని ఏమాత్రమూ అధిగమించలేరు. మిమ్మల్ని ఆధ్యాత్మిక సాధన చెయ్యలేని పూర్తి అశక్తులుగా అది చేస్తుంది.

ఒక వ్యక్తి జన్మించినప్పుడు, అదే సమయంలో అతడి యొక్క అనేక రూపాలు విశ్వ పరిధిలోని ఒక నిర్దిష్ట పరిమితిలో జన్మిస్తారని మేము తెలుసుకున్నాం. వారందరూ ఒకేలాగా కనిపిస్తూ, ఒకే పేరు కలిగి ఉండి, ఒకే రకమైన పనులు చేస్తుంటారు. అందువల్ల వారిని అతడిలోని భాగాలుగా కూడా పరిగణించ వచ్చును. ఇందులో ఒక సమస్య ఉంది, ఎందుకంటే, వారిలో ఇతర పరిమాణాలలోని మిగిలిన అన్ని రూపాలు తమకు విధిలిఖితమై ఉన్న జీవన పయనాలను ఇంకా పూర్తి చేసుకోవలసి ఉండగా, ఇంకా అనేక సంవత్సరాల జీవితం మిగిలి ఉండగా, వాటిలోని ఒక రూపం (ఇతర పెద్ద జంతువుల ప్రాణాలవలె) హఠాత్తుగా మరణిస్తే, ఈ మరణించిన వ్యక్తి నిరాశ్రయుడై, విశ్వ పరిధిలో సంచరిస్తూ ఉంటాడు. ఒంటరి ప్రేతాత్మలు, నిరాశ్రయమైన పిశాచాలు ఆకలి దప్పులతోనూ, ఇతర కష్టాలతోనూ బాధ పడుతూ ఉంటాయని గతంలో వర్ణింప బడింది. ఇది నిజమై ఉండొచ్చు. కానీ ఇతర పరిమాణాలలో ఉన్న తనలోని ప్రతిఒక్కరూ తమ జీవిత పయనాన్ని ముగించుకొనే వరకు వేచి ఉండవలసిన అవసరం ఉన్నందువలన ఈ వ్యక్తి బాధలు పడవలసిన ఒక భయంకరమైన పరిస్థితిని మేము నిజంగా గమనించాం. అది ఎంత దీర్ఘమైన కాలమైతే అతడు అంత అధికంగా బాధ

పడతాడు. అతడు ఎంత ఎక్కువగా బాధపడతాడో, అతడి బాధవల్ల జనించే కర్మ, చంపిన వ్యక్తి శరీరానికి అంతగా జమ చేయబడుతుంది. దీనిని గురించి ఆలోచించండి: మీరు ఎంత అధిక కర్మను మూట కట్టుకుంటున్నారు? ఇవీ, అతీంద్రియ శక్తుల ద్వారా మేము గమనించిన విషయాలు.

మేము మరొక పరిస్థితిని కూడా గమనించాం: ఒక మనిషి పుట్టినప్పుడు, ఒక ప్రత్యేక పరిమాణంలో అతడి పూర్తి జీవితచిత్రం లిఖితమై ఉంటుంది. మరొక రకంగా చెప్పాలంటే, అతడు తన జీవితంలో ఎక్కడ ఉండాలో, ఏం చెయ్యాలో అవన్నీ దానిలో కూడి ఉంటాయి. అతడి జీవితాన్ని ఎవరు ఏర్పాటు చేశారు? అది ఒక ఉన్నత జీవి చేత జరిగిందన్నది తెలిసినదే. ఉదాహరణకు, మన సామాన్య మానవ సంఘంలో, ఒక వ్యక్తి పుట్టుక తరవాత ఒక నిర్దిష్ట కుటుంబానికి, పాఠశాలకు, పెరిగి పెద్దవాడైన తరవాత ఒక కార్యాలయానికి, చెంది ఉంటాడు; అతడి ఉద్యోగ కారణంగా సంఘంలో అనేక సంబంధాలు ఏర్పడతాయి. అంటే, సమాజం యొక్క స్వరూపం అంతా ఈ విధంగా రచించబడి ఉంది. అయితే, మౌలికమైన, ఈ ప్రత్యేకమైన ఏర్పాటును అనుసరించి జరగక, లేదా ఏవైనా మార్పులు జరిగి, ఈ జీవి హఠాత్తుగా మరణిస్తే ఆ ఉన్నత జీవి, మధ్యలో జోక్యం చేసుకున్నవారిని క్షమించరు. ప్రతివారూ, ఇది ఆలోచించండి: సాధకులుగా, మనం ఉన్నత స్థాయులకు చేర్చే ఆధ్యాత్మిక సాధనను చెయ్యాలని అనుకుంటాం. ఆ ఉన్నత-స్థాయి జీవి ఆ హంతకుడిని కనీసం క్షమించరు. ఈ వ్యక్తి ఇంకా ఆధ్యాత్మిక సాధన చెయ్యగలడని మీరు అనుకుంటున్నారా? కొందరు గురువుల స్థాయులు ఈ ఏర్పాటును చేసిన ఉన్నత జీవి స్థాయికి సరితూగవు. అందువల్ల ఆ వ్యక్తి యొక్క గురువు కూడా శిక్షించబడి, క్రింది స్థాయికి పంపివేయబడతాడు. ఇది ఆలోచించి చూడండి: ఇది ఒక సాధారణ విషయమా? కాబట్టి, ఒక వ్యక్తి ఇటువంటి పని చేస్తే, వారికి ఆ తరవాత ఆధ్యాత్మిక సాధన చెయ్యడం కష్టం అవుతుంది.

ఫాలున్ దాఫా సాధకులలో యుద్ధ సమయాలలో పోరాడినవారు కొందరు ఉండొచ్చు. ఆ యుద్ధాలు, మొత్తం మీద చూస్తే, విశ్వంలో జరిగిన గొప్ప మార్పుల కారణంగా ఏర్పడిన పరిస్థితులు, మీరు వాటిలో కేవలం ఒక

చిన్న అంశం మాత్రమే. విశ్వంలోని మార్పులకులోనై మానవులు చేసే పనులవల్ల ఏర్పడడమే తప్ప, సామాన్య మానవ సంఘంలో అటువంటి పరిస్థితులు మరొక విధంగా ఏర్పడి ఉండేవి కావు, విశ్వం యొక్క మార్పులని చెప్పబడి ఉండేవీ కావు. ఆ సంఘటనలు గొప్పవైన మార్పులను అనుసరించి పరిణమించినవే తప్ప పూర్తిగా మీ తప్పు కాదు. ఇక్కడ మనం, ఒక వ్యక్తి స్వలాభం కోసం ప్రయత్నించడమూ, స్వప్రయోజనాలను సంతృప్తిపరచు కోవడం కోసం మరీ, మరీ కోరుకోవడం, లేదా తనవల్ల మరొకరు ఏదో రకంగా బాధింపబడడంవల్ల అతడికి కలిగే కర్మ గురించి చర్చించుకుంటున్నాం. అది సంఘం యొక్క విస్తార పరిధిని అంతటినీ, సంఘంలోని అతిపెద్ద మార్పులతో సమకూడినంత వరకు, అది మీ తప్పు కాదు.

చంపడం అన్నది అనంతమైన కర్మను తెచ్చిపెడుతుంది. ఒక వ్యక్తి: “మనం ప్రాణం తియ్యకూడదు. కానీ, నేను ఇంట్లో వంట చేస్తుంటాను. నేను ఏ జీవినీ చంపనిదే, నా కుటుంబం ఏం తింటుంది?” అని ఆలోచించొచ్చు. నేను ఈ విషయాన్ని ప్రత్యేకించి పట్టించుకోను, ఎందుకంటే, నేను సాధకులకు ఫా ను బోధిస్తున్నాను గానీ సామాన్య వ్యక్తులకు ఎలా బ్రతకాలి అన్న విషయాన్ని అలక్ష్యంగా చెప్పడం లేదు. ఒక వ్యక్తి ప్రత్యేకమైన విషయాలలో ఎలా వ్యవహరించాలి అన్నదానికి మీరు దాఫాను అనుసరించి తీర్పును నిర్ణయించుకోవాలి. ఏమైనా, సరి అయినవిగా మీకు తోచిన పనులనే చెయ్యాలి. సామాన్య మానవులు తమకు ఏది చెయ్యాలనిపిస్తే అదే చేస్తారు, అది వాళ్ళ పని; నిజమైన ఆధ్యాత్మిక సాధన చెయ్యడం ప్రతి ఒక్కరికి అసాధ్యం. అయితే, ఒక సాధకుడిగా, ఒక వ్యక్తి ఉన్నత ప్రమాణాన్ని పాటించాలి, అందువల్ల నేను సాధకులలో ఉండవలసిన ఆవశ్యకతలను మీ ముందు ఉంచుతున్నాను.

మానవులతోపాటు జంతువులు, చెట్లు కూడా ప్రాణులే. ఏ పదార్థం యొక్క ప్రాణమైనా ఇతర పరిమాణాలలో వ్యక్తం కావచ్చు. మీ దివ్యనేత్రం ఫా దృష్టి స్థాయికి చేరుకున్నప్పుడు, రాళ్ళు, గోడలైనా మరేదైనా కూడా మీతో మాట్లాడ గలవని, మిమ్మల్ని పలకరించగలవని మీరు తెలుసుకుంటారు. “మనం తినే ధాన్యాలు, కూరలూ కూడా ప్రాణులే. ఇంట్లో కూడా ఈగలు,

దోమలూ ఉన్నాయి. మనం ఏం చెయ్యాలి?” అని ఎవరైనా అనుకోవచ్చు. వేసవికాలంలో ఒక దోమ కుడుతున్నప్పుడు దాన్ని ఏమీ చెయ్యకుండా చూస్తూ ఆ బాధను భరించడం ఏమంత సుఖంగా ఉండదు. తాను తినే పదార్థం మీద ఈగ వాలి దాన్ని మలినం చేస్తుంటే, ఒక వ్యక్తి దాన్ని చంపలేకపోవచ్చు. మనం అకారణంగా, అలక్ష్యంగా ఒక ప్రాణం తియ్య కూడదని నేను చెప్తున్నాను. కానీ మనం చాలా పెద్ద మనుషులవలె, చిన్నచిన్న విషయాలను పట్టించుకుంటూ, మనం నడుస్తున్న దారిలో చీమలు ఉన్నాయని, వాటిని తొక్కుతామేమో అన్న బాధతో, ఎగురుతూ నడిచేంత అత్యంత జాగ్రత్త వహించవలసిన అవసరం కూడా లేదు. అలాగైతే, మీరు అలసట నిండిన జీవితం గడుపుతారని నేను చెప్తున్నాను. అది కూడా ఒక బంధం కాదా? మీ గంతులవల్ల కొన్ని చీమలను చంపి ఉండకపోవచ్చు గాని, తప్పనిసరిగా అనేక సూక్ష్మజీవులను చంపి ఉంటారు. సూక్ష్మస్థాయిలో క్రిములు, బాక్టీరియా కలిపి అనేకమైన ఇంకా చిన్న జీవులు ఉన్నాయి; బహుశా మీరు వాటిలో ఎన్నిటినో కూడా తొక్కి చంపి ఉండొచ్చు. అటువంటి సందర్భంలో మనం జీవించడమే మానుకోవాలి. మనకు అటువంటి మనుషులుగా తయారవాలి అన్న కోరిక లేదు, ఎందుకంటే, దానివల్ల ఆధ్యాత్మిక సాధన అసాధ్యం అవుతుంది. ఒక వ్యక్తి విశాల దృక్పథం మీద దృష్టి కేంద్రీకరించి, ఒక నీతివంతమైన, గౌరవప్రదమైన విధానంలో ఆధ్యాత్మిక సాధన చెయ్యాలి.

మానవులుగా, మనకు మానవ జీవితాలను నిలబెట్టుకునే హక్కుంది. అందువల్ల, మనం నివసించే పరిసరాలు మానవ జీవిత అవసరాలకు తగినట్లు ఉండాలి. మనం ఉద్దేశపూర్వకంగా ప్రాణులకు హాని చెయ్యడం గానీ, ప్రాణం తియ్యడంగానీ చెయ్యకూడదు, అయితే ఇటువంటి అనవసర విషయాల గురించి అతిగా పట్టించుకోకూడదు. ఉదాహరణకు, మనం పండించే కూరలు, ధాన్యాలు అన్నీ ప్రాణం కలిగి ఉండేవే. ఒక వస్తువులో ప్రాణముంది కదా అని దానిని, తినడమో, తాగడమో మానుకోకూడదు, ఎందుకంటే అప్పుడు మనం ఆధ్యాత్మిక సాధన ఎలా చెయ్యగలుగుతాం? ఒక వ్యక్తి దానికి అతీతంగా దృష్టి సారించాలి. ఉదాహరణకు, మీరు

నడుస్తున్నప్పుడు, కొన్ని చీమలో, పురుగులో మీ కాళ్ళ కింద పడి చనిపోవచ్చు. మీరు ఉద్దేశపూర్వకంగా చంపలేదు గనక, బహుశా అవి మరణించవలసి ఉందేమో? సూక్ష్మజీవులూ, అతిసూక్ష్మజీవుల ప్రపంచంలో, పర్యావరణ సమతౌల్యత అన్న అంశం కూడా ఉంది – ఒకే జాతికి చెందిన అనేక జీవులు ఉండడం కూడా సమస్యాత్మకం అవుతుంది. ఆ విధంగా మనం ఆధ్యాత్మిక సాధనను గౌరవప్రదమూ, ధర్మబద్ధమైన విధానంలో చెయ్యాలి. ఇంట్లో ఈగలు, దోమలూ ఉన్నప్పుడు, వాటిని తరిమివేసి లేదా కిటికీలకు ఒక దోమ తెరను అమర్చి వాటినించి తప్పించుకోవచ్చు. కొన్నిసార్లు వాటిని తరమలేం, కొన్ని నలిగిపోవచ్చు, కానివ్వండి. మనుషులు నివసించేచోట అవి కుట్టి హాని చేసే పక్షంలో, ఎవరైనా వాటిని తప్పక తరిమివెయ్యాలి. అలా చెయ్యకపోతే అవి అక్కడ ఉన్న మనుషులను కుడుతూ ఉండడం చూస్తూ ఉండిపోవలసి వస్తుంది. ఒక సాధకుడిగా మీరు వాటిని పట్టించుకోరు, మీలో వ్యాధినిరోధకశక్తి ఉంటుంది, కానీ మీ కుటుంబ సభ్యులు ఆధ్యాత్మిక సాధన చేయక అంటురోగాల బెడద గురించిన భయం కలిగి ఉంటారు. ఒక చిన్న బిడ్డ ముఖం మీద దోమ కుడుతుంటే, మనం చూస్తూ ఊరుకోలేం.

మీకొక ఉదాహరణ ఇస్తాను. శాక్యముని తొలినాటి కథ ఒకటుంది. ఒక అడవిలో ఒకనాడు శాక్యముని స్నానం చెయ్యబోతూ, స్నానపు తొట్టెను శుభ్రం చెయ్యమని ఒక శిష్యునికి చెప్పారు. ఆ శిష్యుడు ఆ స్నానపుతొట్టె దగ్గరికి వెళ్ళి దాని నిండా కీటకాలు పాకుతూ ఉండడం చూశాడు. దానిని శుభ్రం చేస్తే అవన్నీ చనిపోతాయి. శిష్యుడు శాక్యముని దగ్గరికి వచ్చి "స్నానపుతొట్టి నిండా కీటకాలు ఉన్నాయి" అన్నాడు. శాక్యముని అతడి వంక చూడకుండానే "నువ్వు వెళ్ళి స్నానపుతొట్టెను శుభ్రం చెయ్యాలి" అన్నారు. అతడు మళ్ళీ స్నానపుతొట్టె దగ్గరికి వెళ్ళాడు, దానిని ఎలా శుభ్రం చెయ్యాలో అతడికి అర్థం కాలేదు, ఎందుకంటే, అలా చేస్తే ఆ కీటకాలు చనిపోతాయి. అతడు తిరిగి శాక్యముని దగ్గరికి వెళ్ళి "గురువుగారూ, ఆ స్నానపుతొట్టె నిండా కీటకాలు ఉన్నాయి, నేను కడిగితే అవన్నీ చనిపోతాయి" అన్నాడు. శాక్యముని అతడి వంక చూసి, "నేను నీకు చెప్పినది స్నానపు తొట్టెను శుభ్రం చెయ్యమని" అన్నారు. హఠాత్తుగా ఆ శిష్యునికి విషయం అర్థమై, అతడు నేరుగా వెళ్ళి దానిని శుభ్రం చేశాడు. ఈ

కథ మనకొక నియమాన్ని తెలియజేస్తుంది: అది ఏమిటంటే, కీటకాలు ఉన్నాయి కాబట్టి మనం స్నానాలు మానకూడదని, మనం ఉన్నచోట దోమలు ఉన్నాయని మరొక నివాసస్థలం వెతకకూడదని. అలాగే, ధాన్యాలలోనూ, కూరగాయలలోనూ ప్రాణం ఉందని మన నోళ్ళు కట్టేసుకొని తినడం, తాగడం మానెయ్యకూడదు. ఆ విధంగా చెయ్యకూడదు. మనం ఈ సంబంధాన్ని, సరిగ్గా నిర్వహించుకొని, హుందాగా మన ఆధ్యాత్మిక సాధనను చెయ్యాలి. మనం ఉద్దేశపూర్వకంగా ఏ ప్రాణికీ హాని చెయ్యనంత వరకు, అంతా మంచిదే. అదే సమయంలో, మనుషులకు నివసించేందుకు తగిన స్థలమూ, జీవన పరిస్థితులూ ఉండి, వాటిని నిర్వహించుకోవాలి. మానవులు తమ జీవితాలను సహజంగా నడుపుకోవలసిన అవసరం ఉంది.

గతంలో, కొందరు మోసపు చీ గోంగ్ గురువులు: “ఒక వ్యక్తి చాంద్ర మానం ప్రకారం, ప్రతి నెలలోని మొదటి లేదా పదిహేనవ రోజున ప్రాణులను చంపవచ్చు” అని చెప్పారు. వారిలో కొందరైతే, రెండు కాళ్ళ జంతువులను చంపొచ్చు అని కూడా వాదించారు, వాటికి ప్రాణం లేదన్నట్లు. మొదటి రోజున గానీ పదిహేనవ రోజున గానీ చంపితే అది ప్రాణం తియ్యడంగా లెక్క కాకపోతే ఇంకేమిటి? మట్టిని తవ్వడమా? కొందరు నామమాత్రపు చీ గోంగ్ గురువులను వారి ఉపన్యాసాలను బట్టి, వారి ప్రవర్తనను బట్టి లేదా, వారు ఏం చెప్తున్నారు, దేనికోసం ప్రయత్నిస్తున్నారు అనే విషయాన్ని బట్టి గుర్తించవచ్చు. అటువంటి ప్రకటనలు చేసే చీ గోంగ్ గురువులందరూ సాధారణంగా ప్రేతాత్మలు లేదా జంతువుల చేత ఆవహింపబడి ఉంటారు. ఒక నక్క చేత ఆవహింపబడి ఉన్న చీ గోంగ్ గురువు కోడిని తినే విధానాన్ని చూడండి. అతడు దానిని ఆబగా మింగేటప్పుడు, కనీసం దాని ఎముకలనైనా ఉమ్మెయ్యడు.

చంపడంవల్ల చాలా కర్మ పొందడమే కాకుండా అందులో దయ గురించిన అంశం కూడా ఇమిడి ఉంటుంది. సాధకులుగా మనం దయ గలిగి ఉండొద్దా? మనలోని దయ బయటికి వచ్చినప్పుడు, అన్ని ప్రాణులు, ప్రతి మనిషి పడే బాధను గ్రహించగలుగుతాము. ఇది జరుగుతుంది.

## మాంస భక్షణ అంశం

మాంస భక్షణ అన్నది కూడా ఒక అతిసున్నితమైన విషయమే కానీ, అది ఒక ప్రాణిని చంపడం కాదు. మీరు ఎంతో కాలంగా ఫాను అభ్యసిస్తున్నా, మేము అందరినీ మాంసాహారం మానెయ్యమని అడగలేదు. చాలామంది చీ గోంగ్ గురువులు వారి తరగతులలోకి మీరు అడుగుపెట్టగానే మాంసాహారం తీసుకోవడం మానెయ్యమని చెప్తారు. "నేను హఠాత్తుగా మాంసాహారం మానడానికి మానసికంగా సిద్ధంగా లేను" అని మీరు అనుకోవచ్చు. ఇవాళ ఇంట్లో కోడి లేదా చేప వేపుడు అయి ఉండొచ్చు. వాటి వాసన మీకు బాగున్నా, మీకు తినడానికి అనుమతి లేదు. ఒక వ్యక్తి మాంస భక్షణ చెయ్యరాదని బలవంతపెట్టి మతసంబంధమైన ఆధ్యాత్మిక సాధనల విషయం కూడా ఇంతే. సంప్రదాయబద్ధమైన బుద్ధ, తావో సిద్ధాంతాల సాధనలు మాంస భక్షణను నిషేధించాయి. మేము ఇక్కడ మిమ్మల్ని అలా అడగం కానీ ఈ అంశం గురించి మేము పట్టించుకుంటాం. అయితే మాకు కావలసిందేమిటి? మా సాధన సాధకులను ఫా సంస్కరించేది కాబట్టి, గోంగ్, ఫా వల్ల కొన్ని పరిస్థితులు ఏర్పడతాయన్న అర్థం వస్తుంది. సాధనాక్రమంలో భిన్న స్థాయులలో భిన్న పరిస్థితులు ఏర్పడతాయి. ఏదో ఒక రోజున, లేదా ఇవాళ నా ఉపన్యాసం ముగిసిన తరవాత, కొందరు వ్యక్తులు ఈ పరిస్థితిలోకి అడుగుపెట్టే అవకాశం ఉంది. వారు మాంసం తినలేరు, దాని వాసన వారికి పడదు. ఒకవేళ వారు తిన్నా, వాంతి చేసుకోవాలని వారికి అనిపిస్తుంది. మిమ్మల్ని ఇతరులు బలవంతపెట్టరు, మీ అంతట మీరు కూడా బలవంతంగా తినరు. దానికి మారుగా స్వయంగా మీ మనసునించే ఇది కలుగుతుంది. ఈ స్థాయికి చేరుకున్న తరవాత మీరు మాంస భక్షణ చెయ్యలేరు, ఎందుకంటే, ఈ పరిస్థితి మీ గోంగ్ నించి ప్రతిఫలిస్తున్నది. మీరు నిజంగా ఆ మాంసాన్ని మింగితే, నిజంగానే వాంతి చేసుకుంటారు.

దీర్ఘకాలం మా సాధనను చేసిన సాధకులు అందరికీ ఫాలున్ దాఫా ఆధ్యాత్మిక సాధనలో ఈ పరిస్థితి ఏర్పడుతుందని తెలుసు, ఎందుకంటే భిన్న స్థాయులు భిన్నమైన పరిస్థితులను కల్పిస్తాయి. కొందరు సాధకులకు మాంస భక్షణ పట్ల ఒక బలమైన కోరిక, బలమైన బంధమూ ఉంటుంది –

వారు సాధారణంగా చాలా ఎక్కువగా మాంసం తింటారు. ఇతరులకు అసహ్యం కలుగుతుండగా వారికి అలా అనిపించదు, అలా తినడాన్ని ఇంకా కొనసాగిస్తారు. ఆ బంధాన్ని తొలగించుకోవడానికి ఏం చెయ్యాల్సి ఉంటుంది? ఈ వ్యక్తికి మాంసం తిన్న తరవాత కడుపునొప్పి వస్తుంది. దాన్ని దూరం పెట్టినప్పుడు ఆ స్త్రీ లేదా పురుషునికి నొప్పి రాదు. ఈ పరిస్థితి కలుగుతుంది, దానికి అర్థం ఆ వ్యక్తి మాంసం తినరాదు అని. అంటే మా సాధనాసిద్ధాంతానికి ఆ పైన మాంస భక్షణ విషయంతో సంబంధం లేదని అర్థమా? అలా కాదు. ఈ విషయంలో మనం ఎలా వ్యవహరించాలి? మాంస భక్షణ చెయ్యలేక పోవడం అన్నది స్వయంగా ఒక వ్యక్తి యొక్క హృదయంనించే వస్తుంది. దాని యొక్క ఉద్దేశం ఏమిటి? మతాలలో జరిగే ఆధ్యాత్మిక సాధన ఒక వ్యక్తిని బలవంతంగా మాంస భక్షణ మానుకొనేట్లు చేస్తుంది. అది, దానితోపాటుగా మా సాధనలో ప్రతిఫలించినట్లు దానిని తినలేకపోవడమూ రెండూ మాంస భక్షణ పట్ల మానవ సహజమైన కోరికనూ, బంధాన్నీ తొలగింపజేసేందుకు ఉద్దేశింపబడినవి.

తమ ఆహారపాత్రలలో మాంసం లేకపోతే, కొంతమంది భోజనమే చెయ్యరు. అది ఒక సామాన్య వ్యక్తిలో ఉండే కోరిక. నేను ఒక రోజున చాంగ్ చున్‌లోని ట్రయంఫ్ పార్కు వెనక ఉన్న ద్వారం వైపు వెళ్తుంటే, ముగ్గురు వ్యక్తులు గట్టిగా కేకలు పెడుతూ ఆ వెనక ద్వారంనించి బయటకు వచ్చారు. వారిలో ఒకరు “ఒక వ్యక్తి కనీసం మాంసం తినలేని ఇది ఏ రకమైన చీ గోంగ్ సాధన? నేను మాంసం తినడం కోసం నా జీవితకాలంలో పది సంవత్సరాలనైనా వదులుకుంటాను” అన్నారు. ఎంతటి బలమైన కోరిక అది! అందరూ దాన్ని గురించి ఆలోచించండి: ఈ కోరిక తొలగించబడవద్దా? తప్పకుండా తొలగింపబడాలి. ఆధ్యాత్మిక సాధనాక్రమంలో ఒక వ్యక్తి భిన్న వాంఛలనూ, బంధాలనూ వదులుకోవాలి. ఒక్కమాటలో చెప్పాలంటే, మాంసం తినాలనే కోరిక వదులుకోకపోతే, అది వదలిపెట్టని ఒక బంధమే కాదా? ఆ వ్యక్తి ఆధ్యాత్మిక సాధనను ఎలా పూర్తి చేసుకుంటాడు? అందువల్ల, అది బంధంగా ఉన్నంతకాలమూ, దాన్ని తొలగించుకోవలసిందే. కానీ ఒక వ్యక్తి మళ్ళీ ఎన్నటికీ మాంసం తినడు అని దీని అర్థం కాదు. ఇక్కడ మాంస భక్షణ

మానెయ్యడం అన్నదే లక్ష్యం కాదు. లక్ష్యం ఏమిటంటే, మీకు ఈ బంధం ఉండకూడదు అన్నదే. మీరు మాంసం తినలేని సమయంలో ఆ బంధాన్ని వదులుకోకపోతే, మీరు తరవాత తినగలిగే అవకాశం ఉంది. అప్పుడు మీకు దాని రుచి వాసన అసహ్యంగానూ, రుచి ఘోరంగానూ అనిపించదు. ఆ సమయంలో మీరు మాంసాన్ని తినొచ్చు, దానికి పట్టింపు లేదు.

మీరు మళ్ళీ మాంస భక్షణ చేయగలిగే సమయానికి, అంతకుముందే దానిపట్ల మీకున్న కోరిక, బంధమూ వదిలివేయబడి ఉంటాయి. ఒక పెద్ద మార్పు జరిగిపోయి ఉంటుంది, ఎందుకంటే ఆపై మీకు మాంసం రుచికరంగా అనిపించదు. మీ ఇంట్లో వండినప్పుడు, మీ కుటుంబంతో కలిసి తింటారు. ఇంట్లో వండనప్పుడు మీకు అది లోటుగా అనిపించదు. మీరు ఒకవేళ తింటే, అది రుచిగా ఉండదు. ఆ పరిస్థితి సంభవిస్తుంది. కానీ సామాన్య మానవుల నడుమ ఆధ్యాత్మిక సాధన చెయ్యడం చాలా క్లిష్టం. మీ కుటుంబంలో ఎల్లప్పుడూ వండుతూనే ఉంటే, కొంతకాలానికి మీకు మళ్ళీ అది రుచికరంగా అనిపిస్తుంది. ఇటువంటివి పునరావృత్తం అవుతూ, యావత్ ఆధ్యాత్మిక సాధనాక్రమంలో చాలాసార్లు జరుగుతాయి. మీరు హఠాత్తుగా మాంస భక్షణ చెయ్యలేకపోతారు. మీరు తినలేనప్పుడు తినకూడదు. మీరు నిజంగానే తినలేకపోతారు, ఒకవేళ తింటే, వాంతి చేసుకుంటారు. ప్రకృతి ధర్మాన్ని అనుసరించి మళ్ళీ తినగలిగే వరకు వేచి ఉండండి. మాంస భక్షణ అన్నదే ఇక్కడ లక్ష్యం కాదు – ఆ బంధాన్ని వదిలివెయ్యడమే కీలకం.

మా ఫాలున్ దాఫా సిద్ధాంతం ఒక వ్యక్తి త్వరగా పురోగతి చెందేట్లు చేస్తుంది. మీరు మీ షిన్ షిన్‌ను ఉన్నతీకరించుకుంటూ ఉన్నంతకాలం ప్రతి స్థాయిలోనూ మీరు త్వరితంగా పురోగతి సాధిస్తారు. కొంతమందికి మాంసం గురించిన బంధం ముందే ఉండదు, తమ భోజనంలో అది ఉందో లేదో కూడా పట్టించుకోరు. వారికి ఆ బంధాన్ని వదిలివెయ్యడానికి రెండు వారాలు పడుతుంది. కొంతమందికి, ఒకటి, రెండు, మూడు లేదా ఆరు నెలలు పట్టొచ్చు. కొన్ని అతి అసాధారణ సందర్భాలలో తప్ప, ఒక వ్యక్తి మళ్ళీ మాంస భక్షణ చెయ్యడానికి ఒక సంవత్సర కాలం కన్నా ఎక్కువ సమయం పట్టదు. ఇలా ఎందుకంటే ఇప్పటికే మాంసం ప్రజలకు ప్రధానమైన ఆహారం

అయింది. ఏది ఏమైనా మతాలలోని నిపుణ సాధకులు మాంసం తినకూడదు.

బౌద్ధమతంలో మాంస భక్షణను ఏ విధంగా పరిగణించేవారో చూద్దాం. ప్రప్రథమ మౌలిక బౌద్ధమతం మాంస భక్షణను నిషేధించలేదు. శాక్యముని తన శిష్యులను కష్టాల మధ్య ఆధ్యాత్మిక సాధన చెయ్యడానికి అడవులకు తీసుకువెళ్ళిన సమయంలో మాంసాహారాన్ని నిషేధించే నియమం ఏదీ లేదు. అప్పుడు అట్టి నియమం ఎందుకు లేదు? ఎందుకంటే, శాక్యముని రెండు వేల అయిదు వందల ఏళ్ళ క్రిందట తన ధర్మమును బోధించిన కాలంలో మానవ సంఘం చాలా వెనకబడి ఉంది. కొన్ని ప్రాంతాలలో వ్యవసాయం ఉండగా మరికొన్నిచోట్ల ఇంకా తెలియదు. సాగుభూమి తక్కువ ఉండి, అడవులే ఎక్కువగా ఉండేవి. ధాన్యాలు అతితక్కువగా, అరుదుగా లభించేవి. మానవులు అప్పుడప్పుడే అనాగరికతనించి బయటకు వస్తూ ఇంకా వేటనే ప్రధాన జీవనాధారంగా చేసుకొని బ్రతికేవారు; అనేక ప్రాంతాలు మాంసాహారం పైనే ఆధారపడేవి. తన శిష్యులు మానవసహజ బంధాలను అధికాధికంగా త్యజించడానికై శాక్యముని వారిని ధనము, తక్కిన ప్రాపంచిక విషయాలనించి దూరంగా ఉండాలని ఆజ్ఞాపించారు. ఆయన వారిని తనతో భిక్షకు తీసుకు వెళ్ళేవారు. అక్కడ ఏది ఇస్తే వారు అదే తినేవారు, ఎందుకంటే సాధకులుగా వారికి తమకు పెట్టే ఆహారాన్ని ఎంచుకునే అవకాశం ఉండేది కాదు, అందులో మాంసం కూడా కలిసి ఉండొచ్చు.

మౌలికమైన బౌద్ధమతంలో హూన్ (1) అనే నిషేధం పాటించబడేది. ఆ హూన్ అన్న నిషేధం మౌలిక బౌద్ధంలో ఉండేది, ఈనాడు మాంస భక్షణనే హూన్ అంటున్నారు. నిజానికి, ఆ కాలంలో హూన్ అంటే, మాంసం కాదు, ఉల్లిపాయలు, అల్లం, వెల్లుల్లిపాయలను సూచించేది. వాటిని హూన్‌గా ఎందుకు పరిగణించేవారు? ఈ రోజుల్లో ఎందరో భిక్షువులు కూడా దాన్ని స్పష్టంగా వివరించలేరు. వారిలో అనేకులు నిజంగా ఆధ్యాత్మిక సాధన చెయ్యరు కనక వారికి చాలా విషయాలపట్ల స్పష్టత లేదు. శాక్యముని బోధించినది ఏమిటంటే, "నియమం, సమాధి, జ్ఞానము" అని చెప్పబడు తుండేది. నియమం అంటే సామాన్య మానవ సహజ బంధాలను అన్నిటినీ వదిలిపెట్టడం. సమాధి అంటే, ఒక సాధకుడు ధ్యానంలో కూర్చొని పూర్తిగా

సమాధి స్థితిలో ఆధ్యాత్మిక సాధన చేస్తాడు – అతడు పూర్తిగా సమాధి స్థితిలో ఉండాలి. అతడి యొక్క సమాధి స్థితిని గానీ, ఆధ్యాత్మిక సాధనను గానీ ఆటంకపరచే ఏ విషయమైనా తీవ్రమైన అంతరాయంగా భావింపబడుతుంది. ఎవరైనా ఉల్లిపాయలు, అల్లము, వెల్లుల్లి తిన్నప్పుడు ఘాటైన వాసన వెలువడుతుంది. ఆ కాలంలో భిక్షువులు సాధారణంగా ఒక అడవిలో లేదా ఒక గుహలో నివసించేవారు. ఏడుగురు లేదా ఎనిమిదిమంది ఒక వలయంగా కూర్చునేవారు లేదా అనేక వలయాలుగా ఏర్పడి కూర్చుని ధ్యానం చేసేవారు. ఎవరైనా ఆ పదార్థాలు తింటే చిరాకు కలిగించే ఒక వాసన వెలువడి, సమాధి స్థితిలో ఉన్న ఇతరులకు ఇబ్బంది కలగజేసి, వారి సాధనకు అంతరాయం కలిగించేది. అందువల్ల ఈ నియమం ఏర్పడింది; అటువంటి ఆహారం హూన్ అని పరిగణించబడి నిషేధింపబడింది. ఆ విధమైన ఘాటు వాసనలు, శరీరంలో సంస్కరింపబడే జీవులకు దుర్భరంగా ఉంటాయి. ఉల్లిపాయలు, అల్లము, వెల్లుల్లి ఒక వ్యక్తిలో వాటిపట్ల తీవ్రమైన కోరికను కూడా ప్రేరేపిస్తాయి. ఒక వ్యక్తి వాటిని ఎక్కువగా తింటే, అతడికి అవి వ్యసనంగా పరిణమిస్తాయి, కాబట్టి అవి హూన్‌గా పరిగణింపబడ్డాయి.

ఒకసారి ఆధ్యాత్మిక సాధనలోని అత్యున్నత స్థాయిలకు చేరుకొని గోంగ్ బంధనం విప్పుకొనే స్థితి లేదా గోంగ్ వికాసంలోని మధ్యమ స్థితిలోకి ప్రవేశించిన తరవాత ఆధ్యాత్మిక సాధనలో నిజంగా ఆ నియమాలు అంతగా పట్టించుకోవలసిన అవసరం లేదని గతంలో అనేకమంది భిక్షువులు గ్రహించారు. ఆ బంధాన్ని వదిలేస్తే ఆ పదార్థం యొక్క ప్రభావమే ఏమాత్రమూ ఉండదు. ఒక వ్యక్తికి నిజంగా అంతరాయం కల్పించేది బంధమే. అందువల్ల చరిత్ర అంతటా, సిద్ధి పొందిన అనేక భిక్షువులు ఒక వ్యక్తి మాంస భక్షణ చెయ్యడం అన్నది ఏ మాత్రమూ ప్రధానం కాదని కూడా గ్రహించారు. ఆ బంధాన్ని వదులుకోగలరా లేదా అన్నదే కీలకమైన ప్రశ్న. ఒక వ్యక్తికి బంధం లేకపోతే కడుపు నింపుకోవడానికి ఏది తిన్నా పట్టింపు లేదు. మతాలలో ఆధ్యాత్మిక సాధన అన్నది ఒక నిర్దిష్టమైన మార్గం అయినందువల్ల, అనేకులు ఇప్పటికే దానికి అలవాటుపడ్డారు. పైగా మతాలలో ఒక వ్యక్తి ఎంతమాత్రమూ మాంస భక్షణ చెయ్యరాదన్నది కేవలం ఒక

నియమం వంటి చిన్న విషయం కాక ఒక లిఖిత శాసనంగా మారిపోయింది. అందువల్ల జనులు ఆ విధమైన ఆధ్యాత్మిక సాధనకు అలవాటు పడ్డారు. గ్రంథాల ద్వారా ప్రజలకు ప్రచారం చేయబడిన జీ గోంగ్ (2) అన్న భిక్షువు గురించి చెప్పుకుందాం. భిక్షువులు మాంస భక్షణ చెయ్యరాదు కానీ అతడు మాంస భక్షణ చేసి ప్రాచుర్యం పొందాడు. నిజానికి అతడు లింగ్ యిన్ మఠం నించి బహిష్కృతుడు అయినందువల్ల అతడికి భోజన సదుపాయం కరువై, అతడి మనుగడకే ముప్పు కలిగి అతడికి అది సహజంగానే పెద్ద సమస్య అయిపోయింది. తన కడుపు నింపుకోవడం కోసం అతడు కనపడినదల్లా తిన్నాడు; ఒక ప్రత్యేక పదార్థం కావాలన్న బంధం లేకుండా కేవలం ఏదో ఒకటి తిని కడుపు నింపుకున్నంత కాలమూ దానికి ఏ విధమైన పట్టింపు లేదు. ఆధ్యాత్మిక సాధనలోని ఆ స్థాయిలో అతడు ఈ నియమాన్ని అర్థం చేసుకున్నాడు. నిజానికి జీ గోంగ్ కేవలం ఒకటి లేక రెండు సందర్భాలలో మాత్రమే మాంస భక్షణ చేశాడు. ఒక భిక్షువు మాంస భక్షణ చెయ్యడం గురించి విన్నంతనే రచయితలు ఉద్విగ్నులవుతారు. ఈ విషయం ఎంతగా నిర్ఘాంతపరిచేదైతే పాఠకులు అంతటి ఆసక్తి కనబరుస్తారు. సాహిత్య ప్రక్రియలు మొదట నిజజీవితం మీద ఆధారపడి తరవాత దానికి అతీతంగా వెళతాయి; అతడు ఆ విధంగా ప్రచారం పొందాడు. నిజం చెప్పాలంటే, ఆ బంధాన్ని వదిలివేస్తే, ఒక వ్యక్తి తన కడుపు నింపు కోవడానికి ఏది తిన్నా పట్టింపు లేదు.

ఆగ్నేయాసియాలో లేదా చైనాలోని దక్షిణ ప్రాంతాలైన గ్వాంగ్ డోంగ్, గ్వాంగ్ జీ (3)లలో కొందరు సాధారణ బౌద్ధులు సంభాషణలలో అది ఏదో పాతకాలపు పద్ధతిగా ధ్వనిస్తుందన్నట్లు, తమనుతాము బౌద్ధులుగా చెప్పుకోరు. తాము బౌద్ధ ఆహారం తింటామని లేదా శాకాహారులమని చెప్తారు, అది వారు శాకాహార బౌద్ధులు అని తెలియజేస్తుంది. బుద్ధ ఆధ్యాత్మిక సాధన అంత తేలికైనట్లు వారు భావిస్తారు. శాకాహారి అయినంత మాత్రాన ఒక వ్యక్తి బుద్ధత్వం పొందడానికి ఎలా సాధ్యపడుతుంది? మాంస భక్షణ అన్నది కేవలం ఒక బంధమూ, ఒక కోరిక మాత్రమే అని ప్రతిఒక్కరికి తెలుసు ఇది ఒకటే బంధం. శాకాహారిగా ఉండడం మాత్రమే ఆ బంధాన్ని తొలగిస్తుంది. ఒక

వ్యక్తి ఇంకా అసూయనూ, పోటీ మనస్తత్వాన్నీ, వీరాభిమానమన్న బంధాన్నీ, గొప్పలు ప్రదర్శించే మనస్తత్వాన్నీ, వివిధ ఇతర బంధాలనూ తొలగించుకోవలసి ఉంటుంది; అసంఖ్యాకమైన మానవ సహజ బంధాలున్నాయి. కేవలం అన్ని బంధాలనూ తొలగించుకోవడంవల్లనే ఒక వ్యక్తి తన ఆధ్యాత్మిక సాధనను సంపూర్ణం చేసుకోగలుగుతాడు. కేవలం మాంసభక్షణ అన్న ఈ ఒక్క బంధం వదిలించుకున్నంత మాత్రాననే ఒక వ్యక్తి బుద్ధత్వాన్ని ఎలా సాధించగలుగుతాడు? ఆ రకమైన వ్యాఖ్య సరియైనది కాదు.

ఆహారం విషయంలో, మాంసభక్షణ పట్లనే గాక, ఏ విధమైన ఆహారం పట్లనూ బంధం కలిగి ఉండకూడదు. ఇతర పదార్థాలలో కూడా అంతే. కొంత మంది ఒక్క ప్రత్యేకమైన ఆహారమే తినగలం అంటారు – అది కూడా ఒక కోరికే. ఆధ్యాత్మిక సాధనలో ఒక నిర్దిష్ట స్థాయికి చేరుకున్న తరవాత, ఒక సాధకునికి ఆ బంధం ఉండదు. అయితే, మా ఫా అత్యున్నత స్థాయిలో, భిన్న స్థాయులను ఇముడ్చుకొని బోధింపబడుతుంది. ఒక వ్యక్తికి ఒక్కసారిగా ఆ స్థాయికి చేరుకోవడం అసాధ్యం. మీకు ఆ ప్రత్యేక ఆహారం తినాలని ఉన్నట్లు చెప్పుకుంటారు గానీ, మీ ఆధ్యాత్మిక సాధన నిజంగా ఆ బంధాన్ని వదిలివెయ్యవలసిన ఆ స్థాయికి చేరుకున్నప్పుడు దానిని మీరు తినలేకపోతారు. మీరు అది తింటే, అది సరైన రుచిలో ఉండదు, ఇంకే విధమైన రుచి అయినా కలగడం జరగవచ్చు. నేను పనిచేస్తున్న కాలంలో కార్యాలయంలో ఉండిన ఉపాహారశాల నష్టాలలో సాగుతూ చివరకు మూతపడింది. అది మూతపడిన తరవాత ప్రతి ఒక్కరూ మధ్యాహ్న భోజనం తెచ్చుకునేవారు. పొద్దున్నే వంటలు చెయ్యడమన్న పని ఇబ్బందికరంగానూ, హడావిడితో కూడి ఉండేది. నేను ఆవిరిలో ఉడికించిన రెండు రొట్టెలూ, సోయ్ సాస్‌లో వేసిన టోఫూ తెచ్చుకునేవాడిని. సైద్ధాంతికంగా అది తేలికైన ఆహారమే, అయినప్పటికీ ఎప్పుడూ అదే తినడం మంచిది కాదు, ఎందుకంటే ఆ బంధం తొలగించుకోవలసి ఉంది. టోఫూను మళ్ళీ చూస్తూనే నాకు అయిష్టంగా ఉండేది. నేను మళ్ళీ దానిని తినాలని ప్రయత్నించినప్పుడు, అది ఒక బంధంగా పెంచుకుంటానేమో అనిపించి తినలేకపోయాను. అయితే ఒక వ్యక్తి తన ఆధ్యాత్మిక సాధనలో ఒక నిర్దిష్ట స్థాయికి చేరుకున్నప్పుడు మాత్రమే ఇలా జరుగుతుంది. మొదట్లో ఇలా ఉండదు.

బుద్ధ సిద్ధాంతం మద్యపానం చేయడాన్ని అనుమతించదు. మీరెప్పుడైనా బుద్ధుడు సురాపాత్రను పట్టుకొని ఉండడం చూశారా? లేదు. ఒక వ్యక్తి మాంస భక్షణ చెయ్యలేకపోవచ్చని నేను చెప్పాను, కానీ అతడు సామాన్య మానవుల నడుమ ఆధ్యాత్మిక సాధన చేస్తూ ఆ బంధాన్ని వదిలివేసిన తరవాత, తదుపరి కాలంలో అతడు మళ్ళీ తిన్నా అది సమస్య కాదు. అయితే మద్యపానం వదిలి వేసిన వ్యక్తి మళ్ళీ తాగకూడదు. ఒక సాధకుడు తన శరీరంలో గోంగ్‌ను కలిగి ఉండడా? భిన్న రకాలైన గోంగ్, ఇంకా కొన్ని అతీంద్రియశక్తులూ మీ శరీరంపై కనిపిస్తూ ఉంటాయి, అవన్నీ శుద్ధమైనవి. మీరు మద్యపానం చేసిన వెంటనే అవన్నీ మీ శరీరాన్ని వదిలిపెట్టేస్తాయి. లిప్తమాత్రంలో మీ శరీరంలో ఏమీ మిగలదు, ఎందుకంటే వాటన్నిటికీ ఆ వాసన అంటే భయం. మీరు ఆ వ్యసనానికి బానిస కావడమన్నది అసహ్యాకరం, ఎందుకంటే మద్యపానం ఒక మనిషిని విచక్షణారహితునిగా చెయ్యవచ్చు. కొన్ని ఘన తావో సాధనలలో మద్యపానం ఎందుకు అవసరం? ఎందుకంటే అవి ఒక వ్యక్తి యొక్క ప్రధాన ఆత్మను సంస్కరించవు, మద్యపానంవల్ల ప్రధాన ఆత్మ తన చేతనత్వాన్ని కోల్పోయే అవకాశం ఉంది.

మద్యాన్ని కొందరు తమ ప్రాణ సమానంగా ప్రేమిస్తారు. కొందరు మద్యం తాగడాన్ని భోగిస్తారు. కొందరు మద్యంతో విషపూరితులు అయి ఉంటారు, అది లేనిదే తమ ఆహారపాత్రను కూడా తీసుకోరు – వారు తాగనిదే ఏమీ చెయ్యలేరు. సాధకులుగా మనం అలా ఉండరాదు. మద్యపానం తప్పనిసరిగా ఒక వ్యసనమే. అది ఒక కోరిక, అది ఒక వ్యక్తి యొక్క వ్యసన కారకమైన నరాలను ప్రేరేపిస్తుంది. ఒక వ్యక్తి ఎంత ఎక్కువగా తాగితే, అంత ఎక్కువగా బంధితుడవుతాడు. దీని గురించి ఆలోచిద్దాం: సాధకులుగా మనం ఈ బంధాన్ని వదిలిపెట్టవద్దా? ఈ బంధం కూడా తొలగింపబడాలి. "నేను వినియోగదారులను ఆనందింపచెయ్యాలి, కాబట్టి అది అసాధ్యం" లేదా, "నేను వ్యాపార సంబంధాలను పెంచే బాధ్యత కలిగి ఉన్నాను. మద్యపానం చెయ్యనిదే ఒక వ్యాపారం సంపాదించడం సులువు కాదు," అని ఒక వ్యక్తి భావించవచ్చు. అది అంత అవసరం కాదని నేను అంటాను. సాధారణంగా ఒక వ్యాపార వ్యవహారంలో, ముఖ్యంగా విదేశీయులతో పని చేస్తున్నప్పుడు,

మీరు సోడా కావాలని అడగవచ్చు, ఆ స్త్రీ లేదా పురుషుడు మినరల్‌వాటర్ అడగవచ్చు, మరొకరు బీరు కోరవచ్చు. ఎవ్వరూ మిమ్మల్ని మద్యం తాగమని బలవంతపెట్టరు. మీరే స్వయంగా ఎంచుకొని కోరినంత తాగుతారు. ప్రత్యేకించి, మేధావుల నడుమ, ఈ సందర్భం అరుదుగా జరుగుతుంది. ఇది సాధారణంగా ఇలా జరుగుతుంది.

పొగ తాగడం కూడా ఒక బంధమే. కొంతమంది పొగ తాగడంవల్ల తాము ఉల్లాసం పొందుతామని చెప్పుకుంటారు, కానీ అది ఆత్మవంచన, ఇతరులను కూడా మోసం చెయ్యడమే. పనిలో అలసినా, ఏదైనా రాస్తూ అలసినా మధ్యలో విరామం కోసం ఒక సిగరెట్ తాగాలని ఒక వ్యక్తికి అనిపించవచ్చు. ఆ పొగ పీల్చడంవల్ల ఆ వ్యక్తికి కొంత ఉల్లాసం కలగవచ్చు. నిజానికి అలా జరగదు. అది ఒక విరామంవల్ల పొందిన ఉల్లాసమే. మానవుని మనసు ఒక అసత్యమైన ముద్ర వేసి, ఒక భ్రమను కలిగించగలదు, అది తరవాత పొగ పీల్చడంవల్ల నిజంగానే ఒక మనిషికి ఉల్లాసం కలగగలదన్న ఒక సిద్ధాంతమో, అసత్య భావనగానో ఏర్పడిపోవచ్చు. అది అలా చెయ్యలేదు, దానికి అంతటి ప్రభావమూ లేదు. పొగ తాగడంవల్ల మనిషి శరీరానికి ఏ విధమైన మేలూ జరగదు. ఒక మనిషి దీర్ఘకాలం పొగ తాగినట్లైతే, మరణానంతర శవపరీక్షలో వైద్యునికి ఆ స్త్రీ లేదా పురుషుని యొక్క ట్రాకియా, ఊపిరితిత్తులూ మొత్తం నల్లగా ఉన్నట్లు కనిపిస్తుంది.

సాధకులైన మనం మన శరీరాలను శుద్ధి చేసుకోవాలని కోరుకోమూ? మనం నిరంతరమూ మన శరీరాలని శుద్ధిపరచుకుంటూ, నిరంతరం ఉన్నత స్థాయిలకు పురోగమిస్తూ ఉండాలి. అయినా మీరు మీ శరీరంలో దాన్ని పెట్టుకుంటున్నారు, కాబట్టి మీరు మాకు వ్యతిరేక మార్గంలో వెళ్ళడం లేదూ? పైగా అది ఒక బలమైన బంధం కూడా. కొంత మందికి అది మంచిది కాదని కూడా తెలుసు, కానీ వాళ్ళు మానలేరు. నిజం చెప్పాలంటే, వారికి తమకు దారి చూపించే సరైన ఆలోచనలు లేవు, వారికి అందువల్ల ఆ రకంగా దానిని మానడం సులభంగా ఉండదని నేను చెప్తాను. ఒక సాధకుడిగా మీరు దానిని వదులుకోవలసిన ఒక బంధంగా ఎందుకు భావించరు? దానిని మానగలరేమో చూడండి. మీరు నిజంగా ఆధ్యాత్మిక సాధన చెయ్యాలనుకున్నట్లైతే ఇప్పటి

నించి పొగ తాగడం మానెయ్యాలి అని నేను మీకు సలహా ఇస్తున్నాను, మీరు మానగలరు అన్నది నిశ్చయం. ఈ తరగతి పరిధిలో ఎవరూ సిగరెట్ కాల్చాలని అనుకోరు. మీరు మానాలనుకుంటే, మీరు మానగలరు అన్నది నిశ్చయం. మీరు మళ్ళీ సిగరెట్ కాల్చినప్పుడు అది మీకు రుచించదు. మీరు ఈ పుస్తకంలోని ఈ ఉపన్యాసం చదివినా అదే ప్రభావం ఉంటుంది. అయితే, మీరు ఆధ్యాత్మిక సాధన చెయ్యాలని అనుకోకపోతే మాత్రం మేము ఆ విషయమై శ్రద్ధ వహించం. ఒక సాధకుడిగా మీరు దాన్ని మానుకోవాలని నేను భావిస్తాను. నేను ఒకసారి ఈ ఉదాహరణను ఉపయోగించాను: మీరెప్పుడైనా ఒక బుద్ధుడుగానీ తావోగానీ నోటిలో సిగరెట్ పెట్టుకొని కూచోవడం చూశారా? అదెలా సాధ్యం అవుతుంది? ఒక సాధకుడిగా మీ లక్ష్యం ఏమిటి? మీరు దాన్ని మానేయవద్దా? అందువల్ల, మీరు ఆధ్యాత్మిక సాధన చెయ్యాలని అనుకుంటే పొగ తాగడం మానెయ్యాలని నేను చెప్తున్నాను. అది మీ శరీరానికి హాని చేస్తుంది, అలాగే అది ఒక కోరిక కూడా. అది మా సాధకులకు ఉన్న ఆవశ్యకతలకు సరిగ్గా వ్యతిరేకం.

## అసూయ

నేను ఫాను బోధించినప్పుడు, తరచుగా అసూయ అన్న అంశాన్ని ప్రస్తావిస్తాను. ఎందుకని? ఎందుకంటే చైనాలో అసూయ అతి ప్రబలంగా చూపించబడుతుంది. అది ఎంత బలంగా ఉంటుందంటే, అతి సహజమైపోయి ఒక వ్యక్తి దాని ఉనికినే పట్టించుకోడు. చైనీయులకు ఇంత బలమైన అసూయ ఎందుకుంది? దానికి తగిన కారణాలు ఉన్నాయి. చైనీయులు గతంలో కన్ఫ్యూషియస్ మత ప్రభావానికి అతిగా లోనై ఉండి, అంతర్ముఖ గుణాన్ని పెంచుకున్నారు. వారు కోపంగా ఉన్నా, సంతోషంగా ఉన్నా, బయటకు చూపించేవారు కాదు. వారు ఆత్మనిగ్రహాన్ని, ఓర్పును నమ్ముతారు. వారు ఆ విధానానికి అలవాటు పడి ఉన్నందువల్ల, మన జాతి మొత్తమూ ఒక అంతర్ముఖ గుణాన్ని పెంపొందించుకుంది. ఆ విధానంలో, ఒక వ్యక్తి తన అంతర్గత శక్తులను గొప్ప కోసం ప్రదర్శించకపోవడం వంటి ఉపయోగాలు ఉన్న మాట నిశ్చయం. కానీ దానిలో కొన్ని నష్టాలు కూడా ఉన్నాయి, వాటితోపాటు, అది

ఇతర ప్రతికూల ప్రభావాలను కూడా కల్పించగలదు. ప్రత్యేకించి ధర్మం అంతరించే ఈ కాలంలో, దాని ప్రతికూల ప్రభావాలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి, అవి ఒక వ్యక్తిలోని అసూయను గాఢతరం చెయ్యగలవు. ఒక వ్యక్తి గురించిన మంచి విషయాలు వెల్లడి అయినప్పుడు, ఇతరులు వెంటనే అసూయ పడతారు. కొంతమంది తమకు కార్యాలయాలలో లేదా మరొక చోటనైనా లభించిన ప్రశంసలను లేదా ప్రయోజనాలను గురించి గానీ చెప్పుకుంటే, ఇతరులు అవి విని వ్యాకులపడతారేమో అనే భావన వల్ల, చెప్పుకోవడానికి భయపడతారు. పాశ్చాత్యులు దానిని "తూర్పు దేశాల అసూయ" లేదా "ఆసియా అసూయ" అంటారు. చైనీయ కన్ఫ్యూషియస్ మత ప్రభావం వల్ల ఆసియా ప్రాంతం మొత్తమూ కొద్దో గొప్పో ఇలాగే ఉంటుంది. ప్రత్యేకంగా చైనాలో అది చాలా బలంగా వ్యక్తం చెయ్యబడుతుంది.

ఈ అసూయ అన్నది ఒకప్పుడు అవలంబించిన సంపూర్ణ సమతా వాదానికి ఏదో ఒక విధంగా సంబంధం కలిగి ఉన్నది. ఏది ఏమైనా ఒకవేళ ఆకాశం కింద పడితే, అందరూ కలిసి చనిపోవలసి ఉంటుంది; ఒక మేలు జరిగినప్పుడు అందరికీ సమాన వాటా ఉండాలి; ఎంత శాతం పెరిగిందనే దానితో సంబంధం లేకుండా అందరికీ వేతనాలు సమానంగా పెరగాలి. అందరిపట్ల సమానంగా వ్యవహరించే ఈ మనస్తత్వం, పైకి న్యాయంగా ఉన్నట్లే కనిపిస్తుంది. వాస్తవానికి, మనుషులందరూ ఒక్క రకంగా ఎలా ఉంటారు? వారు చేసే ఉద్యోగాలు భిన్నమైనవి, అలాగే వారు తమ బాధ్యతలను నిర్వహించే పరిధి కూడా భిన్నమైనది. ఈ విశ్వంలో "నష్టపోనిదే లాభం రాదు," అన్న సూత్రం ఒకటి ఉంది. ఒక వ్యక్తి లాభం పొందాలంటే, నష్టపోవాలి. ఒక వ్యక్తి ఏ లాభం కోసమైనా పని చెయ్యనిదే పొందలేడని సామాన్య వ్యక్తులు భావిస్తారు. ఎక్కువ పని అంటే ఎక్కువ లాభం, తక్కువ పని అంటే తక్కువ లాభం దొరుకుతుంది. ఒక వ్యక్తి ఎంత కృషి చేస్తే అంత ఫలితం పొందడానికి అర్హుడవుతాడు. గతంలో అవలంబించిన సంపూర్ణ సమతావాదం ప్రకారం ప్రతి మనిషి పుట్టుకతో సమానుడని పుట్టిన తరవాత గడిపే జీవితం ఆ స్త్రీ లేదా పురుషుడిని మారుస్తుందని వాదించేవారు. నాకు ఈ వ్యాఖ్య నిరంకుశమైనదిగా అనిపిస్తుంది. ఏదైనా నిరంకుశంగా తయా

రయితే, అది తప్పు అవుతుంది. కొంతమంది పురుషులుగా, ఇతరులు స్త్రీలుగా ఎందుకు పుట్టాలి? అందరూ ఒకేలాగా ఎందుకు కనపడరు? మనుషులందరూ ఒకలాగా పుట్టరు, ఎందుకంటే కొందరు పుట్టుకతోనే వ్యాధిగ్రస్తులుగానూ, అవకారాలతోనూ పుడతారు. ఉన్నతస్థాయులనించి, ఒక వ్యక్తి యొక్క మొత్తం జీవితమూ మరొక పరిమాణంలో ఉన్నట్లు చూస్తాం. అందరూ ఒక్కలాగే ఎలా ఉంటారు? జనులందరూ సమానంగా ఉండాలని కోరు కుంటారు. ఏదైనా ఒక విషయం ఒక వ్యక్తి జీవితంలో భాగం కాని పక్షంలో, వారు ఒకే విధంగా ఎలా తయారై ఉంటారు? జనులు ఒక్కలాగా ఉండరు.

పాశ్చాత్య దేశాలలోని మనుషుల వ్యక్తిత్వాలు అత్యంత బహిర్ముఖంగా ఉంటాయి. వారు ఎప్పుడు సంతోషంగా ఉన్నారో, ఎప్పుడు కోపంగా ఉన్నారో ఎవరైనా చెప్పేయగలరు. ఇందులో కూడా దాని లాభనష్టాలు ఉన్నాయి అది నియంత్రణ కోల్పోయేందుకు కారణం కావచ్చు. ఆ రెండు ప్రవృత్తుల మనోధర్మం భిన్నంగా ఉండడంవల్ల, పనులు చేసేటప్పుడు అవి భిన్న పర్యవసానాలకు దారితీస్తాయి. ఒక చైనా దేశీయుడిని అతడి పైఅధికారి పొగిడినా, ఏ బహుమతి ఇచ్చినా, ఇతరుల మనసును అది ఇబ్బంది పెడుతుంది. ఒకవేళ ఒక పెద్ద బోనస్ లభించినా, అతడు ఇతరులకు తెలియకుండా రహస్యంగా తన జేబులో పెట్టుకుంటాడు. ఈ రోజుల్లో ఒక ఆదర్శ కార్మికుడిగా ఉండడం కష్టం. “నువ్వు ఒక ఆదర్శ కార్మికుడివి. నువ్వు చెయ్యగలవు. నువ్వు త్వరగా పనిలోకి వచ్చి రాత్రి ఆలస్యంగా వెళ్ళాలి. నీకు ఈ పని బాగా వచ్చు గనక అంతా చెయ్యగలవు. మేము నీలాగా చెయ్యలేం”. జనులు వ్యంగ్యంగా, మూర్ఖంగా ఉంటారు, అందువల్ల ఒక మంచి మనిషిగా ఉండడం కూడా అంత సులభం కాదు.

ఇదే ఇతర దేశాలలో జరిగితే, పరిస్థితి మొత్తం భిన్నంగా ఉంటుంది. ఒక యజమాని ఆ కార్మికుడు ఆ రోజున చక్కగా పని చేశాడని చూసి అతడికి పెద్ద బోనస్ ఇవ్వొచ్చు. అతడు ఉల్లాసంగా ఆ డబ్బును ఇతరుల ఎదురుగానే లెక్క పెట్టుకొని “ఆహా యజమాని నాకివాళ ఇంత డబ్బు ఇచ్చారు” అని అంటాడు. తరవాత వచ్చే పర్యవసానాల బాధ లేకుండా ఇతరులకు చెప్పు కుంటాడు. ఇదే, చైనాలో ఒక వ్యక్తికి అధికంగా బోనస్ ఇవ్వడం జరిగితే,

యజమాని తానే, ఆ డబ్బు ఇతరులకు కనపడకుండా దాచుకోమని కూడా అతడికి చెప్తాడు. ఇతర దేశాలలో ఒక పిల్లవాడికి పరీక్షలో వందకు వంద శాతం మార్కులు వస్తే, వాడు ఇంటికి పరుగెత్తుకుంటూ వెళ్ళి, "నాకు ఇవాళ వందకు వంద వచ్చాయి! వందకు వంద వచ్చాయి" అని ఉల్లాసంగా అరిచి చెప్తాడు. వాడు బడి నించి ఇంటి వరకు పరుగెత్తుతూనే వెళ్తాడు. ఒక పక్కింటిలోని ఆమె తలుపు తీసి "హే, టామ్, మంచి పిల్లవాడివి" అంటుంది. ఇంకొక పొరుగింటాయన "హే, జాక్, చాలా బాగా చేశావు, మంచి పిల్లవాడివి" అనొచ్చు. ఇదే చైనాలో జరిగితే అదొక విపత్తే అవుతుంది. "నాకు వందకు వంద వచ్చాయి, వందకు వంద వచ్చాయి". ఆ పిల్లవాడు ఇంటికి పరుగెత్తుతాడు. ఇంకా వాడు తన ఇంటి తలుపు తీయక ముందే పక్క ఇంటి ఆయన, తన ఇంట్లోనించి "వంద రావడం ఏం గొప్పంట? బడాయి! ఎవరికి రాలేదట వంద?" అని శాపనార్థాలు మొదలు పెడతాడు. ఆ రెండు మనస్తత్వాలు రెండురకాల ఫలితాలనిస్తాయి. అది ఒక వ్యక్తిలో అసూయను పుట్టించొచ్చు, ఎందుకంటే ఎవరైనా మంచిపని చేసినప్పుడు వారి గురించి సంతోషపడే బదులు, జనుల మనసులకు ఇబ్బంది కలుగుతుంది. ఇది ఈ సమస్యకు దారితీయవచ్చు.

కొన్ని సంవత్సరాలకు పూర్వం, సంపూర్ణ సమతావాదం అవలంబింప బడేది, ఆ కారణంగా, అది జనుల ఆలోచనాసరళిని, విలువలను క్రమం తప్పేట్లు చేసింది. మీకొక ప్రత్యేకమైన ఉదాహరణను ఇస్తాను. ఒక వ్యక్తి తన కార్యాలయంలో, తాను పని చేసినంత సమర్థంగా తన సహోద్యోగులు ఉండరని తలుస్తాడు. తాను ఏమి చేసినా చక్కగా చేస్తాడు. తనను తాను ఒక విశేష వ్యక్తిగా భావించుకుంటాడు. "ఒక కర్మాగారపు అత్యున్నత లేదా ఉన్నత అధికారి లేదా ఇంకా గొప్ప పదవి పొందడానికి తగిన అర్హతలు నాకు ఉన్నాయి. నేను ప్రధాన మంత్రిని కూడా కాగలననుకుంటాను" అని తనలోతాను అనుకుంటాడు. అతడి యజమాని కూడా అతడు నిజంగా అతిసమర్థుడని ఏదైనా సాధించగలడని కూడా అతడికి చెప్పి ఉండొచ్చు. సహచరులు కూడా అతడు నిజంగా సమర్థుడని, ప్రతిభావంతుడని చెప్పి ఉండొచ్చు. అయితే అదే చోట అతడు పనిచేసే ఆ జట్టులో లేదా అదే

కార్యాలయంలో, ఏ పని చెయ్యడానికైనా అశక్తుడు, లేదా ఎందుకూ పనికిరానివాడు అయినటువంటి మరొక వ్యక్తి ఉండొచ్చు. అయినా ఒక రోజున తనకు మారుగా ఆ అయోగ్యునికే పదోన్నతి లభించి, అతడు తనకు పర్యవేక్షకునిగా నియమింపబడి రావచ్చు. అతడు దాని గురించి కలతతో, చాలా అసూయతో తన హృదయంలో అది చాలా అన్యాయమని తలపోసి తన యజమానికి, సహోద్యోగులకు మొర పెట్టుకుంటాడు.

సామాన్య వ్యక్తులు సులభంగా గ్రహించలేని ఒక నియమం మీకు చెప్పబోతున్నాను. మీరు అన్ని విషయాలలోనూ చక్కగా ఉన్నారని మీరను కోవచ్చు, కానీ మీ విధిలో అది రాసిపెట్టి లేదు. ఆ వ్యక్తి ఏ పనీ చేతకానివాడు, కానీ అతడి విధిలో అది రాసిపెట్టి ఉంది, అతడు ఒక యజమాని అవుతాడు. సామాన్య వ్యక్తులు ఏమైనా అనుకోనివ్వండి, మాకు ఏ బాధా లేదు, ఎందుకంటే, అది కేవలం సామాన్య మానవుల దృష్టికోణం మాత్రమే. ఒక ఉన్నత స్థాయి దృక్పథంనించి చూసినప్పుడు, మానవసంఘపు పురోగతి ఒక స్పష్టమైన అభివృద్ధి సూత్రాన్ని అనుసరించి జరుగుతున్నట్లు తెలుస్తుంది. అందువల్ల, ఒక వ్యక్తి తన జీవితంలో ఏం చేస్తాడు అన్నది అతడి సామర్థ్యాలపై ఆధారపడి ఏర్పడదు. బౌద్ధమతం కర్మ ఫలాన్ని అనుభవించడం అన్న సూత్రాన్ని నమ్ముతుంది. ఒక వ్యక్తి జీవితం అతడి కర్మను బట్టి ఏర్పడుతుంది. మీకు ఎంతటి సామర్థ్యం ఉన్నా, పుణ్యం లేకపోతే, మీకు బహుశా ఈ జీవిత కాలంలో ఏమీ లభించకపోవచ్చు. మరొక వ్యక్తిని చేతకాని వాడిగా మీరు భావించినా, అతడికి చాలా పుణ్యం ఉండొచ్చును. అతడు ఒక ఉన్నతోద్యోగి కావచ్చు లేదా ఒక పెద్ద సంపద కూడబెట్టుకోవచ్చు. ఒక సామాన్య వ్యక్తి ఈ విషయాన్ని గ్రహించలేక తాను ఏమి చెయ్యగలడో కేవలం అదే చెయ్యాలని నమ్ముతూ ఉంటాడు. అందువల్ల అతిగా గాయపడిన హృదయంతో అతడు జీవితపర్యంతమూ పోటీపడుతూ, పోరాడుతూ ఉంటాడు. ఎల్లప్పుడూ అన్ని విషయాలు అన్యాయంగా ఉన్నట్లు భావిస్తూ, మనసంతా చేదు అనుభవాన్ని పొందినట్లూ, అలసటగానూ అనుభూతి చెందుతూ ఉంటాడు. సరిగ్గా తినలేక, నిద్రపోలేక, అతడు దుఃఖితుడు, అసంతృప్తుడు అవుతాడు. వయసుమీరిన తరవాత చివరకు అనారోగ్యం పాలై, అన్ని రకాల వ్యాధులూ అతడిలో బయటపడతాయి.

అందువల్ల, మన సాధకులు ఈ రకమైన ప్రవర్తనను మరింతగా తగ్గించుకోవాలి, ఎందుకంటే, ఒక సాధకుడు ప్రకృతి నియమాన్ని అనుసరించవలసి ఉంటుంది. ఒక వస్తువు మీది అయినట్లైతే, మీరు దానిని ఎప్పటికీ కోల్పోరు. ఏదైనా వస్తువు మీది కాని పక్షంలో, మీరు దానికోసం ఎంత పోరాడినా, అది మీకు దొరకదు. అయితే, ఇది తప్పనిసరి కాదు. అలా అయినట్లైతే, తప్పులు చెయ్యడమన్న ప్రశ్నే ఉండేది కాదు. మరొకరకంగా చెప్పాలంటే, కొన్ని అస్థిరమైన కారకాలు ఉన్నాయి. కానీ, ఒక సాధకుడుగా, నియమానుసారం మీరు గురువుగారి ఫాషెన్ రక్షణలో ఉన్నారు. ఇతరులు మీదైన ఏ వస్తువునైనా తీసేసుకోవాలి అనుకున్నా, తీసుకోలేరు. అందువల్ల మేము ప్రకృతి నియమాన్ని అనుసరిస్తాము. కొన్నిసార్లు ఒక వస్తువు మీది కావాలని మీరు అనుకుంటారు, ఇతరులు కూడా అది మీదేనంటారు. నిజానికి అది మీది కాదు. అది మీదేనని మీరు నమ్మొచ్చు గాక, చివరకు అది మీకు దక్కదు. దీని ద్వారా, మీరు దానిని వదిలిపెట్టగలరా, లేదా అన్నది తెలుస్తుంది. మీరు దానిని వదలలేకపోతే, అది ఒక బంధం. ఈ పద్ధతిని స్వప్రయోజనాలపట్ల మీ బంధంనించి విడిపించుకోవడానికి ఉపయోగించుకోవాలి. ఇదీ విషయం. సామాన్య వ్యక్తులకు ఈ నియమం పట్ల ఎరుకలేకపోవడంవల్ల, వారందరూ లాభాల కోసం పోటీ పడుతూ, పోరాడుతుంటారు.

సామాన్య వ్యక్తుల మధ్య అసూయ అన్నది దారుణంగా ప్రదర్శించబడింది. సాధకుల సమాజంలో కూడా ఇది చాలా స్పష్టంగా కనిపిస్తుంది. భిన్న చీ గోంగ్ సాధనల నడుమ ఎటువంటి గౌరవం లేదు, "మీ సాధన బాగుంది" లేదా "అతడి సాధన బాగా లేదు" అంటూ – అనుకూలమూ, వ్యతిరేకమూ అయిన రెండు రకాల వ్యాఖ్యానాలు చెయ్యడం జరుగుతూ ఉంటుంది. నా దృష్టిలో. అవన్నీ కూడా వ్యాధినిర్మూలన, దేహపుష్టి నిలుపుకునే స్థాయికి చెందినవే. పరస్పర విరుద్ధమైన ఆ సాధనలలో, చాలా వరకు గందరగోళంగా ఉండేవీ, ప్రేతాత్మలు, జంతువులతో ఆవహింపబడి జనించిన సాధనలకు చెంది ఉన్నవే, అవి షిన్ షిన్ పట్ల శ్రద్ధ వహించవు. ఒక వ్యక్తి ఇరవై ఏళ్ళు చీ గోంగ్ సాధన చేసి కూడా ఎటువంటి అతీంద్రియ శక్తులు సాధించకపోగా మరొక వ్యక్తి సాధన ప్రారంభించిన అనతికాలంలోనే పొందుతాడు. అప్పుడు మొదటి వ్యక్తి

దానిని అన్యాయమని భావిస్తాడు "నేను ఇరవై ఏళ్ళకు పైగా సాధన చేసి ఏ అతీంద్రియ శక్తులనూ పొందలేకపోయాను, అతడు వాటిని పెంచుకున్నాడు. అతడికి ఎటువంటి అతీంద్రియ శక్తులున్నాయి?" అతడు కోపోద్రిక్తుడై "అతడు ప్రేతాత్మ లేదా జంతువుతో ఆవహింపబడి, ఆధ్యాత్మికపు పిచ్చి పట్టి ఉన్నాడు" అనుకుంటాడు. ఒక చీ గోంగ్ గురువు ఒక తరగతిలో బోధించినప్పుడు అక్కడ ఉన్నవారిలో ఎవరో ఒకరు "ఓ... ఇతడు ఏ రకమైన చీ గోంగ్ గురువు? అతడు చెప్పేది వినాలని నాకు ఏమాత్రమూ ఆసక్తిగా లేదు" అన్న అమర్యాదా భావనతో కూచొని ఉండొచ్చు. ఈ వ్యక్తి మాట్లాడగలిగినంత ధారాళంగా ఆ చీ గోంగ్ గురువు మాట్లాడలేకపోవచ్చు. అయినా, ఆ చీ గోంగ్ గురువు మాట్లాడే విషయం తాను అనుసరించే సాధనాసిద్ధాంతంలో చెప్పబడి ఉన్నదే. ఈ వ్యక్తి ప్రతి విషయమూ అధ్యయనం చేసి పట్టభద్ర యోగ్యతాపత్రాల కట్ట ఒకటి చేతబట్టి, ప్రతి చీ గోంగ్ గురువు నడిపే తరగతులకు వెళ్ళి ఉన్నవాడు. నిజానికి, ఆ చీ గోంగ్ గురువు కన్నా ఇతడికే ఎక్కువ విషయ జ్ఞానం ఉన్నది. కానీ ఏం ప్రయోజనం? అదంతా, వ్యాధినిర్మూలన, దేహపుష్టి నిలుపుకునే విషయమే. అతడిలో అది పెరుగుతున్నకొద్దీ అతడికి అందే సందేశాలు అంతకంతా గందరగోళమూ, సంక్లిష్టమూ అవుతూ అతడి ఆధ్యాత్మిక సాధన కష్టతరం అవుతుంది – అంతా కలుషితం అవుతుంది. అసలైన ఆధ్యాత్మిక సాధన ఒకే మార్గాన్ని అనుసరించమని, దారి తప్పవద్దనీ బోధిస్తుంది. ఇది నిజమైన సాధకుల విషయంలో కూడా జరగొచ్చు, ఎందుకంటే పరస్పర అగౌరవ భావమూ, పోటీపడడం అన్న బంధం వదలకపోవడమూ కలిసి సులభంగా అసూయకు దారితీస్తాయి.

ఒక కథ చెప్తాను. ఇన్వెస్టిచర్ ఆఫ్ గాడ్స్ (4) అన్న గ్రంథంలో జియాంగ్ జియా (6) వృద్ధుడూ, అసమర్థుడూ అని షెన్ గోంగ్ బావో (5) కి తెలుసు. కానీ అమరులకు బిరుదులు ఇవ్వమని స్వర్గపు ప్రాచీన దైవం జ్యాంగ్ బ్యాను అడిగారు. అది అన్యాయమని షెన్ గోంగ్ బావో తన మనసులో భావించాడు "అమరులకు బిరుదులు ఇవ్వమని అతడికి ఎందుకు చెప్పారు? నేను ఎంతటి సమర్థుడనో చూడండి. నా శిరస్సును ఖండించినా, నేను దాన్ని మరల భుజాల మీద అమర్చుకోగలను. అమరులకు బిరుదులు ఇవ్వమని నాకెందుకు

చెప్పలేదు?" అనుకున్నాడు. అతడు ఎంత అసూయాగ్రస్తుడు అయ్యాడంటే ఎల్లప్పుడూ జ్యాంగ్ బ్యాని ఇబ్బందుల పాలు చేస్తుండేవాడు.

శాక్యముని కాలంలో ఉన్నట్టి ప్రాథమిక బౌద్ధమతంలో అతీంద్రియ శక్తుల గురించి చెప్పబడింది. ఈనాడు బౌద్ధమతంలో ఎవ్వరూ అతీంద్రియ శక్తుల గురించి మాట్లాడడానికి ఎంత మాత్రమూ సాహసించరు. మీరు అతీంద్రియ సామర్థ్యాల ప్రస్తావన తెస్తే, జనులు మీకు ఆధ్యాత్మికపు పిచ్చి పట్టిందంటారు. "ఏ అతీంద్రియ శక్తులు?" అంటూ, వాటిని ఏ మాత్రమూ గుర్తించరు. ఇలా ఎందుకని? ప్రస్తుతం భిక్షువులకు కూడా వాటి గురించి తెలియదు. శాక్యమునికి పదిమంది ప్రధాన శిష్యులు ఉండగా, వారిలో అతీంద్రియ సామర్థ్యాలు గలిగినవారిలో మూజ్యెన్యెన్ (7) అన్న శిష్యుడు ప్రథమ స్థానంలో ఉన్నాడని ఆయన పేర్కొన్నారు. శాక్యమునికి కొందరు శిష్యురాండ్రు కూడా ఉండేవారు, వారిలో ల్యెన్‌హ్వాజ్ (8) అన్న ఆమెది అతీంద్రియ సామర్థ్యాలు కలిగినవారిలో ప్రథమస్థానం. బౌద్ధమతం చైనాలో ప్రవేశించిన తరవాత జరిగినది కూడా అదే. చరిత్ర అంతటా, సిద్ధి పొందిన భిక్షువులు అనేకులు ఉన్నారు. బోధిధర్ముడు చైనాలో ప్రవేశించినప్పుడు ఒక నదిని దాటడానికి, ఒక్క రెల్లు గడ్డిపోచ ఆధారంగా దాటాడట. చరిత్ర అభివృద్ధి పొందుతున్న క్రమంలో, అతీంద్రియ సామర్థ్యాలు అధికాధికంగా తిరస్కరింపబడ్డాయి. భిక్షువులలో పెద్దవారు, పర్యవేక్షకులు, లేదా మఠాధిపతులు ఉన్నతమైన జన్మ సంస్కారం కలిగినవారు కాకపోవడమే దానికి ప్రధాన కారణం. వారు మఠాధిపతులూ, భిక్షువులలో పెద్దవారూ అయినా, అవన్నీ సామాన్య వ్యక్తులలో పొందిన పదవులు మాత్రమే. వారు కూడా సాధకులే, అయితే కొంత ఎక్కువ అనుభవం కలిగిఉన్నవారు, అంత మాత్రమే. మీరు ఔత్సాహికులుగా ఇంట్లో సాధన చేసుకుంటారు. ఒక వ్యక్తి ఆధ్యాత్మిక సాధనలో సఫలుడు అవుతాడా అన్న విషయం అతడి అంతఃకరణ యొక్క సంస్కరణ మీద ఆధారపడి ఉంటుంది. అందరి విషయంలోనూ ఇదే జరుగుతుంది, ఒక వ్యక్తి ఏమాత్రమూ వెనకబడడం జరగదు. అయితే కొత్తగా సాధనను ప్రారంభించిన ఒక చిన్న భిక్షువు, వంటవాడు అయినంత మాత్రాన అతడి యొక్క జన్మ సంస్కారం తక్కువ స్థాయిది కాకపోవచ్చు. ఆ చిన్న భిక్షువు, ఎంతగా బాధలు

సహిస్తే అతడికి గోంగ్ బంధనం విప్పుకోవడం అంతటి సులభం కావచ్చు. సాధన దీర్ఘకాలం సాగుతూ వారు పెద్ద స్థాయికి వెళుతూ, వారి జీవితాలు సుఖమయం అయ్యేకొద్దీ, ఆ పెద్ద భిక్షువులకు గోంగ్ బంధం విప్పుకునే స్థాయిని చేరుకోవడం కష్టతరం అవుతూ ఉంటుంది, ఎందుకంటే, కర్మ పరివర్తన చెందడం అనే అంశం ఇక్కడ ఉంది. చిన్న స్థాయిలో ఉన్న భిక్షువు నిరంతరం అలుపు లేకుండా శ్రమిస్తూ, ఉంటాడు. అతడికి కర్మను తీర్చు కోవడమూ, జ్ఞానోదయం పొందడమూ త్వరగా జరుగుతుంది. బహుశా అతడు హఠాత్తుగా ఒకనాడు గోంగ్ బంధనం విప్పుకునే స్థితిని సాధిస్తాడు. గోంగ్ బంధనం విప్పుకోవడం లేదా జ్ఞానప్రాప్తి లేదా సగం జ్ఞానం పొందడం అన్న ఈ స్థితిలో అతడిలోని అతీంద్రియ శక్తులన్నీ బయటపడతాయి. మఠం లోని భిక్షువులందరూ అతడిని ప్రశ్నలు అడగడానికి చుట్టుముడతారు, అతడి పట్ల గౌరవం ప్రకటిస్తారు. కానీ మఠాధిపతి దానిని సహించలేకపోతాడు: "నేను ఇకపై మఠాధిపతిగా ఎలా కొనసాగగలను? ఏం జ్ఞానోదయం? అతడికి ఆధ్యాత్మికపు పిచ్చి పట్టింది. అతడిని తరిమివెయ్యండి" అంటాడు. ఆ రకంగా ఆ మఠంనించి ఆ చిన్న భిక్షువును బహిష్కరించడం జరుగుతుంది. కాలం గడిచేకొద్దీ, చైనీయ బౌద్ధమతంలో ఎవ్వరూ, అతీంద్రియ శక్తుల మాట ఎత్తడానికి సాహసించరు. జీ గోంగ్ ఎంతటి సమర్థుడో మీ అందరికీ తెలుసు. ఉహ్మే పర్వతం (9) నించి వృక్షాల మొదళ్ళతో సహా జరిపి, లింగ్ యిాన్ మఠంలోని బావిలో నించి విసిరివేయగలిగేవాడు. అయినా చివరకు అతడు ఆ మఠంనించి తరిమివేయబడ్డాడు.

మీరు ఆధ్యాత్మిక సాధనను పరిపూర్ణం చేసుకోగలరా అన్న విషయం మీద నేరుగా ప్రభావం కలిగి ఉండడంవల్ల, అసూయ అన్న అంశం అతితీవ్రమైనది. అసూయను తొలగించనంత వరకు, మీరు చేసియున్న ఆధ్యాత్మిక సాధన అంతా ఒక సున్నితమైన వ్యవహారం అవుతుంది. అక్కడ ఈ క్రింది నియమం ఉంది. ఒక వ్యక్తి తన ఆధ్యాత్మిక సాధనాక్రమంలో, అసూయను వదలకపోతే, అతడు సరైన ఫలాన్ని పొందలేడు – అది ఎంతమాత్రమూ జరగదు. అమితాభ బుద్ధుడు కర్మతో స్వర్గానికి వెళ్ళడం గురించి ప్రస్తావించినట్లు బహుశా మీరు వినే ఉంటారు. కానీ అసూయను వదలనిదే అది జరగబోదు. ఒక వ్యక్తి

ఇతరత్రా చిన్న విషయాలలో లోపం ఉన్నా, కర్మ ఉన్నప్పటికీ తదుపరి ఆధ్యాత్మిక సాధన కోసం స్వర్గానికి వెళ్ళొచ్చు. కానీ అసూయను వదలనిదే అది అత్యంత అసాధ్యం. ఈ విషయాన్ని తెలుసుకోకుండా మిమ్మల్ని మీరు చీకటిలో ఉంచుకో రాదని ఈ రోజున నేను సాధకులకు చెప్తున్నాను. మీరు సాధించాలి అనుకున్న లక్ష్యం ఉన్నత స్థాయిలకు చేర్చే ఆధ్యాత్మిక సాధన చెయ్యడం. అసూయ అన్న బంధాన్ని తప్పనిసరిగా వదలాలి, అందుకోసమే నేను ఈ ఉపన్యాసంలో దానిని గురించి ప్రత్యేకంగా వివరించాను.

## వ్యాధులకు చికిత్స చేయడం అన్న అంశం

వ్యాధులకు చికిత్స చేయడం గురించి, నేను మీకు బోధించబోవడం లేదు. అసలైన ఫాలున్ దాఫా శిష్యులెవ్వరూ, ఇతరుల వ్యాధులకు చికిత్స చేయకూడదు. మీరు ఒకసారి వ్యాధికి చికిత్స చేస్తే, ఫాలున్ దాఫా వల్ల మీ శరీరానికి లభించిన వస్తువులనన్నిటినీ నా ఫాషెన్ వెనకకు తీసుకుంటుంది. ఈ విషయం ఇంత తీవ్రంగా ఎందుకు చూడబడుతున్నది? ఎందుకంటే, అలా చెయ్యడం ఫాలున్ దాఫాను అవమానించడమే. మీరు మీ ఆరోగ్యాన్ని దెబ్బతీయడంకన్నా ఎక్కువ హాని చేసుకుంటారు. కొందరు వ్యక్తులు ఎవరికైనా వ్యాధిని స్వస్థపరచిన వెంటనే, మళ్ళీ చెయ్యాలన్న దురద వారికి కలుగుతూ ఉంటుంది. తాము చూస్తున్నవారినందరినీ పట్టుకొని వారి వ్యాధులకు చికిత్స చేసి, తమ గొప్పను చూపుకోవాలి అనుకుంటారు. ఇది ఒక బంధం కాదా? ఇది ఒక వ్యక్తి యొక్క ఆధ్యాత్మిక సాధనను తీవ్రంగా ఆటంకపరుస్తుంది.

చీ గోంగ్ నేర్చుకున్న తరవాత రోగులకు చికిత్స అందించాలని సామాన్య వ్యక్తులలో ఉండే కోరికను మోసపు చీ గోంగ్ గురువులు ఉపయోగించు కుంటారు. వారు మీకు ఈ విషయాలను నేర్పించి, ఒక వ్యక్తి చీని ప్రసరించి, వ్యాధినిర్మూలన చెయ్యగలుగుతాడని వాదిస్తారు. ఇది హాస్యాస్పదం కాదా? మీలో చీ ఉంది, ఇతర వ్యక్తిలోనూ చీ ఉంది, మీ చీతో అతడికి చికిత్స ఎలా చెయ్యగలరు? బహుశా అతడి చీ మీ చీని అధిగమించవచ్చు! ఈ రెండు చీలకు మధ్య నిర్బంధం లేదు. ఒక వ్యక్తి ఉన్నత స్థాయి ఆధ్యాత్మిక సాధనతో తన గోంగ్‌ను పెంచుకున్నప్పుడు, నిజానికి అతడు తయారుచేసుకునేది

వ్యాధిని స్వస్థపరచేది, అణచివేసేది, అదుపుచేసేది మాత్రమే అయిన ఉన్నత శక్తి పదార్థం మాత్రమే, అది వ్యాధి యొక్క మూలకారణాన్ని తొలగించలేదు. అందువలన, ఒక వ్యాధిని స్వస్థపరచి దానిని నిజంగా నిర్మూలించడానికి అతీంద్రియ శక్తులు అవసరం. ప్రతి వ్యాధిని స్వస్థపరచడానికి ఒక ప్రత్యేక అతీంద్రియ శక్తి ఉంది. వ్యాధినిర్మూలన చెయ్యగలిగిన అతీంద్రియ శక్తుల విషయంలో ఒక వెయ్యి రకాలు ఉన్నాయని, ఎన్ని వ్యాధులు ఉన్నాయో, అన్ని అతీంద్రియ శక్తులు ఉన్నాయని నేను చెప్తాను. ఈ అతీంద్రియ శక్తులు లేనిదే, మీరు ఎంత నిపుణతతో చికిత్స చేసినా అది వ్యర్థమే అవుతుంది.

ఇటీవలి సంవత్సరాలలో, కొందరు వ్యక్తులు సాధకుల సమాజాన్ని గందరగోళం పాలుచేశారు. ప్రజలలోకి వచ్చి వ్యాధినిర్మూలన, దేహపుష్టి నిలుపుకోవడాన్ని నేర్పించిన, లేదా మొట్టమొదట దారిని ఏర్పరచిన అసలైన చీ గోంగ్ గురువులలో రోగులకు చికిత్స చేయడం ఎవరు నేర్పారని? వారు ఎప్పుడూ తామే మీకు వ్యాధినిర్మూలన చేసేవారు, లేదా మీరు స్వయంగా ఆధ్యాత్మిక సాధన చేసుకుంటూ, శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడమే నేర్పారు. వారు మీకు కొన్ని వ్యాయామాలు నేర్పారు, తరవాత మీరు స్వంత అభ్యాసం ద్వారా మీ వ్యాధులను స్వస్థపరచుకునేవారు. తరవాతి కాలంలో, మోసపు చీ గోంగ్ గురువులు ప్రజలలోకి వచ్చి, చాలా కలుషితం చేశారు. చీ గోంగ్ ద్వారా రోగులకు చికిత్స చెయ్యాలనుకున్న ప్రతి ఒక్కరూ ప్రేతాత్మ లేదా జంతువుల ఆవాహనను ఆకర్షించేవారు – అది ఖచ్చితంగా జరిగేది. అప్పటి పరిస్థితులలో కొందరు చీ గోంగ్ గురువులు రోగులకు చికిత్స చేశారు. ఆనాడు ఉన్న విశ్వ వాతావరణానికి సహకరించడానికి వారలా చేశారు. అయినా చీ గోంగ్ సామాన్య మానవుల స్థాయి నైపుణ్యం కాదు, అది ఎల్ల కాలమూ నిలిచేది కాదు. అది అప్పటి విశ్వ వాతావరణంలో కలిగిన మార్పుల కారణంగా జరిగింది; ఆ ప్రత్యేక కాల అవధిలో మాత్రమే సంభవించినట్టిది. తరవాత, కొంతమంది ఇతరులకు వ్యాధుల చికిత్స నేర్పడంలో ప్రత్యేకమైన వాళ్ళం అని తమకుతాము చెప్పుకొని ఒక కలుషిత వాతావరణాన్ని కల్పించారు. ఒక సామాన్య వ్యక్తి ఇతరుల వ్యాధులకు చికిత్స చేయడాన్ని, మూడు రోజులో లేదా అయిదు రోజులలోనో నేర్చుకోవడం అన్నది ఎలా

జరుగుతుంది? కొందరు: "నేను ఫలానా వ్యాధిని నిర్మూలించగలను" అని చెప్పుకోవచ్చు గాక. ఈ వ్యక్తులు ప్రేతాత్మ, లేదా జంతువులను తమలో కలిగి ఉంటారని నేను మీకు చెప్తున్నాను. వారి వీపులకు ఏవి అంటిపెట్టుకొని ఉన్నాయో మీకు తెలుసా? వారిని ప్రేతాత్మలు, లేదా జంతువులు ఆవహించుకొని ఉన్నాయి, కానీ వారికి అలా అనిపించదు, అవి ఉన్నట్లు తెలుసుకోరు. అయినప్పటికీ, వారికి ఎంతో మంచి భావం ఉండి, తాము సమర్థులమని తలుస్తారు.

అసలైన చీ గోంగ్ గురువులు ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి తమ ఆధ్యాత్మిక సాధనలో అనేక సంవత్సరాలు కఠిన పరిశ్రమకు గురి కావలసి ఉంటుంది. మీరు ఒక రోగికి చికిత్స చేసేటప్పుడు, ఆ వ్యక్తికి ఉన్న కర్మను తొలగించగల బలమైన అతీంద్రియ శక్తులు మీలో ఉన్నాయో లేదో, ఎప్పుడైనా ఆలోచించారా? మీరు ఎప్పుడైనా అసలైన బోధనను పొందారా? ఒక వ్యాధికి చికిత్స చెయ్యడం మూడు రోజులు లేదా అయిదు రోజుల్లో మీరు ఎలా నేర్చుకోగలరు? ఒక సామాన్య వ్యక్తి చేతులను కలిగి ఉన్న మీరు ఒక వ్యాధి నుండి స్వస్థతను ఎలా ఇవ్వగలరు? ఏమైనా, అటువంటి మోసపు చీ గోంగ్ గురువు, మీ బలహీనతలను, మానవులకు ఉన్న బంధాలను తన అవకాశంగా వాడుకున్నాడు. మీరు వ్యాధులను తొలగించాలని ఆశపడడం లేదా? ఈ వ్యక్తి మీకు చీ సూది, కాంతి చికిత్స, చీని విడుదల చేయడం, చీకి అనుబంధంగా మరికొంత సమకూర్చడం, ఆక్యుప్రెషర్ విధానం, చేతితో ఒడిసిపట్టుకోవడం అని పిలిచే పద్ధతి వంటి కొన్ని చికిత్సా పద్ధతులను ప్రత్యేకంగా నేర్పించడానికి ఒక తరగతిని ఏర్పాటు చేస్తాడు. మీ డబ్బును సంగ్రహించడంపై గురిపెట్టే అనేక రకాలైన పద్ధతులు ఉన్నాయి.

చేతితో ఒడిసి పట్టుకునే పద్ధతిని గురించి చెప్పుకుందాం. మేము చూసిన పరిస్థితి ఇలా ఉంది. ప్రజలు ఎందుకు అనారోగ్యం పాలవుతారు? ఒక వ్యక్తి అనారోగ్యానికీ, దురదృష్టానికీ మూలకారణం అతడి కర్మ, ఆ నల్లని పదార్థపు కర్మ క్షేత్రం. అది ప్రతికూలమూ, చెడ్డది కూడా. ఈ పాప జీవులు కూడా ప్రతికూలమైనవీ, అవన్నీ కూడా నల్లగానూ ఉంటాయి. ఈ వాతావరణం వాటికి సరిపడుతుంది గనక, అవి రాగలుగుతాయి. ఒక వ్యక్తి అనారోగ్యానికి

ఇదీ మూలకారణం; ఇది అనారోగ్యానికి అత్యంత మూలాధారం. అయితే, రెండు ఇతర రూపాలు కూడా ఉన్నాయి. ఒకటి అధిక సాంద్రత కలిగిన కర్మ యొక్క సమూహంలాగా ఉండి అతిసూక్ష్మంగా ఉంటుంది. రెండవది, ఒక గొట్టం ద్వారా ప్రవహించేదిగా ఉంటుంది, కానీ ఇది అతి అరుదుగా కనిపిస్తుంది; ఇది అంతా ఒక వ్యక్తి పూర్వీకుల ద్వారా పోగుచేయబడినది. ఇటువంటి సందర్భాలు కూడా ఉన్నాయి.

అతి సాధారణంగా వచ్చే అనారోగ్యాలను గురించి చెప్పుకుందాం. ఒక వ్యక్తికి శరీరంలో ఎక్కడో ఒకచోట గడ్డ, అంటువ్యాధి, ఎముకలకు సంబంధించిన వ్యాధి ఉండొచ్చు. ఎందుకంటే మరొక పరిమాణంలో ఆ ప్రదేశంలో ఒక జీవి ఉంటుంది. ఆ జీవి చాలా లోతైనట్టి ఒకపరిమాణంలో ఉంటుంది. ఒక సాధారణ చీ గోంగ్ గురువులో లేదా ఒక సాధారణమైన అతీంద్రియ శక్తిలో దాన్ని గుర్తించే సామర్థ్యం ఉండదు, ఆ వ్యక్తి శరీరంలో నల్లని చీ ఉన్నట్లు మాత్రమే వారు చూడగలుగుతారు. నల్లని చీ ఎక్కడున్నా, అక్కడ అనారోగ్యం ఉందని చెప్పడమే సరైన పని. అయినప్పటికీ, అనారోగ్యానికి మూలకారణం ఆ నల్లని చీ కాదు. ఎందుకంటే, ఒక లోతైన పరిమాణంలో ఈ క్షేత్రాన్ని కల్పించే జీవి ఉన్నది. కాబట్టి కొందరు దాని ప్రభావాన్ని పోగొట్టి దాన్ని తొలగించడం గురించి చెప్తారు – వెళ్ళి మీరు కోరినట్లు దానిని పోగొట్టండి! కొద్ది సమయం తరవాత అది తిరిగి ఏర్పడుతుంది, ఎందుకంటే, కొన్ని జీవులు అతి శక్తివంతమైనవి, ఆ చీ తొలగింపబడగానే తిరిగి తమంతటతామే దానిని వెనక్కు తీసుకురాగలవు కూడా. ఏ రకమైన చికిత్సలు చేసినప్పటికీ అవి పనిచెయ్యవు.

అతీంద్రియ శక్తులతో చూడగలిగిన ఎవరికైనా నల్లని చీ ఉన్నట్లు కనిపించిన ప్రతి చోట, ఆ ప్రదేశంలో వ్యాధిగ్రస్తమైన చీ ఉన్నట్లు పరిగణింపబడుతుంది. చైనీయ వైద్యం తెలిసిన వైద్యునికి అక్కడ నాడులలో అడ్డు ఏర్పడి ఉండడం తెలుస్తుంది, ఎందుకంటే చీ మరియు రక్తం సరిగా ప్రవహించక నాడులలో శక్తి ఒక్కచోటే పోగుపడిపోతుంది. పాశ్చాత్య వైద్యం చదివిన వైద్యునికి అక్కడ ఒక వ్రణమో, గడ్డ, ఎముక బయటకు పొడుచుకురావడం, లేదా పూత వచ్చినట్లుగా వ్యాధి చిహ్నాలు కనిపిస్తాయి. అది మన

పరిమాణంలో వ్యక్తమై నప్పుడు ఈ రూపంలో ఉంటుంది. మీరు ఆ జీవిని తొలగించిన తరవాత ఈ పరిమాణంలో ఉన్న శరీరంలో ఎటువంటి బాధా లేదని గమనిస్తారు. అది వెన్నెముకలోని వెన్నుపూసల మధ్యనున్న డిస్క్‌లు లేదా వెన్నెముక బయటకు పొడుచుకు రావడం, ఏదైనా గానీ, ఆ జీవిని తొలగించివేసి ఆ క్షేత్రాన్ని శుభ్రపరచిన తరవాత, అది ఆ క్షణంలో స్వస్థ పడినట్లు మీరు తెలుసుకోగలుగుతారు. మరొక ఎక్స్‌రేను తీసి చూసినప్పుడు ఆ ఎముక పొడుచుకురావడం అన్నది మాయమైనట్లు తెలుసుకోగలుగుతారు. మూలకారణం ఏమిటంటే, ఆ జీవి ఈ పరిస్థితిని ఉత్పన్నం చేసింది.

చేతితో ఒడిసి పట్టుకొనే పద్ధతిని వారు మీకు నేర్పడం ద్వారా మూడు లేదా అయిదు రోజుల్లో మీరు వ్యాధులను స్వస్థపరచగలుగుతారని కొందరు చెప్పుకుంటారు. మీరు చేతితో ఒడిసి పట్టుకునే ఆ పద్ధతిని నాకు చూపండి! ఆ జీవి అతిభయంకరమైనది కాగా, మానవులు అతిబలహీనులు. అది అతిసులభంగా మీ మనసును అదుపు చేసి, తన ఇష్టం వచ్చినట్లుగా మిమ్మల్ని మార్చివేయగలుగుతుంది. అది మీ జీవితాన్ని కూడా సులభంగా అంతం చెయ్యగలుగుతుంది. మీరు దానిని పట్టుకోగలనని చెప్పుకుంటారు. మీరెలా పట్టుకోగలరు? సామాన్య వ్యక్తి చేతుల వంటి మీ చేతులతో మీరు దానిని చేరుకోలేరు. మీరు గురి లేకుండా అక్కడ చేతులు పెట్టొచ్చు, అది మిమ్మల్ని లక్ష్యపెట్టకుండా మీ వెనక పరిహసించవచ్చు – గురి లేకుండా ఒడిసి పట్టుకోవడం హాస్యాస్పదం. మీరు దానిని నిజంగానే పట్టుకోగలిగితే, అది వెంటనే మీ చేతులను గాయపరుస్తుంది. అది ఒక నిజమైన గాయమే! నేను ఇంతకు ముందు కొందరి చేతులను చూశాను, ఏ పరీక్ష చేసి చూసినా, వారి రెండు చేతులూ మామూలుగానే కనిపించేవి. వారి శరీరాలూ, రెండు చేతులూ అనారోగ్యంగా లేవు, కానీ, వ్రేలాడబడిపోతున్న తమ చేతులను వారు పైకి ఎత్తలేకపోయేవారు. నేను అటువంటి స్థితిలో ఉన్న రోగిని చూశాను: మరొక పరిమాణంలోని అతడి శరీరం గాయపడి ఉంది – ఆ సందర్భంలో అతడు నిజంగానే పక్షవాతానికి గురై ఉన్నాడు. అక్కడి మీ శరీరం గాయపడితే మీకు నిజంగా పక్షవాతం రాదా? కొంతమంది, “టీచర్, నేను చీ గోంగ్ అభ్యసించ గలుగుతానా? నాకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స అయింది.” అని లేదా

"నా శరీరంనించి ఏదో తొలగించబడింది" అని అడుగుతారు. "మరేం సమస్య లేదు, ఎందుకంటే మరొక పరిమాణంలో ఉన్న మీ శరీరానికి ఎటువంటి శస్త్రచికిత్స జరగలేదు, చీ గోంగ్ సాధనలో ఆ శరీరం మీద పని జరుగుతుంది" అని నేను వారికి చెప్పాను. అందువల్లనే మీరు ఆ జీవిని ఒడిసి పట్టుకోవాలని చూసినప్పుడు అది మీకు అందదని చెప్పాను. మీరు దానిని తాకితే అది మిమ్మల్ని గాయపరుస్తుంది.

ప్రభుత్వం చేత నిర్వహింపబడుతున్న ఒక పెద్ద చీ గోంగ్ కార్యక్రమంలో దానిని సమర్ధించడానికి బీజింగ్‌లో జరుగుతున్న ఓరియెంటల్ హెల్త్ ఎక్స్‌పో లలో పాల్గొనడానికి కొందరు శిష్యులతో నేను వెళ్ళాను. రెండు ఎక్స్‌పోలలోనూ మాదే ఉత్తమమైన సాధనగా నిలిచింది. మొదటి ఎక్స్‌పోలో మా ఫాలున్ దాఫా "స్టార్ చీ గోంగ్ స్కూల్" అన్న బిరుదుతో గౌరవింపబడింది. రెండవ ఎక్స్‌పోలో మా దగ్గరకు ఎంతమంది వచ్చారంటే, మాకు నిర్వహించడం కష్టం అయింది. ఆ ఎగ్జిబిషన్‌లోని మిగిలిన స్టాళ్ళ దగ్గర అంతగా జనం లేరు గానీ మా స్టాలు కిక్కిరిసిపోయింది. మూడు వరసలలో ప్రజలు ఎదురుచూస్తున్నారు. మొదటి వరసలో పొద్దుటి చికిత్స కోసం తెల్లవారుజామున నమోదు చేసుకున్న వారు, రెండవ వరసలో మధ్యాహ్నపు చికిత్స కోసం నమోదు చేసుకున్నవారు, మూడో వరసలో ఉన్నవారు నా చేవ్రాలు కోసం ఎదురుచూస్తున్నవారు. మేము వ్యాధి నిర్మూలన చెయ్యం, కానీ మేము ఇలా ఎందుకు చేశాం? ఎందుకంటే, ఇది ప్రభుత్వ నిర్వహణలో జరుగుతున్న పెద్ద కార్యక్రమం, దానిని సమర్ధించ డానికై మేము పాల్గొన్నాము గనక చేశాం.

నాతో అక్కడ ఉన్న నా శిష్యులకు నా గోంగ్‌ను పంచాను. ప్రతి ఒక్కరికీ, వందకు పైబడిన అతీంద్రియ శక్తులతో కూర్చబడిన గుత్తినించి ఒక భాగం లభించింది. నేను గోంగ్‌తో వారి అరచేతులను మూసివేశాను, అయినప్పటికీ వారిలో కొందరి చేతులు కరవబడి బొబ్బలెక్కడం లేదా రక్తం కారడమో జరిగింది; అది చాలా తరచుగా కూడా జరిగింది. ఆ జీవులు అంతటి విష పూరితమైనవి. మీకున్న సామాన్యవ్యక్తి చేతులతో వాటిని పట్టుకునే సాహసం మీకు ఉందనే అనుకుంటున్నారా? అదీకాక, మీరు వాటిని అందుకోలేరు. ఆ రకమైన అతీంద్రియ శక్తి లేకుండా, ఆ పని నెరవేరదు. ఇలా ఎందుకు

అవుతుందంటే, మీరు ఏం చెయ్యాలని అనుకున్నా – మీలో ఆ ఆలోచన మెదిలిన వెంటనే మరొక పరిమాణంలో దానికి తెలిసిపోతూ ఉంటుంది. మీరు దానిని పట్టు కోవాలని ప్రయత్నించేటప్పటికీ, అది పారిపోతుంది. ఎప్పుడైతే వ్యాధిగ్రస్తుడు బయటకు అడుగుపెడతాడో, అది వెంటనే అక్కడికి వెళ్తుంది, అతడి వ్యాధి తిరగబెడుతుంది. దాన్ని అదుపులో పెట్టడానికి ఒక వ్యక్తికి తాను చేతిని చాచిన వెంటనే, ఆ జీవిని అక్కడే అణచివేయగలిగినటువంటి అతీంద్రియ శక్తి ఉండాలి. గతంలో అంతకన్నా శక్తివంతమైన “ఆత్మను పట్టుకొనే గొప్ప పద్ధతి” అనే విధానం ఉండేది, దానిని ఉపయోగించాలి. అది ఒక వ్యక్తిలో ఉన్న ప్రాథమిక ఆత్మను బయటకు తియ్యగలుగుతుంది, తక్షణమే అతడు కదలికను కోల్పోతాడు. ఈ అతీంద్రియ శక్తికి ఒక ప్రత్యేకమైన ప్రయోజనం ఉంది, మేము ఆ జీవిని పట్టుకునే లక్ష్యంతో దానిని ప్రయోగిస్తాం. సున్ వుకోంగ్ (10) చాలా పెద్ద ఆకారం కలిగి ఉన్నప్పటికీ, తథాగతుడు తన భిక్షాపాత్రతో దానిని మూసేసి, అతిచిన్న ప్రాణిగా మార్చి వేయగలడని ప్రతివారికి తెలుసు. ఈ అతీంద్రియ శక్తికి ఇటువంటి ప్రభావం ఉంటుంది. ఆ జీవి ఎంత పెద్దదైనా, చిన్నదైనా చేతితో పట్టుకున్న వెంటనే అతి చిన్నదిగా మారిపోతుంది.

దీనికితోడు, ఒక వ్యక్తి ఒక రోగి శరీరంలోకి చేతితో తవ్వి ఏదైనా బయటకు తియ్యడాన్ని ఎవరూ అనుమతించరు. అది సామాన్య వ్యక్తుల సంఘంలో మనుషుల మనసులను అదుపు తప్పిస్తుంది, అది పూర్తిగా నిషేధితం. ఒకవేళ సాధ్యపడినా, దాన్ని అలా చెయ్యలేరు. ఒక వ్యక్తి తవ్వుతున్న చెయ్యి మరొక పరిమాణంలో ఉండే చెయ్యి. ఎవరికైనా హృద్రోగం ఉందనుకోండి. ఈ చెయ్యి ఆ జీవిని పట్టుకోవడానికి ఆ గుండె వైపు కదిలినప్పుడు, మరొక పరిమాణంలో ఉన్న ఆ చెయ్యి ఆ శరీరం లోపల కదులుతుంది. ఆ జీవి తక్షణమే దొరికిపోతుంది. బయట ఉన్న మీ చెయ్యి దాన్ని ఒడిసిపట్టుకున్న వెంటనే, రెండు చేతులూ కలిసి మూసుకొని దాన్ని పట్టుకుంటాయి. అది చాలా విషపూరితం, కొన్నిసార్లు మీ చేతులలో కదులుతూ రంధ్రం చెయ్యాలని ప్రయత్నిస్తూ ఉంటుంది, మరికొన్నిసార్లు కరవాలని ప్రయత్నిస్తుంది, అరుస్తుంది. మీ చేతులలో ఉన్నప్పుడు చిన్నదిగా అనిపించినా, మీరు దానిని మీ చేతుల

నించి వదిలిపెడితే చాలా పెద్దది అవుతుంది. అది ఎవరు పడితే వారు తాకగలిగినది కాదు. ఆ అతీంద్రియ శక్తి లేనిదే ఎవ్వరైనా దాన్ని ఎంత మాత్రమూ తాకలేరు. కొందరు సాధారణ ప్రజలు ఊహించేదానికి అది చాలా విరుద్ధంగా ఉంటుంది.

అయితే గతంలో ఎప్పుడూ ఈ చీ గోంగ్ చికిత్స పద్ధతి అమలులో ఉండేది, కాబట్టి బహుశా భవిష్యత్తులో అది అమలులో ఉండేందుకు అనుమతి ఉండొచ్చు. అయితే దానికి ఒక నిబంధన ఉండాలి: ఆ వ్యక్తి ఒక సాధకుడై ఉండాలి. ఆధ్యాత్మిక సాధనాక్రమంలో, తన దయాగుణంచేత ఆ వ్యక్తి కొద్ది మంది మంచివారికి ఇలా చెయ్యొచ్చు. కానీ వారి కర్మను పూర్తిగా తొలగించ గలిగినంత గొప్ప పుణ్యం అతడిలో లేకపోవడంవల్ల అతడు తొలగించలేడు. అందువల్ల కష్టాలు ఇంకా మిగిలే ఉంటాయి, కానీ ఆ ప్రత్యేక వ్యాధులు మాత్రం స్వస్థపరచబడతాయి. ఒక సాధారణ చీ గోంగ్ గురువు ఆధ్యాత్మిక సాధనలో తావో స్థితిని అందుకున్నట్టివాడు కాదు. అతడు కేవలం వ్యాధులను దూరం చెయ్యగలడు లేదా బహుశా వాటిని మార్చగలడు. అతడు ఆ వ్యాధులను ఇతర దురదృష్టకర సంఘటనలుగా మార్చగలిగి ఉండొచ్చు, లేదా అతడికే బహుశా ఈ వాయిదా వేసే ప్రక్రియ గురించి తెలిసి ఉండకపోవచ్చు. అతడు చేసే సాధనలో సహాయక చైతన్యపు ఆధ్యాత్మిక సాధన చేసినట్లైతే ఆ పనిని అతడి సహాయక చైతన్యమే చేస్తుంది. కొన్ని సాధనలలోని సాధకులు చాలా పేరు పొందినట్లే పైకి కనిపిస్తారు. లబ్ధప్రతిష్టులైన చీ గోంగ్ గురువు లలో అనేకులకు గోంగ్ ఉండదు, ఎందుకంటే, వారి గోంగ్ వారి సహాయక ఆత్మల శరీరాలలో పెరుగుతూ ఉంటుంది. అంటే, కొంతమంది అదే స్థాయిలో కొనసాగుతూ ఉంటారు, అందువల్ల వారికి తమ ఆధ్యాత్మిక సాధనాక్రమంలో ఇటువంటి పనులు చేయడానికి అనుమతి ఉంటుంది. వారు ఒక దశాబ్దం లేదా అనేక దశాబ్దాలుగా ఆధ్యాత్మిక సాధన చేస్తున్నారు, అయినా ఈ స్థాయిని దాటి పైకి వెళ్ళలేకపోతున్నారు. కాబట్టి వారి జీవితకాలమంతా రోగులను చూస్తూనే ఉంటారు. వారు ఈ స్థాయిలోనే ఉండిపోవడంవల్ల, అలా చెయ్య డానికి అనుమతింపబడుతుంది. ఫాలున్ దాఫా శిష్యులు రోగులను చూడడం అన్నది పూర్తిగా నిషిద్ధం. మీరు ఒక రోగికి ఈ పుస్తకం చదివి వినిపించొచ్చు.

ఆ రోగి దానిని అంగీకరిస్తే, అది వారి వ్యాధిని స్వస్థపరచగలదు. కానీ ఫలితాలు ఆయా వ్యక్తుల కర్మను బట్టి, వేరుగా ఉంటాయి.

## ఆస్పత్రిలో చికిత్స, చీ గోంగ్ చికిత్స

ఆసుపత్రిలో చేసే చికిత్సకు, చీ గోంగ్ చికిత్సకు మధ్య ఉండే సంబంధం గురించి చెప్పుకుందాం. పాశ్చాత్య వైద్యం నేర్చిన వైద్యులు చీ గోంగ్‌ను గుర్తించరు, వారిలో అధికసంఖ్యాకులు ఇంతేనని చెప్పుకోవచ్చు. చీ గోంగ్‌తోనే వ్యాధి నిర్మూలన జరిగిపోతే ఇక ఆస్పత్రుల అవసరం ఏముంది అనేది వారి అభిప్రాయం. “మా ఆస్పత్రుల స్థానాన్ని మీరు తీసుకోవాలి! ఇంజెక్షన్లు, మందులు, ఆస్పత్రిలో ఉండడంవంటివాటి జోలికి పోకుండా, ఒక్క చేతితో వ్యాధినిర్మూలన చెయ్యగలిగితే మా స్థానంలో, మా ఆస్పత్రుల స్థానంలోనూ మీరే ఉంటే బాగుంటుంది కదా?” ఈ ప్రతిపాదన సహేతుకమూ కాదు, అర్థవంతమూ కాదు; కొంతమందికి చీ గోంగ్ అంటే తెలియదు. నిజానికి చీ గోంగ్ చికిత్స సామాన్య వ్యక్తుల చికిత్సలవలె ఉండదు, ఎందుకంటే అది సామాన్య వ్యక్తుల నైపుణ్యం కాదు – అది మానవాతీతం అయినది. కాబట్టి అటువంటి అతీంద్రియ శక్తి కారణంగా సామాన్య మానవ సంఘంలో పెద్ద ఎత్తున అంతరాయం కలగడం అన్నది ఎలా అనుమతింపబడుతుంది? ఒక బుద్ధుడు అపరిమితమైన శక్తి కలిగి ఉంటాడు, ఒక్కసారి చేతిని ఊపి సమస్త మానవుల వ్యాధులను తుడిచివేయగలడు. అలా ఎందుకు చెయ్యడు? అదీకాక, బుద్ధులు కూడా అసంఖ్యాకంగా ఉన్నారు. మరి వారు మీ వ్యాధులను స్వస్థపరచి తమ కరుణను ఎందుకు చూపించరు? ఎందుకంటే, సామాన్య మానవ సంఘం ఇలా ఉండాలనే ఉద్దేశింపబడి ఉంది. పుట్టుక, వృద్ధాప్యం, వ్యాధి, మరణం కేవలం అటువంటి స్థితులు. వాటన్నిటికీ కర్మ సంబంధ కారణా లుంటాయి, కర్మను తీర్చుకోవడానికి జరుగుతుంటాయి. మీకు ఋణం అంటూ ఉంటే, మీరు దాన్ని తిరిగి చెల్లించి తీరాలి.

మీరు ఒక వ్యక్తి యొక్క వ్యాధిని స్వస్థపరిస్తే, అతడు తన కర్మ సంబంధిత ఋణాలను తీర్చకుండానే చెడ్డ పనులు చెయ్యొచ్చు, అందువల్ల, మీరు ఆ నియమాన్ని ఉల్లంఘించినట్లే అవుతుంది. అది ఎలా సాధ్యం? ఆధ్యాత్మిక

సాధన చేసే వ్యక్తిగా ఈ సమస్యను సంపూర్ణంగా పరిష్కరించగల శక్తి లేనప్పుడు, దయాగుణం చేత ఒక రోగికి చికిత్స చేయడానికి మీకు అనుమతి ఉంటుంది. మీలోని దయాగుణం వెలికిరావడంచేత మీరు అలా చెయ్యడానికి అనుమతింపబడ్డారు. కానీ మీరు ఈ సమస్యను నిజంగానే పూర్తిగా పరిష్కరించగలిగినా, పెద్ద ఎత్తున అలా చెయ్యడానికి మీకు అనుమతి ఉండదు. ఆ సందర్భంలో, మీరు సామాన్య మానవసంఘాన్ని తీవ్రంగా అవమానపరిచినట్లే అవుతుంది – అది అనుమతింపబడదు. అందువల్ల, సామాన్య మానవుల ఆస్పత్రుల స్థానంలో చీ గోంగ్‌ను ఉంచడం పనికిరాదు, చీ గోంగ్ మానవాతీతమైన ఒక ఫా.

ఒకవేళ చైనాలో చీ గోంగ్ ఆస్పత్రులు ఏర్పరచడానికి అనుమతింపబడి, ప్రఖ్యాతి చెందిన అనేకమంది చీ గోంగ్ గురువులు చికిత్స చెయ్యడానికి ముందుకు వస్తే ఎలా ఉంటుందని మీరు భావిస్తున్నారు? అది అనుమతింప బడదు, ఎందుకంటే, చీ గోంగ్ వైద్యశాలలు, చీ గోంగ్ చికిత్సా కేంద్రాలు, చీ గోంగ్ ఆరోగ్యకేంద్రాలు, చీ గోంగ్ చికిత్స చేసే విలాసవంతమైన ప్రదేశాలు స్థాపించబడితే చీ గోంగ్ గురువుల చికిత్సాసామర్థ్యం గణనీయంగా తగ్గిపోయి, వెంటనే ఆ చికిత్సల వలన మంచి ఫలితాలు ఉండవు. అలా ఎందుకని? వారు ఈ పనిని సామాన్య వ్యక్తుల మధ్య చెయ్యవలసి ఉంటుంది కాబట్టి, వారి ఫా సామాన్య వ్యక్తులకు తగిన స్థాయిలోనే ఉండాలి. వారు సామాన్య వ్యక్తుల స్థితిగతులతో సమానమైన స్థాయిలో ఉండాలి. వారి చికిత్సా సామర్థ్యం ఒక ఆస్పత్రిలో చేసే చికిత్సకు సమానమై ఉండాలి. అందువల్ల వారు చేసే చికిత్సలు సరిగ్గా పని చెయ్యవు, వారికి కూడా ఒక వ్యాధినిర్మూలన చెయ్యడంకోసం, ఆస్పత్రులలో చేసినట్లు పలుమార్లు చికిత్సలు నిర్వహించవలసిన అవసరం కలుగుతుంది. సాధారణంగా ఇలా జరుగుతుంది.

చీ గోంగ్ ఆస్పత్రులున్నా, లేకపోయినా చీ గోంగ్‌కు వ్యాధులనించి స్వస్థపరిచే శక్తి ఉందన్న విషయాన్ని ఎవ్వరూ నిరాకరించలేరు. ఎంతోకాలంగా ప్రజలలో చీ గోంగ్ ప్రాచుర్యంలో ఉంది. ఈ సాధనతో అనేకమంది వ్యాధి నిర్మూలన, దేహపుష్టిని నిలుపుకోవడం అన్న లక్ష్యాన్ని సాధించారు. ఆ వ్యాధిని చీ గోంగ్ గురువు పోగొట్టినా, లేదా ఏ రకంగా చికిత్స జరిగి ఉన్నా, మొత్తానికి

ఆ వ్యాధి అయితే ఇప్పుడు మాయమైంది. మరొక రకంగా చెప్పాలంటే, చీ గోంగ్‌కు వ్యాధిని పోగొట్టే శక్తి ఉన్న మాటని ఎవరూ కాదనలేరు. చీ గోంగ్ గురువులను సంప్రదించిన వారిలో అధికులు ఏ ఆస్పత్రిలోనూ చికిత్స దొరకనంతటి కష్టతరమూ, క్లిష్టతరమూ అయిన వ్యాధులు కలిగినవారే. తమ అదృష్టాన్ని పరీక్షించుకునే ప్రయత్నంలో వారు ఒకసారి చీ గోంగ్ గురువులను సంప్రదిస్తున్నారు, చివరకు వారికి వ్యాధినిర్మూలన జరుగుతున్నది. ఆస్పత్రులలో వ్యాధినిర్మూలన జరిగినవారు చీ గోంగ్ గురువుల దగ్గరకు వెళ్ళరు. ప్రత్యేకించి, మొదట్లో ప్రజలు ఈ విధంగా అనుకున్నారు. కనుక, చీ గోంగ్‌కు వ్యాధి నిర్మూలన చేసే శక్తి ఉంది, ఉన్న వ్యత్యాసమల్లా సామాన్య మానవసంఘంలో మిగతా విషయాలను అనువర్తించినట్లు దానిని ఉపయోగించడం కుదరదు. పెద్ద ఎత్తున ఉపయోగించడం పూర్తిగా నిషిద్ధం కాగా, చిన్నపాటి పరిధిలో ఉపయోగించడమూ, ఇతరులను ప్రభావితం చెయ్యని విధంగా సాధనను చేసుకోవడం అనుమతింపబడింది. కానీ అది వ్యాధిని పూర్తిగా నిర్మూలించదు– ఇది కూడా నిశ్చయం. ఒక వ్యక్తి యొక్క వ్యాధినిర్మూలనకు స్వయంగా చీ గోంగ్ ను సాధన చెయ్యడమే ఉత్తమమైన మార్గం.

ఆసుపత్రులలో వ్యాధులను నిర్మూలన చెయ్యలేరని, అక్కడి చికిత్సల సామర్థ్యం అంతంతమాత్రమే అని కొందరు చీ గోంగ్ గురువులు వాదిస్తారు. దీని గురించి మనం ఏమనాలి? ఇది అనేక అంశాలకు సంబంధించిన విషయాలను కూడుకొని ఉంటుంది. నా దృష్టిలో, ముఖ్యమైనది ఏమిటంటే, మానవుల విలువల ప్రమాణాలు అత్యల్ప స్థాయికి పడిపోయాయి, అది ఆసుపత్రులలో నివారించలేని రకరకాల వింత రోగాలకు దారితీసింది. మందుల వల్ల కూడా ఏ ప్రయోజనం లేదు. ఎన్నో నకిలీ మందులు కూడా ఉంటున్నాయి. ఇదంతా, మానవసంఘం చాలా అవినీతిమయం కావటం వల్ల జరుగుతున్నది. దీనికై ఏ ఒక్కరూ ఇతరులను నిందించకూడదు, ఎందుకంటే, ప్రతివారూ అగ్నిలో ఆజ్యం పోసినవారే. ఫలితంగా, ప్రతివారూ ఆధ్యాత్మిక సాధనలో కష్టాలను ఎదుర్కొంటారు.

కొందరికి నిజంగా అనారోగ్యం ఉన్నా, ఆ వ్యాధులు ఆస్పత్రిలో కనుగొనబడవు. కొందరిలో అంతవరకూ ఎన్నడూ చూడని వ్యాధి లక్షణాలు ఉండడం

వల్ల, వారిలో పేరు తెలియని వ్యాధులను గుర్తించడం జరుగుతున్నది. ఆస్పత్రులలో వాటిని “ఆధునిక వ్యాధులు” అని పిలుస్తున్నారు. ఆస్పత్రులలో వ్యాధులను స్వస్థపరచగలరా? తప్పకుండా చెయ్యగలరు. లేకపోతే, ప్రజలు వాటి మీద నమ్మకంతో చికిత్సలకోసం ఎందుకు వెళ్తారు? ఆస్పత్రులలో వ్యాధులు స్వస్థపరచబడతాయి గానీ, వ్యాధులు మానవాతీతమైనవి అయి ఉండగా వాటి చికిత్సాపద్ధతులు మాత్రం సామాన్య వ్యక్తుల స్థాయికి చెందినవై ఉన్నాయి. కొన్ని వ్యాధులు చాలా తీవ్రమైనవి, అందువల్ల ఒక వ్యక్తికి అటువంటి వ్యాధి ఉన్న పక్షంలో ఆస్పత్రులలో దానికి ప్రాథమిక దశలోనే చికిత్స అవసరం అవుతుంది. ఒకవేళ వ్యాధి తీవ్రతరం అయితే ఆస్పత్రులవల్ల ఉపయోగం ఉండదు, ఎందుకంటే అధిక మోతాదులలో ఇచ్చిన మందులు ఆ వ్యక్తి శరీరాన్ని విషపూరితంగా మార్చవచ్చు. ప్రస్తుతం వైద్య చికిత్సలు మన వైజ్ఞానికశాస్త్ర, సాంకేతికశాస్త్ర రంగాలు ఉన్న స్థాయిలోనే ఉన్నాయి – అవన్నీ సామాన్య వ్యక్తుల స్థాయిలోనే ఉన్నాయి. అందువల్ల, వాటి చికిత్సా సామర్థ్యం ఆ స్థాయిలోనే ఉంటుంది. ఇక్కడ స్పష్టం చెయ్యవలసిన అంశం ఏమిటంటే, సగటు చీ గోంగ్ చికిత్సలైనా, ఆస్పత్రుల చికిత్సలైనా ఆయా వ్యాధుల మూలకారణాలైన ఆయా కష్టాలను ఆ వ్యక్తి యొక్క రెండవ సగం జీవితకాలానికో, తదుపరి కాలానికి వాయిదా వెయ్యడం మాత్రమే జరుగుతుంది. అతడి కర్మను తొలగించడం ఏ మాత్రం జరగదు.

చైనీయ వైద్యం గురించి చెప్పుకుందాం. చైనీయ వైద్యం చీ గోంగ్ చికిత్సకు చాలా దగ్గరగా ఉంటుంది. ప్రాచీన చైనాలో సున్ మియో, హ్వా త్వో, లీ ష్రజన్, బియాన్ చ్యూ (11) వంటి గొప్ప వైద్యులు ఉండేవారు, దాదాపుగా అందరు చైనీయ వైద్యులకు వాస్తవంగా అతీంద్రియ శక్తులుండేవి. ఆనాడు వారికి ఉన్నటువంటి అతీంద్రియశక్తులన్నీ వైద్య పాఠ్యగ్రంథాలలో పొందుపరచబడ్డాయి. అయినప్పటికీ ఈ అత్యుత్తమ భాగాలు తరచుగా విమర్శలకు గురి అవుతున్నాయి. చైనీయ వైద్యంలో వారసత్వంగా లభించినది మందులు వాడవలసిన విధానపత్రాలు లేదా పరిశోధనల ద్వారా కలిగిన అనుభవాలు మాత్రమే. ప్రాచీన చైనీయ వైద్యం చాలా ముందంజలో ఉండినది, దాని యొక్క అభివృద్ధి ప్రస్తుత వైద్యవిజ్ఞానానికి అతీతంగా విస్తరించి ఉండేది.

ఆధునిక వైద్యం మానవదేహంలోని అంతర్భాగాన్ని పరీక్షించే సిటి స్కాన్స్, అల్ట్రాసౌండ్, ఫోటోగ్రఫీ, ఎక్స్-రే మొదలైనవాటితో ఎంతో ముందంజలో ఉందని కొంతమంది భావించవచ్చు. ఆధునిక పరికరాలు ఎంత అభివృద్ధిలో ఉన్నా, నా దృష్టిలో అవన్నీ ప్రాచీన చైనీయ వైద్యం ముందు దిగదుడుపే.

త్సావొ త్సావొ (12) మెదడులోని కణితిని హ్వా టువా చూసి శస్త్రచికిత్స చెయ్యాలని భావించాడు. త్సావొ త్సావొ తనను హ్వా టువా హత్య చెయ్యాలని ప్రయత్నిస్తున్నట్లు అపార్థం చేసుకొని, హ్వా టువాను చెరసాలలో పెట్టించాడు. ఫలితంగా హ్వా టువా చెరసాలలో మరణించాడు. త్సావొ త్సావొకు వ్యాధి తిరగబెట్టినప్పుడు, హ్వా టువాను గుర్తుచేసుకొని, అతడికోసం వెతికాడు, కానీ అప్పటికే హ్వా టువా మరణించాడు. తరవాత త్సావొ త్సావొ నిజంగా ఆ వ్యాధి కారణంగానే మరణించాడు. హ్వా టువా ఎలా తెలుసుకున్నాడు? అతడు దానిని చూడగలిగాడు. ఇదీ గతంలో గొప్ప వైద్యులందరికీ ఉండిన మానవ ఇంద్రియాతీత శక్తి. దివ్యనేత్రం తెరుచుకున్న తరవాత, ఒక వ్యక్తి ఒక్కవైపునించే మానవదేహంలో నలువైపులా ఏమున్నదో ఒకేసారి చూడగలడు. ముందువైపునించి వెనకవైపుకు, కుడి, ఎడమ వైపులకు చూడగలుగుతాడు. అతడు శరీరాన్ని ఒక పొర తరవాత మరొకటిగా లేదా ఈ పరిమాణానికి ఆవల ఆ వ్యాధికి ఉన్న మూలకారణాన్ని చూడగలుగుతాడు. ఆధునిక వైద్య విధానాలు ఇలా చెయ్యగలవా? అది చాలా దూరం. దానికి మరొక వెయ్యి సంవత్సరాలు పడుతుంది! సిటి స్కాన్‌లు, అల్ట్రాసౌండ్ పరీక్షలు, ఎక్స్‌రేలు కూడా మానవదేహం లోపల పరీక్షలు చెయ్యగలవు గానీ ఆ పరికరాలు అతిబరువుగా ఉండి, అంత పెద్ద వస్తువులు ఒకచోటి నించి మరొకచోటికి తరలించడం కష్టం, విద్యుచ్ఛక్తి లేనిదే అవి పని కూడా చేయవు. ఈ దివ్యనేత్రం ఒక వ్యక్తి వెళ్ళినచోటికల్లా వెళ్ళనూ గలదు, దానికి విద్యుచ్ఛక్తితో పని కూడా లేదు. రెండింటిని పోల్చడం ఎలా?

కొంతమంది, ఆధునిక వైద్యం ఎంత అద్భుతమైనదో చెప్తూ ఉంటారు. అది అంత అద్భుతమైనది కాకపోవచ్చని నేను అంటాను, ఎందుకంటే ప్రాచీన చైనీయ మూలికలు ఉపయోగించినప్పుడు, అవి నిజంగా వ్యాధులను స్వస్థ పరిచేవి. అనేక విషయాలు ఈ కాలానికి అందించబడి ఉండకపోవచ్చు గానీ,

పూర్తిగా కనుమరుగు కాలేదు, ఇంకా ప్రజల చేత ఉపయోగింపబడుతున్నాయి. నేను చీ చీ హార్(13)లో తరగతిని నిర్వహించినప్పుడు, ఒక వ్యక్తి ఒక స్టాల్‌లో ప్రజలకు దంతాలను తొలగిస్తూ ఉండడం చూశాను. అతడు దక్షిణదేశం నించి వచ్చినవాడని ఎవ్వరైనా సులభంగా చెప్పగలరు, ఎందుకంటే, అతడు ఈశాన్య వాసుల వేషధారణలో లేడు. అతడు తన దగ్గరికి వచ్చినవారెవ్వరినీ నిరాకరించేవాడు కాదు. ఎవరు వచ్చినా వాళ్ళకు దంతం తొలగిస్తూ ఉండే వాడు, అతడి పక్కన దంతాల కుప్ప ఉండేది. అతడు అక్కడ ఉన్నది దంతాలు తొలగించడానికై కాదు, తన దగ్గర ద్రవ రూపంలో ఉన్న మందును అమ్ము కోవడానికే. ఆ మందు దట్టమైన పసుపు రంగు పొగను వెలువరించేది. దంతాన్ని లాగుతున్నప్పుడు అతడు ఆ మందు సీసాను తెరచి, పుచ్చుపన్ను ఉన్నచోట ఆ వ్యక్తి చెంపకు దానిని పులిమేవాడు. ఆ రోగిని ఆ పసుపు రంగు మందునించి వెలువడిన పొగను ముక్కు ద్వారా పీల్చమని చెప్పేవాడు, ఆ మందు ఎక్కువగా ఖర్చు అయ్యేది కాదు. మందుసీసాను మూత బిగించి పక్కన పెట్టేసేవాడు. అతడు తన జేబునించి ఒక అగ్గిపుల్లను తీసేవాడు. తన మందును గురించి చెప్తున్నప్పుడు, ఆ అగ్గిపుల్లతో పుచ్చుపన్నును తోసేవాడు, అది ఊడి వచ్చేసేది. నొప్పి ఉండేది కాదు. ఆ పంటికి కొంచెం రక్తం మరకలు ఉండేవి తప్ప రక్తస్రావం ఉండేది కాదు. అందరూ ఇది ఆలోచించండి: చాలా బలంతో ఉపయోగిస్తే ఒక అగ్గిపుల్ల విరిగిపోతుంది, కానీ అతడు కొద్దిగా తాకించి ఒక పంటిని లాగివేసేవాడు.

పాశ్చాత్య వైద్య ఆధునిక పరికరాలు అందుకోలేనంతటి కొన్ని గొప్ప విషయాలు ఇప్పటికీ చైనాలో అందించబడుతున్నాయని నేను చెప్పాను. ఎవరి చికిత్స మెరుగ్గా ఉందో చూద్దాము. ఆ వ్యక్తి చేతిలోని అగ్గిపుల్ల ఒక పంటిని లాగివేయగలదు. పాశ్చాత్య వైద్యం చేసే వైద్యుడైతే రోగికి పన్ను పీకాలంటే, ముందుగా అక్కడా, ఇక్కడా మత్తుకోసం ఇంజెక్షన్లు ఇస్తాడు. ఇంజెక్షన్లు బాధ కలిగిస్తాయి, మత్తు ఎక్కేవరకు వేచి ఉండవలసి ఉంటుంది. అప్పుడు వైద్యుడు పట్టకారుతో ఆ పంటిని తీస్తాడు. చాలా సమయం, శ్రమ తరవాత, ఆ వైద్యుడు ఒకవేళ అజాగ్రత్తగా ఉంటే, పంటి చిగురులో ఉన్న పంటి మొదలు విరిగి పోవచ్చు. అప్పుడు ఆ వైద్యుడు ఒక సుత్తిని, రంధ్రం చేసే పరికరాన్ని తీసుకొని,

పంటి కోసం తవ్వుతాడు, దానివల్ల రోగికి భయంతో, గాభరాతో గుండెదడ రావచ్చు. తరవాత తవ్వడానికి మరింత సునిశితమైన పరికరం ఉపయోగించ బడుతుంది. కొంతమందికి ఎంత బాధ కలుగుతుందంటే, వారు గంతులే వేసేస్తారు. ఆ పంటినించి చాలా రక్తం ఊరుతూ ఉండి, రోగి చాలాసేపు దానిని ఉమ్మేస్తూనే ఉంటాడు. ఎవరి చికిత్స మెరుగ్గా ఉందంటారు మీరు? ఎవరిది అభివృద్ధి చెందిన పద్ధతి? మనం కేవలం పరికరాల రూపం మాత్రమే కాక, వాటి ప్రభావం కూడా చూడాలి. ప్రాచీన చైనా వైద్యం చాలా అభివృద్ధి చెంది ఉండేది, నేటి పాశ్చాత్య వైద్యం రాబోయే అనేక సంవత్సరాలకు కూడా ఆ స్థాయికి చేరుకోవడం సాధ్యం కాదు.

ప్రాచీన చైనా విజ్ఞానశాస్త్రం, మనం పశ్చిమదేశాలనించి నేర్చుకున్న ప్రస్తుత విజ్ఞానశాస్త్రానికి భిన్నంగా ఉంటుంది, ఎందుకంటే, ఇది పూర్తిగా భిన్నమైన స్థితిని తీసుకువచ్చే మరొక దారికి మళ్ళింది. అందువల్ల, మనం ప్రస్తుతం విషయాలను అర్థం చేసుకునే విధానంలో, ప్రాచీన చైనాలో ఉన్న విజ్ఞాన, సాంకేతిక శాస్త్రాలను అర్థం చేసుకోలేం. ప్రాచీన చైనా విజ్ఞానశాస్త్రం నేరుగా మానవదేహం, జీవితం, విశ్వముల మీద దృష్టి కేంద్రీకరించిన కారణంగా, అది భిన్నమార్గాన్ని అనుసరించింది. ఆ కాలంలో, విద్యార్థులు విద్యాలయానికి వెళ్ళినప్పుడు, చక్కని భంగిమలో కూర్చొని ధ్యానం చేయడాన్ని అభ్యసించేవారు. వారు తమ కుంచె కలాలను అందుకున్నప్పుడు, తమ శ్వాసను, చీని క్రమబద్ధం చేసుకునేవారు. అన్ని వృత్తులవారు, మనసును శూన్యంగా చేసుకొని శ్వాసను క్రమబద్ధం చేసుకోవాలనే పద్ధతిని నమ్మేవారు, ఎందుకంటే, సమాజం అంతటా ఇదే స్థితి ఉండేది.

ఎవరో : "మనం ప్రాచీన చైనా విజ్ఞానశాస్త్రాన్నే అనుసరించి ఉన్నట్లైతే, కార్లూ, రైళ్ళూ ఉండేవా? ఈనాడు మనకు ఉన్న ఆధునికీకరణ ఉండేదా?" అన్నారు. ఇప్పటి పరిసరాలలో మీకున్న దృక్పథంతో మరొక రకమైన పరిస్థితులను అర్థం చేసుకోలేరని నేను అంటాను. మీ ఆలోచనావిధానంలో ఒక విప్లవం రావాలి. టెలివిజన్ సెట్లు లేకుండా, ప్రజలు వాటిని తమ నుదురు భాగంలోనే కలిగి ఉండి, తాము చూడగోరిన ఏ విషయాన్నైనా చూడగలిగి ఉండేవారు. వారికి అతీంద్రియ శక్తులు ఉండేవి. రైళ్ళూ, విమానాలూ

లేకుండానే, ప్రజలు తాము కూర్చున్న చోటునించే ఎలివేటర్లు ఉపయోగించకుండా, గాలిలోకి తేలగలిగి ఉండేవారు, అది సంఘం ప్రగతిలో, భిన్న స్థితిని తీసుకొస్తుంది. ఎందుకంటే, అది ఈ చట్రానికే పరిమితమై ఉండవలసిన అవసరం లేదు. గ్రహాంతరవాసుల ఎగిరే పళ్ళాలు, ఊహించలేని వేగంతో ముందుకు, వెనకకు ప్రయాణించగలవు, అవి పెద్దవిగానూ, చిన్నవిగానూ మారగలవు. అవి మరొక రకమైన ప్రత్యామ్నాయ అభివృద్ధి పద్ధతిని అనుసరించాయి, అది మరొక వైజ్ఞానిక మార్గం.

* * * *

**అర్థములు:**

1. హున్ – బౌద్ధమతంలో నిషేధించబడిన ఆహారం.
2. జీ గోంగ్ – దక్షిణ సోంగ్ వంశంలోని ప్రసిద్ధ బౌద్ధ భిక్షువు.
3. గ్వాంగ్ డాంగ్, గ్వాంగ్ జీ – దక్షిణ చైనాలోని రెండు రాష్ట్రాలు.
4. ఇన్వెస్టిచర్ ఆఫ్ ద గాడ్స్ – చైనా కాల్పనిక సాహిత్యంలోని పురాణ గ్రంథం.
5. షున్ గోంగ్ బావ్ – ఇన్వెస్టిచర్ ఆఫ్ ద గాడ్స్‌లోని అసూయాగ్రస్త పాత్ర.
6. జ్యాంగ్ బ్యా – ఇన్వెస్టిచర్ ఆఫ్ ద గాడ్స్‌లోని ఒక పాత్ర.
7. మూజ్యెన్ ల్యెన్ – శాక్యముని బుద్ధుని ప్రధాన పదిమంది శిష్యులలో ఒకరు.
8. ల్యెన్ హ్వాజ్ – శాక్యముని బుద్ధుని పదిమంది ప్రధాన శిష్యురాండ్రలో ఒకరు.
9. ఉహ్ మే పర్వతం – ఒక బావి ఉన్న లింగ్ యీన్ మందిరానికి దాదాపు వెయ్యి మైళ్ళ దూరంలో ఉన్న పర్వతం.
10. సున్ వుకోంగ్ – “వానర రాజు”గా కూడా చెప్పబడింది, జర్నీ టు ద వెస్ట్ అన్న చైనా పురాణ గ్రంథంలోని ఒక పాత్ర.
11. సున్ మియో – హ్వ త్వో, లీ ష్రజన్, బియాన్ చ్యూ – చైనీయ వైద్యశాస్త్రంలోని ప్రసిద్ధ వైద్యులు.
12. త్సావొ త్సావొ – మూడు రాజ్యాల (క్రీ.శ.220–265)లో ఒకదానికి చక్రవర్తి.
13. చీ చీ హార్ – ఈశాన్య చైనాలోని ఒక నగరం.

* * * *

# ఎనిమిదవ ఉపన్యాసము

## బీగూ (1)

కొందరు బీగూ ప్రసక్తి తెచ్చారు. బీగూ అన్న విషయం ఉంది. ఇది సాధకుల సమాజంలోనేకాక, మన సమస్త మానవ సంఘంలోని చెప్పుకోదగినంత మంది ప్రజలలో ఉంది. కొంతమంది సంవత్సరాల తరబడి, ఒక దశాబ్దం పైగా ఏమీ తాగకుండా, తినకుండా ఉంటారు, అయినా వారు చాలా చక్కగా జీవిస్తుంటారు. బీగూ ఒక నిర్దిష్ట స్థాయికి సూచికగా కొందరు చెప్తూండగా, మరికొందరు దానిని శరీర శుద్ధికి గుర్తుగా భావిస్తారు. కొందరు దానిని ఒక ఉన్నతస్థాయి ఆధ్యాత్మిక ప్రక్రియగా కూడా చెప్తారు.

నిజానికి అది పైన చెప్పిన వాటిలో ఏదీ కాదు. మరి అది ఏమిటి? నిజానికి బీగూ అన్నది ఒక ప్రత్యేక వాతావరణంలోని ఒక ప్రత్యేకమైన సాధనా పద్ధతిని సూచిస్తుంది. అది ఏ పరిస్థితిలో ఉపయోగింపబడుతుంది? ప్రాచీన చైనాలో, మతాలన్నవి స్థాపింపబడక ముందు, అనేకమంది సాధకులు మానవ నివాసాలకు దూరంగా మారుమూల పర్వతాలలో లేదా గుహలలో రహస్య సాధన లేదా ఏకాంత సాధన అన్న పద్ధతిని ఉపయోగించేవారు. ఈ మార్గాన్ని ఎన్నుకున్నప్పుడు, ఆహార సదుపాయం సమకూర్చుకోవడం అన్న విషయం తలెత్తుతుంది. ఒక వ్యక్తి బీగూ పద్ధతిని పాటించకపోతే అతడు ఆధ్యాత్మిక సాధనను ఏమాత్రమూ కొనసాగించలేక ఆకలి, దప్పులతో మరణిస్తాడు. నేను ఫా బోధించడానికి చాంగ్ చింగ్ నించి వుహాన్‌కు వెళ్ళాను, యాంగ్ జి నదికి తూర్పువైపుకు వెళ్ళే పడవ ఎక్కాను. పర్వతాల నడుమ శ్రేణులలోని త్రీ గోర్జెస్‌కి రెండువైపులా గుహలను చూశాను; అనేక ప్రఖ్యాత పర్వతాలలో కూడా అవి ఉంటాయి. గతంలో, ఒక తాడు సాయంతో దానిలోకి ఎక్కిన సాధకుడు ఆ గుహలో సాధన చేసుకోవడానికి ఆ త్రాటిని కత్తిరించేసేవాడు. ఆ వ్యక్తి తన

ఆధ్యాత్మిక సాధనలో సఫలుడు కాలేని పక్షంలో, ఆ లోపలే చనిపోయేవాడు. ఆహారం, నీరు లేకుండా, అటువంటి అతి ప్రత్యేక పరిస్థితిలో అతడు ఈ విశేష ఆధ్యాత్మిక సాధనకు పూనుకునేవాడు.

అనేక సాధనలు తరతరాలుగా ఇటువంటి వారసత్వ ప్రక్రియకు లోనైనాయి, వాటిలో బీగూ కలిసి ఉంది. చాలా సాధనలలో బీగూ ఉండదు. ఈనాడు ప్రజలకు తెలియజేయబడిన సాధనలలో అధికభాగం బీగూను కలుపుకోలేదు. ఒక వ్యక్తి ఒకే సాధనలో ఏకాగ్రచిత్తం కలిగి ఉండాలని, మీరు మానవ సహజమైన కోరికతో ఇష్టం వచ్చినట్లు చెయ్యకూడదని నేను చెప్పాను. బీగూ మంచిదని, దాన్ని పాటించాలని మీరు అనుకోవచ్చు. మీకు అది ఎందుకు? కొందరు దానిని మంచిదని భావించి, ఉత్సుకత చూపిస్తారు, బహుశా తమ నైపుణ్యాలు ఇతరులకు ప్రదర్శించేంత గొప్పవని అనుకుంటా రేమో? అన్ని రకాల మనస్తత్వాలు కలిగిన మనుషులు ఉంటారు. ఆధ్యాత్మిక సాధనలో ఈ పద్ధతిని పాటించినప్పటికీ, ఒక వ్యక్తి ఈ దేహాన్ని నిలుపుకోవడానికి తన స్వంత శక్తిని వాడుకోవలసి వస్తుంది. అందువలన ఆ శ్రమ నిష్ప్రయోజనం. ముఖ్యంగా మతాలు స్థాపింపబడిన తరవాత మఠాలలో సమాధి స్థితిలో కూర్చున్నప్పుడో, ఏకాంత సాధన చేస్తున్నప్పుడో, ఆ చేసే వ్యక్తికి ఆహారము, టీ అందజేసేవారనే సంగతి మీకు తెలుసు. అక్కడ ఈ విషయం లేదు. విశేషించి, మనం సామాన్య మానవ సంఘం నడుమ ఆధ్యాత్మిక సాధన చేస్తాం. మీరు ఈ పద్ధతిని పాటించవలసిన అవసరం ఏమాత్రమూ లేదు. పైగా మీ సాధనా సిద్ధాంతంలో ఈ పద్ధతి లేకపోతే మీరు మీ ఇష్టానుసారం అలక్ష్యంగా ఏదీ చెయ్యకూడదు. అయితే, మీకు నిజంగానే బీగూని పాటించా లని కోరిక ఉంటే మీరు కొనసాగించవచ్చు. నాకు తెలిసినంత వరకు, సాధారణంగా ఒక గురువు తన శిష్యునికి ఒక ఉన్నతస్థాయి సాధనను బోధిస్తూ, అసలైన మార్గదర్శకత్వం చేస్తున్నప్పుడు, ఆ సాధనా సిద్ధాంతంలో బీగూ ఉంటే ఈ పరిణామం సంభవించవచ్చు. అయితే, ఎవరైనా దీనిని బహిరంగంగా ప్రచారం చెయ్యలేరు, వారు శిష్యులను రహస్యంగా లేదా ఒంటరిగా సాధన చేయడానికి దూరంగా తీసుకు వెళతారు.

ఇప్పుడు బీగూ బోధించే చీగోంగ్ గురువులు కూడా ఉన్నారు. బీగూ

జరిగిందా? నిజం చెప్పాలంటే, లేదు. ఆ పద్ధతిలో ఎవరు సఫలులు అయ్యారు? నేను చాలామంది ఆస్పత్రుల పాలవడం చూశాను, మరికొందరి జీవితాలు ప్రమాదంలో ఉండడం చూశాను. అయితే, ఈ పరిస్థితి ఎందు కుంది? బీగూ అన్న విషయం లేదా? ఉంది. ఏమైనప్పటికీ ఒక సంగతి ఉంది: మన మానవ సమాజ స్థితిని అలక్ష్యంగా అవమానించడానికి ఎవరికీ అనుమతి లేదు – దాన్ని కలతపరచడం నిషిద్ధం. సమస్త దేశంలో ఎందరికి ఆహారం, నీళ్ళు అవసరం ఉండవు అన్నమాట అటుంచి, చాంగ్ చున్ ప్రాంతంలోని ప్రజలకు తినే, త్రాగే అవసరం లేకపోతే దాని కారణంగా ఎన్నో విషయాలు సులభతరం అవుతాయని నేను అంటాను! మనం భోజనాలు వండుకోవాలనే దిగులే ఉండదు. రైతులు పొలాలలో చెమటోడ్చి శ్రమిస్తుంటారు, ఇప్పుడు ఎవరికీ తినవలసిన అవసరమే ఉండదు. అది విషయాలను సులభతరం చేస్తుంది, ఎందుకంటే, మనుషులు తినే ప్రసక్తి లేకుండా కేవలం పనే చేస్తుంటారు. అదెలా అనుమతింపబడుతుంది? అది మానవ సమాజం అవుతుందా? అది ఖచ్చితంగా నిషిద్ధం, ఎందుకంటే, అంత పెద్ద ఎత్తున సామాన్య మానవ సమాజంలో అంతరాయం కలిగించడానికి అనుమతి ఉండదు.

కొందరు చీ గోంగ్ గురువులు బీగూ బోధించినప్పుడు అనేకమంది వ్యక్తుల జీవితాలు ప్రమాదంలో పడతాయి. కొంతమంది బీగూని సాధించాలని బంధం పెంచుకుంటారు, సామాన్య మానవులు పెంచుకునే అనేక ఇతర బంధాలలాగానే ఇది కూడా ఇంకా తొలగింపబడలేదు. అటువంటి వ్యక్తికి ఏదైనా రుచికరమైన ఆహారం కనిపిస్తే, నోరూరుతుంది. ఆ కోరిక ఒకసారి ఉవ్వెత్తున కలిగినప్పుడు, అతడు దానిని అదుపులో పెట్టుకోలేక, ఆ పదార్థాన్ని తినాలని ఆత్రపడతాడు. అతడికి ఆకలి వేసినప్పుడు తినాలనుకుంటాడు, లేనట్లైతే, అతడు ఆకలిగొని ఉంటాడు. అయితే, అతడు ఒకవేళ దాన్ని తింటే వాంతి చేసుకుంటాడు. అతడు దానిని తినలేకపోవడం వలన చాలా కంగారు పడి తినడానికి భయపడతాడు. చాలామంది ఆస్పత్రి పాలవుతారు, నిజానికి అనేకమంది ప్రాణాలు ప్రమాదంలో పడతాయి. అటువంటి గందరగోళ సందర్భాలలో కొందరు నా సహాయంకోసం ప్రయత్నిస్తారు, నేను చెయ్యడానికి

సుముఖంగా లేను. కొందరు చీ గోంగ్ గురువులు బాధ్యతారహితంగా ఇటు వంటి పనులు చేస్తుంటారు. వారికోసం ఎవ్వరూ ఇటువంటి సమస్యలను పరిష్కరించడానికి ఇష్టపడరు.

మీదు మిక్కిలి, ఒకవేళ బీగూని పాటించి మీరు ఇబ్బందిలో పడితే, అది మీ యొక్క స్వంత ప్రయత్నంవల్ల కలిగినదే కాదా? ఈ విషయాలు ఉన్నాయని మేము చెప్పాము కానీ, ఇవి "ఉన్నత-స్థాయి" లేదా "ప్రత్యేక ప్రతిచర్యలు" అని చెప్పబడేవి కావు. అది కేవలం ఒక ప్రత్యేక పరిస్థితిలో ఉపయోగింపబడే సాధనాపద్ధతి మాత్రమే, కాబట్టి దానిని విస్తారంగా ప్రచారం చెయ్యకూడదు. ఎందరో వ్యక్తులు బీగూ గురించి ప్రయత్నిస్తూ, దాన్ని బీగూ అని అర్థ – బీగూ అని భిన్నస్థాయులలో గణిస్తారు. కొందరు కేవలం నీళ్ళు మాత్రమే తాగొచ్చని చెప్పగా మరికొందరు పండ్లు మాత్రమే తినొచ్చని చెప్తారు. ఇవన్నీ నకిలీ బీగూలు, కాలం గడిచినకొద్దీ అవన్నీ నిష్ఫలం అవుతాయి. అసలైన ఒక సాధకుడు నీరు, ఆహారము మాని ఒక గుహలో ఉంటాడు – అదీ నిజమైన బీగూ.

## చీని దోచుకోవడం

చీని దోచుకోవడం గురించి చెప్పినప్పుడు, కొంతమంది, పులి గురించి చెప్పినట్లు పారిపోతారు, వారు చీ గోంగ్‌ను సాధన చెయ్యడానికి భయపడి పోతారు. ఆధ్యాత్మిక సాధన వలన పిచ్చి అన్న విషయాన్ని గురించి, చీని దోచుకోవడం మొదలైన వాటి గురించి అధిక ప్రసంగాల కారణంగా సాధకుల సమాజంలో చాలామంది చీ గోంగ్ అభ్యసించడానికి, లేదా చీ గోంగ్ జోలికి వెళ్ళడానికే బెదిరిపోతారు. ఈ అభిప్రాయాల వలన కాకపోతే, బహుశా ఇంకా ఎక్కువమంది చీగోంగ్ అభ్యసించి ఉండేవారేమో? అయినప్పటికీ ప్రత్యేకంగా ఈ విషయాలను బోధిస్తున్న తక్కువ షిన్ షిన్ కలిగి ఉన్న చీ గోంగ్ గురువులు ఇంకా ఉన్నారు. అది సాధకుల సమాజాన్ని అధ్వాన్నం చేస్తున్నది. నిజానికి అది వారు వర్ణించినంత భయంకరమైనది కాదు. మీరు "మిశ్రమ ప్రాథమిక చీ", లేదా ఆ చీ, ఈ చీ అని ఎలా పిలిచినా చీ కేవలం చీ మాత్రమే అని మేము చెప్పాం. ఒక వ్యక్తి శరీరంలో ఎంతకాలం చీ ఉంటుందో, అతడు

వ్యాధినిర్మూలన, దేహపుష్టి నిలుపుకునే స్థాయిలో మాత్రమే ఉంటాడు, అతడు అప్పటికి సాధకుడు కాడు. అతడిలో చీ ఉన్నంత వరకు, అతడి శరీరం ఇంకా ఉన్నతస్థాయిలో శుద్ధి కాలేదని దాని అర్థం, అందువల్ల ఇంకా వ్యాధిగ్రస్తమైన చీని కలిగి ఉంది – అది తథ్యం. చీని దోచుకొనే వ్యక్తి కూడా చీ స్థాయిలోనే ఉన్నాడు. మన సాధకులలో అటువంటి కలుషిత చీని కోరుకునేదెవరు? చీ గోంగ్ సాధనవల్ల ప్రకాశవంతం అయ్యే అవకాశం ఉన్నా, సాధకుడు కాని వ్యక్తి శరీరంలోని చీ చాలా కలుషితమై ఉంటుంది. కాబట్టి వ్యాధిగ్రస్తమైన ప్రదేశంలో అధిక–సాంద్రత కలిగిన నల్లని పదార్థం యొక్క ఒక అతిపెద్ద గుత్తి కనిపిస్తూ ఉంటుంది. సాధన చేయడంవల్ల ఆ వ్యాధిని నిజంగా అతడు నయం చేసుకొని, దేహపుష్టిని పొందగలిగితే, అతడి చీ క్రమంగా పసుపు రంగులోకి మారుతుంది. అతడు ఇంకా సాధన చేసేకొద్దీ, ఆ వ్యాధి నిజంగా తొలగిపోయి, అతడి చీ కూడా అదృశ్యం అవుతుంది. అతడు పాల–తెలుపు గలిగిన శరీర స్థితిలోకి ప్రవేశిస్తాడు.

అంటే, ఒక వ్యక్తిలో చీ ఉంటే, అతడికి ఇంకా వ్యాధులు ఉన్నట్లే. మనం సాధకులం – సాధనలో మనకు చీతో అవసరం ఏముంది? మన శరీరాలే శుద్ధి కావలసి ఉంది. మనకు ఆ కలుషితమైన చీ ఎందుకు? నిశ్చయంగా అనవసరం. చీని కోరే వ్యక్తి ఇంకా చీ స్థాయిలోనే ఉన్నాడు. ఆ స్థాయి చీతో ఉండడంవల్ల మంచి చీకి చెడు చీకి మధ్య వ్యత్యాసం చెప్పగలిగే సామర్థ్యం లేకపోవడంవల్ల వాటిని వేరుచేసి చూడలేడు. మీ దాన్ త్యన్‌లోని చీని అతడు తొలగించలేడు, ఎందుకంటే, ఆ ప్రాథమిక చీని కేవలం ఉన్నతస్థాయి సామర్థ్యాలు ఉన్నవారే తొలగించగలరు. మీ శరీరంలోని కలుషిత చీ విషయానికి వస్తే, అతడిని దోచుకోనివ్వండి – అదేమంత గొప్ప విషయం కాదు. సాధన చేస్తున్నప్పుడు, నేను నాలో చీని నింపుకోవాలని కోరుకుంటే, ఒక్క ఆలోచనతో అతికొద్ది సమయంలో దానితో నా కడుపు నిండిపోతుంది.

తావో సిద్ధాంతంలో, త్యన్ జ్వాంగ్ (3) అన్న నిలుచుని చేసే వ్యాయామం ఉండగా, బౌద్ధ సిద్ధాంతంలో తల మీద చీని నింపుకోవడం ఉంటుంది. మీరు ప్రతిరోజూ మీలోనికి నింపుకోడానికి సరిపడినంతటి అధికంగా చీ విశ్వంలో ఉంది. తెరచుకొని ఉన్న లావో గోంగ్ బిందువు, బై హ్వే (4) బిందువుల

ద్వారా, దాన్ త్యేన్ మీద దృష్టి కేంద్రీకరించి మీలోనికి మీరు మీ చేతులతో చీని పోసుకోవచ్చు. కొద్దిసేపట్లోనే మిమ్మల్ని నింపుతుంది. మీరెంత చీని నింపుకొని ఉన్నప్పటికీ దానివల్ల మీకు ఏం ప్రయోజనం? కొంతమంది చీని ఎక్కువగా సాధన చేసిన తరవాత, వారి చేతి వేళ్ళు, శరీరాలూ వాచిపోయినట్లు కనిపిస్తాయి. ఇతరులు అటువంటి వ్యక్తి దగ్గరగా నడిచి వెళ్ళినప్పుడు, అతడి చుట్టూ ఒక క్షేత్రం ఉన్నట్లు అనుభూతి పొందుతారు: "ఆహా, మీరు చాలా చక్కగా సాధన చేశారు". అది ఏమాత్రం ఎన్నదగినది కాదని నేను అంటాను. గోంగ్ ఏది? అది ఇంకా చీ సాధనే, ఒక వ్యక్తికి ఎంత చీ ఉన్నా, అది గోంగ్‌కు ప్రత్యామ్నాయం కాదు. చీని సాధన చేయడంలోని ఉద్దేశం ఏమిటంటే, ఒక వ్యక్తి శరీరంలోని చీ స్థానంలోకి బయట ఉండే మంచి చీని తెచ్చి, శరీరాన్ని శుద్ధి చేసుకోవడం. అతడు చీని ఎందుకు కూడబెట్టుకుంటాడు? ఈ స్థాయిలో, మౌలికమైన ఒక మార్పు జరగనిదే, చీ అప్పుడే గోంగ్‌గా మారదు. మీరు ఎంత చీని, దోచుకున్నప్పటికీ, మీరు చీ నిండి ఉన్న ఒక పెద్ద సంచీ తప్ప, మరేమీ కారు. దాని వల్ల ఏం ఉపయోగం? అది ఇంకా ఉన్నత-శక్తి పదార్థంగా పరివర్తన చెందలేదు. ఇక మీరు దేనికి భయపడాలి? అతడికి నిజంగా కావాలంటే, ఆ చీని దోచుకోనివ్వండి.

అందరూ ఇది ఆలోచించండి: మీ శరీరంలో చీ ఉన్నదంటే, దానిలో వ్యాధులు ఉన్నాయి. అటువంటప్పుడు, ఆ వ్యక్తి మీ చీని దోచుకున్నప్పుడు, మీలోని వ్యాధిగ్రస్తమైన చీని కూడా దోచుకున్నాడు కదా? చీని కోరుకునే వ్యక్తి కూడా చీ స్థాయిలోనే ఉంటాడు. అతడికి ఎటువంటి శక్తులు ఉండకపోవడం వల్ల, అతడు ఈ విషయాలలోని భేదాలను ఏమాత్రమూ వేరుచేసి చూడలేడు. గోంగ్‌ను కలిగి ఉన్న వ్యక్తి చీని కోరడు – అది నిశ్చయం. మీరు దీనిని నమ్మక పోతే, ఒక ప్రయోగం చేయొచ్చు. ఒక వ్యక్తి మీలో ఉన్న చీని దోచుకోవాలి అనుకుంటే, మీరు అలా నిలబడి అతడిని దోచుకోనివ్వండి. అతడు మీ వెనకనించి అలా చేస్తుండగా, మీరు విశ్వంనించి మీ శరీరంలోకి చీని నింపుకోవడంపై మనసును కేంద్రీకరించుకోండి. అది ఎంత మంచిదో మీరే చూస్తారు, ఎందుకంటే మీరు మీలోని చీని విడుదల చేసి, తిరిగి నింపు కోవలసిన పని ఉండదు, అది మీ శరీర శుద్ధి మరింత వేగవంతం కావడానికి

సాయపడుతుంది. అతడు ఒక దురుద్దేశంతో ఇతరులను దోచుకుంటున్న కారణంగా, అతడు దోచుకున్నది మంచి వస్తువు కాకపోయినా, అతడు తన పుణ్యాన్ని పోగొట్టుకునే పనిని చేస్తున్నాడు. అందువలన అతడు మీకు పుణ్యం ఇస్తాడు. అది అతడు ఇటు మీ చీని దోచుకుంటూండగా, అటు తన పుణ్యం ఇచ్చే వలయంగా ఏర్పడుతుంది. చీని దోచుకునే వ్యక్తికి ఇది తెలియదు – తెలిస్తే అంత సాహసం చెయ్యడు!

చీని దోచుకునే వారందరి ముఖాలు నీలం రంగులో ఉంటాయి, వాళ్ళందరూ ఆ విధంగానే ఉంటారు. చీ గోంగ్ సాధనకు పార్కులకు వెళ్ళే వారిలో చాలామంది వ్యాధినిర్మూలన చెయ్యాలని కోరతారు, వారికి అన్ని రకాల వ్యాధులు ఉంటాయి. ఒక వ్యక్తి, ఒక వ్యాధిని స్వస్థపరచేటప్పుడు, ఆ వ్యాధిగ్రస్త చీని విడుదల చెయ్యడానికి అతడు ప్రయత్నించాలి. అయితే, చీని అపహరించే వ్యక్తి, చీని విడుదల చెయ్యక, అన్ని రకాల వ్యాధిగ్రస్త చీని తన శరీరంపై కూడబెట్టుకుంటాడు. అతడి అంతర శరీరం కూడా చాలా నల్లగా అవుతుంది. ఎప్పుడూ పుణ్యాన్ని పోగొట్టుకుంటూ ఉండే కారణంగా, అతడు నల్లగా కనిపిస్తాడు. ఒక పెద్ద కర్మ క్షేత్రం కలిగి ఉండడం, అధికంగా పుణ్యాన్ని పోగొట్టుకోవడమూ రెండిటివల్ల అతడు లోపలా, బయటా నల్లగా తయారవుతాడు. చీని దోచుకునే వ్యక్తికి తాను అనుభవిస్తున్న ఈ మార్పు తనకే తెలిసి, తాను చేస్తున్న తెలివిమాలిన పనివల్ల ఇతరులకు తన పుణ్యాన్ని ఇచ్చుకుంటున్నట్లు అర్థమైతే, ఆ పని చేసి ఉండేవాడే కాదు.

కొంతమంది చీ గురించి గోరంతను కొండంతలు చేశారు. "మీరు అమెరికాలో ఉంటే, నేను ప్రసరించే చీని అందుకోగలరు", "మీరు గోడకు అటువైపు ఉండి ఎదురుచూడండి, నేను ప్రసరించే చీని అందుకుంటారు". కొంతమంది ఎక్కువగా స్పందిస్తారు, చీ ప్రసరించినప్పుడు, వారు దానిని అనుభవించగలరు. కానీ ఈ పరిమాణంలో చీ ప్రయాణించలేదు. అటువంటి గోడ లేని మరొక పరిమాణంలో అది కదులుతుంది. ఒక చీ గోంగ్ గురువు ఒక బహిరంగ ప్రాంతంలో చీని ప్రసరింపచేసినప్పుడు మీకు ఏ అనుభూతి ఎందువల్ల తెలియదు? ఆ విధంగా, ప్రజలు వర్ణించేంతగా చొచ్చుకుపోయే శక్తి చీకి లేదు.

నిజంగా పనిచేసేది ఏమిటంటే గోంగ్. ఒక సాధకుడు లేదా సాధకురాలు గోంగ్‌ను ప్రసరింపచేయగలిగినప్పుడు, వారిలో చీ ఏమాత్రమూ ఉండదు. వారు ఉన్నత–శక్తి పదార్థాన్ని ఇవ్వగలుగుతారు, దివ్యనేత్రానికి అది వెలుగు రూపంలో కనిపిస్తుంది. అది మరొక వ్యక్తికి చేరినప్పుడు ఆ వ్యక్తికి వెచ్చదనం అనుభవం అవుతుంది; అది ఒక సామాన్య వ్యక్తిని నిరోధించగలుగుతుంది. అయినప్పటికీ, వ్యాధినిర్మూలన అనే లక్ష్యాన్ని పూర్తిగా సాధించలేకపోతుంది, ఎందుకంటే, దానికి కేవలం అణచిపెట్టగలిగే ప్రభావం మాత్రమే ఉంటుంది. నిజంగా వ్యాధులను నిర్మూలించాలంటే, అతీంద్రియ శక్తులు తప్పనిసరిగా ఉండాలి. ఒక్కొక్క వ్యాధి కోసమై ఒక ప్రత్యేకమైన అతీంద్రియ శక్తి ఉంది. అతిసూక్ష్మ స్థాయిలో, గోంగ్‌లోని ప్రతి సూక్ష్మమైన నలుసు కూడా మీ రూపాన్నే సంతరించుకుంటుంది. అది మనుషులను గుర్తించగలుగుతుంది, దానికి తెలివి ఉంటుంది, ఎందుకంటే, అది ఉన్నత–శక్తి పదార్థం. ఒకవేళ ఎవరైనా దానిని దోచుకుంటే అది అక్కడ ఎలా ఉండగలదు? అది ఆ వ్యక్తి యొక్క స్వంత సంపద కానప్పుడు, అక్కడ ఉండదు, అక్కడ ఉంచడం కూడా కుదరదు. నిజమైన సాధకుల విషయంలో, వారు గోంగ్‌ను పెంపొందించుకున్న తరవాత వారి గురువుల సంరక్షణలో ఉంటారు. మీరేం చేస్తున్నారో, మీ గురువు గమనిస్తూ ఉంటారు. మీరు మరొక వ్యక్తి వస్తువులను తీసుకోవడానికి ప్రయత్నిస్తే, అతడి గురువు కూడా అది జరగనివ్వరు.

## చీని కూడబెట్టడం

ఉన్నత స్థాయులలో ఆధ్యాత్మిక సాధన బోధిస్తున్నప్పుడు, చీని అపహరించడం, చీని కూడబెట్టడం వంటి అంశాలను సరిచెయ్యవలసిన అవసరం మాకు లేదు. అయినా ఎందుకు చెప్తున్నానంటే, నాకు ఆధ్యాత్మిక సాధనల యొక్క గౌరవాన్ని నిలబెట్టాలని, కొన్ని మంచి పనులు చెయ్యాలన్న ఉద్దేశం ఇప్పటికీ ఉంది. గతంలో ఎవ్వరూ ప్రస్తావించని కొన్ని చెడు విధానాలను నేను బయట పెడతాను. మీరందరూ అది తెలుసుకోవాలని నేను కోరుతున్నాను, ఎందుకంటే దానివల్ల కొంతమంది ఎల్లకాలమూ దుష్కర్మలు చెయ్యడం కొనసాగించక మానేస్తారు, చీ గోంగ్‌లోని సత్యం తెలియని కొందరు దాని గురించి మాట్లాడడానికి ఎప్పుడూ బెదిరిపోతూ ఉంటారు.

విశ్వంలో ఎంతో చీ ఉంది. కొందరు దివ్యమైన యాంగ్ చీ గురించి, భువి మీద ఉన్న యిన్ చీ గురించి చెప్తుంటారు. మీరు కూడా విశ్వంలోని ఒక మూలపదార్థమే గనక, మీరు ఆ చీని కూడబెట్టుకోవచ్చు. కానీ కొంతమంది విశ్వంలో ఉన్న చీని తీసుకోరు. వారు ప్రజలను మొక్కలనించి చీని తీసుకోమని ప్రత్యేకంగా బోధిస్తారు. వారు తమ అనుభవాన్ని సంగ్రహం కూడా చేశారు. చీని ఎప్పుడు, ఎలా తీసుకోవాలి, పోప్లర్ చెట్టు యొక్క చీ తెల్లగా ఉంటుందని, పైన్ చెట్టు యొక్క చీ పసుపు రంగులో ఉంటుందని. ఒకరు ఇలా కూడా చెప్తారు: "మా ఇంటి ముందు ఒక చెట్టు ఉండేది. నేను దాని యొక్క చీని తీసుకోవడంవల్ల అది చచ్చిపోయింది" అని. అది ఏ రకమైన శక్తి? అది ఒక చెడ్డ పని కాదా? మనం నిజమైన ఆధ్యాత్మిక సాధన చేస్తున్నప్పుడు, మనకు అనుకూల సందేశాలు కావాలని, విశ్వ లక్షణంతో మమేకం కావాలని కోరుకుంటాం. మీరు దయని సాధన చెయ్యొద్దా? విశ్వ లక్షణమైన సత్యం-దయ-సహనంతో మమేకం కావాలనుకున్న వ్యక్తి తప్పని సరిగా దయను సాధన చెయ్యాలి. మీరు ఎప్పుడూ, దుష్కర్మలు చేస్తుంటే, గోంగ్‌ను ఎలా పెంచుకోగలుగుతారు? మీ వ్యాధులు ఎలా నయమవుతాయి? మన సాధకులు చెయ్యవలసిన దానికి, ఇది వ్యతిరేకం కాదా? అది కూడా ప్రాణులను చంపడం, దుష్కర్మలను చెయ్యడమే! "మీరు ఎంత ఎక్కువ చేసి చెప్తుంటే అది అంతటి నమ్మశక్యం కాని విషయం – ఒక జంతువును చంపితే అది ఒక ప్రాణం తీసినట్లు, ఒక చెట్టును చంపినా అది ఒక ప్రాణం తీసినట్లే," అని ఎవరైనా అనవచ్చు. వాస్తవం కూడా అదే. బౌద్ధమతం సంసారచక్రాన్ని గురించి చెప్తుంది. మీరు ఆ చక్రంలో ఒక చెట్టుగా పునర్జన్మను పొంది ఉండొచ్చు. బౌద్ధమతంలో ఆ విధంగా చెప్పబడి ఉంది. ఇక్కడ మనం ఆ విధంగా చెప్పం కానీ, చెట్లు కూడా ప్రాణులేనని మేము అందరికీ చెప్తాము. కేవలం ప్రాణమే కాదు, వాటికి చాల ఉన్నత స్థాయి ఆలోచనా క్రియాత్మకత కూడా ఉంటుంది.

ఉదాహరణకు, అమెరికాలో, సత్యశోధన చేసే పరికరాన్ని ఎలా ఉపయోగించాలో ఇతరులకు నేర్పే, ఎలెక్ట్రానిక్స్ అధ్యయనం చేసిన, ఒక వ్యక్తి ఉన్నారు. ఒక రోజు ఆయనకు హఠాత్తుగా ఒక ఆలోచన తట్టింది. సత్యశోధన

చేసే పరికరపు రెండు కొసలను ఒక కుండీలోని డ్రాగన్-పాట్-ప్లాంట్ అనే మొక్కకు అనుసంధానించి, ఆ మొక్క వేళ్ళకు నీళ్ళు పోశారు. అప్పుడు ఆ పరికరంలో ఉన్న ఎలెక్ట్రానిక్ కలం గబగబా ఒక గీతను గీసినట్లు ఆయన కనుగొన్నారు. ఆ గీత, మానవ మస్తిష్కం ఒక్కక్షణంలో అనుభవించిన ఆనందం లేదా ఉద్రేకం కలిగినప్పుడు గీసిన గీతకు సరిసమానంగా ఉంది. ఆ క్షణంలో ఆయన నిర్ఘాంతపోయారు. ఒక మొక్కకు అనుభూతులు ఎలా ఉంటాయి? వీధులలోకి వెళ్ళి "మొక్కలకు అనుభూతులు ఉన్నాయి" అని అరచి చెప్పాలని ఆయనకు అనిపించించింది. ఈ సంఘటనతో కలిగిన జ్ఞానంవల్ల, ఆయన ఆ విషయంలో పరిశోధనలను కొనసాగించి ఎన్నో పరీక్షలను నిర్వహించారు.

ఒకసారి రెండు మొక్కలను ఒకచోట పెట్టి వాటిలో ఒక మొక్క ముందు మరొక మొక్కను, చచ్చిపోయేవరకు తొక్కమని తన విద్యార్థికి చెప్పారు. తరవాత బ్రతికి ఉన్న మొక్కను గదిలోకి తీసుకొనిపోయి, దానికి సత్యశోధన పరికరాన్ని కలిపారు. బయటినించి అయిదుగురు విద్యార్థులను ఒకరి తరవాత మరొకరిగా ఆ గదిలోకి వెళ్ళమని అడిగారు. మొదటి నలుగురు గదిలోకి వెళ్ళినప్పుడు మొక్కలో ఏ ప్రతిచర్యలు కనిపించలేదు. మొక్కను నాశనం చేసిన అయిదవ విద్యార్థి గదిలోకి ప్రవేశించగానే, మొక్కకు దగ్గరగా వెళ్ళకముందే ఆ ఎలెక్ట్రానిక్ కలం ఒక వ్యక్తి భయపడినప్పుడు మాత్రమే గీసే గీతను గీసింది. ఆయన నిజంగా నిర్ఘాంతపోయారు! ఈ సంఘటన ఒక ముఖ్య విషయాన్ని తెలియజేస్తుంది: ఒక మానవుడు విచక్షణ కలిగిన జ్ఞానేంద్రియాలను, విషయాలను విశ్లేషించుకొనగల శక్తి కలిగిన మెదడును పొందిన ఉన్నత స్థాయి ప్రాణి అని మనం నమ్ముతాం. మొక్కలు వస్తువులను ఎలా వేరుచేసి చూడగలవు? వాటికి కూడా జ్ఞానేంద్రియాలు ఉన్నాయని ఇది సూచించడం లేదా? గతంలో మొక్కలకు జ్ఞానేంద్రియాలు, ఆలోచించే బుద్ధి, అనుభూతులు ఉన్నాయని, అవి మనుషులను గుర్తించగలవని ఎవరైనా చెప్తే అతడివి మూఢ నమ్మకాలని అని ఉండేవారు. వీటన్నిటికీతోడు, కొన్ని విషయాలలో మొక్కలు మనుషులను అధిగమించాయి.

ఒకరోజున ఆయన సత్యశోధన పరికరాన్ని ఒక మొక్కకు కలిపి: "ఇవాళ ఏ పరీక్ష చేద్దాం? దీని ఆకులకు నిప్పు పెట్టి అది ఎలా స్పందిస్తుందో చూద్దాం"

అనుకున్నారు. ఆ ఆలోచన కలగగానే – ఆయన ఆకులను కాల్చకముందే – ఆ ఎలెక్ట్రానిక్ కలం ఒక వ్యక్తి సహాయం కోసం ఆర్తనాదం చేసినప్పుడు మాత్రమే గీసే గీతను గీసింది. ఈ ఇంద్రియాతీత క్రియను గతంలో మనసును చదవడం అనేవారు; ఇది మానవులలో దాగి ఉండే క్రియ, ఒక అంతర్గత సామర్థ్యం. అయితే నేడు మానవజాతి సమస్తం కలుషితమైపోయింది. వాటిని తిరిగి పొందడానికై మీరు మొదటినించి ఆధ్యాత్మిక సాధన చేసి, మీ స్వస్వరూపం లేదా మీ మూలప్రకృతికి చేరుకోవాలి. కానీ ఆ మొక్కకు అవి ఉన్నాయి, మీ మనసులో ఏముందో దానికి తెలుసు. ఇది నమ్మశక్యం కానట్లు కనిపిస్తుంది కానీ, ఇది నిజంగా జరిగిన వైజ్ఞానిక పరీక్ష. చాలా దూరంనించి ప్రయోగించే రిమోట్ కంట్రోల్ యొక్క సామర్థ్యంతో సహా, ఆయన అనేక రకాల పరీక్షలను నిర్వహించారు. ఆయన పరిశోధనాపత్రాల ప్రచురణ జరిగిన తరవాత అవి ప్రపంచం అంతటినీ కుదిపివేశాయి.

మన దేశంతో సహా భిన్న దేశాలలోని వృక్ష శాస్త్రజ్ఞులు ఈ రంగంలో తమ పరిశోధనలు ఆరంభించారు, దీన్ని ఇక మూఢనమ్మకంగా పరిగణించడం లేదు. ఈనాడు మానవజాతి అనుభవించిన, ఆవిష్కరించిన, కనుగొన్న సమాచారం మన ప్రస్తుత పాఠ్యగ్రంథాలను మార్చడానికి సరిపడా ఉన్నదని నేను ఒకరోజున చెప్పాను. పూర్వాచార మనస్తత్వాల ప్రభావంవల్ల, వాటిని గుర్తించడానికి ప్రజలు విముఖంగా ఉన్నారు. ఎవ్వరూ వీటిని క్రమపద్ధతిలో సంగ్రహపరచడం కూడా లేదు.

ఈశాన్య ప్రాంతంలోని ఒక పార్కులో కొన్ని పైన్ చెట్ల సమూహం చనిపోయినట్లు నేను గమనించాను. కొందరు అక్కడ ఎటువంటి చీ గోంగ్‌ను అభ్యసిస్తున్నారో, ఎవ్వరికీ తెలియదు: వారక్కడ నేల మీద దొర్లేవారు, తరవాత ఒకవైపు కాళ్ళతోనూ, మరొకవైపు చేతులతోనూ చెట్లనించి చీని కూడబెట్టుకునేవారు. అతిత్వరలో అక్కడ ఉన్న పైన్ చెట్లన్నీ పసుపుపచ్చ రంగుకు తిరిగి చనిపోయాయి. వారు చేసిన పని మంచిదా చెడ్డదా? మన సాధకుల దృష్టిలో అది ప్రాణులను చంపడమే. మీరు ఒక సాధకుడు. అందువల్ల క్రమంగా విశ్వ లక్షణాలతో మమేకం కావడానికి, మీలోని చెడ్డ విషయాలను వదిలివెయ్యడానికి, మీరొక మంచి వ్యక్తిగా ఉండి తీరాలి. ఒక

సామాన్య వ్యక్తి దృష్టినించి చూసినా కూడా, అది మంచిపని కాదు. అది ప్రజల సామూహిక సంపదను దుర్వినియోగపరచడం, దానివల్ల పచ్చదనమూ, పర్యావరణ సమతుల్యమూ నాశనం అయింది. ఏ దృష్టికోణంనించి చూసినా అది మంచిపని కాదు. విశ్వంలో చాలా చీ ఉంది, అందులోనించి మీకు కావలసినంత మీరు తీసుకోవచ్చు. కొంతమందికి చాలా శక్తి ఉంటుంది. ఒక నిర్దిష్టమైన స్థాయిలో సాధన చేసిన తరవాత, వారు నిజంగానే ఒక్కసారి తమ చేతులు ఊపి, ఒక పెద్ద ప్రాంతంలోని చెట్ల యొక్క చీని కూడబెట్టుకోగలరు. అయినప్పటికీ, అది చీ తప్ప మరేమీ కాదు. ఒక వ్యక్తి దాన్ని ఎంతగా కూడబెట్టుకున్నా, అది ఎందుకు పనికొస్తుంది? కొందరు, పార్కుకు వెళ్ళినప్పుడు ఇతర పనులేవీ చెయ్యరు. "నాకు చీ గోంగ్ సాధన చెయ్యవలసిన అవసరం లేదు. నేను నడుస్తూ ఉన్నప్పుడు చీని కూడబెట్టుకోవడం మేలు, అంతటితో నా సాధన పూర్తి అవుతుంది. చీని పొందితే సరిపోతుంది", అని ఒక వ్యక్తి చెప్పుకుంటాడు. వారు ఆ చీని గోంగ్‌గా భావిస్తారు. అతడి దగ్గరగా నడిచినవారికి అతడి శరీరం చాలా చల్లగా ఉన్నట్లు అనిపిస్తుంది. మొక్కల యొక్క చీ యిన్ స్వభావాన్ని కలిగి ఉండదా? ఒక సాధకుడు యిన్, యాంగ్ రెండిటి సమతూకాన్ని నిలుపుకోవాలి. ఆ వ్యక్తి శరీరం పైన్ నూనె వాసన వస్తున్నప్పటికీ అతడు తాను తన సాధనను సక్రమంగా చేస్తున్నట్లే భావిస్తాడు.

## ఆధ్యాత్మిక సాధన చేసినవారు గోంగ్‌ను పొందుతారు

గోంగ్‌ను సాధన చేసేవారు ఎవరు, దాన్ని పొందేవారు ఎవరు అన్నది ఒక ముఖ్యమైన చర్చనీయాంశం. ఫాలున్ దాఫావల్ల ఉపయోగాలు ఏమిటని నన్ను అడిగితే, ఫాలున్ దాఫా, గోంగ్‌కు సాధకుడిని సంస్కరించే శక్తిని ఇస్తుంది, కాబట్టి సాధనకు పట్టే సమయాన్ని తగ్గిస్తుందని నేను చెప్తాను. ఒక వ్యక్తికి సాధన చేసే సమయం లేకపోవడం అన్న సమస్యను అది పరిష్కరిస్తుంది, అదే సమయంలో అతడు నిరంతరమూ సంస్కరింపబడుతూనే ఉంటాడు. అలాగే, మనది మనశ్శరీరాల యొక్క అసలైన ఆధ్యాత్మిక సాధన. మన భౌతిక శరీరాలు గొప్ప మార్పులకు లోనవుతాయి. ఫాలున్ దాఫాకు, నేను ఇంతకు ముందు చెప్పనిది, అన్నిటిలోకి గొప్పదైన మరియొక ప్రయోజనం ఉంది.

ఇవాళే దానిని బయటపెడుతున్నాము. ఎందుకంటే దానిలో చారిత్రక ప్రాముఖ్యత కలిగియుండి సాధకుల సమాజాన్ని చాలా ప్రభావితం చేసే ఒక ప్రధాన అంశం ఉంది, చరిత్రలో ఇంతవరకు ఎవ్వరూ దానిని బయటపెట్టడానికి సాహసించలేదు, దాన్ని బయటపెట్టడానికి ఎవ్వరికీ అనుమతి సైతం లేదు. అయితే ఇప్పుడు అది చెప్పడం తప్ప నాకు గత్యంతరం లేదు.

"మాస్టర్ లీ హోంగ్ జీ చెప్పే ప్రతి ఒక్క వాక్యమూ ఒక దివ్య రహస్యమే, అది దివ్య రహస్యాలను బయల్పరచడమే" అని కొందరు శిష్యులు అన్నారు. అయినా, మేము ప్రజలను కాపాడడానికి నిజంగా ఉన్నత స్థాయిలకు తీసుకు వెళ్తున్నాం. అందరిపట్ల బాధ్యత వహించడం అన్న బాధ్యతను మేము తీసుకో గలం. ఆ కారణంగా అది దివ్య రహస్యాలను బయల్పరచడం కాదు. ఒకవేళ ఒక వ్యక్తి బాధ్యతారహితంగా చెప్తే, అది దివ్య రహస్యాలను బయల్పరచినట్లు అవుతుంది. సాధన చేసేది ఎవరు, గోంగ్‌ను పొందేది ఎవరు అన్న అంశాన్ని ఇవాళ మేము ప్రజలకు చెప్తాం. నా దృష్టిలో, చరిత్ర అంతటా బుద్ధ సిద్ధాంతం, తావో సిద్ధాంతం, చీ మున్ సిద్ధాంతాలతో సహా – నేడు ఉన్న అన్ని సాధనలు ఒక వ్యక్తి యొక్క సహాయక ఆత్మనే సంస్కరించాయి, గోంగ్‌ను పొందినది కూడా సహాయక ఆత్మయే. మనం ఇక్కడ ప్రస్తావిస్తున్నట్టి ప్రధాన ఆత్మ మన మనసులను సూచిస్తున్నది. ఒక వ్యక్తి తాను ఆలోచిస్తున్నది లేదా చేస్తున్నది ఏమిటో – ఎరుక గలిగి ఉండాలి – అది మీ నిజమైన స్వరూపం. కానీ మీ సహాయక ఆత్మ ఏం చేస్తున్నది అన్న విషయం మీకు ఎంతమాత్రమూ తెలియదు. మీరు, అది, ఒకే సారి, ఒకే పేరు, ఒకే రూపంతో పుట్టినప్పటికీ, ఒకే శరీరాన్ని అదుపు చేస్తున్నప్పటికీ ఖచ్చితంగా చెప్పాలంటే, అది మీరు కాదు.

విశ్వంలో ఒక నియమం ఉంది: నష్టపోయినవారు లాభం పొందుతారు. ఆధ్యాత్మిక సాధన చేసిన వారందరూ గోంగ్‌ను పొందుతారు. చరిత్ర అంతటా, సాధన చేసే సమయంలో సమాధి స్థితిలో ఉండాలని, ఏ విషయం గురించిన ఆలోచనలూ చెయ్యకూడదని అన్ని సాధనలూ ప్రజలకు బోధించాయి. అటు వంటప్పుడు ఒక వ్యక్తి చివరివరకు, తాను అన్ని విషయాలనూ మరచిపోయే వరకు సమాధి స్థితిలోనే ఉండాలి. కొంతమంది ఏదో ఒక్క క్షణం గడిచినంత

సులభంగా మూడుగంటలసేపు ధ్యానంలో కూచుంటారు. అంతసేపు సమాధి స్థితిలో కూర్చోగలిగిన అతడి సామర్థ్యానికి ఇతరులు అబ్బురపడొచ్చు. అతడు నిజంగా సాధన చేశాడా? అదేమిటో అతడికే తెలియదు. తావో సిద్ధాంతం ప్రత్యేకించి, ప్రషన్ (5) మరణించి ప్రాథమిక ఆత్మ జన్మిస్తుందని బోధిస్తుంది. అందులో చెప్పే "ప్రషన్"ను మనం "ప్రధాన ఆత్మ" అని, "ప్రాథమిక ఆత్మ" అన్నదానిని "సహాయక ఆత్మ" అంటాము. మీ ప్రషన్ నిజంగా మరణిస్తే మీరూ మరణిస్తారు, మీకు నిజంగా ప్రధాన ఆత్మ అన్నది ఉండదు. మరొక సాధనకు చెందిన ఒక వ్యక్తి: "టీచర్, నేను సాధన చేస్తున్నప్పుడు ఇంట్లోని వారిలో ఎవరినీ గుర్తు పట్టలేను" అని చెప్పాడు. మరొక వ్యక్తి. "నేను ఇతరులలాగా తెల్లవారుజామున లేదా చాలా రాత్రివేళ సాధన చెయ్యను. ఇంటికి వెళ్ళిన తరవాత, ఒక పడకపై పడుకొని, సాధన చెయ్యడానికై నాలోనించి బయటకు వెళతాను. అక్కడ పడుకొని ఉండి నా సాధనను నేను చూసుకుంటాను" అని చెప్పాడు. నాకు అది దుఃఖకరంగా కనిపించింది, కానీ అది కూడా దుఃఖకరం కాదు.

వారు సహాయక ఆత్మను ఎందుకు రక్షించుకుంటారు? ల్యూ డొంగ్ బిన్ ఒకసారి ఒక వ్యాఖ్య చేశారు: "నేను ఒక మానవునికి బదులుగా ఒక జంతువును రక్షిస్తాను" అని. నిజానికి జనులకు జ్ఞానోదయం పొందడమన్నది అతికష్టం, ఎందుకంటే సామాన్య మానవ సంఘం సామాన్య వ్యక్తులను మాయలో పడేస్తుంది. తమ ఎదుట ప్రత్యక్ష ప్రయోజనాలు ఉన్నప్పుడు, వారు ఆ బంధాన్ని వదలిపెట్టలేరు. మీరు నమ్మలేకపోతే చూడండి, ఈ తరగతి ముగిసిన తరవాత, కొంతమంది, మళ్ళీ సామాన్య మానవులలాగానే ఈ ఆడిటోరియంనించి బయటకు వెళతారు. ఒకవేళ ఎవరైనా వారిని బాధపెట్టినా, వారితో తలపడినా, వారు దానిని భరించలేరు. కొంతకాలం తరవాత వారు తమనుతాము సాధకులుగా ఎంతమాత్రమూ నిలుపుకోలేరు. చరిత్రలో ఎందరో తావో అనుయాయులు ఈ క్రింది విషయాన్ని తెలుసుకున్నారు: మానవులను రక్షించడం అతికష్టం, ఎందుకంటే, వారు తమ ప్రధాన ఆత్మలను పూర్తిగా కోల్పోతారు. కొందరిలో చక్కని జ్ఞానోదయ లక్షణం ఉండి, ఒక్క సూచనతో వెంటనే దానిని అర్థం చేసుకుంటారు. కొందరేమో మీరు ఏం చెప్పినా మిమ్మల్ని

నమ్మరు. మీరేవో కట్టుకథలు చెప్తున్నారని భావిస్తారు. మనం షిన్ షిన్ సంస్కరణ చెయ్యడం గురించి ఇంతగా చెప్పుకుంటున్నాం, అయినా ఈ వ్యక్తి ఒకసారి సామాన్య వ్యక్తుల నడుమ ఉన్నప్పుడు, యథాప్రకారం ప్రవర్తిస్తాడు. నిజమైనవి, చేతికి అందుబాటులో ఉన్నట్టి ప్రయోజనాలు యదార్థమైనవిగా తలచి, వాటికోసం తాపత్రయపడతాడు; గురువు బోధించిన ఫా కూడా అర్థవంతమే, కానీ అనుసరించలేనిది. మానవ ప్రధాన ఆత్మను మాయనించి రక్షించడం కష్టం. కానీ, సహాయక ఆత్మ ఇతర పరిమాణాలలోని దృశ్యాలను చూడగలుగుతుంది. అందువల్ల వారు: "నేను మీ ప్రధాన ఆత్మను ఎందుకు రక్షించాలి? మీ సహాయక ఆత్మ కూడా మీరే. నేను దానిని రక్షించినా ఒకటే కదా? అదంతా మీరే, కాబట్టి దానిని ఎవరు పొందినా మీరు పొందినట్లే" అనుకుంటారు.

వారి సాధనా పద్ధతులను ప్రత్యేకంగా వర్ణిస్తాను. ఒక వ్యక్తికి క్లెయర్ వోయన్స్ అన్న అతీంద్రియ శక్తి ఉంటే, బహుశా అతడు ఈ దృశ్యాన్ని చూడగలుగుతాడు: మీరు ధ్యానంలో కూచున్నప్పుడు, మీరు సమాధిస్థితికి చేరుకున్న వెంటనే, మీలాగే కనిపించే ఒక వ్యక్తి హఠాత్తుగా మీ శరీరాన్ని విడిచి వెళతాడు. మీరు విడదీసి చూడాలనుకుంటే వాటిలో మీ స్వరూపం ఏది? మీరు అక్కడే కూచుని ఉన్నారు. ఆ వ్యక్తి మీ శరీరాన్ని విడిచి వెళ్ళడం చూసిన తరవాత ఆధ్యాత్మిక సాధన చేయడానికై అతడిని గురువు తాను పరివర్తన చేసిన ఒక పరిమాణంలోకి తీసుకొని వెళ్తారు. అది ఏనాడో గతించిపోయిన సమాజమో, నేటి సమాజమో లేదా మరొక పరిమాణంలోని సమాజమో అయి ఉండొచ్చు. ఆ వ్యక్తికి ప్రతిరోజూ రెండు, మూడుగంటలు సాధనను బోధించడమూ, అతడిని అనేక కష్టాలకు గురిచేయడమూ జరుగుతుంది. అతడు సాధననించి వెనకకు వచ్చినప్పుడు మీరు కూడా సమాధిస్థితి నించి మేలుకుంటారు. చూడగలిగినవారికి ఇలా కనిపిస్తుంది.

ఒక వ్యక్తి ఇది చూడలేకపోతే అది మరింత దయనీయం. అటువంటి వాడు రెండు గంటలు సమాధి స్థితిలో కూచున్న తరవాత ఏమీ తెలియని ఒక అయోమయ పరిస్థితిలో లేస్తాడు. సాధనా పద్ధతిగా కొందరు రెండు మూడు గంటలు నిద్రపోయి తమను తాము ఇతరులకు అర్పించుకుంటారు. ఇది

రోజంతటిలో అప్పుడప్పుడూ కొద్దిసేపు ధ్యానంలో కూచోవడంగా నిత్యమూ జరుగుతుంది. ఇంకొక రకంలో ఒకేసారి పూర్తిచెయ్యడం జరుగుతుంది. ఒక గోడ ఎదుట తొమ్మిది సంవత్సరాలు కూచున్న బోధిధర్ముని గురించి అందరూ వినే ఉంటారు. గతంలో దశాబ్దాల తరబడి కూచుని ఉండే భిక్షువులు ఉండేవారు. చరిత్రలో అత్యధికంగా కూచున్న సమయం తొంభై సంవత్సరాలు. కొందరు అంతకన్నా ఎక్కువకాలం కూచున్నారు. తమ కనురెప్పల మీద ధూళి దట్టంగా పేరుకొని ఉన్నా, శరీరం మీద గడ్డి మొలిచినా, వారు అలా కూచుని ఉండేవారు. తావో సిద్ధాంతంలో కూడా కొందరు దీనిని బోధిస్తారు. ముఖ్యంగా చీ మున్ సిద్ధాంతానికి చెందిన కొన్ని సాధనలు, నిద్రను ఒక రకమైన సాధనగా బోధిస్తాయి. ఒక వ్యక్తి సమాధి స్థితిని వీడకుండానే దశాబ్దాలపాటు నిద్రపోగలడు, అతడికి మెలకువ రాదు. కానీ దాన్ని సాధన చేసిన వారెవరు? ఆ వ్యక్తి యొక్క సహాయక ఆత్మ సాధన చెయ్యడానికి బయటకు వెళ్ళింది. ఒకవేళ అతడు చూడగలిగి ఉంటే, సాధన చెయ్యడానికి తన సహాయక ఆత్మను గురువు తీసుకువెళ్ళడం గమనిస్తాడు. సహాయక ఆత్మకు కూడా అనేక కర్మ సంబంధిత ఋణాలు ఉండి ఉండొచ్చు, వాటినన్నిటినీ తొలగించగల శక్తి గురువుకు ఉండదు. అందువల్ల ఆయన దానికి: "నువ్వు ఇక్కడ చాలా కష్టపడి పని చెయ్యవలసి ఉంటుంది. నేను వెళ్ళి కాసేపటిలో తిరిగి వస్తాను. నువ్వు నాకోసం వేచి ఉండు," అని చెప్తారు.

ఏం జరగబోతున్నదో గురువుకు సరిగ్గా తెలుసు, కానీ ఇలాగే చెయ్యాలి. చివరికి ఒక దయ్యం ఆ వ్యక్తిని భయపెట్టడానికి వస్తుంది, లేదా ఒక అందమైన స్త్రీగా మారి ప్రలోభపెట్టడానికి వస్తుంది–ఇటువంటి విషయాలన్నీ జరుగుతాయి. సహాయక ఆత్మ ఏమాత్రమూ ప్రభావితం కాలేదని ఆ దయ్యానికి తెలుస్తుంది. ఎందుకంటే, సత్యం తెలుసుకోగలదు కనుక సహాయక ఆత్మకు ఆధ్యాత్మిక సాధన చెయ్యడం చాలా సులభం. నిరాశను తట్టుకోలేని ఆ దయ్యం, దాని ప్రాణాన్ని తీయడానికి ప్రయత్నిస్తుంది, నిజంగానే దాన్ని చంపుతుంది. అంతటితో ఒక్కసారిగా దాని ఋణం తీరిపోతుంది. చనిపోయిన తరవాత, సహాయక ఆత్మ పొగలాగా తేలుతూ ఒక అతిపేద కుటుంబంలో పునర్జన్మను పొందుతుంది. చాలా చిన్నతనంనించి ఆ బాలుడు కష్టాలను అనుభవిస్తూ

ఉంటాడు. ఆ బాలుడు పెరిగి పెద్దవాడయ్యాక, గురువు తిరిగి వస్తారు. అయితే, ఆ బాలుడు ఆయనను గుర్తుపట్టలేడు. అతీంద్రియ శక్తులను ఉపయోగించి, దాచిపెట్టబడిన అతడి జ్ఞాపకాలను గురువు విడుదల చేస్తారు. వెంటనే అతడికి అంతా గుర్తు వచ్చి, "మీరు నా గురువు కదా?" అంటాడు. గురువు: "ఇది సాధన మొదలు పెట్ట వలసిన సమయం" అని చెప్తారు. ఆ విధంగా, అనేక సంవత్సరాల తరవాత గురువు దానికి ఆ బోధనలను అందజేస్తారు.

ఆ బోధన అయిన తరవాత, గురువు దానికి మళ్ళీ: "నువ్వు పోగొట్టుకో వలసిన బంధాలు ఇంకా ఉన్నాయి. నువ్వు చాలా సంచారం చెయ్యవలసి ఉంది", అని చెప్తారు. సంఘంలో సంచరించడం అన్నది చాలా కష్టాలతో కూడుకొని ఉన్నది. అది ఆహారంకోసం బిచ్చం ఎత్తవలసి వస్తుంది, దానిని తిట్టి, అవమానపరచి, అవసరానికి వాడుకొనే రకరకాల మనుషులను కలుసు కోవలసి వస్తుంది. అది అన్ని రకాల విషయాలను ఎదుర్కోవలసి వస్తుంది. అది తనను తాను ఒక సాధకుడిగా భావించుకొని ఇతరులతో సంబంధాలను చక్కగా నడుపుకుంటూ, ఎల్లప్పుడూ షిన్ షిన్‌ను నిలుపుకుంటూ, ఉన్నతీకరించు కుంటూ ఉంటుంది. సామాన్య మానవుల నడుమ ప్రలోభాలకు, ప్రాపంచిక ప్రయోజనాలకు అది లోబడదు. అనేక సంవత్సరాలు సంచరించిన తరవాత అది తిరిగివస్తుంది. గురువు: "నువ్వు ఇప్పటికే తావోను పొంది ఆధ్యాత్మిక సాధనను పూర్తి చేసుకున్నావు. నీకు చెయ్యవలసినది ఇక ఏమీ మిగిలి ఉండకపోతే, అన్నీ సర్దుకొని వెళ్ళేందుకు సిద్ధంగా ఉండు. ఒకవేళ ఇంకా చెయ్యవలసినది ఏమైనా మిగిలి ఉంటే, సామాన్య మానవులదైన ఆ పని పూర్తిచేసుకోవడానికి బయలుదేరి వెళ్ళు" అంటారు. అనేక సంవత్సరాల తరవాత, ఆ సహాయక ఆత్మ తిరిగి వస్తుంది. అది తిరిగి వచ్చిన తరవాత ప్రధాన ఆత్మ కూడా సమాధిస్థితినించి బయటకు వస్తుంది, ఆపై ప్రధాన చైతన్యం మేలుకుంటుంది.

అయినప్పటికీ ఆ వ్యక్తి నిజంగా ఆధ్యాత్మిక సాధన చెయ్యలేదు. అతడి సహాయక ఆత్మ ఆ సాధన చేసింది, అందువల్ల సహాయక ఆత్మ గోంగ్‌ను పొందుతుంది. కానీ ప్రధాన ఆత్మ కూడా కష్టాలు అనుభవించింది. అంతా

చేసి, ఆ వ్యక్తి తన యవ్వన కాలాన్నంతా అక్కడ కూచొని అంకితం చేశాడు, ఒక సామాన్య వ్యక్తిగా అనుభవించగలిగిన అతడి జీవితకాలమంతా గడిచి పోయింది. కాబట్టి ఏం జరుగుతుంది? సమాధిస్థితినించి మేలుకున్న తరవాత తన సాధన ద్వారా గోంగ్‌ను పెంపొందించుకొని, అతీంద్రియ శక్తులను సంపాదించుకున్నాను అని భావిస్తాడు. అతడు ఒక రోగికి చికిత్స చేయడం, లేదా మరేమైనా చెయ్యాలనుకుంటే, చెయ్యగలుగుతాడు, ఎందుకంటే, ఆ సహాయక ఆత్మ అతడిని సంతృప్తిపరచడానికి ప్రయత్నిస్తుంది. ఆ వ్యక్తియే ప్రధాన ఆత్మ కాబట్టి, ప్రధాన ఆత్మయే శరీరాన్ని అదుపుచేసి, నిర్ణయాలు తీసుకుంటుంది. పైగా అతడు ఎంతకాలం ఇక్కడ కూచొని ఉన్నాడంటే, అతడి జీవితకాలమే గడిచిపోయింది. ఈ వ్యక్తి మరణించినప్పుడు, ఆ సహాయక ఆత్మ వెళ్ళిపోతుంది. ఇద్దరూ ఎవరి దారిన వాళ్ళు వెళ్తారు. బౌద్ధమతం ప్రకారం, ఈ వ్యక్తి మళ్ళీ సంసారచక్రంలోనే పరిభ్రమిస్తాడు. అతడి శరీరంలో ఒక మహాజ్ఞాని విజయవంతంగా ఆధ్యాత్మిక సాధన చెయ్యడం వలన, ఆ వ్యక్తి కూడా చాలా పుణ్యాన్ని సంపాదించాడు. కాబట్టి, ఏం జరుగుతుంది? అతడు మరుజన్మలో ఒక ఉన్నతోద్యోగి కావచ్చు లేదా పెద్ద సంపదను కూడబెట్టవచ్చు. ఇది కేవలం ఇలా జరిగే అవకాశం ఉంది. అతడి ఆధ్యాత్మిక సాధన వ్యర్థం కాలేదా?

ఈ అంశాన్ని బయటపెట్టడానికి అనుమతి కోసం చాలా ప్రయత్నం చేయవలసి వచ్చింది. నేను యుగాలనించి ఉన్న ఒక రహస్యాన్ని బయట పెట్టాను – అది ఎంతమాత్రమూ తెలియజేయరాని రహస్యాతి రహస్యం. చరిత్ర పొడవునా ఉన్న ఆధ్యాత్మిక సాధనల మూలాన్ని నేను బయటపెట్టాను. దానిలో చారిత్రకమైన వివాదాంశాలు ఉన్నాయని నేను చెప్పలేదా? ఆ కారణాలు ఇవే. దీని గురించి ఆలోచించండి: ఏ సాధన లేదా సిద్ధాంతం ఆధ్యాత్మిక సాధనను ఈ విధంగా చెయ్యదు? మీరు క్రిందా, మీదా పడి సాధన చేస్తారు కానీ గోంగ్‌ను పొందరు. మీకు బాధగా లేదా? అయితే, ఎవరిని నిందించాలి? మానవులు ఎంతటి మాయలో చిక్కుకున్నారంటే, ఎన్ని సూచనలు ఇచ్చినా వాళ్ళు అది గ్రహించలేరు. ఒక ఉన్నతస్థాయినించి వివరిస్తే, అది వాళ్ళకు కల్పనగా తోస్తుంది. క్రింది స్థాయినించి వివరిస్తే, ఉన్నతమైనదాన్ని

అందుకో లేరు. నేను ఇంతగా చెప్పినా, కొంతమంది ఇంకా తమ వ్యాధులను స్వస్థపరచమని కోరుతారు. వాళ్ళకు ఏం చెప్పాలో నాకు నిజంగా తెలియదు. మేము ఆధ్యాత్మిక సాధనను బోధిస్తాం, ఉన్నతస్థాయిలకు చేర్చే ఆధ్యాత్మిక సాధన చేసే వారి గురించి మాత్రమే మేము జాగ్రత్త తీసుకోగలం.

మా సాధనా సిద్ధాంతంలో గోంగ్‌ను పొందేది ప్రధాన చైతన్యమే. మనం అన్నంతమాత్రానే ప్రధాన చైతన్యం గోంగ్‌ను పొందుతుందా? దాన్ని ఎవరు అనుమతిస్తారు? అది అలా జరగదు, దానికి కొన్ని ప్రాథమిక ఆవశ్యకతలు ఉన్నాయి. ఆధ్యాత్మిక సాధనలో మా సాధనా సిద్ధాంతం సామాన్య మానవ సమాజాన్ని తప్పించుకోవడం లేదా ఘర్షణలను నివారించడమో, వాటినించి పారిపోవడమో చెయ్యదు. సామాన్య మానవుల యొక్క ఈ సంక్లిష్ట వాతావరణంలో మీరు నిర్మలమైన మనసును కలిగి ఉండి, స్వప్రయోజనాలను స్వచ్ఛందంగా వదులుకోగలిగి ఉండాలి. మీకు రావలసిన మేలును మరొకరు లాగివేసుకున్నా, ఇతరులలాగా మీరు పోటీపడి దానికోసం పోరాడరు. భిన్నమైన షిన్ షిన్‌ల జోక్యంతో మీరు నష్టాలను ఎదుర్కొంటారు. అటువంటి కష్టతరమైన వాతావరణంలో మీరు మీ కోరికలను అదుపు చేసుకుంటూ మీ షిన్ షిన్‌ను పెంచుకుంటారు. సామాన్య మానవుల యొక్క రకరకాలైన చెడ్డ ఆలోచనల ప్రభావంనించి మీరు పైకి ఎదిగి వాటికి అతీతులు కాగలుగుతారు.

అందరూ ఇది ఆలోచించండి: తెలిసి కూడా బాధను అనుభవిస్తున్నది మీరు కాదా? త్యాగాలు చేస్తున్నది మీ ప్రధాన ఆత్మయే కాదా? సామాన్య మానవుల నడుమ మీరు పోగొట్టుకున్నదంతా మీరు తెలిసి తెలిసే పోగొట్టు కోలేదూ? నష్టపోయినవారే లాభపడతారు కాబట్టి ఈ గోంగ్ మీకే చెందాలి. ఆ కారణం గానే, మా సాధనాసిద్ధాంతం సంక్లిష్ట సామాన్య మానవ సంఘంలో ఆధ్యాత్మిక సాధన చెయ్యడాన్ని తప్పించుకోదు. మనం సామాన్య మానవుల యొక్క ఘర్షణల మధ్య ఆధ్యాత్మిక సాధనను ఎందుకు చేస్తాం? ఎందుకంటే గోంగ్‌ను పొందబోతున్నది స్వయంగా మనమే కాబట్టి చేస్తాం. భవిష్యత్తులో మఠాలలోని నిపుణ సాధకులు తమ ఆధ్యాత్మిక సాధనలో సామాన్య మానవుల నడుమ సంచారం చెయ్యవలసి ఉంటుంది.

కొందరు: "ప్రస్తుతం ఇతర సాధనలకు చెందినవారు కూడా సామాన్య

మానవుల మధ్యనే ఆధ్యాత్మిక సాధన చెయ్యడం లేదా?" అని అడిగారు. కానీ ఆ సాధనలు వ్యాధినిర్మూలన, దేహపుష్టి నిలుపుకోవడం ప్రచారం చేస్తున్నాయి. కేవలం ఒకే ఒక్క శిష్యుడికి ఏకాంతంగా బోధించడమే తప్ప, నిజంగా ఉన్నత స్థాయిలకు చేర్చే సాధనలను బహిరంగంగా ఎవ్వరూ బోధించలేదు. శిష్యులకు అసలైన బోధ గరిపేవారు తమ ఏకాంత బోధన కోసం వారిని తీసుకొని ఎప్పుడో వెళ్ళిపోయారు. ఎన్నో సంవత్సరాలుగా, ఈ విషయాలను ప్రజలలో చర్చించినవారెవరు? ఎవ్వరూ అలా చెయ్యలేదు. మా సాధనా సిద్ధాంతం ఈ విధంగా బోధించింది, ఎందుకంటే, మేము బోధించేది సరిగ్గా ఇదే మార్గం, మేము గోంగ్‌ను పొందేది కూడా సరిగ్గా ఇదే మార్గం. అదే సమయంలో మీ అంతట మీరే వాస్తవంగా గోంగ్‌ను పొందగలిగిన శక్తిని కలిగించడంకోసం వందల, వేల వస్తువులు అన్నిటినీ మీ ప్రధాన ఆత్మకు మా సాధనా సిద్ధాంతం అందిస్తుంది. ఇంతకు మునుపు ఎవ్వరూ చెయ్యని ఒక పనిని నేను చేశానని, ఒక ద్వారాన్ని కూడా అత్యంత విశాలంగా తెరిచానని నేను చెప్పాను. నేను చెప్పిన ఈ మాటలను కొంతమంది అర్థం చేసుకున్నారు, ఎందుకంటే నేను చెప్పినది నిజంగా ఏమంత ఊహాతీతమైన విషయం కాదు. వ్యక్తిగతంగా, నాకు ఒక అలవాటు ఉంది: నా దగ్గర ఒక గజం మేర ఉంటే నేను ఒక అంగుళం మేర మాత్రమే ఉందని చెప్తాను, అయినా నేను గొప్పలు చెప్పుకుంటున్నానని మీరు వాదించొచ్చు, ఇప్పటికి చెప్పబడింది ఒక చిన్నిభాగం మాత్రమే. స్థాయుల మధ్య చాలా పెద్ద అంతరం ఉండడంవల్ల ఇంతకన్నా ఉన్నతస్థాయికి చెందిన దాఫాలో కొద్దిమాత్రం కూడా నేను మీకు బహిర్గతం చెయ్యలేను.

మా సిద్ధాంతంలోని ఆధ్యాత్మిక సాధన మీ అంతట మీరే వాస్తవంగా గోంగ్‌ను పొందగలిగిన శక్తిని ఇచ్చే మార్గంలో బోధిస్తుంది. మీరు చరిత్రను పరీక్షించవచ్చు – ఇది దివి, భువి ఏర్పడిన నాటినించి ఎన్నడూ జరగని అపూర్వమైన విషయం. మీరే స్వయంగా గోంగ్‌ను పొందుతారు కాబట్టి ఇది చాలా మంచిది, కానీ ఇది కష్టతరం కూడా. సామాన్య మానవుల యొక్క సంక్లిష్టమైన వాతావరణమూ, అందులో ఉన్న వ్యక్తుల మధ్య ఉండే షిన్ షిన్ సంఘర్షణల మధ్య, మీరు ఉన్నతంగానూ, వాటికి అతీతంగానూ ఎదగ

గలుగుతారు. ఇదే అత్యంత కష్టతరమైన విషయం. మీరు ఇష్టపూర్వకంగా మీ స్వప్రయోజనాలను సామాన్య మానవుల నడుమ వదులుకుంటున్నారు. ఒక ముఖ్యమైన స్వలాభాన్ని కోల్పోతున్నప్పుడు మీరు మానసికంగా బాధపడు తున్నారా? ఇతరుల కుతంత్రాలకు గురైనప్పుడు బాధపడుతున్నారా? మీ మిత్రులు, కుటుంబసభ్యులు బాధలు పడుతున్నప్పుడు మీరు బాధపడు తున్నారా? వాటిని మీరు ఎలా పరిగణిస్తున్నారు? సాధకుడిగా ఉండడంలోని కష్టం ఇది! ఎవరో నాతో "టీచర్, సామాన్య మానవుల మధ్య ఒక మంచి మనిషిగా ఉంటే చాలు. ఆధ్యాత్మిక సాధనలో ఎవరు సాఫల్యం పొందగలరు?" అని అన్నారు. అది విన్న తరవాత నేను నిజంగా నిరాశకు గురయ్యాను. అతడితో నేను ఒక్కమాట కూడా అనలేదు. అన్ని రకాల షిన్ షిన్‌లు ఉన్నాయి. ఒక వ్యక్తి తనకు సాధ్యమైనంత ఎక్కువగా జ్ఞానం పొందుతాడు : ఎవరు ఎంత ఎక్కువ జ్ఞానం పొందితే అంతగా లాభపడతారు.

లావో జి: "తావో మార్గం ఒక అనుసరణీయ మార్గం, కానీ అది ఒక సాధారణ మార్గం కాదు" అన్నారు. ఎవరైనా ఎక్కడ పడితే అక్కడ నేల మీదనించి తావోను ఏరుకొని దాన్ని విజయవంతంగా సాధన చెయ్యగలిగి ఉంటే, తావోకు ఇంత విలువ ఉండదు. మా సాధనాసిద్ధాంతం మీకు ఘర్షణల ద్వారానే గోంగ్‌ను సిద్ధింపచేస్తుంది. అందువల్ల మనం వీలైనంత వరకు సామాన్య వ్యక్తులకు దగ్గరగా మసలాలి. నిజానికి, మీరు ప్రాపంచికంగా ఏమీ పోగొట్టుకునే అవసరం ఉండదు. కానీ ఈ ప్రాపంచిక వాతావరణంలో మీరు మీ షిన్ షిన్‌ను ఉన్నతీకరించుకోవాలి. ఇందులో ఉన్న సౌలభ్యం ఇదే. మా సాధనా సిద్ధాంతం చాలా అనువైనది, ఎందుకంటే, ఒక వ్యక్తి సన్యాసి లేదా సన్యాసిని కావలసిన అవసరం లేకుండా సామాన్య మానవుల నడుమనే పొందడానికి అది శక్తిని ఇస్తుంది కాబట్టి, ఇది అత్యుత్తమమైనది. మా సాధనలో ఉన్న అతిప్రధానమైన విషయం ఇది, దీన్ని ఇవాళ నేను అందరిలో బయటపెట్టాను. అయితే, ప్రధాన ఆత్మ గోంగ్‌ను పొందినప్పుడు, సహాయక ఆత్మ కూడా దానిని పొందుతుంది, అది ఎందువలన? అన్ని సందేశాలు, జీవులు, మీ శరీరంలోని జీవకణాలు గోంగ్‌ను పొందుతున్నప్పుడు, సహాయక ఆత్మ కూడా ఖచ్చితంగా దాన్ని పొందు తున్నది: అయినప్పటికీ, దాని యొక్క

గోంగ్ స్థాయి, ఎప్పటికీ మీ స్థాయి అంత ఉన్నతంగా ఉండదు. మీరు యజమాని కాగా అది మీ ఫాకు రక్షణగా ఉంటుంది.

ఇది చెప్తున్నప్పుడు, సాధకుల సమాజంలో, ఉన్నత స్థాయులకు చేర్చే సాధన చెయ్యాలని నిరంతరమూ ప్రయత్నించినవారు అనేకులు ఉన్నారని కూడా చెప్పాలనుకుంటున్నాను. వారు ఎంతో ధనం ఖర్చు చేసి, ప్రతిచోటికీ తిరిగారు. దేశమంతటా తిరిగినా వారికి మంచి గురువులు దొరకలేదు. మంచి గురువు అన్నంతమాత్రాన ఆయనకు తప్పనిసరిగా అన్నీ తెలిసి ఉంటాయని అర్థం కాదు. చివరికి వారు ఎటువంటి ఫలితమూ లేకుండా ఎంతో ధనమూ, శ్రమ వెచ్చించి అటూ, ఇటూ తిరిగారు. ఇవాళ మేము మీకందరికీ ఈ గొప్ప సాధనను బహిర్గతం చేశాం. నేను ఇప్పటికే దీనిని మీ ముంగిటికి తెచ్చాను. మీరు ఆధ్యాత్మిక సాధన చేసి పూర్తి చెయ్యగలరా అన్న విషయం మీపై ఆధార పడి ఉంది. మీరు చెయ్యగలిగితే, మీ ఆధ్యాత్మిక సాధనను కొనసాగించండి. మీరు ఇలా చెయ్యలేకపోతే లేదా ఆధ్యాత్మిక సాధన చేయలేకపోతే, ఇప్పటి నించి మీరు దాని గురించి మరచిపోండి. మిమ్మల్ని మోసం చేసే దయ్యాలు తప్ప మరెవరూ మీకు బోధించరు, భవిష్యత్తులో ఎప్పుడూ ఆధ్యాత్మిక సాధన చెయ్యడం మీకు సాధ్యం కాదు. మిమ్మల్ని నేను రక్షించలేకపోతే, మరెవ్వరూ చెయ్యలేరు. నిజం చెప్పాలంటే, ఒక సనాతన ఫాకు చెందిన అసలైన గురువు లభించడం అంటే, స్వర్గానికి ఎక్కి వెళ్ళడం కంటే కష్టతరం. శ్రద్ధ తీసుకునే వారెవ్వరూ లేరు. ధర్మం అంతరించే కాలంలో, ఉన్నత స్థాయులు కూడా కల్పాంతంలో ఉన్నాయి. సామాన్య మానవుల గురించి ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ఇది అత్యంత సులభమైన సాధనాసిద్ధాంతం. పైగా ఇది నేరుగా విశ్వ లక్షణాన్ని అనుసరించి సాధన చెయ్యబడుతుంది. ఇది అతిత్వరితమైనది, చాలా సూటి అయిన మార్గం, అది ప్రత్యేకించి ఒక వ్యక్తి హృదయంపై దృష్టి కేంద్రీకరిస్తుంది.

## దివ్య వలయం

తావో సిద్ధాంతంలో పెద్దవి చిన్నవి అన్న దివ్య వలయాల గురించి బోధించ బడుతుంది. “దివ్య వలయం” అంటే ఏమిటో మేము వివరిస్తాం. దివ్య

వలయం అని మేము చెప్తున్నది రెన్, డు అన్న రెండు శక్తి నాడుల కలయిక. ఇది కేవలం వ్యాధినిర్మూలన, దేహపుష్టి నిలుపుకోవడం తప్ప ఎక్కువ లోతులేని పైపైన ఉన్న దివ్య వలయం. దీనిని చిన్న దివ్య వలయం అంటారు. ధ్యానంలో ఆధ్యాత్మిక సాధన చెయ్యడంకోసం అటు "చిన్న దివ్య వలయం" లేదా ఇటు "పెద్ద దివ్య వలయం" అన్న రెండు పేర్లతోనూ పిలవబడని మరొక విధమైన దివ్య వలయం ఉంది. ఒక వ్యక్తి శరీరం లోపల మొదలై నివాన్ చుట్టూ తిరిగి కింద దాన్ త్యన్ దగ్గరికి వస్తుంది, దానిచుట్టూ తిరిగి మళ్ళీ పైకి వస్తుంది. అది ఒక అంతర ప్రసరణ. ధ్యానంలో ఆధ్యాత్మిక సాధన చెయ్యడానికి ఇది నిజమైన దివ్య వలయం. ఈ దివ్య వలయం ఏర్పడిన తరవాత అది ఒక ప్రబలమైన శక్తి ప్రవాహంగా రూపొంది, ఇతర శక్తి నాడులు అన్నీ తెరవడం కోసం వందలకొద్దీ శక్తి నాడులను ఒక్క శక్తి నాడి ద్వారా కదిలిస్తుంది. తావో సిద్ధాంతం దివ్య వలయం గురించి చెప్పగా బుద్ధసిద్ధాంతం దాని గురించి చెప్పదు. బౌద్ధమతం ఏం బోధిస్తుంది? శాక్యముని తన ధర్మాన్ని బోధించినప్పుడు, వ్యాయామాలు అభ్యసించడం గురించి వివరించనూ లేదు, బోధించనూ లేదు. అయినప్పటికీ, ఆయన సాధనాపద్ధతిలో కూడా ఆధ్యాత్మిక సాధనలో ఆయన యొక్క స్వంత పరివర్తనా విధానం ఉంది. బౌద్ధమతంలో శక్తి నాడి ఎలా కదులుతుంది? అది బైహ్వే బిందువు దగ్గర మొదలై దాని ద్వారా ప్రసరిస్తుంది. తరవాత అది పెరిగి ఆ వ్యక్తి తలపైనించి శరీరపు క్రింది భాగానికి సుళ్ళు తిరుగుతున్నట్లుగా దిగి, చివరకు ఈ పద్ధతి ద్వారా వందలకొద్దీ శక్తి నాడులను కదిలిస్తూ వాటిని తెరిపిస్తుంది.

తంత్రశాస్త్రంలో మధ్యమ శక్తి నాడి కూడా ఇదే విధంగా పని చేస్తుంది. "మధ్యమ శక్తి నాడి అనేదే లేదు. ఇక తంత్రశాస్త్రం దానిని ఎందుకు అభివృద్ధి చేస్తుంది?" అని నాతో ఒకరు అన్నారు. నిజానికి, మానవ శరీరంలోని శక్తి నాడులను ఒక చోట చేరిస్తే, అవి కొన్ని వందలు లేదా పది వేల సంఖ్యలో ఉండొచ్చు. అవి రక్తనాళాలవలెనే అడ్డంగానూ, నిలువుగానూ కలిసి ఉంటాయి, అవి రక్తనాళాల సంఖ్యను సైతం అధిగమిస్తాయి; శరీర అంతర్భాగాల మధ్య రక్తనాళాలు ఉండవు, కానీ శక్తి నాడులు ఉంటాయి. అవి ఒక మనిషి శరీరంలో తల పైభాగంనించి వివిధ శరీర భాగాలకు నిలువుగానూ, అడ్డంగానూ

కలుస్తూ ఉంటాయి. బహుశా అవి మొదట నిలువుగా ఉండకపోవచ్చు, కలవడంకోసమే తెరుచుకుంటాయి. అప్పుడు అవి క్రమంగా విచ్చుకుంటూ, మెల్లగా నిలువుగా ఉండే శక్తి నాడిగా మారతాయి. ఆ శక్తి నాడి కేంద్రంగా తనంతట తానే గుండ్రంగా తిరుగుతూ, అనేక ఊహాచక్రాలను ముల్లువలె సమాంతర భ్రమణం లోకి తెస్తుంది. శరీరంలోని అన్ని శక్తి నాడులను తెరవడమే దాని లక్ష్యం.

ఒక్క శక్తి నాడి అనేక వందల శక్తి నాడులను కదిలించే ఈ పద్ధతిని మా ఫాలున్ దాఫాలోని ఆధ్యాత్మిక సాధన తప్పిస్తుంది. మొట్టమొదటనించే వందల కొద్దీ శక్తి నాడులు తెరుచుకొని ఒకేసారి భ్రమించడం మాకు అవసరం. మేము ఒక్క ఉదుటున ఒక అత్యున్నతస్థాయిలో సాధన చేస్తూ క్రింది స్థాయి విషయాలను తప్పించేస్తూ ఉంటాము. ఒక్క శక్తి నాడితో తక్కిన అనేక వందల శక్తి నాడులను తెరవడానికి కొందరికి ఒక జీవితకాలమంతా సరిపోక పోవచ్చు. కొందరు దశాబ్దాల తరబడి ఆధ్యాత్మిక సాధన చెయ్యక తప్పదు, అది అతికష్టం. అనేక సాధనలలో ఒక జీవితకాలం చాలదని చెప్పగా, ఉన్నత స్థాయి సాధనలు చేసే సాధకులలో అనేకులు తమ జీవితకాలాన్ని పొడిగించుకో గలిగినవారున్నారు – వారు దీర్ఘజీవనం కోసం సాధన చెయ్యడం గురించి మాట్లాడరా? వారు తమ ఆధ్యాత్మిక సాధన కోసం పొడిగించుకోగలరు, దానికి చాలా ఎక్కువ కాలం పడుతుంది.

చిన్న దివ్య వలయం మౌలికంగా వ్యాధినిర్మూలన, దేహపుష్టి నిలుపు కోవడం కోసం మాత్రమే కాగా పెద్దదైన దివ్య వలయం గోంగ్ కోసం సాధన చేసేందుకు ఉంది – అది కూడా ఒక వ్యక్తి నిజంగా ఆధ్యాత్మిక సాధన చేసినప్పుడే. తావో సిద్ధాంతం చెప్పే పెద్ద దివ్య వలయం, ఒక్కసారిగా వందలకొద్దీ శక్తి నాడులను తెరిపించే మా సాధనలో ఉన్నంతటి శక్తివంతంగా పని చెయ్యదు. తావో సిద్ధాంతం చెప్పే పెద్ద దివ్య వలయం యొక్క భ్రమణం అనేది ఒక వ్యక్తి చేతిలో ఉండే మూడు యిన్, మూడు యాంగ్ శక్తి నాడుల నించి ఒకసారి అతడి పాదాల క్రిందకు, రెండు కాళ్ళకు, జుట్టుకు, శరీర మంతటికీ ప్రయాణించే అనేక శక్తి నాడుల భ్రమణాన్ని తెలియజేస్తుంది. పెద్ద దివ్య వలయం కదలడం అంటే అదే. పెద్ద దివ్య వలయం కదలడం

ప్రారంభిస్తూనే, గోంగ్‌ను సాధన చేస్తుంది. అందువల్ల కొందరు చీ గోంగ్ గురువులు పెద్ద దివ్య వలయం గురించి బోధించరు, ఎందుకంటే వారు బోధించే విషయాలన్నీ వ్యాధినిర్మూలన, దేహపుష్టి నిలుపుకోవడం కోసమే. కొంతమంది పెద్ద దివ్య వలయం గురించి చెప్పారు కానీ, వారు మీ శరీరంలో ఏమీ నెలకొల్పలేదు, ఇక మీ అంతట మీరు వాటిని తెరవలేరు. ఆ వ్యవస్థను నెలకొల్పనిదే, కేవలం ఒక వ్యక్తి మానసిక సంకల్పం ఆధారంగా, అవి సులభంగా ఎలా తెరుచుకుంటాయి? అది ఏరోబిక్స్ చేసినట్లే – అది వాటిని ఎలా తెరవగలదు? ఆధ్యాత్మిక సాధన ఒక వ్యక్తి స్వంత ప్రయత్నం మీద ఆధారపడి ఉండగా, గోంగ్ పరివర్తనను గురువు చేస్తారు. అంతర "సంవిధానము"ను పూర్తిగా మీకు ఇచ్చిన తరవాతే, ఆ ప్రభావం ఉంటుంది.

చరిత్ర అంతటా తావో సిద్ధాంతం మానవ శరీరాన్ని ఒక చిన్న విశ్వంగా పరిగణించింది. విశ్వం యొక్క వెలుపలి అంచు, దాని లోపలి భాగం అంతటి పెద్దది అనీ, దాని వెలుపలి అంచు దాని లోపలి భాగంలాగే కనిపిస్తుందని అది నమ్ముతుంది. ఈ అభిప్రాయం నమ్మశక్యంగా ఉండదు, సులభంగా అర్థమూ కాదు. ఈ విశ్వం ఎంత పెద్దది – దానిని ఒక మానవ శరీరంతో పోల్చితే ఎలా? ఈనాటి మన భౌతికశాస్త్రం పదార్థపు మూలకాలను అణు సమూహాలు, అణువులు, ఎలెక్ట్రాన్లు, ప్రోటాన్లు, క్వార్కులు, న్యూట్రినోలు అని లెక్కిస్తుంది, అలా క్రిందకు లెక్కించుకుంటూ వెళ్తే ఈ వరుసలో తరువాత వచ్చే ప్రమాణం ఏమిటి? సూక్ష్మదర్శిని ఆ చోట దానిని కనిపెట్టలేదు, కాబట్టి ఆ తరవాతి సూక్ష్మాతిసూక్ష్మమైన నలుసు ఏమై ఉంటుంది? అది తెలియదు. నిజానికి నేటి మన భౌతికశాస్త్రపు అవగాహనకు, విశ్వంలోని అతిచిన్నపాటి సూక్ష్మపు నలుసులకు ఎంతో అంతరం ఉంది. ఒక మనిషి ఈ మాంసపు శరీరాన్ని కోల్పోయినప్పుడు, అతడి కళ్ళకు విస్తారమైన దృష్టి లభించి ఆ సూక్ష్మస్థాయిలో ఉన్నవాటిని చూడగలుగుతాయి. ఆ మనిషి స్థాయి ఎంత ఉన్నతంగా ఉంటే, అతడికి సూక్ష్మస్థాయిలో చూడగలిగిన శక్తి అంత ఎక్కువగా ఉంటుంది.

శాక్యముని తన స్థాయిలో మూడు వేల ప్రపంచాల సిద్ధాంతాన్ని ప్రస్తావించారు, అది ఏమిటంటే, ఈ పాలపుంతలో మానవజాతిలో ఉన్నట్లే

భౌతికశరీరాలుగల మనుషులు ఉన్నారు. ఒక్క ఇసుకరేణువులో మూడువేల ప్రపంచాలు ఉన్నాయని కూడా ఆయన చెప్పారు, ఇది మన ఆధునిక భౌతిక శాస్త్రం యొక్క అవగాహనతో ఏకీభవిస్తున్నది. ఎలెక్ట్రాన్లు కేంద్రకాల చూట్టూ పరిభ్రమించే పద్ధతికి, భూమి సూర్యునిచుట్టూ పరిభ్రమించే పద్ధతికి వ్యత్యాసం ఏమున్నది? అందువల్ల, సూక్ష్మస్థాయిలో ఒక్క ఇసుకరేణువు మూడువేల ప్రపంచాలను కలిగి ఉంటుందని శాక్యముని చెప్పారు. అది అచ్చంగా జీవము, పదార్థములను కలిగి ఉన్న విశ్వం వంటిదే. ఒకవేళ అది నిజమైతే, దీని గురించి ఆలోచించండి: ఆ ఇసుకరేణువులో ఉన్న ప్రపంచం లోనూ ఇసుక ఉందా? అందులో ఉన్న ఇసుకలోని రేణువులోనూ మూడువేల ప్రపంచాలు ఉన్నాయా? తిరిగి ఆ ఇసుకలోని ఇసుకలో మరొక మూడువేల ప్రపంచాలున్నాయా? అలా అన్వేషించుకుంటూ పోతున్నకొద్దీ, దానికి అంతు ఉండదు. కాబట్టి తథాగత స్థాయిలోనూ, శాక్యముని, "అది వెలుపలి అంచు లేనంతటి బ్రహ్మాండము, లోపలి అంచు లేనంతటి చిన్నిది", అన్న వ్యాఖ్య చేశారు. అది ఎంత పెద్దదంటే, దాని చుట్టుకొలత ఆయనకు కనిపించలేదు, అయినప్పటికీ, ఎంత చిన్నదంటే పదార్థపు మూలమైన అత్యంత సూక్ష్మపు నలుసును ఆయన కనిపెట్టలేకపోయారు.

ఒక చీ గోంగ్ గురువు, "ఒక్క స్వేదరంధ్రంలో కార్లు, రైళ్ళూ నడుస్తున్నట్టి నగరం ఉంది," అన్నారు. అది నమ్మశక్యం కానట్లు ధ్వనించినా, మనం వైజ్ఞానిక దృక్పథంనించి అవగాహన చేసుకొని అధ్యయనం చేసినట్లైతే అంతటి కల్పన కాదు. నేను ఒకరోజున దివ్యనేత్రం తెరుచుకోవడం గురించి చెప్పి నప్పుడు, చాలామంది, తమ దివ్యనేత్రం తెరుచుకున్నప్పుడు ఈ పరిస్థితిని గమనించారు. వారికి తాము తమ నుదురు లోపలి భాగంలోని ఒక సొరంగంలో దాని చివరకు చేరుకోలేనట్లు, పరుగులు పెడుతున్నట్లు అనిపించింది. ప్రతిరోజూ, తమ సాధన సమయంలో వారికి తాము ఇరువైపులా పర్వతాలూ, నదులూ కలిగి ఉన్న పెద్ద రహదారి వెంట పరుగులు పెడుతున్నట్లు, అనుభూతి కలిగింది. అలా పరుగెత్తుతున్నప్పుడు వారు నగరాల గుండా వెళ్తూ, ఎందరో ప్రజలను చూస్తారు, దానిని వారు ఒక భ్రమగా భావించవచ్చు. ఈ విషయం ఏమిటి? కనిపించే దృశ్యం చాలా స్పష్టంగా ఉంటుంది, భ్రమ కాదు. సూక్ష్మ

స్థాయిలో ఒక వ్యక్తి శరీరం ఒకవేళ నిజంగా అంత బ్రహ్మాండంవలె ఉంటే, అది భ్రమ కాదు అని నేను చెప్పాను. ఎందుకంటే, తావో సిద్ధాంతం ఎప్పుడూ మానవశరీరాన్ని ఒక విశ్వంగానే పరిగణించింది. ఇది నిజంగానే ఒక విశ్వం అయితే, నుదుటినించి వినాళగ్రంథికి మధ్యనున్న దూరం 108 వేల లీ కన్నా ఎక్కువ ఉంటుంది. మీరు బయటికి దూసుకుపోవచ్చు, కానీ ఆ దూరం అనంతం.

ఆధ్యాత్మిక సాధనాక్రమంలో పెద్ద దివ్య వలయం పూర్తిగా తెరుచుకుంటే అది సాధకుడికి ఒక అతీంద్రియ శక్తిని తెచ్చిపెడుతుంది. అది ఏ అతీంద్రియ శక్తి? పెద్ద దివ్య వలయమును "నాడుల దివ్య వలయం" అని, "చ్యెన్ కున్ భ్రమణం" (9) అని, లేదా "హు చు భ్రమణం" (10) అని కూడా చెప్తారని మీకు తెలుసు. ఒక అతితక్కువ స్థాయిలో, పెద్ద దివ్య వలయం యొక్క భ్రమణం ఒక శక్తి ప్రవాహంగా తయారవుతుంది, అది క్రమంగా మరింత ఘనీభవించి ఉన్నతస్థాయిలకు పరివర్తన చెందుతూ అధిక సాంద్రత గల శక్తి ఒక పెద్ద పటకా (శక్తి బెల్ట్)గా తయారవుతుంది. ఈ శక్తి పటకాకు భ్రమణ చలనం ఉంటుంది. ఆ భ్రమణంలో అది ఒక వ్యక్తి శరీరంలో చీని ఒక చోటినించి మరొకచోటికి మార్చడాన్ని, ఒక అతితక్కువ స్థాయిలో తెరుచుకున్న దివ్యనేత్రంతో చూడగలుగుతాము. గుండెలోని చీ ప్రేగులలోనికి పోవచ్చు, లేదా కాలేయంలోని చీ పొట్టలోనికి పయనించవచ్చు...... సూక్ష్మస్థాయిలో చూసినప్పుడు అది తీసుకువెళ్తున్నది చాలా పెద్దగా ఉన్నట్లు చూడొచ్చు. ఈ శక్తి పటకా అతడి శరీరం బయట విడుదల అయితే అది టెలి పోర్టేషన్ అనబడుతుంది. అతిశక్తివంతమైన గోంగ్ గల వ్యక్తి చాలా పెద్ద వస్తువును కదిలించగలుగుతాడు. దీనిని గొప్ప టెలి పోర్టేషన్ అంటారు. అంతగా బలం లేని గోంగ్ కలిగిన వ్యక్తి చాలా చిన్న వస్తువును కదిలించగలుగుతాడు, దానిని చిన్న టెలి పోర్టేషన్ అంటారు. ఇవీ టెలి పోర్టేషన్ ఉత్పత్తి, అందులోని రకాలు.

పెద్ద దివ్య వలయం నేరుగా గోంగ్ సాధనతో కలసి ఉంటుంది. ఆ విధంగా అది గోంగ్‌లో భిన్న పరిస్థితులను, రూపాలను కల్పిస్తుంది. అది మనకు ఒక ప్రత్యేకమైన స్థితిని కూడా కల్పిస్తుంది. అది ఎటువంటి స్థితి? **ఏ బయోగ్రఫీ ఆఫ్ ఇమ్మోర్టల్స్, డాన్ జింగ్, లావో జాంగ్** లేదా **షింగ్ మింగ్**

గ్విజి వంటి ప్రాచీన గ్రంథాలలో "పట్టపగలు గాలిలో తేలుతూ ఉండడం" (బైరి ఫెయిషింగ్) అన్న పదప్రయోగాన్ని అందరూ చదివే ఉంటారు. అంటే ఒక వ్యక్తి గాలిలో తేలడం స్పష్టంగా కనిపిస్తుంది అని అర్థం. నిజానికి ఒకసారి పెద్ద దివ్య వలయం తెరుచుకుంటే ఆ వ్యక్తి గాలిలో తేలగలుగుతాడు – ఇది చాలా సులభం అని నేను చెప్తున్నాను. ఎన్నో ఏళ్ళ సాధన తరవాత పెద్ద దివ్య వలయం తెరుచుకున్నవారు ఏ కొద్దిమంది మాత్రమే ఉండొచ్చని కొంతమంది అనుకుంటారు. నేనైతే కొన్ని వేలమంది ఆ స్థాయిని అందుకున్నారన్న విషయం కల్పన కాదు అంటాను, ఎందుకంటే పెద్ద దివ్య వలయం అన్నది ఆధ్యాత్మిక సాధనలో కేవలం మొట్టమొదటి మెట్టు మాత్రమే.

అయితే, మనుషులు గాలిలో తేలడం లేదా ఎగరడమన్నది ఇంతవరకు ఎవ్వరూ ఎందువల్ల చూడలేదు? సామాన్య మానవ సంఘాన్ని కలత పెట్టరాదు, దాని స్వరూపాన్ని అలక్ష్యంగా విచ్ఛిన్నం చేయడం, లేదా మార్చడం కూడదు. ప్రతివారూ గాలిలో ఎగరడానికి అనుమతి ఎలా ఉంటుంది? అప్పుడు అది సామాన్య మానవ సంఘంగా నిలుస్తుందా? ఇది ఒక ప్రాథమిక కోణం. మరొక దృక్పథంలో చూసినట్లైతే, మానవులు తమ స్వస్వరూపాలకు చేరుకోవడానికి ఉంటున్నారుగానీ, కేవలం మానవులుగా జీవించడంకోసం మాత్రమే సామాన్య మానవ సంఘంలో ఉండడం లేదు. జ్ఞానోదయం పొంద వలసిన అవసరం ఇక్కడ ఉంది. ఒక వ్యక్తి గనక నిజంగానే చాలామంది గాలిలో తేలగలుగుతున్నారని చూస్తే, అతడు కూడా అందుకోసం ఆధ్యాత్మిక సాధన చెయ్యాలి అనుకుంటాడు గానీ, జ్ఞానోదయం పొందడం అన్న అంశం అక్కడ ఉండదు. అందువల్ల, మీరు ఆధ్యాత్మిక సాధన ద్వారా గాలిలో తేలగలిగితే, దానిని అలక్ష్యంగా ఇతరులకు చూపడంగానీ, నేర్పడంగానీ చెయ్యకూడదు, ఎందుకంటే, వారు కూడా ఆధ్యాత్మిక సాధన చేయవలసిన అవసరం ఉంది. ఫలితంగా మీ పెద్ద దివ్య వలయం తెరుచుకున్నప్పుడు, మీ చేతి వ్రేలు, కాలి వ్రేలి కొస లేదా మీ శరీరంలోని ఏదో ఒక నిర్దిష్టభాగం బిగుసుకొనిపోవడంవల్ల మీరు గాలిలో తేలలేకపోతారు.

మనలో పెద్ద దివ్య వలయాలు తెరుచుకోబోయే ముందు, ఒక పరిస్థితి ఏర్పడుతుంది: అప్పుడు కూర్చొని ధ్యానం చేసే సమయంలో, కొంతమంది

ముందుకు వంగుతారు. వీపులో ప్రసరణ చక్కగా తెరుచుకోవడంవల్ల, వారికి శరీరపు వెనకభాగం తేలికగానూ, ముందరి భాగం బరువుగానూ అనిపిస్తుంది. కొందరేమో, వెనకభాగం బరువై, ముందువైపు తేలికగా అనిపించడంవల్ల వెనక వైపుకు వంగుతారు. మొత్తం శరీరమంతటా చక్కగా తెరుచుకున్నట్లైతే, మీకు మిమ్మల్ని పైకి ఎత్తి పట్టుకున్నట్లుగానూ, నేల విడిచి గాలిలో తేలుతున్నట్లుగానూ అనిపిస్తుంది. మీరు నిజంగా తేలగలిగినా, అది అనుమతింపబడదు – అయితే అది అందరి విషయంలో తప్పనిసరి కాదు. అతీంద్రియ శక్తులను పెంపొందించుకునే వారిలో రెండు భిన్నమైన రకాలవారు ఉంటారు. పసిపిల్లలకు బంధాలు ఉండవు, వృద్ధులకూ –ప్రత్యేకించి వృద్ధ స్త్రీలకు కూడా ఉండవు. వారు అతీంద్రియ శక్తులను సులభంగా పెంపొందించుకొని పరిరక్షించుకోగలుగుతారు. పురుషుల విషయానికి వస్తే, ప్రత్యేకించి యువకులకు, ఒకసారి అతీంద్రియ శక్తులు లభిస్తే, ఇతరుల ఎదుట వాటిని ప్రదర్శించకుండా నిగ్రహించుకోగలిగే మనస్తత్వం వారికి ఉండదు. అదే సమయంలో వాటిని సామాన్య మానవుల నడుమ పోటీ పడడానికి ఒక సాధనంగా వాడుకునే అవకాశం ఉంది. అందువల్ల ఆధ్యాత్మిక సాధన క్రమంలో అది పెంపొందిన వెంటనే బంధింపబడుతుంది, అది జరగడానికి అనుమతి ఉండదు. శరీరంలోని ఒక భాగం బిగుసుకుపోతే, ఆ వ్యక్తి గాలిలో తేలలేడు. దీని భావం మీరు ఈ స్థితి పొందడం పూర్తిగా నిషిద్ధమని కాదు. ప్రయత్నించడానికి మీకు అనుమతి ఉండొచ్చు. కొంతమంది ఎప్పటికీ దాన్ని ఉంచుకోగలుగుతారు.

నేను ఎక్కడ ఉపన్యాసాలు ఇచ్చినా, ఈ పరిస్థితులు చోటుచేసుకుంటాయి. నేను షాన్ డాంగ్‌లో తరగతిని నిర్వహించినప్పుడు, అందులో బీజింగ్‌నించి, జీనాన్ (11) నించి వచ్చిన సాధకులు ఉన్నారు. "టీచర్, నాకేమైంది? నడుస్తున్నప్పుడు నేలను విడిచినట్లు అనిపిస్తున్నది. ఇంట్లో నిద్రపోతున్నప్పుడు కూడా గాలిలో తేలిపోతున్నట్లుంది. మంచం మీది దుప్పట్లు కూడా ఒక బెలూన్‌లాగా ఎగిరిపోతున్నాయి" అని ఒకరు నాతో అన్నారు. గ్వేయాంగ్ (12)లో బోధించినప్పటి తరగతిలో గిజానించి వచ్చిన ఒక వృద్ధ సాధకురాలు ఉన్నారు. ఆమె గదిలో ఒక గోడ వైపుకు ఒకటి, మరొక గోడ వైపుకు మరొకటిగా రెండు మంచాలు ఉన్నాయి. ఆమె ఒక మంచం మీద కూర్చొని

ధ్యానం చేస్తూ, తాను గాలిలో తేలుతున్నట్లుగా అనుభూతి చెంది, కళ్ళు తెరిచినప్పుడు తాను రెండవ మంచం పైకి చేరినట్లు తెలుసుకున్నారు. ఆమె తనలోతాను "నేను నా మంచం మీదకు తిరిగి వెళ్ళాలి", అని చెప్పుకొని, మళ్ళీ వెనకకు తేలి వెళ్ళారు.

చింగ్ డా (13) లో ఉండే సాధకుడు ఒకరు మధ్యాహ్న భోజన విరామంలో చుట్టుపక్కల ఎవ్వరూ లేని సమయంలో ఒక మంచం మీద ధ్యానానికి కూచున్నారు. కూచున్న వెంటనే, దాదాపు ఒక మీటరు ఎత్తుకు తేలి, బలంగా పైకి, క్రిందకు కదలడం జరిగింది. పైకి లేచిన తరవాత క్రిందకు దిగడం, కొనసాగుతూనే ఉంది. మంచం మీది దుప్పటి సైతం నేల మీదకు విసురుగా పడింది. అతడు కొంత ఉద్విగ్నుడు అయ్యాడు, కొద్దిగా భయపడ్డాడు కూడా. ఈ కదలడం భోజన విరామ సమయం అంతా జరిగింది. చివరకు, కార్యాలయంలోని గంట మ్రోగింది. "ఇతరులు ఇదంతా చూడకూడదు. ఏం జరుగుతున్నదా" అని విస్తుపోతారు. "నేను దీన్ని త్వరగా ముగించాలి" అనుకొని, ఆపాడు. ఈ విధంగానే పెద్దలు తమను తాము నిగ్రహించుకోగలరు. ఇదే ఒక యువకుడి విషయంలో జరిగి ఉంటే, గంట మ్రోగినప్పుడు, "నేను గాలిలో తేలడం మీరంతా చూడాలి", అనుకునేవాడు. ఇక్కడే "చూడండి నేను ఎంత గొప్పగా సాధన చేశానో – నేను గాలిలో తేలగలను", అని గొప్పలు చూపించే మనస్తత్వాన్ని ఒక వ్యక్తి సులభంగా అదుపు చేసుకోలేకపోతాడు. ఒక్కసారి అతడు గొప్పగా చూపించుకున్నంతనే ఆ శక్తి పోతుంది, ఎందుకంటే అలా ఉండడానికి అనుమతింపబడదు. సాధకులలో ఇటువంటి సందర్భాలు ప్రతిచోటా ఉన్నాయి.

మొట్టమొదటనే వందలకొద్దీ శక్తి నాడులు తెరుచుకోవడం మాకు అవసరం. ఈపాటికి మా సాధకులలో ఎనభై నించి తొంభై శాతం వరకు తమ శరీరాలు చాలా తేలికపడి, వ్యాధిరహితమై ఉండే స్థితికి చేరుకున్నారు. అదే సమయంలో, మీరు ఈ తరగతిలో ఉన్నప్పుడు మీ శరీరం పూర్తిగా శుద్ధి అయ్యే ఈ స్థితిలోకి ప్రవేశపెట్టడమే కాకుండా, మీరు గోంగ్‌ను పెంపొందించుకోవడం కోసం, ఈ తరగతిలో మీ శరీరంలో అనేక వస్తువులు నెలకొల్పబడ్డాయి. ఇది మీ స్థాయిని పెంచి, మిమ్మల్ని ముందుకు నడిపించినట్లే.

నేను తరగతిలోని ప్రతివారికి ఫాను బోధిస్తూ ఉన్నాను, అలాగే అందరిలో షిన్ షిన్ నిలకడగా పెరుగుతూనే ఉంది. ఈ ఆడిటోరియంనించి బయటకు వెళ్ళిన తరవాత, మీలో చాలామంది తమలో మార్పులు కలిగినట్లు కనుగొంటారు, మీ దృక్పథం ఖచ్చితంగా మారుతుంది. భవిష్యత్తులో మీరు ఎలా ప్రవర్తించాలో మీకు తెలుస్తుంది, మీకు ఇకపై ఏ విధమైన అస్పష్టత ఉండదు. ఈ విధంగా ఉండడం తథ్యం. అందువల్ల, మీ షిన్ షిన్ ఇప్పటికే మెరుగుపడింది.

పెద్ద దివ్య వలయం గురించి చెప్తున్నప్పుడు, మీరు గాలిలో తేలడానికి అనుమతి లేకపోయినా, మీ శరీరం చాలా తేలికగా ఉన్నట్లు, గాలిలో నడుస్తున్నట్లుగా అనుభూతి పొందుతారు. గతంలో కొన్ని అడుగులు నడవగానే అలసిపోయిన మీకు ఎంత దూరమైనా నడవడం సులభమైపోతుంది. మీరు బైక్ నడుపుతున్నప్పుడు వెనకనించి ఎవరో తోస్తున్న అనుభూతి కలుగుతుంది, మేడ మెట్లు ఎక్కుతున్నప్పుడు – అక్కడ ఎన్ని అంతస్తులున్నా మీరు అలసిపోరు. ఇలా జరగడం తథ్యం. ఈ పుస్తకం చదివి స్వయంగా ఆధ్యాత్మిక సాధన చేసుకునేవారు కూడా, ఊహించిన విధంగానే ఈ స్థితిని చేరుకుంటారు. చెప్పకూడదని తలచిన ఒక విషయాన్ని చెప్పని మనస్తత్వం కలిగినవాడను నేను, కానీ నేను చెప్పేది నిజం అయి ఉండాలి. ప్రత్యేకించి ఈ పరిస్థితిలో, ఫాను బోధించడంలో నిజం చెప్పకపోతే, నమ్మశక్యం కాని వ్యాఖ్యలు చేస్తే, లక్ష్యశుద్ధి లేకుండా అలక్ష్యంగా మాట్లాడితే, నేను దుష్ట ఫాను బోధించినట్లే అవుతుంది. విశ్వమంతా గమనిస్తున్నది, కాబట్టి నాకు ఆ పని చెయ్యడం సులువు కాదు. ఒక వ్యక్తి దారితప్పడం అన్నది అనుమతింపబడదు.

ఒక సామాన్య వ్యక్తి ఈ పెద్ద దివ్య వలయం సాధిస్తే అంతటితో అన్నీ సాధించినట్లు అనుకుంటాడు. నిజం చెప్పాలంటే అది సరిపోదు. శరీరమంతా వీలైనంత త్వరగా అధిక శక్తి పదార్థంతో ప్రతిక్షేపించి పూర్తిగా పరివర్తన చెందడానికి మీ శరీరంలోని శక్తి నాడులన్నిటినీ నడపడానికి మరొక దివ్య వలయం అవసరం. దానిని "మావ్యూ (14) దివ్య వలయం" అంటారు, ఇది బహుశా అతికొద్దిమందికే తెలిసి ఉంటుంది. ఈ పదం అడపాదడపా పుస్తకాల్లో ప్రస్తావించబడుతూ ఉంటుంది కానీ ఎవ్వరూ దాని గురించి మీకు

వివరించ లేదు, చెప్పనూ లేదు. అది రహస్యాతి రహస్యం కనక కేవలం ఒక సిద్ధాంతంగా మాత్రమే చర్చించబడుతుంది. మేము ఇక్కడ మీకు దానినంతా వెల్లడిస్తాము. అది బైహ్వే బిందువు (లేదా హ్యూయిన్ బిందువు) వద్ద మొదలై, యిన్ యాంగ్‌ల మధ్యనున్న సరిహద్దు రేఖ వెంబడి కదలడానికి బయటకు వస్తుంది. తరవాత అది చెవి దగ్గరనించి క్రిందకు దిగి భుజం, చేతిలోని ప్రతి వేలు వెంబడి వెళ్తూ, శరీరపు ప్రక్కభాగంనించి మీ అరికాలికి చేరుతుంది. అప్పుడు పైకి కదిలి ఒక తొడ లోపలి భాగంలోకి ఎక్కి, మరొక తొడ లోపలి భాగంలో క్రిందకు దిగి, రెండవ అరికాలి దగ్గరకు దిగుతుంది. తరవాత అది ఒక తొడ లోపలి భాగం లోకి పైకి ఎక్కి, మరొక తొడ లోపలి భాగంలో దిగి అటువైపున్న అరికాలు క్రిందుగా వెళ్ళి మళ్ళీ శరీరానికి అటు వైపు పైకి వస్తుంది. అది మళ్ళీ చేతిలోని ప్రతి వేలి వెంబడి కదిలి ఒక వలయాన్ని పూర్తి చేస్తూ మీ తల పైకి చేరుతుంది. ఇది మావ్యూ దివ్య వలయం. ఇతరులు దీని గురించి ఒక పుస్తకమే రాయగలరు కానీ నేను కొన్ని మాటల్లో సంక్షిప్తంగా చెప్పాను. దీన్ని ఒక దివ్య రహస్యంగా పరిగణించకూడదని నేను తలుస్తాను కానీ ఇతరులకు ఈ విషయాలు చాలా విలువైనవిగా కనిపించి, తమ శిష్యులకు నిజమైన బోధన చేసేటప్పుడు తప్ప ఎప్పుడూ చర్చించరు. నేను దీనిని బయటపెట్టినప్పటికీ, మీలో ఎవ్వరూ సాధన చేసేటప్పుడు మానసిక సంకల్పం ఉపయోగించి దానిని నడపడం గానీ, అదుపు చెయ్యడం గానీ చెయ్యకూడదు. మీరు అలా చేస్తే ఫాలున్ దాఫాను సాధన చెయ్యనట్లే. ఉన్నత స్థాయిలకు చేర్చే అసలైన సాధన అన్నది వూవే స్థితిలో జరుగుతుంది, అందులో ఏ విధమైన మానసిక చర్యలు ఉండవు. ప్రతి వస్తువు ముందే తయారుచెయ్యబడి, మీ శరీరంలో నెలకొల్పబడుతుంది. అవి వాటంతట అవే ఏర్పడినవి, ఆ లోపలి యంత్ర వ్యవస్థలు మిమ్మల్ని సంస్కరిస్తూనే ఉంటాయి; నియమిత సమయం రాగానే అవి స్వీయ-భ్రమణాలు చేస్తూ ఉంటాయి. సాధన చేస్తున్నప్పుడు ఒక రోజున మీ తల ఒకవైపునించి మరొకవైపుకు ఊగొచ్చు. మీ తల ఇటు ఊగితే అది ఇటు భ్రమిస్తున్నట్లు. మీ తల అటు ఊగితే అటు భ్రమిస్తున్నట్లు. అది రెండు వైపులకు తిరుగుతుంది.

చిన్న లేదా పెద్ద దివ్య వలయం తెరుచుకున్నప్పుడు ఒక వ్యక్తి ధ్యానంలో

కూచున్నప్పుడు అతడి తల ఊగుతూ ఉంటుంది, శక్తి కదలికకు గుర్తు ఇది. మేము సాధన చేసే ఫాలున్ దివ్య వలయం విషయంలో కూడా ఇలాగే ఉంటుంది; మేము సరిగ్గా ఇలాగే సాధన చేస్తాము. నిజానికి మీరు సాధన చెయ్యనప్పుడు కూడా అది తనంతటతానే తిరుగుతూ ఉంటుంది. అది ఎప్పటికీ నిరంతరం తిరుగుతూనే ఉంటుంది; మీరు సాధన చేసినప్పుడు ఆ యంత్ర వ్యవస్థలను బలోపేతం చేస్తున్నారు. ఫా సాధకులను సంస్కరిస్తూ ఉంటుందని మనం చెప్పుకోలేదూ? సాధారణంగా, మీ దివ్య వలయం ఎప్పుడూ తిరుగుతూనే ఉన్నట్లు మీరు కనుగొంటారు. మీరు సాధన చేయక పోయినా మీ శరీరం వెలుపల నెలకొల్పబడిన ఈ శక్తి యంత్ర వ్యవస్థల పొర, అంటే, పెద్దవైన బాహ్య నాడుల పొర మీ శరీరాన్ని సాధనలో నడిపిస్తూ ఉంటుంది – అదంతా స్వయంచాలితము. అది వ్యతిరేక దిశలో కూడా తిరగ గలదు, ఎందుకంటే అది రెండువైపులా తిరుగుతుంది, అది నిరంతరమూ మీ శక్తి నాడులను తెరిపిస్తూ ఉంటుంది.

అయితే దివ్య వలయాన్ని తెరవడం యొక్క లక్ష్యం ఏమిటి? కేవలం దివ్య వలయాన్ని తెరవడం ఒక్కటే సాధన యొక్క లక్ష్యం కాదు. మీ దివ్య వలయం తెరుచుకున్నా కూడా అది ఏమంత గొప్ప కాదని నేను అంటాను. ఒక వ్యక్తి యొక్క ఆధ్యాత్మిక సాధన ముందుకు కొనసాగుతున్నప్పుడు, దివ్య వలయపు పద్ధతిని ఉపయోగించుకొని అతడు ఒక్క శక్తి నాడి ద్వారా వందలకొద్దీ శక్తి నాడులను తెరవడాన్ని లక్ష్యంగా చేసుకుంటాడు, ఆ విధంగా అతడు శరీరంలోని అన్ని శక్తి నాడులను తెరవగలుగుతాడు. మేము అలా చెయ్యడం ఇప్పటికే మొదలుపెట్టాము. సాధన కొనసాగించిన కొద్దీ, దివ్య వలయపు భ్రమణంతో శక్తి నాడులన్నీ ఒక వేలి వెడల్పున విస్తరించి, లోపల కూడా విశాలంగా తయారవడాన్ని అతడు తెలుసుకుంటాడు. ఆ శక్తి కూడా బలోపేతం కావడంతో, శక్తి ప్రవాహం ఏర్పడిన తరవాత అది చాలా వెడల్పుగానూ, ప్రకాశవంతంగానూ తయారవుతుంది. ఇది కూడా ఏమంత గొప్ప విషయం కాదు. సాధన ఎప్పుడు చక్కగా ఉన్నట్లు? అతడిలోని వందలకొద్దీ శక్తి నాడులు వాటిలోని శక్తి మరింత బలంగానూ, ప్రకాశ వంతంగానూ అవుతూ క్రమంగా విస్తరించాలి. చివరకు, వేలకొద్దీ శక్తి నాడులు

ఏకమై శక్తి నాడులు గానీ ఆక్యుపంక్చర్ బిందువు గానీ విడిగా లేకుండా అతడి శరీరాన్ని ఏకం చేస్తాయి; ఒకే శరీరంగా మారడానికి అవన్నీ ఏకం అవుతాయి. శక్తి నాడులను తెరవడానికి గల అత్యుత్తమ లక్ష్యం ఇదే. మానవ శరీరం అత్యంత – శక్తి పదార్థంతో పూర్తిగా పరివర్తన చెందడమే దాని లక్ష్యం.

ఆ సమయంలో ఒక వ్యక్తి శరీరం అత్యంత శక్తి పదార్థంతో మౌలికంగా పరివర్తన చెంది ఉంటుంది. మరొక రకంగా చెప్పాలంటే, అతడు త్రిలోకాంతర ఫా ఆధ్యాత్మిక సాధనలోని అత్యంత ఉన్నతస్థాయికి చేరుకున్నాడు. మాంసనిర్మిత మానవ దేహం అత్యుత్తమ స్థితి వరకు సంస్కరింపబడింది. ఆ సమయంలో ఆ వ్యక్తి మరొక పరిస్థితిని ఎదుర్కొంటాడు. అది ఎటువంటి పరిస్థితి? ఈ వ్యక్తి మహోన్నతమైన గోంగ్‌ను పెంపొందించుకొని ఉంటాడు. ఒక సామాన్య వ్యక్తి శరీరాన్ని సంస్కరించడంలో లేదా త్రిలోకాంతర ఫా ఆధ్యాత్మిక సాధన క్రమంలో, అన్నిరకాల మానవ అతీంద్రియ శక్తులు (పని చేయగలిగిన సామర్థ్యాలు), ప్రతి ఒక్క విషయమూ అభివృద్ధి చెందుతాయి. అయినప్పటికీ, సామాన్య మానవ సంఘంలో సాధన చేస్తున్నప్పుడు వాటిలో అనేకం బంధింపబడి ఉంటాయి. దీనికితోడు, ఆ వ్యక్తి గోంగ్ స్తంభం చాలా ఎత్తుకు పెరిగి ఉంటుంది. ఆ బలమైన గోంగ్‌వల్ల గోంగ్‌లోని అన్ని రూపాలు చాలా శక్తివంతంగా తయారవుతూ, బలోపేతం అవుతాయి. కానీ, అవి ఏ ఇతర పరిమాణంలో దేని మీదనూ ప్రభావం చూపక కేవలం ఈ మన పరిమాణం లోనే పనిచేస్తాయి, ఎందుకంటే అవి మన సామాన్య మానవ మాంసనిర్మిత శరీరాలతో సాధన చేసి పెంచుకున్న అతీంద్రియ శక్తులు. అయినప్పటికీ, అవి చాలా బలం కలిగి ఉన్నవే. భిన్న పరిమాణాలలోనూ, భిన్న పరిమాణాలలో ఉండే శరీరపు రూపాల రీత్యా చూసినప్పుడు చాలా మార్పులు వస్తాయి. ప్రతి ఒక్క పరిమాణపు స్థాయిలో ఉన్న ఈ శరీరపు రూపాలలో ఉండే వస్తువులు అతిపెద్దగా ఉండి, భయంకరంగా కనిపిస్తాయి. కొంతమంది శరీరాల మీద అంతటా కళ్ళు ఉంటాయి, వారి శరీరాల మీద స్వేద రంధ్రాలన్నీ కళ్ళుగా తయారవుతాయి. ఆ వ్యక్తి యొక్క మొత్తం పరిమాణ క్షేత్రం నిండా కళ్ళు ఉంటాయి. బుద్ధ సిద్ధాంతం ద్వారా పొందిన గోంగ్ కావడంవల్ల, కొంతమంది తమ శరీరాల నిండా బోధిసత్త్వ రూపం లేదా, బుద్ధ రూపం కలిగి ఉంటారు.

గోంగ్ యొక్క అన్ని రూపాలూ చాలా విశాలంగా విస్తరించి ఉంటాయి. దీనికి తోడు అనేక ప్రాణులు తమను తాము బయటకు వ్యక్తపరచుకుంటూ ఉంటాయి.

ఈ సమయంలో "తల మీద మూడు పువ్వులు కలవడం" అని చెప్పబడే పరిస్థితి సంభవిస్తుంది. అది ఆకర్షణీయమైనట్టి ఒక అతి విస్పష్ట స్థితి. తక్కువ స్థాయిలో దివ్యనేత్రం తెరుచుకున్న వ్యక్తి కూడా దాన్ని చూడగలుగుతాడు. ఒక వ్యక్తికి తల మీద మూడు పువ్వులు ఉంటాయి. వాటిలో ఒకటి తామరపువ్వు, కానీ అది మన భౌతిక పరిమాణంలోని తామరపువ్వు కాదు. తక్కిన రెండు పువ్వులు కూడా ఇతర పరిమాణాలలోనివే, అవి అసాధారణ సౌందర్యం కలిగినవి. ఈ మూడు పువ్వులు వంతుల వారీగా ఆ వ్యక్తి తల మీద తిరుగుతూ ఉంటాయి. అవి మూడూ సవ్య దిశలో లేదా అపసవ్య దిశలో తిరుగుతూ ఉంటాయి, వాటిలో ప్రతి ఒక్క పువ్వు కూడా దానంతట అది తిరగగలదు. ప్రతి ఒక్క పువ్వుకూ దాని యొక్క వ్యాసం ఎంత ఉందో అంత దళసరితనం కలిగిన పెద్ద స్తంభం ఉంటుంది. ఆ మూడు స్తంభాలూ ఆకాశం అందుకునేంత ఎత్తుకు చేరుకుంటాయి, కానీ అవి గోంగ్ యొక్క స్తంభం కావు – అవి కేవలం ఆ రూపంలో ఉంటాయి, అవి అత్యద్భుతమైనవి. మీరు గనక వాటిని చూడగలిగితే నిర్ఘాంతపోతారు. ఒక వ్యక్తి యొక్క ఆధ్యాత్మిక సాధన ఈ స్థితికి చేరుకున్నప్పుడు, అతడి శరీరం తెల్లగా, పరిశుద్ధంగా ఉండి, చర్మం తెల్లగా, సున్నితంగా ఉంటుంది. అప్పుడు, అతడు త్రిలోకాంతర ఫా ఆధ్యాత్మిక సాధనలోని అత్యున్నత రూపాన్ని చేరుకొని ఉంటాడు, కానీ ఇదే చిట్టచివరి స్థితి కాదు. అతడు ఇంకా ఆధ్యాత్మిక సాధనను కొనసాగిస్తూ ముందుకు వెళ్ళవలసిన అవసరం ఉంది.

ఆ వ్యక్తి ముందుకు సాగుతున్నకొద్దీ, త్రిలోకాంతర ఫాకు, త్రిలోకాతీత ఫాకు మధ్య ఒక విరామ స్థాయిలో ఉన్న శుద్ధ శ్వేత శరీరం ("స్ఫటిక శ్వేత శరీరం" అని కూడా పిలవబడుతుంది) లోకి ప్రవేశిస్తాడు. మానవ దేహం యొక్క సంస్కరణ త్రిలోకాంతర ఫాలోని అత్యున్నత రూపాన్ని చేరుకున్నప్పుడు అది కేవలం మాంసపు మానవ దేహం అత్యున్నత స్థాయికి పరివర్తన చెందడం మాత్రమే. మొత్తం శరీరం నిజంగా ఈ రూపంలో ఉన్నప్పుడు, అది

సంపూర్ణంగా అత్యంత శక్తి పదార్థంతో తయారవుతుంది. అది శుద్ధ శ్వేత శరీరంగా ఎందు చేత పిలువబడుతుంది? ఎందుకంటే, ఈ శరీరం ఇప్పటికే అత్యున్నత స్థితిలోని అత్యంత శుద్ధత్వాన్ని చేరుకున్నది. దివ్యనేత్రంతో దాన్ని చూసినప్పుడు, మొత్తంగా ఆ శరీరం పారదర్శకంగా – ఒక పారదర్శకమైన గాజుపలకలా కనిపిస్తుంది. అది ఈ స్థితిని ప్రదర్శించడం వల్ల, మీరు దానిని చూసినప్పుడు అక్కడ ఏమీ ఉండదు. క్లుప్తంగా చెప్పాలంటే, ఈ శరీరం ఇప్పటికే ఒక బుద్ధ – శరీరం. ఇలా ఎందుకంటే, అత్యంత – శక్తి పదార్థంతో తయారైన శరీరం మన భౌతిక శరీరాలకు చాలా భిన్నమైనది. ఆ స్థితిలో అన్ని అతీంద్రియ శక్తులు, నైపుణ్యాలూ ఒక్కసారిగా వర్జింపబడతాయి. అవన్నీ నిష్ప్రయోజనమై ఇకపై ఎందుకూ పనికిరావు కాబట్టి ఒక లోతైన పరిమాణంలో ఉంచబడతాయి. భవిష్యత్తులో మీరు ఆధ్యాత్మిక సాధనలో సఫలత పొంది నప్పుడు వాటిని ఒకసారి బయటకు తీసి చూసుకొని వెనుతిరిగి మీ ఆధ్యాత్మిక సాధన ప్రయాణాన్ని పునర్విచారణ చేసుకోవచ్చు. ఆ సమయంలో కేవలం రెండు వస్తువులే మిగిలి ఉంటాయి: గోంగ్ స్తంభం మిగిలి ఉంటుంది, ఆధ్యాత్మిక సాధనలో తయారైన అమృత శిశువు చాలా పెద్దదై ఉంటుంది. అయినప్పటికీ, ఆ రెండూ కూడా, సగటు–స్థాయి దివ్యనేత్రం కలిగిన వ్యక్తి సైతం చూడలేనటువంటి ఒక లోతైన పరిమాణంలో ఉంటాయి. ఎవరైనా చూడగలిగినదల్లా ఆ వ్యక్తి యొక్క పారదర్శకమైన శరీరాన్ని మాత్రమే.

శుద్ధ – శ్వేత శరీరపు స్థితి కేవలం ఒక విరామ స్థాయి మాత్రమే కావడం వల్ల, ఆధ్యాత్మిక సాధనను కొనసాగించడంతో ఒక వ్యక్తి నిజంగా బుద్ధ – శరీర ఆధ్యాత్మిక సాధన అనబడే త్రిలోకాతీత ఫా యొక్క ఆధ్యాత్మిక సాధనను ప్రారంభిస్తాడు. మొత్తం శరీరం గోంగ్‌తో తయారై ఉంటుంది. అప్పటికి, అతడి షిన్ షిన్ స్థిరంగా ఉంటుంది. అతడు కొత్తగా ఆధ్యాత్మిక సాధనను ప్రారంభించి అతీంద్రియ శక్తులను తిరిగి పెంపొందించుకుంటాడు. వాటిని ఇకపై ఎంతమాత్రమూ "అతీంద్రియ శక్తులు" అనకూడదు. వాటిని "బుద్ధ ఫా యొక్క దివ్యశక్తి" అని పిలవాలి, ఎందుకంటే, అవి తమ అపరిమిత శక్తితో అన్ని పరిమాణాలలోనూ పనిచెయ్యగలవు. మీరు భవిష్యత్తులో ఆధ్యాత్మిక సాధనను కొనసాగిస్తున్నకొద్దీ ఉన్నతస్థాయిలోని విషయాలనూ, ఆధ్యాత్మిక

సాధన ఎలా చెయ్యాలి, దాని రూపాలు ఎలా ఉంటాయి అన్నది, స్వయంగా తెలుసుకుంటారు.

## వీరాభిమానం అన్న బంధం

వీరాభిమానం అన్న బంధానికి సంబంధించిన అంశాన్ని నేను ప్రస్తావిస్తాను. అనేకులు చాలాకాలం చీ గోంగ్‌ను సాధన చేసి ఉన్నారు. ఎన్నడూ దానిని సాధన చేయకపోయినా, మానవ జీవితపు సత్యాన్ని, అర్థాన్ని అన్వేషించిన వ్యక్తులూ ఉన్నారు. ఒకసారి మా ఫాలున్ దాఫాను నేర్చుకుంటే, వారికి జీవితంలో తాము అర్థం చేసుకోవాలని కోరుకున్నప్పటికీ సమాధానం పొందలేకపోయిన అనేకమైన ప్రశ్నలకు సమాధానాలు దొరుకుతాయి. వారి మనసులు ఎదగడంతో పాటుగా వారు బహుశా చాలా ఆనంద ఉద్విగ్నులు అవుతారు – ఇది నిశ్చయం. ఒక అసలైన సాధకుడు దాని విలువను గ్రహిస్తాడని దాన్ని పదిలపరచుకుంటాడని నాకు తెలుసు. అయినప్పటికీ ఈ సమస్య తరచు సంభవిస్తుంది: మానవ సహజ ఉద్విగ్నత వల్ల, ఒక వ్యక్తి అనవసరంగా వీరాభిమానం అన్న బంధాన్ని పెంచుకుంటాడు. అది అతడు చేసే పనులలో, సామాన్య మానవ సంఘంలో ఇతరులతో మెలగడంలో లేదా సామాన్య మానవ సంఘపు వాతావరణంలో అసహజంగా ప్రవర్తించడానికి కారణం అవుతుంది. ఇది అంగీకార యోగ్యం కాదని నేను చెప్తాను.

మా సిద్ధాంతానికి చెందిన సాధన చేసే వ్యక్తులలో అత్యధికులు సామాన్య మానవ సంఘంలో ఆధ్యాత్మిక సాధన చేస్తారు, కాబట్టి మీరు సామాన్య మానవ సంఘానికి దూరం కారాదు, మీరు తప్పనిసరిగా ఒక స్పష్టమైన మనసుతో ఆధ్యాత్మిక సాధన చెయ్యాలి. మనుషుల మధ్య ఉన్నట్టి సంబంధాలు సాధారణంగా ఉండాలి. అయితే, మీలో అత్యున్నతమైన షిన్ షిన్, ధర్మబద్ధమైన మనసు ఉన్నాయి. మీరు మీ యొక్క షిన్ షిన్‌ను, స్థాయినీ ఉన్నతీకరించుకుంటారు; మీరు మంచి పనులే తప్ప చెడ్డ పనులు చెయ్యరు– ఇవన్నీ కేవలం దానికి వ్యక్తీకరణలు. కొందరు, తాము మానసికంగా అసాధారణత కలిగి ఉన్నట్లు లేదా తాము ఈ లౌకిక ప్రపంచాన్ని ఇప్పటికి చూసినది చాలన్నట్లు ప్రవర్తిస్తారు. ఇతరులు అర్థం చేసుకోలేని విషయాలను

వారు చెప్తారు. ఇతరులు "ఫాలున్ దాఫా నేర్చుకున్న మనిషి ఇలా తయారవడం ఏమిటి? చూడబోతే ఇతడికి ఏదో మానసిక సమస్య ఉన్నట్లుంది" అంటారు. నిజానికి అలా జరగదు. అతడు కేవలం విపరీతమైన ఆనందోద్రేకం కలిగిన కారణంగా లోకజ్ఞానం కోల్పోయి హేతుబద్ధత లేనట్లు కనిపిస్తాడు. అందరూ ఇది ఆలోచించండి: మీరు ఇలా ప్రవర్తించడం కూడా తప్పే, మీరు మరీ విపరీతంగా ప్రవర్తిస్తున్నారు – ఇది కూడా ఒక బంధమే. సామాన్య మానవుల నడుమ తక్కిన వ్యక్తులందరిలాగా సాధారణ జీవితాన్ని గడుపుతున్నప్పుడు మీరు దాన్ని వదులుకొని, ఆధ్యాత్మిక సాధనను చెయ్యాలి. సామాన్య వ్యక్తుల మధ్య మీరు మైమరచి ఉంటున్నారని ఇతరులు భావిస్తే మీతో కలిసిమెలిసి ఉండక, దూరంగా ఉంటారు. మీ షిన్ షిన్‌ను పెంచుకునే అవకాశాలను ఎవ్వరూ మీకు ఇవ్వరు, ఒక సాధారణ వ్యక్తితో వలె మీతో వ్యవహరించడం కూడా జరగదు – అది సరికాదని నేను అంటాను! అందువల్ల, ప్రతి స్త్రీ లేదా పురుషుడు ఈ విషయంపట్ల తప్పనిసరిగా శ్రద్ధ వహించి ప్రవర్తించాలి.

ఒక వ్యక్తిని పరధ్యానంలో పడవేసే లేదా సమాధిలో ఉంచే లేదా మైమరచిపోయేట్లు చేసే సాధారణ సాధనలకు మా సాధన భిన్నంగా ఉంటుంది. మా సాధనలో, మీరు పూర్తిగా స్పృహలో ఉండి ఆధ్యాత్మిక సాధన చెయ్యడం అవసరం. ఒకరు నాతో ఎల్లప్పుడూ: "టీచర్, నేను ఒకసారి కళ్ళు మూసు కున్నంతనే నా శరీరం ఊగిపోవడం మొదలవుతుంది" అంటారు. అది తప్పని సరిగా అలా ఉండాల్సిన అవసరం లేదని నేను చెప్తాను. మీరు ఇప్పటికే మీ ప్రధాన చైతన్యాన్ని వదిలివేయడం అలవాటు చేసుకున్నారు. ఒకసారి మీరు కళ్ళు మూసుకోగానే, మీ ప్రధాన చైతన్యానికి విశ్రాంతిని ఇచ్చేస్తారు, అది మాయం అవుతుంది. మీరు ఇప్పటికే ఈ అలవాటును పెంచుకున్నారు. ఇక్కడ కూచున్నప్పుడు మీ శరీరం ఎందుకు ఊగదు? మీ కళ్ళు తెరుచుకొని ఉన్న స్థితిని నిలుపుకొని ఉంటే, కళ్ళను అరమూతలు చేసుకొని ఉన్నా, మీ శరీరం ఊగుతుందా? అలా ఎప్పటికీ జరగదు. చీ గోంగ్‌ను ఇలా సాధన చెయ్యాలని మీరు అనుకుంటారు, అటువంటి భావనను పెంచుకున్నారు. ఒకసారి కళ్ళు మూసుకుంటే, మీరెక్కడున్నారో మీకే తెలియ కుండా మీరు మాయమైపోతారు. మీ ప్రధాన చైతన్యం స్పృహలో ఉండాలని

మేము చెప్తాము, ఎందుకంటే, ఈ సాధన మిమ్మల్నే సంస్కరిస్తున్నది. మీరు స్పృహలో ఉన్న మనసుతో పురోగమించాలి. మాకు ఒక ధ్యాన వ్యాయామం కూడా ఉంది. మనం ధ్యానాన్ని ఎలా సాధన చేస్తాం? మీరు ఎంత తీవ్రంగా ధ్యానం చేస్తున్నా, మీరు ఇక్కడ సాధన చేస్తున్నారన్న విషయం తప్పకుండా మీకు తెలిసి ఉండడం మాకు అవసరం. మీకు ఏమీ తెలియకుండా చేసే సమాధి స్థితిలో ఉండడం పూర్తిగా నిషేధం. అప్పుడు ఏ విధమైన ప్రత్యేక స్థితి ఏర్పడుతుంది? మీరు ఇక్కడ కూచుని ఉన్నప్పుడు, మీకు అద్భుతంగా అనిపించాలి, ఒక గుడ్డు పెంకు లోపల ఉన్నంత భద్రంగా అనిపించాలి; మీరు ఆ వ్యాయామాన్ని సాధన చేస్తున్నట్లు మీకు తెలుస్తూ ఉండాలి కానీ మీ శరీరమంతా కదలడం లేదని మీకు అనిపిస్తుంది. మా సాధనలో అలా జరగాలి. మరి ఒక స్థితి ఉంది, అందులో ఒక వ్యక్తి కొంతసేపు కూచున్న తరవాత, తన కాళ్ళు లేనట్లుగా అనిపిస్తుంది, అవి ఎక్కడికి పోయాయో కూడా అలోచించలేడు; శరీరం కూడా పోయింది; భుజాలు పోయాయి, చేతులు కూడా పోయాయి – తల ఒక్కటే మిగిలి ఉంది. అతడు సాధన చేస్తున్నకొద్దీ మనసు ఒకటే తాను అక్కడ సాధన చేస్తున్నాననే చిన్నపాటి ఆలోచనతో ఉన్నట్లు కాస్త పని చేస్తూ, తల కూడా పోయినట్లు అతడికి అనిపిస్తుంది. మనం ఈ స్థితిని సాధిస్తే అంత మాత్రం చాలు. ఇలా ఎందుకు? ఒక వ్యక్తి ఈ స్థితిలో సాధన చేస్తూ ఉంటే, అతడి శరీరం పూర్తిగా పరివర్తన చెందుతూ ఉంటుంది, ఇది అత్యుత్తమమైన స్థితి. అందువల్ల, మీరు ఈ ప్రశాంత స్థితిని అందుకోవాలని మేము కోరుతాము. అయితే, మీరు నిద్ర పోరాదు, స్పృహ కోల్పోకూడదు లేకపోతే మంచి విషయాలు మరొకరి చేత సాధన చేయబడవచ్చు.

మా సాధకులందరూ కూడా ఖచ్చితంగా, సామాన్య మానవుల మధ్య ఎన్నడూ చాలా అసాధారణంగా ప్రవర్తించకూడదు. మీరు సామాన్య మానవుల నడుమ దుష్ట భూమిక వహిస్తే, "ఫాలున్ దాఫాను నేర్చుకున్న వారందరూ ఇలా ఎందుకు ప్రవర్తిస్తారు?" అని ఇతరులు అనవచ్చు. అది ఫాలున్ దాఫా యొక్క కీర్తిని తగ్గించడమే, కాబట్టి ఈ విషయంలో తగిన శ్రద్ధ వహించడం మరచిపోకండి. ఇతర విషయాలలోనూ ఆధ్యాత్మిక సాధన క్రమంలోనూ వీరాభిమానం అన్న బంధాన్ని పెంచుకోకుండా తప్పనిసరిగా

జాగ్రత్త పడాలి – ఈ మనస్తత్వాన్ని దయ్యాలు సులభంగా తమ స్వార్థానికి వాడుకుంటాయి.

## వాక్శుద్ధి సాధించడం

గతంలో మతాలలో వాక్శుద్ధిని సాధించడం కూడా ఒక ఆవశ్యకతయే. అయితే, మతాలలో చెప్పబడిన వాక్శుద్ధిని సాధించడం అన్నది ప్రధానంగా కొందరు నిపుణ సాధకుల విషయంలోనే జరిగింది – భిక్షువులు, తావో అనుయాయులు మాట్లాడేందుకు నోరు విప్పేవారే కాదు. వారు నిపుణసాధకులు గనక, వారు మానవ బంధాలను చాలావరకు వదలివేయాలని భావించేవారు. ఒక వ్యక్తి ఆలోచించడమే కర్మ అని నమ్మేవారు. మతాలు కర్మను "సత్కర్మ"గానూ "పాపకర్మ"గానూ వర్గీకరించాయి. సత్కర్మా లేక పాపకర్మా అన్న పట్టింపు లేకుండా బుద్ధ సిద్ధాంతం చెప్పిన శూన్యమార్గం లేదా తావో సిద్ధాంతం బోధించిన ఏమీ లేదనే బోధన ప్రకారం, అది తయారుకాకూడదు. అందువల్ల తాము సంఘటనల యొక్క కర్మ సంబంధాలను చూడలేరు కాబట్టి, అంటే ఆ వ్యవహారాలు మంచివో, చెడ్డవో, లేదా ఎటువంటి కర్మ సంబంధాలు కలిగి ఉండేవో తెలియదు కాబట్టి తాము ఏమీ చెయ్యం అని వాదించేవారు. అంతటి స్థాయిని చేరుకోని ఒక సామాన్య సాధకుడు ఈ విషయాలను చూడలేడు కాబట్టి ఒక విషయం పైకి మంచిదిగా కనపడినా, ఆ పని చేసినప్పుడు చెడ్డది అవుతుందేమో అని కలవరపడతాడు. అందువల్ల అతడు వూవేని తన శక్తి మేరకు సాధన చెయ్యడానికి ప్రయత్నించి, కర్మను తయారుచెయ్యకూడదనే ఉద్దేశంతో ఏ పనీ చెయ్యడు. ఇలా ఎందుకంటే ఒకసారి కర్మ తయారైతే అతడు దానిని తొలగించుకోవడానికి బాధలను సహించవలసి వస్తుంది. ఉదాహరణకు మన సాధకులకు వారు ఏ స్థితిలో జ్ఞానోదయం పొందుతారో అన్నది ముందుగానే నిర్ణయింపబడి ఉంటుంది. మీరు అనవసరంగా మధ్య దారిలో దేనినైనా చొప్పిస్తే అది మీ ఆధ్యాత్మిక సాధన అంతటికీ సమస్యలు కల్పిస్తుంది. అందువల్ల అతడు వూవేని సాధన చేస్తాడు.

బుద్ధ సిద్ధాంతంలో వాక్శుద్ధి సాధించడం అవసరం, అంటే, ఒక వ్యక్తి వాక్కు అతడి ఆలోచన చేత నియంత్రింపబడుతుంది. అలాగే, అతడి

ఆలోచనలకు సంకల్పాలు ఉంటాయి. ఒక వ్యక్తి మనసు తానుగా కొంచెం ఆలోచించాలనుకున్నా, ఏదైనా వ్యక్తం చేయాలనుకున్నా, ఒక పని చెయ్యాలనుకున్నా, లేదా అతడి జ్ఞానేంద్రియాలను లేదా, చేతులు, కాళ్ళను ఆదేశించాలన్నా అది సామాన్య మానవుల నడుమ ఉన్నప్పుడు ఒక బంధం కాగలదు. ఉదాహరణకు "నువ్వు మంచివాడివి" లేదా "అతడు మంచివాడు కాడు" లేదా "నీ సాధన చక్కగా ఉంది గానీ అతడిది లేదు" వంటి పరస్పర సంఘర్షణలు వారి మధ్య ఉంటాయి. అవే సంఘర్షణలు. సాధారణంగా ఉండే "నాకు ఇది చెయ్యాలని లేదా అది చెయ్యాలనుంది" లేదా "ఈ వ్యవహారంలో ఇప్పుడు ఇలా చెయ్యాలి, లేదా అలా చెయ్యాలి" వంటి సాధారణ విషయం గురించి చెప్పుకుందాం. బహుశా అది అసంకల్పితంగానే ఎవరినైనా బాధ పెట్టొచ్చు. వ్యక్తుల మధ్య ఉండే సంఘర్షణలన్నీ అతిసంక్లిష్టంగా ఉన్న కారణంగా, ఒక వ్యక్తి అసంకల్పితం గానే కర్మను తయారుచెయ్యొచ్చు. ఫలితంగా, అతడు పూర్తిగా తన నోటిని కట్టేసుకొని ఏమీ అనకూడదని అనుకుంటాడు. గతంలో మతాలన్నీ వాక్శుద్ధి సాధనను చాల గంభీరమైన అంశంగా భావించాయి, మతంలో బోధింపబడినది ఇదే.

మా ఫాలున్ దాఫా సాధకులలో అత్యధికులు (అంటే, నిపుణ సాధకులు తప్పించి) సామాన్య మానవుల నడుమ ఆధ్యాత్మిక సాధన చేస్తారు. అందువల్ల వారు సామాన్య మానవ సంఘంలో సాధారణ జీవితం గడపడమూ, సంఘంలో ఉండే పరస్పర చర్యలనూ నివారించలేరు. ప్రతివారికీ ఒక పని ఉంది, వారు దానిని చక్కగా నిర్వహించాలి. కొందరు తమ పనిని మాట్లాడుతూ చెయ్యవలసి ఉంటుంది. కాబట్టి అది ఒక సంఘర్షణ కాదా? అది సంఘర్షణ కాదు. అది సంఘర్షణ ఎందుకు కాదు? మేము చెప్పే వాక్శుద్ధి సాధన మిగిలిన వాటికి చాలా భిన్నమైనది. సాధనా మార్గాలలోని వ్యత్యాసాలవల్ల, వాటి ఆవశ్యకతలు కూడా భిన్నంగా ఉంటాయి. మనం అందరమూ కూడా ఒక సాధకుని షిన్ షిన్‌ను బట్టి మాట్లాడాలి తప్ప, సంఘర్షణలు సృష్టించడం లేదా అసమంజసంగా మాట్లాడడం చెయ్యకూడదు. సాధకులుగా, మనలను మనం ఫా ప్రామాణికతతో అంచనా వేసుకుంటూ కొన్ని విషయాలను మనం మాట్లాడొచ్చా లేదా అని నిర్ణయించుకోవాలి. ఒక వ్యక్తి ఫాను అనుసరించి

సాధకులకు ఉండవలసిన షిన్ షిన్ ప్రమాణంతో వ్యవహరిస్తే ఏం మాట్లాడాలి అన్నది సమస్యయే కాదు. దీనికితోడు మనం తప్పనిసరిగా ఫా గురించి మాట్లాడి, ఫాను ప్రచారం చెయ్యాలి, కాబట్టి మనకు మాట్లాడకుండా ఉండడం అనేది అసంభవం. మేము బోధించే వాక్శుద్ధి సాధన ఏం సూచిస్తుందంటే: సామాన్య మానవ సంఘంలో ఒక వ్యక్తికి ఉన్న కీర్తి, స్వలాభాన్ని వదిలివేయ గలగడము, సాధకుల అసలైన పనితో ఎటువంటి సంబంధమూ లేని సాంఘిక విషయం, ఒకే సిద్ధాంతానికి చెందిన సాధకుల మధ్య అర్థం లేని గుసగుసలు, గొప్పలు ప్రదర్శించడానికి కారణమయ్యే బంధాలు, చెప్పుడు మాటలు, పుకార్లను ప్రచారం చెయ్యడం లేదా ఒక వ్యక్తి ఉద్రేకపడిన సాంఘిక విషయాల గురించిన చర్చలు. ఇవన్నీ సామాన్య మానవుల బంధాలని నా అభిప్రాయం. ఈ అంశాలలో మనం ఏం మాట్లాడుతున్నామో కొంచెం గమనించుకోవలసిన అవసరం ఉందని నేను భావిస్తాను – మేము చెప్తున్న వాక్శుద్ధి సాధన అంటే ఇదే. గతంలో భిక్షువులు ఈ విషయాలను అతిగంభీరమైనవిగా భావించేవారు, ఎందుకంటే, ఒక వ్యక్తి ఒకసారి ఆలోచించడం ప్రారంభిస్తే, కర్మను సృష్టిస్తాడు. అందువల్ల వారు "మనో వాక్ కాయా"లను సాధన చేసేవారు. కాయ సాధన అంటే వారి ఉద్దేశంలో ఒక వ్యక్తి దుష్కర్మలను ఆచరించరాదు అని అర్థం. వాక్ సాధన అంటే అతడు మాట్లాడరాదు అని అర్థం. మనో సాధన అంటే అతడు ఎన్నడూ ఆలోచించరాదని అర్థం. గతంలో మఠాలలో నిపుణ సాధన చేసేందుకు ఈ విషయాలలో కఠిన ఆవశ్యకతలు ఉండేవి. మనం ఒక సాధకుని షిన్ షిన్ స్థాయిని అనుసరించి ప్రవర్తించాలి. ఒక వ్యక్తి తాను ఏమి మాట్లాడాలో, ఏమి మాట్లాడకూడదో గ్రహించినంత కాలమూ, అంతా చక్కగానే ఉంటుంది.

* * * *

**అర్థములు:**

1. బీగూ – "ధాన్యాలు తినకపోవడం"; ఆహారము, నీరు వదిలివేయడం.
2. చోంగ్ చింగ్ – నైఋతి చైనాలో అతి జనసమ్మర్దమైన నగరం.

3. త్యన్ జ్వాంగ్ – తావో సిద్ధాంతానికి చెందిన నిలబడి చేసే ఒక రకమైన వ్యాయామం.
4. బై హ్వే – ఒక వ్యక్తి యొక్క శిరస్సు నడిమిభాగంలోనున్న ఆక్యుపంక్చర్ బిందువు.
5. ఫ్రషన్ – ఒక వ్యక్తి యొక్క ప్రధాన ఆత్మకు తావో పదం.
6. ల్యు డోంగ్ బిన్ – తావో సిద్ధాంతంలో ఎనిమిదిమంది దేవతలలో ఒకరు.
7. శక్తి నాడులు – చైనీయ వైద్యశాస్త్ర ప్రకారం శక్తి ప్రసరణ కోసం ఏర్పడియున్న జటిలమైన వలవంటి చీ నాళములు.
8. మూడు యిన్ మూడు యాంగ్ – రెండు కాళ్ళు, చేతులలో ఉన్నట్టి మూడు యిన్ మరియు మూడు యాంగ్ మర్మ బిందువులన్నిటికీ కలిపి పెట్టిన పేరు.
9. చ్యన్ కున్ – "దివి, భువి".
10. హు చు – "నది యానం".
11. జీ నాన్ – షాన్ డోంగ్ రాష్ట్ర రాజధాని.
12. గ్వే యాంగ్ – ఘి జౌ రాష్ట్ర రాజధాని.
13. చింగ్ డా – షాన్ డోంగ్ రాష్ట్రంలోని ఒక ఓడరేవు పట్టణం.
14. మావ్యా – యిన్ మరియు యాంగ్ ఇరుప్రక్కల మధ్యనున్న రేఖ.

* * * *

# తొమ్మిదవ ఉపన్యాసము

## చీ గోంగ్ మరియు శారీరక వ్యాయామాలు

ఒక సాధారణ స్థాయిలో, చీగోంగ్ నేరుగా శారీరక వ్యాయామాలకు సంబంధించినదని ప్రజలు తేలికగా తీసుకుంటారు. నిజానికి, ఒక క్రింది స్థాయిలో, ఆరోగ్యవంతమైన శరీరం పొందే దృష్టితో చూసినప్పుడు చీ గోంగ్, శారీరక వ్యాయామాలూ ఒకలాంటివే. అయితే, అందులోని ప్రత్యేకమైన వ్యాయామ పద్ధతులూ, పాటించే విధానాలూ శారీరక వ్యాయామాలకు చాలా భిన్నంగా ఉంటాయి. ఒక వ్యక్తి శారీరక వ్యాయామాల ద్వారా ఆరోగ్యవంతమైన శరీరం పొందాలంటే, తప్పనిసరిగా వ్యాయామ సమయాన్ని పెంచి, శారీరక శిక్షణను తీవ్రతరం చెయ్యాలి. అయితే, చీ గోంగ్ సాధన సరిగ్గా దీనికి వ్యతిరేకం, ఎందుకంటే దానికోసం మనిషి కదలవలసిన అవసరమే లేదు. ఒకవేళ ఏదైనా కదలిక ఉన్నప్పటికీ, సున్నితంగా, మెల్లగా, వంపులతో కూడి ఉంటుంది. కొన్నిసార్లు అది కదలికయే లేకుండా, స్థిరంగా కూడా ఉంటుంది – భంగిమ పరంగా చూస్తే, ఇది శారీరక వ్యాయామాలకు చాలా భిన్నంగా ఉంటుంది. ఒక అత్యున్నత దృక్పథంనించి చూస్తే, చీ గోంగ్ కేవలం వ్యాధినిర్మూలన, దేహపుష్టి వరకే పరిమితం కాదు, ఎందుకంటే, అది ఉన్నత స్థాయులకు సంబంధించినదీ, గంభీరమూ అయిన విషయాన్ని కూడుకొని ఉంటుంది. చీ గోంగ్ అన్నది సామాన్య వ్యక్తుల స్థాయికి చెందిన అల్పజ్ఞానం కాదు. అది మానవాతీతమైనదీ, భిన్న స్థాయులలో భిన్న రూపాలలో వ్యక్తమయ్యేది. అది సామాన్య వ్యక్తులకు చాలా అతీతమైన విషయం.

వీటిలోని వ్యాయామాల యొక్క విధానపరంగా చూసినా, అవి చాలా విభిన్నంగా ఉంటాయి. ఈ ఆధునిక కాలపు పోటీని, దాని లక్షణాలను బట్టి, శరీరాన్ని సంసిద్ధం చెయ్యడానికి ప్రత్యేకించి నేడు ఒక క్రీడాకారునికి అధిక

సమయం వ్యాయామం చెయ్యవలసిన అవసరం ఉంది. అందువల్ల, అతడు ఎల్లప్పుడూ తన శరీరాన్ని చక్కని ఆకృతిలో ఉంచుకోవాలి. ఈ లక్ష్యాన్ని సాధించడానికి శరీరంలో తగినంత రక్తప్రసరణను కలిగి ఉండడానికీ, తన జీవక్రియలను పెంచుకోవడానికి, శరీరాన్ని నిరంతరం మెరుగుపరచుకోవడానికి అతడు తప్పనిసరిగా అధిక సమయం వ్యాయామం చెయ్యవలసి ఉంటుంది. జీవక్రియలను ఎందుకు పెంచుకోవాలి? ఎందుకంటే ఒక క్రీడాకారుని శరీరం ఎప్పుడూ మెరుగుపడుతూ, పోటీకి సిద్ధంగా అత్యుత్తమ స్థితిలో ఉండాలి. మానవ శరీరం అసంఖ్యాకమైన జీవకణాలతో తయారై ఉంటుంది. అవన్నీ ఈ క్రింది ప్రక్రియను అనుసరించి ఉంటాయి. కొత్తగా విభజించబడిన జీవకణపు జీవితం చాలా చురుకుగా ఉంటూ, ఒక పెరుగుదల స్థితిని వ్యక్తం చేస్తుంది. అది పూర్తిగా ఎదిగిన తరవాత ఇక చివరి స్థితికి తరిగిపోవడమే తప్ప ఆపై ఏమాత్రమూ పెరగదు. అప్పుడు ఒక కొత్త జీవకణం దాని స్థానంలోకి వస్తుంది. ఉదాహరణకు, దానిని వర్ణించడానికి పగటి వేళలోని పన్నెండు గంటలను ఉపయోగించుకుందాం. పొద్దున ఆరు గంటలకు ఒక కణం విభజింపబడి ఒక పెరుగుదలను చూపిస్తుంది. అది ఎనిమిది, తొమ్మిది, పది గంటల వేళను చేరుకున్నప్పుడు అవన్నీ చాలా మంచి సమయాలే. మధ్యాహ్నం మొదలయ్యే సరికి, అది ఇక ఏమాత్రం పైకి కదలలేకపోతుంది, క్రిందకు మాత్రమే దిగిపోతుంది. ఆ సమయంలో, ఆ జీవ కణపు జీవితంలోని సగభాగం మిగిలే ఉంటుంది కానీ, ఆ సగభాగం ఒక క్రీడాకారుని పోటీ స్థితికి పనికివచ్చేది కాదు.

అటువంటప్పుడు ఏం చెయ్యాలి? ఆ వ్యక్తి, శిక్షణను తీవ్రతరం చేసి రక్తప్రసరణను పెంచాలి, అప్పుడు మాత్రమే కొత్తగా విభజన చెందిన రక్తకణాలు పాతవాటి స్థానంలోకి వస్తాయి. అది ఈ మార్గాన్ని అనుసరిస్తుంది. అంటే, ఆ జీవకణపు ప్రయాణమంతా ముగిసేలోగా లేదా దాని జీవితంలోని సగభాగం మాత్రమే దాటిన సమయంలో దాని స్థానంలో మరొకటి వస్తుంది. ఆ విధంగా ఆ శరీరం ఎల్లప్పుడూ బలాన్ని నిలుపుకుంటూ, మెరుగుపడుతూ కూడా ఉంటుంది. అయితే, మానవ జీవకణాలు ఈ రకంగా విభజన చెందడం జీవిత పర్యంతం జరగదు, ఎందుకంటే, జీవకణాల విభజనల సంఖ్య

పరిమితం. ఒకవేళ ఒక వ్యక్తి యొక్క జీవితకాలంలో ఒక జీవకణం వందసార్లు మాత్రమే విభజన చెందగలదని మాటవరసకు అనుకోండి. వాస్తవానికి అది పదిలక్షల సార్లకన్నా ఎక్కువగానే విభజింపబడగలదు. ఒక సామాన్య వ్యక్తిలో ఒక జీవకణం వందసార్లు విభజన చెందితే అతడు వంద సంవత్సరాలు జీవించగలడనుకోండి. కానీ ఇప్పుడు ఆ జీవకణం తన జీవితంలోని సగం కాలమే జీవిస్తున్నది, కాబట్టి అతడు యాభై సంవత్సరాలు మాత్రమే జీవించ గలుగుతాడు. అయినా, క్రీడాకారులకు పెద్ద సమస్యలు కలగడం మనం చూడలేదు, ఎందుకంటే, వారు తమ క్రీడాజీవితంనించి ముప్పై సంవత్సరాలకే విరమించవలసి వస్తున్నది. ముఖ్యంగా ఇప్పుడు పోటీస్థాయి చాలా ఎక్కువగా ఉంది, విరమణ చేసిన క్రీడాకారుల సంఖ్య కూడా చాలా ఎక్కువగా ఉంది. అందువల్ల ఒక క్రీడాకారుడు సాధారణ జీవనాన్ని తిరిగి ప్రారంభించగలడు, ఎక్కువ ప్రభావానికి లోనైనట్లు కనిపించడు. సైద్ధాంతికంగా ఇది తప్పనిసరిగా ఇలాగే జరుగుతుంది. శారీరక వ్యాయామాలు, ఒక వ్యక్తి ఆరోగ్యవంతమైన శరీరం నిలుపుకోవడానికి సహాయపడతాయేగానీ అతడి జీవితకాలాన్ని తగ్గించివేస్తాయి. ఒక క్రీడాకారుడు పదుల వయసులో ఇరవైలలో ఉన్నట్లు గానూ, ఇరవైలలో ముప్పైఏళ్ళ వయసులో ఉన్నట్లుగానూ కనిపిస్తాడు. అతడు త్వరగా వయసు మళ్ళినవాడిలా కనిపిస్తాడు. వాదనాపరంగా చూసినప్పుడు అన్ని విషయాలలోనూ, ఒక మంచి ఉంటే ఒక చెడు కూడా ఉంటుంది. వాస్తవంలో, అది ఈ రకంగా ఉంటుంది.

చీ గోంగ్ సాధన శారీరక వ్యాయామాలకు సరిగ్గా వ్యతిరేకంగా ఉంటుంది. అందులో శ్రమ కలిగించే కదలికలు ఉండవు. ఏదైనా కదలిక అంటూ ఉంటే, అది సున్నితంగానూ, మెల్లగానూ, వంపులతో కూడి ఉంటుంది. అది ఎంత సున్నితంగా, మెల్లగా ఉంటుందంటే కొన్నిసార్లు కదలికయే లేక, లేదా స్థిరంగా ఉంటుంది. సమాధి స్థితిలో కూచునే ఆధ్యాత్మిక సాధన పద్ధతిలో స్థిరమైన స్థితిలో కూచోవడం అవసరం అని మీకు తెలుసు. హృదయస్పందన, రక్తప్రసరణ, వంటి ప్రతిదాని వేగం తగ్గిపోతుంది. భారత దేశంలో, చాలారోజులు నీటిలో ఉండడం లేదా భూమి లోపల సమాధిగత స్థితిలో ఉండగల యోగసిద్ధులు అనేకులు ఉన్నారు. వారు తమనుతాము

ఎటువంటి చలనమూ లేకుండా చేసుకోగలరు, తమ హృదయ స్పందనను కూడా అదుపు చేయగలరు. ఒక వ్యక్తిలోని జీవకణాలు రోజుకు ఒకసారి విభజింపబడతాయనుకోండి. ఒక సాధకుడు తన శరీరంలోని జీవకణాల యొక్క విభజనను ప్రతి రెండు రోజులకు, వారానికి, పదిహేను రోజులకు లేదా చాలాకాలానికి ఒకసారి జరిగేటట్లు చేసుకోగలడు. ఆ విధంగా అతడు తన జీవితకాలాన్ని అప్పటికే పెంచుకున్నాడు. శారీరక సంస్కరణ లేకుండా కేవలం మానసిక ఆధ్యాత్మిక సాధన మాత్రమే గలిగిన సాధనలను ఇది సూచిస్తుంది, ఎందుకంటే, అవి సైతం దీనిని సాధించి అతడి జీవితాన్ని పొడిగించగలవు. “ఒక వ్యక్తి జీవితం లేదా జీవితకాలం ముందుగానే నిర్ణయింపబడి ఉంటుంది కదా? ఒక వ్యక్తి తన శరీర సంస్కరణ చెయ్యకుండానే అతడు అధిక కాలం ఎలా బ్రతికి ఉండగలడు?” అని ఎవరైనా అనుకోవచ్చు. నిజం. ఒక సాధకుడి స్థాయి త్రిలోకాతీత స్థితికి చేరితే అతడి జీవితకాలం పొడిగించబడవచ్చు కానీ, పైకి మాత్రం అతడు చాలా వృద్ధునిలాగా కనిపిస్తాడు.

శరీరాన్ని సంస్కరించే ఒక అసలైన సాధన నిరంతరమూ అత్యంత శక్తి పదార్థాన్ని ఆ వ్యక్తి శరీరపు జీవకణాల్లో నింపుతూ, క్రమంగా సామాన్య వ్యక్తివైన ఆ జీవకణాలను నిరోధిస్తూ వాటిని మెల్లగా ప్రతిక్షేపించడం కోసం నిరంతరమూ ఆ శక్తి యొక్క సాంద్రతను పెంచుతూ ఉంటుంది. ఆ సమయంలో ఒక గుణాత్మకమైన మార్పు జరిగి, ఆ వ్యక్తి ఎల్లప్పటికీ యువకుడిగా ఉంటాడు. అయితే, ఆధ్యాత్మిక సాధన అన్న ప్రక్రియ అతి మెల్లగానూ, క్రమబద్ధంగానూ సాగుతుంది, ఆ వ్యక్తి దానికోసం చాలా త్యాగం చెయ్యవలసి ఉంటుంది. ఒక వ్యక్తికి తననుతాను శారీరకంగానూ, మానసికంగానూ పదును పెట్టుకోవడం అంత సులభం కాదు. ఇతరులతో షిన్ షిన్ సంఘర్షణ వచ్చినప్పుడు ఒక వ్యక్తి శాంతంగా ఉండగలుగుతాడా? స్వప్రయోజనాలూ, స్వార్థం పట్ల ఆసక్తి పరీక్షకు నిలచినప్పుడు చలించకుండా ఉండగలడా? అలా ఉండడం అతికష్టం, కాబట్టి ఒక వ్యక్తి తన లక్ష్యాన్ని సాధించాలనుకున్నంత మాత్రాన, దానిని సాధించలేడు. అతడి షిన్ షిన్, పుణ్యం ఉన్నతిని పొందినప్పుడే, అతడు లక్ష్యాన్ని సాధించగలడు.

చీ గోంగ్‌కు, సాధారణ శారీరక వ్యాయామాలకు, అత్యంత వ్యత్యాసం ఉండగా చాలామంది అవి ఒకటే అనుకుంటారు; అవి ఒకటి కానే కాదు. కేవలం తప్పనిసరిగా ఒక ఆరోగ్యవంతమైన శరీరాన్ని కలిగి ఉండడం కోసం వ్యాధినిర్మూలనకు, దేహపుష్టి నిలుపుకోవడానికి మాత్రమే అతితక్కువ స్థాయిలో ఉన్న చీని సాధన చేసినప్పుడు మాత్రమే, ఆ అత్యల్పస్థాయి లక్ష్యం విషయంలో శారీరక వ్యాయామాలను పోలి ఉంటుంది. అయితే, ఒక ఉన్నతస్థాయిలో అవి రెండూ పూర్తి భిన్నమైన విషయాలు. చీ గోంగ్‌లోని శరీర శుద్ధికి కూడా ఒక ప్రయోజనం ఉంది, పైగా సాధకులు కొన్ని సామాన్య మానవ నియమాలను పాటించడం కాక మానవాతీత నియమాలకు అనుగుణంగా నడచుకోవలసి ఉంటుంది. కానీ శారీరక వ్యాయామాలు ఉన్నది కేవలం సామాన్య వ్యక్తుల కోసం మాత్రమే.

## మనోభావన

మనోభావన అంటే, మనిషి మనసు యొక్క చర్యలను సూచిస్తుంది. సాధకుల సమాజం దృష్టిలో మస్తిష్కంలోని మానసిక చర్యలు ఏ విధంగా ఉంటాయి? అది మానవుల ఆలోచనల (మనోసంకల్పం) యొక్క భిన్న రూపాలను ఎలా భావిస్తుంది? అవి ఎలా వ్యక్తమవుతాయి? మానవ మస్తిష్కం గురించిన అధ్యయనంలో అనేక ప్రశ్నలను ఆధునిక వైద్యవిద్య ఈనాటికీ పరిష్కరించలేక పోతున్నది, ఎందుకంటే, అది మన శరీరాల ఉపరిభాగాన్ని అధ్యయనం చేసినంత సులభం కాదు. లోతైన స్థాయులలో, భిన్న పరిమాణాలు భిన్న రూపాలను సంతరించుకుంటాయి. కానీ అది కొందరు చీ గోంగ్ గురువులు చెప్పినదానికంటే వేరుగా ఉంటుంది. ఏమి జరుగుతున్నదో కొంతమంది చీ గోంగ్ గురువులకే తెలియదు, దానిని వారు స్పష్టంగా వివరించనూ లేరు. ఒకసారి తమ మనసులో ఏదైనా ఒక భావం కలిగినప్పుడు, అలా చేసెయ్య గలమని తలుస్తారు. తమ ఆలోచనలు లేదా మనోభావనతో ఆ పనులు జరుగుతాయని వారు వాదిస్తారు. నిజానికి ఆ విషయాలు వారి మనోభావనవల్ల జరిగినవి కానే కావు.

మొట్టమొదటగా ఒక మనిషి ఆలోచనలకు మూలం ఏమిటో చెప్పు కుందాం. ప్రాచీన చైనాలో "హృదయంతో ఆలోచించడం" అన్న ప్రయోగం ఉండేది. దానిని హృదయంతో ఆలోచించడం అని ఎందుకు అనేవారు? ప్రాచీన చైనాలో వైజ్ఞానికశాస్త్రం ఎంతో అభివృద్ధి చెంది ఉండేది, ఎందుకంటే ఆ పరిశోధనలు నేరుగా మానవ దేహం, జీవితం, విశ్వం వంటి విషయాలను లక్ష్యంగా చేసుకొని జరిగేవి. కొందరు తమ మస్తిష్కాలు ఆలోచిస్తాయని భావిస్తుండగా మరికొందరు నిజానికి తమ హృదయాలు ఆలోచిస్తున్నాయని భావించేవారు. ఇటువంటి పరిస్థితి ఎందుకు కలిగింది? తమ హృదయాలు ఆలోచిస్తాయని కొందరు అన్నది సహేతుకమే. ఎందుకంటే ఒక సామాన్య వ్యక్తి యొక్క ప్రాథమిక ఆత్మ చాలా చిన్నది, మానవ మస్తిష్కంనించి వచ్చే సందేశాలు కేవలం మస్తిష్కం యొక్క పని కాదు – అవి అతడి ప్రాథమిక ఆత్మనించి తయారైనవే గానీ మస్తిష్కంలో జనించినవి కావు. ఒక వ్యక్తి యొక్క ప్రాథమిక ఆత్మ కేవలం నివాన్ భవనంలో మాత్రమే ఉండదు. తావో సిద్ధాంతంలో చెప్పబడిన నివాన్ భవనం అంటే మన ఆధునిక వైద్యశాస్త్రం వినాళ గ్రంథి అని తెలుసుకున్నది. ఒక వ్యక్తి యొక్క ప్రాథమిక ఆత్మ నివాన్ భవనంలో ఉంటే, అతడికి తన మస్తిష్కం ఏదో ఆలోచిస్తున్నదని లేదా సందేశాలను పంపిస్తున్నదని నిజంగా అనిపిస్తుంది. ఒకవేళ అది అతడి హృదయంలో ఉంటే హృదయం ఏదో ఆలోచిస్తున్నదని అతడికి నిజంగానే అనిపిస్తుంది.

మానవదేహం ఒక చిన్న విశ్వం. ఒక సాధకుడి శరీరంలో అనేక జీవులు తమ స్థానాలను పరస్పరం మార్చుకోగలిగే శక్తిని కలిగి ఉండొచ్చు. ఒక వ్యక్తి శరీరంలో ప్రాథమిక ఆత్మ తన స్థానాన్ని మార్చుకున్నప్పుడు, ఒకవేళ అతడి కడుపులోకి వెళ్తే తన కడుపు నిజంగా ఏదో ఆలోచిస్తున్నట్లు అతడికి అనిపిస్తుంది. అతడి ప్రాథమిక ఆత్మ గనక కాలి పిక్కలోకి లేదా మడమలోకి వెళ్తే నిజంగా అతడికి తన పిక్క లేదా మడమ ఏదో ఆలోచిస్తున్నట్లు అనిపిస్తుంది. ఇది ఒక కల్పనగా ధ్వనించినప్పటికీ, అది నిశ్చయంగా అలాగే ఉంటుంది. మీ ఆధ్యాత్మిక సాధన స్థాయి మరీ ఎక్కువగా లేనప్పుడు ఇటువంటి పరిస్థితి ఉందని మీరు తెలుసుకుంటారు. ఒక మానవ దేహానికి ఒకవేళ

ప్రాథమిక ఆత్మ గానీ, దృక్పథం, శీలం, వ్యక్తిత్వం వంటి విషయాలు గానీ లేకపోతే, అతడు కేవలం ఒక మాంసఖండం తప్ప, స్వీయ అస్తిత్వం కలిగిన సంపూర్ణ మానవుడు కాడు. కనుక, ఒక మనిషి మస్తిష్కం యొక్క విధులు ఏమిటి? ఈ భౌతిక పరిమాణంలో, అది కేవలం కార్యనిర్వహణ జరిపే ఒక కర్మాగారం మాత్రమే అయినట్లు నాకు కనిపిస్తున్నది. అసలైన సందేశం ప్రాథమిక ఆత్మ చేత వెలువరింపబడుతున్నది. అయినప్పటికీ ప్రసారం అయ్యేది ఒక భాష కాదు, కానీ ఒక నిర్దిష్టమైన అర్థం కలిగిన విశ్వసందేశం. అటువంటి ఒక ఆదేశాన్ని అందుకున్న తరవాత మన మస్తిష్కాలు మన ప్రస్తుత భాషగా లేదా ఆ విధమైన భావప్రకటనగా తయారుచేస్తాయి; వాటిని మనం చేతి సంజ్ఞల ద్వారా లేదా, కళ్ళు కళ్ళు కలపడం ద్వారా లేదా పూర్తి కదలికల ద్వారా ప్రకటిస్తాం. మస్తిష్కానికి కేవలం ఈ ప్రభావం మాత్రమే ఉంటుంది. అసలైన ఆదేశాలు, ఆలోచనలు ఒక వ్యక్తి యొక్క ప్రాథమిక ఆత్మనించి వస్తాయి. సాధారణంగా జనులు అవి నేరుగా మస్తిష్కం యొక్క స్వతంత్ర విధులని నమ్ముతారు. నిజానికి ప్రాథమిక ఆత్మ కొన్నిసార్లు హృదయంలో ఉంటుంది, కాబట్టి కొంతమందికి తమ హృదయాలు ఆలోచిస్తున్నట్లు నిజంగా అనిపిస్తుంది.

ప్రస్తుతం మానవదేహం గురించి పరిశోధన చేస్తున్నవారు మానవ మస్తిష్కం ప్రసారం చేసేది ఒక విద్యుత్తరంగంలాగా ఉంటుందని నమ్ముతారు. వాస్తవంగా ప్రసారమయ్యేది ఏమిటన్నది ముందుగానే మేము చెప్పం, కానీ అది ఒక రకమైన పదార్థం అని వారు గుర్తించారు. అందుచేత, అది ఒక మూఢనమ్మకం కాదు. ఆ పదార్థానికి ఏ ప్రభావాలుంటాయి? కొందరు చీ గోంగ్ గురువులు “నేను టెలిపోర్టషన్ చెయ్యడానికి, మీ దివ్యనేత్రాన్ని తెరవడానికీ, మీ వ్యాధులు తొలగించడానికి నా మనోభావనను ఉపయోగించ గలను” అని చెప్పుకుంటారు. వాస్తవానికి, కొందరు చీ గోంగ్ గురువులకు కనీసం తమకు ఏ అతీంద్రియ శక్తులు ఉన్నాయో తెలియదు, వాటి గురించి స్పష్టత కూడా ఉండదు. తాము ఏ విషయాన్నైనా ఆలోచించినంతసేపు దానికి సంబంధించిన పనిని చెయ్యగలమని మాత్రం వారికి తెలుసు. నిజానికి, అక్కడ పని చేస్తున్నది వారి యొక్క మనోభావన మాత్రమే. అతీంద్రియ

శక్తులు మస్తిష్కం యొక్క మనోభావనతో నడపబడుతున్నాయి, అవి మనో భావన యొక్క నేతృత్వంతో నిర్దిష్ట విధులు నెరవేరుస్తున్నాయి. అయినా, మనోభావన తనంతటతానే ఏమీ చెయ్యలేదు. ఒక సాధకుడు ఏదైనా నిర్దిష్టమైన పనిని చేసినప్పుడు ఆ పని చేసినది ఆ స్త్రీ లేదా పురుషునికి గల అతీంద్రియ శక్తులే.

అతీంద్రియ శక్తులు అంటే మానవదేహంలో కార్యశీలత కలిగిన సామర్థ్యాలే. మానవ సమాజపు అభివృద్ధితోపాటుగా మనిషి మనసు, "వాస్తవం" అన్నదానికి చాలా ప్రాధాన్యతనిచ్చి, ఆధునిక పరికరాలనబడే వాటిపైనే ఎక్కువగా ఆధారపడడం వలన, అధిక సంక్లిష్టం అయింది. ఫలితంగా మానవులలో జన్మతః వచ్చే సామర్థ్యాలు క్రమంగా క్షీణించి పోయాయి. తావో సిద్ధాంతం స్వస్వరూపానికి తిరిగి వెళ్ళడం గురించి బోధిస్తుంది. ఆధ్యాత్మిక సాధనాక్రమంలో మీరు సత్యాన్వేషణ చెయ్యాలి, చివరకు మీ స్వస్వరూపానికి, మీ స్వతః ప్రకృతికి చేరుకోవాలి. అప్పుడు మాత్రమే మీరు మీ జన్మతః వచ్చే సామర్థ్యాలను వెల్లడించగలుగుతారు. అవన్నీ నిజానికి జన్మతః వచ్చే మానవ సామర్థ్యాలై ఉండగా, ఈరోజుల్లో మనం వాటిని "అతీంద్రియ శక్తులు" అంటున్నాం. మానవ సంఘం పురోగమిస్తున్నట్లు కనిపిస్తున్నది కానీ, నిజానికి తిరోగమిస్తూ విశ్వ లక్షణానికి దూరమైపోతున్నది. ఝాంగ్ గ్వాలావో గాడిద నెక్కి, వెనకకు స్వారీ చేశాడని ఒక రోజున నేను చెప్పాను, కానీ ప్రజలు దానిని అర్థం చేసుకున్నట్లు లేదు. ముందుకు వెళ్ళడమంటే వెనకకు వెళ్ళడమని, మానవాళి విశ్వ లక్షణానికి దూరమైపోతున్నదని ఆయన కనుగొన్నారు. విశ్వ పరిణామక్రమంలో ప్రత్యేకించి వస్తుసంబంధ ఆర్థికవ్యవస్థ అన్న మహాకెరటంలో భాగమైన తరవాత ప్రజలు నైతికంగా చెడిపోయి, సత్యం-దయ-సహనం అన్న విశ్వ లక్షణానికి ఇంకా దూరమైపోతున్నారు. సామాన్య మానవులతోపాటు ఆ ప్రవాహంలో కొట్టుకు పోతున్నవారు మానవాళి నైతిక పతనం ఎంత మేర విస్తరించి ఉన్నదో తెలుసుకోలేరు. కాబట్టి కొందరు ఈ విషయాలు మంచివని కూడా భావిస్తారు. కేవలం ఆధ్యాత్మికంగా ఉన్నతీకరించుకున్న షిన్ షిన్ కలిగి ఉన్నవారే వెనుతిరిగి చూసినప్పుడు మానవ నైతిక విలువలు ఎంత విపరీతంగా క్షీణించిపోయాయో తెలుసుకోగలుగుతారు.

కొందరు చీ గోంగ్ గురువులు "నేను మీ అతీంద్రియ శక్తులను పెంపొందించగలను" అని చెప్పుకుంటారు. వారు ఏ అతీంద్రియ శక్తులను పెంపొందించగలరు? శక్తి లేనిదే ఒక వ్యక్తిలోని అతీంద్రియ శక్తులు పనిచెయ్యవు. అది లేనిదే మీరు వాటిని ఎలా పెంపొందించగలుగుతారు? ఒక వ్యక్తి యొక్క అతీంద్రియ శక్తులు అతడి స్వంత శక్తితో ఏర్పడడమూ, నిలచి ఉండడం జరగనప్పుడు మీరు వాటిని ఎలా పెంపొందించగలరు? అది పూర్తిగా అసంభవం. వారు అతీంద్రియ శక్తులను పెంపొందించడంగా చెప్పినది, మీలో ముందుగానే ఏర్పడి ఉన్న అతీంద్రియ శక్తులను మీ మస్తిష్కంతో అనుసంధానించడం తప్ప మరేమీ కాదు. అవి మీ మస్తిష్కం యొక్క మనోభావన ఇచ్చే ఆదేశాలను అనుసరించి పనిచేస్తాయి. అతీంద్రియ శక్తులు పెంపొందించే విషయంలో వారు చేసేది అంతే. వాస్తవంగా, ఈ చిన్న పని తప్ప, మీలో ఉన్న అతీంద్రియ శక్తులలో దేనినీ వారు పెంపొందించలేదు.

ఒక సాధకుడిలోని అతీంద్రియ శక్తులు పని చెయ్యడానికి అతడి మనోభావన ఆదేశాలు ఇస్తుంది. ఒక సామాన్య వ్యక్తికి మాత్రం కేవలం అతడి కాళ్ళు, చేతులు, జ్ఞానేంద్రియాలు పని చెయ్యడానికి, ఒక కర్మాగారంలోని ఉత్పాదన కార్యాలయంవలె అతడి మనోభావన నిర్దేశం చేస్తుంది. నిర్దేశకుడి కార్యాలయం ప్రత్యేక విధులు ఉన్న ప్రతి విభాగానికి తమ తమ విధులను నిర్వర్తించడానికి ఆదేశాలను పంపిస్తుంది. అది ఒక ప్రధాన సైనిక కార్యాలయం వలె కూడా పనిచేస్తుంది: సైన్యాధ్యక్షుని కార్యాలయం ఒక లక్ష్యసాధన కోసం యావత్తు సైన్యానికి ఆదేశాలనిచ్చి మార్గనిర్దేశం చేస్తుంది. నేను ఉపన్యాసాలు ఇవ్వడానికి బయటి ఊళ్ళకు వెళ్ళిన సమయంలో స్థానిక చీ గోంగ్ సంఘాల కార్యనిర్వాహకులతో తరచుగా ఈ అంశాలను చర్చించే వాడిని. వారందరూ "మానవుల మనసుకు ఎంతటి కార్యశీలత కలిగిన శక్తి, నిద్రాణమైన చైతన్యం ఉన్నాయా అని మేము అధ్యయనం చేస్తూ ఉన్నాము" అని చాలా ఆశ్చర్యపోయారు. నిజానికి అలా ఉండదు. వారు మొదటినించి పక్కదారి పట్టారు. మానవ శరీరశాస్త్రం అధ్యయనం చెయ్యడానికి ఒక వ్యక్తి తప్పనిసరిగా తన ఆలోచనాసరళిని విప్లవాత్మక పంథాలో మార్చుకోవలసిన అవసరం ఉంది. ఆ అతీంద్రియ విషయాలను అర్థం చేసుకోవడానికి ఒక వ్యక్తి

సామాన్య ప్రజల యొక్క నిర్ణాయక పద్ధతులను, విషయాలను అర్థం చేసుకోవడంలో వారి పంథాను అన్వయించరాదు.

మనోభావన గురించి చెప్పుకుంటే, దానికి అనేక రూపాలున్నాయి. ఉదాహరణకు కొంతమంది అస్పష్టమైన ఎరుక, సుప్తచైతన్యం, ప్రేరేపణ, కలలు వంటివి చెప్తారు. కలల గురించి చెప్పాలంటే, ఏ చీ గోంగ్ గురువు కూడా వాటిని వివరించడానికి సుముఖంగా లేరు. మీరు ఇక్కడ పుట్టినప్పుడు, అదే సమయంలో విశ్వంలోని అనేక పరిమాణాలలో కూడా పుట్టినందువల్ల, ఆ ఇతర మీ రూపాలు మీతో ఒక సంపూర్ణమైన, ఏకరూపత చెంది, మానసికంగా అనుసంధానింపబడి, ఒకదానితో ఒకటి సంబంధం కలిగి ఉంటాయి. దీనికితోడు, శరీరంలో మీ స్వంత ప్రధాన ఆత్మ, సహాయక ఆత్మ, అనేక ఇతర జీవుల రూపాలను మీరు కలిగి ఉన్నారు. ఇతర పరిమాణాలలోని మీ రూపాలలో ఉన్న ప్రతి జీవకణమూ, అంతరభాగాలు మీ రూపంలోని సందేశాన్ని కలిగి ఉంటాయి. అందువల్ల అది అతిసంక్లిష్టం. ఒక కలలోని విషయాలు ఒక క్షణంలో ఒక రకంగానూ, మరొక క్షణంలో మరొక రకం గానూ ఉండొచ్చు. ఏమైనా, అవి ఎక్కడినించి వచ్చాయి? మనిషి మెదడులోని కార్టెక్స్ అన్న భాగంలో వచ్చే మార్పులవల్ల అలా జరుగుతుందని వైద్యశాస్త్రంలో చెప్పబడింది. ఇది ఆ ప్రతిచర్యకు భౌతికరూపం. నిజానికి, అది మరొక పరిమాణంనించి వచ్చిన సందేశాలు అందుకోవడంవల్ల కలిగిన ఫలితం. అందువల్ల కలలో ఉన్నప్పుడు మీకు అయోమయంగా అనిపిస్తుంది. దానివల్ల మీకు ఏమీ అవదు, మీరు దానిని పట్టించుకోవలసిన అవసరమూ లేదు. మిమ్మల్ని నేరుగా కలవరపరచే ఒక రకమైన కల ఉంది. అటువంటి కలను మనం "కల" అనకూడదు. మీ ప్రధాన చైతన్యం లేదా ప్రధాన ఆత్మ మీ కుటుంబ సభ్యులు ఒకరు మీ దగ్గరికి వచ్చినట్లు, మీకు నిజంగానే ఏదో అనుభవం కలిగినట్లు, లేదా మీరు ఏదో చూసినట్లో, చేసినట్లో కల గంటుంది. ఈ సందర్భాలలో, మీ ప్రధాన ఆత్మ నిజంగానే మరొక పరిమాణంలో ఏదో చేసిందని లేదా చూసిందని అర్థం, ఎందుకంటే, మీ చైతన్యం స్పష్టంగా, సత్యంగా ఉంటుంది. ఈ విషయాలు నిజంగానే ఉంటాయి, కాకపోతే అవి మరొక భౌతిక పరిమాణం లోనూ, మరొక దేశ-కాలంలోనూ చెయ్యడం

సంభవిస్తుంది. దానిని మీరు కల అని ఎలా అనగలరు? అది కాదు. వాస్తవానికి, ఇక్కడ మీ భౌతిక శరీరం నిద్రలో ఉంది, కాబట్టి మీరు దానిని ఒక కల అని మాత్రమే చెప్పగలుగుతారు. కేవలం ఆ రకమైన కలలు మాత్రమే నేరుగా మీకు సంబంధించినవి.

మానవ ప్రేరేపణ, సుప్తచైతన్యం, అస్పష్టమైన ఎరుక మొదలైన వాటి గురించి చెప్పాలంటే, ఈ పదాలు శాస్త్రజ్ఞులు పెట్టినవి కావు. అవి రచయితల చేత కల్పించబడిన పదాలు, సామాన్య ప్రజల ఆచారాలపై ఆధారపడి ఉన్నవి– అవి అశాస్త్రీయమైనవి. ప్రజలు చెప్పే "అస్పష్టమైన ఎరుక" ఏమిటి? దీనిని స్పష్టంగా వివరించడం కష్టం, అతి సందిగ్ధకరమైనది, ఎందుకంటే మానవుల సందేశాలలో చాలావరకు సంక్లిష్టమైనవి ఉంటాయి, ఒక రూపమంటూ లేని జ్ఞాపకాల పోగులవలె కనిపిస్తాయి. ప్రజలు చెప్పే సుప్త చైతన్యం విషయానికి వస్తే మనం దానిని సులభంగానే వివరించవచ్చు. సుప్తచైతన్యం అన్న పదానికి నిర్వచనం, సాధారణంగా ఒక మనిషి తనకు తెలియకుండానే ఒక పని చెయ్యడం అని సూచిస్తుంది. సాధారణంగా, అతడు ఆ పనిని ఉద్దేశ్యపూర్వకంగా చెయ్యలేదని, సుప్తచైతన్యంలో ఉండగా చేశాడని ఇతరులు అంటారు. ఈ సుప్త చైతన్యం అన్నది అచ్చంగా మేము ప్రస్తావించిన సహాయక ఆత్మ వంటిదే. ఒక వ్యక్తి యొక్క ప్రధాన చైతన్యం మస్తిష్కాన్ని అదుపు చెయ్యకుండా విశ్రాంతిగా ఉంటే, అతడు గాఢనిద్రలో ఉన్న విధంగా, అతడికి స్పష్టమైన చైతన్యం ఉండదు. ఒక కలలోగానీ, సుప్తచైతన్యంలోగానీ ఉన్న ఒక వ్యక్తి తన సహాయక చైతన్యం లేదా సహాయక ఆత్మచేత సులభంగా అదుపు చేయబడతాడు. ఆ సమయంలో సహాయక ఆత్మ కొన్ని పనులు చేయగలుగుతుంది, అంటే, మీరు ఒక అస్పష్టమైన మనసుతో పనిచేస్తారు. అయినప్పటికీ ఆ పనులు చాలావరకు చక్కగా జరుగుతాయి, ఎందుకంటే, సహాయక ఆత్మ ఆ విషయం ఎటువంటిది అని మరొక పరిమాణంనించి చూడగలిగి ఉండి, మన సామాన్య మానవ సంఘంవల్ల దారి తప్పడమనేది జరగదు. అందువల్ల ఒక వ్యక్తి తాను చేసిన పని ఏమిటన్నది తెలుసుకున్నప్పుడు, : "నేను ఈ పనిని ఇంతగా చెడగొట్టానా? ఒక స్పష్టమైన మనసుతో ఉండి ఉంటే ఈ విధంగా చేసి ఉండేవాడిని కాదేమో?" అని పునర్విమర్శించుకొంటాడు. మీరు ఇప్పుడు అది సరిగ్గా లేదనుకోవచ్చు

కానీ ఒక పది, పదిహేను రోజుల తరవాత : “ఆహా! ఎంత చక్కగా జరిగింది! అయితే నేను ఎలా చెయ్యగలిగాను?” అనుకుంటారు. సహాయక ఆత్మ ఆ క్షణంలో ఏ ప్రభావం ఉంటుందో పట్టించుకోదు కాబట్టి, ఏది ఏమైనా అది భవిష్యత్తులో, మంచి ప్రభావం చూపిస్తుంది. ఆ క్షణంలో ప్రభావం చూపించి భవిష్యత్తులో ఎటువంటి ఫలితాలనూ చూపని విషయాలు కూడా కొన్ని ఉంటాయి. సహాయక ఆత్మ ఈ పనులు చేసినప్పుడు, ఆ క్షణంలో అది చాలా మంచి పని చేసి ఉండవచ్చు.

ఇంకొక రకం ఉంది: మీలో అత్యుత్తమ జన్మ సంస్కారం ఉంటే మీరు సులభంగా ఉన్నత జీవుల ఆధీనంలో పనులు చేస్తారు. అయితే, ఇది మరొక అంశం, ఇక్కడ దాని ప్రస్తావన ఉండదు. ప్రధానంగా మనలో పుట్టిన ఆలోచనల గురించి మేము చర్చిస్తాం.

“ప్రేరేపణ” విషయానికి వస్తే, అది కూడా రచయితల చేత కల్పించబడిన పదమే. ప్రేరేపణ అంటే, ఒక వ్యక్తి తన జీవితకాలం అంతటిలో సమకూర్చుకున్న జ్ఞానం, మరొక జన్మలో ఒక్క క్షణంలో, మెరిసే మెరుపులా విచ్చుకొని రావడం అని సాధారణంగా నమ్ముతారు. భౌతికవాద (1) దృక్పథం ప్రకారం, ఒక వ్యక్తి తన జీవితంలో ఎంతగా జ్ఞానసముపార్జన చేస్తుంటే, అంతగా, అతడు తన బుద్ధిని ఉపయోగిస్తుంటాడు, అది కూడా మరింత నిశితంగా తయారవుతుంది. అతడు దాన్ని ఉపయోగిస్తున్నంత కాలమూ అది నిరంతరాయంగా పనిచేస్తూ ఉండాలి, అక్కడ ప్రేరేపణ అన్న అంశం ఉండరాదు. ప్రేరేపణ అని చెప్పబడు తున్నది, వచ్చినప్పుడు, ఇట్టి స్థితిలో ఉండదు. సాధారణంగా ఒక వ్యక్తి తన మెదడును ఉపయోగిస్తున్నప్పుడు, తన జ్ఞానం అంతా ఇగిరిపోయింది, ఇక తానేమీ చెయ్యలేడు అనిపించేంతవరకు ఉపయోగిస్తూనే ఉంటాడు. ఒక రచన చేస్తున్నప్పుడు ఆపై రాయలేకపోతాడు, ఒక సంగీతపు అంశాన్ని సమకూరుస్తు న్నప్పుడు ఎటువంటి కల్పన తట్టదు, ఒక విజ్ఞాన పరిశోధనా ప్రణాళికను పూర్తిచెయ్యలేకపోతాడు. సాధారణంగా అటువంటి సమయంలో అతడు అలసిపోయి ఉంటాడు, మెదడు పనికి రాకుండా పోతుంది, నేలపై సిగరెట్ పీకలు చిందరవందరగా పడి ఉంటాయి. అతడు చిక్కులో పడతాడు, తలనొప్పి వస్తుంది, అయినా అతనికి ఎటువంటి ఆలోచనలు స్ఫురించవు. చివరకు ఏ

పరిస్థితిలో ప్రేరేపణ ప్రత్యక్షమవుతుంది? అతడు అలసిపోయి ఉంటే, "ఇక చాలిద్దాం, నాకు విరామం కావాలి" అనుకుంటాడు. ఎందుకంటే అతడి ప్రధాన చైతన్యం ఎంత ఎక్కువగా అతడి మస్తిష్కాన్ని అదుపు చేస్తుంటే, ఇతర జీవులు అంత తక్కువగా ప్రవేశించగలుగుతాయి; ఆ విరామంవల్లనూ, అతడి మనసుకు విశ్రాంతి లభించడంవల్లనూ, హఠాత్తుగా అసంకల్పితంగానే అతడు తన మస్తిష్కంనించి ఏదో గుర్తు తెచ్చుకుంటాడు. చాలావరకు ప్రేరేపణ ఈ రకంగా కలుగుతుంది.

ప్రేరేపణ ఆ సమయంలో ఎందుకు వస్తుంది? ఎందుకంటే, ఒక వ్యక్తి యొక్క మస్తిష్కం అతడి ప్రధాన చైతన్యం ఆధీనంలో ఉన్నప్పుడు, అతడు తన మస్తిష్కాన్ని ఎంత ఎక్కువగా ఉపయోగిస్తే, ప్రధాన చైతన్యానికి అంత ఎక్కువ అదుపు వస్తుంది, సహాయక ఆత్మ అంత తక్కువగా లోనికి అడుగు పెడుతుంది. ఒక వ్యక్తి ఆలోచిస్తున్నప్పుడు, అతడికి తలనొప్పి వచ్చినప్పుడు, అతడు బాధ పడుతున్నప్పుడు సహాయక ఆత్మ కూడా బాధపడుతుంది, అతితీవ్రమైన తల నొప్పితో బాధపడుతుంది. ఈ శరీరంలోని ఒక భాగంగానూ, ఒకే సమయంలో ఒకే తల్లి కడుపునించి జన్మించినందువల్లనూ అది కూడా ఈ శరీరంలోని ఒక భాగాన్ని అదుపుచేస్తుంది. అతడి ప్రధాన ఆత్మ విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు సహాయక చైతన్యం తనకు తెలిసినది మస్తిష్కంలోకి పంపిస్తుంది. అది మరొక పరిమాణంలో ఆ విషయం యొక్క స్వభావాన్ని చూడగలిగినందువల్ల దానిని అనుసరించి ఆ పని జరుగుతుంది, ఆ రచన పూర్తవుతుంది, ఆ సంగీతం సమకూర్చబడుతుంది.

"అటువంటప్పుడు, మనం సహాయక ఆత్మను ఉపయోగించుకోవాలి" అని కొందరు అంటారు. ఇది ఎలా ఉందంటే "మనం సహాయక ఆత్మను ఎలా సంప్రదించాలి?" అని ఇప్పుడే ఎవరో రాసి పంపించిన ప్రశ్నలాగానే ఉంది. మీరు దానిని సంప్రదించలేరు, ఎందుకంటే, మీ ఆధ్యాత్మిక సాధన ఇప్పుడే మొదలైంది, మీకు ఎటువంటి సామర్థ్యాలూ లేవు. మీరు ఎటువంటి సంపర్కం చేయకపోవడమే మీకు మేలు, ఎందుకంటే మీ ఉద్దేశ్యం ఒక బంధంగా మారబోతున్నది. "మనం సహాయక ఆత్మను ఉపయోగించుకొని సంపద కూడబెట్టి, మానవ సమాజపు అభివృద్ధి వేగాన్ని పెంచవచ్చా?" అని కొందరు

ఆలోచించవచ్చు. కూడదు! ఎందుకని? ఎందుకంటే, మీ సహాయక ఆత్మకు తెలిసినది కూడా చాలా పరిమితం. పరిమాణాలు, వాటి స్థాయులతో సంక్లిష్టతతో కూడుకొని ఉన్న విశ్వం చాలా క్లిష్టతరమై ఉంది. సహాయక ఆత్మకు కేవలం తానున్న పరిమాణంలో ఉన్నదే తెలుస్తుంది గానీ ఈ పరిమాణానికి ఆవల ఉన్నది ఏదీ తెలియదు. దీనికితోడు నిలువుగా విభజింపబడిన అనేక భిన్న స్థాయులు, పరిమాణాలు ఉన్నాయి. మానవాళి యొక్క అభివృద్ధి, ఒక అత్యున్నత స్థాయిలోని ఉన్నత జీవుల అధీనంలో ఉండి, పురోగమన ధర్మాన్ని అనుసరించి పురోగమిస్తుంది.

మన సామాన్య మానవ సంఘం, చరిత్రను శాసించే పురోగమన ధర్మం ప్రకారం పురోగమిస్తుంది. మీరు దానిని ఒక నిర్దిష్టమైన విధంగా అభివృద్ధిపరచి ఒక నిర్దిష్టమైన లక్ష్యం సాధించాలని అనుకోవచ్చు, కానీ ఆ ఉన్నత జీవులు ఆ విధంగా పరిగణించరు. ప్రాచీనకాలంలో మనుషులు నేటి విమానాలు, రైళ్ళూ, బైకుల గురించి ఆలోచించలేదా? వారు ఆలోచించనే లేదు అనుకోవడం సరికాదని నేను అంటాను. పరిణామక్రమంలో చరిత్ర ఈ స్థితిలో లేదు గనక వారు వీటిని కనిపెట్టలేకపోయారు. పైపైన చూసినప్పుడు, లేదా సంప్రదాయ సిద్ధాంతాలు, నేటి మానవజ్ఞానం దృష్ట్యా చూసినప్పుడు, ఆ కాలంలో మానవుల విజ్ఞానశాస్త్రం ఈనాడు ఉన్న స్థాయిలో అభివృద్ధి చెందకపోవడంవల్ల వారు కనిపెట్టలేకపోయినట్లు అనిపిస్తుంది. నిజానికి మానవుల విజ్ఞానశాస్త్రం అభివృద్ధి ఎలా చెందాలో అది కూడా చరిత్రలో నిర్ణయింపబడి ఉన్న వేగంతోనే జరుగుతుంది. మీరు మానవ ఇష్టానుసారం ఒక నిర్దిష్ట గమ్యాన్ని సాధించాలంటే, అది జరగదు. అయితే, తమ ఇష్టానుసారం సులభంగా పనిచేసే సహాయక ఆత్మ కలిగిన వ్యక్తులు కూడా ఉన్నారు. ఒక రచయిత: "నేను నా పుస్తకం కోసం ఏమాత్రమూ అలసి పోకుండా ఒక్క రోజులో వేలు, లక్షల సంఖ్యలో పదాలు రాయగలను, నేను తలచుకుంటే, దాన్ని అతివేగంగా రాయగలను, అయినప్పటికీ ఇతరులు దానిని చదివినప్పుడు చాలా చక్కగా ఉందనే అనుకుంటారు." అని చెప్పు కుంటాడు. అలా ఎందుకు జరుగుతుంది? అది ప్రధాన చైతన్యమూ, సహాయక చైతన్యమూ కలిసి కృషి చెయ్యడంవల్ల కలిగిన ఫలితం, ఎందుకంటే అతడి

సహాయక చైతన్యం కూడా సగం పని చేస్తుంది. కానీ అది ఎల్లవేళలా జరగదు. సహాయక ఆత్మలలో ఎక్కువ భాగం దేనిలోనూ ఏమాత్రం కల్పించు కోవు. మీరు ఏదైనా పని చెయ్యమని దాన్ని కోరడం మంచిది కాదు ఎందుకంటే, మీకు వ్యతిరేక ఫలితాలు వస్తాయి.

## ఒక స్పష్టమైన శుద్ధమైన మనసు

చాలామంది సాధన చేసేటప్పుడు ప్రశాంతమైన మనసును సాధించలేరు, వారు చీ గోంగ్ గురువుల దగ్గరికి వెళ్తూ ప్రతిచోట “టీచర్, నేను ఎంత సాధన చేసినా ప్రశాంతతను పొందలేకపోతున్నాను. ఒకసారి కూచుంటే, అర్థంలేని ఆలోచనలు, భావాలతో సహా అన్ని విషయాలూ ఆలోచిస్తూ ఉంటాను,” అని అడుగుతారు. నదులు, సముద్రాలలోని ఉధృతికి అడుగున ఉన్నవన్నీ ఉపరితలానికి వచ్చిన విధంగా, ఏమి చేసినా ఒక వ్యక్తి ప్రశాంతతను పొందలేకపోయినట్లుగా ఉంటుంది. ఒక వ్యక్తి ఎందువల్ల ప్రశాంతతను పొందలేకపోతాడు? కొంత మంది దీనిని అర్థం చేసుకోలేక కొన్ని రహస్య పద్ధతులు ఉండవచ్చని నమ్ముతూ ఉంటారు. పేరుపొందిన గురువులను “ప్రశాంతమైన మనసును పొందడానికి దయచేసి నాకు కొన్ని చిట్కాలను నేర్పండి”, అని అడుగుతారు. నా దృష్టిలో అది బయటినించి సాయం వెతకడమే. మిమ్మల్ని మీరు మెరుగుపరచుకోవాలి అనుకుంటే, మీ లోపలనే వెతుక్కోని, మీ హృదయం మీద తీవ్రమైన సాధన చెయ్యాలి – అప్పుడే మీరు నిజంగా ఎదిగి, ధ్యానం చేసేటప్పుడు ప్రశాంతతను పొందగలుగుతారు. ప్రశాంతతను సాధించగలిగే శక్తే గోంగ్, ఇక డింగ్ యొక్క లోతు ఒక వ్యక్తి స్థాయిని సూచిస్తుంది.

ఒక సామాన్య వ్యక్తి కోరుకున్నప్పుడల్లా ప్రశాంతతను ఎలా పొందు తాడు? అతడికి అత్యుత్తమ జన్మసంస్కారం లేనిదే, ఎంతమాత్రమూ చెయ్యలేడు. మరొక రకంగా చెప్పాలంటే, ఒక వ్యక్తి ప్రశాంతతను సాధించలేకపోవడానికి మౌలికమైన కారణం అతడి యొక్క మనసు, హృదయమూ శుద్ధంగా లేక పోవడమే తప్ప ఏ పద్ధతులు కాదు. సామాన్య మానవ సంఘంలో, పరస్పర మానవ సంఘర్షణలలో మీరు స్వప్రయోజనాల కోసం, అన్ని రకాల సున్నిత

భావజాలం, కోరికల పట్ల మీకు ఉండే బంధాల కోసం పోటీపడి పోరాడతారు. మీరు వాటిని వదిలివేయకపోతే, తేలికగా తీసుకోకపోతే, మీరు సులభంగా ప్రశాంతతను ఎలా సాధించగలుగుతారు? చీ గోంగ్ సాధన చేస్తున్నప్పుడు, "నేను దానిని నమ్మను. నేను నెమ్మదిగా ఉండి, ఆలోచించడం మానెయ్యాలి", అని ఒకరు అంటారు. ఆ మాట అనగానే, అన్ని ఆలోచనలు మళ్ళీ తలెత్తుతాయి, ఎందుకంటే, అంత శుద్ధంగా లేనిది మీ మనసే. అందువల్లనే మీరు ఒక ప్రశాంతమైన మనసును నిలుపుకోలేకపోతున్నారు.

నా అభిప్రాయంతో కొందరు విభేదించవచ్చు: "కొందరు చీ గోంగ్ గురువులు ప్రజలకు కొన్ని పద్ధతులు నేర్పరా? ఒక వ్యక్తి ఒక విషయం మీద దృష్టి కేంద్రీకరించడం, దానిని దర్శించడం, దాన్ త్యన్‌పై మనసును కేంద్రీకరించడం, అంతర్గతంగా దాన్ త్యన్‌ను చూడడం, బుద్ధుని నామాన్ని జపించడం మొదలైనవి నేర్పించరా" అనొచ్చు. అవి కొన్ని రకాల పద్ధతులు. అయినా, అవి కేవలం పద్ధతులు మాత్రమే కాదు, ఆ వ్యక్తి యొక్క సామర్థ్యాలకు ప్రతిరూపాలు. ఆ రకంగా ఈ సామర్థ్యాలు నేరుగా మన షిన్ షిన్ సాధనతో, మన అభివృద్ధితో సంబంధం కలిగి ఉంటాయి. పైగా, కేవలం అటువంటి పద్ధతులను మాత్రమే పాటించడంవల్ల ఒక వ్యక్తి ప్రశాంతతను పొందలేడు. మీరు దీనిని నమ్మకపోతే మీరే ఒకసారి ప్రయత్నించవచ్చు. రకరకాలైన బలీయమైన కోరికలు, బంధాలను కలిగి ఉండి, అన్నిటినీ వదిలివేయగల శక్తి లేకుండా, మీరు ప్రశాంతతను సాధించడానికి ప్రయత్నించి చూడొచ్చు. బుద్ధుని నామజపం పనిచేస్తుందని కొంతమంది చెప్తారు. బుద్ధుని నామజపం చేసి మీరు ప్రశాంతతను పొందగలరా? "అమితాభ బుద్ధుని సిద్ధాంత సాధన చెయ్యడం సులభం. కేవలం బుద్ధుని నామజపం చేసినంతమాత్రాన పని జరుగుతుంది" అని ఒకరు చెప్పుకుంటారు. మీరు ఆ విధంగా జపించడాన్ని ఎందుకు ప్రయత్నించరు? దాన్ని ఒక సామర్థ్యంగా నేను పేర్కొంటాను. అది సులభమని మీరంటారు, కానీ అది అంత సులభం కాదని నేను అంటాను ఎందుకంటే, ఏ సిద్ధాంతపు సాధన అయినా సులభం కాదు.

శాక్యముని, "సమాధి" గురించి బోధించారని అందరికీ తెలుసు. సమాధికి ముందు ఏం బోధించారు? ఆయన "నియమము", ఏమీ మిగల

నంతవరకు అన్ని కోరికలనూ, వ్యసనాలనూ పరిత్యజించడం బోధించారు – అప్పుడు మాత్రమే ఒక వ్యక్తి సమాధిని సాధించగలడు. ఆ నియమం అటువంటిది కాదా? కానీ "సమాధి" కూడా ఒక సామర్థ్యమే, ఎందుకంటే మీరు "నియమము"ను ఒకేసారి మొత్తంగా సాధించలేరు. క్రమంగా చెడ్డ విషయాలన్నిటినీ పరిత్యజించడంవల్ల ఒక వ్యక్తిలో తక్కువగా ఉండే ఏకాగ్రత మెరుగుపడుతుంది. ఒక వ్యక్తి బుద్ధుని నామజపం చేస్తున్నప్పుడు, తప్పనిసరిగా మనసులో మరే విషయమూ లేకుండా ఏకైక భావనతో, మస్తిష్కంలోని ఇతర భాగాలన్నీ మొద్దుబారిపోయి అన్ని విషయాలనూ మర్చిపోయేవరకు, ఒక్క తలపు వెయ్యి ఇతర తలపులను ప్రతిక్షేపిస్తూ లేదా "అమితాభ బుద్ధుడు"లోని ప్రతి పదమూ తన కళ్ళ ముందు కనిపించే వరకు చెయ్యాలి. ఇది ఒక సామర్థ్యం కాదా? మొట్టమొదటిలోనే ఒక వ్యక్తి ఇలా చెయ్యగలడా? అతడు చెయ్యలేడు. అలా చెయ్యలేకపోతే ఖచ్చితంగా అతడు ప్రశాంతతను సాధించ లేడు. మీరు ఇది నమ్మలేకపోతే ఒకసారి ప్రయత్నించి చూడవచ్చు. తన నోటితో నిరంతరంగా బుద్ధుని నామం జపిస్తూనే, అతడి మనసు: "నా కార్యాలయంలో పైఅధికారికి నాపై అంతటి అయిష్టం ఎందుకని? ఈ నెల నాకు ఇచ్చిన బోనస్ చాలా తక్కువగా ఉంది" అని ప్రతి విషయాన్ని తలుస్తూనే ఉంటుంది. తన నోటితో ఒకవైపు బుద్ధుని నామజపం చేస్తూనే మరొకవైపు ఆ విషయం గురించి ఆలోచిస్తున్నకొద్దీ అతడిలో ఆగ్రహం పెరిగిపోతూ ఉంటుంది. ఈ వ్యక్తి చీ గోంగ్ సాధన చెయ్యగలడని మీరు భావిస్తున్నారా? ఇది సామర్థ్యానికి సంబంధించిన విషయం కాదా? మీ మనసు కలుషితంగా ఉందన్న అంశానికి గుర్తు కాదా? కొందరు వ్యక్తులలో దివ్యనేత్రం తెరచి ఉండి, వారు అంతర్గతంగా దాన్ త్యన్‌ను చూడగలిగి ఉంటారు. ఒక వ్యక్తి యొక్క పొత్తికడుపు ప్రాంతంలో సమకూడే దాన్ విషయానికి వస్తే, ఆ శక్తి పదార్థం ఎంత ఎక్కువగా శుద్ధి అవుతుంటే, అది అంతగా ప్రకాశవంతం అవుతుంది. శుద్ధత్వం ఎంత తక్కువ అయితే, పారదర్శకత అంతగా తగ్గి, అది అంత నల్లగానూ ఉంటుంది. కేవలం అంతర్గతంగా దాన్ త్యన్‌లోని దాన్‌ను చూడడంవల్లనే ఒక వ్యక్తి ప్రశాంతతను పొందగలడా? అతడు పొందలేడు. ఇక్కడ పద్ధతి ఒక్కటే చాలదు. అసలైన కీలక విషయం ఏమిటంటే అతడి మనసు, తలపులూ స్పష్టంగానూ, శుద్ధంగానూ లేవు. మీరు అంతర్గతంగా

దాన్ త్యన్‌ను చూస్తున్నప్పుడు, దాన్ ప్రకాశవంతంగానూ, అందంగానూ కనిపిస్తుంది. ఒక్కక్షణంలో ఈ దాన్ ఒక అపార్ట్‌మెంట్‌గా మారిపోతుంది: "మా అబ్బాయికి పెళ్ళయిన తరవాత ఈ గది అతడిది అవుతుంది. ఆ గది నా కూతురికి. వృద్ధ దంపతులుగా మేము మరొక గదిలో ఉంటాం, మధ్యలో ఉన్న గది లివింగ్ రూమ్‌గా ఉంటుంది. అది చాలా గొప్పగా ఉంటుంది! ఇది నాకు కేటాయింపబడుతుందా? దీన్ని పొందడానికి నేను ఒక దారి చూసుకోవాలి. అందుకు నేను ఏం చెయ్యాలి?" మనుషులు కేవలం ఈ విషయాలకు బంధింపబడి ఉంటారు. ఈ రకంగా ప్రశాంతతను సాధించ గలమని మీరు భావిస్తున్నారా? "నేను ఈ సామాన్య మానవ సంఘంలోకి వచ్చినప్పుడు ఒక హోటల్ గదిలో కొన్ని రోజులు ఉండడానికి వచ్చినట్లుగా ఉంటుంది. తరవాత నేను హడావిడిగా నిష్క్రమిస్తాను" అని చెప్పబడింది. కొంతమంది ఈ విడిదిపట్ల వ్యామోహం పెంచుకొని తమ స్వంత ఇళ్ళను మరచిపోయారు.

అసలైన ఆధ్యాత్మిక సాధనలో ఒక వ్యక్తి తప్పనిసరిగా తన హృదయాన్ని, అంతరాత్మని సంస్కరించుకోవాలి. అతడు బయట వెతుకులాడే బదులు తన లోపలనే అన్వేషించాలి. కొన్ని సాధనాసిద్ధాంతాలు ఒక వ్యక్తి హృదయంలోనే బుద్ధుడు నివసిస్తాడని చెప్తాయి, ఇందులో కూడా కొంత నిజముంది. కొందరు ఈ వ్యాఖ్యను తప్పుగా అర్థం చేసుకొని, తమ హృదయాలలో బుద్ధుడు ఉన్నాడని, తామే స్వయంగా బుద్ధులైనట్లు లేదా తమ హృదయంలో బుద్ధుడు ఉన్నట్లుగా చెప్పుకుంటారు – వారు దీనిని ఆ విధంగా అర్థం చేసుకున్నారు. అది తప్పు కాదా? అలా అర్థం చేసుకోవడం ఏమిటి? దానికి అర్థం ఏమిటంటే, మీరు ఆధ్యాత్మిక సాధనలో సఫలం కావాలంటే తప్పనిసరిగా మీ హృదయాన్ని సంస్కరించుకోవాలి అన్న ఈ నియమాన్ని చెప్తుంది. మీ శరీరంలో ఒక బుద్ధుడు ఎలా ఉంటాడు? మీరు సఫలం కావాలంటే తప్పనిసరిగా ఆధ్యాత్మిక సాధన చెయ్యాలి.

మీరు ప్రశాంతతను సాధించలేకపోవడానికి కారణం ఏమిటంటే, మీ మనసు ఇంకా అన్నిటినీ వదలలేదు, కేవలం మెట్టు తరవాత మెట్టు ఎక్కుతూ సాధించగలిగిన అంతటి ఉన్నతస్థాయికి మీరు చేరలేదు. అది మీలోని

మెరుగుదల స్థాయితో కలసికట్టుగా పెరుగుతుంది. మీరు మీ బంధాలను వదులుకున్నప్పుడు మీ స్థాయి పెరుగుతుంది, మీలో ఉన్న ఏకాగ్రత శక్తి కూడా మెరుగుపడుతుంది. మీరు కొన్ని చిట్కాలు లేదా పద్ధతుల ద్వారా ప్రశాంతతను సాధించాలనుకుంటే అది బయటినించి సహాయంకోసం వెతుకులాడుతున్నట్లే అని నేను అంటాను. ఏమైనా, చీ గోంగ్ సాధనలో దారి తప్పడమూ, ఒక దుష్టమార్గాన్ని అనుసరించడమూ అన్నది, కేవలం బయటి సాయం కోసం వెతకడాన్ని సూచిస్తుంది. ప్రత్యేకించి బౌద్ధమతం విషయంలో మీరు బయటి సాయం కోసం వెతికితే అది ఒక అసుర మార్గం ఎన్నుకున్నట్లే అని చెప్పుకోవాలి. అసలైన ఆధ్యాత్మిక సాధనలో ఒక వ్యక్తి తన హృదయాన్ని సంస్కరించుకోవాలి: మీరు మీ షిన్ షిన్‌ను ఉన్నతీకరించుకున్నప్పుడే మీరు ఒక స్పష్టమైన, శుద్ధమైన మనసును, ఆలోచనారహితమైన స్థితిని (వూవే) పొందగలుగుతారు. కేవలం మీ షిన్ షిన్‌ను ఉన్నతీకరించుకున్నప్పుడు మాత్రమే మీరు విశ్వ లక్షణంతో మమేకమై, వివిధ మానవ సహజ వాంఛలను, బంధాలను, ఇతర చెడ్డ విషయాలను తొలగించుకోగలుగుతారు. అప్పుడే మీరు మీలోని చెడ్డ విషయాలను వదలిపెట్టి, విశ్వ లక్షణం మిమ్మల్ని నిరోధించని విధంగా పైకి ఎదుగుతారు. అప్పుడు పుణ్య పదార్థం గోంగ్‌గా పరివర్తన చెందుతుంది. అవి రెండూ కలసికట్టుగా జరగడం లేదా? ఈ నియమం అటువంటిది.

ఒక మనిషి ప్రశాంతతను సాధించలేకపోవడానికి అతడి వైపున ఉన్న కారణం ఇది, ఎందుకంటే, అతడు ఒక సాధకుడికి ఉండవలసిన ప్రామాణికతను అందుకోలేడు. బయట ఉన్న కారణాల విషయానికి వస్తే, ప్రస్తుతం ఉన్నత స్థాయిలకు చేర్చే ఆధ్యాత్మిక సాధనలో అంతరాయం కల్పించే ఒక పరిస్థితి ఉంది, అది సాధకులపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. సంస్కరణలు, పారదర్శకతలతో, ఆర్థికరంగం సరళతరమై, విధానాలపై నిబంధనలు తగ్గాయి. కొత్త సాంకేతికతలు ప్రవేశపెట్టబడ్డాయి, ప్రజల జీవనప్రమాణాలు పెరిగాయి. సామాన్య మానవులు అందరూ ఇది మంచిదని తలుస్తారు. ఈ విషయాన్ని రెండువైపులనించి చూసి మంచిచెడులు నిర్ణయించాలి. సంస్కరణలు, పారదర్శకతతోపాటుగా రకరకాల చెడ్డ విషయాలు కూడా దిగుమతి

అయ్యాయి. లైంగిక విషయం లేకుండా ఒక పుస్తకం రాస్తే అది అమ్ముడుపోవడం కష్టం, ఎందుకంటే అది ఉంటే పుస్తకాల అమ్మకం గురించి బాధ ఉండదు. సినిమాలలోనూ టెలివిజన్‌లోనూ పడకగది దృశ్యాలు ఉంటే, ప్రేక్షకుల గురించి, రేటింగ్స్ గురించి ఇక దిగులు ఉండదు. కళాకృతుల విషయానికొస్తే అది అసలైనదో కాదో ఎవ్వరూ చెప్పలేరు. చైనీయ సంప్రదాయ కళలలో అటువంటివి లేవు. మన జాతీయ చైనీయ సంప్రదాయా లను ఎవరో ఒక్క వ్యక్తి కనిపెట్టడం లేదా సృష్టించడం జరగలేదు. ఐతిహాసిక యుగపు సంస్కృతి గురించి చెప్పినప్పుడు, ప్రతి విషయానికీ దాని మూలం ఉంటుందని చెప్పాను. మానవులలో నైతిక విలువలు క్షీణించిపోయాయి, మారిపోయాయి. మంచి చెడులను కొలిచే ప్రమాణాలు మొత్తంగా మారిపోయాయి. అవన్నీ సామాన్య మానవుల విషయాలు. అయినప్పటికీ సత్యం–దయ–సహనం అన్న ఈ విశ్వ లక్షణం మంచివారిని చెడ్డవారిని వేరుచేసే ఏకైక ప్రమాణంగా మార్పు లేకుండా నిలిచి ఉంది. ఒక సాధకుడిగా మీరు పైకి ఎదిగి అతీతులు కావాలంటే విషయాలను అంచనా వెయ్యడానికి – సామాన్య మానవుల ప్రమాణం కాకుండా – ఈ ప్రమాణాన్నే ఉపయోగించి తీరాలి. ఆ విధంగా బయటినించి ఈ అంతరాయం కలుగుతుంది. ఇంకా స్వలింగ సంపర్కం, లైంగిక స్వేచ్ఛ మాదకద్రవ్యాల వాడకం మొదలైనవి ఉన్నాయి.

మానవ సమాజం ఈనాడు ఈ మెట్టుకు పురోగమించిందంటే, ఇది ఆలోచించండి: ఇలాగే జరుగుతూ ఉంటే ఏమవుతుంది? ఇది ఎప్పటికీ ఇలాగే ఉండడం అన్నది అనుమతింపబడుతుందా? దీని గురించి మానవాళి ఏమీ చెయ్యకపోయినా, దైవం చేస్తుంది. మానవాళికి ఉత్పాతాలు ఎప్పుడూ ఇటువంటి పరిస్థితులలోనే ఎదురవుతూ ఉండేవి. ఇన్ని ఉపన్యాసాలలో, మానవాళికి ఎదురైన ఉత్పాతాల గురించి నేనెప్పుడూ ప్రస్తావించలేదు. ఆసక్తికరమైన ఈ అంశం మతాలలోనూ, అనేకమంది ప్రజల చేతనూ చర్చింపబడింది. నేను అందరికీ ఈ ప్రశ్నను లేవనెత్తుతున్నాను, కాబట్టి అందరూ ఇది ఆలోచించండి: మన సామాన్య మానవ సంఘంలో మానవుల నైతిక ప్రమాణం ఎంతటి మార్పుకు లోనయ్యింది! మనుషుల మధ్య ఉద్వేగాలు ఎటువంటి అంచుకు చేరాయి! ఇది ఒక అతిప్రమాదకరమైన స్థితికి

చేరుకున్నట్లు మీకు అనిపించడం లేదా? అందువల్ల, మనం ప్రస్తుతం ఉన్న వాతావరణం ఉన్నత స్థాయిలకు ఆధ్యాత్మిక సాధన చేసే మన సాధకులకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నది. నగ్నచిత్రాలు నడివీధిలో తగిలించి ఉంటాయి. మీరు ఒకసారి తల ఎత్తగానే కనిపిస్తాయి.

"ఒక వివేకవంతుడు తావో వినగానే, శ్రద్ధగా సాధన చేస్తాడు" అని లావోజీ వ్యాఖ్యానించారు. ఒక వివేకవంతుడు తావో గురించి తెలుసుకోగానే "ఎట్టకేలకు నేను ఒక నీతివంతమైన ఆధ్యాత్మిక సాధనాపద్ధతిని పొందాను. ఇక ఆగకుండా ఇవాళే ప్రారంభించవచ్చు కదా?" అని ఆలోచిస్తాడు. అయితే, నా దృష్టిలో ఈ సంక్లిష్ట వాతావరణం మంచిదే. అది ఎంత సంక్లిష్టం అవుతుంటే, అంత ఉత్తములను తయారుచేస్తుంది. ఒక వ్యక్తి తననుతాను దానికి పైగానూ, అతీతంగానూ ఉన్నతీకరించుకోగలిగితే అతడి సంస్కరణ అతిదృఢంగా ఉంటుంది.

ఆధ్యాత్మిక సాధన చెయ్యాలని నిజంగా నిశ్చయించుకున్న సాధకునికి అది చాలా మంచి చేస్తుందని నేను అంటాను. సంఘర్షణలు రాకుండా, లేదా మీ షిన్ షిన్ పెంచుకునే అవకాశాలు లేకుండా మీరు పురోగమించలేరు. ప్రతివారూ ఒకరితో ఒకరు చక్కగా వ్యవహరిస్తే, మీరు ఆధ్యాత్మిక సాధన ఎలా చేస్తారు? ఒక సగటు సాధకుడైతే, "తావోను వినే సాధకుడు మాత్రమే", అతడికి ఆధ్యాత్మిక సాధన చేసినా, చెయ్యకపోయినా ఒకటిగానే ఉంటుంది, సాధనలో అటువంటివాడు విఫలం అవడం అన్నదే ఎక్కువగా జరుగుతుంది. ఇక్కడ కూర్చొని వింటున్నవారిలో చాలామందికి గురువు చెప్తున్నది అర్థవంతంగా ఉన్నట్లే అనిపిస్తుంది. ఒకసారి సామాన్య మానవ సమాజంలోకి అడుగుపెట్టిన తరవాత తక్షణ లాభాలే ఎక్కువ ఆచరణీయమూ, నిజమూ అనిపిస్తాయి. అవి నిజమైనవే. మీరే కాదు, పాశ్చాత్య దేశాలలోని కోటీశ్వరులు, అధిక సంపన్నులూ కూడా మరణానంతరం మిగిలేది ఏమీ లేదని గ్రహించారు. ప్రాపంచికమైన సంపదలు, పుట్టినప్పుడు మనతో రావు, పోయేటప్పుడూ మన వెంట రావు – అవన్నీ ఉత్త డొల్లలే. అయితే గోంగ్‌కు అంతటి విలువ ఎందుకు? ఎందుకంటే, అది మీ ప్రాథమిక ఆత్మకు అతుక్కొని ఉంటుంది, మీరు పుట్టినప్పుడు మీతో వచ్చి, మరణానంతరం కూడా మీ వెంట వస్తుంది. ఒక

వ్యక్తి యొక్క ప్రాథమిక ఆత్మ నశించదని, ఇది ఒక మూఢనమ్మకమూ కాదని, మీకు మేము చెప్పాం. మన భౌతిక శరీరంలోని జీవకణాలు విచ్ఛిపోయిన తరవాత, ఇతర భౌతిక పరిమాణాలలో ఉన్నట్టివీ, జీవకణాల కన్నా చిన్నగా ఉండేవీ అయిన నలుసులు మాత్రం నశించవు. పైన ఉన్న పెంకు మాత్రమే ఊడిపోతుంది.

నేను ఇప్పుడే వివరించినదంతా ఒక వ్యక్తి యొక్క షిన్ షిన్ గురించిన అంశం. శాక్యముని, తరవాత బోధిధర్ముడు కూడా : "మహా పుణ్యాత్ములు తయారయ్యే ప్రదేశం ఈ ఉత్తమ చైనా", అని ప్రకటించారు. చరిత్ర అంతటా ఎందరో భిక్షువులూ చైనీయులూ దీని గురించి ఎంతో గర్వపడేవారు; వారు ఉన్నతస్థాయి గోంగ్‌ను సాధన చెయ్యగలరని ఇది సూచిస్తుంది, అది చూసి ఎందరో ప్రజలు సంతోషించి: "ఆహా చైనీయులమైన మనమంతా ఎంత గొప్పవాళ్ళం! మన చైనా నేల అత్యుత్తమ జన్మ సంస్కారవంతులను, మహా పుణ్యాత్ములను తయారుచేస్తుంది" అని గర్వపడతారు. నిజానికి చాలామంది దీని వెనకనున్న అసలు అర్థం గ్రహించలేదు. చైనా నేల ఎందువల్ల మహా పుణ్యమూ, ఉన్నతస్థాయి గోంగ్‌నూ కలిగినవారిని తయారుచేస్తుంది? ఆ ఉన్నత స్థాయి వ్యక్తులు చెప్పినదానికి అసలైన అర్థాన్ని చాలామంది గ్రహించనూ లేరు, ఇక ఉన్నత స్థాయులలో, ఉన్నత రాజ్యాలలోనూ ఉండే ఆ వ్యక్తుల యొక్క రాజ్యమునూ లేదా ఆలోచనాసరళిని కూడా అర్థం చేసుకోరు. అయితే మేము దాని యొక్క అర్థం ఏమిటనేది వివరించము అని చెప్పాం. అందరూ ఇది ఆలోచించండి: కేవలం సంక్లిష్టమైన వ్యక్తుల గుంపు మధ్యలోనూ, సంక్లిష్ట తరమైన వాతావరణంలో ఉండడంవల్లనూ మాత్రమే ఒక వ్యక్తి ఉన్నతస్థాయి గోంగ్‌ను సాధించుకోగలుగుతాడు.

## జన్మ సంస్కారం

ఒక వ్యక్తి యొక్క జన్మ సంస్కారం అన్నది మరొక పరిమాణంలో ఉండే అతడి శరీరంలోని పుణ్యపదార్థాన్నిబట్టి నిర్ణయించబడుతుంది. కొద్దిపాటి పుణ్యమూ, చాలా ఎక్కువ నల్లని పదార్థమూ ఉన్నట్లైతే అతడి కర్మ యొక్క క్షేత్రం విస్తారంగా ఉంటుంది. అటువంటప్పుడు, అతడికి జన్మ సంస్కారం అల్పంగా ఉంటుంది.

చాలా ఎక్కువ తెల్లని పదార్థం లేదా పుణ్యం ఉంటే కర్మ యొక్క క్షేత్రం చిన్నగా ఉంటుంది. దానికి తగినట్లే అతడి జన్మ సంస్కారం ఉన్నతంగా ఉంటుంది. ఒక వ్యక్తిలోని తెల్లని నల్లని పదార్థాలు ఒకటి మరొకటిగా మార్చవచ్చు. అవి ఎలా మారతాయి? సత్కర్మలు చెయ్యడంవల్ల తెల్లని పదార్థం తయారవుతుంది, ఎందుకంటే కష్టాలు సహించడం ద్వారా, బాధలను భరించడం ద్వారా లేదా సత్కర్మలను చేయడంవల్లనూ దానిని పొందడం జరుగుతుంది. తప్పులు, దుష్కర్మలూ చేయడంవల్ల నల్లని పదార్థం తయారవుతుంది అదే కర్మ. ఇది ఆ రకమైన పరివర్తన ప్రక్రియకు లోనవుతుంది. అదే సమయంలో దానికి పరంపరగా కొనసాగే సంబంధం కూడా ఉంటుంది. నేరుగా ఒక వ్యక్తి యొక్క ప్రాథమిక ఆత్మను అనుసరించడంవల్ల అది ఏ ఒక్క జన్మకో పరిమితమైనది కాదు, అనంత కాలంగా పోగుపడి ఉన్నట్టిది. అందువల్ల జనులు పాపం పొందడమూ, పుణ్యం పోగుచేసుకోవడం గురించి మాట్లాడు తుంటారు. దీనికి తోడు అవి పూర్వీకులనించి వారసత్వంగా పొందడం కూడా జరుగుతుంది. "ఒక మనిషి యొక్క పూర్వీకులు పుణ్యాన్ని కూడబెట్టారు. పుణ్యాన్ని కూడగట్టుకోండి, లేదా పోగొట్టుకోండి" అని ప్రాచీన చైనీయులు లేదా పెద్దవారు చెప్పిన మాటలను నేను కొన్నిసార్లు మననం చేసుకుంటూ ఉంటాను. అది ఎంత సరిగ్గా చెప్పబడింది! నిజంగా అది సరైన మాట.

ఒక మనిషిలోని ఉన్నతమైన లేక అల్పమైన జన్మ సంస్కారం అతడిలో జ్ఞానోదయ లక్షణం అధికంగా ఉందో అల్పంగా ఉందో నిర్ణయిస్తుంది. అతడిలోని అల్ప సంస్కారం అతడిలో జ్ఞానోదయ లక్షణాన్ని కూడా చాలా తగ్గించేస్తుంది. ఇలా ఎందుకని? ఎందుకంటే ఉన్నతమైన సంస్కారం ఉన్న వ్యక్తిలో, మన విశ్వంతోనూ సత్యం–దయ–సహనం అన్న విశ్వ లక్షణంతోనూ ఎటువంటి అవరోధాలూ లేకుండా మమేకమైపోయిన తెల్లని పదార్థం చాలా ఎక్కువగా ఉంటుంది. విశ్వలక్షణం మీ శరీరం మీద నేరుగా వ్యక్తమై, మీ శరీరంతో దగ్గరి సంబంధం కలిగి ఉండగలదు. కానీ నల్లని పదార్థం దీనికి సరిగ్గా వ్యతిరేకంగా ఉంటుంది. అది దుష్కర్మల ద్వారా కలుగుతుంది కాబట్టి, మన విశ్వ లక్షణానికి వ్యతిరేక దిశలో వెళ్తుంది. అందువల్ల ఈ నల్లని పదార్థం మన విశ్వ లక్షణానికి దూరమవుతుంది. ఈ నల్లని పదార్థం అధికమొత్తంలో

పోగుపడినప్పుడు అది ఆ వ్యక్తి శరీరాన్ని చుడుతూ ఒక క్షేత్రంగా ఏర్పడి పూర్తిగా కప్పివేస్తుంది. ఆ క్షేత్రం ఎంత పెద్దగా ఉంటే, దాని యొక్క సాంద్రత, దళసరితనం అంతగా పెరిగి, ఆ వ్యక్తి యొక్క జ్ఞానోదయ లక్షణాన్ని అధమంగా చేస్తుంది. ఇలా ఎందుకంటే, అతడు దుష్కర్మలను చేసి నల్లని పదార్థాన్ని పెంచుకోవడంవల్ల, అతడికి విశ్వలక్షణమైన సత్యం–దయ–సహనమును గ్రహించే శక్తి ఉండదు. అటువంటి మనిషి సాధారణంగా ఆధ్యాత్మిక సాధనను నమ్మడం కష్టం. అతడి జ్ఞానోదయ లక్షణం ఎంతగా తరిగిపోతుంటే, అతడు అంతగా కర్మ చేత నిరోధింపబడతాడు. ఎంత ఎక్కువ కష్టాలు భరిస్తుంటే, అతడు దాన్ని అంత తక్కువగా నమ్ముతూ ఉంటాడు, అతడికి ఆధ్యాత్మిక సాధన చెయ్యడం అంత కష్టమవుతుంది.

చాలా ఎక్కువ తెల్లని పదార్థం కలిగి ఉన్న వ్యక్తికి ఆధ్యాత్మిక సాధన చెయ్యడం సులభతరం అవుతుంది. ఇది ఎందుకంటే, అతడు ఆధ్యాత్మిక సాధనలో విశ్వలక్షణంతో మమేకమై ఉంటూ, తన షిన్ షిన్ మెరుగుపడు తున్నంత కాలమూ, అతడి పుణ్యం నేరుగా గోంగ్‌గా పరివర్తన చెందుతుంది. అయితే, చాలా ఎక్కువ నల్లని పదార్థం కలిగి ఉన్న వ్యక్తి విషయంలో మరొక ప్రక్రియ అదనంగా ఉంటుంది. అది ఒక కర్మాగారం తయారుచేసే వస్తువు లాగా ఉంటుంది: ఇతరులంతా, వాడుకోవడానికి సిద్ధంగా ఉన్న పదార్థాన్ని తీసుకురాగా ఇతడు మాత్రం శుద్ధి చేయవలసిన ముడిపదార్థాన్ని తెస్తాడు. అది ఈ ప్రక్రియను అనుసరించవలసి వస్తుంది. అందువల్ల అతడు తన కర్మను పుణ్య పదార్థంగా మార్చగల తెల్లని పదార్థంగా మార్చుకోవడానికి ముందుగా కష్టాలను అనుభవించి కర్మను తొలగించుకోవలసి ఉంటుంది. అప్పుడు మాత్రమే అతడు ఉన్నతస్థాయి గోంగ్‌ను పెంచుకోగలుగుతాడు. కానీ అటు వంటి వ్యక్తికి సాధారణంగా జన్మతః మంచి జ్ఞానోదయ లక్షణం ఉండదు. మీరు అతడిని ఇంకా ఎక్కువగా భరించమంటే అతడి నమ్మకం మరింత తగ్గి, అతడికి దానిని భరించడం మరింత కష్టమవుతుంది. ఆ కారణంగా నల్లని పదార్థం ఎక్కువగా కలిగి ఉన్న వ్యక్తికి ఆధ్యాత్మిక సాధన చెయ్యడం కష్టమవు తుంది. అదే విధంగా తావో సిద్ధాంత సాధన లేదా ఒకే శిష్యునికి బోధన చేసే మరి ఏ సిద్ధాంతంలోని సాధనలోనైనా శిష్యుడు గురువును వెతుక్కోవడం

గాక, గురువే శిష్యుని వెతుక్కోవలసిన ఆవశ్యకత ఉంటుంది. అది ఆ శిష్యుని శరీరంలో ఈ వస్తువులు ఎంత మాత్రం ఉన్నాయనే విషయం మీద ఆధారపడి నిర్ణయించబడుతూ ఉండేది.

ఒక వ్యక్తి యొక్క జన్మ సంస్కారం అతడి జ్ఞానోదయ లక్షణాన్ని నిర్ణయిస్తుంది, అయితే అదే తప్పనిసరి కాదు. కొందరికి ఉన్నతమైన జన్మ సంస్కారం లేకపోయినప్పటికీ వారి గృహ వాతావరణం చాలా మంచిదై ఉంటుంది; కుటుంబ సభ్యులలో చాలామంది ఆధ్యాత్మిక సాధన చేస్తారు. వారిలో కొందరు మతాన్ని నమ్మేవారు ఉండి ఆధ్యాత్మిక సాధన విషయంలో చాలా నమ్మకం కలిగి ఉంటారు. ఈ వాతావరణంలో ఆ వ్యక్తి దాన్ని నమ్మేట్లు చెయ్యవచ్చు, ఇది అతనిలోని జ్ఞానోదయ లక్షణాన్ని మెరుగుపడేట్లు చెయ్యగలదు. కాబట్టి అదే తప్పనిసరి కాదు. కొంతమందిలో అత్యున్నతమైన జన్మ సంస్కారం ఉన్నప్పటికీ, మన ఆచరణాత్మక సంఘంలో ఉండే కొద్దిపాటి జ్ఞానాన్ని పాటించి విద్యను నేర్చుకోవడంవల్ల, ప్రత్యేకించి కొద్ది సంవత్సరాల క్రింద ఉన్న భావజాలం కలిగిన విద్యలోని నిరంకుశ విధానాల కారణంగా సంకుచిత మనస్కులుగా మారి, తమకు తెలిసినదానికి ఆవల ఉన్న ఏ విషయాన్నీ నమ్మరు. ఇది వారి జ్ఞానోదయ లక్షణాన్ని తీవ్రంగా ప్రభావితం చెయ్యగలదు.

ఉదాహరణకు, ఈ తరగతిలో రెండో రోజున నేను దివ్యనేత్రం తెరుచుకోవడం గురించి బోధించాను. వెంటనే, ఉన్నతమైన జన్మ సంస్కారం కలిగిన ఒక వ్యక్తికి ఒక అత్యున్నత స్థాయిలో దివ్యనేత్రం తెరుచుకున్నది. ఇతరులెందరో చూడలేకపోయిన అసంఖ్యాకమైన దృశ్యాలను అతడు చూడగలిగాడు. అతడు ఇతరులతో: "ఆహా, ఫాలున్ మంచురేకలవలె మొత్తం ఆడిటోరియంలోని ప్రేక్షకుల శరీరాలపై పడడం, టీచర్ లీ నిజశరీరం ఎలా ఉంటుందో, ఆయన తల చుట్టూ ఉన్న కాంతిపుంజాన్ని, ఫాలున్ ఎలా ఉంటుందో, ఎన్ని ఫాషెన్ ఉన్నాయో చూశాను," అని చెప్పాడు. టీచర్ భిన్న స్థాయిలలో ఉపన్యాసాలు ఇస్తున్నట్లుగాను, ఫాలున్ ఏవిధంగా సాధకుల శరీరాలను సరిచేస్తున్నదీ, అతడు అంతా చూశాడు. ఉపన్యాస సమయంలో ప్రతి ఒక్క భిన్న స్థాయిలో ఉపన్యసిస్తున్నది గురువుగారి గోంగ్ షెన్ (2) అన్నది

కూడా అతడు చూశాడు. దీనికితోడు, దివ్యసుందరులు పైనించి పూలు చల్లడమూ మొదలైనవి చూశాడు. అతడు అటువంటి కొన్ని అద్భుతమైన విషయాలను చూశాడు, అది అతడి జన్మ సంస్కారం ఉన్నతమైనదని సూచిస్తుంది. అతడు అలా చెప్పి, చెప్పి చివరగా "నేను ఈ విషయాలను నమ్మను" అన్నాడు. వీటిలోని కొన్ని విషయాలు విజ్ఞాన శాస్త్ర రీత్యా ఇంతకు ముందే ధృవీకరింపబడ్డాయి, ఇంకా అనేక విషయాలను కూడా ఆధునిక విజ్ఞానశాస్త్ర రీత్యా వివరించవచ్చు; మేము వాటిలో కొన్నిటిని చర్చించడం కూడా జరిగింది. ఇలా ఎందుకంటే, చీ గోంగ్‌కు ఉన్నట్టి అవగాహన ఆధునిక విజ్ఞానశాస్త్ర అవగాహనకు అతీతమైనది – ఇది నిశ్చయం. ఈ దృష్టితో చూస్తే, ఒక వ్యక్తిలోని జన్మ సంస్కారం అతడి యొక్క జ్ఞానోదయ లక్షణాన్ని పూర్తిగా నిర్ణయించదు.

## జ్ఞానోదయం

"జ్ఞానోదయం" అంటే ఏమిటి? "జ్ఞానోదయం" అన్నది మతంనించి వచ్చినట్టి పదం. బౌద్ధమతం ప్రకారం ఇది ఒక సాధకునికి బౌద్ధధర్మం పట్ల గల అవగాహనను సూచిస్తుంది, అవగాహన పట్ల జ్ఞానం కలగడాన్ని, అత్యున్నత జ్ఞానోదయాన్ని సూచిస్తుంది. అంటే జ్ఞానసిద్ధిని పొందడం. అయితే, ఈ రోజుల్లో ఇది ఇప్పటికే సామాన్య వ్యక్తుల విషయంలో కూడా వాడుకలో ఉంది. ఆ వ్యక్తి చాలా చురుకైనవాడని, తన పైఅధికారి మనసును చదవగలడని అది తెలియ జేస్తుంది. అతడు విషయాలను త్వరగా నేర్చుకొని తన అధికారిని ఎలా మెప్పించాలో తెలిసినవాడు. ప్రజలు దీనిని మంచి జ్ఞానోదయ లక్షణమంటారు, సాధారణంగా దీన్ని ఇలాగ అర్థం చేసుకుంటున్నారు. అయితే, మీరు సామాన్య మానవుల స్థాయి కంటే కొంచెం పైకి ఎదిగినప్పుడు సామాన్య మానవులు తమ స్థాయిలో అర్థం చేసుకున్న నియమాలు సాధారణంగా తప్పుగా ఉన్నాయని మీకు తెలుస్తుంది. ఇది మేము చెప్పేటటువంటి జ్ఞానోదయం ఎంతమాత్రమూ కాదు. ఒక చురుకైన వ్యక్తికి ఉన్న జ్ఞానోదయ లక్షణం మంచిది కాదు, ఎందుకంటే ఆ అతిచురుకైన వ్యక్తి తన పైఅధికారి లేదా పర్యవేక్షకుని మెప్పు పొందడంకోసం పైకి కనబడే పని మాత్రమే చేస్తాడు. అటువంటప్పుడు

అసలైన పని మరెవరో చేశారు కదా? ఆ రకంగా ఆ వ్యక్తి ఇతరులకు ఋణపడతాడు. అతడు చురుకుగా ఉండి ఇతరులను మెప్పించడం తెలిసి ఉండడంచేత ఇతరులకు చాలా నష్టాలు రాగా అతడు ఎక్కువ ప్రయోజనాలు పొందుతాడు. అతడు చురుకైనవాడు కావడం చేత అతడికి నష్టాలూ ఉండవు, అతడు సులభంగా దేనినీ పోగొట్టుకోడు. ఫలితంగా ఇతరులు నష్టపోవలసి ఉంటుంది. ఈ కొద్దిపాటి లాభంకోసం అతడు ఆశపడిన కొద్దీ మరింత సంకుచిత మనస్కుడవుతాడు, సామాన్య మానవుల యొక్క ప్రాపంచిక లాభాలను పోగొట్టుకోలేనని అంతగానూ అనుకుంటాడు. తాను చాలా ఆచరణాత్మకంగా ఉంటున్నానని పరిగణించుకొని, ఎటువంటి నష్టాలనూ పొందడు.

కొంతమంది ఈ వ్యక్తిని చూసి ఈర్ష్యపడడం కూడా జరుగుతుంది! అతడిని చూసి ఈర్ష్యపడవద్దని మీకు నేను చెప్తున్నాను. అతడు ఎంతగా అలసట కలిగించే జీవితాన్ని గడుపుతాడో మీకు తెలియదు: అతడు సరిగ్గా తిండి తిననూ లేదు, నిద్ర పోనూ లేదు. కలల్లో కూడా తన ప్రయోజనాలను నష్టపోతున్నట్లు భయపడతాడు, స్వలాభం కోసం ఏదైనా చేస్తాడు. అతడి జీవితమంతా దానికే అంకితమైపోవడంవల్ల, అతడు ఒక అలసట కలిగించే జీవితం గడుపుతున్నాడని మీరు అనరా? ఒక ఘర్షణలో మీరు ఒక్క అడుగు వెనక్కు వేసినప్పుడు సముద్రానికి, ఆకాశానికి అంతులేదని తెలుసుకుంటారు, అది ఖచ్చితంగా మరొక రకమైన పరిస్థితి. అయితే ఆ రకమైన మనిషి ఎన్నటికీ లొంగకుండా, విపరీతమైన అలసట కలిగించే జీవితాన్ని గడుపుతాడు. మీరు అతడిని చూసి నేర్చుకోకూడదు. సాధకుల సమాజంలో "అటువంటి వ్యక్తి పూర్తిగా మాయలో చిక్కుకున్నాడు. ప్రాపంచిక ప్రయోజనాల విషయంలో అతడు సామాన్య మానవుల నడుమ పూర్తిగా మాయలో చిక్కుకున్నాడు" అని చెప్పుకుంటారు. పుణ్యాన్ని దాచుకోమని అతడిని అడగడం ఏమంత సులభం కాదు! ఆధ్యాత్మిక సాధన చెయ్యమని మీరతడికి చెప్తే, నమ్మడు సరికదా "ఆధ్యాత్మిక సాధన చెయ్యడమా? సాధకులుగా మీరు ఎవరైనా కొట్టినా తిట్టినా తిరిగి పోరాడరు. మిమ్మల్ని ఇతరులు కష్టపెడితే వారికి తగినట్లు బుద్ధి చెప్పక, మనసులో వారికి కృతజ్ఞతలు కూడా చెప్పవలసి ఉంటుంది. మీరందరూ ఆహా

క్యూలై పోయారు! మీరందరూ మానసిక రోగులు" అంటాడు. అటువంటి మనిషికి ఆధ్యాత్మిక సాధనను అర్థం చేసుకొనే మార్గమే లేదు. మీరు నమ్మ శక్యంగా లేరని, మందమతి అని అతడు అంటాడు. అతడిని రక్షించడం కష్టమని మీరు అనరూ?

మేము చెప్పే జ్ఞానోదయం ఇది కాదు. అంతకంటే, ఆ మనిషి స్వప్రయోజనాలు పొందే విషయంలో "తెలివితక్కువ" అనిపింపచేసేదే మేము చెప్పిన జ్ఞానోదయం. అయితే అటువంటి మనిషి నిజంగా తెలివితక్కువవాడు కాదు. మేము స్వప్రయోజనాలు, స్వార్థపర ఆసక్తుల అంశంలో ఉపేక్ష వహిస్తాం, ఇతర వ్యవహారాలలో మేము తెలివి కలిగినవారమే. విజ్ఞాన పరిశోధన కార్యాలలో లేదా మా పర్యవేక్షకులు అప్పగించిన పనులు, లేదా ఇతర విధులు నిర్వర్తించడంలో, మేము స్పష్టమైన మనసుతో, చాలా చక్కగా పని చేస్తాం. కేవలం స్వప్రయోజనాలు లేదా వ్యక్తుల మధ్య కలిగే సంఘర్షణ లను మేము పట్టించుకోం. మిమ్మల్ని తెలివితక్కువవారు అనేదెవరు? ఎవ్వరూ అలా అనరు. ఇది నిశ్చయం.

నిజంగా మందమతి అయిన వ్యక్తిని గురించి చెప్పుకుందాం, ఎందుకంటే ఉన్నత స్థాయిలలో ఈ సూత్రం తిరగబడుతుంది. సామాన్య వ్యక్తుల నడుమ ఒక మందమతి పెద్ద తప్పులు చెయ్యడం జరగదు, అతడు స్వప్రయోజనాల కోసం పోటీపడి, పోరాడడం కూడా జరగదు. అతడు కీర్తి కోసం ప్రయత్నం చెయ్యడు, పుణ్యమును పోగొట్టుకోడు, కానీ ఇతరులు అతడికి పుణ్యం ఇస్తారు. అతడిని కొట్టడం తిట్టడం రెండూ అతడికి పుణ్యాన్నిస్తాయి, ఈ పదార్థం అత్యంత విలువైనది. మన విశ్వంలో నష్టపోనిదే లాభం రాదు అన్న ఈ నియమం ఉంది. లాభం పొందాలనుకున్న వ్యక్తి తప్పనిసరిగా నష్టపోవాలి. ఇతరులు ఈ మందమతిని చూసినప్పుడు అతడిని "నువ్వెంత తెలివితక్కువ వాడివి" అని దూషిస్తారు. ఆ దూషణతో కొంచెం పుణ్యం అతడి దగ్గర పడుతుంది. అతడిని మీ అవసరానికి ఉపయోగించుకొని లాభపడినప్పుడు, మీరు తప్పనిసరిగా కొంత నష్టపోవాలి. ఒకసారి ఒకడు అతని దగ్గరికి వెళ్ళి "నువ్వొక పెద్ద మందబుద్ధివి" అని తంతాడు. ఇంకేం ఒక పెద్ద పుణ్యపు ముక్క మళ్ళీ అతడి దగ్గరికి వెళ్ళి పడుతుంది. ఎవరైనా అతడిని బెదిరించినా తన్నినా

అతడు కేవలం ఒక చిరునవ్వు నవ్వుతాడు “తీసుకురండి, మీరు నాకు అంతే పుణ్యాన్ని ఇస్తున్నారు, నేను దాన్ని కొంచెమైనా నిరాకరించను”, అని. అప్పుడు ఉన్నత స్థాయుల నియమాల ప్రకారం ఆలోచిస్తే, ఎవరు చురుకైనవారు? ఈ మనిషి చురుకైనవాడు కాదా? అతడు అందరిలోకి చురుకైనవాడు, ఎందు కంటే, అతడు పుణ్యమును ఏమాత్రమూ పోగొట్టుకోడు. మీరు అతడి మీదకు పుణ్యమును విసిరినప్పుడు, ఏమైనా అతడు అందులో కొంచెం కూడా నిరాకరించడు. అతడు దానినంతా తీసుకొని ఒక చిరునవ్వుతో స్వీకరిస్తాడు. ఈ జన్మలో అతడు తెలివితక్కువవాడు కావచ్చు గానీ మరుజన్మలో కాదు – అతడి ప్రాథమిక ఆత్మ తెలివితక్కువది కాదు. మతంలో చెప్పినదేమంటే, చాలా పుణ్యం కలిగి ఉంటే, ఆ మనిషి మరుజన్మలో ఒక ఉన్నతాధికారి అవుతాడు లేదా పెద్ద సంపదను పొందుతాడు; అవి రెండూ ఒక వ్యక్తి పుణ్యమునకు బదులుగా ఇవ్వబడతాయి.

పుణ్యం నేరుగా గోంగ్‌గా మారుతుందని మేము చెప్పాం. మీ ఆధ్యాత్మిక స్థాయి ఈ పుణ్యపు పరివర్తన వల్ల రావడం లేదూ? అది నేరుగా గోంగ్‌గా పరివర్తన చెందగలదు. ఒక వ్యక్తి స్థాయిని, గోంగ్ శక్తిని నిర్ణయించే గోంగ్ ఈ పదార్థంతోనే కదా పరివర్తన చెందేది? అది అతివిలువైనదని మీరు అనరూ? అది పుట్టుకతో వచ్చి మరణంలో వెళ్ళగలదు. బౌద్ధమతంలో మీ ఫల స్థితి మీ ఆధ్యాత్మిక స్థాయి అని చెప్పబడింది. మీరెంత ఎక్కువ త్యాగం చేస్తే మీరు పొందే లాభం అంతగా ఉంటుంది – ఈ నియమం కేవలం అటువంటిది. పుణ్యంవల్ల ఒక వ్యక్తి మరుజన్మలో ఒక ఉన్నతాధికారి అవుతాడు లేదా పెద్ద సంపదను పొందుతాడని మతంలో చెప్పబడింది. తక్కువ పుణ్యంవల్ల ఒక వ్యక్తికి తిండి కోసం కూడా బిచ్చమెత్తవలసినంతటి కష్టకాలం సంప్రాప్తిస్తుంది, ఎందుకంటే మార్చుకోవడానికి పుణ్యమే లేదు. నష్టం లేదు, లాభం లేదు! ఎట్టి పుణ్యమూ లేనప్పుడు ఒక వ్యక్తి శరీరపరం గానూ, ఆత్మపరంగానూ నశించిపోతాడు. అతడు, వాస్తవంగా మరణిస్తాడు.

గతంలో ఒక చీ గోంగ్ గురువు ప్రజల మధ్యకు వచ్చిన కొత్తల్లో అతడి స్థాయి చాలా ఎక్కువగా ఉండేది. తరవాత ఆ చీ గోంగ్ గురువు కీర్తి, స్వలాభం పట్ల వ్యామోహం పెంచుకున్నాడు. అతడి గురువు అతడి సహాయక ఆత్మను

తీసేసుకున్నారు, ఎందుకంటే అతడు సహాయక ఆత్మను సాధన చేసేవారికి చెందినవాడు. అతడి సహాయక ఆత్మ తన చెంత ఉన్నప్పుడు దాని అధీనంలో ఉండేవాడు. ఉదాహరణకు అతడి కార్యాలయం వారు ఒక అపార్ట్‌మెంట్‌ను తమ ఉద్యోగి కోసం చూశారు. పర్యవేక్షకుడు "మీలో అపార్ట్‌మెంట్ అవసరం ఉన్నవారు తమ తమ పరిస్థితిని చెప్పుకొని అది ఎందుకు అవసరమో వివరించండి" అన్నారు. ప్రతివారూ తమ తమ కారణాలు చెప్పగా ఈ వ్యక్తి మాత్రం ఒక్క మాట కూడా మాట్లాడలేదు. చివరికి ఈ వ్యక్తికి అందరికన్నా ఎక్కువగా దాని అవసరం ఉందని ఆ పర్యవేక్షకుడు కనుక్కొని అతడికి దానిని ఇవ్వాలని తెలుసుకున్నాడు. తక్కినవారు: "లేదు, అతడికి ఇవ్వకూడదు. నాకు అత్యవసరం కాబట్టి నాకే ఇవ్వాలి" అని వాదించారు. ఈ వ్యక్తి "అయితే మీరే దీనిని తీసుకోండి" అన్నాడు. ఒక సామాన్య వ్యక్తికి అతడు మందమతిగా కనిపించవచ్చు. కొందరికి అతడు ఒక సాధకుడని తెలిసి "నువ్వు సాధకుడివి కాబట్టి, నీకు ఏమీ అక్కర్లేదు. నీకు కావలసినదేమిటి?" అని అడిగారు. "ఇతరులకు ఏది అక్కర్లేదో దానిని నేను తీసుకుంటాను" అన్నాడు. అతడు మందమతి కానే కాడు, తెలివైనవాడే. స్వప్రయోజనాలూ, స్వార్థపు ఆసక్తుల విషయం వచ్చినప్పుడు మాత్రమే అలా ఉండేవాడు. ప్రకృతి గమనాన్ని అనుసరించాలని నమ్మినవాడు అతడు. ఇతరులు అతడిని మళ్ళీ "ఈ రోజుల్లో మనుషులు కోరుకోనిదంటూ ఏమున్నది?" అని అడిగారు. "ఆ నేల మీద పడి అందరితో తన్నులు తింటున్న రాతి ముక్కలు ఎవరికీ అక్కర్లేదు. నేను దానిని తీసుకుంటాను" అని అతడు జవాబిచ్చాడు. సామాన్య వ్యక్తులు దీనిని అప నమ్మకంతో చూసి, సాధకులను అర్థం చేసుకోలేరు. వారి ఆలోచనల యొక్క తలముల మధ్య దూరమూ, వారి స్థాయులలో అంతరమూ కూడా చాలా ఎక్కువగా ఉన్నందువలన వారు దానిని అర్థం చేసుకోలేరు. నిజానికి అయితే అతడు ఆ రాయిని తీసుకోబోలేదు. "నేను సామాన్య మానవుల నడుమ దేని కోసమూ ప్రయత్నించను" అంటూ ఒక సామాన్య వ్యక్తి అవగాహన చేసుకోలేని నియమాన్ని అతడు చెప్పాడు. ఆ రాయి గురించి చెప్పుకుందాం. "పరమానందపు స్వర్గంలో చెట్లు, నేల, పక్షులు, పువ్వులు, ఇళ్ళు అన్నీ బంగారంతో తయారైనవి. బుద్ధుని శరీరం కూడా బంగారమై మెరుస్తూ ఉన్నది" అని బౌద్ధమత గ్రంథాలలో రాసి ఉందని మీకు తెలుసు. అక్కడ ఎవ్వరికీ ఒక్క

రాతిముక్క కూడా దొరకదు. అక్కడి ధనం రాళ్ళ రూపంలో చెల్లుబడి అవుతుంది. అతడు అక్కడికి వెళ్ళి ఒక రాతిముక్కను తెచ్చుకోడు గానీ, ఒక సామాన్య వ్యక్తి అవగాహన చేసుకోలేని తన నియమాన్ని చెప్పాడు. నిజానికి, సాధకులు "సామాన్య మానవులకు తమ ప్రాకులాటలు ఉంటాయి, మేము వాటికోసం ప్రయత్నించం. సామాన్య మానవుల దగ్గర ఏమున్నాయో, మాకు వాటిపట్ల ఆసక్తి కూడా లేదు. అయినప్పటికీ మా దగ్గర ఉన్నది సామాన్య మానవులు కోరినా పొందలేనట్టిది," అంటారు.

నిజానికి, మేము ఇప్పుడే చెప్పిన జ్ఞానోదయం అన్నది ఇంకనూ ఆధ్యాత్మిక సాధనాక్రమంలో పొందే ఒక రకమైన జ్ఞానోదయం గురించే, ఇది సామాన్య మానవులు చెప్పేదానికి సరిగ్గా వ్యతిరేకం. మేము చెప్పే జ్ఞానోదయం అన్నది ఒక వ్యక్తి తన ఆధ్యాత్మిక సాధనాక్రమంలో తన గురువు బోధించిన ఫా లేదా తావో గురువు నేర్పిన తావోపట్ల జ్ఞానం పొంది అంగీకరిస్తాడా అని, కష్టాలు ఎదురైనప్పుడు తననుతాను సాధకుడిగా భావించుకొంటాడా, ఆధ్యాత్మిక సాధన చేస్తున్నప్పుడు ఫాకు అంటిపెట్టుకొని ఉంటాడా అన్న విషయం మాత్రమే. కొంతమంది మాత్రం, మీరు దాని గురించి ఎంత చెప్పినప్పటికీ, నమ్మక, సామాన్య మానవులుగా ఉండడమే ఆచరణ సాధ్యమని తలుస్తారు. వారు తమ మొండి నమ్మకాలను వదిలించుకోవడం కంటే వాటినే పట్టుకొని వేలాడతారు, ఆ కారణంగా నమ్మలేకపోతారు. కొందరు కేవలం వ్యాధినిర్మూలన చెయ్యాలని మాత్రమే కోరుకుంటారు. ఏది ఏమైనా చీ గోంగ్‌ను వ్యాధినిర్మూలన కోసం ఉపయోగించకూడదని నేను చెప్పగానే వారి మనసులు ప్రతికూలంగా స్పందిస్తాయి, అందువల్ల ఆ తర్వాత బోధించినదాన్ని వారు నమ్మరు.

కొంతమంది ఏం చేసినా తమ జ్ఞానోదయ లక్షణాన్ని మెరుగుపరచు కోలేరు. నా పుస్తకంలో తమ ఇష్టం వచ్చినట్లు గుర్తులు పెట్టుకుంటారు. మా సాధకులలో దివ్యనేత్రం తెరచి ఉన్న ప్రతివారికి ఈ పుస్తకం వర్ణభరితంగానూ, బంగారం వలెనూ, మెరుస్తున్నట్లుగానూ కనిపిస్తుంది. ప్రతి పదంలోనూ నా ఫాషెన్ నిండి ఉంటుంది. నేను అబద్ధం చెప్తుంటే అందరినీ మోసగిస్తున్నట్లే. మీరు పెట్టిన గుర్తు చాలా నల్లగా కనిపిస్తూ ఉంటుంది. మీ ఇష్టానుసారంగా

గుర్తులు పెట్టడానికి మీరెలా సాహసించగలరు? ఇక్కడ మేము చేస్తున్నదేమిటి? మిమ్మల్ని ఉన్నతస్థాయిలకు చేర్చే ఆధ్యాత్మిక సాధన చేయమని దారిచూపడం లేదా? మీరు కూడా ఆలోచించవలసిన విషయాలు ఉన్నాయి. ఈ పుస్తకం మీ ఆధ్యాత్మిక సాధనను ముందుకు నడిపించగలదు. ఇది విలువైనదని మీరు భావించడం లేదా? మీరు బుద్ధుని పూజించడంవల్ల నిజంగా ఆధ్యాత్మిక సాధనను చెయ్యగలరా? మీరు చాలా భక్తి కలిగి ఉంటారు, రోజూ ఆ బుద్ధ విగ్రహం దగ్గర ధూపం వేసే మీరు దానిని కొద్దిగానైనా స్పృశించే సాహసం చెయ్యరు, కానీ మీ ఆధ్యాత్మిక సాధనకు నిజంగా దారిచూపగల దాఫాను మాత్రం నాశనం చెయ్యడానికి సాహసిస్తారు.

ఒక వ్యక్తిలోని జ్ఞానోదయ లక్షణం గురించి చెప్పాలంటే, ఇది ఆధ్యాత్మిక సాధనాక్రమంలోని భిన్నస్థాయిల దగ్గర సంభవించే దాని గురించి లేదా మీ గురువు బోధించిన ఒక ప్రత్యేకమైన ఫా గురించి మీ అవగాహన ఎంత లోతైనదో చెప్తుంది. అయినప్పటికీ ఇది మేము చెప్పే మౌలికమైన జ్ఞానోదయం కాదు. మేము చెప్పే మౌలికమైన జ్ఞానోదయం ఇది: ఒక వ్యక్తి తన జీవితకాలంలో ఆధ్యాత్మిక సాధన ప్రారంభించినప్పటినించి నిరంతరం పైకి ఎదుగుతూ మానవ సహజ బంధాలను, వాంఛలనూ వదిలిపెడుతూ ఉంటాడు, అతడి గోంగ్ కూడా ఆధ్యాత్మిక సాధనలోని ఆఖరిమెట్టు చేరేవరకు నిరంతరం పెరుగుతూనే ఉంటుంది. ఈ పుణ్య పదార్థం పూర్తిగా గోంగ్‌గా మారినప్పుడూ, గురువుచేత ఏర్పరచబడిన ఆధ్యాత్మిక ప్రయాణం ముగిసినప్పుడూ అన్ని బంధనాలూ ఆ క్షణంలోనే భళ్ళుమని విడిపోతాయి. ఆ వ్యక్తి యొక్క దివ్యనేత్రం అతడున్న స్థాయిలోని అత్యున్నత బిందువును చేరుకుంటుంది, తన స్థాయిలో ఉన్నట్టి భిన్న పరిమాణాలలోని సత్యాన్ని, భిన్న జీవులను, పదార్థానికి భిన్న దేశ కాలాలలో ఉండే రూపాలను, విశ్వ సత్యాన్నీ అతడు చూడగలుగుతాడు. అతడి దైవీక శక్తులన్నీ వెలికివస్తాయి, అతడు రకరకాల జీవులను కలుసుకోగలుగుతాడు. ఆ సమయానికి ఈ మనిషి ఒక మహాజ్ఞాని లేదా ఆధ్యాత్మిక సాధన ద్వారా జ్ఞానోదయం పొందిన మనిషి కాదా? ప్రాచీన భారతీయ భాషలోకి అనువదిస్తే అతడు ఒక బుద్ధుడు.

మేము జ్ఞానోదయం అని చెప్పేది హఠాత్తుగా జరిగే ఒక రకమైన

మౌలికమైన జ్ఞానోదయం. హఠాత్ జ్ఞానోదయం అంటే, ఒక వ్యక్తి తన జీవిత కాలపు ఆధ్యాత్మిక సాధనలో బంధింపబడి ఉంటాడు, అతడికి తన గోంగ్ స్థాయి ఎంత ఎత్తున ఉందో లేదా తాను సాధన చేసుకున్న గోంగ్ ఏ రూపంలో కనిపిస్తుందో తెలియదు. అతడికి ఏ విధమైన అనుభూతి కూడా ఉండదు, అతడి శరీరంలోని జీవకణాలు సైతం బంధింపబడి ఉంటాయి. అతడు ఆఖరి మెట్టు చేరుకునే వరకు తాను సాధన చేసుకున్న గోంగ్ బంధింపబడి ఉండి, అప్పుడు మాత్రమే అది విడిపించబడుతుంది. ఉన్నతమైన జన్మ సంస్కారం ఉన్న వ్యక్తి మాత్రమే ఇది చెయ్యగలుగుతారు, ఎందుకంటే ఈ ఆధ్యాత్మిక సాధన అన్నది చాలా కష్టాలతో కూడుకున్నది. ఒక వ్యక్తి మంచివాడిగా ఉంటూ దీనిని మొదలుపెట్టాలి. అతడు ఎప్పుడూ షిన్ షిన్‌ను మెరుగుపరచుకోవాలి, ఎప్పుడూ బాధలను సహించుతూ ఉండాలి, ఆధ్యాత్మిక సాధనలో పైకి ఎదుగుతూ ఉండాలి, తన గోంగ్‌ను చూసుకోలేకపోయినప్పటికీ ఎల్లప్పుడూ తన షిన్ షిన్‌ను ఉన్నతీకరించుకోవడానికి ప్రయత్నిస్తూ ఉండాలి. అటువంటి వారికి ఆధ్యాత్మిక సాధన అత్యంత కష్టం, ఆ స్త్రీ లేదా పురుషుడు ఉన్నతమైన జన్మ సంస్కారం కలిగినవారై ఉండాలి. ఈ వ్యక్తి ఏమీ తెలియకుండానే అనేక సంవత్సరాలు ఆధ్యాత్మిక సాధన చేస్తూ ఉంటాడు.

క్రమక్రమంగా కలిగే జ్ఞానోదయం అని మరొక రకమైన జ్ఞానోదయం కూడా ఉంది. మొట్టమొదటినించే అనేకమంది ఫాలున్ యొక్క భ్రమణాన్ని అనుభవించి ఉన్నారు. అదే సమయంలో నేను అందరి దివ్యనేత్రాన్ని కూడా తెరిచాను. రకరకాల కారణాలవల్ల ఇప్పుడు కాకపోయినా భవిష్యత్తులో అనేక మంది విషయాలను చూడగలుగుతారు. వారు విషయాలను అస్పష్టంగా చూడగలిగే స్థితినించి స్పష్టంగా చూడగలిగే స్థితికి, దాన్ని ఉపయోగించుకోలేని స్థితినించి ఉపయోగించుకోగల స్థితికి వస్తారు. వారి స్థాయి నిరంతరం పెరుగుతూనే ఉంటుంది. మీ షిన్ షిన్ మెరుగుపడుతూ మీరు రకరకాల బంధాలను వదులుకొంటున్నకొద్దీ, అనేక అతీంద్రియ శక్తులు పెంపొందుతూ ఉంటాయి. ఆధ్యాత్మిక సాధన యొక్క యావత్ పరివర్తనా ప్రక్రియ, శరీర పరివర్తనా ప్రక్రియ అన్నీ కూడా మీరు వాటిని చూడగలిగిన లేదా అనుభూతి చెందగలిగిన పరిస్థితిలో జరుగుతాయి. ఆ మార్పులు మీరు విశ్వ సత్యాన్ని

పరిపూర్ణంగా అర్థం చేసుకోగలిగినట్టి, ఆధ్యాత్మిక సాధనలో ఆశించిన అత్యున్నత స్థానానికి చేరుకున్నప్పటి ఆ చివరిమెట్టు దాకా కొనసాగుతాయి. బెంటి యొక్క పరివర్తన, అతీంద్రియ శక్తులు బలోపేతం కావడం అన్నవి కూడా ఒక నిర్దిష్ట స్థాయికి చేరి, క్రమంగా ఈ లక్ష్యాన్ని సాధిస్తాయి. ఇదే క్రమమైన జ్ఞానోదయం. క్రమమైన జ్ఞానోదయం అన్న ఈ ఆధ్యాత్మిక సాధనా విధానం కూడా సులభమైనది కాదు. అతీంద్రియ శక్తులు కలిగినప్పుడు కొంతమంది తమ బంధాలను విడిచిపెట్టలేక గొప్పలు ప్రదర్శించడమూ లేదా కొన్ని దుష్కర్మలు చేయడమూ జరగొచ్చు. ఆ విధంగా మీరు గోంగ్‌ను కోల్పోతారు, మీ ఆధ్యాత్మిక సాధన వృథా అయి, చివరికి క్షీణించిపోతుంది. కొంతమంది, పరిశీలనతో భిన్న స్థాయులలో భిన్న జీవులు ఎలా వ్యక్తం అవుతాయన్నది చూడగలుగుతారు, మిమ్మల్ని ఎవరైనా అది చెయ్యమనో, ఇది చెయ్యమనో అడగవచ్చు. ఆ వ్యక్తి తన విషయాలను సాధన చెయ్యమని అడిగి, మిమ్మల్ని తన శిష్యునిగా తీసుకోవచ్చు, కానీ మీరు సరియైన ఫలం సాధించడానికి అతడు సాయం చెయ్యలేడు ఎందుకంటే తానే సరియైన ఫలం పొందలేదు.

దీనికితోడు ఉన్నత పరిమాణాలలోని జీవులందరూ అతిపెద్ద ఆకారాలను పొంది తమ అతీంద్రియ శక్తులను చూపించగలిగిన అమరులు. మీ మనసులో నిజాయితీ లేకపోతే మీరు వారిని అనుసరించరూ? ఒకసారి మీరు వారిని అనుసరిస్తే, మీ ఆధ్యాత్మిక సాధన వృథాగా ముగిసిపోతుంది. ఆ వ్యక్తి ఒకవేళ నిజమైన బుద్ధుడే అయినా, తావోయే అయినా, మీరు తిరిగి మీ సాధనను మొట్టమొదటినించీ ప్రారంభించవలసి ఉంటుంది. వారు ఏ స్వర్గ స్థాయినించి వచ్చినవారైనా, ఇంకా అమరులే కదా? ఒక వ్యక్తి ఆధ్యాత్మిక సాధనలో ఒక అత్యంత ఉన్నతస్థాయికి చేరుకొని లక్ష్యాన్ని సాధించినప్పుడు మాత్రమే పూర్తిగా పైకి ఎదిగి అతీతుడు అవుతాడు. ఒక సామాన్య వ్యక్తికి ఒక అమరజీవి తప్పని సరిగా పొడుగ్గానూ, పెద్ద ఆకారంతోనూ, అతిసమర్థుడుగానూ గోచరించవచ్చు. అయినప్పటికీ ఆ వ్యక్తి కూడా సరియైన ఫలం పొంది ఉండకపోవచ్చు. వివిధ సందేశాలవల్ల కలిగే అంతరాయాలు, వివిధ దృశ్యాలవల్ల మనసు చెదరడం జరిగినప్పుడు మీరు కలత పడకుండా ఉండగలరా? అందువల్ల, దివ్యనేత్రం

తెరిచి ఉన్నప్పుడు కూడా ఆధ్యాత్మిక సాధన చెయ్యడం కష్టమవుతుంది, షిన్ షిన్‌ను సరిగ్గా అదుపు చెయ్యడం కష్టతరం అవుతుంది. అదృష్టవశాత్తు, మన సాధకులలో అనేకమందికి ఆధ్యాత్మిక సాధనా ప్రక్రియలోని సగభాగం దాటిన తరవాత వారి అతీంద్రియ శక్తులు విడిపించబడి, వారు అప్పుడు క్రమమైన జ్ఞానోదయస్థితిని చేరుకుంటారు. ప్రతిఒక్కరి దివ్యనేత్రం తెరుచుకొని ఉంటుంది, కానీ చాలామందిలోని అతీంద్రియ శక్తులు బహిర్గతం కావడానికి అనుమతి ఉండదు. మీ షిన్ షిన్ క్రమంగా ఒక నిర్దిష్ట స్థాయికి చేరుకున్న తరవాత, మీరు ఒక స్థిరచిత్తంతో చక్కగా ప్రవర్తించగలిగిన తరవాత, అవన్నీ ఒక్క విస్ఫోటంతో తెరుచుకుంటాయి. ఒక నిర్దిష్ట స్థాయిలో మీరు క్రమమైన జ్ఞానోదయ స్థితిలోకి ప్రవేశిస్తారు, అప్పుడు మీ ప్రవర్తనను చక్కగా ఉంచుకోవడం సులభమవుతుంది. వివిధ అతీంద్రియ శక్తులు బహిర్గతమవుతాయి. చివరకు అన్నీ బంధ విముక్తి పొందే వరకు మీ అంతట మీరే ఆధ్యాత్మిక సాధనలో ఎదగగలుగుతారు. మీ ఆధ్యాత్మిక సాధనలో సగం పూర్తి అయినప్పుడు వాటిని పొందడానికి అనుమతి ఉంటుంది. మా సాధకులలో అనేకమంది ఈ వర్గానికి చెంది ఉంటారు, కాబట్టి మీరు విషయాలను చూడ్డానికి ఆత్రపడకూడదు.

జెన్ బౌద్ధమతం కూడా హఠాత్ జ్ఞానోదయం, క్రమమైన జ్ఞానోదయం మధ్యనున్న వ్యత్యాసాన్ని తెలియజెప్తుందని ప్రతివారూ వినే ఉంటారు. జెన్ బౌద్ధమతంలో ఆరవ గురువైన హ్యూ నెంగ్ హఠాత్ జ్ఞానోదయం గురించి బోధించగా, జెన్ బౌద్దమతంలో ఉత్తర సిద్ధాంతానికి చెందిన షెన్ గ్జ్యు (3) క్రమమైన జ్ఞానోదయం గురించి బోధించారు. ఆ రెండు బౌద్ధ విద్యల నడుమ చరిత్రలో చాలాకాలం వివాదం కొనసాగింది. అది అర్థం లేనిదని నేను అంటాను. ఎందుకని? ఎందుకంటే వారు చెప్పినది ఆధ్యాత్మిక సాధన ప్రక్రియలో కేవలం ఒక నియమం గురించి మాత్రమే. ఆ నియమం గురించి కొందరు ఒక్కసారిగా అర్థం చేసుకోగా, ఇతరులు దానిని క్రమంగా అర్థం చేసుకో గలిగి ఉండొచ్చు. ఒక వ్యక్తి ఎలా జ్ఞానం పొందాడు అన్నది అంత ముఖ్యమా? అతడు దానిని ఒక్కసారిగా అర్థం చేసుకుంటే మంచిదే, కానీ అతడు దానిని క్రమక్రమంగా అర్థం చేసుకున్నా కూడా మంచిదే. రెండు

సందర్భాలు జ్ఞానోదయానికి చెందినవే కదా? రెండూ జ్ఞానోదయమే, కాబట్టి ఏదీ తప్పు కాదు.

## మహోన్నత జన్మ సంస్కారం కలిగినవారు

"మహోన్నత జన్మ సంస్కారం" కలిగిన మనిషి అన్న మాటకు అర్థమేమిటి? మహోన్నత జన్మ సంస్కారంగల మనిషి అనడానికీ, ఉన్నత జన్మ సంస్కారం లేదా అల్పమైన జన్మ సంస్కారం గల మనిషి అని చెప్పడంలో ఇంకనూ వ్యత్యాసాలున్నాయి. మహోన్నత జన్మ సంస్కారం కలిగిన మనిషి దొరకడం అతిదుర్లభం, ఎందుకంటే, అటువంటి మనిషి జన్మించడానికి చరిత్రలో చాలాకాలం పడుతుంది. అయితే, ఒక మహోన్నత జన్మ సంస్కారం కలిగి ఉన్న మనిషికి తప్పనిసరిగా మొదట పెద్ద మొత్తంలో పుణ్యమూ, తెల్లని పదార్థపు అతిపెద్ద క్షేత్రమూ ఉండాలి – ఇది నిశ్చయం. అదే సమయంలో అతడికి కఠినతరమైన కష్టాలను సహించగలిగిన శక్తి కూడా ఉండాలి. అతడికి చాలా ఓర్పు కలిగిన మనసు కూడా ఉండాలి, త్యాగం చేసే గుణం ఉండాలి. అతడు పుణ్యాన్ని తప్పనిసరిగా పరిరక్షించుకోగలిగి ఉండాలి, చక్కని జ్ఞానోదయ లక్షణం కలిగి ఉండాలి మొదలైనవి.

అన్నిటిలోకి కఠినతరమైన కష్టం ఏది? మానవ జన్మ ఉన్నది కష్టాలను భరించడానికే – మీరు మానవులుగా ఉన్నంతవరకు కష్టాలు పడి తీరవలసిందే అని బౌద్ధమతం నమ్ముతుంది. ఇతర పరిమాణాలన్నిటిలోని జీవులకు మనవలె సామాన్య మానవ శరీరాలు ఉండవని అది నమ్ముతుంది. అందువల్ల వారికి వ్యాధులు రావు, వారికి పుట్టుక, వృద్ధాప్యమూ, వ్యాధీ, మరణమూ వంటి సమస్యలు సైతం ఉండవు. ప్రాథమికంగా అటువంటి కష్టాలే ఉండవు. ఇతర పరిమాణాలలోని మనుషులు గాలిలో తేలగలరు, ఎందుకంటే, వారు భార రహితంగానూ, అతి అద్భుతంగానూ ఉంటారు. ఈ శరీరం కారణంగా మానవులకు ఈ చెప్పబడిన సమస్య ఎదురవుతుంది: వారు చలి, వేడిమి, దాహం, ఆకలి, అలసటలను తట్టుకోలేరు, అయినప్పటికీ వారికి పుట్టుక, వృద్ధాప్యమూ, వ్యాధీ, మరణం ఉంటాయి. ఏ పరిస్థితిలోనూ ఒక వ్యక్తి సుఖంగా ఉండడు.

తాంగ్ షాన్ (4) లో భూకంపం వచ్చిన సమయంలో చాలామంది భూకంపంలో చనిపోయారు కానీ కొందరు రక్షింపబడ్డారని నేను ఒక వార్తా పత్రికలో చదివాను. ఆ వ్యక్తులందరితో ఒక ప్రత్యేకమైన సాంఘిక అభిప్రాయ సేకరణ నిర్వహింపబడింది. "మరణం ఎదురైన ఆ స్థితిలో మీకు ఎలా అనిపించింది?" అని వారిని ప్రశ్నించడం జరిగింది. ఆశ్చర్యకరంగా అందరూ నిర్ద్వంద్వంగా ఒకే పరిస్థితిని అనుభవించారు. అంటే, మరణం ఎదురుగా నిలిచిన ఆ క్షణంలో వారికి భయమే కలగలేదు; దానికి విరుద్ధంగా వారికి, సుప్తచేతనలో ఒక రకమైన ఆనందాతిరేకంతో హఠాత్తుగా ఒక నిశ్చింత అయిన అనుభూతి కలిగింది. కొంతమందికి శరీరంనించి బంధ విముక్తులైనట్లు గాలిలో తేలికగా, అద్భుతంగా తేలిపోతున్న భావన కలిగింది; వారు తమ శరీరాలను చూసుకోగలిగారు కూడా. కొందరైతే ఇతర పరిమాణాలలోని జీవులను చూడడం కూడా జరిగింది, మరికొందరు మరెక్కడికో వెళ్ళిపోయారు. వారందరూ కూడా ఆ క్షణంలో ఒక నిశ్చింత పొందిన భావనను, ఏ విధమైన బాధ లేకుండా సుప్తచేతనలో కలిగిన ఒక ఆనందాతిరేక భావనను గురించే చెప్పారు. ఈ మానవ దేహంతో ఒక వ్యక్తి బాధలు పడతాడు, కానీ, ప్రతి ఒక్కరూ మాతృగర్భంనించి ఇలాగే వస్తారు కాబట్టి, ఇది బాధ అని ఎవరికీ తెలియదు.

ఒక వ్యక్తి, కష్టాలన్నిటిలోకి కఠినతరమైన కష్టం అనుభవించవలసి ఉంటుందని నేను చెప్పాను. మానవుల దేశ కాల భావన, పెద్దదైన మరొక దేశ కాలమునకు భిన్నంగా ఉంటుందని నేను ఒకరోజున చెప్పాను. ఆ ప్రదేశంలోని ఒక ష్రచన్ ఒక సంవత్సరం కాగా, ఇక్కడ అది రెండుగంటలే. ఈ గడ్డు పరిస్థితిలో ఒక మనిషి ఆధ్యాత్మిక సాధన చేస్తే, అతడు నిజంగా అతిశ్రేష్టునిగా పరిగణింపబడతాడు. ఈ వ్యక్తి హృదయపూర్వకంగా తావోను కోరి ఆధ్యాత్మిక సాధన చెయ్యాలనుకున్నప్పుడు, అతడు నిజంగా గొప్పవాడని అనిపించుకుంటాడు. ఇటువంటి కష్టాలు ఉన్నా అతడు తన సహజ స్వభావాన్ని పోగొట్టుకొనక ఆధ్యాత్మిక సాధన ద్వారా తన స్వస్వరూపానికి తిరిగి వెళ్ళాలని కోరుకుంటాడు. సాధకులకు నిబంధనలు లేని సాయం ఎందుచేత అందించ బడుతుంది? కేవలం ఈ కారణం వల్లనే. ఈ వ్యక్తి సామాన్య వ్యక్తులున్న ఈ

పరిమాణంలో ఒక రాత్రి అంతా ధ్యానంలో కూర్చుంటే, అది చూసి, అక్కడి వారు ఇతడు ఆరేళ్ళు కూర్చున్నందువల్ల, శ్రేష్ఠుడని చెప్తారు. ఎందుకంటే, మన ష్చన్ అక్కడ ఒక సంవత్సరంతో సమానం. మన మానవాళి ఉన్న పరిమాణం అతి అద్వితీయ మైనది.

ఒక వ్యక్తి, కష్టాలన్నిటిలోకీ కఠినతరమైన కష్టాన్ని ఏ విధంగా సహించ గలుగుతాడు? ఉదాహరణకు, ఒకనాడు ఇతడు తన కార్యాలయానికి వెళ్ళి నప్పుడు అక్కడ పని సరిగ్గా సాగడంలేదు. అక్కడి మనుషులు తమ పనిని సరిగ్గా నిర్వర్తించకపోవడంవల్ల అటువంటి పరిస్థితి ఏమాత్రం కొనసాగదు. అక్కడ మార్పులు చేసి కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగులను నియమించుకుంటారు. అదనపు ఉద్యోగులు తొలగింపబడతారు, హఠాత్తుగా జీవనాధారాన్ని కోల్పోయిన వారిలో ఇతడు ఒకడు. అతడికి ఎలా అనిపిస్తుంది? ధన సంపాదనకు మరి ఏ ఇతర మార్గమూ లేదు. అతడు ఎలా జీవిస్తాడు? అతడికి ఎటువంటి ఇతర నైపుణ్యమూ లేదు, కాబట్టి దిగులుగా ఇంటికి చేరుకుంటాడు. ఇల్లు చేరేటప్పటికి, వృద్ధులైన తల్లిదండ్రులలో ఒకరు జబ్బుపడి, ఆందోళన కరమైన స్థితిలో ఉన్నారు. అతడు కంగారుపడి వారిని ఆస్పత్రికి తీసుకు వెళ్ళాలని త్వరపడతాడు. ఆస్పత్రి ఖర్చులకోసం అప్పు తెచ్చుకోవడానికి నానాపాట్లు పడతాడు. ఇంటికి తిరిగి వచ్చిన తరవాత వారికి తినడానికి ఏమైనా వండాలనుకుంటాడు. ఇంటికి వచ్చీ రాగానే, బడిలోని ఉపాధ్యాయుడు ఒకరు తలుపుతట్టి పిలిచి, "మీ అబ్బాయి పోట్లాటలో ఒకరిని గాయపరిచాడు, మీరు వెంటనే వచ్చి చూడాలి" అంటారు. ఆ విషయం చూసి వచ్చి కూర్చో బోతున్నంతలోనే ఫోన్ మోగుతుంది. "నీ భార్య ఎవరితోనో తిరుగుతున్నది" అని ఎవరో చెప్తారు. మీకు ఈ పరిస్థితి నిజంగా రాదు. ఒక సామాన్య వ్యక్తి అటువంటి కష్టాలను తట్టుకోలేక "నేను దేనికోసం బ్రతుకుతున్నాను? ఒక తాడు సంపాదించి ఉరి వేసుకొని ఈ బాధలను ఎందుకు ముగించుకో కూడదు?" అని ఆలోచిస్తాడు. ఒక వ్యక్తి కఠినతరమైన కష్టాలను సహించ గలిగి ఉండాలని మాత్రమే నేను చెప్తున్నాను. నిజానికి అవి ఈ విధంగా రూపుదిద్దుకోకపోవచ్చు. ఏమైనప్పటికీ, ఇద్దరి మధ్య ఘర్షణలు, మీ షిన్ షిన్‌ను పదును పెట్టుకోవలసినట్టి సంఘర్షణలు, స్వలాభంకోసం చేసే పోటీలు ఈ

సమస్యలకు ఏమాత్రమూ తీసిపోవు. చాలామంది తమ మాటను ఋజువు చేసుకోవడానికి లేదా తమ పరువు నిలబెట్టుకోవడం కోసమే జీవిస్తుంటారు, ఏ విషయాలనైనా పరిష్కరించలేని పరిస్థితి వచ్చినప్పుడు, ఉరి వేసుకుంటారు. కాబట్టి మనం ఈ సంక్లిష్ట వాతావరణంలోనే ఆధ్యాత్మిక సాధన చేసి కఠిన తరమైన కష్టాలను సహించగలిగి ఉండాలి. అదే సమయంలో మనకు చాలా ఓర్పు కలిగిన హృదయం ఉండాలి.

"చాలా ఓర్పు కలిగిన హృదయం" అంటే ఏమిటి? ఒక సాధకుడిగా, మొట్టమొదటిగా మిమ్మల్ని ఎవరైనా తిట్టినా కొట్టినా మీరు తిరిగి పోట్లాడకుండా ఉండగలగాలి – సహనంగా ఉండాలి. లేకపోతే మీరు ఏ రకమైన సాధకులు? "సహనంగా ఉండడం నిజంగా కష్టం, నాది త్వరగా కోపం వచ్చే స్వభావం" అని ఒకరు అంటారు. మీ స్వభావం అటువంటిదైతే, మీరు దాన్ని మార్చు కోవాలి, ఎందుకంటే, ఒక సాధకుడు ఓర్పుగా ఉండాలి. కొంతమంది, పిల్లలను అదుపు చేసేటప్పుడు త్వరగా సహనం కోల్పోయి వారి మీద అరుస్తారు, ఒక గలభా అయిన పరిస్థితి కల్పిస్తారు. మీరు పిల్లల్ని అదుపు చేస్తున్నప్పుడు అలా ఉండ కూడదు, మిమ్మల్ని మీరు కూడా బాధించుకోకూడదు. పిల్లలకు అర్థ మయ్యేలాగా నచ్చచెప్పి చక్కగా నేర్పాలి. ఒక చిన్న విషయాన్నే తట్టుకోలేక అంత సులువుగా సహనం కోల్పోతే, మీ గోంగ్‌ను పెంచుకోగలనని ఎలా ఊహించగలరు? "వీధిలో నడుస్తుండగా నన్ను ఎవరైనా తంతే, నన్ను గుర్తు పట్టేవాళ్ళెవరూ చుట్టుపక్కల లేకపోతే నేను భరించగలను", అని ఒకరు అంటారు. అది చాలదని నేను అంటాను. భవిష్యత్తులో ఒకవేళ ఎవరైతే చూడకూడదని మీరు అనుకుంటారో వారి ఎదుటనే ఎవరైనా మిమ్మల్ని రెండు చెంపదెబ్బలు వేస్తే, వారి ఎదుట మీ పరువు పోవచ్చు. మీరు ఆ విషయంలో ఎలా వ్యవహరిస్తారు, దాన్ని సహించ గలరా అన్నది చూడవలసి ఉంటుంది. మీరు దానిని భరించినప్పటికీ, అది మీ మనసును పీడిస్తుంటే అది ఏమంత గొప్ప విషయం కాదు. ఒక వ్యక్తి అర్హత స్థాయిని చేరు కున్నప్పుడు అతడి హృదయానికి ఏ విషయమూ పట్టదని మీకు తెలుసు. సామాన్య మానవసంబంధమైన ఏ వ్యవహారమూ తన హృదయానికి పట్టించు కోక, అతడు ఏ చీకూ, చింతా లేక నిరంతరమూ చక్కని భావనలతో ఉంటూ

చిరునవ్వు నవ్వుతూ ఉంటాడు. అతడికి ఏ విధమైన నష్టాలు కలిగినా ఏ చింత లేక చిరునవ్వును, చక్కని భావనలనూ కలిగి ఉంటాడు. మీరు నిజంగా ఇలా చెయ్యగలిగితే, మీరు ఇప్పటికే అర్హత పదవిలో ఫలస్థితిలోని ప్రవేశ – స్థాయికి చేరుకున్నట్లే.

"ఆ మేరకు సహనాన్ని పాటిస్తే, మేము చాలా పిరికిగా ఉన్నామంటూ, ఇతరులు సులభంగా అలుసు చేస్తారని సామాన్య మానవులు అంటారు," అని ఒకరన్నారు. అది పిరికితనమని నేను అనను. అందరూ ఇది ఆలోచించండి: మన సాధకులే కాకుండా, సామాన్య మానవులలో కూడా మధ్య వయస్కులు లేదా అంతకన్నా పెద్దవారు, ఉన్నతవిద్య అభ్యసించినవారు కూడా ఆత్మనిగ్రహం చూపి ఇతరులతో వివాదాలకు దూరంగా ఉంటారు. దానిని పిరికితనం అని ఎలా భావిస్తాము? అది గొప్ప సహనానికి ప్రతిరూపమని, మనోబలానికి వ్యక్తీకరణ అని నేను అంటాను. ఒక సాధకునికి మాత్రమే ఇంత గొప్ప సహనం కలిగిన హృదయం ఉంటుంది. "ఒక సగటు మనిషిని అవమానిస్తే, అతడు పోరాడటానికి కత్తి దూస్తాడు" అన్న నానుడి ఉంది. ఒక సామాన్య వ్యక్తికి నువ్వు తిడితే నేను తిడతా, నువ్వు కొడితే నేనూ తిరిగి కొడతా అన్నది సహజలక్షణంగా ఉంటుంది. అతడొక సామాన్య వ్యక్తి. అతడు సాధకుడిగా పిలవబడగలడా? ఒక సాధకుడిగా, మనోబలమూ, ఆత్మనిగ్రహమూ లేనిదే మీరు ఇలా చెయ్యలేరు.

ప్రాచీనకాలంలో అతిసమర్థుడూ, లియో బాంగ్ (6) వద్ద ఉన్నత సైనికాధికారి, దేశానికే వెన్నెముకవంటి వాడైన హాన్ షీన్ (5) అన్న వ్యక్తి ఉండేవాడని మీకు తెలుసు. అతడికి ఆ గొప్ప విజయాలు ఎలా సమకూరాయి? హాన్ షీన్ పిన్నవయసులోనే ఒక అసాధారణ వ్యక్తి అని చెప్పబడింది. అతడు ఒక మనిషి కాళ్ళ మధ్య పాకవలసి వచ్చినప్పుడు ఆ అవమానాన్ని ఎలా భరించాడు అని అతడి గురించి ఒక కథ ఉంది. హాన్ షీన్ యవ్వనంలో యుద్ధవిద్యలను సాధన చేశాడు, యుద్ధవిద్యను ప్రదర్శించేవారు సాధారణంగా ఒక కత్తి పట్టుకొని తిరిగేవారు. ఒకరోజున అతడు వీధిలో నడుస్తుండగా, స్థానికుడైన ఒక మొరటుమనిషి నడుము మీద చేతులు పెట్టుకొని అతడి దారికి అడ్డు నిలిచి "నువ్వు దేనికోసం ఆ కత్తి పట్టుకొని తిరుగుతున్నావు?

ఎవరినైనా చంపే సాహసం చెయ్యాలనుకుంటున్నావా? అలా అయితే నా తల నరికెయ్యి" అన్నాడు. అలా అంటూ తన తలను ముందుకు చాపాడు. హాన్ షీన్ "నేను నీ తల ఎందుకు నరకాలి?" అనుకున్నాడు. ఆ కాలంలో కూడా ఎవరినైనా చంపితే ప్రభుత్వానికి తెలియజేయడమూ, ఆ ప్రాణానికి మారుగా ప్రాణం చెల్లించడమూ ఉండేది. ఒక వ్యక్తి తన ఇష్టం వచ్చినట్లు ఎవరినైనా ఎలా చంపగలడు? హాన్ షీన్ తనను చంపేంతటి సాహసం చెయ్యకపోవడాన్ని చూసిన ఆ మొరటు మనిషి "నీకు నన్ను చంపేంతటి సాహసం లేకపోతే నా కాళ్ళ మధ్యగా పాకాలి" అన్నాడు. హాన్ షీన్ నిజంగానే అతడి కాళ్ళ మధ్యగా పాకాడు. ఇది హాన్ షీన్ గొప్ప ఓర్పు గల హృదయం ఉన్నవాడని తెలియ జేస్తున్నది. అతడు సామాన్య మానవులకు భిన్నమైనవాడు గనకనే ఆ గొప్ప విజయాలను సాధించగలిగాడు. తన మాటనే నిరూపించుకోవడమూ లేదా తన మర్యాదను కాపాడుకోవడానికే జీవించాలనేది ఒక సామాన్య వ్యక్తి యొక్క లక్ష్యం. అందరూ ఇది ఆలోచించండి: తన మాటను నిరూపించుకోవడం కోసమూ లేదా తన మర్యాదను కాపాడుకోవడం కోసమే జీవించడమనేది – అది అలసటకు గురి చెయ్యదూ? అది బాధాకరం కాదూ? దానివల్ల ఏమైన ఉపయోగం ఉందా? ఇంతా చేసి హాన్ షీన్ ఒక సామాన్య వ్యక్తి. సాధకులుగా, మనం అతనికన్నా చాలా మెరుగ్గా ఉండాలి. మన లక్ష్యం సామాన్య మానవుల స్థాయికంటే పైకి ఎదిగి అతీతులమై ఉన్నతస్థాయుల కోసం ప్రయత్నించడం. మనం అటువంటి పరిస్థితిలోకి దూసుకుపోము. అయినా, సామాన్యమానవుల నడుమ ఒక సాధకుడు సహించే అవమానాలూ, ఇబ్బందులూ దీనికన్నా సులువుగా ఉండవలసిన అవసరం లేదు. మీ యొక్క షిన్ షిన్‌ను పదును పెట్టడానికి ఏర్పడేవి, ఇతరులతో వచ్చే సంఘర్షణలు ఇంతకన్నా సులభమైనవి కాదంటాను నేను – అవి ఇంకా ఘోరంగా ఉండొచ్చు. అది కూడా చాలా కష్టమే.

అదే సమయంలో, ఒక సాధకుడు సామాన్య మానవుల యొక్క వివిధ బంధాలనూ, వాంఛలనూ వదిలిపెట్టి, త్యాగాలు చెయ్యడానికి కూడా సిద్ధంగా ఉండాలి. ఒకేసారి అలా చెయ్యడం కష్టంగా ఉండవచ్చు, కాబట్టి క్రమక్రమంగా చెయ్యవచ్చు. మీరు ఇవాళే చెయ్యగలిగితే, మీరు ఒక బుద్ధుడే అవుతారు.

ఆధ్యాత్మిక సాధనకు సమయం పట్టవచ్చు కానీ మీరు నెమ్మదించకూడదు. “గురువుగారు ఆధ్యాత్మిక సాధనకు సమయం పడుతుందన్నారు – మెల్లగానే చేద్దాములే,” అని మీరు అనొచ్చు. అలా కుదరదు! మీరు కఠినంగా ఉండాలి. బుద్ధ ఫా ఆధ్యాత్మిక సాధనలో పురోగమించడానికి మీరు తీవ్రంగా శ్రమించాలి.

మీరు మీ పుణ్యాన్ని పరిరక్షించుకొని, షిన్ షిన్‌ను నిలుపుకోగలిగి ఉండాలి, మీ ఇష్టానుసారం ప్రవర్తించకూడదు. మీరు అలక్ష్యంగా మీకు కావలసినదల్లా చెయ్యకూడదు, మీ షిన్ షిన్‌ను నిలుపుకోగలిగి ఉండాలి. “సత్కర్మలను ఆచరించడంవల్ల పుణ్యం పోగుపడుతుంది” అన్నమాట సాధారణంగా సామాన్య మానవుల నడుమ వినిపిస్తుంది. ఒక సాధకుడు పుణ్యాన్ని సంపాదించుకోవడం కోసం సాధన చెయ్యడు, ఎందుకంటే మనం పుణ్యమును పరిరక్షించుకోవడాన్ని నమ్ముతాం. మనం పుణ్యాన్ని పరిరక్షించు కోవడాన్ని ఎందుకు నమ్ముతాం? ఎందుకంటే మనం ఒక పరిస్థితిని చూసి ఉన్నాం: సామాన్య మానవులు పుణ్యాన్ని సంపాదించడం గురించి నమ్ముతారు, ఎందుకంటే వారు మరుజన్మలో మంచి జీవితంకోసం పుణ్యం సంపాదించే సత్కర్మలు చేస్తారు. కానీ మనకు ఆ సమస్య లేదు. మీరు ఆధ్యాత్మిక సాధనలో సఫలమై తావోను అందుకుంటే, మీకు మరుజన్మ అన్న సమస్య ఉండదు. పుణ్యాన్ని పరిరక్షించు కోవాలి అని ఇక్కడ మేము చెప్పేదానికి మరొక అర్థం ఉంది. అది, మన శరీరాలలో ఉండే ఈ రెండు పదార్థాలు ఒక జన్మలో సంపాదించుకున్నవి కావు – అవి అనంతకాలంనించి వారసత్వంగా వస్తూ ఉన్నవి. మీరు బైక్ మీద నగర మంతట తిరిగినా చెయ్యడానికి మంచిపనులు దొరకకపోవచ్చు. మీరు ఇలా రోజూ వెతికినప్పటికీ అటువంటి అవకాశాలు మీకు లభించకపోవచ్చు.

దీనికి మరొక రకమైన అర్థం ఉంది: పుణ్యం సంపాదించే ప్రయత్నంలో ఒక పని మంచిది అనుకొని మీరు చేసిన తరవాత అది చెడ్డపనిగా తెలియవచ్చు. మీరు ఒక విషయం చెడ్డదని భావించి దానికి అంతరాయం కలిగించిన తరవాత అది ఒక మంచిపనిగా తెలియవచ్చు. ఎందుకు? ఎందుకంటే మీరు దానికి ఉన్నట్టి కర్మ సంబంధాన్ని చూడలేరు. సామాన్య

మానవుల జీవన వ్యవహారాలు సక్రమంగా నడిచేందుకు చట్టాలున్నాయి, అది పెద్ద సమస్య కాదు. సాధకుడుగా ఉండడం ఒక అతీంద్రియమైన విషయం కాబట్టి ఒక అతీంద్రియ వ్యక్తిగా మీరు మీ ప్రవర్తనను మానవాతీతమైన నియమాలతోనే నడుపుకోవాలిగానీ, సామాన్య మానవుల నియమాల ప్రకారం మిమ్మల్ని మీరు అంచనా వేసుకోకూడదు. మీకు ఒక విషయంలో ఉన్న కర్మ సంబంధం తెలియకపోతే, మీరు అందులో తప్పు చేసే అవకాశం ఉంది. అందువల్ల, మేము వూవేని బోధిస్తాం. మీరు కేవలం మీకు చెయ్యాలని అనిపించినంతమాత్రాన ఒక పని చెయ్యకూడదు. కొంతమంది "నాకు చెడ్డ వారిని క్రమశిక్షణలో పెట్టాలని ఉంది" అంటారు. వారు రక్షకభటులవడం ఉత్తమం అని నేను అంటాను. మీరు ఒక హత్య లేదా ఏదైనా తగలబెట్టడం చూసినప్పుడు పట్టించుకోకుండా వెళ్ళిపోవాలని నేను అనడం లేదు. నేను అందరికీ చెప్పేది ఏమిటంటే, మనుషుల మధ్య ఒక సంఘర్షణ జరిగినప్పుడు లేదా ఒక వ్యక్తి మరొకరిని తన్నడమో, కొట్టడమో జరిగినప్పుడు వారిద్దరి మధ్య ఏదో పాత ఋణం ఉందని, వారు దానిని తీర్చుకోవడం జరుగు తున్నదని చెప్తున్నాను. మీరు అందులో కల్పించుకొని అంతరాయం కలిగిస్తే వారు ఆ ఋణం తీర్చలేరని, దానిని తీర్చుకోవడానికి మరొక అవకాశంకోసం వేచి ఉండవలసి వస్తుందని చెప్తున్నాను. అంటే, మీరు కర్మ సంబంధాలను చూడ లేకపోతే, సులభంగా చెడ్డపనులు చేసి, ఫలితంగా పుణ్యాన్ని పోగొట్టుకుంటారు.

ఒక సామాన్య వ్యక్తి ఇతర సామాన్య వ్యక్తుల విషయంలో జోక్యం చేసుకుంటే అది ఒక సమస్య కాదు, ఎందుకంటే ఆ స్త్రీ లేదా పురుషుడు ఆ విషయాలను అంచనా వెయ్యడానికి సామాన్య మానవుల నియమాలను ఉపయోగిస్తారు. మీరు విషయాలను చూడడానికి మానవాతీత నియమాలను ఉపయోగించాలి. మీరు ఒక హత్యను గానీ, ఏదైనా తగలబెట్టడాన్ని గానీ చూసినప్పుడు వాటిని ఆపడానికి సాయం చెయ్యకపోవడం అన్నది షిన్ షిన్‌కు సంబంధించిన సమస్య అవుతుందని నేను చెప్తున్నాను. మీరు అలా చెయ్యనిదే మీరు మంచివారని ఎలా చూపించుకోగలరు? మీరు ఒక హత్యను లేదా దహనాన్ని ఆపడానికి సాయం చెయ్యకపోతే, మీరు ఇక ఏ విషయంలో కల్పించుకుంటారు? అయినప్పటికీ ఒక విషయం చెప్పవలసి ఉంది: మన

సాధకులకు ఈ విషయాలతో ఏ విధమైన సంబంధం లేదు. మీరు వాటిలో కల్పించుకోవడానికి అవి ఏర్పడి ఉండకపోవచ్చు. పుణ్యాన్ని పరిరక్షించు కోవడం మీరు తప్పులు చెయ్యకుండా ఉండడానికి పనికివస్తుంది. మీరు ఒకవేళ ఒక చిన్న పనిలో కల్పించుకొని చెడు చేస్తే, మీరు పుణ్యాన్ని పోగొట్టుకుంటారు. ఒకసారి పుణ్యాన్ని పోగొట్టుకుంటే, మీ స్థాయిని ఎలా ఉన్నతీకరించుకోగలుగుతారు? మీరు మీ అంతిమలక్ష్యాన్ని ఎలా సాధించ గలుగుతారు? అందులో ఇటువంటి అంశాలు కలిసి ఉంటాయి. దీనికితోడు ఒక వ్యక్తికి చక్కని జ్ఞానోదయ లక్షణం ఉండాలి. ఒక వ్యక్తి యొక్క ఉన్నతమైన జన్మ సంస్కారం అతడికి చక్కని జ్ఞానోదయ లక్షణం కలిగేటట్లు చెయ్యగలదు. అతడి పరిసర వాతావరణం కూడా ప్రభావాన్ని చూపించగలదు.

మనలో ప్రతి ఒక్కరు తమ అంతరాత్మను సంస్కరించుకొని, ఏదైనా తప్పు జరిగినప్పుడు వాటికిగల కారణాలకోసం, మరొకసారి మెరుగ్గా ప్రవర్తించడం కోసం తమ షిన్ షిన్‌ను తరచి చూసుకోవడం, ఏదైనా పని చేసేముందు ఇతరుల గురించి ముందుగా ఆలోచించడమూ చేస్తే, మానవ సమాజం మెరుగుపడుతుంది, నైతిక ప్రమాణాలూ తిరిగి పెరుగుతాయని కూడా మేము చెప్పాం. ఆధ్యాత్మిక సంస్కృతి (7), దానితోపాటుగా ప్రజలకు భద్రత కూడా మెరుగుపడుతుంది. బహుశా రక్షకభటులే ఉండకపోవచ్చును. పరిపాలన ఆవశ్యకత ఉండదు, ఎందుకంటే ఎవరికివారే తమ అంతరాత్మలను తరచి చూసుకొని తమనుతాము అదుపులో పెట్టుకుంటారు. అది గొప్పగా ఉంటుందని మీరు అనరా? చట్టాలు సమగ్రంగానూ, ఎటువంటి లొసుగులు లేకుండానూ తయారవుతున్నాయని మీకు తెలుసు. అయినా చెడ్డ పనులు చేసేవారు ఇంకా ఎందుకు ఉంటున్నారు? వారు చట్టాలకు ఎందుకు లోబడరు? ఎందుకంటే, మీరు వారి మనసులను కావలి కాయలేరు. వారిని ఎవరూ గమనించనప్పుడు, వారు ఇంకా చెడ్డపనులు చేస్తూనే ఉంటారు. ప్రతిఒక్కరూ తమ అంతరాత్మను సంస్కరించుకుంటే పరిస్థితి చాలా భిన్నంగా ఉంటుంది. అప్పుడు ధర్మాన్ని నిలబెట్టవలసిన పని మీకు ఉండదు.

ఈ ఫాను ఈ స్థాయి వరకే బోధించగలుగుతాం. ఉన్నతస్థాయులలో ఉన్నదాన్ని అందుకోవడం మీ ఆధ్యాత్మిక సాధనపై ఆధారపడి ఉంటుంది.

కొందరు లేవనెత్తిన ప్రశ్నలు చాలా ప్రత్యేకంగా ఉంటున్నాయి. మీ జీవితం లోని అన్ని ప్రశ్నలకూ నేనే సమాధానాలు వివరిస్తూ ఉంటే, ఇక సాధన చేయడానికి మీకు ఏం మిగిలి ఉంటుంది? తప్పనిసరిగా మీరు ఆధ్యాత్మిక సాధన చేసి స్వయంగా జ్ఞానం పొందవలసి ఉంటుంది. నేనే అన్నీ చెప్తే మీరు సాధన చెయ్యడానికి ఏమీ మిగలదు. అదృష్టవశాత్తూ, దాఫా అంతా జనులకు వెల్లడి చేయబడి ఉంది, ఇక మీరు అన్ని విషయాలను దాఫాను అనుసరించి చెయ్యవచ్చు.

* * * *

నేను ఫాను బోధించవలసిన సమయం పూర్తి అయిందని అను కుంటున్నాను. అందువల్ల, ప్రతిఒక్కరికి భవిష్యత్ ఆధ్యాత్మిక సాధనలో ఫా మార్గదర్శకత్వం వహించే విధంగా కొన్ని అసలైన విషయాలను అందించాలని అనుకుంటున్నాను. ఈ ఫా బోధనాక్రమం అంతటిలోనూ నేను ప్రతి ఒక్కరి పట్లనూ, సమాజం పట్లనూ బాధ్యత వహించాలన్న నియమానుసారం పని చెయ్యాలని సంకల్పించాను. వాస్తవంగా మేము ఈ నియమాన్ని పాటించాము. ఫలితం గురించి నేను ఎటువంటి వ్యాఖ్యానమూ చెయ్యను. దాని గురించి తీర్పును ఇవ్వడం ప్రజల వంతు. ఈ దాఫాను ప్రజలకు వెల్లడిచేసి మన ప్రజలలో చాలామందికి మేలు చెయ్యాలని, ఫాను అనుసరిస్తూ నిజంగా ఆధ్యాత్మిక సాధన చెయ్యాలనీ, తమ ఆధ్యాత్మిక సాధనలో పురోగమించాలనీ కోరుకునేవారికి ఆ శక్తి కల్పించాలన్నదే నా సంకల్పం. ఫాను బోధించడంతో పాటుగా ఒక మానవుడికి ఉండవలసిన నియమాలు కూడా వివరించాం. ఈ తరగతి ముగిసిన తరవాత ఒకవేళ మీరు ఆధ్యాత్మిక సాధన చెయ్యలేక పోయినా కనీసం ఒక మంచి మనిషిగా ఉండ గలుగుతారని ఆశిస్తున్నాను. అది మన సంఘానికి మేలు చేస్తుంది. నిజానికి, ఒక మంచి మనిషిగా ఎలా ఉండాలో మీకు ఇప్పటికే తెలిసింది. ఈ తరగతి తరవాత మీరు ఒక మంచి మనిషిగా ఉంటారు.

ఫాను బోధిస్తున్న క్రమంలో సక్రమంగా సాగని విషయాలు కూడా కొన్ని జరిగాయి, అనేక రకాల అంతరాయాలు ఎక్కువగా కలిగాయి. దీనిని

నిర్వహించిన సంస్థ యొక్క, అలాగే భిన్న వృత్తులకు చెందిన కార్యనిర్వాహకుల యొక్క, ఇంకనూ సంస్థలోని ఉద్యోగుల యొక్క గొప్ప తోడ్పాటుతో, మా తరగతులు చాలా విజయవంతంగా జరిగాయి.

ఈ ఉపన్యాసాలలో నేను చెప్పినదంతా ప్రతి ఒక్కరినీ ఉన్నతస్థాయిలకు చేర్చే ఆధ్యాత్మిక సాధన కోసం మార్గదర్శకత్వం చేయడానికే. గతంలో ఎవ్వరూ తమ శిక్షణలో ఈ విషయాలను బోధించలేదు. మేము బోధించినది చాలా స్పష్టమైనది, మానవ శరీరం గురించి ఆధునిక విజ్ఞానశాస్త్రాన్నీ, సమకాలీన విజ్ఞానశాస్త్రాన్ని ఇముడ్చుకున్నట్టిది అయిన విషయం. దీనికితోడు మీకు బోధించబడినది అత్యున్నత స్థాయిలోని విషయం. అది భవిష్యత్తులో ప్రతి ఒక్కరూ నిజంగా ఫాను పొందే శక్తి కల్పించడానికినీ, ఆధ్యాత్మిక సాధన ద్వారా పైకి ఎదగడానికి ఉద్దేశింపబడి ఉంది – నా ఉద్దేశం ఇదే. ఫాను, గోంగ్‌ను గురించి బోధిస్తుండగా చాలామందికి ఫా ఎంతో చక్కగా ఉన్నప్పటికీ అనుసరించడానికి కష్టంగా ఉన్నట్లు తోచింది. వాస్తవానికి, అది అనుసరించడం కష్టమా కాదా అన్న విషయం ఆయా వ్యక్తుల మీద ఆధారపడి ఉందని నేను అంటాను. ఆధ్యాత్మిక సాధన పట్ల ఇష్టం లేని ఒక వ్యక్తికి అది కేవలం చాలా కష్టంగానూ, ఊహాతీతంగానూ, అసాధ్యంగానూ తోస్తుంది. ఒక సామాన్య వ్యక్తిగా అతడికి ఆధ్యాత్మిక సాధన చెయ్యాలని అనిపించక, చాలా కష్టంగా ఉంటుంది. లావో జీ "ఒక వివేకవంతుడు తావోను విన్నంతనే, దాన్ని శ్రద్ధగా సాధన చేస్తాడు. ఒక సగటు మనిషి దానిని విన్నప్పుడు అప్పుడప్పుడు సాధన చేస్తాడు. ఒక వివేకహీనుడు దానిని విన్నప్పుడు దానిని పరిహసిస్తూ పెద్దగా నవ్వుతాడు. ఆ మనిషి దానిని పరిహసిస్తూ పెద్దగా నవ్వకపోతే అది తావోయే కాదు" అన్నారు. ఒక అసలైన సాధకుడికి అది సులభమైనదని, అందుకోలేనంత ఎత్తున ఉన్నది కాదనీ నేను అంటాను. నిజానికి, ఇక్కడ కూర్చున్నవారిలోనూ, ప్రస్తుతం ఇక్కడికి రానివారు కొందరు దీర్ఘకాలంగా సాధన చేసినట్టి అనేక సాధకులు ఇప్పటికే తమ ఆధ్యాత్మిక సాధనలో అత్యున్నత స్థాయిలకు చేరుకున్నారు. మీరు ఒక బంధాన్ని కల్పించుకోవడం లేక సంబరపడిపోవడం జరగకూడదనే ఉద్దేశంతో నేను అది చెప్పలేదు. అది మీ గోంగ్ బలం యొక్క అభివృద్ధిని ప్రభావితం చేస్తుంది. నిజంగా దృఢ నిశ్చయం కలిగిన సాధకుడైన

వ్యక్తి ప్రతీ విషయాన్ని సహించగలిగియుండి, వివిధ రకాలైన స్వలాభాపేక్షలు ఎదురైనప్పుడు కలిగే ఏ బంధమైనా వదలివేయగలడు లేదా ఉపేక్ష వహించ గలడు. అతడు ఇలా చేయగలిగినంతవరకు అది కష్టం కాదు. ఆ వ్యక్తులు ఆ విషయాలను వదలలేరు కాబట్టి వారికి అది కష్టంగా ఉంటుంది. ఆధ్యాత్మిక సాధన, లేదా షిన్ షిన్ ఉన్నతీకరించుకోవడం అన్న విషయాలు వాటికవే కష్ట మైనవి కావు. వారు మానవ మనస్తత్వాన్ని వదులుకోలేక అది కష్టమంటారు. ఇలా ఎందుకంటే ఎదురుగా లాభాలు కనపడుతున్నప్పుడు వాటిని వదులు కోవడం అతికష్టం. ఆ ప్రయోజనాలు అందుబాటులో ఉన్నాయి, కనక ఆ బంధాలను మీరు ఎలా వదులుకోగలరు? వాస్తవానికి ఈ కారణంవల్లనే ఒక వ్యక్తికి అది కష్టంగా కనిపిస్తుంది. ఇతరులతో సంఘర్షణ ఏర్పడినప్పుడు, మీరు సహనం పాటించలేకపోవడం లేదా దానిని ఎదుర్కొనడంలో మిమ్మల్ని మీరు ఒక సాధకుడిగా భావించుకోకపోతే, అది అంగీకరింపబడదని నేను చెప్తున్నాను. గతంలో నేను ఆధ్యాత్మిక సాధన చేసినప్పుడు ఎందరో పరమ గురువులు నాతో "నీకు భరింప శక్యంగా లేనప్పుడు నువ్వు భరించగలవు. అది అసాధ్యమైన పని అయినప్పుడు నువ్వు చెయ్యగలవు", అన్న మాటలు చెప్పారు. నిజానికి ఇది అలాగే ఉంటుంది. మీరు ఇంటికి వెళ్ళాక ఒక ప్రయత్నం ఎందుకు చెయ్యకూడదు? మీరు నిజంగా ఎదురైన ఒక కష్టం లేదా బాధను దాటడానికి దీన్ని ప్రయత్నించండి. దాన్ని భరించడం కష్టంగా ఉన్నప్పుడు భరించడానికి ప్రయత్నించండి. అది అసాధ్యంగా ఉన్నప్పుడు, అది అసాధ్యంగానే ఉంటుందని చెప్పబడినప్పుడు సాధ్యపడుతుందేమో చూడండి. మీరు నిజంగా చేయగలిగినప్పుడు: "విల్లో చెట్ల నీడలను దాటిన తరవాత అందమైన పూలూ, ముందు మరొక పల్లె ఉంటాయి" అన్నది నిజంగానే తెలుసుకుంటారు.

నేను ఇంతగా మాట్లాడినందున, చాలా విషయాలు ప్రస్తావించాను కాబట్టి ఇన్ని విషయాలను గుర్తుపెట్టుకోవడం ప్రతిఒక్కరికీ అతికష్టంగా ఉంటుంది. నేను ముఖ్యంగా అవసరమైన కొన్ని విషయాలను చెప్తాను: భవిష్యత్ ఆధ్యాత్మిక సాధనలో మీరందరూ మిమ్మల్ని సాధకులుగా భావించు కుంటారని, నిజంగా మీ ఆధ్యాత్మిక సాధనను కొనసాగిస్తారని ఆశిస్తున్నాను.

దీర్ఘకాలంగా సాధన చేస్తున్నవారూ, కొత్తగా సాధన చేస్తున్నవారూ కూడా దాఫాలో ఆధ్యాత్మిక సాధన చేసి సఫలం కాగలరని ఆశిస్తున్నాను! ఇంటికి వెళ్ళిన తరవాత ప్రతి స్త్రీ, ప్రతి పురుషుడు తమతమ కాలాన్ని అసలైన ఆధ్యాత్మిక సాధన కోసం ఉత్తమంగా ఉపయోగించుకుంటారని ఆశిస్తున్నాను.

* * * *

**అర్థములు:**

1. భౌతికవాదం – భౌతిక పదార్థపు చర్యలు, కదలికలు మాత్రమే ఏకైక సత్యమని ప్రతిపాదించే ఒక తాత్విక సిద్ధాంతం; ఉద్వేగములూ, ఆలోచనలతో సహా విశ్వంలోని ప్రతి విషయమునూ భౌతిక సూత్రాలతో వివరించవచ్చు.
2. గోంగ్ షెన్ – గోంగ్‌తో తయారైన శరీరం.
3. టాంగ్ వంశంలో జెన్ బౌద్ధంలోని ఉత్తర సిద్ధాంతాన్ని స్థాపించినవారు.
4. టాంగ్ షాన్ – హెబే రాష్ట్రంలోని ఒక నగరం.
5. హాన్ షీన్ – లియు బాంగ్ యొక్క ప్రముఖ సేనాధికారి.
6. లియు బాంగ్ – హాన్ వంశం (క్రీ.పూ. 200–క్రీ.శ. 23) స్థాపించిన చక్రవర్తి.
7. ఆధ్యాత్మిక నాగరికత – ప్రజల మనసులను, నైతికతను ఉన్నతీకరించడాన్ని సూచించేందుకు సమకాలీన చైనాలో ప్రాచుర్యం కలిగిన ఒక పదం. చైనాలో ఈ పదం "భౌతిక నాగరికత"కు వ్యతిరేకంగా ఉపయోగించబడుతుంది.

* * * *

పైపైన చూస్తే జువాన్ ఫాలున్ భాషాపరంగా సొంపుగా ఉండదు. అది ఆధునిక వ్యాకరణానికి అనుగుణంగా కూడా ఉండదు. అయితే నేను ఆధునిక వ్యాకరణం ఉపయోగించి ఈ దాఫా పుస్తకాన్ని కూర్చినట్లైతే, ఒక తీవ్ర సమస్య ఎదురవుతుంది, దానివల్ల ఈ పుస్తకంలోని భాష కూర్పు ప్రామాణికత, సొంపు గలిగి ఉన్నా, అది ప్రగాఢమూ, ఉన్నతమూ అయిన విషయాన్ని ఆవరించు కొనదు. ఎందుకంటే, ఆధునిక, ప్రామాణిక పదజాలం భిన్నమైన ఉన్నత స్థాయిల దాఫా యొక్క మార్గదర్శకత్వాన్నీ, ప్రతి స్థాయిలోనూ అభివ్యక్తమయ్యే ఫానూ వ్యక్తపరచలేదు; అంతేకాక అది సాధకుల యొక్క బెంటి, గోంగ్‌ల యొక్క పరివర్తనను, ఇంకా అటువంటి ఇతర మౌలికమైన మార్పులను కూడా చెయ్యలేకపోతుంది.

**లీ హోంగ్ జీ**

జనవరి 5, 1996

* * * *

# Glossary

## A

**Ah Q (ah cue)**

A foolish character in a Chinese novel.

**Arhat**

An enlightened being with Fruition Status in the Buddha School and one who is beyond the Three Realms.

**Assistant Soul (fu yuanshen)**

One's secondary soul(s); Assistant Consciousness.

**Asura**

"Malevolent spirits" from Sanskrit.

## B

**Baihui (buy-hway)** point

An acupuncture point located at the crown of one's head.

**Benti**

One's physical body and the bodies in other dimensions.

**Big Lotus Flower Hand Sign**

A hand posture for consecration.

**Bigu (bee-goo)**

"Avoidance of grains"; an ancient term for abstinence from food and water.

**Bodhisattva**

An enlightened being with Fruition Status in the Buddha School, and one who is higher than an Arhat but lower than a Tathagata.

**Bodhisattva Guanyin**

Known for her compassion, she is one of the two senior Bodhisattvas in the Paradise of Ultimate Bliss.

**Book of Changes (Zhouyi)**

An ancient Chinese book of divination dating from the Zhou Dynasty (1100 B.C.–221 B.C.).

**The Buddha Fa**

The Buddha Law; the universal principles and law; the way of the universe.

## C

**Cao Cao (tsaow-tsaow)**

Founder and ruler of Wei Kingdom, one of the Three Kingdoms (220 A.D.–265 A.D.).

**Celestial Eye**

Also known as the "third eye."

**Changchun (chahng-choon)**

Capital city of Jilin Province.

**Chongqing (chong-ching)**

The most populous city in Southwestern China.

**Cultural Revolution**

A communist political movement that denounced traditional Chinese values and culture (1966-1976).

# D

**Da Ji (dah jee)**

A wicked concubine of the last emperor in the Shang Dynasty in (1765 B.C. - 1122 B.C.). She is believed to have been possessed by a fox spirit and to have caused the fall of the Shang Dynasty.

**Dafa (dah-fah)**

"Great law," or "Great Way"; principles of the universe.

**Dan (dahn)**

An energy cluster in a cultivator's body, collected from other dimensions.

**Danjing (dahn jing), Daozang (daow zang)**

Both are Taoist texts for cultivation.

**Dantian (dahn tyen)**

Field of *dan* (energy cluster in a cultivator's body); the lower abdominal area.

**De (duh)**

"Virtue" or "merit"; a precious white substance.

**Dharma**

Buddha Shakyamuni's teachings.

**Dharma-Ending Age**

According to Buddha Shakyamuni, the Dharma-ending Age is a period of time that represents the decline of Buddhism when Shakyamuni's Dharma is no longer able to save sentient beings.

**Diamond Sutra**

One of the primary scriptures in Buddhism.

**Digging into a bull's horn**

A Chinese expression for going down a dead end.

**Ding**

A state of empty, yet conscious mind.

## E

**Eight Deities**

Well-known Taoist deities in Chinese history.

**Eight Trigrams**

Also known as Bagua, these eight trigrams are used in Taoist cosmology to represent the fundamental principles of reality, seen as a range of interrelated concepts.

## F

**Fa (fah)**

Law and principles in the Buddha School.

**Fashen (fah-shun)**

"Law body"; a body made of *gong* and Fa.

**Fengshui (fung-shway)**

Chinese geomancy, a practice of reading landscapes.

**Five Elements**

Metal, wood, water, fire, and earth.

**Fruition Status (guowei)**

One's level of attainment in the Buddha School, such as Arhat, Bodhisattva, or Tathagata.

## G

**Gong**

1. Cultivation energy; 2. A practice that cultivates such energy.

**Gongshen (gong-shuhn)**

A body made of *gong* or cultivation energy.

**Great Jade Emperor**

In Chinese mythology, the deity that supervises the Three Realms.

**Guanding (gwan-ding)**

Pouring energy into the top of one's head; initiation ritual.

**Guangdong (gwang-dong) and Guangxi (gwang-shee)**

Two provinces in Southern China.

**Guanyin (gwan-yeen) sect**

A cult named after Bodhisattva Guanyin, the "Goddess of Mercy."

**Guiyang (gway-yahng)**

Capital of Guizhou Province.

**Guizhou (gway-jhoe)**

A province in Southwest China.

## H

**Han (hahn)**

The majority ethnicity of Chinese people.

**Han Xin (hahn-sheen)**

The leading general who helped Emperor Liu Bang establish the Han Dynasty.

**Heche** (huh-chuh)

Also known as "river vehicle", a Taoist exercise for internal circulation.

**Hegu (huh-goo) point**

An acupuncture point on the back of the hand, between the thumb and the index finger.

**Hetu (huh-too), Luoshu (luoa-shew)**

Both are prehistoric diagrams that are thought to disclose the course of cosmic changes.

**Hinayana**

"The Small Vehicle Buddhism."

**Huangdi Neijing**

Also known as *The Yellow Emperor's Inner Canon*, a Taoist text for cultivation.

**Huiyin (hway-yeen) point**

An acupuncture point in the center of the perineum (the area between one's anus and genitals).

**Hun (huhn)**

Food that is forbidden in Buddhist temples, such as all types of meat.

## I

**Idealistic**

In Mainland China, this term carries a negative connotation that implies imaginary, superstitious, and unrealistic thinking.

**In-Triple-World-Fa**

Buddhism holds that one must go through samsara (six paths of reincarnation or the cycle of reincarnation) if one has not reached Beyond-Triple-World-Fa cultivation or beyond the Three Realms.

**Investiture of the Gods (Fengshenbang)**

A classic work of Chinese fiction.

**Iron Sand Palm, Cinnabar Palm,Vajra Leg, Arhat Foot**

Types of Chinese martial arts techniques.

**It is easier to invite an immortal than to see one off**

A Chinese expression commonly used to describe a situation that is easy to fall into, but difficult to get out of.

## J

**Jie**

A period lasting for two billion years; here the term is used as a number

**Jigong (jee-gong)**

A well-known Buddhist monk with magic powers in the Southern Song Dynasty (1127 A.D.-1279A.D.).

**Jinan (jee-nahn)**

Capital of Shandong Province.

## L

**Lady Queen Mother**

In Chinese mythology, the highest-level female deity within theThreeRealms.

**Lama**

A title for a master in Tibetan Buddhism.

**Lao Zi (laow-dzz)**

Founder of the Tao School and author of the *Dao De Jing (Tao-TeChing)*,who lived and taught in China around the 5th or 4th century B.C.

**Laogong (laow-gong) point**

Anacupuncturepointatthecenterofthepalm.

**LastHavoc**

The community of cultivators holds that the universe has threephasesofevolution(The Beginning Havoc, The Mid-

dle Havoc. The Last Havoc), and that now is the The Last Havoc's final period.

**Lei Feng (lay-fung)**

A Chinese moral exemplar in the 1960's.

**Li (lee)**

A Chinese unit for distance (0.5km). In Chinese, "108 thousand li" is a common expression to describe a very longdistance,

**Liu Bang (leo bahng)**

Emperor and founder of the Han Dynasty (206 B.C.- 23 A.D.).

**Lu Dongbin (lyudong-bin)**

One of the Eight Deities in the Tao School.

**Lunyu (loon-yew)**

Statement; comment.

## M

**Mahayana**

"The Great Vehicle Buddhism."

**Mahjong**

Traditional Chinese game played by four people.

**Main Soul (zhu yuanshen)**

One's main soul; Main Consciousness.

**Maoyou (maow-yo)**

The borderline between the yin and yang sides of a humanbody.

**Materialism**

A philosophical theory holding that physical matter in its actions and movements is the only reality; everything in the universe, including emotions and thoughts, can be explained by phyisical laws.

**Ming Dynasty**

A Period between 1368 A.D.and 1644 A.D. in Chinese history.

**Mingmen (ming-muhn) point**

"Gate of life": an acupuncture point located at the middle of the lower back.

**Moding (muo-ding)**

As claimed by some qigong masters, touching the top of one's head to give energy.

**Mt. Emei (uh-may)**

A mountain in Sichuan Province about one thousand miles awayfrom the well at Lingyin (ling-yeen) Temple.

# N

**Nanjing (nahn-jing)**

Capital of Jiangsu Province.

**Nirvana**

Departing the human world without this physical body, the-method of completing cultivation in Buddha Sakyamuni's School.

**Niwan (nee-wahn) palace**

Taoist term for the pineal body.

# O

**Original Soul (yuanshen)**

This is sub-divided into the Main Soul (zhu yuanshen) and the Assistant Soul (fu yuanshen). In traditional Chinese thought, it is believed that many souls exist in the body, governing certain functions and processes.

# P

**Producefire**

A Chinese term also meaning "cultivation insanity"; it can be understood both figuratively and literally here.

# Q

**Qi (chee)**

In Chinese culture, it is believed to be" vitalenergy"; comparedwith *gong*, it is a lower form of energy.

**Qiankun (chyen-kuhn)**

“Heaven and earth.”

**Qianmen (chyen-mun)**

Oneof the major shopping districts in Beijing.

**Qigong (chee-gong)**

A form of traditional Chinese exercise that cultivates *qi* or” vital energy.”

**Qimen (chee-mun) School**

“Unconventional School of Cultivation”.

**Qin Hui (chin hway)**

A wicked official of the royal court in the Southern Song Dynasty (1127A.D.-1279A.D)

**Qing**

Emotion, feelings, orsentiment.

**Qingdao (ching-dow)**

A seaport city in Shandong Province.

**Qiqihar (chee-chee-har)**

A city in Northeastern China.

# R

**Ren and Du**

In Chinese medicine, these energy channels are said to be conduits of qi,which constitute an intricate network for energy circulation.

**Righteous Fruition (zhengguo)**

Attainment of Fruition Status *(guowei)* in the Buddha School.

# S

**Samadhi**

From Buddhism, “meditation in trance”.

**Sarira**

A term from Sanskrit, it refers to pearl or crystal-like bead-shaped objects or dan that are found among the cremated ashes of Buddhist cultivators.

**Setting up a bodily crucible and furnace to make dan using-gathered medicinal herbs**

Taoist metaphor for cultivation of internal alchemy.

**Shangen (shahn-ghun) point**

An acupuncture point located between one's eyebrows.

**Shakyamuni**

Also known as Guatama Siddhartha, the historical Buddha.

**Shichen (shr-chuhn)**

A Chinese unit of time for two hours.

**Spirit tablet**

Enshrined wooden tablet in the home for worshipping ancestors or other spirits at home.

**Spiritual civilization**

This is apopular term in contemporary China,which refers to the uplifting of people's minds and morality. In Mainland China,this term is contrasted with "material civilization".

**Srivatsa**

"Wheel of light" from Sanskrit, the symbol dates back over 2,500 years and has been unearthed in cultural relics in Greece, Peru, India, and China. For centuries it has connoted good fortune, represented the sun, and been held in positive regard.

**Sun Simiao (sun szz-meow), Hua Tu (hwa-twoah), Li Shizhen (lee shr-jhun), Bian Que (b'yen chueh)**

Well-known doctor of Chinese medicine in history.

**Sun Wukong**

Also known as "Monkey King", a character in the classic work of Chinese fiction, *Journey to the West.*

# T

**Taiji**

The symbol of the Tao School, popularly known in the West as the "yin-yangsymbol."

**Taiyuan (tie-yu-en)**

Capital city of Shanxi Province.

**Tang (tahng) Dynasty**

One of the most prosperous periods in Chinese history (618A.D.-907A.D.).

**Tangshan (tahng-shahn)**

A city in Hebei Province.

**Tanzhong (tahn-jong) point**

An acupuncture point located at approximately the center of the chest.

**Tao**

1. Also known as "Dao," Taoist term for "the Way of nature and the universe"; 2. An enlightened being who has achieved this Tao.

**Tathagata**

An enlightened being with Fruition Status *(zhengguo)* in the Buddha School, who has his own paradise and is above the levels ofBodhisattvaandArhat.

**Teacher**

Also called Master, a respectful way to address a teacher in China.

**Three Yin and Three Yang**

A collective name for the three yin and three yang meridians of both the hands and the feet.

**Tian**

"Field" of energy.

**Tianzi zhuang (tyen-dzz jwahng)**

A form of standing qigong exercise in the Tao School.

## W

**World of Ten Directions**

A Buddhist conception of the universe.

# List of Falun Dafa Books

## Zhuan Falun

Zhuan Falun is the comprehensive, core text that guides both new and veteran students alike in their practice of Falun Dafa (also known as Falun Gong). This book is also available in Hindi and other Indian languages.

## Falun Gong

Falun Gong is an introductory text, systematically presenting the practice of Falun Gong (also known as Falun Dafa). This book includes instructions and photo illustrations for performing the five sets of Falun gong exercises. It also provides detailed explanations of how the exercises function and what makes them unique. This book is also available in Hindi and other Indian languages.

## Falun Dafa - Essentials for Further Advancement

Known among the community of Falun Dafa practitioners as "Essentials", this work is a collection of supplementary writings by Mr. Li. Hongzhi. These writings can be seen as a further exposition of Mr. Li's Zhuan Falun. The form they take are quite diverse, ranging from articles and letters to poems.

**Please visit below websites for more information**

www.falundafa.org

www.falundafaindia.org

## Volunteer contacts for further information

Falun Dafa activities are conducted by volunteers and are free of charge. There is no membership and no donations are accepted. Call now to join your nearest practice site to learn Falun Dafa exercises; practitioners will be glad to instruct you. All materials including books, audio and video clips are also available on Falun Dafa websites.

| | |
|---|---|
| Kolkata | 9143066856, 9821381501 |
| Mumbai | 9920093985, 9867256562 |
| Bangalore | 9886500273, 9341255561 |
| New Delhi | 9871679992, 9971513911 |
| Nagpur | 9822569386, 7798124882 |
| Pune | 7083880160, 9423215580 |
| Hyderabad | 9885476390, 9848523532<br>9885536274 |
| Rajahmundry | 9885567811 |
| Jamshedpur | 9939500428 |
| Pondicherry | 9944025970 |
| Varanasi | 9935529619 |
| Chennai | 9840125536 |
| Kochi | 9895036331 |

Websites:

www.falundafa.org

www.falundafaindia.org

www.minghui.org